
శ్రీ

# దైవానుకరణము.

## ఆంగ్లేయానువాదక నవల.



నవనిబంధన గ్రంథకర్తలగు:

శ్రీ రాజా మంత్రిప్రగడ భుజంగరావు బహద్దర్.

జమీందారు వారి కృతము.

రామా ముద్రాక్షరశాల,

ఏలూరు.

1925.

వెల. 0—12—0

సుల్తాను బజార్, హైద్రాబాద్.

# దైవానుకరణము.

## పాత్రలు.

1. కణ్వమహర్షి—ధర్మపురీ మఠాధిపతి.
2. సుగుణవతి—గానకళానిధి.
3. పరదేశి—నిరుద్యోగియగు బీదవాఁడు.
4. పురూరవుఁడు—దైనికపత్రికాధిపతి.
5. సుమంతుఁడు—వస్త్రయంత్రశాలకు కార్యదర్శి.
6. విద్యాధరుఁడు—కళాశాలాధ్యక్షుఁడు.
7. కన్నయ్యశ్రేష్ఠి—వర్తకుఁడు.
8 వైద్యభూషణుఁడు— ధన్వంతరి.
9 నృసింహకవి—అనేకోద్గ్రంథకర్త.
10. సుమతి — మిక్కిలి ధనవంతురాలు.
11. అవధాని—పత్రికాసహాయాధ్యక్షుఁడు.
12. జానయ్య—పత్రికాలయమునకు కోశాధిపతి.
13. చిదంబరరావు—ప్రకటనల గుమాస్తా.
14. భానుమంతుఁడు—సుమతిసోదరుఁడు నాగరకాగ్రగణ్యుఁడు.
15. కమలాంబ—సుమతిమిత్త్రవ్వ రాజకీయగలయువతి.
16. సోమనాథశర్మ—నిష్ఠాజాత్యుద్ధారకుఁడు.
17. పులోమ—సోమనాథశర్మ ధర్మపత్ని.
18. మయూరుఁడు—స్వయంనిర్ణయ సభాధ్యక్షుఁడు.
19. సావిత్రి—దుష్ప్రవర్తనగల మతంగకన్య.
20. సాంబుఁడు—విలాసపురుషుఁడు.
21. ఇందుమతి—ఒకవిలాసవతి.
22. వేంకటసోమయాజి — కాశ్మీరదేశపురోహితుఁడు.
23 గంగాధరుఁడు—సోమయాజిమిత్త్రుఁడు.
24. విజయరామరాజు —మాయావిసుకునర్తకుఁడు.
25. విశాలాక్షి—రామరాజుప్రథమపుత్త్రిక విలాసవతి.
26. చకోరాక్షి—రామరాజుద్వితీయపుత్త్రిక భక్తురాలు.
27. కంబుకంఠి—విలాసవతి గోడేవారిపిల్ల.
28. దీక్షితులు—మఱియొకమఠాధిపతి.
29. సోమిదమ్మ—సోమయాజిభార్య.
30. ప్రియంవద—విజయరామరాజుభార్య.
31. పెద్దమ్మ—సుగుణవతి, ప్రియంవదలతల్లి
32. శారదాంబ—ఒకయిల్లాలు.
33. కమలము—గాయనియగు మతంగబాలిక.
34. ఇరువురుదొంగలు—అందొకఁడు నతుత్రికుఁడు.
35. వామనమూర్తి—కల్లుదుకాణముగల యింటియజమాని.

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పఙ్క్తి. | | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|---|
| 6 | మీ | 7 | నితన | నితని. |
| 10 | క్రిం | 12 | విషమై | విషయమై |
| 24 | మీ | 14 | పెనట్లు | పెన్నిట్లు |
| 29 | క్రిం | 1 | ధృష్ప్రత్వము | దుష్ప్రత్వము |
| 31 | క్రిం | 6 | సురిచి | సురుచి |
| 34 | క్రిం | 6 | కనుకూల | కననుకూల |
| 35 | క్రిం | 2 | నిప్పుడట్లొర్పు | నిప్పుడట్లొనర |
| 36 | క్రిం | 14 | పోతి | పోతకంత |
| 37 | క్రిం | 14 | కొనిన | కొన |
| 62 | మీ | 11 | సమ్మతింతునా | సమ్మతింతువా |
| 66 | మీ | 17 | ప్రజ్ఞాపయలు | ప్రతిజ్ఞాపరులు |
| 70 | క్రిం | 7 | బాళ్యహు | బాహుళ్య |
| 73 | మీ | 2 | యెన్న | యెన్ని |
| 82 | మీ | 16 | దివ్య | దిత్య |
| 83 | క్రిం | 11 | చించుచు | చింను |
| 84 | క్రిం | 10 | నాతని | నాదని |
| 92 | మీ | 10 | ఘునను | ఘునకుమున్న |
| 111 | మీ | 4 | ఇషువు | ఇఘుగా |
| 112 | క్రిం | 10 | బెప్పి | జెప్పి |
| 116 | క్రిం | 1 | నియము | నియమము |
| 125 | మీ | 10 | వ్యాప్తలు | వ్యాప్తములు |
| 127 | మీ | 6 | కరుడెంచెద | కరుదెంచెద |
| 136 | క్రిం | 10 | భారము | భావము |
| 141 | క్రిం | 3 | నిట్లు | నిల్లు. |
| 151 | మీ | 17 | మత్కృష్ట | ముత్కృష్ట |
| ,, | క్రిం | 18 | దార్ఢ్త్య | దార్ఢత్య |
| 153 | క్రిం | 5 | నెవం | డెవం |
| 155 | మీ | 2 | బడుచుటు | విసుచుటు |
| 156 | క్రిం | 7 | నాని | గాని |
| 157 | మీ | 10 | తేచి | వేచి |
| 160 | మీ | 9 | గుళ్ళయిన | గుళ్ళయని |
| 164 | మీ | 8 | నారర్షించు | నాకర్షించు. |

# FOREWORD.

BRETHREN,

Religious novels are very rare and perhaps this is the first of its kind written in any language. People now a days are taking much interest in reading novels that carry them through most exciting scenes. Custodians of religion will have to take this opportunity of the popular mind and encourage writers to produce novels that inculcate religious thoughts while the story runs most interestingly. By so doing the innate tendency of the reader to pass through a most interesting story with exciting scenes will be satisfied with the fresh advantage of stimulating lofty thoughts. Such literature is most needed at the present juncture and want of it is producing indirectly many an athiest and materialist.

Charles M. Sheldon, one of the ablest religious preachers of America, the Pastor of Topeka Kansas. correctly understood the situation and successfully tackled it by writing a most brilliant novel of the sort in English entitled "In His steps or what would Jesus Do." The popular applause the book met with can easily be gauged by taking note of the fact that within a short time it went through 20 Editions completing 694000 copies. It was translated into 15 languages already and my attempt is the 16th one. The story is now being exhibited through film in the biggest Cinemas of the new continent.

Mr. R. Koustubham, B. A., a teacher in the Pithapur Maharajah's College, Coconada, placed a copy of it in my hands and requested me to put it into Telugu for the benefit of Andhras. He is a Hindu and yet this work not only attracted him but created in him a longing that all the Telugu knowing public should be given a chance of being benefited by its publication in Telugu. There is an unfounded suspiscion lurking in the minds of both Christians and the non-Christians that the precepts ennunciaed by the Lord Jesus Christ are idealistic and impracticable. Whatever might have been the conduct of His immediate followers the Christendom as a wholet

during these twenty centuries proved the suspiscion by a breach of the edicts of its own master. It has become therefore an extremely difficult problem for evangelists to convince their hearers that the sayings of the Lord are capable of practical application. Our venerable Pastor the Rev. Mr. Sheldon solved this problem to the utmost satisfaction of his readers in this book. This book shows the practical side of the work and clears the doubts of many a wavering Christian.

While I was busily engaged with this work I had the good fortune of meeting Sherwood Eddy, the well known missionary orator of world wide fame and the international secretary of the Y. M. C. A., and in the course of our conversation I mentioned to him about my work on hand. He immediately wrote to the author and obtained permission for me to publish a Telugu adaptation of this work.

My thanks are therefore due first to Mr. Koustubham who has instilled in me a desire to serve my Telugu brethren by placing this work at their disposal, to Mr. Eddy for having obtained for me the permission of the author and lastly to Mr. Sheldon the author for having kindly allowed me to undertake this work. I shall have to thank also Rev. F. L. Merlar, Chief Secretary to the C. L. S. Telugu publication committee, for having gone through my manuscript and encouraged me with kind sentiments on my achievement.

This is rather a big work and I thank God for having given me the requisite energy and persistance to bring it to a successful termination. I now place it before the Telugu public with a prayer that it may enlarge the religious outlook of every one of the readers and may serve as a turning point in the case of some of them at least. May God help us in our efforts to reach Him while playing our part in this world stage. May the spirit of the Lord be with us all.

2—5—25.

RAJAH M. BHUJANGA RAO.

# భూమిక.

అనుజన్ములారా !

కథావిధానమునఁ జదువుకొని యానందించు మతానుసారములగు నవలలాంధ్ర భాషలో మిక్కిలి స్వల్పములుగ నున్నవి. అట్లననేల ? మన భాషయందట్టి గ్రంథములు లేవనియే చెప్పవచ్చును. నేను నా బాల్యమునుండియు భాషాసేవఁ గావించుచుంటినని యాంధ్రలోక మెఱుంగును. అందును బదివత్సరములనుండి క్రైస్తవమత గ్రంథమగు నవనిబంధన నాంధ్రమున ఛందోబద్ధము గావించియుంటిని. ఇంకను పెక్కు మత గ్రంథముల వ్రాసియుంటినని మీ రెఱింగిన విషయమే. అమెరికా దేశములో నొక క్రైస్తవమత సంఘమున కాచార్యుఁడైన ఛార్లెసు షెల్డన్ అను సుప్రసిద్ధపురుషుఁడు ఆంగ్లమున "In his steps" అను పేర నిట్టి మతప్రబోధక నవలాగ్రంథము వ్రాసెను. నామిత్రులొక రాగ్రంథము నాచేతనిడి దీనినాంధ్రీకరించినఁ గ్రైస్తవులకేగాక తక్కుంగల యాంధ్రలోకమునకెల్ల మహోపకారమును గావించినవారగుదురని ప్రేరేచిరి. నేనాగ్రంథమును జదువునప్పుడు కేవలము నైమరచి తదేకాయత్తచిత్తుండనై యానందాబ్ధి నోలలాడితిని. మతము మతమన నొక మూలఁగూర్చుండి ముక్కుమూసికొనుట కాదనియు లోకమునంగల సమస్తవ్యాపారములయందును మతసాంప్రదాయముల ననువర్తించినఁ బాపభూయిష్ఠమైన యీలోకమే స్వర్గతుల్యము కాఁగలదనియు నామనంబునకుఁ దెల్లంబయ్యెను. జీవనోపాధికై యేవృత్తి నవలంబించిన నదియే భగవత్సేవగఁ బరిగణింపఁజేయ వచ్చునని యీ గ్రంథము విశదీకరించును. ఏమానవుఁడైనఁ దనకు లభించిన వృత్తినే దైవసేవగ మార్చుటకు వీలగువిధానములీగ్రంథమునందు సూచింపఁబడినవి. పాఠకులకుఁ దన్మయత్వము లభించితీరును దీనియందలి శ్రేష్ఠభావములచే మతప్రచారమున నీ గ్రంథమత్యంత సహకారి కాఁగలదు. క్రైస్తవులకుమాత్రమే కాక యన్ని మతముల వారికి నీ గ్రంథముపకరింపఁగలదు. క్రైస్తవేతరులును దీని పఠనమువలన మేలును గాంచఁగలరు.

ఈ గ్రంథము దేశాంతరమునందుండు కవిపుంగవునిచే రచింపఁబడినదగుటవలన నిందలిపాత్రల, రంగముల నామములు మన యాంధ్ర సోదరులకుఁ జదువుకొనునప్పుడుచ్చారణా కఠినములుగ నుండును. ఈ చిక్కును దొలఁగించుటకై రంగస్థలములకును పాత్రలకును ఆంధ్రయోగ్యములగు నామాంతరములఁ గల్పించితిని. ఈ గ్రంథము చరిత్రాంశము గాక ప్రబోధయోగ్యమగు కల్పితకథయగుటచే నిందలిపాత్రలకు నామాంతరములఁ గల్పించుటచే నది పాఠకుల సౌకర్యమునకే యగును గాని కావ్యమునకు భంగము వాటింపఁజేయుట కానేరదు.

ఈ కార్యము ప్రారంభావస్థయందుండ మన్మిత్రులగు జి. యస్. ఎడ్డిదొరవారి సందర్శనము సంప్రాప్తమైనది. సంభాషణావశంబున నీ సంకల్పమును వారెఱింగి షెల్డన్ దొరవారికి నా సంకల్పమును దెలిపి యేతత్కార్యమునకు వారి యామోదమునుగూడఁ దెప్పించిరి. కావునఁ బైవారి కిరువురికిని నా వందనసహస్రములు. నాకీ గ్రంథరచనా సంకల్పము నంకురింపఁజేసిన మన్మిత్రులును వందనీయులు.

గ్రంథము కొంచెము బాహుళ్యమైనదగుటచేఁ గొంత కాలము శ్రమపడి తుదకట్లో దైవానుగ్రహమువలనఁ బూర్తిగావించితిని. ఇది క్రైస్తవ క్రైస్తవేత రాంధ్రసోదరులకు మత ప్రవృత్తియందు సహకారియైన యెడల దీనింగూర్చుటకు నాపడిన శ్రమ సార్థకమైనదగును. నాజన్మతరించును. ఈ గ్రంథమిదివఱకు పదునైదు భాషలలో ననుకరింపఁబడినది. ఈ యాంధ్రీకరణము పదియాఱవ భాషాంతరీకరణము కావున నీ గ్రంథరచనకుఁ గడంగిన నన్నును పాఠకమహాశయులను గూడ నాపరాత్పరుఁడను గ్రహించుఁగావుత మని ప్రార్థించుచున్నాఁడను.

ఏలూరు.
2—2—22

సజ్జన విధేయుఁడు,
రాజా. మంత్రిప్రెగడ భుజంగరావు

శ్రీ

# దైవానుకరణము.

## ప్రథమాధ్యాయము.

కోలాహలంబుగఁ జెలరేగిన తుపాను విడిచిన తరుణమువలె నేటి యాదిత్యవాసర ప్రాతఃకాలము నిర్మలంబై తెలువారుచుండెను. 1 అరుణోదయంబు మున్ముందు పొడసూప వెనువెంట సూర్యుండు ప్రకాశమానుండై వెలువడియెను. సకల విధంబుల నాటి యుదయంబు సుకరంబై యుండుటచే ధర్మపురియందలి పిన్నపెద్దలందఱును దేవాలయంబున కారాధనార్థముపోవ 2 సన్నద్ధులైరి. పదిగడియల ప్రొద్దెక్క నారాధన క్రమము ప్రారంభించునరికి సద్వస్త్రధారులై యెల్లరు నరుదెంచి యుచితాసనంబుల నలంకరించిరి.

చుట్టుప్రక్కలనున్న దేవాలయముల కందుకంటె నీ ధర్మపుర్యాలయమున మేలగు గానోపకరణంబులు కలవు. ఈ యాలయమును సందర్శించువారెల్లరు ధనికులగుటచే నిట్టి యుపపత్తి కలిగినది. ఆరాధన సమయమున సద్భక్తిఁ జేయు గానము సభాస్తారుల యంతరంగంబులఁ గరఁగించుచుండెను. నాటి గేయము లుపన్యాసానుగుణ్యములుగ నుండెను. సిలువయు గిరీటమును జిహ్నములుగా నమర్పఁబడియుండిన సంగీతపుపెట్టె చాటున నిలువఁబడియున్న సుగుణవతియొక్క వదనారవిందము సంపూర్ణ కళాన్వితమగు పూర్ణిమా చంద్రబింబముగిది 3. హృదయంగమంబుగ నుండెను. ఆమె స్వరము సుస్వరయుక్తమై వీనుల విందొనరించుచుండెను. గానము చేయుట కామె లేచునని యెల్లరు నువ్విళ్ళూరుచుండిరి. మఠాధిపతియగు కణ్వుండును దన పీఠముపైఁ గూరుచుండెను. సుగుణవతియొక్క గాన మాచార్యునకెప్పుడును సహాయకారిగనుండెను; తన యుపన్యాసమునకుఁ బూర్వ మామెయొక్క కీర్తనను బాడుచుండుట నట్లేర్పరచుట వాని కాచారము

సుగుణవతియొక్క గాత్రమునుబోలు సుస్వరమును మున్నెన్నఁడు నీనగరంబున వినియుండలేదని సామాజికులెల్లరుఁ దలంచిరి. ఇది దైవారాధన సమయమునఁ జేయు సంకీర్తనమే కాకుండినచో 4. సభాస్తారులనుండి పెద్దాసను మెప్పును వడసియుండును. తద్గానాకర్ణనానందసూచకంబుగ శ్రోతలు కరతాళములవైన నుంకించినటులు కణ్వుండనుమానించి తనయాసనమునుండి యులికిపడిలేచి సత్యవేదగ్రంథమును విప్పినప్పటి కాతని యనుమానము నివారణమయ్యెను. ఆ తరుణమున నాతఁ డుపన్యసించుట కుపక్రమించి తత్కార్యనిమగ్న చిత్తుండయ్యెను.

కణ్వుఁడు స్పష్టముగ బోధింపఁజాలఁడను వదంతి యెన్నఁడును లేదు. అతఁ 5. డుత్సుకత్వంతతోఁ ప్రవచించుచుండును. అతని యుపన్యాసమునకంటె నుపన్య

---

1. సూర్యోదయము. 2. సిద్ధపడిరి. 3. మనోహరము. 4. సభలో నున్నవారు. 5. ప్రీతితోఁ గూడిన వేగిరపాటు.

సించు విధానము శ్లాఘాపాత్రము. ఈమఠ సామాజికుల కందఱికది యానంద దాయకముగనుండెను. మఠమున కొక వన్నె దెచ్చెను. కణ్వున కుపన్యసించుటయం దత్యుత్సాహము. తనయుపన్యాసవేదిపైఁ బరుల నెక్కింప ననుమతింపఁడు. ప్రతి యాదివారమును దానే తనసాంఘికుల కుపన్యసించుచుండును. తన సామాజికులు తనవ్యాసమును ఆమోదించిరని తెలిసికొని సంతసించును. సభ్యులసంఖ్య తగ్గియుండినఁ జిన్నబుచ్చుకొనును. నేటి ప్రాతఃకాలమునందువలె మందిరము జనాకీర్ణమైయుండ నుత్సహించును.

ఈమఠ మీప్రాంతములలోఁ బెద్దది. ఇందు గానపరికరము లన్నియుఁ గలవు. శ్రావ్యముగఁ బాడువారునుగలరు. ధర్మపురియందుఁగల విద్యాధికులును, ధనాఢ్యులును, జ్ఞానవంతులు నీమఠ సామాజికులుగ నుండిరి. కణ్వుండు రాఁబోవు శెలవికాలమున చల్లని ప్రదేశమున కేఁగఁదలంచియుండెను.

ఈ విషయములన్నియు వాని యుపన్యాసకాలమున నెట్లు స్మరణకు వచ్చెనో వివరింప 1. దురూహ్యముగాని వ్యాసాంతంబున నివి మధ్యమధ్య స్మరణకు వచ్చెనని మాత్రము కణ్వుఁడెఱుంగును. ఈ యూహలు వాని మేధాశక్తి నావరించియుండెను. కావున నావ్యాసమాతనికి సంతుష్టి నొసంగెను. తానుపన్యసించు కాలమునఁ దన సామాజికుల మనంబును నొవ్వకుండునట్లు లలితపద2. భూయిష్ఠములగు వాక్యములతోఁ గర్తవ్యాంశముల నుడువు సౌలభ్యము కణ్వునకుఁ బూర్తిగఁ గలదు. తన సామాజికులందఱును దగు విద్యాగౌరవోపపత్తులు గలవారని కణ్వున కెట్టిసంతుష్టి కలిగెనో యట్లే సామాజికులకును దమ మఠాధినాథుఁడు విద్యాధికుండై తమ యంతరంగములు నొవ్వకుండునట్లు చక్కని శైలిలో నుపన్యసింపఁగలవాఁడను సంతుష్టి కలిగి యుండిరి.

వక్తకును శ్రోతలకు నిట్టిసంతుష్టిని గలిగించిన యీ సమయమున నకాత్తుగ నొకచిత్రమైన 3. యంతరాయము తటస్థించెను. దీనిచేఁ గలిగిన హఠాద్ఘటిత విభ్రమ మింతయని చెప్పవలవి కాదు. ఇది దురూహ్యమును గేవల మసంభవము నగుటచేఁ గారణము నారయుటకుఁగాని ప్రతిక్రియను యోజించుటకుఁగాని యేరికి నవకాశము చిక్కలేదు.

ఉపన్యాసమును ముగించినతోడనే కణ్వుఁడు సత్యవేదగ్రంథమును మూసి కూర్చుండఁబోవుచుండెను. గాయకులు భగవన్నామ సంకీర్తనమును ప్రారంభింపఁబోవుచుండిరి. అట్టి తరుణమున నొక గంభీర పురుష నాదమును విని యందఱు నివ్వెగ జెందిరి. ఈధ్వని మఠాంతికోన్నతాసనముల క్రిందనుండి వెలువడెను. అప్పుడే యొకపురుషుఁడు, ఆ చాటుననుండివచ్చి యుపన్యాసపీఠిక దరిఁజేరెను. సామాజికులేమి జరుగుచున్నదియుఁ దెలిసికొనకమున్నే యాతఁడా పీఠిపైనెక్కి వారి కభిముఖుఁడై నిలిచి యుండెను.

“ నే నప్పటికి వచ్చినప్పటినుండియు ” నని యాతఁడు ముందాసనము క్రిందనుండి ప్రారంభించినవాక్యమునే తిరిగి యుద్ఘాటించి—“ నీయారాధనము ముగిసినతోడనే

1, ఊహింప శక్యముకానిది. 2. నిండిన. 3. అడ్డు.

మీకొకమాటను జెప్పుట యుచితమాయని విచారించుచుంటిని. నేను సురాపానము జేసియుండలేదు. మతిభ్రమ కలవాఁడను కాను నన్ను జూచి మీరు భయపడవలసిన పనిలేదు. నేను మరణించినను—మరణము నాకు సన్నిహితమైయేయున్నది- ఇట్టి స్థలమున మిముబోటి సామాజికులతో నేను జెప్పఁదలఁచిన సంగతులను జెప్పితినను తృప్తినందెదను. ”

కణ్వుఁడింకను సుఖాసీనుఁడు కాలేదు. నిలిచియుండినవాఁడట్టె ముందు బల్ల నానుకొని నిలువఁబడి యీ శ్రోత్రియానిసిని జూచుచుండెను. గడచిన శుక్రవారము నాఁటి యుదయమున మలినవస్త్రధారుఁడై 1. విషణ్ణుఁడై, విగతాశుఁడై, తనయింటికి వచ్చిన యువకుఁడీతఁడె యని గ్రహించెను. మాసిపోయిన తన 2. శిరోవేష్టము నాతఁడు రెండుచేతులఁ బట్టుకొనియెను. ఆతని 3. చుబుకమముండితమైయుండెను. శిరోజములు చిక్కువడి పీచువలె నెగయుచుండెను. ఈ మతాంతరాళమున నిట్టిపురుషుఁడెన్నఁడును బ్రవేశింపలేదు. ఇట్టివాండ్రు వీధులలోను బుర బహిఃప్రదేశంబులను, 4. ధూమశకట యంత్ర నిర్మాణ స్థానములయందును గాన్పించెదరుగాని యిట్టివాఁడీతావునకు వచ్చుట యసహజమగుట నాశ్చర్యమును గలిగించెను.

ఈతని ప్రవర్తనమునఁగాని ప్రసంగమునఁగాని లోపమేమియులేదు. ఉద్రేకమేమియులేక నెమ్మదిగా మాటలాడఁ జొచ్చెను. కణ్వుఁడు నిర్విణ్ణుఁడై చూచుచుండినను వీనిస్థితి 5. స్వప్నావస్థయందు మాటలాడువాని తెఱంగున నూహించెను.

మఠమునందుండిన వారిలో నెవ్వరును నాతని మాటలాడకుండ నిలుపుచేయుటకుఁగాని వానికే యితర యాతంకములనైనఁ గలిగించుటకుఁగాని ప్రయత్నింపరైరి. కాని హఠాత్ప్రవేశమువలనఁ గలిగిన 6. నిర్విణ్ణతయే వారినిఁకను స్తంభీభూతులఁ గావించెను. అదియెట్లున్న నాతఁడు తానొక వింతప్రదేశమున నుంటిననిగాని తన నిరాఘాట వాక్ప్రచారమున కడ్డుకలుగుననిగాని తలంపలేదు. ఈతఁడు మాట్లాడుచుండినంతదనుక కణ్వుఁడు నివ్వెరపడి బల్లనానుకొని నిలువఁబడి యుండెను. క్షణక్షణమునకు గణ్వుని మోము విచారగ్రస్తమై వెలవెలపోవఁజొచ్చెను. వాని ప్రసంగమున కంతరాయముగల్గింప సమకట్టలేదు. ప్రజలందఱు నిశ్శబ్దముగ నుండిరి. గాయకుల మధ్యనుండిన సుగుణవతి కూడఁ గణ్వునివలె దీర్ఘాలోచనము గలదైయుండెను. ఆమె వదనారవిందము సదా ప్రజాకర్షణ దక్షమై యుండును. ఈతరుణమున 7. సహస్రకిరణునిభాతి ప్రకాశమానమై యొప్పుచుండెను.

“ నేను సహజముగ దేశాటనము చేయువాఁడను గాను 8. నిరుపాధికులై దేశాటనముచేయువారిలో నొకతెగవారు రక్షణార్హులనియు మఱియొకతెగవారు కారనియు క్రీస్తు చెప్పియుండలేదు. అట్లు చెప్పెనా? ”

---

1. ఖేదము పొందినవాఁడు. 2. తలపాగా. 3. గడ్డముక్షౌరముచేయఁ బడలేదు. 4. రైలుబళ్ళనుచేయుతావులు. 5. కలలో 6. ఆశ్చర్యము. 7. సూర్యునివలె. 8. జీవన వసతిలేనివారు.

అచ్చటఁగూడియున్న సంఘమంతయు నొకచిన్నబడిని గానెంచి యీ ప్రశ్న నాతఁడు సహజముగా వైచెను. ఒక్కక్షణముతాళి కొంచెము శ్రమతోఁదగ్గి మరల నుపన్యసింప నుపక్రమించెను.

“ పదినెలలక్రిందట నాయుద్యోగము పోయినది. ముద్రణాలయమున నచ్చొత్తు పనిచేయుచుండెడివాఁడను. ఆవిరిచేఁ దిరుగు ముద్రాయంత్రములుకడు చిత్రమైనవి. వాని లోఁబడి యాఱుగురు మృతినందుట నే నెఱుంగుదును. వార్తాపత్రికఁ బ్రచురించువారీ యంత్రములఁ దెప్పించినందులకు వారిని నేనునిందింపను? కూలిపనిచే జీవించుట కలవాటుపడిన వాఁడేమిచేయఁగలఁడు ? నేనీ కాగితముల నచ్చువేయు పనిని మాత్రమే నేర్చుకొంటిని. నేను చేయఁగలపని యది యొక్కటియే. ఎచ్చటనైన నేను జేయఁగల యీపని దొరకఁగలదను నాసచే దేశదేశములఁ దిరిగితిని. నావలెఁ బనులుదొరకక తిరుగుచుండిన వారనేకులు కలరు. నే నొకరిని నిందించుట లేదు. నిందించుచుంటినా ? సత్యములగు సంగతులఁ దెల్పుచుంటిని. కాని నేపీఠములక్రిందఁ గూర్చుండి మీరు క్రీస్తును వెంబడించవలయునని చెప్పురీతులు క్రీస్తుబోధించిన విధముగ నుండెనా యని నాలో నేను విడ్డూరపడుచుంటిని. “ నన్ననుసరింపుఁడు. ” అనిక్రీస్తు చెప్పెనుగదా ! ఆతని యభిప్రాయ మేమైయుండును ? “ కణ్వున[1] కభిముఖుండై ” క్రీస్తుని శిష్యులందఱు నాతని వెంబడించుట యావశ్యకమని మీ మతాధిపతి చెప్పియుండెను. అజ్ఞానువర్తనము—భక్తి—ప్రేమ—వాని మార్గముల ననుసరించుట-యనునవియే వెంబడించుటకు 2. సోపానములనికూడఁ జెప్పెను. కాని కడపటి సోపానమున కర్థమేమియో యామునీంద్రుఁడు చెప్పఁగా నేను వినియుండలేదు. ప్రభుపదానుసరణమనఁగాఁ గ్రైస్తవులకేమి యర్థమగును? నేను మూఁడు దినములనుండి యెచ్చటనైనఁ బనిదొరకునేమోయని యీ పట్టణపువీథులన్నియుఁ దిరుగుచుంటిని. నన్నుజూచి నీవెవ్వఁడవు ? యిట్లేల తిరుగుచుంటివని ప్రేమాస్పదముగ నడిగినవాఁడొక్కఁడును గాన్పింపలేదు. మీ గురువగు నీ కణ్వమహాముని మాత్రము “నీకై మిక్కిలి విచారించుచుంటి ననియు, నీకెచ్చటనైనఁ బని లభింపఁ గోరుచుంటి ననియుఁ జెప్పెను. బిచ్చమెత్తుటయే జీవనముగ దేశాటనము చేయువారి ననేకులఁ జూచుచుండుటచేతఁ గాఁబోలు రెండవ తెగవారియందుఁగూడ మీ కామోదము సడలినది. నే నెవ్వరిని నిందించుట లేదు. నిందించుచుంటినా ? నిజమైన సంగతులను జెప్పుకొంటిని. మిముబోంట్లు మీ స్వకార్యములను విడచి యిటునటుఁ దిరిగి మాబోంట్లకుఁ బనులను గుదిర్చిపెట్టఁజాలరని నే నెఱుఁగుదును. నేను మిమ్మట్టులు జేయుఁడని కోరుటలేదు, కాని యేసు ననుసరించుటయన నర్థమేమియో నాకు గోచరించుటలేదు. యేసువలె మీరష్టకష్టములకోర్చి స్వార్థపరిత్యాగులై పాపభారమున మునిఁగియుండు ప్రజలను రక్షించుటకై పాటుపడుచుంటిమని మీరనుకొనుచుంటిరా ? దాని కర్థమేమి ? లోకముయొక్క కష్టదశను నేను మిక్కుటముగఁ జూచియుంటిని. నావలె దుస్థితియందుండిన వారీపట్టణమున నైదువందలమంది కలరు. వారిలోఁ బెక్కండ్రకుఁ గుటుంబములు కలవు. నా భార్య నాల్గుమాసములకుమున్నే పరలోకమున కేగెను. ఆమె కష్టములు గట్టెక్కినవని సంత

1. ఎదురు తిరిగి. 2 మెట్లు.

సించుచున్నాను. నాకెచ్చటనైనఁ బనిదొరకు దనుక నా చిన్నికుమార్తె నొకయుద్ది వేయువాని యింటనుంచితిని. ఇందఱు క్రైస్తవులు స్వేచ్ఛగా సకల సౌఖ్యముల ననుభవించుచుఁ "ప్రభువా! నా 1 సర్వస్వమును విడిచి సిలువను బట్టుకొని నిన్ను వెంబడించుచున్నా"నని కీర్తనలను బాడుచుండుటను గాంచ నాకు విభ్రాంతి కలుగుచున్నది. పరిశుభ్రమగు గాలి నావరింపఁగోరియు దానిం బొందనేరక కలకత్తా నగరంబునఁ గూలివాండ్ర యద్దెగదియందు నా భార్య తన ముద్దులకూఁతురు వెంటఁగొనుచుఁ గాలధర్మము నందినది. తినఁ దిండిలేక నిలువ నీడలేక పరిశుద్ధ వాయుప్రచారమునైనఁ బడయఁజాలక యద్దెకొట్టులలో మరణమునందు వారి నందఱిని మీరు కాపాడఁగలరని నేను తలంచుటలేదు. కాని యేసు ననుసరించుట యన నేమి? క్రైస్తవులనేకులు కూలివాండ్ర కద్దెకిచ్చుటకై కొట్లను గట్టించెదరు. ఒక క్రైస్తవుని యిట్టి కొట్టునందే నా భార్య మృతినందినది. అతఁడు నిజముగఁ క్రీస్తుననుసరించుచుండెనా యని నాలో నేను నివ్వెరఁ జెందితిని. మొన్న రాత్రి యొకచో కొందఱొక సంఘమున నిట్లు పాడుచుండ నాలకించితిని.

గీ. సకలమును క్రీస్తునకొసంగఁ జాలుదు నిఁక
నాతఁడే నాదుజీవంబు నవని విలిచె
నూహలును జేష్టలును వానికొసఁగుచుండఁ
గాల సర్వస్వమర్పింతు ఘనత మీఱ.

తక్కతద్వారమునఁ గూర్చుండి యీ గానమును విని దీనికర్థమే మైయుండునని నాలో నేను వితర్కించుకొంటిని. ఇట్టి కీర్తనలను బాడువారందఱును వానియర్థమును గ్రహింప తమ జీవితములయం దాచరణలో నిడుకొనినచో లోకములోని యనేకులు కష్టములనుండి గట్టెక్కఁగలరు. నేను సరిగ గ్రహింపలేకుంటి ననుకొనెదను. క్రీస్తేమి చేయును? వాని కాలిజాడల ననుసరించుట యనునదియే కదా! పట్టణములలోని యాలయముల కారాధనమునకుఁ జేరువారు ధనధాన్య సమృద్ధియు, వస్త్రాభరణాద్యలంకార సమృద్ధియుఁగలవారై వేసవిని శీతల ప్రదేశంబుల కేగుచు సకలసౌఖ్యముల ననుభవించుచుండ 2 దేవాగార బహిఃప్రాంత జనము వేనవేలు అన్నవస్త్రములులేక వీధులవెంట నల్లాడుచు సురాపాన వివశులై సమస్తపాపముల కొడిగట్టుచు యమపురి కరుగుచుందురు." అంతట నాతఁడు నిలువఁజాలక తూలి సమీపముననున్న ప్రసాదమునుంచు బల్లనానుకొనియెను. వాని 3. శిరోవేష్టము పాదములయొద్ద క్రిందఁబడెను. సభ్యులందఱు నులికిపడిరి. సౌమ్యుఁడను ధన్వంతరి సగము లేచెను గాని యింకను సభ నిశ్శబ్దముగనే యుండెను. ఆవింత పురుషుఁడు తనచేతితో నేత్రముల నులిమికొని హఠాత్తుగ నువ్వెత్తుగ నేలపైఁబడెను.

"ఆరాధనము ముగిసినది." అని కణ్వుఁడు సభవారితోఁ బలికి తానే మునుముందుగఁబోయి యాతని సమీపమున మోకరించెను. సభవారందఱును లేచి చుట్టును మూఁగిరి. వైద్యుఁ డాతఁడు జీవించియుండెనని వాక్రుచ్చెను. నిస్త్రాణఁ జెందెను. మఱ

1. సర్వధనము. 2. గుడి. 3. తలగుడ్డ.

ములోని కణ్వుని గదిలోని కతని జేరవేయుచు, "గుండెజబ్బు" అని కూడ వైద్యుఁడనెను.

మఠాధిపతియు సభ్యులలోఁ గొందఱును మాత్ర మాగదిలోఁ గొంతతడవు నిలిచియుండిరి. ఆపురుషుఁడు మంచముమీఁదఁ బడియుండి మిక్కిలి గోండ్రించుచుండెను. ఇతని నేమి చేయవలయునను మీమాంస వచ్చినప్పుడు సుగుణవతి తనయింటికిఁ దీసికొని పోయి కాపాడి వలయు నుపచారములఁ జేసెదననియుఁ దనయిల్లిచ్చటికి సమీపమున నుండెననియుఁ దనయింట నితనికిచ్చుట కొకగదికూడ సిద్ధముగ నుండెననియుఁ జెప్పెను. సుగుణవతి ప్రస్తుతము తనతల్లి యింట నొంటరిగ నుండెననియుఁ దాను తమగృహంబున నితని నాదరింతుమనియుఁ జెప్పెను. ఆమె మిక్కిలి 1. విషణ్ణ హృదయమై కాన్పించెను. పరు లీవిషయమును గనిపెట్టఁజాలరైరి. వారందఱును దాము బుద్ధినెఱిఁగినవెనుకఁ దమమతప్రాంతముల నిట్టి వైపరీత్యము నెన్నఁడును గాంచమిని మిక్కిలి యుద్రేకము కలవారై యుండిరి. కాని కణ్వుఁడు వీనిని తానే తనయింటికిఁజేర్చి పరిచర్యచేసెదనని దృఢీకరించి, బండివచ్చినతోడనే స్మారకముతప్పియుండిన యాజీవచ్ఛవమును దనయింటికిఁ దీసికొనిపోయెను. ఈతఁడు గృహప్రవేశము చేసినతోడనే కణ్వుని జీవితమున సంపూర్ణమైన మార్పును గలుగఁజేసెను. క్రైస్తవాదర్శమునఁగూడ మార్పును గలిగింపనై యున్నదిగాని యావిషయ మింకను గణ్వునకుఁగాని మఱియేరికిగాని తెలియదు

ఈవిషయ మీమఠము నాదరించు ప్రజలందఱిలో గొప్ప కదలికను గలిగించెను. ఒకవారమువఱకు జనులీవిషయమును దక్కఁ దదితరమును ముచ్చటించుకొనలేదు. అతఁడాలయంబునఁ బ్రవేశించుసరికే మనోవ్యథచే నిండియుండెననియుఁ బ్రసంగించుకాలమునఁగూడ నొకవిధమగు జ్వరసన్నిపాతము గలిగి యొడలెఱుంగఁడనియుఁ దానచ్చట నెవ్వరి సంబోధించుచుండెనో యెఱుంగఁడనియుఁ దలంచిరి. వానిచర్యనుగూర్చి యట్లు తలంచుటయే 2. సమంజసము. వారి ప్రసంగము క్రౌర్యముతోఁ గూడుకొనఁలేదు. దుష్టపదప్రయోగయుక్తమును గాదు. ఆసంఘమునఁ దానుగూడ నొక్కఁడైయుండి తన నిజమగు సందేహమును నివారణచేసికొనఁ దలంచి మర్యాదతోఁ బ్రసంగించినట్లైయుండెను.

మఠాధిపతియగు కణ్వునియింటి కాతనిజేర్చిన మూఁడుదినముల కాతనిస్థితియందు గొంతమార్పు గలిగెను. దానినిగూర్చి వైద్యుఁడు ముచ్చటించెనుగాని యెంత మాత్రమును ధైర్యముఁ జెప్పలేదు. వారాంతమగు నప్పటి కాతఁడు క్రమక్రమముగఁ గృశించెను. శనివారము ప్రాతఃకాలమున మిక్కిలి నీరసస్థితియందుండెను. ఆదివారమున 3 ఉషఃకాలమున నాతఁడు కొంచెము తెరపితెచ్చుకొనితనకుమారిక యరుదెంచెనాయని ప్రశ్నించెను. అతని జేబునందుఁగల కొన్ని కాగితముల వలన నామెయుండు స్థలమును దెలిసికొనినతోడనే కణ్వుఁడామెను వెంటనే రమ్మని వర్తమానము చేసెను. అతఁడు గతవారమున దేవాలయమునఁ బ్రసంగించుచు స్మారకముదెలియక పడిపోయినది మొదలు, ఒకటిరెండు మాటలను మాత్రము 4 క్షణనిర్భాస గలవాఁడై యుచ్చరిం

1. విచారముగల. 2. యుక్తము. 3. ఉదయము. 4. కొలది తెలివి.

చెను. “పిల్లవచ్చుచున్నది. ఆమెత్వరలో నిచ్చటికిఁ జేరఁగలదు.” అని కణ్వుఁడు ప్రత్యుత్తరము నిచ్చెను.

కణ్వుని ముఖవికాసము వారమంతయుఁ శ్రమపడుచుండిన రీతిని గోచరింపఁ జేయుచుండెను. ఆతఁడీవారమంతయు రాత్రులు నిద్రను జెందక రోగి కుపచారమును జేయుచు వేచియుండెను.

“ఆమె నీజన్మమున నీకఁ జూడ” నని యాతఁడు మందస్వరమునఁ బలికెను. పిదప విశ్వప్రయత్నముతో “నీవు నాకు మిక్కిలి మేలొనరించితివి. క్రీస్తుచేయువిధానము నీవనుకరించితివని నా సందేహము మన్న” దని యాతఁడనెను. కొలది క్షణములకుఁ బిదప నాతఁడు తనతలను కొంచెము త్రిప్పెను. కణ్వుఁడు గ్రహింపకమున్నె వైద్యుఁ “డాతఁడు మరణించె” ననెను.

ఆదివారమునాటి యుదయ మాధర్మపురి యందు గతవారమునట్లె యుండెను. సాంఘికులచే 1 నిబిడముగ నిండియుండిన యారాధన మందిరమునం దుపన్యాస వేదికపైఁ గణ్వుఁడు నిలువఁబడెను. ఆతఁడు 2 వైవర్ణ్యముకలవాఁడై దీర్ఘరోగమునుండి లేచినవానివలె గాన్పించెను. తండ్రి మరణించిన వెనుక నొకగడియైన వచ్చి చేరిన యాపురుషుని కుమార్తెను గనిపెట్టుకొని కణ్వునిభార్య యింటియొద్దనే యుండెను. ఆపురుషుఁడు కణ్వునియింట నొకగదిలో నిర్మలుఁడై నిశ్చలుఁడై యుండెను. ఆతని శ్రమలన్నియు గట్టెక్కినవి. గత దశవత్సరములనుండియుఁ జేయునట్లే కణ్వుఁడు సత్యవేదముతో దెరచి కాగితములను సవరించుచుండ నా నవీన పురుషుని 3 వక్త్రకమలమే యెదుటఁ బొడకట్టుచుండెను.

నాటి యారాధనమున నొక క్రొత్త వింత కాన్పించెను. ఆయగురు వెన్నఁడు ప్రాతఃకాల పూజావిధానమునఁ గార్యక్రమమును వ్రాసికొని రాక జరిపెనో యెవ్వరును జెప్పఁజాలరు. ఆతఁడీ యాచార్యపదవికి నూతనముగా వచ్చినప్పుడట్లు చేసెను గాని చిరకాలమునుండి తన యుదయ ప్రసంగముయొక్క ప్రతివాక్యమును జక్కఁగా నాలోచించి వ్రాసికొని వచ్చెడివాఁడు. వాని సాయంతనోపాసన వ్యాసమును గూడ నట్లే వ్రాసికొని వచ్చుచుండును. నేటి ప్రాతఃకాలవ్యాస మంత జనవశీకరముగ నుండెనని చెప్పవీలులేదు. అనుమానించి పట్టిపట్టి మాట్లాడెను వానిమనంబున నేదియో గొప్పవిషయము 4 బహిర్గతమగుటకై ప్రేరేపించుచుండెను. గాని యారాధన విధానంబున దాని నాతఁడు వెలువరించలేదు. నాటి యారాధనముయొక్క 5 చరమభాగంబునఁ బ్రబోధమునఁ గాన్పింపని యొకసత్త్వము గాన్పింపఁజొచ్చెను. సత్యవేదమును 6. ముకుళించి బల్లమాటునుండి వెలుపలకువచ్చి ప్రజల కభిముఖుండై కణ్వుండు గతవారమున జరిగిన విషయమును గూర్చి ప్రసంగింప నుపక్రమించెను.

“మన సహోదరుఁడు”— ఈమాట కణ్వుని ముఖమునుండి వెలువడుటచే మిక్కిలి యాశ్చర్యమును గలిగించెను.— “నేటి యుదయమునఁ 7. బరంపదమును జెందెను. వాని చారిత్రమునంతను బూర్తిగ గ్రహింప నాకింకను సావకాశము చిక్క

1. దట్టముగ. 2. వివర్ణత్వము జెందినవాఁడు. 3. ముఖపద్మము. 4 వెడలుటకు. 5. చివర. 6. మూసి. 7. వచ్చెను.

లేదు. కలకత్తానగరంబున వానికొక సోదరి కలదు. నేనామె కొకజాబును వ్రాసితినిగాని ప్రత్యుత్తరము నింకను బడయనైతిని. వాని పత్త్రిక నాయొద్దనే యున్నది. ప్రస్తుత మిచ్చటనే యుండఁగలదు!

ఇట్లుచెప్పి యాతఁడు కొంచెము నిదానించి సభామందిరము నంతటం గలయఁ జూచి తానిదివఱ కెన్నఁడును జూడనందులకు మిక్కిలి యాతురతతోఁ జూచుచుండుటం గాంచెను. గతవారమునఁ దనకుఁ గలిగిన స్వానుభవముల నాతఁడింకను వారికిఁ దెలుప వలనుపడలేదు. తానిప్పుడును దదనుభవ 1. నిమగ్నుఁడై యుండెను. అట్టులయ్యును వాని యనుభవములోని కొంతభాగము వారికి చెప్పనవసరములేకయే గోచరించెను. వానిహృదయమున నుప్పొంగుచుండిన సువార్తను వారికిఁ జెప్పఁ దలంచుటలో నాతఁడు 2. అప్రమత్తుఁడుఁగాక స్వక్రముఁడనైయుంటినని గ్రహించెను. కావున నాతఁడిట్లుపన్యసింప 3 నుపక్రమించెను.

"ఈపరదేశి గతవారమున మన దేవాలయమునకు విచ్చేసి పలికిన వాక్యములు 4 మదంతర్గత హృత్ఫలకమున గాఢముగా నాటుకొనియెను. అతఁడప్పుడు చేసిన ప్రసంగమును, వెనువెంటనే వానికిఁ గలిగిన యవస్థయుఁ, బిదప నాతఁడు మద్గృహంబున మృత్యుముఖంబునఁ బడుటయుఁగూడ సమకూడి నేనింతదనుక నెన్నఁడును దలంపని రీతిని "క్రీస్తును వెంబడించుట యన నేమి?" యని పరిపరివిధంబుల 5 నంతఃకరణశుద్ధిగ నాలోచించితినను విషయమును మరుగుపరుప నసమర్థుఁడ నగుచున్నాను. వీనివిషయమునఁగాని వీనివలె నిరాధారులై మనయూర నల్లాడుచుండిన పలువురి విషయమునఁగాని నేనుగాని మీరుగాని ప్రభుని యెదుట నిందార్హుల మగుదుమా! లేదా యని నేనింకను నిర్ధారణగాఁ బ్రవచింప నసమర్థుఁడ నగుచున్నాను. అటులయ్యును నాతఁడు చెప్పినవానిలో విశేషభాగము సత్యమనియును, సమాధానమును జెప్పుటకు మనము సంసిద్ధులము కావలయు ననియును, కానిచోఁ గ్రైస్తవులమగు మనము దేవుని యెదుట నిర్దోషులము కాఁజాలమనియును నేను నిశ్చయముగ దలంచుచున్నాను. గతవారమున నాతఁడు చెప్పిన దంతయు మన క్రైస్తవాలయములలోను సంఘములలోను గల దురాచారముల ప్రకటనమై యున్నది. నాటినుండియు నానాటి కానాఁడు నాయా యభిప్రాయము బలపడుచున్నది. ఆనాఁడాతఁడాడిన మాటలకుఁ బ్రత్యుత్తరముగా మన మనుసరింప వలసిన విధానమును నాకు 6 స్ఫురించుచుండిన రీతిని మీకుఁ దెలుపుట కిదియే యుక్తమైన 7 తరుణముగాఁ దోఁచుచున్నది."

కణ్వుఁడొకక్షణమాగి తన 8 శ్రోతలవైపునకుఁ జేరిపారఁజూచెను. తన యాజమాన్యముక్రింద దృఢమైనట్టియు, మనోనిశ్చలము గలట్టియు, స్త్రీపురుషులు కొందఱు కలరు. ధర్మపురి దైనికపత్రికాధిపతియగు పురూరవుఁడు తనకెదురుగఁ గూర్చుండి యుండెను. అతఁడీ యాలయమునఁ బదివత్సరములనుండి సభ్యుఁడుగ నుండెను. గౌరవప్రపత్తుల నాయూర నాతని మించినవారు లేరు. బట్టలనేయు యంత్రశాలకు గార్యదర్శియగు సుమంతుఁడుండెను. కలాశాలాధ్యక్షుఁడగు విద్యాధరుఁడు కలఁడు. వణిక్ఛిఖామణియగు కన్నయ్యశ్రేష్ఠియు నచ్చటఁగాన్పించుచుండెను. వాని దుకాణములలో నధమ

1. మునిగి. 2. మఱచిపోక. 3. మొదలుపెట్టెను. 4 నాహృదయములోపల 5. శుద్ధమైనమనస్సుతో 6. తోఁచు 7. సమయము 8. వినువారు.

మైదువందల జీతగాండ్రు కలరు. చిన్న వయస్సునం దుండినను శస్త్రవైద్యమున నందె వేసినచేయి యనిచెప్పఁదగిన వైశ్యభూషణుం డుండెను. ఇందనుక ననేకోద్గ్రంథముల రచియించినట్టియుఁ బ్రకృతమున నొకవిచిత్రమగు "నవల" ను వ్రాయుచుండినట్టియు నరసకవికలఁడు. క్రొత్తగఁ దండ్రి మరణమునందుటచే విశేషధనమున కధికారిణియై శంరత్ [1] లావణ్యయు సద్గుణ గణ్యయు నగు సుమతియుఁ గలదు. గాన విద్యా కౌశలత గలిగి యాలయ సంకీర్తనంబునఁ బాల్గొనుచుండిన సుగుణవతియుఁ గలదు. ఈ పరదేశి యొక్క వృత్తాంతంబునం దామె మిక్కిలి శ్రద్ధను వహించినదగుటచే నత్యాతురతతో [2] దేశికుని యుపదేశ వాక్యములకై నిరీక్షించుచుండెను.

ఇట్టి గుణవంతమగు సంఘము కలిగియుండుటచేతనే కణ్వుఁడు వెనుకటి యాదివారమువలెనే వీరిని దలంచి మిక్కిలి తృప్తికలిగినవాఁడై యుండును. ఈసంఘమునఁ బట్టుదలతోఁ బనిచేయఁగల [3] దత్తులనేకులు గలరు. నేటియుదయమునఁ గణ్వుఁడు వారి ముఖవిలాసంబులం దిలకించి వీరిలో నెందఱు తానుచెప్పఁబోవు విషయము నామోదించి పనిచేయ [4] నియ్యకొనియెదరోయని చింతగఁ దలంచెను. తానుచ్చరించు ప్రతివాక్యమును నెమ్మదిగా యోజించుచుఁ బ్రజల మనంబుల నింతదనుక నాటనంతటి దృఢముగ నాటునటుల తన యావచ్ఛక్తిని వినియోగపరచి నెమ్మదిగఁ జెప్పఁ దొడంగెను.

"నేను చెప్పఁబోవు విషయము నసహజముగఁగాని యనాదరణీయముగఁగాని తలంపవలదు. కాని యీసంఘమునఁ బెక్కండ్రు దీని నట్టులనే తలంచెదరు. మన మిప్పు డాలోచింపఁబోవు విషయము మాకందఱికిని సుబోధముగ నుండుటకు నేఁజెప్పు విషయమును స్పష్టముగఁ జెప్పెదను. "క్రీస్తు ఏమి చేయును" అను ప్రశ్నము వైచికొనకుండ నొకవత్సర పర్యంత మేకార్యమును జేయమని ప్రమాణము చేయఁదలఁచినవారు కావలయును అట్లు ప్రశ్నించుకొని దాని కుత్తరముగాఁ దన యంతరాత్మ ప్రబోధించినరీతి నాచరించవలయును. అట్లు చేయుట వలనఁ గలుగు పర్యవసానమెట్టులుగాఁ బరిణమించినను సరకుసేయఁ జనదు. ఇట్లు ప్రతిజ్ఞ చేసి తదనుగుణముగ నాచరించువారిలో నే [5] నాద్యుఁడనుగ నుండెదను. ఇట్టి ప్రవర్తనమువలనఁ గలుగు మార్పులకు సాంఘికులందఱు హర్షించి నన్ను మన్నింపవలయును. క్రీస్తుచేయఁగలరీతిని నీనాచరించితినని మీకుఁదోఁచినప్పుడు నాకార్యములకు మీరడ్డు చెప్పవలదు. నా యభిప్రాయమును మీకు సుబోధముగ [6] వ్యక్తపఱచితినా ? నేటి యారాధనము ముగిసినవెనుక నీ ప్రతిజ్ఞను జేయఁదలంచిన సభ్యులందఱు నిచ్చట నాఁగవలయును. తదనుసరణ విధానమును ముచ్చటించుకొందము. "క్రీస్తేమిచేయును." అనునదియే మనముపాటింపవలసిన వాక్యము. ఫలాఫలములను బరిగణింప క్రీస్తు ప్రకృతమున నిచ్చట మనస్థానమున నుండిన నేమిచేయునని [7] వితర్కించి మన యంతరాత్మ ప్రబోధించునటులు ప్రతి కార్యమును జేయుచుండవలయును. క్రీస్తు తనశిష్యులెట్లు ప్రవర్తింపవలయునని బోధించెనో యట్లు మనము ప్రవర్తింపఁ బ్రయత్నింతము. ఇట్లాచ

---

1 సౌందర్యము 2. గురువు. 3. సమర్థులు. 4. ఇష్టపడుదురో. 5. మొదటివాఁడు. 6. చెప్పితినా. 7. ఆలోచించి.

రింప సమకట్టువారు నేటినుండి యొకవత్సరముదనుక నటులు వర్తింతుమని ప్రతిజ్ఞఁ గావింపవలయును."

కణ్వుఁడు తిరిగి కొంచెమాగి శ్రోతల వైపునకుఁ జూచెను. ఇట్టిప్రతిజ్ఞను జేయఁ గోరుటవలన సంఘమున మిక్కిలి కలవరము పుట్టెను. విడ్డూరముతో మొగములు మొగములు జూచుకొన సాగిరి. కణ్వునివంటివాఁడిట్టి క్రొత్త ప్రచారము నుద్బోధించునని యెవ్వరును దలంపలేదు. కర్తవ్యమునుగూర్చి వారి మనంబులు కలఁతను జెందఁ జొచ్చెను. కణ్వుఁడు కోరిన విషయమందఱికి బూర్తిగ బోధపడియెనుగాని క్రీస్తుని బోధనల నిప్పుడాచరణమునఁ బెట్టఁదలంచుట యుక్తమగునా? కాదా! యను విషయమున వారిలో నభిప్రాయ భేదములు పొడసూపెను.

చిన్న ప్రార్థనచేసి యాచార్యుఁ డారాధనమును ముగించెను. దీవన వాక్యముల నుచ్చరించినతోడనే గాయకు లొక కీర్తనను బాడిరి. సభికులు నొక్కొక్కరుగ లేచి వెడలి పోవఁ బ్రారంభించిరి. ఒకరితో నొక రీవిషయమును ముచ్చటించుకొనుచు దేవాలయ 1 ప్రాంగణమున గుంపులుగుంపులుగాఁ గూడిరి. బలవత్తరముగా వాదించుకొనుచుండిరి. కొలఁదికాలము నిరీక్షించిన పిదపఁ గణ్వుఁడు తానుగోరిన విషయము నామోదించిన వారందఱు నుపన్యాసగృహమునఁ బ్రవేశింపుఁడని కోరెను. కొందఱితో ముచ్చటించుచుఁ దానాలయద్వారమునఁ గొంతతడవు నిలిచెను. పిదపఁ దిరిగిచూడ నాలయంబున నెవ్వరును లేరు. ఉపన్యాసాగారమున కాతఁడు వెళ్ళెను. అచ్చట చేరినవారిని జూచి యాతఁ డాశ్చర్యమును జెందెను. అచటి కెవరవత్తు రెవరురారని యాతఁడు తనలో వితర్కించుకొనలేదు. ఇట్టి కష్టసాధ్యమగు కార్యమున కిందఱు సంసిద్ధులగుదురని యాతఁ డూహింపలేదు. ఏఁబదిమంది యచ్చటఁ జేరియుండిరి. అందు సుమతియు, సుగుణవతియు, బురూరవుఁడను విద్యాధరుఁడును, గన్నయ్యశ్రేష్ఠియు, వైద్యభూషణుఁడను గూడనుండిరి.

కణ్వుఁడు లోనఁ బ్రవేశించి యుపన్యాసాగార2ప్రవేశద్వారమునుమూసి యందుఁ జేరిన చిన్న సంఘమున కెదురుగ నిలువఁబడెను. వాని ముఖము తెల్లఁబడి యుండెను. వాని 3. యోష్ఠము లావేశముచేఁ జలించుచుండెను. అతని జీవితమునం దాతనిసంఘముయొక్క జీవితమునందు నిది గొప్పమార్పునకు హేతుభూతమైన విషయమైయున్నది. పరిశుద్ధాత్మవలనఁ బ్రేరితుండయినప్పుడుగాని యేమనుజుఁడును బాల్యమునుండియుఁ దనకు సహజములైన గుణప్రవర్తనములకు భిన్నముగ నెట్లు సంచరించునో యెవ్వరు నూహింపఁ జాలరు. మేమింతకుమున్నే చెప్పియుండినట్లు కణ్వుఁడు తనలో జరుగుచుండిన మార్పును బూర్తిగ నెఱుఁగఁడుగాని తా నిపుడాచరింప నుంకించిన విధానంబున గొప్పమార్పు కలుగఁగలదని యెఱుంగును. ఇప్పుడీచేరియుండిన వారిని జూచినతోడనే యాతని మనంబున నుత్సాహోద్రేకంబులు వెల్లివిరిసెను. ప్రప్రథమమున నుచ్చరింపఁదగినది ప్రార్థనమేయని వానికిఁదోఁచెను. వారినందఱిఁ దనతోఁ బ్రార్థింపుఁడని కోరెను. ఆతఁడు 4. వక్త్రమునుదెరచి ప్రార్థింప నుపక్రమించినతోడనే పరిశుద్ధాత్మ తమ 5. సన్నిధానమున నుండెనని వారికందఱికి నుద్బోధించెను. ప్రార్థనము ప్రబలిన కొలఁదిని వీరిశక్తియు నధికము కాఁజొచ్చెను. గదియందెల్లెడలను బరిశుద్ధాత్మ కంటి

1. ముంగిలి. 2. వీధితలుపు. 3. పెదవులు. 4. నోరు. 5. దగ్గఱ.

కగపడుచుండినంతటి 1. సువ్యక్తముగ వ్యాపించెను. ప్రార్థించుట ముగిసినతోడనే కొన్ని క్షణములదనుక నిశ్శబ్దముగ నుండెను. అందఱి 2 శిరములును వంపఁబడియుండెను. కణ్వుని వదనమంతయు 3. నశ్రుపూరితమై యుండెను. ప్రభువుయొక్క పాదవిన్యాసముల ననుసరింప మీఁదుపూనిన ప్రతిజ్ఞయుక్తమైనదేవుని 4 దివినుండి శబ్దము వినఁబడెనా యనునంతటి దృఢముగ నందఱి ప్రతినను జూచి హృత్ఫలకమున నాటుకొనియెను. ఇట్లు ఈ మతమున నిందనుకలేని నూతన ప్రచారము ప్రారంభ మయ్యెను.

కణ్వుఁడు ప్రసంగించుట కుపక్రమించి తన 5 నమ్రతతో నిట్లనియెను:—

"మనమిప్పు డేమిచేయుటకు సంకల్పించినదియు మీ కెల్లరికిని దెలిసియేయున్నది. కృతకార్యఫలంబు మనకెట్లు పరిణమించినను మన దైనికకృత్యములయందెల్లెడల "క్రీస్తు యేమిచేయును." అని ప్రశ్న చేసికొని యాచరించుచుండవలయును. ఒకవారము దినములలో నిట్టి యాచరణమువలన నాజీవితమునం దెట్టిమార్పు కలిగినదో సావకాశముగ మీకింకొకసారి చెప్పెదను. ఇప్పుడావిషయమును జెప్పుటకు వ్యవధి చాలదు. కాని దానివలన నాగతచర్యయెంత యత్యంత తృప్తికరముగ నుండెనో యది స్పష్టమైనది. నేనొంటరిగ నీ కార్యమునకు గడంగ సాహసింప నసమర్థుండనైతిని. ఈ విషయమున భగవత్ప్రేరణయే నన్ను నడిపించుచున్నదని చెప్పఁగలను. అట్టి దైవప్రేమయే మిమ్ములనుగూడ నిప్పుడిప్పటికిఁ జేర్చి నడిపించుచున్నది. మనమేమిచేయ నిశ్చయించుకొనినదియు మీరు నిశ్చయముగఁ దెలిసినదిగదా!" అనెను

సుగుణవతి తానొక ప్రశ్న నడుగఁ దలంచితి ననెను. అందఱు నామె వైపునకుఁ దిరిగిరి. ఏ యితరకారణముచేతను గలుగఁజాలని వికాస మామె వదనారవిందమునఁ గాన్పించుచుండెను.

సుగుణవతి—"క్రీస్తు యేమిచేయునని మనము చేసికొను ప్రశ్నమునకుఁ దగు సదుత్తరము మనకెట్లు లభించునో నాకు గోచరించుటలేదు నావిషయమునఁ గ్రీస్తేమి చేయఁ దలంచునో నిశ్చయించి నాకుఁ జెప్పువారెవ్వరు? క్రీస్తు మన భూగోళమునం దవతరించిన కాలమునకును మన యీ కాలమునకును హస్తిమశకాంతరము తారతమ్యము కలదు. సువార్తలయందుఁ జెప్పఁబడని యనేక విశేషాంశము లీకాలమున మనల నలమికొని యున్నవి. ఇప్పుడా ప్రభు విచ్చటనుండిన నేమిచేయునో నేనెట్లు చెప్పఁగలను?"

కణ్వుఁడిట్లు ప్రత్యుత్తరము చెప్పెను:—

అది తెలిసికొనుటకుఁ దగిన మార్గము నాకుఁ దోఁచుటలేదు. పరిశుద్ధాత్మని ద్వారా ప్రభువును మనము గ్రహింపవలసినదే. పరిశుద్ధాత్మనిగూర్చి ప్రభువు తనశిష్యులతోఁ జెప్పిన సంగతులు మీరెఱిఁగియే యుంటిరి. "ఎటులైనను బరిశుద్ధాత్మ మిమ్ములను జేరినప్పుడాతఁడే మిమ్ములనందఱిని న్యాయమార్గంబున నడిపించును. అతఁడు తాను వినిన యంశములనే మీకుఁ జెప్పెను. రాఁబోవు సంగతులను మీకెఱుకపఱచును. నన్నాతఁడు ఘనతపఱచును. నావలన సంగతుల నన్నింటిని దెలిసికొని మీకుఁ దెలియఁజేయుచుండును. తండ్రియైన దేవుని సర్వస్వమును నాదియే. కావుననే యాతఁడు నావలన సంగ్రహించి మీ కుద్బోధించుచుండునని తెలిపియుంటిని." అని క్రీస్తు చెప్పియుండలేదా?

1. స్పష్టమున. 2. తలలు. 3. కన్నీళ్ళతోనిండి. 4. ఆకాశము, 5. అణకువ.

"ఇంతకంటె మనము దెలిసికొనఁదగిన మార్గమింకొకటి నాకుఁ దోఁచుటలేదు. పరిశుద్ధాత్మ మూలముననే క్రీస్తేమిచేయునో మనము గ్రహింపవలసియుండును"

"మనమటులే యోజించి చేయుకార్యములనుగాంచి పరులు క్రీస్తిట్లుచేసి యుండఁడని యధిక్షేపించిన మనమేమి చేయవలయు" నని యంత్రశాలాధికారి ప్రశ్నించెను.

"అట్టి ప్రసంగమును మనమాతంకపరుపఁ జాలము. మనము మాత్రము కేవలము సత్యప్రవర్తనము కలవారమై యుండవలయును. మనము చేయు ననేక కార్యముల యందుఁ గ్రైస్తవాదర్శము పలువిధముల మారనేరదు." అని కణ్వుఁడనెను.

"అట్టులయ్యు నొక క్రైస్తవసంఘమునకుఁ జేరినవాఁడు క్రీస్తననుసరించిన విధానమును మఱియొక సంఘమువా రామోదింపరు. మనమందఱము నొక్కటే విధముగఁ గ్రీస్తు ననుసరించు టెట్లు? అందఱు నొక్కవిధముగ నాలోచించెదరా?" యని కన్నయశ్రేష్ఠి పలికెను.

కణ్వుఁడు కొంతతడవూరకుండి తుదకిట్లు ప్రత్యుత్తరమిచ్చెను:—

"అందఱు నేకాభిప్రాయులగుదురని తలంప నలవికాదు. కాని యంతఃకరణ శుద్ధిగఁ గ్రీస్తుని వెంబడింప నిశ్చయించుకొనునపుడు మన మనంబులఁగాని యితరుల యూహలయందుఁగాని భేదములు కలుగవని యెంతును. మన మవలంబించిన విధానమే నిర్దిష్టమను పట్టుదలగాని పరుల నెరసులను వెదకు దురభ్యాసముగాని లేకుండినఁ జాలును. క్రీస్తుప్రపంచమున కంతకు నాదర్శమగు నెడల ననుకరణార్హమై యుండక తీరదు. మనమీ ముఖ్యాంశమును సదా దృష్టియందుంచుకొనవలెను. క్రీస్తు నేమిచేయు నని పరిశుద్ధాత్మ నడిగి ప్రత్యుత్తరమును వడసినపిదపఁ దదాచరణమువలన మనకెట్టి ఫలము కలిగినను సరకుసేయక యాచరించి తీరవలయును. ఈసంగతి సువ్యక్తమయినదా?"

ఆగదిలోః సమావేశమయిన వారందఱును దమయామోదమును, ఆచార్యునిపైఁ గరుణాకటాక్ష వీక్షణంబులఁ బరపుటరూపమున వెలిబుచ్చిరి. ఇందు సుబోధముగాని విషయమేమియును లేదు. అచ్చటఁ జేరిన పిన్నపెద్దల ముఖకమలములఁ దేరిపారఁ జూచినప్పుడు కణ్వుని ముఖము కంపమందెను.

ఒకరితో నొకరు ముచ్చటించుకొని సంగతులఁ బ్రశ్నించుకొనుచుఁ గొంతతడవచ్చటనుండి క్రీస్తునీవిధమున వెంబడించుటవలనఁ దమకుఁగలిగిన స్వానుభవములఁ బరస్పరము వారమున కొకసారి సమావేశమై తెలుపుకొనుటకు నంగీకరించిరి. కణ్వుఁడు తిరిగి ప్రార్థించెను. తిరిగి పరిశుద్ధాత్మస్పర్శ వారి కనుభవములోనికి వచ్చెను. ప్రతి 1. శిరమును గొంతదనుక వంపఁబడియుండెను. అంత నందఱు లేచి నిశ్శబ్దముగ వెడలిపోయిరి మహోత్కృష్టమయిన యావేశము వారికి వాగ్బంధనమాయెను. ఒక్కొకరు వెడలిపోవుచుండఁ గణ్వుఁడు వారితో 2 హస్తచాలనముల నొనర్చెను. పిమ్మట 3 గర్భాలయప్రాగ్భాగమునం గల తనగదిని జేరి మోకరించి యరగడియదనుక లోననుండెను. ఇంటికి వెళ్ళినతోడనే పరదేశియొక్క శవముగల గదిలోనికేగి వాని మొగముం దిలకించి 4 యశ్రుపతనముం గావించి జ్ఞానాభివృద్ధికై పరితపించెను.

ఇతి ప్రథమాధ్యాయము.

---

1. తలయు. 2. చేయూచెను. 3. గుడిలోపలి. 4. కన్నీరుపెట్టుచు.

# దైవానుకరణము.

## ద్వితీయాధ్యాయము.

---

ధర్మపురీ 1దైనిక వార్తాపత్రికాధిపుఁడు సోమవారమునాఁటి యుదయమున బత్రికావ్యాపారమును జూచుగదిలోఁ గూర్చుండి కర్తవ్యాంశములఁ దిలకించుటలో నొక నవీనప్రపంచ మాతని 2 దృక్పథమునఁ గోచరించెను. క్రీస్తుచేయు విధానమున సమస్తకార్యముల నాచరించెదనని మనఃపూర్వకముగఁ బ్రతిజ్ఞ చేసియుండెను. అందువలనఁగలుగు కష్టసుఖముల కాతఁడు సంసిద్ధుఁడాయెను. కాని తన వార్తాపత్రిక యీ వారమునఁ బ్రారంభింపఁబోయినపుడు అతనికి 3 భయజనకముగనుండి కొంచెము సంశయాకుల మానసుండయ్యెను. ఆతఁడు కార్యనిర్వాహక భవనమున కందఱికంటె మున్ముందుగనే చేరి యొంటరిగ నీపత్కాలము గడపెను. ఆతఁడు దీర్ఘాలోచనము చేయుచుఁ దనవ్రాఁతబల్లకడఁ గూర్చుండియుండ నసహజమగు నొకయుద్రేక మాతనికిఁ గలిగెను. ఆతఁడు నాతనితోపాటు క్రీస్తుననుసరింతుమని ప్రతిజ్ఞచేసిన వారందఱును పరిశుద్ధాత్మ తమయంతఃకరణముల 4 నిబిడముగ నిండియుండెనని యింకను గ్రహింపవలసియున్నది. ఆతఁడు లేచి గది 5 ముఖద్వారమును లోనబిగించి తానిదివఱ కనేకవత్సరములనుండి చేయనికార్యమును జేయ నుపక్రమించెను. తనబల్లప్రక్కను మోకరించి దైవసాన్నిధ్యము లభించి జ్ఞానోదయమునుజేసి తన్ను నడిపింప వలయునని ప్రార్థించెను.

ఇట్లు ప్రార్థించి తాఁజేసిన ప్రతిజ్ఞనుమనంబున దృఢంబుగ నిలకొల్పి దినచర్యఁ బ్రారంభించెను. 6 కవాటమును దెరచి యనుదినమును సహజముగ జేయవలసిన పనులఁ జేయ మొదలిడెను. సహకార పత్రికాధిపతి యప్పుడే వచ్చి యాతని గదిలోని బల్లయొద్దఁ గూర్చుండెను. వ్యాససంపాదకుఁ డొకఁడు తీవ్రదృష్టితో నొకవ్యాసమును సిద్ధము చేయుచుండెను. పత్రికాధిపతి నాటిప్రధానవ్యాసమును వ్రాయుచుండెను. ఈదైనికపత్రిక సాయంతనమున వెలువడునది. ప్రధానవ్యాసము నుదయము నెనిమిదిగంటలకు మున్నె సిద్ధపరచుట యాచారము.

ఆతఁడు పావుగంట వ్రాయుసరికి సహకారాధిపుఁడు "నిన్న విహారప్రదేశమున జరిగిన మల్లయుద్ధముయొక్క వివరమంతయు సిద్ధముగనున్నది. అదియొక పత్రము నిండఁగలదు. అచ్చునకియవచ్చునా" యని ప్రశ్న చేసెను. పత్రికాధిపతి పత్రికతో సంబంధించిన ప్రతివిషయమును స్వయముగ విమర్శించు స్వభావముకలవాఁడు కావున సహకారి సకల విషయములయం దాతని యామోదమును వడయుచుండును. ఇట్టి విషయములలో నాజ్ఞఁగొనుట కేవలనామమాత్రము.

"సరే—వలదు. చూచెదనిటు తెమ్ము"

7 తంత్రివార్తాముఖమున వచ్చిన యాసమాచారమును గైకొని శ్రద్ధతోఁ దిలకించెను. పిదపఁ గాకితముల బల్లపైనుంచి గాఢాలోచన మొనర్చి నేటి పత్రికయందు

---

1. దినసంబంధము 2. చూపుమార్గమున 3. భయముపుట్టి 4. దట్టముగ 5. ముందుతలుపు. 6. తలుపు. 7. తెల్లిగ్రాము.

దీనిని బ్రచురింప వలదు" అని చెప్పెను. సహకారి రెండుగదుల నడుమనుగల ద్వారమున నిలిచియుండెను. ఆతఁడు నిశ్చేష్టితుఁడై యజమాని భావమును దాను గ్రహింపలేదనుకొనెను.

"ఏమంటిరి ?"

"దీనిని బరిత్యజింపుము. మనముపయోగింపము."

"కాని—" సహాయాధ్యక్షుఁడు 1 స్తంభీభూతుఁడయ్యెను. ప్రధానాధ్యక్షుఁడు మతిచెడియుండెనేమోయని వానివైపుఁ జూచెను.

"అవధానీ ! దాని నచ్చువేయఁగూడదని నేను నిశ్చయించితిని." అని ప్రధానాధ్యక్షుఁడు తలయెత్తి యాతని వంకఁ జూచెను.

"అవధాని తనయజమానితో నధికప్రసంగము జేయు నాచారము లేదు, పుహారవుని వాక్యము కార్యస్థానమున సదా విధివాక్యముగ నుండెను. ఆతఁడెన్నఁడును దనయభిప్రాయముల మార్చుకొనువాఁడు కాఁడు. ప్రస్తుతసందర్భము వైచిత్ర్యాత్మకంబగుటచే నవధాని మౌనమునువీడి యిట్లనియెను.—

"2 బాహాబాహీ సమర ప్రస్తావన లేకయే పత్రిక నేఁడు వెలువడవలయునని తమసంకల్పమా !

"అగును. అదియే నామతము."

"ఇట్టి పద్ధతిం గనివిని యెఱుంగము. సమకాలిక పత్రికలన్నియు నీవిషయమును వివరించితీరగలవు. మనచందాదారు లేమందురు ? ఇది కేవలము——" తన మనోగతాభిప్రాయమును వెల్లడింపఁగల 3 వాక్యానుసంధానము కుదురక విరమించెను.

దీర్ఘాలోచనముతో నవధానిని తేరిపారఁజూచెను. అవధాని మతియొక క్రైస్తవసంఘమునఁ జేరినవాఁడు. తనసంఘము వేఱు. ఈ పత్రికానిర్వహణమున వీరిద్దరు ననేక వత్సరములనుండి కలిసి పనిచేయుచున్నను మతవిషయమున వీరెన్నఁడును ముచ్చటించుకొని యుండలేదు.

"అవధానీ ! ఒక్కక్షణము లోనికి వచ్చి తలుపు మూయుము."

అవధాని లోనఁ బ్రవేశించెను. వారిరువురొంటరిగా 4. నభిముఖులైరి. ఒక్కక్షణము నిశ్శబ్దముగ నుండిరి. పిమ్మట యజమాని యిట్లనెను—

"అవధానీ ! మనప్రభువు రక్షకుఁడునైన యేసునాథస్వామియే యీపత్రికను నడుపుచుండినచో నీదొమ్మరకుస్తీ నింతదూరము కొనియాడి తనపత్రిక నావిషయముతో నింపునని నీవంతఃకరణశుద్ధిగ నమ్మెదవా ?"

అవధాని యాశ్చర్యముచే నోరుఁదెఱచి తుదకు "ప్రభువట్లు చేయునని నమ్మఁజాల" ననెను.

"బాగు. ఈవిషయమును మనపత్రికయందుఁ జొన్పకుండుట కిదియే నాప్రధాన కారణము. ఒక సంవత్సరము దనుకఁ గ్రీస్తు పాల్గొంపని పని నీపత్రికా నిర్వహణమున జరుపనని నిశ్చయించుకొంటిని."

---

1. కొయ్యబారిపోవుట 2. చేతులు చేతులుగలిపిపోరు. 3. మాటలకూర్పు. 4 ఎదురుపడి.

తన యజమానికి నిజముగఁ బిచ్చియెత్తి యుండినను అవధానియింత 1 నివ్వెఱఁ జెందియుండఁడు. ప్రపంచమున 2 నున్మాదావస్థయందుండిన వారిలోఁ దన యజమాని యగ్రగణ్యుఁడని యవధానికి నిశ్చితాభిప్రాయము కలిగియుండినను 3 దాత్కాలికముగ నేదియో తద్భ్రమ కలిగెనని తలంచెను.

"అట్లొనర్చిన పత్రికస్థితి యెట్లుండును ?" అని యవధాని తుదకు హీనస్వరముతో నడిగెను.

యజమాని కోరచూపుఁ జూచి "నీవేమనుకొనియెద" వనెను.

"ఈవిధానము పత్రికకు వినాశహేతువు. ఈ పద్ధతి నీ కాలమున వార్తాపత్రికల నడపుట యసంభవము. ఇది కేవలమాదర్శప్రాయము. లోకమందులకు సంసిద్ధము కాలేదు. అట్టి పత్రికవలన ధనము లభింపదు. మల్లయుద్ధప్రసంగరహితముగాఁ బత్రిక నేఁడు వెలువడినచోఁ గొన్నివందలమంది చందాదారులైన దూసిపోక తీరదు. ఈ విషయమును గ్రహించుటకుఁ బ్రవక్తలు కావలయునా? మనపట్టణ ప్రముఖులందఱు నీ విషయమును జదువఁగోరుచుందురు. విషయము జరిగినదని వారికెల్లరకుఁ దెలియును. పత్రిక కరగతమైనతోడనే యందీవిషయమున నొకపత్రార్ధమైనముండునని తలంతురు. పౌరుల కుతూహలము మీరిట్లు సరకుసేయకుండుట శ్రేయస్కరము కానేరదు. మీరిట్లు చేయుట గొప్పతప్పని నేనూహింతును" అని యవధాని నిర్భయముగఁ బ్రత్యుత్తర మిచ్చెను.

అధిపుఁ డొక్కక్షణము నిశ్చలుఁడైయుండి పిదప నెమ్మదిగఁ దనదృఢనిశ్చయము నిట్లు వెలిబుచ్చెను.—

"అవధానీ! ఒక మనుజుని గుణగణనము చేయుటకు నీకు సరియైన యాధారమెద్ది? క్రీస్తుయొక్క యాదర్శమునుబట్టియే మనము కొలువవలయును. ప్రతివిషయమునఁ గ్రీస్తేమిచేయునో యూహించి తద్విధానము నాచరించి పర్యవసానమును బరిగణింపకుండుటయే 4 ఋజుమార్గవర్తికిఁ గర్తవ్యమని నీవంగీకరింతువా? నరులు తమ దినచర్యయందుఁ గ్రీస్తుననుసరించుట యుక్తమగునా? కాదా?"

అవధాని మొగము నెఱ్ఱజేసికొని యస్వస్థతతోఁ దనపీఠముపై నటునిటు దిరిగి తుదకు నాయకునకిట్లు సమాధానము చెప్పెను.—

"ఏల-నిజమే! ఏమిచేయఁదగియుండునని యుక్తాయుక్తవిచారణచేసినచో మీ రానతిచ్చినదియే ఖచితమైన 5 మానము కానియది సంభవమగునా యనునది విచారణీయాంశము. అట్లుచేసియు ద్రవ్యము నార్జింపఁగలమా? వార్తాపత్రికానిర్వాహమున జయమునందఁగోరితిమేని సాంఘికనైతికాచారముల ననువర్తింపక తీరదు. స్వర్గమువంటి 6 నిర్దుష్టప్రపంచమున నీయనుకరణము జయావహమగునుగాని 7 పాపభూయిష్ఠమైన యిచ్చట సాగనేరదు."

"క్రైస్తవాదర్శములతోఁ బత్రికను జయప్రదముగఁ గొనసాగింపలేమనెదవా?"

"అగును. అదియే నానిశ్చితాభిప్రాయము. అట్లుచేయఁజాలము. ఒకమాసములో పునసే మనము దివాలా తీయవలసినదే"

---

1. తెల్లపోవుట 2. పిచ్చి 3. అప్పటికప్పుడు. 4. న్యాయ 5. కొలత 6. దోషములేని 7 పాపముతోనిండిన

పత్రికాధిపుఁడు వెంటనే సమాధానమును జెప్పలేకపోయెను. దీర్ఘాలోచనము చేసి తుట్టతుద కిట్లనియె.—

"అవధానీ! మనమీవిషయమున మఱియొకసారి ముచ్చటించుకొనవచ్చును. ఈలోపున మన 1 మనోనిశ్చయమునుబూర్తిగ గ్రహించి యుండుట యుక్తము. సంవత్సరాంతమునకుఁ బత్రికానిర్వాహణమునఁ బ్రతికార్యము విషయమునను గ్రీస్తేమి సేయునని శంకించి శుద్ధాంతఃకరణముతోఁ నాకుఁదోఁచిన రీతిని బూర్ణముగ నడిపింతునని ప్రతిజ్ఞ చేసియుంటిని. ఇవ్విధమున జయమునందుటయేగాక మున్ను లభింపనంతటి యధికమగు జయమునుబొందఁగలనను నమ్మికతో నేనీకార్యమునకు దొరకొంటిని"

అవధానిలేచి "అట్లయిన నీవిషయము పత్రికయందుదాహరింపఁ బడదు."

"దానికి తావొసఁగను. దానిస్థానము నాక్రమింప సమర్థములగు విషయములు పెక్కులుం గలవు. అవెవ్వియో నీ కెఱుకయే" అని యజమాని నుడివెను. అవధాని సంకోచించి "ఈ విషయము నిందుఁ జొప్పించుటకుఁ గారణమునైనఁ బ్రచురింతురా?"

"వలదు నిన్నటిమల్లయుద్ధము జరుగనట్లే పత్రిక జరుపుము"

2 విషాదాకులచిత్తుండై యవధాని తన స్థానమును జేరెను. ఆశ్చర్యోద్రేకాహంకారము లొక్కమొగి వానినావహించెను. యజమానియెడల నాతనికిఁగల గౌరవప్రపత్తులాతని స్తంభీభూతుని గావించెను. పత్రికా మూలచ్ఛేదాంకురమగు నీ 3 యపమార్గమేల పత్రికాలయమునఁ బ్రవేశింపవలయునని కినిసెను.

ఆదివారమునాఁడు జరిగిన మల్లసంగరమును గూర్చి ప్రస్తావవశమునైనను నుదాహరింపఁ బడకయే నేటిపత్రిక వెలువడఁగలదని కార్యాలయములోని సేవకవర్గమునకంతకును నాటి 4 యపరాహ్ణకాలమునకే తెలిసినది. అదివిని యుపవిలేఖకులందఱాశ్చర్యపరీత చిత్తులైరి. అన్ని శాఖల పనివారు నీవిషయమును వింతగఁ జెప్పుకొనిరి. ఆనాఁ డొకటిరెండుసారులు పత్రికాధిపతి కార్యాలయమున నిటునటుఁదిరుగుచుండఁ బనివారందఱాతని వైపునకుఁ దేరిపారఁజూచిరి. వారుతన్ను వింతగఁ జూచుచుండిరని యాతఁడు గనిపట్టియు నెఱుంగనట్లు నటించెను.

ఆతఁడు పత్రికయందనేకములగు మార్పుల నూహించెనుగాని వాని 5 నాచరణమున కింకను దేలేదు. దీర్ఘాలోచనమును జేయుచు వేచియుండెను. తన ప్రశ్నమునకు దగుసమాధానమును వడయుట కింకను గొంతతడవు సమయమునకై వేచియుండవలయునని యాతఁడూహించెను. మనోనిశ్చయమును దీవ్రముగఁ జేసికొనకపోవుటకుఁ గారణము పత్రికావిధానమునఁ గ్రైస్తవాదర్శమునకు భిన్నములగు విషయములు విశేషించి యుండుటచేతఁ గాదుగాని క్రీస్తెట్లు సంచరించునోయని విమర్శించుటకే కాలము పట్టెను.

నాఁటి సూర్యాస్తమయ తరుణమునఁ బత్రిక వెలువడఁ జందాదారుల మనంబుల నది స్పష్టాభిప్రాయమును గలిగించెను. మల్లయుద్ధప్రసంగము పత్రికలోఁ జొన్పియుండినఁ దనభావమువలనఁ గలిగిన యాశ్చర్యమును గలిగింపనేరదు. పత్రిక వెలువడినతోడనే సత్రములయందుఁ గర్మాగారములయందుఁ బురమందిరంబునందు నింకను బలుతావులఁ

---

1. ఒకరినొకరము 2. విచారముతోఁ గూడిన 3. చెడుదారి. 4. మధ్యాహ్నము 5. చేయుట.

గల ప్రజలనేకులు మల్లయుద్ధప్రశంసను జదువు నాతురతతోఁ బత్రికనువిప్పిరి. అందా విషయముంగానక పత్రికలనమ్ము బాలునకుసంబోయి తద్విషయముగల యితరపత్రికలం గొనిరి. పత్రికలనమ్ము బాలురుఁగూడ నాలేకపోవుటను గమనింపకమున్ను జరిగిన జట్టిపట్టు గూర్చిన వర్ణనగల యీదైనిక పత్రికం గొనుఁడని కేకలిడుచు నమ్ముచుండిరి.

పత్రికాకార్యాలయము సమీపమునయున్న విహార ప్రదేశమున నొకగృహస్థు ఒక పత్రికనుకొని యాతురతతోఁ దెరచిచూచి కోపోద్రిక్తమానసుండయి 1 విక్రేతం బిలిచి ఓరీ! నీపత్రికకేమివచ్చినదిరా! ఇందు గొప్పరాటువిషయమే కానమే? ప్రాతపత్రికల నమ్ముచుంటివా యనెను.

“ప్రాతపత్రికలేమి? అది నేటిపత్రికయే. మీకు దృష్టి మందమయినదా యేమి? అని యాపిల్లవాఁడు కోపముతోఁ బ్రత్యుత్తరమిచ్చెను.”

“[illegible] దీనిలో గొప్పరాటుకడ జరిగిన దెబ్బలాట విషయము లేదే?”

అనియాతఁడా పత్రికను బిల్లవానికొసఁగిన వాఁడు దానిని తొందరగాఁ బరికించి 2 వివర్ణముఖుఁడై వెఱ్ఱివానివలె నటింప సాగెను. మఱియొక బుడుతఁడీ పత్రికలతో వాదారిని బరువిడుటంజూచి వానిం బిలిచి ఓరోరీ నీ పత్రికలనొకసారిఁ జూడనిమ్ము” అనెను. తొందరతో నా పత్రికలనన్నిటిని జూచినను దేనియందును నా విషయము గాన్పింపదయ్యెను.

పత్రికాకార్యాలయమునఁ బత్రికలనమ్ము గదిలోఁ బత్రికావిక్రేతలగు బాలురు పెక్కుండ్రు విషణ్ణులై యుద్రిక్తముతోఁ జేరియుండిరి. పత్రికలను విక్రయించు బల్ల వెనుక నిలువఁబడియుండిన యుద్యోగి నీకట్టిలాటచుండిన దూషణభాషణంబుల మఱియొకఁడు సహింపఁజాలకుండెను. ఆతఁడు సదా యిట్టివారితో సంభాషించుట కలవాటుపడిన వాఁడగుటచే మొద్దుబారియుండెను. పత్రికాధిపతి దినకృత్యము ముగించి యింటికిఁబోవుచు దారిలోనున్న యీగదిలోనికి వచ్చెను. అచ్చట గందరగోళముగా నుండుటం గాంచి యేమిసమాచారమని యడిగెను.

“నేటిపత్రికయందు గొప్పరాటు విషయమయిన సమాచారము లేకపోవుటచే నొకపత్రికనైన విక్రయింపఁజాలమైతిమని కుఱ్ఱవాండ్రు కేకలిడుచుండిరి.” అని మున్ను పత్రికాసేవకుల సేవలవలెనే యీయుద్యోగియుఁ బత్రికాధిపతిని వికారదృష్టితోఁ జూచెను

పత్రికాధిపతి యొకక్షణకాలము సంశయించి తిన్నగ గదిలోనికిఁబోయి బాలుర కభిముఖుఁడై యిట్లనెను.—

“బాలులారా! ఇప్పుడిచ్చట నెన్ని పత్రికలు గలవు. వానిని లెక్కింపుఁడు నేటి రాత్రి వానినన్నిటిని నేను గొనెదను.—

పిల్లలాశ్చర్యముతో 3 నారణ్యకులవలె నాతనింజూచి యుత్సాహముతోఁ దమపత్రికల లెక్కింప 4 దొరకొనిరి.

“ఔరయ్యా! వీండ్రు లెక్కప్రకారము సొమ్మిచ్చివేయుము. ఇంకను ముందెవ్వరయిన పిల్లలమ్ముడువోని ప్రతులందెచ్చిన వానింగూడఁ గొనినాము. ఇది మీకు న్యాయముగ నున్నదా?”

---

1 అమ్మువానిని 2. తెల్లపోయిన మోము. 3. అడవివాండ్రు 4. మొదలిడిరి

అని బాలురనడిగెను. వాండ్రు పత్రికాధిపుని ఈయసహజకృత్యముచే నిశ్శబ్దముగ నూరకుండిరి. అందొకఁడు "బాగుగనే యున్నది. కాని యీపద్ధతి యెంతకాల మవలంబింతురు. పత్రికనిట్లెంతదనుకఁ బోషింతురు."

పత్రికాధిపతి మందహాసముఁ గావించెను. వారికి సమాధానమును జెప్పుట యనవసరమని తలంచి కార్యాలయమునుండి వెలువడి స్వగృహంబున కేగెను. మార్గమధ్యమునఁ గ్రీస్తేమిచేయుననుప్రశ్న పలుసారులీతని కున్ముఖమయ్యెను. నేటి యీ చరమవిషయమునకంటె మొత్తముమీఁదఁ బత్రికావిధానమునఁ దానొనర్పఁదగిన రీతినిఁగూర్చియే యీ ప్రశ్న యాతనికి దారసించెను. పత్రికయందుఁ జెక్కుమార్పులను జేయుటచేఁ విక్రేతలగు నీబాలురకే విశేష నష్టము గలుగును. వారికి దీనివలన ద్రవ్యనష్టమేల కలుగవలయును? వారు నిందాపాత్రులు గారు తాను ధనికుఁడైయుండుటచే సంకల్పించినవారికిఁ గొంతయాదరణమును గల్గింపఁ గలఁడు. వారికన్యాయము గలుగకుండుటకై క్రీస్తుకిట్లే కాని 1 తత్తుల్యమగు మఱియొక విధముననగాని చేయఁగలఁడని నమ్ముచుఁ దన యింటికిఁ బోయెను. ఈవిషయములఁ దదితరులకై తాను నిశ్చయించుటలేదు. స్వోపయోగార్థము యోజించెను. ఇతరులుగూడ నిట్లేచేయవలయునని తాను 2 నిర్ధారణచేయుట లేదుగాని తానంతఃకరణశుద్ధిగ నాచరింపవలసిన విధానమిదియేయని నిశ్చయించుకొనెను పత్రికలెక్కుడుగ నమ్ముడువోవనికూడఁదలంచెనుగాని యీవిధానము నేగొనసాగించినచోఁ బత్రికకెంతటి నష్టముసంభవించునో పూర్తిగ గుర్తింపలేదు.

ఈదినమున బత్రికలో దొమ్మరాటవిషయము జేర్పనందులకు అతనికనేకములుజాబులు వచ్చెను రెండుమూఁడుజాబులను 3 సంక్షిప్తముగా నిందుఁజూపెదము.

"దైనిక పత్రికాధిపతిగారికి—అయ్యా! కొంతకాలమునుండి నేను తెప్పించుకొను పత్రికను మార్పఁదలంచుచుంటిని. కాలానుగుణముగను, 4 ఉత్పన్నముగను వలయువిషయములఁ దెలుపుపత్రికయే నాకుఁగావలయును. మొన్న పానశాలకడ జరిగిన విశేషమును మీపత్రికయందుఁ బ్రచురింపకుండుటచే నికమీపత్రికం దెప్పించుకొనఁ గూడదని నిశ్చయించుకొంటిని. కాన నాకికముందు పంపకుఁడు."

చిత్తగింపుఁడు.

చందాదారు.

"దైనిక పత్రికాధిపతిగారికి:—పత్రికాధిపా! దేశప్రజలకందఱికిని అలజడిఁ గలిగించితిరే! సంఘసంస్కరణమును బత్రికాముఖమున జరుపఁదలంపరనుకొనియెదను. ఇంక నట్లుచేయఁదలంచిన నపాయము సిద్ధించును. పత్రికను మిక్కిలి యభివృద్ధిలోనికిఁ దెచ్చితిరి. నాయాలోచన నామోదించి పత్రికయందు మార్పులను జేయకుఁడు. ప్రజలు దొమ్మిలాటలు, తగవులు మొదలయినవి పత్రికలయందుఁ జదువఁగోరెదరు. పాఠకులు వలయుదానిని వారికి సమకూర్పుఁడు. సంస్కరణమును మఱియెవ్వరినైనఁ జేయనిండు."

చిత్తగింపుఁడు.

మిత్రుఁడు.

---

1. దానితోసమానము 2. నిశ్చయము 3. సంగ్రహము 4. పుట్టినదిగ.

"ప్రియమైన పత్రికాధిపతికి—

నీవాగ్దానము ఆచరణయందుఁ బెట్టుచుంటివని తెలిసి మిక్కిలి యానందించుచుంటిని. సౌభాగ్యమయిన ప్రారంభమును జేసితివి. దానిని నేను మిక్కిలి విలువగల దానిగాఁ 1 బరిగణించుచుంటిని. ఇందువలన నీకుఁ గొంత ద్రవ్యనష్టము సంభవింపవచ్చును. కాని సకలమును బోనేరదు"

భవదాచార్యుండు.
కణ్వుఁడు,

"పత్రికాధిపతిగారికి—

అయ్యా! మీపత్రికయందు నేనేర్పరచిన ప్రకట 2 నావధి ముగిసినతోడనే నిలుపుచేయుఁడు. పూర్వమువలెఁ దిరుగఁ బ్రచురింపవలదు. మీకు నేనీయవలసిన మూల్యము నిందుతోఁ బంపితిని. మన ఖాతా యింతటితో ముగిసినదని గ్రహింపుఁడు.

చిత్తగింపుఁడు
పొగాకువర్తకుఁడు,

పత్రికాధిపతి యీ జాబులను బల్లపైనుంచి కొంతతడవు దీర్ఘాలోచన గావించి పత్రిక నొకదానిని జేతఁగొని యందుఁగల ప్రకటనలనన్నిటిని జూడ నారంభించెను. పొగాకువర్తకుని జాబులో దొమ్మరాటు విషయమును పత్రికయందుఁ జేర్చియుండుటచేఁ దన ప్రకటనమును దీసివేయవలెనని వ్రాసియుండలేదుగాని పత్రికాధిపతి యీ రెంటికినిగల సంబంధమును గుర్తింపక తీరినది కాదు. పత్రికాధిపతి యేదియో యొక వెల్లి సంస్కరణము నామోదించి పత్రికయొక్క రీతిని మార్పఁదలంచెననియుఁ గావున జందాదారులసంఖ్య తగ్గిపోవుననియు విని పొగాకు వర్తకుఁడు తనప్రకటనను నిలుపుచేసెనని పత్రికాధిపతి గ్రహించెను.

కాని యీ జాబువలనఁ దనపత్రికలలోని ప్రకటనలలో నేవియుక్తములేవి యయుక్తములను విమర్శనము పత్రికాధిపతి మనంబునకు స్ఫురించెను. ఈ విషయము నాతఁడింతదనుకఁ జర్చించి యుండలేదు. ప్రకటనముల నన్నిఁటిని జూడ నందుఁగొన్నిఁటిని క్రీస్తు హర్షింపఁడని వానికిఁ బోధపడెను. రెండు కాలములు నిండియుండిన 3 మద్యప్రకటనమును క్రీస్తేమిచేయును. ధర్మపురియందు మద్యవిక్రేతలు స్వేచ్ఛాధికారమును బొంది పానశాలలనిర్మించి తత్సమీపమున నుద్యానవనములు నిర్మించిరి. ఇవియన్నియుఁ బట్టణక్రైస్తవ సంఘమం దిమిడియున్నవి. ధర్మపురియందలి ప్రతివర్తకుఁడును జేయుకార్యమునే దానును జేయుచుండెను. ఇదియే వానికి విశేషాదాయమును గలిగించుచుండెను. పత్రికనుండి దీనిని దొలఁగించిన నదినిలువఁగలదా? ఇదియే ముఖ్యమయిన ప్రశ్న. కాని యదియా యాతఁడిప్పుడు తలంచుప్రశ్న? క్రీస్తేమిచేయుననునదియే యిప్పుడు ముఖ్యమయినప్రశ్న. ఈ ప్రశ్నకే యీవారమున నాతఁడు తనదినచర్యచే సదుత్తరము నిచ్చుచుండెను. క్రీస్తు తనపత్రికలోఁ బొగాకును మద్యమును బ్రకటించునా? పత్రికాధిపతి యీప్రశ్నోత్తరమునకై కొంతతడవు నిశ్చలుండై చింతించి జ్ఞానసంపాదనార్థమై భగవంతుని బ్రార్థించి ప్రకటనలపనింజూచు గుమాస్తాయగు చిదంబరరావును దనగదిలోనికి

1. ఎంచుచుంటిని 2. హద్దు. 3 కల్లు.

రమ్మని పిలిచెను. చిదంబరరావు పత్రికత్వరలో నంతమునందు నవస్థకువచ్చినదని తలంచుకొనుచు లోనఁబ్రవేశించెను.

"చిదంబరమూ! మన పత్రికలోని ప్రకటనలను జూచుచుంటిని. అందులోఁగొన్ని మన పత్రికలోఁ బ్రచురించుట 1 కనర్హములుగాఁ దోఁచుచున్నవి. కావున నట్టివాని విషయములో మనమిదివఱకుఁ జేసికొనిన యొడంబడిక కాలము ముగిసినతోడనే వానిని బ్రచురించుట మానవలయును."

అని పత్రికాధిపతి నెమ్మదిగను నిశ్చలముగను జెప్పి తానాకవాళ్లు పెట్టిన పత్రిక నాతనికిచ్చి—"నేనిందానవాలు పెట్టిన ప్రకటనలింకముందు పత్రికలోఁ బ్రచురింపఁబడ"వని 2 తత్సంబంధులకుఁ దెలుపుము.

చిదంబరమా కాగితమును గంభీరముగాఁ జూచి "వీనినన్నిటిని విడిచిన మన పత్రికకు విశేషనష్టము కలుగఁగలదు. ఈపత్రిక నెంతకాలము నిర్వహింపఁ గలుగుదు మను కొంటిరి?" అనెను.

"చిదంబరమూ! ధర్మపురియందొకదైనిక పత్రికకు ఏసుక్రీస్తుక పత్రికాధిపతియు, సర్వాధికారియునై యుండినచో దానిలో నాతఁడు పొగాకును, కల్లుసారాయిలను బ్రకటించునని నీవనుకొనియెదవా?"

చిదంబరము తన యజమానిని నిర్విణ్ణుఁడైచూచి యిట్లనెను.

"అగును—కాదు—ఆతఁడట్లు చేయునని నేనుతలంపను. కాని యావిషయమునకును మనకు నేమిసంబంధము? ప్రభువుచేయునటులు మనము చేయఁగలమా? అట్టియాదర్శములతో నడిపనవార్తాపత్రిక లెన్నఁడును గొనసాగవు.

"ఏల?" అని పత్రికాధిపుఁడు నెమ్మదిగ నడిగెను.

"ఏలా! అందువలన నార్జించు ధనమునకంటెఁ బోఁగొట్టుకొనునది విశేషము. అంతియే. ఇట్టి యాదర్శములతోఁబనిచేసిన మనపత్రిక త్వరలో దివాలాతీయఁగలదు.?

అనిచిదంబరరావు తా నంతఃకరణశుద్ధిగాఁదలంచిన విషయమును మరుగుపరచనేరక వెల్లడించెను.

"నీవట్లుతలంతువా!" అని పత్రికాధిపతి యడిగెను. ఆతఁడు తనలోఁదాను మాటలాడుకొనుచున్నట్లు ప్రశ్నించెనుగాని చిదంబరమునుండి జవాబును బడయఁగోరి కాదు. కొంచెముసేపుతాళి తిరిగియిట్లనెను.

"నేనింతకుముందుఁ జెప్పినటులు నీవాచరింపవచ్చును. క్రీస్తిట్లేచేయునని నేను నమ్మెదను. ఫలాఫలములు నాకెట్లుపరిణమించినను ఒకసంవత్సరము దనుకఁ బత్రికాకార్యమును ఈయాదర్శముతో నడపుటకుఁ బ్రతిజ్ఞచేసికొని యుంటిని. మనమెన్నివిధముల విమర్శించి చూచినను క్రీస్తుకాలమున మత్తుపదార్థముల వ్యాపకముకకు సహాయకారియై పత్రికలలోఁ బ్రకటించుట కామోదించునని యుక్తిచే నిర్వహింపఁజాలము. ఇంకను సందేహమునకాస్పదములగు ప్రకటనలుగూడఁ గలవు. వానినిగురించి యోజించెదను. ముందువీనివిషయమై నాకు నిశ్చితాభిప్రాయము కలిగినది"

చిదంబరము ఎవ్వరోవింతమానిసియొద్ద నుండినటులు విడ్డూరపడుచు వెళ్ళి తనబల్లయొద్దఁ గూర్చుండెను. ఈ సందర్భమున నేమియు గ్రహింపలేక పోయెను. ఆతని

1 తగనివి 2. ఆయా ప్రకటనలఁ జేయువారికి.

కాగ్రహమును భయమునుకూడఁ గలిగెను. పత్రికాధిపతి యిట్టి యసంభవములగు నాదర్శముల కనుగుణముగఁ బత్రికనడుప సంసిద్ధుఁడయ్యెనని దేశమున వెల్లడియగునేని పత్రిక నాటితో నంతరించుననని చిదంబరము నిశ్చయించుకొనెను. ఇట్లే వ్యాపారముఁ జేసిన నది యెట్లు ఫలించును? [1] అనూచానాచారముల నట్టుపరచి పట్టియుల్లరి లోనికిదిగెను. ఇది కేవలము బుద్ధిహీనత; పట్టిపిచ్చి అని చిదంబరభావను కొనుచు నీవిషయమును సహాయాధ్యక్షులని కలంగింప నాతఁడును జిదంబరముతో నేకీభవించెను. మనయజమానికేమి వెఱ్ఱియెత్తెనా? పత్రికను దివాలా తీయింపనెంచెనా యని తమలోఁదామనుకొనిరి.

పత్రికాధిపతి యింకను దనకు రాఁబోవు కష్టములను బూర్తిగ గుర్తింపలేదు. అతఁడు శుక్రవారమునాటి యుదయమున వచ్చి కార్యాలయమునఁ గూర్చుండ నాదివారముగాదు ప్రచురింపఁబడు పత్రికా విషయముల నిర్ణయింపవలసి వచ్చెను. ఆదివారము నాడు పత్రికను బ్రచురించు పత్రికా కార్యస్థానములు కడునరుదు. వానిలో నిదియొకటి. అట్లుచేయుటచే దీనికి విశేషధనము సమకూడుచుండెను. ఆదిత్యవారమునఁ బ్రచురింపబడు పత్రికలలో సుమారొకటి రెండు కాగితములు మతవిషయికములును, తక్కుంగల ముప్పది నలుబది పత్రములును వేటు, నాటకములు, వర్థప్రసంగములు, దేశాచారములు, సాంఘిక, రాజకీయ విషయములు మున్నగువానితో నిండియుండును. ఇదియన్ని విషయములను జదువుకొనుటకవకాశమిచ్చునది యగుటచే మతస్థులగు చందాదారులందఱును దీనినామోదించి ఆదివారమునాడిట్టి పత్రికయుండుటయే సమంజసమని కొనియాడుచుండిరి.

పత్రికాధిపతి మనంబున కీవిషయ మిప్పుడే తోడకట్టుటచేఁ గ్రైస్తవవిషయమున నేమిచేయునని వితర్కించుకొనెను. క్రైస్తవ యొక దైనిక పత్రికాధిపతియై యుండినచో నెద్దియేని సత్కాలక్షేపముచేయుటకై వారమునందేర్పరచుకొనిన యీయొక్కదినమున ధర్మపురియందలి క్రైస్తవగృహంబులన్నిటిలో నిట్టి కలగూరగంపగనుండు పత్రికను బ్రవేశపెట్టుటకుఁ బ్రయత్నించునా! ఆదిత్యవారమునఁ బ్రజలందఱిట్టి పత్రికనొకదానిని జూచుట యావశ్యకమనియుఁ గాయకష్టమునుండి విశ్రాంతినొందుట కేర్పడిన యీయొక్కదినమునఁ బ్రాయికముగ గుడికిపోవు నాచారము లేని కూలివాండ్రంతటికిని గొంతవిశ్రాంతిని గలిగించుటకుఁగూడ నిట్టిపత్రిక వలయుననియుఁ బెక్కండ్రు సేయు వాదము నీతఁ డెఱుంగును. ఆదివారము ప్రచురించు పత్రికవలన ధనము లభింపదనుకొనఁడు; అట్టిచోఁ బత్రికాధిపతి యీకూలివాండ్ర యవసరమును దీర్చుటకై యాతురపడి పత్రికను బ్రచురించునా? యని యాతఁడీవిషయమును నిర్మలస్వాంతుఁడై తనలోదాను వితర్కించుకొనెను. ఇన్నివిషయములను బర్యాలోచించిన క్రీస్తు ఆదివామందయమునఁ బత్రికను బ్రచురించునా! దానివలన లాభము కలుగునా లేదా యనునది విచారణీయాంశము కాదు. నిజమునాలోచించిన నాదివారము పత్రికను బ్రచురించుట మానినచోఁ గొన్ని వేల రూప్యములు దండగరాకమానదు. అదిగాక సంవత్సర చందాదారులు వారమున కేడుపత్రికలను గొనుచుండిరి. ఇప్పుడు తానొకదినము పత్రికను బంపుట తగ్గించుటయుచితమా! అని అతనిమనము [2] డోలాయమానమై యుండెను. ఏతద్విష

1. పూర్వ 2. ఊయ్యెలవలెనై

యమునఁ గలిగిన యాందోళనముచే గ్రీస్తు ననుకరింపక పోవుటయే యుక్తమని కూడఁ దలంచెను. పత్రికావిషయమునఁ దాను సర్వస్వాతంత్ర్యముగల యజమాని యగుటచే దానినే రీతిని మార్చినను మార్పనగును తానాలోచనము చేయదగిన భాగస్వాములు లేరు. ఆదివారమునఁ బ్రచురింపవలసిన కాగితములఁ బరికించుచు కర్తవ్యమును మనంబున స్థిరపరచుకొని దానిని పత్రికాసేవకుల కందఱికి నెఱింగించుట ధర్మమని యెంచెను. తనసహకారియగు నవధానిని 1 'వార్తాహారులను' చారులను, ముద్రాకార్యనిర్వాహక సంఘము వారిని దక్కఁగల సేవకుల నందఱిని 2 ప్రాంగణంబున సమావేశముగాఁ గోరెను. వారందఱును దామేమి విచిత్రమును వినెదమో యను నాశ్చర్యమానస నిమగ్నులై యందుఁజేరిరి. పత్రిక నూతనమార్గముల ననుసరించుచున్నది. వారలనిట్లు సమావేశపరచుట యొక నవీనమార్గము కావున వారందఱు నాతురతఁ జెందిరి.

"మనదినపత్రిక నికముందెట్లు నడుపవలయునో మీకుఁ దెల్పుటకై మిమ్మిచ్చటికిఁ బిలిచియుంటిని నావశ్యకములని తోఁచిన కొన్ని మార్పుల 3 నుపపాదించుచున్నాఁడను. నేనింతదనుకఁ జేసిన కార్యములను మీలోఁ గొందఱు వింతగఁ దలంచియుందురు. నేనట్లు చేయుటకుఁగల కారణముల మీకుఁ దెలుప నుత్సహించితిని" అని తానిదివఱ కవధానికిఁ జెప్పిన విషయముల నన్నిటినిఁ బత్రికాధిపుఁడు వారితోఁ జెప్ప నందఱును నిర్విణ్ణులై చూచి విషణ్ణులైరి.

"ఇట్లు ప్రవర్తింప నిశ్చయించుటచే నొకవిషయ మావశ్యకమగుచున్నది. అది మీకాశ్చర్యమును గొల్పును. పయివారమునుండి యాదివారమునఁ బత్రికను బ్రచురించుట మానెదను. అట్లొనర్చుటకుఁ గల కారణముల నీపత్రికలోఁ దెల్పెదను. పత్రికాపాఠకులిదివరలోఁ జదువుచుండిన వ్యాసముల సంఖ్య కొఱవడకుండ వారమునకొకపత్రిక నినుమడించెదము. ఆదివారమునఁ బత్రికను బ్రచురింపని పత్రికాధిపతులందఱు నిట్లేగదా చేయుచుండిరి. క్రైస్తవాదర్శముల ననుసరించిచూచిన మనయాదివారపుపత్రిక లోకమునఁజేయు మేలునకంటెఁ గీడే యెక్కువగుచున్నది క్రీస్తే నేఁడు నాస్థానమునఁ బత్రికాధిపుఁడుగా నుండిన నిట్లు చేయునా! ఈమార్పువలనఁ గొందఱి చందాదారులతోడను, ప్రకటనాధికారులతోడను, గొంచెము చిక్కు కలుగును. వారిని సమాధానపరచవలసియుండును. ఆవిషయమును నేనుచూచుకొనియెదను. మార్పునుమాత్రము చేయవలసినదే చూచినంతవఱకు నష్టము నాకే సంభవించును 4. విలేఖరులుగాని అచ్చువేయువారుగాని వారిప్రచారమునమార్పు నేమియుఁ జేయనవసరము లేదు." అనెను.

పురూరవుఁడు గదినన్నివైపులను బరికించెను గాని యెవ్వరును మాఱుపలుకలేదు. తానుచిరకాలమునుండి పత్రికనుఁ నడుపుచుండినను ద 5. న్నిర్వాహకమున నేటివలె 6. మనోద్రఢిమ మున్నెన్నఁడును గానఁబించలేదు. క్రీస్తేపత్రికాధిపుఁడైనచోఁ బత్రికాసేవక సంఘము నిట్లుగుమిగూర్చి 7. సంపర్కించునా ? దైనికపత్రికను జయప్రదముగ నడపుటకనువగు వ్యాపారమర్మములన్నియుఁ బురూరవునకు 8. వ్యగ్రములుగఁ దోఁచుచుండెను.

---

1. సమాచారములు తెచ్చువారు. 2. ముంగిట 3. కలిగించుచుంటిని. 4. వ్రాయువారు 5. నిర్వహించుట 6. మనస్సునకుగట్టితనము 7. కలుపునా 8 అజకతబకగ.

ఇట్లు సేవకులతోడి సమావేశము ముగిసిన వెనుక నవధాని పురూరవుని గదిలోని కేగి వానితోఁ గొంతతడవు ముచ్చటించెను. అతని యుద్రేక మినుమడించి తన పదవికి రాజీనామా నిచ్చుటకు సిద్ధపడెను. పురూరవుఁడు కడు బాగుగానున్నాఁడై యుండెను. వీరిరువురి సమావేశము నను క్షణమును బాధాకరంబుగ నుండెను గాని క్రీస్తు ననుసరించు తలంపు పురూరవునకు మెండగుచుండెను. అవధాని మిక్కిలి యుపయోగకరమగు నుద్యోగి. అతని స్థానమున నంతటివాని నింకొకనిని జేర్చుట దుర్లభము.

"అట్లయినఁ బత్రిక మాసాంతమునకుఁ బరిసమాప్తినందఁగలదు. ఆవిషయము నిప్పుడే యనమేల తెలిసికొనఁ గూడదు;" అని యవధాని పల్కెను. పురూరవుఁడు చిఱునగవుతో "నేనట్లనుకొనను. పత్రిక నిలుపఁబడుదనుక నీవు నీ స్థానమున నుండెదవా?" యనెను.

"పురూరవా! మీతత్వమును నేను గ్రహింపఁజాలను. చిరకాలమునుండి నే నెఱింగి యుండిన మీరీవారమునఁ గ్రొత్తవారుగఁ దోఁచుచుంటిరి."

"నా సమాచారమును నేనే గ్రహింప నేరకుంటిని. ఏదియో యొక నూతనశక్తి 1. నన్నలమికొని నడిపించుచున్నది. కాని యీ సంవత్సరమున నే మన పత్రికకు సంపూర్ణ విజయము సమకూరునను నిశ్చయస్ఫూర్తి కలుగుచున్నది. నా ప్రశ్నమున కుత్తరము నీయవైతివి. నీవు తుదివఱకు నాతో నుందువా?"

అవధాని కొంతవడి సంశయించి తుదకు "సరే" యనెను. పురూరవుఁడు 2. కర గ్రహణ మొనర్చి తన బల్లవైపునకుఁ దిరిగెను. వానిమనమున నలుగడ సరగుచుండిన పలు విషయంబులచేఁ గలవరపడుచు నవధాని తనగదిని చేరెను. ఇట్టి పరితాపజనకంబగు కాలమతని కెన్నఁడును తటస్థింపలేదు. తనకును దానుపాటుపడుచుండిన పత్రికకును 3. చరమావస్థ తటస్థించెనని చింతించెను.

ఆదివారము వచ్చెను. ధర్మపురియందలి 4. ప్రముఖులందఱును ప్రాతఃకాలారాధనకై గుడియందుఁ జేరిరి. ఆరాధన మొదలిడుటకు పూర్వము జనులందఱును బురూరవుని వింతగాఁ జూచిరి. ఉపన్యాస 5. వేదికా సమీపమున నాతఁడు తన యథాస్థానమునఁ గూర్చుండెను. రాఁబోవు నాదిత్యవాసరమునఁ బత్రిక వెలువడదని యాతఁడు వ్రాసిన విషయమును నేటిపత్రికయం దందఱును జదివియుండిరి. ఆవిషయమున వ్రాసిన వ్యాసము కడుతీవ్రముగ నుండుటచే నందఱి హృత్ఫలకముల నాటుకొనియెను. ధర్మపురియందింతటి త్వరితగతి వెన్నంటి వింత విషయములు జరిగియుండలేదు. ఈ పత్రికా విషయ మొక్కటియే కాదు. వస్త్రయంత్రశాలా కార్యదర్శియగు సుమంతుఁడు, వణిక్శిఖామణియగు కన్నయ్యశ్రేష్ఠి మున్నగువారి వింతచర్యలనుగూడ నచ్చటఁ జేరిన వారందఱును జెప్పుకొనుచుండిరి. ఆరాధన జరుగుచుండినంతవఱకు సాంఘికులలో నీ కలవరము జరుగుచునే యుండెను. కణ్వుఁడీవిషయమును గ్రహించియుఁ గార్యనిర్వాహణవత్తులకుఁ దగురీతిని నిశ్చలుఁడై యుండెను. అతఁడు చేసిన ప్రార్థన మిక్కిలి యుపయుక్తముగ నుండెను. అతని ప్రసంగ మెట్టిదని వర్ణింప నలవి కాదు. క్రీస్తు మీబోధించునని గతవారమంతయు వివరించిన బోధకుఁడెట్లు బోధించునో యట్లే యుండెను. కణ్వుఁడు రెండు వారములకుఁ బూర్వము తానుపన్యసించురీతి నుపన్యసింపలేదు. గతమంగళవారమున నాతఁడు పరదేశ

1. ఆవరించి. 2. చేయిపట్టుకొని. 3. చివరదశ. 4. ముఖ్యులు. 5. అరుగు

యొక్క సమాధియొద్ద నిలువఁబడి "మట్టిలో మట్టి, బూడిదలో బూడిదయుఁ" గలియు నని పలికెనుగాని యాదివార మెప్పుడు వచ్చునా? తనసాంఘికుల కీవిషయము నెప్పుడు పూర్తిగ నుపన్యసింతునాయని ప్రభుసందేశ నివేదనార్థమై యాతురపడుచుండెను.

అటులే యాదివారము తటస్థించెను. సాంఘికులందఱును, తదుపన్యాసాకర్ణనాసక్తచిత్తులై వేచియుండిరి. ప్రభువిప్పుడు వారికేమి చెప్పును! పలుతెఱంగుల శ్రమపడి ప్రయత్నించియుఁ బ్రభువేమి చెప్పునని యుద్బోధించుచుండెనో యా యదినిర్ధారణ చేయలేకపోయెను. అట్టులయ్యును ధర్మపురియందిట్టి యుపన్యాసము నిందనుక నెవ్వఁడును వినియుండలేదు. పాపము డాంబికమునందు నిందింపఁబడెను. స్వార్థపరత్వమును, ధనార్జనాసక్తతయు విశేషముగ నీసడింపఁబడెను. ఇట్టి యీసడింపుల నాతఁడు మున్నెన్నఁడును బ్రయోగించినవాఁడు కాఁడు. ఉపన్యాసము సాగినకొలఁదిని తత్ప్రజలయందలి ప్రేమ వెల్లడి యయ్యెను. వ్యాసాంతమున నందఱును బరిశుద్ధాత్ముఁడీతని ప్రేరేచె ననుకొనిరి. అదిసత్యము.

సుగుణవతి గానముచేయ నుపక్రమించెను. వ్యాసము ముగిసినతోడనే కణ్వుఁడామె నట్లు పాడఁ బ్రార్థించెను. ఇప్పుడామె గానప్రాశస్త్యమునకెవ్వరు నాక్షేపము దెలుపలేదు. అట్లు వారి [1] శ్రోత్రముల నరికట్టిన విశేషాంశమేమి! సుగుణవతి సౌందర్యవతి. పారమార్థిక చింత గలవారి కెల్లరికిని సుగుణవతి యొక్క సౌందర్యాతిశయమే యామెయొక్క గానానందమును బోఁగొట్టుచుండెను. ఆహేతువుననే యామెయుఁ గొన్నికీర్తనలఁ బాడునప్పుడు వెనుకంజవేయుచుండును. నేఁడీవిషయము లన్నియు నెచ్చటనో మఱుగుపడియెను. ఆమె తనగాత్రమును నిర్భయముగ సారించెను. ఆమెపాడునప్పు డొకవిధమగు నిర్మలతయు, నమ్రతయు నేఁడందుఁ గలియుటచే నంద[ఱు] [2] అవనతశీర్షులైరి. ఆరాధనక్రమము ముగింపకపూర్వము కణ్వుఁడు గతవారమున నిలిచినవారందఱును నేఁడును నిలిచియుండుఁ డనియుఁ గ్రొత్తగ నీసంఘమునఁ జేరి ప్రతిజ్ఞఁగొనఁదలఁచిన వారుఁగూడ నాగవలయునని [illegible] జెప్పెను. పిదపనాతఁడు వారి సమావేశస్థానమునకుఁబోయి యాభవనము నిండియుండుటంగాంచి యాశ్చర్యనిమగ్నమానసుండయ్యెను.

మొదటివలెనే కణ్వుఁడు వారినందఱిని దనతోఁగూడ బ్రార్థింపుడని కోరెను. మున్నువలెనే పరిశుద్ధాత్ముని సాన్నిధ్యము వారికి గోచరించెను. తామిప్పుడాచరింపఁబోవు విధానము దైవప్రేరితము కాదనిగాని తత్సహాయమున నిది జయప్రదముగఁ గొనసాగనేరదనిగాని యెవ్వరికిని సంకోచమైన కలుగలేదు.

పిదపఁగొంతదనుక నన్యోన్యము సంప్రతించుకొనుచుండిరి. వారియాలయ సంఘాదర్శములయం దెన్నఁడునుగాంచని సహకారము వారికిందు [3] స్పష్టనిర్భాసమాయెను. పురూరవుని పత్రికానిర్వహణ విధానమును వారందఱును సత్యమార్గమున గ్రహించి 'బళే' యని సమ్మతించిరి. వానిప్రక్కను గూర్చుండిన కన్నయ్యశ్రేష్ఠి "ఆదివారపుపత్రికను మానుటవలన నెట్లుగాఁ బరిణమించునని తలంచితిరి?" అని ప్రశ్నచేసెను.

1. చెవులు. 2. తలలవంచిరి. 3. నిజమగునదలింపు.

"1 ఇదమిత్థమని చెప్పఁజాలను. పత్రికాపాఠకులును ప్రకటనలును గూడఁ దగ్గిపోవునని యూహింతును."

కణ్వుఁడిట్లనియెను:— "నీవాచరించు విధానముయొక్క యోగ్యతాయోగ్యతలఁగూర్చి సంశయముకలదా? పశ్చాత్తాపము నందెదవా?"

"అణుమాత్రమును లేదు. కాని నాసంతుష్టికై యడుగుచుంటిని—మీలో నెవరైనఁ గ్రీస్తు, ఆదివారమునాఁడు పత్రికను బ్రకటించు ననుకొనెదరా?"

క్షణకాలమందఱు నిశ్శబ్దముగనుండిరి. పిదప విద్యార్థుఁడిట్లనియెను:—

"ఆవిషయమున మాలో నభిప్రాయభేదములులేవు. కాని గతవారమున 'క్రీస్తేమిచేసియుండు' ననువితర్కము పలుసారులు నన్ను బాధించెను. అది 2 ప్రాయశః అవలీలఁ బ్రత్యుత్తర మొసంగఁదగు ప్రశ్న కాదు."

"నాకునిట్టిబాధయే కలిగినది."

అనిసుమతి పలికెను. ఆమె సుగుణవతి ప్రక్కనుగూర్చుండియుండెను. పరిచితులగువారెల్లరీమె యెట్లీప్రతిజ్ఞ నిర్వహింపఁగలదని శంకించుచుండిరి.

"బహుశః నేను ధనవంతురాలనగుటచే నీప్రశ్నకు సదుత్తరమును బడయఁజాలకుంటినని యెంతును. యేసు ధనికుఁడు కాకుండుట నేనతని జీవితమున ధనము నుపయోగించుట కాదర్శము గాన్పింపదు. నేనుప్రార్థనాన్వితముగ నాలోచించుచుంటిని. అతఁడేమిచేయునో కొంచెము పొడకట్టుచున్నదిగాని 3 కూలంకషముగనుద్బోధించుటలేదు. క్రీస్తు కోటిరూప్యముల నేమిచేయుననునదియే నన్నాయాసపఱచుచుండిన ప్రశ్న. నాకుఁదృప్తికరముగ సమాధానమింకను జిక్కలేదు."

సుగుణవతి సుమతికభిముఖియై "నీద్రవ్యమునఁగొంత భాగమునీ వెట్లువినియోగింప వలయునో నేను జెప్పఁజాలను."

సుమతి హాసమ్ముఖియై "ఆవిషయమున నాకుసందియము లేదు. సాధనమునంతను సద్వినియోగము చేయుటకుఁ బ్రభు వేమార్గమువలంబించునో దానిం దెలిసికొనుటయే కష్టసాధ్యముగఁ దోఁచుచున్నది."

"అందుకుఁ గొంత కాలము పట్టును." అనికణ్వుఁడనెను. 4పారిషదులందఱును, ఆవిషయమునకై దీర్ఘాలోచనము గావించుచుండిరి. సుమంతుఁడు తన యనుభవమును గూర్చి ముచ్చటించెను. యజమానులకును దనకును గల వ్యావహారిక సంబంధమున గమనింపఁదగిన మార్గము నాతఁడు యోజించెను. అయ్యది వారికి నతనికిఁగూడ మార్పును గలిగించెను. అచ్చటఁజేరిన 5 యువకులలోఁ గొందఱు తామాచరించుచుండిన విధులను దెలియఁజేసిరి. క్రీస్తుని యాదర్శమును దైనందిన వ్యాపారమున ననుసరించుట కష్టసాధ్యమని యందఱేకాభిప్రాయులైరి. ప్రభువును బూర్తిగ గ్రహించి వానియాదర్శములఁ దెలిసికొనినఁగాని యాచరింపఁ బ్రయత్నించుట కవకాశము లేదు. ఈసంఘమునఁ బెక్కండ్రకాజ్ఞాన మింకను గలుగలేదు.

వారందఱు నిశ్శబ్దముగఁ గొంతదనుకఁ బ్రార్థించిరి. అట్టితరుణమున భగవత్సన్నిధానము వారికిఁ బొడసూపెను. పిదపఁ దమతమ కష్టములఁ బరస్పరముఁ దెలుపుకొనుచు వెడలిపోయిరి.

---

1. ఇదిఇట్లని. 2. తరుచు. 3. పూర్ణముగ. 4. సభ్యులు. 5. ప్రాయముగలవారు

సుమతియు సుగుణవతియుఁ గలిసి వెడలిపోయిరి. కన్నయ్యశ్రేష్ఠియుఁ బురూరవుఁడును గలసిపోవుచు వారుసంభాషణమున లగ్నచిత్తులై పురూరవునియిల్లు దాటిపోయి వెనుకకుమరలి వచ్చిరి. నృసింహకవియు విద్యాధరుఁడును, ఉపన్యాసమందిరమందే యొకమూల ముచ్చటించుకొనుచుండిరి. కణ్వుఁడును సుమంతుఁడును అందఱును గలిసివెళ్ళిన పిదపఁగూడఁ గొంతదనుక సంభాషణనిమగ్నమానసులైయుండిరి.

సుమంతుఁడు—“ తాము రేపు మా కార్యస్థానమున కరుదెంచి నేను వేసిన పథకము నవలోకించి యచ్చటివాండ్రతో ముచ్చటింపవలయును. ప్రకృతమున నితరులకంటె మీరు వారి నెక్కువగ నాకర్షింపఁగలరని నేనూహించుచుంటిని.”

కణ్వుఁడు, ఈషద్విషాదముతో నిట్లనెను:—“ నాకావిషయ మగోచరము. అయినను వచ్చెదను.”

రెండు మూఁడు వందలమంది కూలివాండ్ర యెదుట నిలువఁబడి యుపన్యసించుట కాతని కెట్టి సమర్థత కలదు? ఈవిషయమునసే వానిమనంబు సంశయగ్రస్తంబైనను తానే ఖండించుకొనెను. “ క్రీస్తిట్టితరుణమున నేమిచేయునను ప్రశ్నయే వాని [1] జుగుప్స నంతమునొందించును. మరుచటిదినమున సుమంతుఁడు తనకార్యాలయమున నుండఁ గణ్వుఁడచ్చటికేగెను. అప్పటికపరాహ్ణకాలమునకుఁ గొలఁదినిమేషములుమాత్రమే కొఱవడియుండెను. మేడమీఁదికిరమ్ము; నేఁజేయఁ బ్రయత్నించుచున్న దంతయు నీకుఁజూపెదను.” అనిసుమంతుఁడు కణ్వునిఁబిలిచెను. వారిరువురును యంత్రశాలలను దాటి సోపానముల [2] నధిరోహించి యొకవిశాల రిక్త సౌధాగారమునం బ్రవేశించిరి. ఈయది మున్నొకప్పుడు యంత్రోపకరణంబుల నుంచుస్థానము.

సుమంతుఁడు:—“ గతవారమున నేనట్లు ప్రతిజ్ఞఁగావించినది మొదలు లెన్నో విషయంబుల నాలోచించితిని. వానిలో నిదియొకటి. మా పారిశ్రామిక సంఘము వారీ గదిని నాయుపయోగార్థమై యిచ్చిరి. దీనిని బల్లలతో నింపి యామూల ఫలాహారముల నమ్మెదను. పనివాండ్రు మధ్యాహ్నమున నాహారమును భుజించుట కీగది నిచ్చి వారమునకు రెండు మూఁడు సారులు వారి జీవితముల నుపయోగవంతములుగఁ జేయఁదగు స్వల్పోపన్యాసముల నిప్పింపవలయునని నా సంకల్పము.”

కణ్వుఁడు నిర్విణ్ణుఁడై కూలివాండ్రిందులకు హర్షించెదరా యని యడిగెను.

సుమంతుఁడు—“ వారు తప్పక వచ్చెదరు. నేను వాండ్రనందఱిని బాగుగ నెఱుంగుదును. మన దేశమునంగల కూలివాండ్రలో వీండ్రు జ్ఞానవంతులు వీండ్రకు దేవాలయములతో సంబంధమేమియును లేదు ఏయాలయమునను వీండ్రకుఁ దావొసంగరు ఇట్టిసందర్భమున గీస్తేమి సేయునని నేనూహింప వీండ్ర [3]. యైహికాముష్మిక శాభివృద్ధికై యా ప్రభువు పాటుపడునని నిశ్చయించితిని. ఈగదియు నిందు నేఁజేయఁబూనిన విషయమును మిక్కిలి స్వల్పమయినదే యగును. కాని నాహృదయమునకుఁ బ్రథమమున స్ఫురించినదాని నాచరణమునఁ బెట్ట సంకల్పించితిని. ఇంకొక క్షణమునకు వాండ్రందఱు నిచ్చటికి సమకూడఁ గలరు. వారినివచ్చి యీ స్థలమును జూడుఁడని కోరితిని. ఈ యుద్యమమును గూర్చి నేను వారితో నించుక ప్రసంగించెదను. అటుపైని వారి యాముష్మిక స్థితిగతులంగూర్చి మీరుపన్యసింపవలయును.”

1. నింద. 2 ఎక్కి. 3 ఇహపరములు

కణ్వుఁడు తానిట్టి కూలివాండ్రతోఁ గొలఁదిదినములలో నుపన్యసింప వలసినందులకు, ఎంత 1. యిఱుకుఁ జెందెనో దాని నెల్లడింప లజ్జించెను. ఆతఁ డుపన్యాసాంశములు వ్రాతమూలమున ముందుసంతరించుకొనక యెట్లుపన్యసింపఁగలఁడు! ఇట్టికూలివాండ్రతో నా యాతఁడు గోష్ఠి సలుపుట! ఇందుల కాతఁడు మిక్కిలి భయపడెను. ఇట్టి వాండ్రకభిముఖుఁడగుటకే జంకెను. అతని కభ్యస్తమగు భాషావాసన సభ్యులకును, వీండ్రకును గల తారతమ్యమును బరికింపని వ్వెరపడెను.

ఆగదిలో నైదాఱు పెంకరటు బల్లలు మిక్కిలి పొడవైనవి కలవు. మాధ్యాహ్నిక భోజనకాల సూచకమగు జేగంట మ్రోగినతోడనే క్రిందిభాగమునందలి యంత్రశాల నుండి కూలివాండ్రందఱొక్క పెట్టున 2. బూర్వోక్తాగారంబునం జేరి బల్లలపైఁ గూర్చుండి భుజింప నారంభించిరి. అట్లచ్చటఁ జేరినవారు మున్నూరుగురు. వారు సుమంతుని వార్తను విని యిందేమి చిత్రము జరుగునోయని యందఱు నచ్చట గుమిగూడిరి. వారి కీగది యాహ్లాదమునే కలిగించెను. గదియు విశాలమైనది. పొగయుం దుమ్ము నచ్చటికిఁ జేరవు. చల్లని గాలియు వెలుతురును వచ్చును.

వాండ్రట్లాహారమును భుజించినతోడనే విశ్వధర్ముఁడు తన హృత్తరంగమున నెలకొనియున్న యూహల వెలువరించెను. శ్రోతల స్థితిగతుల నెఱింగినవాఁడగుటచే సుబోధకములగు వాక్యములతోఁ బ్రబోధించి కణ్వుని వారికెఱింగించి యాతఁడు క్షణకాలము ప్రసంగించుట కంగీకరించెనని చెప్పెను.

ఇట్టి నీచావస్థయందుండిన కూలివాండ్ర కభిముఖుఁడై ప్రసంగింపవలసి వచ్చిన తనయీ 3 యాద్యవస్థను కణ్వుఁ డెన్నటికిని మఱువఁజాలఁడు. స్థితిగతులయందును, వేషభాషలయందును దుల్యప్రతిపత్తిగల సాంఘికులతోఁ బ్రసంగించుట కలవాటుపడిన వాఁడు. పెక్కండ్రు మతబోధకు లిట్టి యభ్యాసముకలవారే కదా! ఇప్పుడీ సంఘమాతని 4 కనభ్యస్తమైనది. ఆతఁ డవలంబించిన నవీనాదర్శకమే వాని నీ సంఘముతో జయప్రదముగఁ బ్రసంగింపఁ జేయుటకు సమగ్రము కావలయును. ప్రతి మనుజుండును దా 5 నావిర్భవించిన జీవితవిధానములతో సంతృప్తుఁడు కావలయునని యందులకుఁ గల కారణములను అట్టి సంతృప్తిని కలిగించుటకు వలయు మూలాధారముల నుపన్యసించెను. ఈ యుపన్యాసకాలమున శ్రోత లుపన్యాసకుని కంటె నీచావస్థయందుండిరను స్వరూప ప్రకటనమును కణ్వుఁడు మఱుగుపఱపఁ గలిగెను. ఉపన్యాసమునఁ గూలివాండ్రను పదమునే యుపయోగింపక తానును వాండ్రును కేవల మనుజమాత్రులేయని స్ఫురింపఁ జేసెను. పనివాండ్రీ యుపన్యాసమును విని మిక్కిలి యానందించిరి అందుఁ బెక్కండ్రు బోధకుని 6 కరాకర్షణ మొనర్చి తమతమ పనులకు వెడలిపోయిరి. కణ్వుఁ డీవిషయమును దన భార్యతో ముచ్చటించు నపుడు కాయకష్టముచే జీవించువారి కరాకర్షణానందము తనకింతకుముం దెన్నఁడును 7. అననుభూతమే యని వక్కాణించెను, ఆతఁ డిదివఱకుఁ దానెన్నఁడుఁ దలంపనంతటి తీవ్ర మత ప్రచారకుఁడగుట కిదియే ప్రారంభము. కష్టజీవులతో నాతనికి సంబంధము గలుగుట కిదియే యారంభము. ధర్మపురియందలి 8. న్యూనాధిక్యతల సమావేశ 9. సేతువునకుఁ బూర్ణాదిశిల యిది.

---

1 చిక్కు 2 మున్ను చెప్పిన 3 మొదటియవస్థ 4 అలవాటులేనిది 5 పుట్టిన 6 చేయిపట్టుకొని 7, అనుభవించనిది. 8. తక్కువయొక్కువల 9. గట్టు.

సుమంతుఁడు, ఈవిధానమున నత్యంతానంద భరితుఁడై సంతుష్టహృదయముతో స్వకార్యాచరణమునకై పోయెను పాడువిడిచిన 1. యన్నవిక్రయాగారమునుండి స్వల్ప మూల్యమునకు బల్లలు మున్నగునవి కొనితేవచ్చుననియు, అల్పాహారముల నమర్చినఁ బనివాండ్రాహ్లాదముతోఁ బ్రసంగములను విని బాగుపడఁగలరనియుఁ దలంచెను. ఇంతకు నేను ననుసరింపవలయుననియేగదా ప్రయత్నించుచుంటినని సంతుష్టహృదయుఁడై యుండెను.

అతఁడు బల్లయొద్దఁ గూర్చుండి వర్తకసంఘ వ్యాపారముల నాసక్తితో నెర వేర్చుచుండఁ దృతీయ 2. యామంబున నొకపెద్దలేఖ బల్లపైఁగాన్పించెను అది సరుకులను గొనుట కధికారపత్రికయని యాతఁడూహించెను. వ్యాపార బాహుళ్యమున సూక్ష్మదృష్టితోఁ దీవ్రముగఁ బత్రములఁ బఠించు విధానమున కలవడిన వాఁడగుటచే నందలి యొకపత్రమును బూర్తిగఁ దిలకించిన వెనుకఁగాని యాలేఖ పరులకై వ్రాయఁబడినదనియుఁ, దనది కాదనియు నాతఁడు తెలిసికొనలేకపోయెను. అందలి మిగిలినభాగము నాతఁడు జదువనిచ్చగింపలేదు గాని చదివినభాగమువలననే తానుద్యోగము జేయుచుండిన వ్యాపారసంఘము తనదేశ నిర్బంధనలకు వ్యతిరిక్తముగా నక్రమాచరణంబునం బ్రవర్తించుచుండెనని గ్రహింపఁగలిగెను. ఒకముచ్చు, అర్ధరాత్రంబున కన్నమువైచి గృహస్థునియింటఁ బ్రవేశించి వానిధనము నపహరించుట యెట్టిదో యీ వ్యాపారసంఘకార్యమును వాని కట్టిదిగానే తోఁచినది. ఈమధ్య వెలువడిన నూతన రాజకీయ నిబంధనలకీకార్యము కేవలము విరుద్ధము. ఈవర్తకసంఘము ప్రభుశాసనమును భంగపరచెనని వెల్లడించుటకు వలయుసాక్ష్యము, ఈకాగితమునఁగలదు.

అతఁడా కాకితమును బల్లపైవైచి నిర్విణ్ణుఁడై తలయెత్తి యాకసమువంకఁ జూచెను, "క్రీస్తేమిచేయును." అను 3. ననువాదము వానిమనఃఫలకంబు నావరించెను. ఈవిషయములను మరపుజెందుట కాతఁడు ప్రయత్నించెను. తనకు సంబంధింపని విషయమగుటచేఁ దటస్థభావము నవలంబింపవచ్చునని వితర్కించుకొనెను. కాని యిప్పుడు తనకరగతమైన యీపత్రిక తద్యాథార్థ్యమును వెల్లడించుచుండెను. ఈపత్రిక గలసంచిపైఁ బొరపాటునఁ దనపేరు వ్రాయబడినది దానితోఁ దనకేమి నిమిత్తము! ఒకగృహస్థునియింటఁ 4. జోరుఁడు ప్రవేశించుటను జూచినచో నావిషయమును దండనాధికారుల కెఱింగింపక యూరకుండవచ్చునా? ఈవర్తకసంఘము అట్టిముచ్చునకంటె భిన్నమైనదా? ఇదియొకగొప్పసంఘమయినంత మాత్రమునఁ గన్నుగప్పి లోకుల ధనమును, అక్రమముగ నాకర్షించుచుఁ బ్రభుశాసనమును వ్యర్థసేయవలసినదేనా? ఈ విషయమును గ్రీస్తుగ్రహించిన వెల్లడింపక యూరకుండునా? వెల్లడించినఁ దనకుటుంబావస్థ యెట్టిస్థితికివచ్చునో? ఈ విషయమును, అధికారులకుఁ దెలుపఁ బ్రయత్నించిన తనయుద్యోగమున కానాటితో నీళ్ళువదలుకొనవలసినదే. ఈ యుద్యోగబలిమిని తనదారాపుత్రాదులు 5. గణ్యతతో సుఖజీవనమును గావించుచుండిరి. ఇందుఁదాను సాక్ష్యముగ బయలువెడలిన న్యాయస్థానముల వెంబడి తిరుగవలసివచ్చును. తన యంతరంగమును లోకము గ్రహింప నేరదు. దీనికంతకును ఫలితము ముందుతానును, దనకుటుంబమును, నిరాధారులై వాపోవుటయేయగును. ఈబెడదతో నతనికేమిపని?

---

1. పూటకూళ్ళయిల్లు. 2. జాము. 3. మరలనుడువుట 4. దొంగ. 5. గౌరవముతో

ఈకాకితమును దిరుగ సంచిలోనుంచి గమ్యస్థానమునకుఁ బంపిన నీవిషయమును దలంచువారే యుండరు. అతనికేవిధమయిన నష్టమును గలుగ నేరదు. కాని యీసాంఘిక 1. దౌర్జన్యము చిరకాలమిట్లు జరుగుచునే యుండును. శాసనోల్లంఘనము ప్రబలును. అయినందనకేమి! తన చుట్టుప్రక్కలనుండువారి యభివృద్ధికై తాను ప్రయత్నించుచునే యుండవచ్చును. క్రైస్తవాదర్శములతో జీవించుట యసంభవమగునంతటి విపులముగా నీసాంఘిక దౌర్జన్యము ప్రబలియుండ దానినంతను నిర్వహింప నొక్కని వశమగునా? కాని యీవిషయమును గ్రీస్తేయెఱింగిన నట్లూరకుండఁగలఁడా! యనునీవిషయములు పరిపరివిధంబుల మనంబును గలఁతపఱచుచుండ నూర్యాస్తమయం బయ్యెను. కార్యాలయమున దీపారాధనముం గావించిరి. సకాలంబున దినచర్య ముగిసినదని తెలుపు శబ్దము వెలువడినతోడనే, యంత్రములచప్పుడు నిలిచిపోయెను. పనివాండ్రందఱును పనిముట్లఁ గ్రిందఁబడవైచి త్వరితగమనంబున స్వనివాసంబులకు వెడలిపోయిరి. సుదంతుఁడు, తనసహాలేఖకులతో "నాకింకను బనికలదు. నేటిరాత్రి కొంతకాలమువఱకు నిచ్చటనుండి పూర్తిచేసెదను." అని చెప్పెను. అందఱును గార్యాలయమునుండి వెడలిపోవువఱకు వేచియుండెను. పిదప నాతఁడు హూంకారించి బల్లమీఁది కాగితములలోఁ దన 2 యుత్తమాంగము నిమగ్నమగునట్లు చాగిలఁబడి తదేకదృష్టితో భగవంతుని ప్రార్థించుచుండెను.

ఇది ద్వితీయాధ్యాయము.

# దైవానుకరణము.

## తృతీయాధ్యాయము.

సుమతియు సుగుణవతియు నాదిత్యవాసరంబునఁ బ్రార్థనాలయమునుండి కలిసిపోవుచుఁ గొంతెదనుక ముచ్చటించుకొని మిగిలిన విషయముల మరునాఁడు మాటలాడుకొన నేర్పరచుకొనిరి. సుమతి సుగుణవతిని మరునాటి మధ్యాహ్న భోజనమునకుఁ దనయింటికి రమ్మని యాహ్వానము చేసెను. తదనుగుణముగ సుగుణవతి సకాలంబున నరుదెంచి సుమతి 1 సింహద్వార కవాటముం దట్టెను. సుమతియేవచ్చి తలుపుఁదీయ నిరువురు లోనికేగి తదేక దృష్టితో ముచ్చటించుకొను చుండిరి. కొంతకాలము ప్రసంగము సాగినతోడనే సుగుణవతి యిట్లనెను. "నిశ్చయముగాఁ బ్రభువిట్లు సేయఁగలఁడని నిర్ధరించుట కవకాశము గాన్పించుట లేదు. ఒకనిని నీవిట్లు సంచరింపవలయునని చెప్పుటకు నావకాశము కాన్పింపదు. కాని నేనుమాత్రము ఆ యుద్యోగము నంగీకరింపఁగూడదని నాయంతరాత్మ ప్రబోధించుచున్నది."

"అట్లయిన నీవేమిచేసెదవు?" అని సుమతి ప్రశ్నచేసెను.

"అదేమియు నాకుఁదెలియదు. కాని యీపనిని మాత్రము తిరస్కరించుటకు నిశ్చయించుకొంటిని." అని సుగుణవతి తనయొడిలోఁ బడియుండిన జాబును దీసి మరలఁ జదివెను అయ్యది దేశాటనమొనర్చు నొకగొప్ప నాటక సంఘాధ్యక్షునిచే వ్రాయఁబడినది. ఆతఁ డిచ్చుట కంగీకరించిన జీతమా బహువిస్తారము. అందుఁ జేరుటవలనఁ గలుగఁబోవు పురోవృద్ధియా 2. యవాచ్యము. గత భానువాసరంబున నీమె దేవాలయంబున భగవన్నామ సంకీర్తనము గావించుచుండ నాతఁ డచ్చటికిఁ గార్యాంతరంబున విచ్చేసి యామె గానామృతంబున 3. శ్రోత్రపర్వముం బొందెను. దీని తన్మయత్వముం గాంచెను. ఈస్వరంబున ధనాగారం బిమిడి యుండెను. దీని నాటక ప్రదర్శనంబుల వినియోగించి యమిత ఫలంబుల నందవచ్చును. కావునఁ బ్రత్యుత్తరము నచిరకాలంబున నొసంగుమని యాలేఖయం దుండెను.

"ఇట్టి సుస్వరము గలిగియుండుటకు ఈ ప్రదర్శనాహ్వానమును నిరాకరించుట యనుచితము కాదు. ఈ విషయమును నిశ్చయించుట దుర్ఘటముగా నున్నది. కాని నా మనస్సును స్థిరపరచుకొంటిని. నీకు నిజమును దెల్పక దాపనేల? సఖీ! సుమతీ! ప్రభువిట్టి సుస్వరమును ఎన్నఁడును ధనార్జనమున కుపయోగింపఁడు. ఈ ప్రదర్శకుల యాహ్వానమును బరికింపుము. ఒకవత్సరము దనుక 4 మృదంగాది వాద్యగాండ్రతోఁగూడి దేశాటన మొనర్పవలయును. వారందఱుఁ బ్రఖ్యాతపురుషులే యగుదురు. నేనాసమాజమున నొకతెనఁగఁ బోవలయును. జీతము విషయమును జదివియేయుంటిని. నెలకిన్నూరు రూప్యముల నొసంగెదరు. కాని క్రీస్తిందుల కంగీకరించునని నేను నమ్మఁజాలకుంటిని. నీ వేమనుకొనియెదవు?

సుమతి 5 యీషద్వైమనస్క హాసముతో నిట్లనియె:—"భవదాచరణ విధానమును నేను నిశ్చయింపఁజాలను. క్రీస్తుననుసరించుటకు వలయు విధానములఁ బ్రతి

1. వీధితలుపు. 2. చెప్పఁజాలనంతటిది. 3. చెవులకు పండువు. 4. మద్దెల. 5. కొంచెము వికటముగు.

వ్యక్తియుఁ దనకుఁ దానే యూహించి నిర్ధారణ చేసికొనవలయు నను కణ్వోపదేశము కడు 1 సమంజసమైనది. ప్రియసఖీ! ప్రభువు నాస్థానమందుండిన నెట్లు సంచరించునో యని నిశ్చయించుటకు నేను పడుచుండిన కష్టము నీ శ్రమకంటె నేయి మడుంగు లధికముగా నున్నది."

సుగుణవతి "నీవంత దిగ్భ్రమఁ జెందుచుంటివా" అని లేచి 2 గవాక్షముచెంత కేగి బయలుం జూచెను. సుమతియు నామెం జేరిసి చెంతనిలువంబడెను. రాజమార్గమంతయు జనసంకీర్ణమై యుండెను. వీరుభయులును క్షణకాలము నిశ్శబ్దముగఁ జూచుచుండిరి. అంత సుమతి యదివఱకెన్నఁడును బలుకనంతటి గంభీరస్వరముతో నిట్లనెను:—

"సుగుణవతీ! క్రీస్తెట్లు సంచరించునని నీవు వితర్కించునప్పుడు లోకమునం గల యీ తరతమభేదములతో నీకేమి ప్రమేయము? నీవును నేనును జేరియుండిన యీ చిన్న యున్నతసంఘము చక్కని దుస్తుల ధరించుచు నమూల్యపదార్థముల నారగించుచు నేఁటేట తమద్రవ్యమును బంధువులకుఁ బబ్బములకు గృహోపకరణాద్యలంకరణంబులకును, వ్యర్థపుచ్చి యేస్వల్పమునో ధర్మకార్యముల కొసంగి ఘనముగాఁ దృప్తిపరమకొనుచుండుటఁ గాంచ నాకుఁ గడు విషాదము పొడముచున్నది. నీవలెనే నేను నెక్కుడు ధనవ్యయమున గొప్పదమైన పాఠశాలయందు విద్యనభ్యసించితిని. గొప్పయాస్తికి వారసురాలినిగా లోకమునఁ గాలుపెట్టితిని. అనేకులు నన్నుగాంచి యీర్ష్యఁగొందురు. దేశయాత్రాపరత్వమున మెలంగుటకుఁ గాని, ఇంటనిలిచి యుండుటకుఁగాని సమర్థను. నాచిత్తవృత్తి నాచరింప వచ్చును. ఇష్టకామ్యార్థసిద్ధిం గాంచవచ్చును. కాని క్రీస్తు నావలెనే సంచరించునాయని నిర్మలబుద్ధితో విమర్శించినపుడు నావలె సంచరించు వేవురు వలెనే నేనును స్వార్థపరతంత్రనై యేవ్యాపగు జీవితమును గడుపుచుంటినని నిశ్చయింపక తీరదు. కొలఁది మాసములనుండి నే నీ గవాక్షమునుండి 3 రాజపథగాములఁ బరికించునప్పుడెల్ల వారి క్షేమమున కావంతయు సరకుగొనక నే నెట్టి స్వార్థపరాయణురాలనై యున్నతస్థానమును ఆసించి యుంటినోయని విషాదమును బొందుచుంటిని."

సుమతి గదిలో నటునిటుఁ దిరుగుచుండెను. సుగుణవతి తన దెందంబును గొందలపఱచుచుండిన 4 సచ్ఛాత్రధర్మమును దలపోయుచు సుమతిని మిన్నక చూచుచుండెను. తనకుఁగల సంగీతజ్ఞానమును క్రైస్తవోపయోగము నెట్లు సేయఁగలను? తన గానకళా 5 కౌశలమును నెల జీతమునకు విక్రయించి నాటకముల వెంబడిఁ దిరిగి పలువురిచేఁ గొనియాడఁబడుచు గొప్పగాయకురాలినను ప్రఖ్యాతిని బడయనగునా? క్రీస్తు వాచరించు విధ మిటులే యుండునా?

ఆమె నిస్సారముగ లేదు. మంచి దేహారోగ్యము గలిగి తన శక్తిని దెలిసికొని యున్నది. దేశాటనమొనర్చిన విశేష ధనమార్జింపవచ్చుననియు, జగద్విఖ్యాతకీర్తిం బడయనగుననియు, నెఱుంగును. అయిన నిప్పుడు సుమతి యావేశముతోఁ బలికిన వాక్యములు ఆమె హృత్ఫలకమున 6 విషదిగ్ధశంకువులవలె నాటుకొనెను.

---

1. యోగ్యము. 2. కిటికి. 3. దారినిపోవువారిని 4. మంచిశిష్య. 5. నేర్పు. 6. విషముపూసిన మేకులు.

మధ్యాహ్న భోజనమునకు సేవకులుపిలిచిరి. అరువదేండ్లవయసుగల సుమతి[1]పితామహియు, నామెసోదరుఁడగు భానుమంతుఁడును భోజనశాల నలంకరించియుండిరి. భానుమంతుఁడు కేళీమందిరంబులఁదనకాలమును బుచ్చుచుండువాఁడు. జీవితమున కాదర్శములేదు. కాని సుగుణవతియెడ లగ్నచేతస్కుఁడై యామె తమయింటఁ గుడుచునప్పుడెల్లఁ దానునింటియొద్దనుండును. వీరుమువ్వురును సుమతికుటుంబము. ఆమెతండ్రి ధాన్యవ్యాపారమునను, ఋణదాతగ నుండి ద్రవ్యము నార్జించెను. తల్లి పదియేండ్లకు మున్నె కాలధర్మమును బొందెను. తండ్రి గతవత్సరంబున గతించెను. ముత్తవ్వ దక్షిణదేశస్థురాలు. [2]ప్రాయికముగా ధనవంతులకుండు నైశ్వర్యమత్తత, పదవీగర్వము, మున్నగు సాంఘిక దౌర్భాగ్యము లీమెయెడ మూర్తీభవించి యున్నవి. జనసామాన్యముకంటె నుత్కృష్టమయిన లౌకిక జ్ఞాన మీమెకుఁ గలదు. కుటుంబ ద్రవ్యమున విశేషభాగము ఈమె యాధిపత్యముక్రిందనే [3] వినిమయము చేయఁబడినది. అందు సుమతియొక్క భాగ మామె స్వాతంత్ర్యమునందే యున్నది. బాల్యమునుండియు సుమతికివ్యవహారజ్ఞానము లవడెను. తనద్రవ్యమును దాఁచ గాపాడుకొనఁగలదని కమలాంబకూడ నెఱుంగును.

సుమతియొక్క శక్తియుక్తులను కమలాంబా భానుమంతులకంటె మిన్నగాఁ దెలిసినవా రితరులు లేరు. సుగుణవతి బాల్యమునుండియు వారియింటికివచ్చి సుమతితో నాడుకొనుచుండునది యగుటచే నీ దైవానుకరణాదర్శమును, సుమతి యవలంబించినది మొదలు, ఇంటిలోనివా రామెనెట్లు పరిగణించిరో తెలిసికొనఁ గుతూహలము గలదియై యుండెను. ఇప్పుడు భోజనకాలమున వారందఱభిముఖులై కూర్చుండియుండ నింతకు మున్నె తన యభిమతమును వెల్లడించియున్న సుమతికిని దద్వ్యతిరిక్త స్వభావముగల యామె ముత్తవకు నెప్పుడో యొకప్పుడు జరుగవలసిన తద్విషయిక సంభాషణ మెట్లుగాఁ బరిణమించునో యని సుగుణవతి తలపోయుచుండెను.

భోజనకాలమున నధికప్రసంగములులేక నిర్మలముగ నుండుతఱి భానుమంతుఁడు సుగుణవతింగూర్చి యిట్లనెను:—"నీవు నటకులలోఁ జేరెదవని వినియుంటిని. అది మాయందఱికి సంతోషదాయకమే."

సుగుణవతియొక్క ముఖ[4] వైఖరి మారి వైవర్ణ్యమును సూచించుచు—"నీకెవ్వరు చెప్పిరి?" అనెను.

అంతదనుక నిశ్శబ్దముగ నుండిన సుమతి తానప్పుడీ సంభాషణంబునఁ బాల్గొన నుద్యుక్త యయ్యెను.

భానుమంతుఁ డిట్లనుచున్నాఁడు!— అదియా! వీధిలో నలువురుం జెప్పుకొనుచున్నారు. అదిగాక రెండు వారములకు మున్ను నాటక సంఘాధ్యక్షుని మన దేవాలయంబున నందఱుం గాంచిరి. ఆతఁడెన్నఁడును మతబోధాశ్రవణ కుతూహలంబున నాలయంబునకు వచ్చువాఁడు కాఁడు. ఇట్టి కారణములేకయు, సద్గురు బోధకంటె మిన్నయగు దానిని విను కౌతుకము లేకయు గుడికి రానివారిని బెక్కండ్ర నెఱుంగుదును"

" నీవు పొరపడితివి. నేను నాటకసంఘమునఁ జేరఁదలఁచుకొనలేదు."అని సుగుణవతి ప్రత్యుత్తర మిచ్చెను. ఈసారి యామె ముఖవికాసమున మార్పేమియుఁగలుగలేదు.

1. తండ్రి తల్లి 2. తరుచుగా. 3. కర్చు. 4. రీతి.

"అయ్యో! అట్లొనర్చుకొనుట విషాదకరము. నీవందు మిక్కిలి రాణింపఁ గలవు. పలువురు నీపాటను విని మెచ్చుకొనుచుండిరి." అని భానుమంతుఁడు పలికెను.

సుగుణవతి రోషారుణిత వదనారవింద యయ్యెను. ఆమె ప్రత్యుత్తరమిచ్చుట కుపక్రమింపకమున్నె సుమతి యడ్డువచ్చి "పలువురనిన నీయభిప్రాయమేమి?" అనెను.

"ఎవరా! భానువాసరంబున నాలయంబున సుగుణవతి గానామృతమును జవిగొనిన వారందఱును, వారు మతిమొకప్పుడామె గాన మాధుర్యము నెచ్చటఁ జవిగొనఁగలరు? ఈయూరి పొలిమేర దాటి ప్రపంచమునందలి తదితరులకీమె పాట శ్రవణాతిథ్యంబు గాకు. డేనే యని విచారించుచుంటిని." అని భానుమంతుఁ డనెను.

"మతిమొక విషయముంగూర్చి ముచ్చటించుకొందము" అని సుగుణవతి తీవ్రముగాఁ బలికెను.

కమలాంబ సూక్ష్మ దృష్టితో సుగుణవతిని నిరూపించి యిట్లనెను— "అమ్మాయీ! భానుమంతుఁడు నీ విషయమున వికటముగ మాటలాడఁ బోలఁడు. తన తండ్రిని బోలిన స్వభావము గలవాఁడు. కాని మేమందఱము నీభావి కార్యవిధానము నించుక తెలిసికొనఁ గుతూహలలమై యుంటిమి. చిరపరిచితి ననుసరించి నిన్నిట్లు పృచ్ఛ సేయుటకు మాకధికారము గలదు. నాటకస్థులు నిన్నాహ్వానించిరని సుమతి చెప్పెను."

సుమతి మందహాసముతో— "అదియందఱికిఁ దెలిసిన విషయమే యనుకొనెదను. నిన్న వార్తా పత్రికలలోఁ గూడఁ జదివితిని." అనెను

"అవునాను కమలాంబ ప్రశ్నము సమంజసమైనదే. సుమతియు నేను నీవిషయమే ముచ్చటించుకొనుచుంటిమి. ఇప్పటి కాయాహ్వానమును నిరాకరించుటకే నిశ్చయించుకొంటిని." అని సుగుణవతి ప్రత్యుత్తర మొసంగెను.

ఈ ప్రసంగము వలన సుగుణవతి యంతఃకరణము క్షణక్షణంబునకు సంకుచితమై ప్రభు ప్రదర్శిత మార్గము తిరస్కారమే యని దృఢీకరించుచున్నట్లు భానుమంతుఁడు గుర్తించెను. తన మనోనిశ్చితమును ఇట్లు లోకమునకు వెల్లడిసేయ నామె తలంచియుండలేదు. కాని భానుమంతుని ప్రసంగరీతి యామె మనోభావము నట్లు వెల్లడింపఁ బురికొల్పెను.

కమలాంబ యిట్లనెను— "సుగుణవతీ! నీవిట్లాయాహ్వానమును నిరసించుటకుఁ గల కారణముల మేమడుగవచ్చునా? నీవంటి యవ్వనవతి కిదియే తగిన సమయము. లోకము నీ [1] కాకలీకంఠనాదంబున శ్రోత్రపర్వంబునంద నీవిచ్చగింపవా? ఈవిషయమున నేను భానుమంతునితో నేకీభవించుచుంటిని. నీ సుస్వర మీ కుగ్రామమున నిచ్చట యాలయంబునకంటె నున్నత స్థానంబులఁ బ్రకాశింపఁ దగినది."

సుగుణవతి స్వభావసిద్ధముగా మితభాషిణి అంతఃకరణ తత్వమును బూర్తిగ వెల్లడింప నిశ్చయించునది కాదు. అట్టులయ్యు నోరెత్తి ప్రతతి నిర్భయముగ నెదిరించి సత్యమును వెల్లడించు స్వభావముఁగూడ నామెయం దిమిడియుండెను. కమలాంబ ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తర మీయవలసివచ్చినప్పుడు సుగుణవతికిట్టి [2] ప్రత్యుత్పన్నదశ

1. అవ్యక్తమధురమయిన. 2. మాసగాఁబుట్టిన.

వాటిల్లి కమలాంబను దేరిపారఁజూచి నిర్మల వాక్యంబులతో "క్రీస్తు తానిట్లే చేయుమనను నమ్మికకు మించిన కారణమేమియు లేదు." అనెను.

కమలాంబ ముఖంబున 1 వైవర్ణ్య మంకురించెను. భానుమంతుఁ డులికిపడెను. తన మత్తన్య మాటలాడుటకు మున్నె సుమతి ప్రసంగింప నారంభించెను. ఆమె ముఖవికాస మామెయంతరాత్మకు 2 దర్పణప్రాయ మయ్యెను. సుమతియొక్క 3 కేతకీగర్భదళాభమగు కపోలకాంతి యారోగ్యవంతమయినదే యగును గాని సుగుణవతియొక్క సహజ సౌందర్యమునకు దీనికి మిక్కిలి భేదముగలదు.

"పెద్దమ్మా! ఒకవత్సరముదనుక మేమదియే మాజీవితముల కాదర్శముగఁ బ్రతిజ్ఞజేసితిమని నీ వెఱుంగుదువు. కణ్వోపదేశమును వినినవారికందఱికది 4 స్పష్టాభాసమయ్యెను. మేము మాదైనిక చర్యల విధాన మింకను నిశ్చయింపఁ జాలకుంటిమి. క్రీస్తు నడచుకొను మార్గమును దెలిసికొనుటకై నేనును సుగుణవతియుఁగూడ మిక్కిలి యాందోళనను నందుచుంటిమి" అని సుమతి చెప్పెను.

కమలాంబ సుమతివంకఁ దీవ్రదృష్టింజూచి యిట్లనెను:—"కణ్వుని 5 యభివాదము నాకుఁ దెలిసినది. దాని నాచరణమునందుంచుట 6 శశవిషాణము వంటిది. అప్పట్టుని ప్రతిజ్ఞజేసినవారందఱును గార్యారంభముననే వ్యర్థప్రతిజ్ఞయని తెలిసికొని విసర్జింతురని నేను భావించితిని. సుగుణవతి విషయమున నేనంతగా ముచ్చటింపవలసిన పనిలేదుగాని (కమలాంబయొక్క మున్నెన్నఁడుఁ గాంచని 7 వికట కటాక్షప్రసారమును సుగుణవతి కాంచెను.) సుమతీ! నీకీవిషయమునఁ దెలివితక్కువ తలంపు లేమియుం లేవుగదా!"

"నాకును బెక్కుతలంపులు గలవు. అవి జ్ఞానవంతములుగను, తద్వ్యతిరిక్తములుగను బరిణమించుట భగవదుద్దేశ్యమును గ్రహించుటమీఁద స్థిరపడియుండును. ఆవిషయమున నేను నిశ్చితాభిప్రాయనైనపు డాచరణలోనికిఁ దెచ్చెదను." అని సుమతి పల్కెను.

"నారీమణులారా! ఈ ప్రసంగము నాకుఁ దురవగాహముగా నున్నది. కావున గ్రంథాగారమునకుఁ బోయెదను మన్నింపుఁడు." అనుచు భానుమంతుఁడు భోజనశాలనుండి వెలువడిపోయెను. క్షణకాలము భోజనశాల నిశ్శబ్దముగ నుండెను. వంటవాఁడు పానపాత్రముల నమర్చుదనుక కమలాంబ వేచియుండి పిదప వానిని వెడలిపోవుట కాజ్ఞాపించెను. ఆమె క్రోధోద్రిక్తమానసయై యుండెను. సుగుణవతి రోదుచుగనుంటచేఁ గమలాంబ తన క్రోధమును గొంతవఱకు కాపుకొనఁ బ్రయత్నించెను. కాని యది మిక్కుటమై యిట్లనెను:—"అమ్మలారా! నేను మీకంటె నేండ్లచే వృద్ధురాలను. మీ రాంతరంగిక ప్రబోధముచేఁ జేసిన యీప్రతిజ్ఞ యాచరణమున కననుకూలమైనది."

ఈమె వైఖరియు, సంభాషణ క్రమమును గాంచ నీమెకును, ప్రభుమార్గానువర్తనమునకును మిక్కిలి వ్యత్యాసము కలదని సుగుణవతి తలంచెను.

"పెద్దమ్మా! లోకవ్యవహారమునఁ గ్రీస్తును మేమనుసరింపలేమని తలంతువా?

1. వివర్ణత. 2. అద్దమువంటిది. 3. మొగలిపూవులోని రేకుతోసాటి. 4 బాగా తెలిసెను. 5. అభిప్రాయము. 6. కుందేటికొమ్ము. 7. వికారమయిన

లేక మేమట్లనుకరింపఁ బ్రయత్నించిన సాంఘిక దురాచార పరాయణులగువారి యామోదముం బడయఁజాలమని యూహింతువా ? " అని సుమతి యడిగెను.

" ఇది కేవల వ్యర్థప్రయత్నము. ఈ కాలమందట్లు సంచరింప వలసిన యవసర మేమియుఁ లేదు. అదియుంగాక యిట్టి యుద్యమమున మీరెట్లు—. అని యర్ధోక్తిలోఁ గమలాంబ నిలిపి సుగుణవతివైపునకుఁ దిరిగి—

" నీ యీ నిశ్చితార్థమును వినిన నీతల్లి యేమను ? సుగుణవతీ ! ఇది కేవలము బుద్ధిహీనత కదా ? ఏది యెట్లున్నను గంధర్వులను మించిన నీగాత్రసౌష్ఠవము నెట్లు వినియోగించెదవు ? " అనెను.

" మాయమ్మ యేమనునో నేనింకను జెప్పఁజాలను " అని సుగుణవతి తన జననియొక్క యనిష్టము నూహించుటకు జంకుమెఁ గొప్పగాయకురాలు కావలెనని యిచ్ఛయించునాయని విచారించిన నట్టివారిలో నగ్రగణ్య యీ సుగుణవతి తల్లియే యగును.

కమలాంబ భోజనపీఠమునుండి లేచి నిలువంబడి " యోగ్యాలోచనముఁ జేసిన భిన్నాభిప్రాయవుకాఁగలవు. ఈనాటకశాలాధ్యక్షుని యాహ్వానమునుగాని తత్తుల్యులగు వేఱొక సేవనుగాని యంగీకరింపకుండిన ముందు విచారింపఁగలవు. " అనెను.

" ఈవిషయమునే 1 యిదమిద్ధమని నిర్ధారణ సేయఁజాలక తబ్బిబ్బు పడుచుంటి" నని సుగుణవతి పలికెను పిదపఁ గొంతకాలము గూర్చుండి తాను వెళ్లిన వెనుక సుమతికిని యామెయవ్వకును దుర్భరమగు సంవాదము జరుగఁగలదని తలంచుకొనుచు వెడలిపోయెను. ఆమె తలంచినటులే జరిగెననియును, అట్టి ప్రసంగమే సుమతి తనద్రవ్యమును పదవిని వినియోగింపవలసిన రీతియొక్క నిశ్చయమును దృఢపరచెననియు సుగుణవతి తెలిసికొనెను. తాను వీరిబారినుండి తప్పించుకొనిపోయి యేకాంతమునఁ గొంతకాలము బుచ్చఁగలిగినందులకు సంతసించితిని. ఆమెమనంబున నొకపథకము స్ఫురించుచుండెను. దాని నొంటరిగఁ గూర్చుండి విమర్శింప నూహించెను. కాని సుమతి భవనంబుననుండి వెలువడి కొంతదూర మేగునప్పటికి భానుమంతుఁడు తనను వెన్నంటి వచ్చుచుండెనని గ్రహించి యామె మిక్కిలి యిసుగుఁ జెందెను.

" సుగుణవతీ ! మీమనోవ్యాసంగమున కంతరాయము కలిగించుటకు విచారించుచుంటిని. నేను నీమార్గముననే పోవలసినవాఁడ నగుటచే 2. నాసహాగమనమునకు నీవంగీకరింతువని తలంతును. కొంతతడవునుండి నేను నీవెనువెంటనే వచ్చుచుండినను నీ వాతంకపడుపలేదు. " అని భానుమంతుఁ డనెను.

" నేను నిన్ను చూడనేలేదు. " అని సుగుణవతి పలికెను.

" నీవు 3 కాదాచిత్కముగానైన నన్ను జ్ఞాపకమున నుంచుకొనిన " అని భానుమంతుఁడు పలికి యామెతో నడువ నారంభించెను.

సుగుణవతి యాతని విధమునుగాంచి యాశ్చర్యము నొందెను.
కాని నివ్వెఱఁజెందలేదు. ఆమె యాతని బాల్యమునుండియు నెఱుంగును. ఒకప్పుడు వారొండొరుల 4 సాంకేతిక నామములతోఁ బిలుచుకొనెడివారు. అచిరకాలమునుండి సుగుణవతియందుఁ గలిగిన యేదోయొకమార్పువలన నిప్పుడట్లొనర్చుటలేదు. అతఁ డీమె

1. ఇదియిట్లని 2. కూడవచ్చుట. 3. కొంచెము. 4. రహస్య.

నప్పుడప్పుడిట్లే యభిముఖుఁడై స్తుతిపాఠములఁ గావించుచుండుటయుఁ గలదు. అందుల కామె యానందించుచుండును. నేఁడామె యాతని సాన్నిధ్యము నిచ్చగింప లేదు. భానుమంతుఁడు క్షణకాల మూరకుండి "సుగుణవతీ! నీవెప్పుడయిన నన్ను స్మరించెదవా?" అనెను. సుగుణవతి చిఱునగవుతో "అందుకు సందియమేమి? పలుమారు తలఁపోయుచుందును." అనెను.

భాను—నీవిప్పుడు నన్నుగూర్చి యోజించితివా?

సుగు—అగును. అనఁగా నేనిప్పుడు, అగును.

భాను—ఏమి?

సుగు—నీవు నన్ను యథార్థము వర్ణించుము మనెదవా?

భాను—అట్లే.

సుగు—అట్లయిన నీవిప్పుడిచ్చట నాసన్నిధిని లేకుండిన బాగుండునని తలంచుచుంటిని.

భానుమంతుఁ డీమాటను వినినతోడనే పెదవులు గఱచు కొనెను. ప్రసంగము ఆతఁడిచ్ఛయించినట్లు పరిణమింప లేదు.

భాను—సఖీ! నేనొకటి చెప్పెదను వినుము-అట్లనుటకు నేననర్హుఁడను. నీతో నొకవిషయముంగూర్చి ముచ్చటింప నిశ్చయించు కొంటిని. నీవిషయమున నేనెట్టి యనురాగమునఁ బ్రవర్తించునదియు నీవెఱింగియే యుంటివి. నీవిప్పుడు నాయెడల నిట్టియనాదరణముం జూపఁ గతంబేమి? నీవును నన్నించుక యనురాగ వీక్షణంబులతో నాదరించు దానవు గదా!

సుగు—అటులు బాల్యదశయందు ఆటపాటలలో నట్టి ప్రవర్తనము మనకు సహజమే. ఇప్పుడు పెద్దవాండ్ర మగుచుంటిమి కదా!

ప్రస్తుత మీతని సమావేశ మించుక వెగటుగఁ దోఁచినను సుగుణవతి తన సహజానురాగ విధముననే యాతనితో ముచ్చటించు చుండెను. ఆమె మనంబంతయుఁ దన భావికార్య విధానంబున 1 నిమగ్నమై యుండెను. ఈతని సన్నిధాన మట్టితల పోతకంతరాయముగలిగించెను. కొంతదూరమునిశ్శబ్దముగానడచిరి. మార్గముజనసంకీర్ణమై యుండెను. వారికెదురుపడిన వారిలో నృసింహకవికూడ నొకఁడు. అతఁడీజంటంగాంచి వినమ్రుఁడై వెడలిపోయెను. భానుమంతుఁడు సుగుణవతిని తదేకదృష్టితోఁ గాంచుచు నిట్లనెను.

"నేను నృసింహకవినైన బాగుండును. అట్లయినదదృష్టవంతుఁడ నగుదునే" మహా

సహజ గాంభీర్యవతి యగు సుగుణవతి కూడ నీవాక్యాకర్ణనమున వైవర్ణ్యముం జెందెను. ఆమె మారుపలుకకయే వడివడిగఁ బోవఁ బ్రారంభించెను. భానుమంతుఁ డెద్దియో పలుకఁ గృతనిశ్చయుం డయ్యెను. సుగుణవతి వానిని నివారింప నసమర్థురాలయ్యెను. తుదకామె యిప్పుడయిన మఱియొకప్పుడయిన నతఁడు యథార్థమును దెలిసికొన వలసినవాఁడే గదా యని తన మనస్సును సమాధాన పరచుకొనెను.

భాను—సుగుణవతీ! నీవిషయమున నేనెట్టి యనురాగమును గలిగి యున్నదియు నీవెఱింగియే యుంటివిగదా! నాయాశ కవకాశమున్నదా లేదా? నేను నిన్నత్యంతము సుఖపెట్టఁ గలను. చిరకాలమునుండి నిన్ను ప్రేమించిన వాఁడను.

1. మునిఁగి.

[1]విషాదజనకంబగు హాసన్ముఖంబుతో సుగుణవతి "నావయస్సెంతని యూహింతువు?" అనెను. ఆమె వైఖరి స్వభావాతీతమైనది.

భానుమంతుఁడు పట్టుదలతో నిట్లనెను— "నీయనురాగమును వాంఛించితినని నన్నపహసింపఁ జెల్లదు."

"నేనపహసించుటలేదు. కాని భానుమంతుఁడా! నీవీవిషయమున విశేషము ముచ్చటించుట వలనఁ బ్రయోజనములేదు. అదికేవల మసంభవము" అని సుగుణవతి తనకు బాల్యమునుండియు సహజమగు మార్దవముతో సమాధానము చెప్పెను: మార్గమధ్యమున వివాహప్రసంగము జరుపవలసినందుల కామె వ్యగ్రతం జెందెను. కాని రాజమార్గమునఁ బోవువారి రొదలో వీరి ప్రసంగము, యింటియొద్ద నొంటరిగఁ గావించిన నెంతరహస్యముగనుండునో యిప్పుడు నట్లేయుండెను.

భాను—నీవు—అనఁగా నాకుఁ గొంత సావకాశము నొసంగినయెడల నేను నీ మనంబున—

సుగుణవతి దృఢనిశ్చయముతో "నిష్ప్రయోజనము" అనెను. ఆమె తరువాతఁ దాను కఠినముగాఁ బలికితినని పశ్చాత్తాపమును జెందియుండెను. పిదప కొంతదనుక వారుభయులును, నిశ్శబ్దముగ నడిచిరి. సుగుణవతి యిల్లు సమీపించుచుండెను. ఎప్పుడిలుసేరుదునో! యెప్పుడీ ప్రసంగ మంతరించునో యని సుగుణవతి వాంఛించుచుండెను. మార్గమున నొకసందు దిరుగునపుడు భానుమంతుఁడు హఠాత్తుగా మున్నెప్పుడును బొడసూపని గంభీర నినాదంబుతో నిట్లనెను.—

"సుగుణవతీ! నీవు నాకు భార్యవు కమ్మని కోరుచుంటిని. నీవెన్నటికైయిన నట్లొనర్చుటకు వీలుకలదో లేదో చెప్పుము."

సుగుణవతి కృతనిశ్చయురాలై "యెన్నటికి నట్లు జరుగనేర,, దని ప్రత్యుత్తర మిచ్చెను.

"నిరాకరణమునకు గారణమేమైనఁ జెప్పఁగలవా!,, అని భానుమంతుఁడు నిజమును దెలిసికొనిన నధికారము గల వానివలెఁ బ్రశ్నించెను.

"ఒకస్త్రీ తాను వివాహమాడఁ దలఁచిన పురుషునియెడఁ గాంచఁదగు ననురాగము నాకు నీయెడలఁ బొడముటలేదు." అని సుగుణవతి పలికెను.

భాను—నీవు నన్ను బ్రేమించుట లేదని మారుమాటలతోఁ జెప్పుటయే గదా!

సుగు—నేనట్లు చెప్పుటలేదు; అట్లు చెప్పఁజాలను

భాను—ఏల?

అది మఱియొక విషయము. భానుమంతుఁ డిట్లు పృచ్ఛచేసినందులకు సుగుణవతి యాశ్చర్యముం జెందెను. తానునిజమును జెప్పఁదలంచి చెప్పఁదగినదానికంటె నెక్కువ చెప్పెదనేమోయని సంశయించుచు, "ఏలయనః-" అనునంతలో భానుమంతుఁడు "ఏలో తెల్పుము. నీవింతకంటె నెక్కుడుగ నన్నవమానింపఁజాలవు." అనెను.

"నీజీవితమున కర్హమైన యాదర్శ మేమియులేదు. కావున నిన్ను బ్రేమించుట కవకాశములేదు. లోకాభివృద్ధికై నీవేమి కార్యములఁ జేసితివి? నీకాలమును వ్యర్థముగ నాటకములఁ జూచుటలోను, దేశాటనముఁ జేయుటలోను, ఆటపాటలయందును,

1. విచారహేతువగు.

వ్యర్థపరచుచుంటివి. ఇట్టి జీవితమున స్త్రీలనాకర్షించు ప్రభావమేమి గలదు ? ” అని సుగుణవతి పలికెను.

భానుమంతుఁడు లజ్జాకలితవదనారవిందుండై చిఱునగవుతో నిట్లనెను:— “ నీవనినట్లు నుత్కృష్టకార్యముల నేమియుఁ జేసియుండను. కాని, నాతోడిపురుషులకు నేనీవిషయమునఁ దీసిపోదునని తలంపను. అందుఁ బెక్కండ్రవలె దుష్టుఁడను కాను. నీ 1 వైముఖ్యకారణముఁ దెలిసినందులకు సంతోషించితిని. ”

ఇట్లు పలుకుచు నాతఁడాకస్మికముగఁ దన 2 శిరోవేష్టము నించుక తొలఁగించి, 3 నమితశీర్షుఁడై వెనుకకు మరలెను. సుగుణవతియు నింటికిఁబోయి తనగదిం బ్రవేశించి యథోచితముగఁ దన్నులముకొనిన యీవిషయములంగూర్చి తలంచుచుండెను. భానుమంతునితోఁ దానుజేసిన ప్రసంగమునుగూర్చి విమర్శించినకొలఁది తనజీవితము నల్లే నిరర్థకమైనదని భావించెను. తనజీవితమున కెట్టి యాదర్శము కద్దు ? విద్యాభ్యసనమునకై తానుగూడఁ బరరాష్ట్రములకేగెను. పశ్చిమఖండ వాసులలో నుత్కృష్టులగు 4 నొజ్జలకడ గానవిద్య నభ్యసించెను. అది ముగిసినతోడనే తన స్వగ్రామమగు ధర్మపురికి మరలివచ్చి యొకవత్సరమునుండి తద్గ్రామాలయంబున గానరసంబును వెదజల్లుచుండెను. అందులకుం దగిన వేతనంబును గైకొనుచుండెను. రెండు వారములక్రిందట నాయాదిత్యవాసరంబు దనుకఁ దనజీవితమునెడ సంతృప్తిఁ జెందియుండెను. గానవిద్యాకౌశలంబునఁ బ్రఖ్యాతి వడయనగునని తనతల్లివలెనే తానును దలంచుచుండెను. లోకమునఁగల గాయనులకంటె నీకతిశయమేమి కలుగును ?

భానుమంతుని దాను నిరాకరించిన కారణమును దలపోసినకొలఁదిని తనజీవితము మాత్ర మంతకన్న నెక్కుడు దేశోద్ధరణ పరాయణత్వమున నొప్పుటలేదని తెలిసికొనెను. ఇట్టిజీవితమును గ్రీస్తెట్లు వినియోగ పరచును ? ఆమె గాత్రమొక ధనాగారము. స్వోత్కర్షకుఁ గారణమ్మను, ఆవిషయము నామె యెఱుంగును. రెండు వారముల క్రిందటి వఱకు దీనిచే ధనమును, శ్లాఘ్యతను బడయుచుండెను. భానుమంతుని జీవితముకంటె నిది యుత్కృష్టమయినదా ? చాలతడవిట్లే తలపోయుచు నొంటరిగఁ దనగదియందుండి తుదకు నిర్భయముగఁ దనతల్లితోఁ దననిశ్చితార్థమును వెల్లడించి నాటకోద్యోగమున కంగీకారమును, దనమనంబునఁ దలంచుచుండిన 5 భావికార్యవిధానమును దెలుప నిశ్చయించుకొని క్రిందికి దిగెను. ఆమె తనతల్లితో నీవిషయము నింతకుమున్నొకసారి ముచ్చటించియుండెను ; తన గానవిద్యా కౌశలమున జగద్విశ్రాంతముగ నాటకశాలలం బ్రదర్శించి ధనార్జనముం గావించి ప్రఖ్యాతివడయవలెననియే తనకున్న యభిమతమని యామెయెఱుంగును.

తనజననితోఁ దెలుపఁబోవు నీప్రసంగమునకు మిక్కిలి భయపడుచు నెట్టకేలకుఁ దల్లింజేరి, “ అమ్మా ! నేనీనాటకశాలం జేరఁగూడదని నిశ్చయించుకొంటిని. అందులకుఁ దగిన కారణము గలదు ” అనెను.

సుగుణవతితల్లి సౌందర్యవతియు, నున్నత దేహసౌష్ఠవమును గలదియునై సంఘమునందుఁ బ్రస్ఫుటమగు స్థానము నలంకరింపవలయుననియుఁ, దనపిల్లలు విద్యాధికులై ప్రఖ్యాతిగలవారుగా వర్ధిల్లవలయుననియుఁ గోరునది ; సుగుణవతికంటెఁ బదినేండ్లు

---

1. విముఖత. 2. తలపాగ 3. వంచఁబడిన తల. 4. గురువులు. 5. ముందు.

చిన్నవాఁడగు నామెసోదరుఁడు పట్టపరీక్షయం 1 దుత్తీర్ణుఁడై విలువిద్యా నైపుణ్యముసు గలవాఁడయ్యెను.

ఈతని విద్యాభ్యాస కాలమున సుగుణవతియుఁ దల్లియు నింటియొద్ద నుండిరి. సుమతి తండ్రివలెనే సుగుణవతితండ్రియు దేశాంతరమునఁ 2 గాలధర్మము నొందెను. సుమతివలె నీమెయుఁ దన యాదర్శమునఁ భిన్నమయిన స్వభావముగల కుటుంబమున నిమిడియుండెను. సుగుణవతి యింక నేమిచెప్పునో వినవలయునని యామెతల్లి నిరీక్షించియుండెను.

సుగు—అమ్మా! రెండువారములకుఁ బూర్వము నేనాలయమునఁ గావించిన ప్రతిజ్ఞను నీవెఱింగియే యుంటివిగదా!

తల్లి—కణ్వని ప్రతిజ్ఞయా?

సుగు—కాదు. నాప్రతిజ్ఞయే. అమ్మా. అదియేదిగానో నీవెఱుంగవా?

తల్లి—నాకును గొంచెము తెలియును ననుకొనెదను. దైవారాధన తత్పరులై యాలయమునకుఁ బోవువారెల్లరు సమకాలిక ప్రవర్తనమున కనువర్తనముగ సాధ్యమగు నంతవఱకు, ఏసు ననుకరింప వలయుననియే తలంచెదరు. కాని జగద్విక్రాంత కీర్తి గల నాటకాలయమున నీవున్నతోద్యోగమును బడయుటకును దీనికిని సంబంధమేమి కలదు?

సుగు—మిక్కిలి సంబంధము గలదు. క్రీస్తువిషయమున నేమిచేయునని విమర్శించి సర్వజ్ఞాంతఃకరణమగు నాతని యుద్దేశ్యమును స్మరించినప్పుడు అతఁడు నాయీ సుస్వరమును, ఇట్లు వినియోగపఱుపఁడని నిశ్చయింపవలసివచ్చెను.

తల్లి— ఇట్టి యుద్యోగమును బడయుటవలన దోషమేమైనఁ గలదాయేమి?

సుగు—దోషము కలదని చెప్పుటకు నేను సాహసింపఁ జాలను.

తల్లి—ఇటువలె నాటకశాలలం దను సంగీత విద్యాకౌశలమును వెదజల్లు నారీమణుల యోగ్యతను నీ 3 వాసాతమును ప్రతిపాదించెదవా? వారందఱును క్రీస్తు సమ్మతికి విరుద్ధము నొనర్చువారని నిందింప సాహసింతువా?

సుగు—అమ్మా! నీవపార్థకల్పనము సేయక నాభావమును ఋజుమార్గమున గ్రహింపుము. నేనొరుల గుణాగుణంబులఁ బరిగణించుట లేదు. గానవృత్తి నవలంబించినవారిని నిందించుటయును లేదు. స్వోచిత విధానమునఁ గృతనిశ్చయ నైతిని. ఈవిషయమున విచారించిచూడఁ గ్రీస్తామోదింపఁడనియే నానమ్మకము.

సుగుణవతితల్లి కోపోద్రేకమున నాత్మ నింకను మరచియుండలేదు. ఈవిషయమునుగాని, సుగుణవతియొక్క నిశ్చయమునుగాని యామె చక్కఁగా గ్రహింపలేదు. కాని తనతనూజాతయొక్క పురోవృద్ధి యామె గానకళానైపుణి కనురూపముగ నుండవలయునని యామె యభిమతము. ఈయాలయ సంఘమున 4 నవీనోత్పన్నమగు నీమతవిషయికోద్రేకము పాతపడినతోడనే సుగుణవతి కుటుంబేచ్ఛ ననుసరించి సంచరించునని తలంచెను. సుగుణవతి చెప్పఁబోవు ప్రత్యుత్తరమునకు సిద్ధపడకయే "కాకున్న నేమనును?" అనెను.

---

1. జయమునందెను. 2. చచ్చెను. 3. పడిపోవుటను. 4. క్రొత్తగాబుట్టు.

సుగు—ఏమనునా? గానవిద్యా విధానమున నెచ్చటఁ బ్రజాభివృద్ధికై తత్పాటవమును వినియోగింపనగునో యచ్చట వినియోగింపు" మనెను. అమ్మా! నాకుఁగల సంగీత విద్యా వైదుష్యమును స్వోత్కర్ష ప్రకటనమునకుఁగాని, యుదర పోషణార్థముగాని వినియోగింపక గానరసముచే నాకర్షింప నలవియగు పతితుల నుద్ధరింప వినియోగపరుపవలెనని నిశ్చయించుకొంటిని. ఇట్టి శ్రావ్యగాత్రమును క్రైస్తవులెందులకు వినియోగపఱచునో యందులకే వినియోగ పఱచెదను. ధనాకర్షణకై యేర్పడిన గాయక సమాజముల యభివృద్ధికై నా గాత్ర పాటవము నెన్నటికిని వ్యర్థపరుపఁ జాలను.

సుగుణవతి పలికిన యీ వాక్యము లంతశ్శుద్ధి గలిగి తీవ్రములగుటచే నామె తల్లి దిగ్భ్రమను జెందెను. ఆమె కిప్పుడు కోపము ముమ్మడించెను. తనకోపమును మఱుగుపఱచుకొను స్వభావము లేనిదగుటచే—

"నీయూహలు కేవలము వ్యర్థములు. నీకుఁ బిచ్చియెత్తుచున్నట్లున్నది. నీవేమి చేయఁగలవు?" అనెను.

సుగు—లోకమునం దనేక స్త్రీపురుషులు 1 ప్రతిభావంతములగు తమవిద్యాధనంబుల లోకారాధనమునకై వినియోగించుచుండిరి. అట్లుండ భగవత్కటాక్షమున స్వాభావికముగ నాకు లభించిన యీ మధురస్వరము నుచితముగ లోకారాధనమున వినియోగింపక నేఁ గేల దానికిఁ గొంత మూల్యమును విధించి ప్రజలనుండి ధనాకర్షణము సేయవలయును? నీవెప్పుడును, నాకలవడిన గాన కళావిశేషంబున మనకు సంఘమున నున్నతస్థానమును, 2 వసుసమృద్ధియుఁ గలుగవలయునని యాసించుచుంటివి. కాని నేనట్టి ప్రతిజ్ఞను జేసినదాదిగా నీ యభిమతార్థసిద్ధికి హర్షింపఁ జాలకుంటిని.

తల్లి కోపోద్రిక్త కంపితాంగియై యాసనమునుండి లేచి తిరిగి కూర్చుండి యావేశము నెట్టకేల కరికట్టి "అట్లయిన నీవేమి సేయఁదలంచితివి? ఆ నా ప్రశ్నమునకింతకును సమాధానముఁ జెప్పవైతివి." అనెను

సుగు—ఇప్పుడు దేవాలయమునఁ బాడుచుందును. వసంతకాల మేగుదనుక నట్లుచేయుట కొప్పుకొనియుంటిని. నడుమనడుమను మాలగూడెమున మతప్రచారిణీసంఘము బోధించునెడ వారితోఁ జేరి యచ్చట భగవన్నామ సంకీర్తనముఁ గావించుచుందును.

తల్లి—ఏమీ! సుగుణవతీ! నీవేమి పల్కుచుంటివో మైమఱచి యుంటివి. మాలగూడెమెంతటి నీచుల కాకరమై యుండునో నీవెఱుంగుదువా!

సుగుణవతి తనతల్లికి సమాధానముచెప్పుట కించుక సంశయించియు నెట్టకేల కిట్లనెను—

"ఆ విషయము నేను బాగుగ నెఱుంగుదును. అచ్చటి ప్రజలంతటి యధోగతి నుండుటచే నేనందులకు దొరకొంటిని. కొలఁది వారములనుండి సోమనాథశర్మయు నాతని 4 యర్ధాంగియగు పులోమయు నచ్చటఁ బనిసేయుచుండిరి. వారి యుపన్యాసకాలములయందుఁ జక్కఁగఁ బాడఁదగిన వారెవరైన దేవాలయ సంఘమునుండి వచ్చి తమకు సాయపడవలయునని నేటి ప్రాతఃకాలముననే వార్తనంపిరి. వారికొక గుడారము గలదు. అందుపన్యసింతురు. క్రైస్తవమతప్రచారము మిక్కిలి కొఱ

1. ప్రతిభతోఁగూడిన. 2. ధన. 3. కోర్కెఫలించుటకు. 4. భార్య.

బడిన ప్రదేశము వారికి నేను సాయపడెదను. ప్రభునామమున నేను గొంత స్వార్థత్యాగమును గావింపఁ గృతనిశ్చయ నైతిని. నా యుద్యమమును నీవు వారింపవని నే నెఱుంగుదును. కాని ప్రభువు కొఱకు శ్రమల నందవలయునని నే 1 నభిలషించుచుంటిని. ధర్మపురి 2 ప్రాంత 3 జనపదంబుల నధోగతి నందుచుండిన వేవురు సహోదరుల 4 యుద్ధరణమునకై మన మేమిపాటు పడుచుంటిమి? మనము నివసించు నీ దేశము నభివృద్ధి పఱచుటకు మన మనోధనాదికముల నెంత వెచ్చించి లోకోద్ధారకుఁడగు ప్రభువు ననుసరించుటకుఁ బ్రయత్నించితిమి? ఉత్కృష్ట జీవకోటుల దౌర్భాగ్యతను బరికింపక యాత్మోపభోగోచితములగు సాంఘిక 5 దైనందిన కృత్యముల స్వార్థపరాయణులమై మెలంగుటయే మన జీవితములకుఁ బరమావధియా?

తల్లి—నీవు వారి హితబోధను చేయుచుంటివా?

సుగు—(తల్లి మాటలను గ్రహించి) లేదు. నాకే బోధించుకొనుచుంటిని.

తల్లియేమైనఁ బ్రత్యుత్తర మిచ్చునోయని నిరీక్షించుదానింబోలెఁ గొంతతడవు మిన్నకుండెను; పిదప గదినుండి వెడలిపోయెను. తనగదిం జేరి మాతృభాషణంబుల 6 నవలోడన మొనరించుటలోఁ దల్లి తనకెన్నఁడును సహాయభూతురాలు కాదనియును, దన యుద్దేశ్యమునయిన సుచితరీతిని గ్రహింపఁజాలదనియుఁ దెలిసికొనెను. ఆమె మోకరించి ప్రార్థించెను. కణ్వని యుపన్యాసభవనమున, పూర్వద్వారమున నాటిదవాఁడు కాన్పించినది మొదలు తత్సాంఘికులలో మున్నెన్నఁడును ప్రార్థింపని వారనేకులు తదవలంబనముం గావించిరని చెప్పనొప్పును. అట్లామె ప్రార్థించి లేచునప్పటికి నేత్రము లశ్రుపూరితములై యుండెను. కొలఁది కాల మాలోచించుచుఁ గూర్చుండి పిదప సుమతి కొక లేఖను వ్రాసెను. దానిం దనచేటికచే నామెకుఁ బంపి తరుగ మాతృసమక్షముం జేరి తానును సుమతియుఁగూడి నేటి సాయంసమయమున మాలపల్లెకుఁబోయి పులోమాసోమనాధశర్మలఁ గాంచనై యుంటిమని తెల్పెను.

" సుమతి పినతండ్రియగు వైద్యభూషణుండు మాతోఁగూడ నచ్చటికివచ్చును. సుమతి వచ్చునప్పు డాతనిని బిలుచుకొని వచ్చును. వైద్యభూషణుఁడు సోమనాధశర్మకుఁ 7 గడుం గూర్చినవాఁడు. గత హేమంతర్తువున నాతని యుపన్యాసములకు సహాయభూతుఁడయ్యెను." అని సుమతి తల్లితోఁ బలికెను.

తల్లి నిరుత్తరయై యూరకుండెను. మహాత్మా విధాన మేమియు నామెకు రుచింపదాయెను. మాతృవిషాదమును 8 మూకీభావముచేతనే సుగుణవతి తెలిసికొనెను. సూర్యాస్తమయకాలమున వైద్యభూషణుఁడును, సుమతియు వరుదెంచిరి. వీరు ముగ్గురుం గలసి చండాలవాటిక కరిగిరి.

ధర్మపురీప్రాంతమున నీ చండాలవాటికను మించిన దుర్మార్గావాసము వే రొకండు లేదు. అది రైలు యంత్రనిర్మాణ స్థానమునకు సమీపమున నున్నది. గ్రామ నిరాహార నీచజనవుల కాకరము. తత్సమీపముననే యొక 9 బహిరంగభూమి కలదు. అందు సర్కసు మున్నగు నాటపాటలవాండ్రు విడియుచుందురు. దాని చుట్టును బీదగాండ్రకును, స్వల్పమూల్యముంగొను నన్న 10 విక్రేతలకును, వ్యభిచా

---

1. కోరుట 2. సమీప 3 పల్లెల 4. ఉద్ధరించుటకు. 5. ప్రతిదిన 6. పరామర్శించుట. 7. మిత్రుఁడు 8 ఊరకుంటచే. 9 మైదానము 10. పూటకూళ్ళ.

రిణులు మున్నగు దౌర్భాగ్యులు నివసించుటకును, చిన్న చిన్న కొట్లద్దెలకిచ్చుటకై యనేకములు కట్టఁబడియున్నవి. ఇట్లు దౌర్భాగ్యుల కందఱికి నాకరంబగు నీప్రదేశమున నాలయసంఘమువారు మున్నెన్నఁడును గంటఁజూచియైన నెఱుంగరు. అట్టి సాంఘికులు సమీపించుటకైన వలనుపడనంతటి మురికితోడను, పాపము తోడను, మునిఁగియుండెను. మనము న్యాయము నాలోచింతము. అప్పుడప్పుడు భజనగాండ్రను ఉపాధ్యాయులను, మతప్రచారకులను బంపి యాప్రదేశమును శుభ్రపఱుపవలయునని మున్ను ప్రయత్నించిరి. కాని పెక్కుసంవత్సరములు గతించినను ధర్మపుర్యాలయ సంఘమువారేమియు సేయఁజాలరైరి.

సకల దుష్కృత్యముల కాకరంబగు నీచండాలవాటికలో సోమనాథశర్మ ధర్మపత్నీ ద్వితీయుఁడై సాహసమునఁ బ్రవేశించి తమగుడారము నందలి మధ్యభాగమున నాటి, యుపన్యసింప నారంభించెను. అతఁడిట్లు 1 శిశిరర్తువునం దండుఁజేరుటచే సాయంసమయము లత్యాహ్లాదకరములుగ నుండెను. తన యుద్యమమును సఫలము సేయుటకు, అచ్చటి క్రైస్తవుల సాహాయ్యముఁ గోరెను. వారును యథాశక్తిని దోడ్పడిరి కాని యిట్టి యుపన్యాసకాలములను స్వరయుక్తమగు గానముగూడఁ దోడ్పడిన జయప్రదముగ నుండును. గతాదిత్యవారోపన్యాసమున హార్మోనియమును వాయించువారనారోగ్యులైరి. పట్నమునుండివచ్చి తోడ్పడినవారి గాత్రములంతగా శ్రావ్యములు గాకుండెను.

ఆనాడు సోమనాథశర్మ, అస్తమయ కాలమున నుపన్యాస స్థానమునఁ గుర్చీలను సర్దుచుఁ దన యర్ధాంగలక్ష్మితో " ప్రేయసీ! నేటిరాత్రి యొక చిన్నసభ జరుపఁబడును.

పులో—నాథా ! నేను నట్లే తలంచెదను.

సోమనాథశర్మ దృఢమైన పొట్టి శరీరము గలవాఁడు. అతని గంభీరకంఠస్వరము కంచుగంటవలె నెంతదూరమునకయిన స్పష్టముగా వినఁబడఁగలదు. ఆప్రాంతమునం దనేకులతో స్నేహముచేసెను. అతని హితబోధవలన బాగుపడిన యొక దిబ్బమొగమువాఁడు అప్పుడే గుడారములోనికివచ్చి కుర్చీల నమర్చుటలో నాతనికిఁ దోడ్పడెను.

నాటిరాత్రి యెనిమిదిగంటల కాలమున సుమంతుఁడు తనకొలువుకూటమునుండి గృహోన్ముఖుఁడై బయలువెడలెను. చండాలవాటికా సమీపంబున నొక యద్దెబండినెక్కి యింటికిఁ బోఁదలంచెను. కాని యాతఁ డాప్రాంతమును సమీపింప హృదయరంజకమగు నొక సుస్వర మచ్చటి గుడారమునుండి వెలువడి యాతనికి 2 శ్రోత్రపేయమును గావించెను. అది సుగుణవతి కంఠస్వరమే. స్వార్థత్యాగిని యగు నామె గానామృత మాతని చెవిం బడినతోడనె స్వచర్యావిమర్శ మిషంబున నాతఁడు భగవత్సాన్నిధ్యమును గాంచెను. ఆతఁడు తానెట్లు సంచరింపవలయునో యింకను నిర్ధారణ చేసికొనలేదు. సందేహ 3 డోలాయమాన మానసుండై పరితపించుచుండెను. రెయిల్వే యుద్యోగమున నున్న యాతని గతచర్య స్వార్థత్యాగమున కభిముఖుని జేయునది కాదు.

1. చల్లని కాలము. 2. చెవికింపును. 3. ఉయ్యెలగాఁజేయఁబడిన.

"ఆమె యేమిపాడుచుండెను! సుగుణవతి యీస్థానమున కెట్లు చేరఁగలిగెను?" అని యాతఁడాశ్చర్యంబునఁ బరికించుచుండఁ దత్ప్రాంత 1 ద్వారంబు లనేకంబులు తెరువఁబడినవి. అచ్చటి మద్యపాన శాలయందంతదనుక దొమ్ములాడుచుండినవారు నిశ్శబ్దముగఁ జెవియొగ్గి విన సాగిరి. పలువురు గుడారముత్తట్టు పరుగిడుచుండిరి. సుగుణవతికిట్టి యానందము మున్నెన్నఁడును గలుగలేదు. దేవాలయమున నెప్పుడు నామెకంఠ ధ్వని యింత శ్రావ్యముగఁ బలుకలేదు. ఇది యద్భుతమైన స్వరము. ఆమె యేమి పాడుచుండెను? రైలు యంత్రశాలాధికారియగు సుమంతుఁడు నిలిచి చెవియొగ్గి విన సాగెను.

గీ. ప్రభువు నడిపించు త్రోవలఁ బట్టి పోదు;
కాని నాదర్శముగఁ గొని వరలు చుందు;
నేను స్వాతంత్ర్య మిసుమంత బూన నవని;
గాంతు గమ్యస్థలంబు ధీమంతు తోడ.

నిర్మలస్వరూపము 2 మూర్తీభవించెనో యన నొప్పు నీగీతము విటు ద్యూత పాన శాలలఁ బ్రవేశించి యచటి దౌష్ట్యమున కంతరాయము గల్పించి నవీనోజ్జీవనమును గలిగించెను. అంత సుమంతుని లోచుకొని పోవుచు నొకఁడు "నేఁడు గుడారము పిక్కటిల్లఁగలదు; గానరసంబన నిట్లు వెల్లివిరియ వలయునుగదా!" అనెను.

సుమంతుఁడు గుడారమున కభిముఖుఁడై కొన్ని యడుగులు జని మరల సంశయించి వెనుకకు మరలి వీధిమూలం జేరి యొకయద్దెబండిలోఁ నెక్కెను. కాని యాతఁడు సుమతి గాత్రము వినంబడనంతటి దూరము పోకముందే తన భావికార్య విధానమును బ్రభుసమ్మతముగ నిశ్చయించుకొనఁ గలిగెను.

ఇది తృతీయాధ్యాయము.

---

1 గుమ్మములు. 2. ఆకారమును బూనెనో.

శ్రీ

# దైవానుకరణము.

## చతుర్థాధ్యాయము.

కణ్వుఁ డాతని పుస్తకాగారమున నిటునటుఁ బచారు సేయుచుండెను. ఆదినము బుధవారము. ఆవారమునఁ దాను సాయంతనారాధనానంతరమున నొసంగఁబడిన యుపన్యాసమునుగూర్చి యాలోచించుచుండెను. అతని 1 శయనాగార గవాక్షాంతరమునుండి చూచిన రైలు కర్మాగారాగ్రము కాన్పించుచుండును. మాలగూడెమున మతప్రచారకుఁడు నాటిన గుడారముఁగూడ నచ్చటికి సూక్ష్మముగఁ గాన్పించుచుండెను.

కణ్వుఁడు గదిలోఁ బచారు సేయుచు 2 గవాక్షముచెంత కరుదెంచినప్పుడెల్ల నటు వైపునకుఁ జూచుచుండెను. ఇట్లు స్వల్పకాల మిటునటుఁదిరిగి తుదకుఁ (లేఖన ఫలకము) వ్రాఁతబల్లయొద్దఁ గూర్చుండి పెద్దకాగితమును దనవైపునకు లాగెను. మరల క్షణకాలము యోజించి పెద్దయక్కరంబులతో నిట్లు వ్రాసెను.

ఈ సంఘమునఁ గ్రీస్తు చేయఁదగిన కార్యముల పట్టిక.

(1) లోకవిడంబనార్థము వ్యర్థ వ్యయమును గాని, యకారణ క్లేశమునుగాని పొందక సహజ సాధారణ పద్ధతిని జీవయాత్ర గడపుట.

(2) ఎంతటి ధనవంతులైనను ప్రజ్ఞావంతులైనను లక్ష్యము సేయక వారి లోపాలోపములను దేవాలయోపన్యాస కాలముల నిర్భయముగ 3 నుద్ఘాటించి నిరసించుట.

(3) తన యాధిపత్యముక్రింద నుండిన సంఘము నందుఁగల శ్రీమంతులను, విద్యావంతులను, సామాన్యులను కనిపట్టి యథోచితముగ వారియెడఁ బ్రేమను జూపి యాదరించుట.

(4) స్వార్థ పరిత్యాగమును జేసి, స్వకాయకష్టమునకోర్చి తనదేశమునఁగల ప్రజాసామాన్యముయొక్క క్షేమాభివృద్ధుల కనువగు కార్యముల పాల్గొనుట.

(5) పంచమవాటికయందలి మద్యపాన మందిరమునకు వ్యతిరేకముగ నిరాఘాటముగ బోధించుట.

(6) పాపాత్ములై యధోగతి నందుచుండిన బీదవారికిఁ దాను స్నేహితుఁడనని వెల్లడి చేసికొనుట.

(7) ఈసంవత్సరంబున వేసవిని శీతావరణ ప్రదేశమునకుఁ బోవలదు. రెండుసారులు దేశాంతరగామి నైతిని. ఇప్పు డట్లొనర్ప నవసరము గాన్పింపదు. ఆరోగ్యమును గలిగి యుంటిని. ఈ స్వేచ్ఛావిహారమును మాని, యావశ్యకతగల మఱియొకని నీధనంబున నుదకమండలమునకుఁ బంపుట యుక్తము. ఈపట్టణంబున నట్టి యావశ్యకత గలవారు పెక్కండ్రుకలరు.

(8) ప్రభువైన యేసు కణ్వుని స్థానమందుండిన నింకేమి సేయును?

---

1. పడకటింటి. 2. కిటికీ. 3. తెలిపి.

క్రీస్తు ననుసరించుటకుఁ దాను సేయు ప్రయత్నములు, అసంతృప్తికరములుగ నున్నవని యాతఁడెఱుంగును. అందుచేతనే ఖిన్నవదనుఁడై తగువిధానంబుల నారయుచుండెను. పయిన వ్రాసిన యెనిమిది విధానంబులలో నొక్కొక్కటిగఁ బ్రతిదియుఁ జిరకాలానుభవములగు మార్గములకు భంగకరంబులుగ నుండెను. అట్లయ్యు నాతఁడు క్రీస్త్వనుకరణ విధానంబుల నారయుచుండెను. ఇంకను మతియొక్కటిని వ్రాయఁ బ్రయత్నింపలేదు. కాని తన జీవితమునఁ గ్రీస్తును మిక్కుటముగఁ బ్రవేశపెట్టుటకై 1 యాలోడనము సేయుచు మిన్నకుండెను. ప్రార్థనా సమాజమునఁ దానానాఁ డుపన్యసింపఁ దలంచిన విషయమును వ్రాయఁదలంచియు నీపరితాపమున దాని మఱచెను.

2 తద్విషయ 3 నిమగ్నమానసుండై యుండుటచే బహిర్ద్వారముకడ మ్రోగిన గంటయైనను వినఁడాయెను. ద్వారపాలకుఁడేతెంచి దర్శనార్థ మెవ్వరో చనుదెంచిరని చెప్ప నులికిపడి 4 ప్రజ్ఞానియాయెను.

తనచీటిని లోనికిఁ బంపెను.

కణ్వుఁడు మెట్లను సమీపించి వానింబయికి రమ్మని పిలిచెను. "మనమిచ్చట నిర్మలముగ మాట్లాడఁదగును." అనెను. సోమనాథశర్మ మేడపయికేఁగి తన రాకకుఁ గారణము నిట్లు చెప్పఁదొడంగెను—

"కణ్వర్షీ! నీవు నాయుద్యమమునఁ దోడ్పడవలయును. సోమవారము రాత్రియు, గతరాత్రియు మేమెట్టి యద్భుతావహములగు సభలఁ గావించితిమో తా మిదివఱకే వినియుందురు. సుగుణవతి తన 5 నిరర్గళ శ్రావ్య గాన ధారా ప్రవాహముచే శ్రోతలఁ 6 బీయూషాబ్ధి నోలలాడించెను. జనులచే నేరా పిక్కటిల్లినది స్థలము చాలినది కాదు:"

"ఆ విషయమును నేనువింటిని. తత్పూర్వమింత ప్రజలామె గానము నింతకు మున్ను వినియుండలేదు. జనులట్లాకర్షింపఁబడుటలో వింతలేదు." అని కణ్వుఁడు పలికెను.

సోమనాథశర్మ—ఇది మన కద్భుతావహమగు ప్రవచనము వంటిది. మనయుద్యమమున కత్యంత సహాయకారి. నేటిరాత్రి తామచ్చటికి విచ్చేసి సభాకాలమునఁ బ్రసంగింపఁ గోరెదను. శీతలముచే నాదు దేహారోగ్యము కొఱవడియున్నది. నా గాత్రము శ్రావ్యముగ శ్రోతల నాకర్షింపదు. వివిధ కార్య భార నిమగ్నులగు మిమ్ము శ్రమపెట్టుట ధర్మముకాదు. నాకోర్కెను జెల్లించుటకుఁ దమకవకాశము లేనియెడల స్పష్టముగాఁ జెప్పుఁడు. మతియొకరికొఱకైనఁ బ్రయత్నించెదను.

కణ్వుఁడు—"నేటిరాత్రి మా ప్రార్థనసమాజము చేరుదు" అని యించుక విషాదముతో నిటునటుఁ బరికించి "దానికేదియో తగునేర్పాటు చేసి నేనే వచ్చుటకుఁ బ్రయత్నించెదను. నేను వచ్చెదనని నీవు విశ్వసించుకొనవచ్చును." అనెను.

కణ్వుని సద్భావమునకు మెచ్చి కొనియాడుచు సోమనాథశర్మ 7 గృహోన్ముఖుఁడయ్యెను.

---

1. పరామర్శించుచు 2. ఆవిషయమున. 3. మునిఁగిన. 4. తెలివిదెచ్చుకొనెను. 5. అడ్డులేని. 6. అమృతసముద్రము. 7 పోవయత్నించెను.

కణ్వుఁడు—మిత్రమా ! ఒకక్షణమాగి నాతోఁగూడఁ బ్రార్థింపవా ?

సోమ—అటులే.

వారిరువురును ఖతనమందిరమున మోకాళించి ప్రార్థింపఁజొచ్చిరి. కణ్వుఁడు పసివానివలె నిర్వికారముగాఁ బ్రార్థించెను. సోమనాథశర్మ నిశ్చలముగనుండి తదాకర్ణనమున [1] నశ్రుధారా ప్రవాహమున మునింగెను. చిరకాలమునుండి సదారాధనలయందాధిపత్యమును వహించుచు గౌరవముగ బ్రదికిన వాఁడయ్యును గణ్వుఁడిప్పుడు చండాలవాటికకడ నప్రాజ్ఞులకొఱ కుపన్యసింప సాహసించుట విపరీతముగఁ దోఁచెను.

సోమ—(లేచి వెడలనూహించి) కణ్వమహాముని ! భగవంతుఁడు నిన్నాశీర్వదించును గాక ! నేటిరాత్రి పరిశుద్ధాత్మ నీకు సహాయమై. నీసంకల్పమును జయప్రదముగ నెరవేర్చునుగాక !

కణ్వుఁడు ప్రత్యుత్తరము నొసంగలేదు. అట్లే నమ్మెదనని చెప్పుటకైనను సాహసింపఁడాయెను. కాని భగవద్ధ్యానమునుగూర్చి తలపోయ నాతని హృదయంబునకుఁ గొంతశాంతి యలవడెను. నాటి సాయంతనమున ధర్మపుర్యాలయ ప్రార్థన సమాజమునఁ బెక్కండ్రుపిక్కటిల్లిరి. జనసంకీర్ణమై యుండెను. నాఁడాపురజీ దేవాలయమున నడుగుపెట్టినదిమొదలు ప్రార్థనసమాజమునకెల్లరు సమావేశ మగుచుండిరి. మున్నెన్నఁడు నిందఱుసమకూడుట లేదు.

కణ్వుఁడు కార్యోపక్రమమున సోమనాథశర్మ సేయుచుండిన కార్యమును గూర్చి శ్లాఘించి తన యాహ్వానమును సభాసదులకు విన్నవించెను.

కణ్వ—నేటిరాత్రి చండాలవాటికయం దుపన్యసింపవలయునని భగవత్ప్రేరణచే నిశ్చయించుచుంటిని. మీరీసమాజకార్యమును నేటికి నేను లేకయే నిర్వహింతురని నమ్మెదను. మీలోఁగొందఱు నాతోఁగూడ మాలపల్లెకు వచ్చి యుపన్యాసానంతరము ప్రజలను సుముఖులను చేయుటలోఁ దోడ్పడవలయును. తక్కుఁగలవారిచ్చటనే మాయుద్యమము నిర్విఘ్నముగఁ గొనసాగించుటకై భగవంతుని బ్రార్థింపుఁడు.

అట్లే వారిలో నల్గురు కణ్వునివెంటఁ బోయిరి. మిగిలిన వారందఱును ప్రార్థనాగారంబున నుండిరి. కణ్వుఁడు వెడలిపోవుచుఁ దనసంఘమునఁ గలవారందఱిలో నిమ్నజాత్యుద్ధరణమునకై యంతఃకరణశుద్ధిగఁ బాటుపడఁదగిన వారు పదిపదునేనుగురికి మించియుండరని తలంచెను. కాని యీవిషయమాతనిని విశేషకాలము ఖేదపెట్టలేదు. కార్యాంతరాసక్తిచే దినిమరచెను, అతని హృత్ఫలకంబున నవీనాదర్శంబులు హత్తుకొనియుండుటంజేసి యిట్టిసంకల్ప వికల్పంబు లుత్పన్నమగుచుండెను.

ఆతఁడు తనజట్టుతోఁ బంచమవాటికం జేరునప్పటికి గుడారమంతయుమున్నే జన[2]సంకీర్ణమై యుండెను. ఉపన్యాసకులకొఱ కేర్పరచిన యున్నతాసనమును జేరుట దుర్ఘటమయ్యెను. సుమతియుఁ సుగుణవతియు నచ్చటనే యుండిరి. ధన్వంతరికి మారుగ నేడు నృసింహకవి వారికి సహచరుఁడై యరుదెంచెను. సుగుణవతి శ్రావ్యగానముతో సభావ్యాపారము నుపక్రమించెను. గుమిగూడిన సభ్యులందఱును బల్లవిని రట్టించి పాడుచుండిరి. ఇంకొకరు నిలుచుటకైనఁ దగిన తావులేక క్రిక్కిరిసియుండిరి. [3] ఝంఝామారుత ప్రచారములేక రేయి నిర్మలముగ నుండెను. దేరాప్రక్క—

1. కన్నీటి. 2. నిండి. 3. ఈదరగాలి.

చేతులు పైకెత్తఁబడెను. చుట్టును నరముఖంబులు కుప్పవోసినట్లు నిండియుండెను.

ప్రారంభించినపాట ముగిసినతోడనే సమీపగ్రామవాసియగు నొక మత ప్రచారకుఁడు ప్రార్థించెను. 1 తదుపరి సోమనాథశర్మ శైత్యముచేఁ దన గాత్ర మవ్యక్తంబుగ నూరెనని విన్నవించి ధర్మపురీ ముఖ్యాలయాధ్యక్షుఁడగు కణ్వమహాముని నేటియారాధనమును జయప్రదముగ నెరవేర్చునని వక్కాణించెను.

"అతఁడెవరు ?" అని సభాభ్యంతరమునుండి యెవ్వరో ప్రశ్న చేసిరి.

"మఠాధిపుఁడఁట నేటిరాత్రి చిత్రవిచిత్రమైన వారెల్లరు వచ్చియుండిరి." అని మఱియొకఁడనెను.

"ధర్మపురీ మఠాధిపతియా ? అతని నే నెఱుంగుదును. నాయజమాని తదాలయ ప్రవేశకుఁడు." అని యింకొకఁడు పలికెను. అతఁడు మద్యవిక్రేత యగుటచే వాని సంభాషణమును విని యెల్లరును నవ్వసాగిరి.

"అందఱింబట్టి సంద్రంబునం ద్రోయుఁడు" అని యొక త్రాగుబోతు గ్రామ తలారివాని పాట ననుకరించి యెలుఁగెత్తి పాడ నందఱును నాదసేయుచు నవ్వుచు రణగుణధ్వనిఁ గావించిరి. డేరాలోనివారందఱు నీవైపునకుఁదిరిగి చూడనారంభించిరి "వాఁడు తప్పత్రాగి యున్నాఁడు. వానిని వెలుపలికిఁ ద్రోసివేయుఁడు" అనికొందఱును, "క్రొత్తబోధకుని గొంతసేపు మాట్లాడనీయుఁడు" అనికొందఱును, "మఱియొక కీర్తనను, ప్రారంభింపుఁడు- కీర్తన- కీర్తన" అని కొందఱును గేకలిడ సాఁగిరి.

కణ్వుఁ డుపన్యాసవేదిక 2నధిష్టించి నిలువఁబడెను. ఈసమ్మర్దమును జూచి యీతఁడు భయాక్రాంతుఁడై యేమియుఁదోఁచక 3నిర్విణ్ణుఁడై యుండెను. పరువుమర్యాదల నెఱింగి మంచి వేషభాషలుంగల నాగరిక సంఘమునెదుట నుపన్యసించుట గాదిది. అతఁడు ప్రసంగింప నారంభించెనుగాని సభలోఁ గలకలము వృద్ధికాఁజొచ్చెను. సోమనాథశర్మ సభ్యులమధ్యకుఁబోయి సద్దుసేయవలదని నివారించెనుగాని వానిప్రయత్నము నిష్ప్రయోజన మాయెను. కణ్వుఁ 4 డూర్ధ్వబాహుఁడై 5 యుచ్చైస్స్వనంబునఁ బలుకఁజొచ్చెను. డేరామధ్య గూర్చుండినవారు కొంచెము శ్రద్ధగ వానిఁజూడఁజొచ్చిరిగాని వెలుపలినుండి రొదహెచ్చఁజొచ్చెను. కొలఁది నిముసములలో సంఘము కణ్వున కసాధ్యమయ్యెను. అతఁడు సుగుణవతిపై విచారచిహ్నమగు 6 మందహాసమును బ్రసరించెను. "సుగుణవతీ! నీవద్దియేనిఁ బాడుము. సంఘము నిశ్శబ్దముగ నీపాటను వినఁగలదు." అనిచెప్పి కణ్వు 7 డాసీనుఁడై తన 8 వక్త్రమును జేతులయందుంచుకొని మిన్నకుండెను.

తన గానామృతరసమును వెదజల్లుటకిదియే సుగుణవతికిఁ దగిన తరుణము. సుమతి హార్మోనియమును సారించెను, సుగుణవతి యిట్లుపాడఁ దొడంగెను.

గీ. రక్షకుఁడు మార్గదర్శియై ప్రబల వాని
ననుకరించుట కర్తవ్య మగును నాకు;
డెందమా! నిశ్చలత్వమునఁ జెందియుండు;
నిర్మలానంద సంధాన నియతుఁ డతఁడు.

---

1 పిమ్మట. 2 ఎక్కి. 3 తెల్లబోయి. 4 చేతులు పైకెత్తి. 5 గొప్పధ్వనితో 6 చిఱునవ్వు. 7 కూర్చుండి. 8 ముఖమును

గీత ప్రథమ పాదము నామె ముగింపకమున్న డేరాలోని జనులందఱు గౌరవ ప్రపత్తులతో సుగుణవతి కభిముఖులైరి. గీతమును ముగించుసరికి పంచమ వాటిక యందలి 1 చత్వరసీమయంతయు నిశ్శబ్దంబుగనుండెను. వారందఱామెకుఁ బాదాక్రాంతులైరి. ఘాతుక మృగతుల్యమగు నాసంఘమున నామె యానందకరమగునట్లు గానముచేసెను.

నాటకశాలలో వస్త్రాభరణాలంకృతులై సుగంధద్రవ్యంబుల నలందుకొని నటనౌచిత్యానౌచిత్య విమర్శనములఁ జేయు 2 ప్రేక్షకులకును, తప్పత్రాగి యొడలెఱుంగక నీచాతినీచములగు సంభాషణల మెలఁగు నీపశుప్రాయులగు 3 నాటవికజనంబులకు బోలిక యెట్లు చెల్లును? అట్టులయ్యును వీరు సుగుణవతి గానామృత 4 రసాస్వాదనంబునఁ గరంగి తమతమ దౌష్ట్యంబుల నెడఁబాసి దైవసాన్నిధ్యంబునంబోలె భక్తిపరవశులై కిమ్మనక మిన్నకుండిరి.

కణ్వుఁడు తలయెత్తి నిశ్చేష్టితుఁడై నిశ్శబ్దంబుగనున్న సామాజికులం గాంచి ప్రభువు భక్తుల శ్రావ్యగాత్రములఁ దన సేవయం దెట్లు వినియోగింపఁగలఁడో గ్రహించెను. నృసింహకవియుఁ దదేకదృష్టితో గాయనిం గాంచుచు నామె పేరిట తన కవితా సామర్థ్యము నెట్లు వెల్లడిచేయఁగలదో యని స్మరించుచుండెను. ఇట్టి సమాజారాధన స్థలంబులం గాలుపెట్టని భానుమంతుఁడుగూడఁ బ్రాంగణంబునఁ దచ్చోటనుండెను. అచ్చటి మొఱటుమానిసులు 5 మహార్ఘవస్త్రధారియగు దన్నుఁ జూచి విడ్డూరమందుచుండ సుగుణవతి సంగీత రసాస్వాదనాయత్త చిత్తంబున నాకర్షింపఁబడి యుండెను. ఆతఁడప్పుడే 6 వ్యాయామమందిరమునుండి వచ్చెను. సుమతిగాని సుగుణవతిగాని వానిరాక నెఱుంగరు.

కీర్తన ముగిసినతోడనే కణ్వుఁ డుపన్యసించుటకై లేచినిలిచెను. ఇప్పుడు సంఘము నిశ్శబ్దంబుగ నుండెను. ఇట్టిసంఘము నెదురఁ గ్రీస్తేమి సేయునని విచారించుచు నుపక్రమించెను. అధోగతియందుండిన వీరెవ్వరు? 7 నశ్వరాత్ములు, క్రైస్తవమతమేమిచేయును? పాపులను సన్మార్గవర్తులనుగాఁ జేయునది. ఇట్టివారితోఁ గ్రీస్తు ముచ్చటించు విధానమెద్ది? ఆతఁడేమనును? ఆతని సువార్తలఁగని యంశములన్నియు వీరికి సుబోధముగ వెల్లడింపలేకపోయినను గొంతవఱకైనఁ బ్రబోధించి యుండును. ప్రభువు సంచరించిన ప్రదేశములయం దట్లే బోధించెను. కణ్వునికిప్పటివలె 8 నిందనుక నెన్నఁడును ప్రజాసామాన్యమునెడ నిట్టి కరుణాంతఃకరణము కలుగలేదు. గతదశవర్షములు నీప్రజాసామాన్యమును గణ్వుఁడెట్లుభావించెను? ఆతని దృష్టిలో వీరు దుర్మార్గులును, లోకాభివృద్ధికి భంగకరులునగు వ్యర్థమానవులుగాఁ గాన్పించిరి. కాని నేటిరాత్రి తాను వారినెదుర్కొని యిట్టివారి నుద్ధరించుటకే కదా మనప్రభువు భూమియం దవతరించినది యని తలపోసి, వీరిసాన్నిధ్యముననుండి తదుద్ధరణార్థమగు కృషి సలుపువాఁడే 9 దిగంతపరీతుఁడైన పరమాత్ముని సమీపించువాఁడని భావించెను. పాపియగు నొకానొక పురుషుఁడు మానసవీథిం దగిలినవానిని ప్రేమించి రక్షించుట యెల్లరకును సుకరంబే యగును. అందఱుఁ బాపులేయగు పెద్దసంఘమును బ్రేమించుట కేవలము రక్షకుని సమీపించుటయే యనఁదగును.

---

1. ముంగిలివాకిలి. 2 చూచువారికి. 3. అడవివాండ్రు. 4 రసమును ద్రాగుట. 5 విలువగల. 6. క్లబ్బు. 7. నశించని. 8. ఇంతవఱకు 9, దిగంతవ్యాపకుఁడు.

కణ్వుఁ డుపన్యాసాంతమున సభముగించినతోడనే జనసందఱు నెవరిదారిని వారు వెడలిపోయిరి. ఇంతదనుక నిర్మానుష్యంబుగ నుండిన మధుపానశాలలు, 1 పణ్యస్త్రీమందిరములు మున్నగు దుర్మార్గస్థలంబులు తమకుఁ గలిగిన యీమహల్లోపమును గూడఁదీయ నుద్యమించినవో యన జనసంకీర్ణమై ద్విగుణీకృత దుర్గంధాకీర్ణంబై యుండెను. సుమతి, సుగుణవతి, నృసింహాకవి, కణ్వుఁడు మున్నగువారును 2 వాసనిలయగాములై వెలువడి యవినీతులు మెలంగు మందిరములందాటి బండ్లునిలిచియుండు తావునకు వచ్చి చేరిరి.

సారథులు 3 శకటముల నాయత్తపరచుచుండఁ గణ్వుఁడు తక్కుఁగలవారితో నిట్లు సంభాషింపఁ దొడంగెను:—“ ఇది కడుభయావహమైన ప్రదేశము. వర్ణనాతీతములగు ఘోరకృత్యముల కాకరమగు నీప్రదేశము పట్టణమునకింత సమీపమున నుండెనని నేనెఱుంగను. దీనింబట్టి చూడఁ బట్టణము క్రైస్తవ మతావలంబకులచే నిండియుండెనని తలంప వలనుపడుటలేదు. త్రాగుబోతులవలనఁ గలుగుచుండిన యీ దౌర్భాగ్యమును దొలఁగింప నెవ్వరికైన సాధ్యమగునని తలంచెదరా ? మనమందఱ మైకకంఠ్యంబున దీనిందొలంగింప నేల ప్రయత్నింపరాదు ? క్రీస్తిట్టి సందర్భమున నెట్లు సంచరించును ? మిన్నకుండునా ? ఘోరకృత్యంబులకును, మృత్యువునకు నాకరంబులగు నిట్టిమధుపానశాలల, వ్యభిచారగృహంబుల, జూదములాడు సావడుల నుంచుటకుఁ గ్రైస్తవు లామోదింపనగునా ? ”

కణ్వుఁడు సాన్నిధ్యవర్తులతో ముచ్చటించుచుండె ననుటకంటెఁ దనలోఁదానె వితర్కించుకొనుచుండెననుట 4 సమంజసము. తానును దనసాంఘికు లందఱును నేఁటట నీమందిరముల 5 నిరాఘాట ప్రచారమునకు ఆమోదము నిచ్చుచునే యుండిరి. క్రీస్తు వీరివలెఁ బా నిందుల కామోదించునా ? ఈప్రశ్నకుఁ గణ్వుఁడు సమాధానము నూహింపఁజాలఁడయ్యెను. క్రీస్తు, ఈకాలమున సజీవుఁడై యుండిన యెడల నిట్టినీచస్థానముల మాయింపఁ బ్రయత్నింపఁడా ? అతఁడెట్లు బోధించియుండును ? ఎంతపనిచేసియుండును ? ఇవి కూడనికార్యమని బోధించిన ప్రబాసామాన్యమున కంత హితవుగ నుండదు, క్రైస్తవులయ్యును వీరు పాపప్రచారమున కామోదము నొసంగి తన్మూలమున లభించు ద్రవ్యమునకు యజమానులైయుండి పాపకార్యముల కద్దెల కిచ్చుచుండవచ్చును. పైకార్యములన్నియు నిచ్చట జరుగుచుండెనని కణ్వుఁడెఱుంగును. ఇట్టి సందర్భమునఁ గ్రీస్తుని 6 యభిమత మెట్లుండును ?

మరునాఁడు ప్రాతఃకాలమున నీవిషయమును 7 నిదమిద్ధమని పూర్తిగనిశ్చయింపక మున్నె తన పఠనమందిరమున కేగెను. ఆదినమంతయు నావిషయమునుగూర్చియే మనస్సునం దాలోచన చేయుచుండెను. అటులనే ధ్యానించుచుఁ దృప్తికరమైన సమాధానమును స్థిరపరచుకొనక పూర్వమే దైనికపత్రిక వచ్చిచేరెను. భార్య పత్రికం దెచ్చి భర్తచేతికిచ్చెను. అతఁడు చదువ నారంభించెను. ఆమె వినుచుఁ గూర్చుండెను.

ఈ 8 దైనికపత్రికయే యాప్రాంతముల నన్ని విషయముల స్పృశించినది. పత్రికాపాఠకులు మున్నెన్నఁడింతటి శ్రద్ధతో విషయముల నిరీక్షించునది లేదు. సమీ

1. వెలయాండ్రయిండ్లు. 2. నివాసగృహములు. 3. బండ్లు 4. మంచిది 5, అడ్డులేని. 6. ఇష్టము. 7. ఇట్లని. 8 దినసంబంధము.

పమున జరిగిన మల్లయుద్ధ వివరణమందుఁ గాన్పింపకాయెను. క్రమక్రమముగ నా ప్రాంతముల జరుగు నేరముల వివరములుగాని, సంసారుల యిండ్లలో జరుగు నీచ వార్తలుగాని, యీపత్రికయందుఁ బొడసూపుటలేదు. పిదప సారాయి మున్నగు మత్తుద్రవ్యములయుఁ, బొగాకు మున్నగు పదార్థముల విక్రయప్రకటనలు గూడఁ బ్రచురింపఁబడుటలేదు. ఆదివారమునఁ బత్రికాప్రకటనము నిలుపుచేయఁబడినది. పత్రికాధిపుల వ్యాసములుగూడ రానురాను, అద్భుతమును గొల్పుచుండెను. సోమవారమున వెలువడిన పత్రికలోని కొన్ని భాగములు చూచిన పత్రికాధిపుఁడు తన వాగ్దానమును నిలుపుకొనినట్లు స్పష్టపడఁగలదు. దీనిం జూడుఁడు—

రాజకీయవిషయముల నీతి—

"వ్యావహారిక విషయముల నధ్యక్షత వహించినవారి పక్షమునే యీపత్రికాధిపుఁ డవలంబించి వ్యాసముల సమకూర్చుచుండెను. ప్రతికక్షుల వాదములను ఖండించుచు స్వమతస్థాపనమును గావించుచుండెను. ఇఁక ముందన్ని పక్షములవారికిని న్యాయ్యమును సమకూర్చుతలంపున యోగ్యాయోగ్య ప్రకటనమే ప్రధానముగా వ్యాసరచన గావింపఁగలదు. వ్రాయఁబోవు విషయము స్వపక్షమున కనుకూలమా లేక పరపక్షమున కనుకూలమా యనిగాని, మనపక్షమువా రేర్పరచిన విధుల కనుగుణముగ నుండెనా లేదా యనిగాని, విచారింపక, ప్రపంచోద్ధరణమునకై యుత్కృష్ట ప్రవర్తనము ననుకరించిన లోకరక్షకుండగు శ్రీ యేసునాథుని విధుల కీవ్యాసరచన యనుగుణముగనుండునా లేదా యనియే విమర్శించుచుండును. ప్రతిరాజ్యాంగతంత్ర విమర్శనమునను దదంతర్గత నైతికాదర్శములు యథాక్రమంబుగ నున్నవా లేవా యని చర్చింపఁబడును. సంఘములుగాని, ప్రజలుగాని సకలవిషయముల భగవత్సంకల్పానుసారమాచరింపఁదగును. అట్టివి యీపత్రికనుండి యామోదింపఁబడును. తద్వ్యతిరిక్తంబులును నిరసింపఁబడును.

శాసన నిర్మాణ సభా ప్రవేశక సభ్యుల యెన్నికల విషయములఁగూడ నిట్టి యాదర్శముననే యామోదము ప్రస్ఫుటముచేయఁబడును. స్వపక్ష ప్రతిపక్ష భావములం ద్యజించి 4 దైవాధిష్ఠిత మార్గంబునఁ బ్రజా ప్రాతినిధ్యమున కర్హుఁడగు నా యను విషయమే యీపత్రికయందుఁ జర్చింపఁబడును.

ఇట్టి విషయము లాపత్రికయందుఁ బెక్కులు పొడసూపుచుండెను. మాదిరికి స్వల్పముగా నిందుఁ జూపితిమి. ధర్మపురీవాసులు పెక్రాండ్రీ వ్యాసములఁ జదివి యాశ్చర్యముచేఁ గన్నుల నులుముకొనిరి. అట్టివారిలో ననేకులు పత్రికను నిలుపుచేయుఁడని పత్రికాధిపునకు స్పష్టముగఁ దెలిపిరి. అట్టులయ్యును పత్రిక వెలువడుచునే యుండెను. పలువు రాతురతతోఁ జదువుచునే యుండిరి. వారాంతమునఁ జందాదారు లనేకులు పత్రికం దెప్పించుకొనుట మానిరని పత్రికాధిపుఁడగు పురూరవుఁడు దెలిసికొనెను. ఈయెదురెత్తునడక నాతఁడు ప్రశాంతుఁడై చూచుచుండెను గాని, తనచేతిక్రింది యుద్యోగి పత్రిక దివాలాతీయునని నిశ్చయించుకొనెను.

ఆరాత్రి కణ్వుఁ డాపత్రికను దనభార్య వినునట్లు చదువుచుండఁగాఁ బ్రతివాక్యమునఁ బురూరవుఁడు తనవాగ్దానమున ననుసరించుచుండెనని కణ్వునకు స్పష్టమయ్యెను.

1. దైవముపూనిన.

ఉద్రేకమును గలిగించు వినీతవాక్యము లెందును గాన్పింపలేదు. 1 మకుటములను వ్యాసములుఁగూడ విశ్వాసపాత్రములై యుండెను. అతఁడు పరికించిన రెండువ్యాసాంతములను వ్యాసకర్తల నామములు స్పష్టముగ లిఖింపఁబడెను. అట్టివ్యాసములలోనే పదరచనయు, 2 నితివృత్తమునుగూడ గౌరవాస్పదములుగఁ గాన్పించుచుండెను.

"పురుషాగవుఁడు పత్రికావిశేఖరులు వ్యాసములకుఁ దమనామములఁ జేర్చునట్లేర్పరచెను. అట్లు చేయుట మిక్కిలి మంచిది. ప్రతివ్యాసముయొక్క బాధ్యతయుఁ దత్కర్తలే వహింపవలసిన వారగుదురు. అందువలన వ్యాసరచన యుత్కృష్టత కలుగును. వ్యాసకారులకును బత్రికాధిపతులకుఁగూడ నిది యుత్తమమయిన కార్యము."

అని చెప్పి కణ్వుఁడు నిలిచెను. అతని భార్య తానుచేయుచున్న పనిపై బునరు దృష్టిని మరలించెను. అతఁడత్యంత శ్రద్ధాళువై చదువుచుండెను.

"ప్రేయసీ! ఇదివినుము" అని కణ్వుఁడు గద్గదస్వరంబుతో నిట్లనెను.

"నేటిప్రాతఃకాలమున రైల్వేకర్మాగారాధ్యక్షుఁడగు సుమంతుఁడు తన పదవికి రాజీనామాను దాఖలుచేసెనఁట. రైల్వేకంపెనీవారు తమదయకుఁ బాత్రులగు కొందఱి సావికావ్యాపారులకుఁ గలిగించుచుండిన విశేషలాభముల నిలుపుచేయుటకై మనగవర్నమెంటువారిమధ్య చేసిన కొన్ని చట్టములకు భంగకరముగాఁ గంపెనీవారు నటించుచున్నట్లు నిర్ధారణచేయఁగల కొన్ని కాగితము లతనికి దొరకెనఁట. వాని నాతఁడు గవర్నమెంటువారికి స్వాధీనముచేయునఁట. ఇట్టి శాసనాపాతములఁ గావించుచుండిన రైలువారి నౌకరిలోనుండుట తనకు, ఆత్మగౌరవమునకు భంగకరముగా నుండునని యెంచి రాజీనామా నిచ్చితినని వ్రాయుచున్నాఁడు. తనకు లభించిన సౌఖ్యమును దండసాధకారుల వశ మొనర్చెనఁట.

సుమంతుని యీసాహస కార్యమునుగూర్చి పత్రికాధిపులు వివరించిరి. ఈకార్యమువలన సుమంతున కేమియుఁ బ్రతిఫలములేదు. జీవనోపాధిగూడ నశించెను ఈవిషయమును బహిర్గతము చేయఁదలఁచినచో దన యుద్యోగమునకు భంగ మెన్నటికిఁ గలుగనేరదు. ధర్మశాస్త్రముల ననువర్తింప వలయుననియు, శాస్త్రవిరుద్ధ ప్రవర్తకుల దండింపవలయుననియు, భావించు సజ్జనులందఱితని యీకృత్యము నామోదింప వలయును. ఇట్టి పెద్దరైల్వే కంపెనీపయిని తగుసాక్ష్యము చిక్కుటయు దుర్ఘటమైయుండ నట్టివిషయములఁ దెలిసినవారుగూడ గొప్పవారితోఁ బోరు మన కేల? మన మపరాధులముగాముకదాయని సమాధానపరచుకొనెదరుగాని యాథార్థ్యమును వెల్లడింప సాహసింపరు. ఇట్లు పెద్ద పెద్దలే కర్తవ్యమును దాటించుచుండుటచే 3 యువకుల యంతఃకరణములు దుర్వ్యాపార 4 పరీతములగుట యొకవింతయా! ఇట్టి న్యాయవిరుద్ధ కార్యములచే నెందఱెందఱు రైలునౌకరులు ద్రవ్యమును సమార్జించుచుండిరో తెల్పుచు వారి5 మేధావిశేషమును గొనియాడుచు మున్నొక గౌరవస్థానము నలంకరించిన విబుధుఁడే లోకమును హెచ్చరించెను. సాధ్యమగునేని యుత్కృష్ట పదవుల నున్నవారెల్లరిట్లే ధనాకర్షణము చేయుచుందురని కూడ నుడివెను.

ఇట్టిచర్యలు భగవత్కటాక్షమునకుఁ బాత్రములు కావనియు లోకసంరక్షణార్థము వినియోగింపవలయుననియు విబుధులెల్ల రెఱింగినవిషయమే. ఇట్లు నేరములు శిక్షా

1 వ్యాసనామములు. 2. కథ 3 యౌవనులు. 4. నిండినవి. 5. బుద్ధివిశేషము.

పాత్రములు కాకుండిన నూతనోద్యోగ పదార్థులగు యవ్వనులందఱును సచ్ఛీలు రెట్లగుదురు?

క్రైస్తవుఁడగువానికి విధాయకమగు రీతినే సుమంతుఁ డాచరించెనని మాన మ్మకము. ప్రభుస్థానమునకును, ప్రజలకునుగూడ నాతఁడసాధారణ సేవఁజేసెను. ప్రతి మానవుఁడును సంఘమునకుఁ జేయవలసిన విధానము నిదమిద్ధమని నిర్ధారణ సేయుట సుకరముకాదు. కాని ప్రకృతవిషయమున సుమంతుఁడు తనవిధిని యుక్తియుక్తంబుగ నిర్వర్తించెనని ధర్మపరాయణులగువా రెల్లరుఁ దలంపక మానరు. ఒక్కొకప్పుడు ప్రజా సేవకై స్వార్థపరిత్యాగమును గావింపవలయును. సుమంతుని కార్యమునుగూర్చి భిన్నాభి ప్రాయములు పెక్కులు వెలువడఁ గలవు. అశ్రీకులీతని నక్రమప్రవర్తకునిగాఁ జెప్ప నుంకించెదరు. దేశాభిమానియుఁ బ్రభుభక్తిపరాయణుఁడును జేయఁదగినదానినే యీ తఁడు గావించెను. ధర్మశాస్త్రము యథోక్తముగ నిర్వహింపఁబడునుగాక!

పూర్వోక్త విధానంబునఁ గల పత్రికా వ్యాసమును పఠించుట ముగించి కణ్వుఁడు పత్రికను నేలపైవైచి యిట్లనెను.

"నేనుపోయి సుమంతు నాదరింపవలయును. ఆతఁడు నాతోఁజేసిన వాగ్దానమునకు ఫలితమిది."

ఇట్లని కణ్వుఁడు వెడలుచుండ నర్థాంగలక్ష్మి—

"నాథా! మనప్రభువీవిషయమున నిట్లె సంచరించునని నీవుతలంచెదవా"అనెను.

కణ్వుఁడొక క్షణకాలము నిరుత్తరుఁడై నిలిచియుండి స్వాదువాక్యంబులతో నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను—

"నేనట్లే తలంచెదను. ఎట్లయినను సుమంతుఁడు క్రీస్తుని సమ్మతమిదియని నిశ్చ యించెను. ఈవాగ్దానమునఁ జేరిన మేమందఱము నెవనికిఁ గ్రీస్తెట్లు ప్రబోధించిన నట్లాచరించుటకు నిశ్చయించితిమి. పరులకుఁ దోఁచినట్లు కాదు. ఎవనిచర్యకు వాని యంతరాత్మయే ప్రబోధస్థానము."

"వాని కుటుంబముగతి యేమి? ఈ 1 స్థానభ్రష్టతను వానిభార్యయుఁ బిల్లలు నెట్లు భావింతురు?" అనిభార్య యనెను.

"వారికిది కడు దుర్భరముగ నుండును. అందుకు సందియము లేదు. ఈవిషయ మున సుమంతునికిఁ గష్టమిచ్చుటనే గలదు. ఆతని యుద్దేశమునుగూడ వారు సన్మార్గ మున గ్రహింపఁ జాలరు." అని కణ్వుఁడు సమాధానముచెప్పుచు నింటినుండి బయలు దేరి వెడలిపోయెను. అదృష్టవశమున సుమంతుఁ డెదురయ్యెను. వారిరువురునిరుత్తరులై మిన్నక పరస్పర కరగ్రహణము లొనర్చిరి. భాషా సాహాయ్యముతో నిమిత్తములేకయే పరస్పరాభిప్రాయముల గ్రహించిరి. గురువునకును, శిష్యులకును నిట్టియన్యోన్యాకర్షణ మిదివఱ కెన్నఁడును గలుగలేదు. ఈవిషయమునఁ గొంతదవ్వు ముచ్చటించిన వెనుక నీవేమిచేయఁదలంచితి"వని కణ్వుఁడడిగెను.

2 "సేవకాంతరవిషయము నడుగుచుంటిరా! ఇంకను నామనంబున నేదియు లేదు. శాంతివార్తల నంపు నాపురాతన వృత్తికలదుగదా! సాంఘిక ప్రపత్తి యందుఁదప్ప నాకుటుంబము శ్రమ పడనవసరములేదు." అని సుమంతుఁడనెను.

1 స్థానమునుండి తొలఁగుట. 2. సేవకత్వమునవదలినతరువాత.

సుమంతుఁడు ఖేదాకుల వదనారవిందుఁడై నెమ్మదిగ నుచ్చరించెను. 1 దారాపుత్రాదు లిక్కార్యము నెట్లు భావించిరని కణ్వుఁ డడుగ నిమిత్తము లేదు. ఆవిషయమున సుమంతుఁడు మిక్కిలి ఖేదపడుచుండెనని కణ్వుఁ డెఱుంగును.

ఇంచుక తాళి "మీతో నింకొక విషయము మనవిసేయ వలసియున్నది. కర్మాగారమునఁ గూలివాండ్రనిమిత్తము నేనారంభించినపనినిగూర్చియే యైయున్నది. ఆపని నాయుద్దేశ్యప్రకారము నడచుటకుఁ గంపెనీవారి కభ్యంతర మేమియుఁ గాన్పింపదు. రైల్వేనౌకరులందఱు న్యాయవిరుద్ధముగ సంచరించుచుండఁ గంపెనీవారు యువజనసంఘములు మున్నగు మతవిషయిక సమాజములఁ బోషించుచుందురను వదంతి సత్యమేకదా! సన్మార్గవర్తులు మతావలంబకులు నగువాండ్రు దమసేవయందుండుట వారికిని యుక్తమే. కావున నేనేర్పరచిన యీగదియందుఁ గూలివాండ్రు చేరి సత్కాలక్షేపము సేయుచుండవచ్చును. నాస్థానమున వచ్చువాఁడే దానిని బోషింపవచ్చును. నీవందుల 2 కనుసంధాతవై నాయుద్యమమును సఫలము సేయ వలయును. నాతలంపు నీకుఁ దెలిసియే యున్నది. ఆనాటి నీసంభాషణము పనివాండ్ర నాకర్షించినది. వీలగునన్నిసారులు తామచ్చటి కేగుచుందును. కన్యాశ్రేష్ఠి నాశ్రయించి తత్కార్యమునకు వలయు బల్లలు మున్నగు పరికరముల నందుఁజేర్పుఁడు. నీవట్లు చేయుట కంగీకరించెదవా?" అని సుమంతుఁ డడిగెను. "వల్లె" యని కణ్వుఁడు ప్రత్యుత్తరమిచ్చి మఱికొంతసే పచ్చటినుండి వెడలిపోవునప్పుడు సుమంతునితోఁగూడి భగవంతుని బ్రార్థించి క్రైస్తవసాహచర్యమునకు సూచకమగు కరపీడన మొనరించి గృహోన్ముఖుఁడై చనెను.

ఆవారమున జరిగిన విషయముల నన్నిఁటిని మనంబునఁ దలపోయుచు నుద్రిక్తుఁడై కణ్వుఁడిల్లుసేరెను. పట్టణమునం దెల్లెడలను ధనసంఘమునందు విశేషంబుగఁ దనచే నుత్పాదింపఁబడిన క్రైస్తవాదర్శ ప్రవర్తన నపరిమితమైన మార్పును కలిగించుచుండెనని గ్రహించెను. అట్టి ప్రతిజ్ఞానువర్తనమున ననుదినంబును భయంకరమగు మార్పులు కలుగుచున్నవి. దాని పర్యవసానము నూహించుట కాతఁ డుద్యమింపలేదు. ధర్మపురియందేగాక దేశమునం దెల్లెడల ననేక కుటుంబములలో 3 నసంభావిత 4 వినిమయంబులు గలుగఁగలవని యాతఁడనుకొనలేదు. సుమతి, సుగుణవతి, సుమంతుఁడు, పురూరవుఁడు మున్నగువారు వాగ్దానము నాచరణమునం దిడుటవలనఁ గలుగుచున్న మార్పులను దలపోయ నట్టివాగ్దానమును చేసిన వారందఱు నైకకంఠ్యంబునఁ దదాచరణంబునకు దొరకొనిన నెంత తారుమారు కలుగునో తెలిసికొన నాతనికి మార్గదర్శక మగుచున్నది. వారందఱిట్లాచరించెదరా? లేక, కష్టములు తారసిల్లిన కొలఁది మెత్తబడి పట్టు వదలుదురా? మరునాటి ప్రాతఃకాలమున నాతఁడు తన పఠనమందిరమునఁ గూర్చుండి యీప్రశ్నమున కుత్తరము నూహించుచుండ స్వయంనిర్ణయ సభాధ్యక్షుఁడగు మయూరుఁడను యాదవుఁడు దర్శనార్థియై పిలిచెను.

"నేను నాకష్టములను వెలిబుచ్చి మిమ్ముల బాధించుట ధర్మముగాదు గాని మీరునాకు సదుపదేశమును గావింతురను నమ్మకముతో వచ్చితిని." అని మయూ

1. భార్య. 2. కూర్పువాఁడవు. 3. భావింపఁబడని. 4. మార్పు.

రుఁడు వెంటనే తానువచ్చిన సంగతి నివేదింప నుపక్రమించెను. “నీవు వచ్చినందులకు మిక్కిలి సంతసించితిని. సందియము వలదు. సంగతిదెల్పుము.” అని కణ్వుఁడనెను. కణ్వుఁడీసంఘమున కధ్యక్షపదవి నందినది మొదలు మయూరుని బాల్యము నుండియు నెఱుంగును. బాలుఁడయ్యు నాతఁడాలయమునఁ [1] గాదాచిత్కముగఁ జేయు సత్కార్యముల నవలోకించి యానందించుచుండెను.

మయూరుఁడు— అయ్యా! మీకు నిజము జెప్పవలయుఁగదా! నాకిప్పుడుద్యోగ మంతరించినది. నిర్వ్యాపారుఁడ నైతిని. గతవత్సరమున నేనున్నత పరీక్షయం[2]దుత్తీర్ణుఁడ నైనది మొదలు దేశోపకారి “పత్రిక కుపవిలేఖరుఁడగా నుంటిని. మొన్న శనివారము సాయంకాలమునఁ బత్రికాధిపుఁడు నన్ను బిలిచి రేపటియుదయమున నీవుపోయి బెజవాడలో జరిగిన చోరీనేరమును గుఱించి, విమర్శించి తద్విషయముల వ్యాసముగ సమకూర్చి తెమ్ము. సోమవారము ప్రాతఃకాల పత్రికయందు ధర్మపురీ దైనిక పత్రికకన్న మున్నుగ మనమీ విషయమును బ్రచురింపవలయు” ననెను. ఆదివారమునాఁడు పనిసేయనని నేను తిరస్కరించితిని. నన్ను పనినుండి తొలఁగించెను. అతని హృదయ మెందువలననో వినువుదలఁ జెందియుండెను. అట్లుకానిచో నన్నంతమాత్రమునఁ ద్యజింపఁడు. ఇంతకు మున్నాతఁడు నన్నత్యంతాదర భావమునఁ గాంచువాఁడు. ఏసు నేను చేసినటులనే చేయునని మీరు తలంపరా? ఇట్లేల యడుగుచుంటినన, బరులందఱును నేనాదిత్యవాసరంబునఁ బనిసేయనని నిరాకరించుటచే బుద్ధిహీనుఁడనని పలుకుచున్నారు. క్రైస్తవుఁడు పరుల కాశ్చర్యమును గొలుపు పనులఁ జేసినం జేయునుగాని బుద్ధిహీనమగు చర్యలం దిగఁడని నేను సంతృప్తినందుట కడుగుచుంటిని, మీ రేమనుకొనియెదరు?

కణ్వుఁడు— నీవు నీమాటను నిలువఁబెట్టుకొంటి వనుకొనెదను. నీయజమాని నిన్ను జేయుమనిన రీతిని క్రీస్తు ఆదివారమున వార్తాపత్రికా కార్యనిర్వాహణమునఁ బనిసేయునని తలంపను.

మయూరుఁడు—. అయ్యా! మీకు వేయివందనములు. ఈ విషయమున నామనస్సు వ్యాకులత నందినది. దూర మాలోచించిన కొలఁదిని శాంతిని జెందుచున్నది.

అని మయూరుఁడు గమనోన్ముఖుఁడై లేచెను. కణ్వుఁడును లేచి కరుణారస పూరితమగు తనహస్తము నాతని భుజముపై వైచి “ముందేమి చేయఁదలంచితివి?” అని యడిగెను.

మయూరుఁడు— నాకింక నేమియు స్ఫురించుట లేదు. కలకత్తా మున్నగు రాష్ట్రీయ నగరంబుల కేగి యెట్లో జీవయాత్ర వెడలింపఁ దలంచితిని.

కణ్వుఁడు—ధర్మపురీ దైనికపత్రిక కుపవిలేఖరుఁడవుగ నేల యుండఁజనదు?

మయూరుఁడు—అవియన్నియుఁ బూర్ణముగ నున్నవి. అట్టితలంపు జనింపలేదు.

కణ్వుఁడొక క్షణ మాలోచించి నాతోఁగూడ దైనిక కార్యాలయమునకురమ్ము. ఈవిషయమునఁ బురూరవు నడిగి చూతము.

ఇంకొక క్షణమునకు వీరిర్వురును బురూరవుని కార్య భవనంబున నుండిరి. కణ్వుఁడు కొలఁది మాటలలోఁ దమరాకకుఁ గల కారణమును బురూరవున కెఱింగించెను. పురూరవుఁడును సత్యాకర్షణ దక్షుఁడగు సూక్ష్మదృష్టితోఁజూచి యిట్లనెను.

1 అప్పుడప్పుడు. 2 దాటుట.

పురూరవ— నాపత్రికాలయమున నీకొక పనినీయఁగలను. ఆదివారమునఁ బనిసేయని విలేఖరులు కావలసియున్నది. పత్రికా విలేఖనమున నవీన విధానము నూహించుచుంటిని. మయూరుఁడు ప్రభ్వాజ్ఞానుసరణోపయుక్తం బగుటచే నావిధానమున కుపకరించు నని తలంచెదను.

ఇట్లని పురూరవుఁడు మయూరునకుఁ గొంతపని నియమించెను. నిర్వ్యాపారి కుద్యోగము గలిగించుటకు సహకారులగు వారికిఁ గలుగు తుష్టిని బోలు సంతుష్టి నందుచుఁ గణ్వుఁడు స్వగృహోన్ముఖుఁడై చనెను

కణ్వుఁడు తన పఠనమందిరమునకే పోవనుద్యుక్తుఁడై మార్గమధ్యమునఁ గన్నయ్యశ్రేష్ఠి దుకాణమును దాటుచుండ లోనికేగి యజమానితోఁ గొంచెము ప్రసంగించు సంకల్పము కలిగి లోనికేగెను. అంత నాశ్రేష్ఠి తాను సత్కార్యనిర్వాహక పథకమును నివేదింప నిశ్చయించెను. కేవల కార్యాతురుఁడై ధనార్జనమే ప్రధాన కార్యముగ భావించుచుఁ, దనకుఁదటస్థించు ప్రతికార్యము నామానముననే కొలుచుచుండు నా శ్రేష్ఠియే యితఁడాతని కణ్వునకు సంశయము జనించెను.

“ గురువర్యా ! నిజమును మరుగుపరుపఁ బ్రయత్నించినఁ బ్రయోజనములేదు. నేనట్లు వాగ్దానముచేసినది మొదలు నావ్యాపారమును దారుమారుగ మార్పుఁజెందింప వలసినవాఁడ నైతిని. గతించిన యిరువది వత్సరంబులనుండియు నాక్రయ విక్రయ శాలలో ననేక కార్యముల నిర్వహించుచుండెడి వాఁడను. వానిని గ్రీస్తునంగీకరింపఁడని నేనెఱుంగుదును. క్రీస్తాచరించునని నేను భావించు విషయములఁ బరికింప నివి యొక గొప్పగాఁ గాన్పించదు. నేనవ్యక్తముగఁ జేసిన పాపములకంటె విధ్యుక్తములఁ ద్యజించిన పాపమే మెండుగఁ గాన్పించుచున్నది. ” అని శ్రేష్ఠి చెప్పెను.

“ నీవు ప్రప్రథమమునఁ జేసిన మార్పేమి ? ” యని కణ్వుఁడడిగెను. తన ప్రసంగ వ్యాసము తనరాకను నిరీక్షింపఁగలదని తలంచెదను. కన్నయ్యశ్రేష్ఠితోడ ప్రసంగము జరుగుచుండఁగనే తనవ్యాసమునకు వలయు పరికరము పఠనమందిరము నపేక్షింపకయే సమకూడినదని తెలిసికొనెను.

“ నేను ముందుచేయవలసిన మార్పు నాపనివాండ్ర విషయమయినట్లు స్ఫురించెను. అట్లా యాదివారమున మీతో వాగ్దానముచేసి వెళ్లిన మరుసటిదినమె నేను కార్యాలయమున కరుదెంచి యిందుఁ బనిసేయుచుండిన గుమాస్తాలు, వ్రాఁతగాండ్రు, లెక్కలవ్రాయువారు, సరకు నమ్మువారు భటులు మున్నగు పరివారము విషయమునఁ గ్రీస్తెట్లు సంచరించునని విచారించితిని. చిరకాలమునుండి వారివిషయమున నేను సంచరించు రీతినిగాక [1] సౌహార్ద్ర భావంబుతోఁ బ్రభువు సంచరించునా యని యోజించితిని. అట్లే యని నిశ్చయించితిని. అట్లొనర్చిన నాస్థితి యెట్లుండునని యోజింపవలసి వచ్చెను. నాపరిజనము నందఱినొక్కచోఁ జేర్చి వారితో నీవిషయముల ముచ్చటించిన వెనుకగాని నాసందేహమునకు సమాధానము చిక్కునని తోఁచలేదు. కావున వారి నందఱి నాహ్వానించితిని. మంగళవారము రాత్రి యాసావడియందు మేమందఱము సమావేశమైతిమి. ఆసమావేశమువలనఁ బెక్కుసంగతు [2] లుత్పన్నములైనవి. వాటి నన్నిటి నిప్పుడు చెప్పనొప్పను. ప్రభువైన యేసు మాట్లాడఁదగిన రీతినే వారితో

---

1 స్నేహభావము. 2 పుట్టినవి.

ముచ్చటించితిని. నేనట్లు ప్రసంగించుట కలవడినవాఁడఁ గాకుండుటచే దుష్కరముగఁ దోఁచెను. ఆప్రసంగమున ననేక లోపములుండవచ్చును. కాని దానివలనఁ బెక్కండ్రు సేవకులలోఁ గలిగిన మార్పును మీరు నమ్మఁజాలరు. నాప్రసంగము ముగింపకపూర్వమే వారిలోఁ బదిమంది 1బాష్పపూరితాక్షులై యుండిరి. ప్రభువేమి సేయునను 2 నాకాంక్షను దరచు గోరుచుంటిని. అట్లుగావించుకోలఁది చిరకాలమునుండి నా సేవయందుండినవారి హృదయంబులు కరఁగఁజొచ్చెను. దినదినము నెద్దియో క్రొత్త విషయము బయలువెడలుచునే యున్నది. ఇప్పటికి వర్తక శాలను ప్రభుసమ్మతిని నడుపువిధానములు నేర్పఱచుట పూర్తియైనది. "సహకార సమితులు" పనిసేయు రీతినాకు బొత్తుగాఁ దెలియకుండుటచే నావిషయమును బూర్తిగఁ దెలిసికొనఁ బ్రయత్నించుచుంటిని. బొంబయి, కలకత్తా మున్నగు రాష్ట్రీయ నగరంబులఁగల సహకారామోదక సంఘాధ్యక్షుల చర్యలఁ దెలిసికొనుచుంటిని. వీరి చారిత్రలు నాకు మిక్కిలి సహకారమును జేయఁగలవు నాభృత్యులలో నెట్టి సహకార సమ్మేళనము గావింపవలయునో నిశ్చయించుకొనలేదు నేనింకను క్రైస్తవ విధానంబునఁ బూర్తిగ నలవడలేదు. ఆటుజూడుఁడు" అని శ్రేష్ఠి పలికి—తనబల్లమీఁదనున్న కాకితముల కట్టను దీసెను. "నేనీవిధానమును సిద్ధపఱచితిని. నావ్యాపారమునఁ గ్రీస్తు సంచరించునని నానమ్మకము. ఈ విషయమునఁ దమయభిప్రాయమును దెలుపఁగోరెదను." అని శ్రేష్ఠి వేఁడుకొనెను.

### క్రీస్తు వర్తకము సేయు నెడ శ్రేష్ఠిస్థానము నిట్లాచరించును.

1 ఈ వ్యాపారమునంతను బ్రభువు నామమును మహిమపఱచుటకేగాని ద్రవ్యార్జనయే ప్రధానాంశముగాఁ బనిసేయఁడు.

2 ఇంతార్జించిన 3 ద్రవిణమునెల్లఁ దనదిగా భావింపఁడు. ప్రజాసేవకై వినియోగించును.

3 తన సేవకులనందఱిని దయార్ద్రదృష్టితోఁ గరుణామయాంతఃకరణంబుతోఁ బరీక్షించును. అట్టివారందఱును రక్షణఁ జెందఁదగిన జీవాత్మలని భావించును. వాణిజ్యమువలన ధనము నార్జింపు తలంపునకంటెఁ దనసేవకుల రక్షించుతలంపే మెండై యుండును.

4 ఏ యక్రమకార్యమునుగాని, సందేహాస్పదమైన కార్యమునుగాని సేయఁడు. తనసాటి 4 వణిక్పుత్రుల వంచించి తాను బాగుపడ నెంచఁడు.

5 స్వార్థపరిత్యాగము, పరోపకారమునను నైతిక సూత్రములు వాని వ్యాపారమున 5 నంతర్గాములై వర్తింపఁగలవు.

6 తన సేవకులవిషయమున నేమి తనతోఁ గ్రయవిక్రయముల జరుపు ప్రజల విషయమున నేమి, 6 పూర్వోదాహృత ధర్మసూత్రములఁ జక్కఁగ ననువర్తింపఁ జేయును. 7 వాణిజ్యప్రపంచమున నందఱితోడ నీతఁడిట్లే వర్తించును.

పైనిబంధనలఁ గ్రమ్వేఁడు నెమ్మదిగఁ జదివెను. స్వవిషయమున మతబోధకుఁడుగ

---

1 కన్నీరుతోనిండిన 2 కోర్కెని 3 ధనము. 4 వ్యాపారము సేయువారిని. 5 గూఢముగానిమిడి 6 మున్ను చెప్పిన. 7 వర్తక.

నాచార్యుఁడుగ నుండినఁ గ్రీస్తెట్లు ప్రవర్తించునని తాను రెండురోజులక్రిందట యోజించిన విషయము లాతనికి జ్ఞప్తికి వచ్చెను. అంతయుఁ జదివి యాతురతతో నిరీక్షించుచున్న శ్రేష్ఠివైపునకుఁ గన్నెత్తి కణ్వుఁడు చూడ నాతని వీక్షణ మత్యంతాలోచన 1 సమన్వితమై యుండెను.

కణ్వుఁడు— ఇట్లు వర్తకము నడపినలాభము నార్జింపఁగలనని యే నీనమ్మకమా!

శ్రే— అవును, తెలివిగలిగియు స్వార్థపరాయణులగుటకంటెఁ దెలివిగలిగి పరోపకారపారీణులగు వారికి జయము విశేషముగ లభించునని మీరు తలంపరా? నా వర్తక వ్యాపారమునఁ బనిసేయు వారందఱును నందు లభించు లాభమునఁ బాల్గొనెదమని యెఱింగినచో, వారీ వర్తకాగారమును బ్రేమించి పనిసేయు నెడల, దానం గల్గు ప్రతిఫలము, శ్రద్ధాధిక్యతయు, నల్పవ్యయమును, న్యాయ్యానుసరణమును గలుగవా?

కణ్వుఁడు— నిశ్చయముగా నట్టే లాభించునని తలంచెదను. వర్తకులనెవరునీ ధర్మమును విశ్వసింప రనుకొనెదను. క్రైస్తవాదర్శములతో ధనార్జన సేయని దుష్టప్రపంచములో నెట్లు శ్రమపడెదవో?

శ్రే— అదియే నాయుద్యమమున దుస్సాధ్యముగఁ దోఁచుచున్నది.

కణ్వుఁడు— నీవనువర్తింప నిశ్చయించిన విధానంబునఁ బరపతిసంఘ నిర్మాణముఁగూడ నిమిడియుండెనా?

శ్రే— నేనిప్పటికి నిశ్చయించిన వానిలో నదిగూడఁ జేరియున్నది. నేనిందనుకఁ దమతో వాక్రుచ్చినరీతి నంతర్లాభ్యంశము లింకను నిశ్చితములు కాలేదు. వానినే పరిశీలించుచుంటిని. యేసు వాగ్దానమునందుండిన స్వార్థపరాయణుఁడు కానేరఁడని నా దృఢనిశ్చయము తనకొలువునందుండిన వీరినందఱిని ప్రేమించును. పరస్పర 2 సహాకారతయే తనవ్యాపారమునకుఁ బట్టుకొమ్మయగును. భగవద్రాజ్య ప్రతిష్ఠాపనయే పర్యవసానముగ నెంచును. నేను నట్టి ప్రధానాంగములతోఁ బనిసేయ సమకట్టితిని. అంతర్భాగముల నిర్ణయమునకుఁ గొంత కాలము పట్టును.

కన్నయ్యశ్రేష్ఠితోడి ప్రసంగము ముగించిన కణ్వుఁడు వెడలిపోవుసరికి దైవానుకరణమువలన లోకవ్యాపారము లెంతటి మార్పులను జెందునో గ్రహింపఁగలిగెను. వెడలిపోవునప్పు డందలి యుద్రేకమును గొంత వెంటఁగొని చనెను. శ్రేష్ఠి తన భృత్యుల యెడఁ జూపిన సోదరభావము వలన వాణిజ్య ప్రక్రియయం దద్భుతమైన మార్పు వారద్వయ కాలంబుననే కలిగెను. అప్పుడుఁ బనిచేయుచున్న వారి ముఖవికాసములను నడతను గనిపట్టిన నీమార్పు లే విస్పష్టమగుచున్నది.

కణ్వుఁడు తనపఠనాగారముం జేరి "శ్రేష్ఠి పట్టినపట్టు విడువక కొనసాగించినచో ధర్మపురీ ప్రాంతములయం దితఁడద్భుత మగు ప్రచారకుఁడు కాఁగలఁడు" అని యనుకొనెను. 4 ఏతాదృక్ప్రవర్తనముచే ద్రవ్యహాని కలుఁగఁ జొచ్చినతరి నాతఁడెట్లు నిర్వహించునో? ధర్మపుర్యాలయ సభ్యుల ద్విగుణీకృత సామర్థ్యంబునఁ బురికొల్పుచుండిన పరిశుద్ధాత్మయే వీరినందఱఁ దన తమ కార్యంబులఁ గృతకృత్యులఁ జేయుఁగాతయని కణ్వుఁడు ప్రార్థించెను. అట్టి ప్రార్థన మంతఃకర 5 ణోత్తమభాగంబుల నావరించియుం

1 కూడి. 2 సహాయము. 3 వెల్లడి 4 ఇట్టి .5 పెదవులు.

డేఁగనే తానాదివారమునఁ జేయఁదలఁచిన ప్రసంగమును వ్రాయ దొరకొనెను. సురాపానభవనములవలనఁ గలుగుచున్న ఘోరకృత్యంబుల వెల్లడించుటయే యిందుఁ బ్రధానాంశము. ఇంతకుముందెపుడు నాతఁడిట్లు మద్యపాన దూషణ గావింపలేదు. తన ప్రసంగవాక్యముల వలన నర్థములు బయలు వెడలఁగలవని వానికిఁ దెలియును. ఫలాఫలములసరకుసేయక యాతఁడు వ్రాయఁజొచ్చెను. వ్యాసరచనయందుఁ బ్రతివాక్యమును వ్రాయ నామోదించునా లేదా యనునదియే ప్రధానవిషయముగా గమనించెను. మధ్య నొకప్పుడు సాష్టాంగపడి దైవమును బ్రార్థించెను. అట్టి ప్రార్థనవలన వానికట్టి బలము కలిగినదియు 1 స్వాత్మైకవేద్యము. దైవానుకరణాదర్శ స్వీకారమునకుఁ బూర్వమెప్పుడైన వ్యాసరచన సేయుతరి నాతఁడు భగవత్సహాయమును గోరెనా ? తన యాజకత్వమునుగూర్చి విచారించినకొలఁది దైవసహాయమును బడయునది విధ్యుక్తమును నెరవేర్పఁజాలనని తెలిసికొనుచుండెను. అభ్యాసవశమునఁ దానుపన్యసింపఁగలననికాని యట్టి కృత్రిమోపన్యాసములవలనఁ బ్రజారక్షణము ఫలించుననిగాని వెఱ్ఱిభ్రమల నందుట మానివైచెను. ప్రభువేమిసేయుమనునాకాంక్షయే వాని మనోవ్యాపారమునం దెల్లెడలం 2 బరీతమై పనిసేయుచుండెను.

సోమనాథశాస్త్రియు నాతని యిల్లాలును మున్నెన్నఁడును వీక్షింపని మహాద్భుతములు పంచమవాటికలో శనివారము రాత్రి 3 ప్రభూతములైనవి. సుగుణవతి శ్రావ్యగానాకర్ణనాకర్షణంబున నొకనాటికంటె మఱియొకనాఁడు శ్రోతలు వెల్లివిరియుచుండిరి. పగలాదరినిబోవు పాంథులీభక్తసమావేశముఁ గూర్చి విశేషముగ వినఁగలరు. శనివారము రాత్రికి సురాపానము, అప్రమాణముల నాచరించుట అపరిశుద్ధత మున్నగు దుర్మార్గములు మిక్కిలి కొఱవడ నారంభించినవని చెప్పవీలులేదు. మాలగూడెము బాగుపడ నారంభించెననిగాని, సంగీతము దుష్టుల నాకర్షించెననిగాని మార్పు ప్రజలలోఁ బ్రారంభించెననిగాని తలంచుట కవకాశము కలుగలేదు. కాని పంచమవాటిక నావరించిన సైతాను శక్తి యగోచరంబుగ నించించుక హరింపఁజొచ్చెను.

సోమనాథశర్మ గాత్రము 4 నీటుగనై ప్రకాశించుటచే శనివారము నాఁడాతఁడు ప్రసంగించెను. అతని సుస్వరము వలయునంతయే వినియోగపరుపఁ దగినదై యుండుటచే సభ్యులు నిశ్శబ్దముగ నుండక తీరినది కాదు. సందడిచేసిన వినఁజాలరు. క్రమక్రమముగ వారందఱితఁడు తనకాలమును బలమును దమకై వినియోగించుచుఁ గొన్ని వారములనుండి ప్రభువగు నేసు క్రీస్తును దమకుఁ దెలుపుటకై ప్రయత్నించుచుండెనని గ్రహించిరి. తమయెడఁగల 5 యవ్యాజప్రేమచే నిట్లొనర్చుచుండెననియు నెఱింగిరి. ధర్మకార్యాలయమున నాగరికులగు సాంఘికు లెట్టి నిశ్శబ్దముగ నుండుదురో నేడిచ్చటి మొరటు మానిసులంత నిశ్శబ్దముగ నుండి వినఁదొడంగిరి. దేరాచుట్టును సమ్మర్దము హెచ్చుచుండెను. సురాగారంబులు నిర్మానుష్యంబులగుచుండెను. పరిశుద్ధాత్మ వారిపైఁ బ్రసరించుచుండెను. శర్మ జన్మసాఫల్యమగు కార్యము ఫలోన్ముఖమైనదని గ్రహించెను.

సుగుణవతి గానామృత మధురిమ కోటిగుణితము కాఁజొచ్చెనని సుమతియు నృసింహాచారియుఁ దలంచిరి. నేటిరాత్రి వారిందఱుఁ గలిసియే సభాస్థానమున కరుదెంచిరి. వైద్యభూషణుఁడు నావారమున విశేషకాలము గూడెమునందలి బీదరోగుల

1 తనకే తెలియును 2 వ్యాపించి, 3 పుట్టినవి. 4 బాగుపడి 5 కారణములేని

యుచితముగ వైద్యముచేసెను. ఆతఁడు నవ్వు డచ్చటనేయుండెను. సుమతి హార్మోని యముకడఁ గూర్చుండెను. నృసింహాకవి యెదురుగఁ గూర్చుండి సుగుణవతిం దదేక దృష్టితోఁ దిలకించుచుండెను. సుగుణవతి పాడఁదొడంగ గూడెమెల్ల విరుగఁబడి విశే షాసక్తితో నిశ్చలులై వినుచుండెను.

ఆ. వె. వాత శూన్యమైన పాపిని నాకయి । శుద్ధ రక్త ధారలిద్ధరిత్రిఁ
బరపి నన్ను బిలుచు ప్రాణాధిక ప్రభూ! । వచ్చుచుంటినోయి పరమపురుష!”

ఇట్లని సుగుణవతి మధుర 1 మధురాలాపంబుల గానామృతధారల వర్షాపాతం బుగ జనసంకీర్ణప్రదేశంబునఁ గురిపించెను. సోమనాథశర్మ 2 యధరస్పందము గావింప లేదు. ఊర్ధ్వబాహుఁడై “పాపులారా! రండు” అని కరసంజ్ఞఁ గావించెను. అంత గుడా రముయొక్క యిరుపార్శ్వములనుండియు 3 నశ్రుధారాపరీతనేత్రములు గలవారును, పా పవినిర్భిన్న హృదయములు గలవారునగు స్త్రీపురుషులనేకు లుపన్యాసకుని యున్న తాసనముం దరిసిరి. వెలుపలి వీధినుండి చొరబడివచ్చి యొక స్త్రీ హార్మోనియము సమీ పమునఁ గూర్చుండెను. సమీపమునునుండిన సుమతి యామెమోముఁ దిలకింపఁ బ్రభువగు నేను పాపుల కెంతటి సహాయకారిరో సుమతికి జన్మాంతరము నందిన 4 ట్లుత్పన్న మయ్యెను. సుమతి 5 యాసనోద్ధితయై యామెం గాంచి 6 దరిసి యాదరించి తనకరంబున నామె హస్తముం బట్టుకొనెను సుమతి కరస్పర్శంబున నాతరుణియుద్రిక్త మానసయై కన్నీరు మున్నీరై పాప నొక్కి పెట్టున విలపించుచు సాష్టాంగపడి 7 యుత్తమాంగం బును బల్లపై నునిచి సుమతి 8 నవలంబించి నిశ్చలయైయుండెను సుమతియు నింపుకసంత యించి పిదప నామెదరిని మోకారించెను. వారిరువురి 9 శీర్షంబులు నేకస్థానమును జేరి ప్రార్థనమునం దైక్యము జెందెను.

ఇట్లు నాప్రదేశమునం దెల్లెడలఁ బెక్కండ్రు సాగిలఁబడి తమ పాపంబులఁ దలంచి పశ్చాత్తాప పడుచు విలపించుచుండ వెలుపలనుండి యొకపురుషుఁడు అచ్చటుఁ జేరిన సామాన్యులవలెఁగాక సుత్కృష్ట వస్త్రాభరణధారి లోనికిఁ ద్రోసికొనివచ్చి మున్ను కబ్బుఁ దుపన్యసించుచుండ నల్లరి చేసిన త్రాగుబోతు సరసను మోకాళ్ళ భూమిపై నూని నమ్రుఁడాయెను. ఇంకను నెమ్మదిగఁ బాడుచుండిన సుగుణవతి సమీ పముననే వీరిరువురు 10 నమిత శీర్షులై యుండిరి.

ఆమె యించుక కన్నులెత్తిచూచి యట్లు సురాపాయియై ప్రార్థించుచున్న వాఁడు భానుమంతుఁడని తెలిసికొని నివ్వెరఁజెందెను. ఒక్కక్షణకాల మామె కంఠ స్వరము తడబడెను. పిమ్మట నిట్లు పాడెను.

ఉ. ఎంతటి దుస్థితిన్మునిఁగి యెదరిఁజేరిన నన్గ్రహించి ను
స్వాంతములో విశుద్ధుని మహామహిమాఢ్యునిఁ జేసి, పాప మ
త్యంతముఁ బాపి కాచెదు దయామయత న్నిను నమ్మినంత నేఁ
జింతిలనేల నీదరిని జేరితి దేవుని 11 మేష 12 శాబమా!

ఈ కీర్తన పాడునప్పుడా స్వరము పరమాత్మని స్వరము భంగి నాప్రాంతము నంతయు నిండి దిగంతము దనుక యేసుని రక్షణప్రాభవము నుద్ఘోషించెను.

ఇది చతుర్థాధ్యాయము.

---

1 తియ్యనిపలుకులచే. 2 పెదవులుగదపు. 3 కన్నీటిచే. 4 సంభ్రమము. 5. పీఠమునుండిలేచి 6 సమీపించి. 7 శిరస్సును. 8 పట్టుకొని. 9 తలలు. 10 వంచబడిన. 11 మేక. 12 పిల్ల.

శ్రీ

# దైవానుకరణము.

## పంచమాధ్యాయము.

" నా సేవకుఁడు నన్ను వెంబడించును గాక ! "

చతుర్థాధ్యాయాంతమున వర్ణించిన సమావేశము రాత్రి రెండుజాములకు ముగిసినది. నీచసంఘమునుండి క్రొత్తగ మార్పునుజెంది ప్రభుసేవాతత్పరులైనవా రుపన్యాసాంతమున వెడలిపోఁజాలక శరీర వినాశనమునుండి కాపాడువాని నాశ్రయించురీతిని సోమనాథశర్మ నావరించుకొనియుండ వారితో ముచ్చటించుచు 1నుషఃకాలము దనుక నచ్చటనే నిలిచియుండెను. ఇట్లు మార్పునుజెంది శర్మను విడువఁజాలక నిలిచియున్న వారిలో భానుమంతుఁ డొకఁడు.

సుమతియు హేమమానుయుఁ గలిసి రాత్రి పదునొకండు గంటలవేళ తమతమ నెలవులకు వెడలిపోయిరి. నృసింహకవియు, సుగుణవతియు వారితోడనే సుమతి యింటిదనుక వెళ్ళిరి. వైద్యభూషణుఁడు మిగిలినవారితోఁ దనయింటిదనుక వచ్చెను.

అప్పటికి రాత్రి పదునొకండుగంటలు దాటినది. రాత్రిరెండు 2 యామముల కాలమున నృసింహకవి తనగదిలో వ్రాఁతబల్లయొద్దఁ గూర్చుండి యరగంటకాలము బల్లపైనుండిన కాగితములను వివర్ణవదనుఁడై చూచుచుండెను.

అతఁడు సుగుణవతితోఁ దనకామెయెడఁగల యత్యంతానురాగమును వెల్లడించెను. ఆమె తానాతని ప్రేమించితినని మారుపలుకదాయెను. నేటిరాత్రి తనయనురాగము నామెకు నివేదించుటకుఁగల ప్రబల ప్రోత్సాహమేమియో యోజింప దుర్ఘటము. ఫలితార్థమెట్లు పరిణమించునో విచారింపకయే తనమనోద్రేకమును నిగ్రహింపనేరక వెలువరించియుండును. సుగుణవతి తనప్రేమను దిరస్కరింపదని యాతనికి గట్టినమ్మకము కలిగియుండుటచే సాహసించెను. తాను ప్రప్రథమమున నామెతో ముచ్చటించునప్పు డాబిడ మనోభావమును దానుగ్రహించినరీతిని జ్ఞాపకముజేసికొనుచుఁ గూర్చుండెను.

ఆమె సౌందర్యాతిశయంబులునుఁ మనోద్రఢిమయు నేఁడాతని మనఃఫలకము నాక్రమించినంత విరివిగ మున్నెన్నఁడు నాకర్షింపలేదు. ఆమె గానము సేయునప్పు డాతఁడామె సుస్వరమునే వినుచుండెను గాని, 3 ధ్వన్యంతర మాతని 4 శ్రవణ వివరంబులఁ జొరదయ్యెను. గుడారమంతయు మనుష్యులవివలె 5 నరశిరస్సంకీర్ణమై యుండెను. తన్నన్నివైపుల జను లావరించియుండిరని యాతఁ డెఱుంగును. కాని వారి నాతఁడు గుర్తింపనేలేదు. ఆమెతో మాటలాడకుండుట కాతఁ డసమర్థుఁడయ్యెను. ఆమె యొంటరిపాటునఁ దారసించినతోడనే ముచ్చటింప సంసిద్ధుఁడై యుండెను.

ముచ్చటించినవెనుక తానామె యభిప్రాయమును గ్రహింపనేరకుండెనో లేక యసమయమున ముచ్చటించితినో యని చింతించెను. ఆమె ప్రవర్తనలో స్వకీయాను

---

1. ఉదయము, 2. జాముల, 3. మారుధ్వని, 4. చెవి. 5. మనుష్యులతలలచేఁగూడి,

రాగ ప్రకటన గావించినది నృసింహకవి కృతమగు నవలకుఁ గథానాయిక సుగుణవతియే యని యామె యెఱింగిన విషయమే. కథానాయకుఁడు నాతఁడే. నవలయందు వారన్యోన్యమును ప్రేమించిరి. అట్టి గ్రంథ ప్రకటనమున కామె హర్షించి యూరకుండెను. ఈవిషయమును బయలుమాత్ర మెఱుంగరు. ఆనవలయందలి పాత్రములును, వాని గుణవర్ణనమును సూక్ష్మదృష్టిని సుగుణవతి పరికింప నేతద్గ్రంథ ప్రథమ పఠనముననే యామె నృసింహకవికిఁ దనయెడఁగల యనురాగమును దెలిసికొనియు నివారింపదాయెను. ఈగ్రంథమును వ్రాసి యొకవత్సరము గతించినది.

నేటిరాత్రి నృసింహకవి సంవత్సరముక్రిందట జరిగిన యాయంశముల నన్నిటిని బూసగ్రుచ్చినట్లు జ్ఞాపకమునకుఁ దెచ్చుకొనెను. కొలఁదికాలము క్రిందట సుగుణవతియు భానుమంతుఁడును [1]విహారారామప్రాంతమునఁ గలిసిపోవుచుండ వారికిని జనకును జరిగిన సంభాషణమునుగూడ స్మరించెను. అప్పుడు భానుమంతుఁ డామెతో నేమి సంభాషించుచుండెనో యని యాశ్చర్యమును జెందెను.

నృసింహకవికిని సుగుణవతికిని నేటిరాత్రి జరిగిన సంభాషణము నీ క్రింద విమర్శించెదను—

నృసింహ—సుగుణవతీ ! నిన్ను నేనెంతదృఢముగఁ బ్రేమించియుంటినో నేటిరాత్రి దనుకఁ బూర్తిగ గ్రహింపఁజాలనైతిని. నాయవస్థను నాయాకృతియే నీకు వెల్లడించుచుండ నామనోభావమును నిన్నుండి మరుగుపరుప నేల ప్రయత్నించవలెను? నిన్ను నాప్రాణసమానను గాఁ బ్రేమించుచుంటినని నీ వెఱుంగుదువు. నీయెడల నాకుఁ గల ప్రేమను దాచఁదలంచియు నసమర్థుండ నగుచుంటిని.

ఈ ప్రేమ ప్రకటనమును వినినతోడనే తనకరంబుననున్న యామె హస్తము కంపమునందుటయే యామె తిరస్కారమున కాతనికిఁ బ్రథమసూచన. అతఁడు ముచ్చటించుకాలమున నామె తనమోము నటునిటుఁ ద్రిప్పక, నిర్మలత నాపాదించి యాతనిఁ బూర్తిగ మాటలాడనిచ్చెను. అతని ప్రసంగము ముగిసినతోడనే యామె ముందుమార్గముపైఁ దనదృష్టిని నిలిపి నిర్మలమైనట్టియు, నుద్రేక శూన్యమైనట్టియు, వాక్యములతోఁ బ్రత్యుత్తర మిచ్చెను.

సుగుణవతి—నాతో నీవిషయము నిప్పుడేల ముచ్చటింప సమకట్టితివి ? నేటిరాత్రి సభాస్థానంబున జరిగిన విషయములను జూచి—యీ ప్రసంగమును భరింపఁజాలను.

“ ఏల—ఏమనుచుంటివి ! ఏమనుచుంటివి ? అని కవియూరకుండెను.

సుగుణవతి యాతని చేతినుండి తనచేయి లాగుకొనెను. కాని యింకను వాని సరసనే నడుచుచుండెను. గొప్పలాభమును బొంద నిరీక్షించువానికిఁ దత్తుల్య వైపరీత్యము తారసింపనున్నదని తెలిసిన నెంత దుఃఖము కలుగునో యాతఁడంత దుఃఖించి యిట్లనెను—

“ సుగుణవతీ ! నీవు నన్ను బ్రేమింపవా ? నాకు నీయెడలఁ గల ప్రేమ ప్రాణాస్పదమగు సత్కృప్తఫలముగాదా ! ”

పిదప వారు నిశ్శబ్దముగఁ గొంతదూర మేగుసరికి మార్గపార్శ్వస్థిత [2]కావదీపి

---

1. ఉద్యానవనము. 2, గాజు,

కను దాటిరి. ఆప్రకాశమునఁ జూడ నామె మోము తెల్లవడి మనోహరంబుగ నుండెను. ఆమె ముంజేయిం బట్టుకొన నతఁడు ప్రయత్నించెను. అతని దప్పించుకొని యామె యెడముగ నడువఁ జొచ్చెను.

"లేదు. ఒకానొకప్పుడట్టి కాలము గలిగెను—అందుకు నేనుత్తరవాదినిగాను. నేఁటి రాత్రి నీవీవిషయమును బ్రసంగింపక పోవలసినది." అని సుగుణవతి పలికెను.

ఈ వాక్యమున కాతఁడు తన ప్రశ్నకుత్తరమును గనిపెట్టెను. దుఃఖావేశ మాతనికిఁ బరమోద్రేకమును గలిగించెను. ఆమెయెడ నాతనికిఁగల ప్రేమాతిశయ మానందవంతమగు సమ్మతవాక్యమునే ప్రార్థింపఁగలదు. కావునఁ దిరస్కృతుఁడై యాతఁడామెతోఁ దన యవస్థం దెలుపుకొన నొల్లఁడాయెను.

"కొంతకాలము గతించిన పిదప—నేను నీప్రేమకుఁ బాత్రుఁడనైనప్పుడు సమ్మతింతువా?" అని యవ్యక్తముగ నాతఁడు హీనస్వరంబునఁ బలికెను. ఆమె వినమి నభినయించి తన యిల్లుఁజేరుటచేఁ బ్రసంగమున కంతరాయమును గల్పించెను. ఆమె లోనికి వెడలిపోయెను. కాని సెలవుఁ గైకొనలేదు.

అతఁడొంటిగనుండి యీ సంభాషణమునంతను స్మరించి దానక్రమముగ నకాలమునఁ బ్రసంగమును వెళ్ళబుచ్చితి ననుకొనెను. ఆమెకు మున్నెన్నఁడును దారసింపని విపరీత సమావేశము లంతకుమున్నె యారాత్రి పంచవటికయందుఁ దటస్థించుటచేఁ గలిగిన మనోద్రేకము నాతఁడు గమనింపక ప్రసంగించెను. కాని యామె తిరస్కారభావమును వెల్లడించుటకుఁగల మనోభావము నాతఁడింకను గ్రహింపనేరఁడయ్యెను. ధర్మపుగ్ర్యాలయ శిఖరమునఁగల (కాలయంత్రము) గడియార మొంటిగంటం గొట్టెను గాని కవియింకను స్వకీయ మానసాందోళన నిమగ్నుండై తన గదిలో వ్రాఁత బల్లదరిం గూర్చుండియుండి యసంపూర్ణమగు తన నవలం దిలకించుచుండెను.

సుగుణవతి తనవాసగృహముం జేరి తానీస్వల్పకాలమునఁ గాంచిన వివిధవిషయములఁ దలపోయుచుండెను. తానెప్పుడయినఁ గవిం బ్రేమించెనా! అగును. లేదు— తన యీ తిరస్కృతిచేఁ దానీజన్మలో ననుభవింపఁదగిన సౌఖ్యమంతయు వమ్మయ్యెనని యొక క్షణము తలంచెను. ఇంకొకక్షణమునఁ దిరస్కారకథనముఁ దన విధ్యుక్తమును నెరవేర్చుకొంటినని శాంతింగాంచును. ఈ పరితాప మామె హృదయమును గ్రుంగివైచెను. గుడారమున దౌర్భాగ్యులందఱుఁ దనగానకళాకౌశలముచే స్వాధీనులగుటయు, నాకస్మికాద్భుతములు వెల్లివిరియు పరిశుద్ధాత్మయొక్క [1] యావిర్భావము నామెను భూకంపమువలెఁ జలింపఁజేసెను. నవీనానుభవమగుటచే నస్వస్థచిత్తయై యుండెను. ఆమె మనంబిట్లు [2] సంక్షుభితమై నిజస్థానమును జేరని తరుణమున నృసింహాకవి యామెం బిలిచి తన ప్రేమానుబంధమును వెల్లడించి యామె యామోదముం బడయఁ బ్రయత్నింపఁ దత్తద్వాక్యంబు లామెకసహ్యములుగఁ దోఁచెను. క్షణము క్రిందట నాతఁడు గూడఁ జూచి దైవవిధానంబుల నాతఁ డవమానించినట్లు తలంచెను. సభాస్థలమున బహిరంగముగఁ దమ పాపముల నొప్పుకొని మారుమనస్సు నొందినవారల నుండి తలంపును మరలించుట తాత్కాలికమున నవ్యక్తమని యామెకుఁ దోఁచెను. ఆమె రాత్రియెల్ల మిగుల శ్రమపడి కోరాను నిండియుండిన పాపుల హృదయముల

1. ఉత్పత్తి. 2. క్షోభపెట్టఁబడినది,

నాకర్షింపఁ దగేకాయత్త చిత్తముతో స్వకీయ గానకళాకౌశలమును వివిధవిధంబుల శరపరంపరాహతంబుగ గుప్పుచుండ నృసింహాకవి తానామెను ప్రేమించుటకే యాగానమును గ్రహించెను. ఆ విషయమామెకు విషాదము. నాతని యెడఁ 1 బరాఙ్ముఖతను గూడఁ గలిగించెను. తానట్లు తలంచుటకుఁ గారణమును జెప్ప నేరదు గాని నేటిరాత్రి తన్నాతఁడట్లు వరించితినని చెప్పకుండిన వానియెడఁ బూర్వానుబంధము విడఁబాయకపోవును. ఆ పూర్వానుబంధమన నెట్టిది? ఆతని యెడ నామె కెట్టి ప్రీతి కలదు? ఈ తిరస్కృతిచే నామె తప్పొనర్చెనా? ఆమె పుస్తకముల బీరువాయొద్దకేగి నృసింహాకవి తనకిచ్చిన నవలందీసెను. తా నిదివరలోఁ జదువుచు చదువుచుండిన కొన్ని భాగములం దిలకింప నామె ముఖము రక్తవర్ణమును దాల్చెను. తన్నుద్దేశించి యాతఁడా వాక్యరచనఁ గావించెనని యామె యెఱుంగును. వానిం దిరిగి పఠించెను. అవియామె నాకర్షింప నసమర్థములయ్యెను. పుస్తకమును మూసి బల్లపైనుంచెను. క్రమక్రమముగ నామె యంతఃకరణము కవితోఁ జేసిన సంభాషణమునుండి మరలి దేరాలో జరిగినవిషయములపై వ్యాప్తము కాఁజొచ్చెను. ఆ స్త్రీపురుషుల ముఖంబుల శుద్ధాత్మానుసంధానము నూతనముగ వ్యక్తమగుచుండెను. మనుష్యుని జీవితమెంత చిత్రమైనది! త్రాగుబోతులు, వ్యభిచారులు, పరమనీచులు నగు వారి వీక్షణ ప్రసారంబుల సంపూర్ణ వినిమయము 2 సుప్రభాతమగుచున్నది. ప్రభుసామీప్య సారూప్యానుసంధానమునకై ప్రణతులైరి. ఆహా లోకమున దైవాత్మసమ్మిళితమై యున్నదనుట కిదియే ప్రబలనిదర్శనము. కేవల దౌర్భాగ్యావస్థం దొప్పదోగు నాపగమనీచుని సరసఁ బ్రార్థించు భానుమంతుఁడు, నిర్గమనమునకుఁ బూర్వము తనసోదరుని కంఠాశ్లేషము గావించి ప్రజల దుస్థితి గాంచి విలపించు సుమతి సమీపమున మోకాళ్లు భూమిపైనాని నమ్రుఁడైయున్న సోమనాథశర్మ మున్నగువారామెకుఁ గన్నులఁగట్టినట్లెదుటఁ గాన్పించుచుండిరి. ఘనులందఱిచే నీచాతినీచప్రదేశమని విడువఁబడిన యామాలగూడెమిప్పుడు పరిశుద్ధాత్మచే స్పృశింపఁబడి యెంతటి ఘనకార్యములకు స్థానమగుచున్నదో కాంచినసుగుణవతికి మనస్సున నివ్వెరజనించి విడ్డూరమును గలిగించెను. అవివిషయములన్నియు నిప్పుడామె గదియందిమిడి యున్నట్లు భ్రమగొల్పుచుండెను.

"లేదులేదు. అట్టిసమయమున నన్ను బలాత్కరించుట కాతని కధికారము లేదు. మా మనంబుల నాకర్షించిన ప్రదేశముమీఁది గౌరవప్రపత్తియైనను వాని నభ్యంతర పరుపలేదు. నేనతనిని భర్తృభావమునఁ బ్రేమించుటలేదు. అదినిశ్చయము. నాజీవితము నతనికి ధారవోయునంతగా వానిఁ బ్రేమించుట లేదు." అని సుగుణవతి తనలో ననుకొనెను.

ఇంతలో గూడెమున జరిగిన విషయములు మరలమరల నామె మనఃఫలకము నావరించి తదన్యచింతలఁ బాఱఁదరుముచుండెను. సర్వాంగ సుందరుఁడును, యౌవన విద్యా 3 సమన్వితుండును, బలిష్ఠుఁడు నగుపురుషుఁడు సమీపించి తన్నుఁ బ్రేమించుచుంటినని తనమనోభావమును వెల్లడించినను సరకుసేయనంతటి మనోద్రఢిమ నీపరిశుద్ధాత్మప్రయుక్త పంచమవాటీ విషయంబు లామెకుఁ గలిగించెను.

---

1. పెడమోము పెట్టుట. 2. ఉదయించు. 3. కూడిన.

గ్రామవాసులకు మున్నలవడిన సహజ దినచర్యలకద్భుత వినిమయమును గాంచువారగుచు ధర్మపురీవాసు లాదిత్యవాసరోషఃకాలంబున మేల్కాంచిరి. సుమంతుఁడు తనపదవిని మానుకొనుటవలనఁ దన్నాగరులకే గాక తత్ప్రాంత ప్రజలకందఱికిని నత్యాశ్చర్యమును గలిగించెను. పురూరవుఁడు తనదైనిక పత్రికా విధానంబు ననుదినంబును గావించుచుండిన మార్పులెల్లెడల ననేకవిధములగు వాదప్రతివాదంబులు గలిగించుచుండెను. ఏసాంఘికాంశంబులు నింతటి చలనమును గలిగింపలేదు. సుగుణవతి తన గానామృతమును మాలగూడెమున వెదజల్లుచుండుటయుఁ బలువురకాశ్చర్యమును గలిగించి యామె స్నేహితులే యాబిడ మనోభిప్రాయమును గ్రహింపనేరని వారగునట్లొనరించెను. సుమతియొక్క ప్రవర్తనమును, ప్రతిరాత్రియు నామె మాలగూడెమును దర్శించుచుండుటయు, సంపన్నులు నాగరికులు నగువారితో నాయమ సాంగత్యము సేయకుండుటయుఁ బలువిధంబులగు లోకాపవాదముల కాస్పదము లయ్యెను. పట్టణంబునఁ బ్రసిద్ధిఁ గాంచిన వీరందఱి భిన్న ప్రవర్తనములకుఁ దోడు కార్యాలయముల వర్తకశాలలు, సాంఘిక సమావేశముల ననేకములగు మార్పులు కలుగుచుండెను. ధర్మపుర్యాలయ సభ్యులలో నూర్గురు "దైవానుకరణ ప్రతిజ్ఞం" గావించిరి. అట్టిప్రతిజ్ఞా ఫలంబుగ మున్నెన్నఁడు గనివిని యెఱుంగని విషయముల నేకములు తటస్థించుచున్నవి. పట్టణమునం దెచ్చటఁ జూచిన నీవిషయములే చెప్పుకొనఁ బడుచుండెను. దీనికన్నిటికిని 1 మకుటప్రాయముగా గూడెమున జరిపినమత వ్యాపకోపన్యాస భగవన్నామ సంకీర్తనంబులచే నచ్చటి నీచులలో నేఁబదిమంది మారుమనస్సును జెందుటయు, నందును పెద్దపెద్దలలోఁ దిరుగుచుండు నా సుమంతుఁడుగూడ మతావలంబకుఁ డగుటయుఁ గూడఁ దటస్థించెను.

ఇన్ని విధములగు మార్పులచేఁ బ్రజాంతఃకరణంబులు కలఁతఁ జెంది యుండుటచే నేఁటియాదివారపుసేవ కరుదెంచిన వారెంతటి సత్యకథనమునైనఁ దీవ్రముగా నాకర్షింప సంసిద్ధులై యుండిరనుటలో వింతయేమి యుండును?

యేసుని దినచర్యయం దవలంబించు విధానము నుద్బోధించినది మొదలు మతాధికారుఁడగు కణ్వునియందుఁ గలిగిన మార్పు విశేషాశ్చర్యమును గలిగించుచుండెను. నాటక పరిభాషతో నాతఁడు పూర్వమిచ్చు నుపన్యాసములు వారికిప్పుడు రుచింపవు. తృప్తివంతమై నిర్మలమగు నాతని సుందర గాత్రంబులను ముఖారవిందంబు నుపన్యాసవేదిక 2 నధిరోహించినప్పుడు పూర్వము గాన్పించు విధానమంతయు మారి నూతన పద్ధతి నవలంబించెను. వానివ్యాసమే దైవవాక్యముగ మారెను. అతఁడిప్పుడు కాగితమును జూచి చదువఁడు. తనహృదంతరమునుండి వెలువడు ప్రజానురాగము, భూతదయ, నమ్రత, స్వామికార్యైక తత్పరత, మున్నగు సత్సంప్రదాయములచే నాతఁడిప్పుడు మూర్తీభవించిన భగవద్వాక్యమోయనఁ దేజరిల్లుచుండెను. ప్రజలు మున్నెన్నఁడును వినని యుత్కృష్ట ప్రార్థనలఁ గావించుచుండెను. అట్టి ప్రార్థనలయందుఁ బరవశతచే నడుమనడుమఁ 3 బ్రభిన్నములగుచుండుటయు, వ్యాకరణాది భాషా నియమముల నతిక్రమించుటయుఁ గూడఁ దటస్థించుచుండెను. మున్నెన్నఁడు కణ్వుఁడిట్టి భాషానియమ భంగకరమగు నంతటి మైమరపుతోఁ బ్రార్థించెను? ఈపన్యాసములయందెట్లో ప్రార్థనల

1 కిరీటం. 2. ఎక్కినపుడు. 3. చెడుట.

యందుఁగూడ నట్టి యున్నతోత్కృష్ట భాషా ప్రయోగమునఁ గణ్యుఁడు ప్రసిద్ధిఁ గాంచినవాఁడు. ఇప్పుడీనూతనాదర్శంబున నట్టి కృత్రిమ ప్రవర్తనము నసహ్యముగ నాతఁడు భావించెను. ఆతఁడిప్పుడు ప్రార్థించునెడ నీవిషయములు స్మరణకు రావు. తనప్రజలకుఁగల లోపాలోపములఁ, కష్టసుఖముల వెల్లడించు తీవ్రసంకల్పముచే భాషా ప్రయుక్త దోషంబుల గమనించుటలేదు. ఆతఁడిప్పుడు ప్రార్థించురీతిని మున్నెన్నఁడును, గావింపలేదని నిశ్చయముగఁ జెప్పనగును.

కాలానుగతికముగను, శ్రోతల స్థితిగతుల ననుసరించియు, మతవిషయికోపన్యాసము లప్పుడప్పుడు కడుంగడుఁ బ్రోత్సాహజనకంబులగుట కలదు. వాఙ్నైపుణివలనను, పదముల మార్పువలన నట్టియవస్థలు కలుగవు. నేటియుదయమునఁ గణ్యుఁడు 1 మద్యశాలల నిరసించునప్పుడట్టి యుత్కృష్టావస్థ 2 యాపతిల్లెను. గూడెమునంగల కల్లంగడుల దుస్స్థితి యెల్లరకు విశదమే కావున నూతన వాక్సంపుటి లభింపనేరదు. క్రొత్తవిషయములును లేవు. వ్యావహారిక రాజ్యాంగ విషయములఁ బ్రాగుచుండుటవలనఁగలిగిన నష్టములఁ గణ్యుఁడు వివరింప నసమర్థుఁడు. పానమును నిరసించు సంఘసంస్కర్తలు పలుసారు లుద్ఘోషించు విషయములకంటె విశేషముల నీతండేమి చెప్పఁగలఁడు? గతవారమున నా ప్రాంతముల జరిగిన మహాద్భుత చర్యలు, మున్నెన్నఁడు నీవిషయమును ముచ్చటింపని గణ్యుఁ డుపన్యసించుటయు ననునీ విషయ ద్వయమే యీ యుద్బోధమున కాధిక్యత నలవడఁజేసెను. తన్మతాధిపత్యము నాతఁడు వహించియుండిన గత దశ వర్షముల నొక్కసారియైన నీసురాగారము లనర్థదాయకములని నుడివియుండలేదు. బీదవాండ్రకే కాక వ్యవహారికులకును, ధనాఢ్యులకును, మతసంఘమునకును బాధకరమని యెన్నఁడు నీతఁ డుపన్యసింపలేదు. ఇప్పుడీతండు క్రైస్తవాదర్శమును స్వానుభవమునందుంచుకొని మనస్ఫూర్తిగ నిరసించెను. వ్యాసాంతమున గూడెమునం దారంభించిన మతవ్యాపక కార్యంబునఁ దోడ్పడుఁడని సాంఘికుల వేఁడుకొనెను. పురపారిశుద్ధ్యసాంఘికుల యెన్నికలు త్వరలో రానైయున్నవి. ఆయెన్నికలలోఁ బానశాలల యామోద తిరస్కారము లుచ్చరింపఁబడును. పాపమునుండి విముక్తులము కావలయునని యిప్పుడిప్పుడే సంకల్పము లుజ్జీవములగుచుండిన పాపమానవుల దుస్థితి నెట్లు దొలంపవలెను? వారియిరుగుపొరుగు 4 వాతావరణస్థితి వారిస్థితి నెట్లుమార్చునో యెవరు చెప్పఁగలరు? క్రైస్తవులును, వర్తకులును, వ్యవహారస్థులును, నాగరికులును, అవమాన లజ్జాకరములు, నరహత్యాది దుష్కార్యకరములునగు సురాపాన శాలల నెలకొలుప నధికృతి నొసంగుఁడని చెప్పుట కాధారమేమి కలదు? ఇట్టిస్థలముల రూపుమాపుటకై పోరాడి, యెన్నికలలో వీనితిరస్కరించుటకు సంసిద్ధులైనవారినే సభాసదులుగ నెన్నుకొని నీచస్థానములఁ జక్కపఱచి పురపారిశుద్ధ్యతను నెలకొల్పుటయేగదా క్రైస్తవులకుఁ గర్తవ్యము! సాంఘిక, రాజకీయార్థికాధికారులును పురపారిశుద్ధ్యసంఘాధికారులును గూడఁ గ్రైస్తవవైరులై విరోధించుచుండఁ గొలఁదిమంది మతప్రచారకుల ప్రార్థనలే పతితులలో నెంతటిమార్పును గలిగించుచున్నవి? క్రీస్తు తనసేవకుల మూలమున నీకార్యమును నిర్వహింపనేరఁడా? ఆతఁడీ విషయమున శ్రమపడి తనసిల్వను మోయ సంసిద్ధుఁడు కాడని యేక్రైస్తవుఁడు చెప్పఁగలఁడు? క్రీస్తునను సరింపఁ బ్రయత్నించి ధర్మపుర్యా

1. కల్లుపాకలు. 2. ప్రాప్తించెను. 3. పుట్టుచుండిన. 4. గాలిగలచోట్లస్థితి.

లయ సభ్యులలోఁ నెందఱింతదనుక నెప్పుడు శ్రమల పాలైరి! క్రీస్తుని శిష్యత్వము, ఆచారానుసరణమును, పారంపర్యమును, స్వసౌకర్యానుసంధానమును గాఁగలదా ? అట్లయిన శ్రమల నోర్చుకొను టెచ్చట?

ఉపన్యాసమునందీభాగమును దఱియునప్పటికి తానుద్దేశించిన కంటె సుత్కృష్టముగ నుండెను. ఇప్పుడే ధర్మపురార్యాలయంబున నెల్లరు శుద్ధాత్మావృత్తులైరనిన నతిశయోక్తి కానేరదు. అందుఁగొంద ఱుపసంఘముగఁ జేరి క్రీస్తుననుసరింప బద్ధకంకణులగుటయే పాలలోఁ దోడుంచినభంగి నెల్లరఁగలఁగింపఁ జొచ్చెను. నూతనోజ్జీవమునంది కణ్వుఁడు గూడఁ దనసాంఘికులయం దుద్భవించిన దైవానుకరణేచ్ఛం గాంచి యాశ్చర్యనిమగ్నమానసుం డయ్యెను. 1 ద్విసహస్ర వర్ష పరిమితి పరమపురుష తత్త్వజ్ఞానాన్విత శిష్యాదర్శము నుద్ఘాటించి నేటియుపన్యాసమును ముగింపకమున్న, సుగుణవతి తనతల్లికిఁ బరమోద్రేకంబున నివేదించినట్లు, పెక్కండ్రు భక్తులు స్త్రీలును బురుషులును గూడ "స్వార్థత్యాగముతోఁ గూడిన కార్యము నెద్దానినేని జేయుఁదలంతును" "ప్రభుకార్యమునఁ గష్టముల ననుభవింప నిశ్చయించుచుంటిని." అనిపలుకఁ జొచ్చిరి. "వచ్చికష్టపడుఁడు" అనిమాజినియను మహాత్ముఁడు చెప్పిన వాక్యమునకంటె నుద్రేకమును గలిగించు నావేశ మెందుఁగానిపింపదు.

ఆరాధన ముగిసినది. శ్రోతలుఁ బెక్కండ్రు వెడలి పోయిరి. గతించిన రెండాదివారములవలెనే కణ్వుఁడును బ్రజ్ఞాపరులు నుపన్యాసమందిరమున సమావేశమయిరి. ప్రతిజ్ఞచేసిన వారందఱు నిలిచి యుండుఁడని పూర్వమువలెనే కణ్వుఁ 2 డామంత్రించెను. శ్రోతగాఁ జేరఁదలచినవారుఁ గూడ నుండుఁడని పలికెను. ఆరాధనానంతర మీసమావేశము విధాయకమయ్యెను. అతఁడచ్చటికేగి వారిం గాంచ వాని హృదయము చలింపఁ జొచ్చెను. మందిరము ద్విసహస్ర జనాకీర్ణమై యుండెను. పరిశుద్ధాత్మ మున్నెన్నఁడు నింత 3 స్పష్టాభాసము కాలేదు. నృసింహాకవి యందు లేడు. కన్నయ్య శ్రేష్ఠిని ప్రార్థింపుమని కణ్వుఁ డడిగెను. అచ్చటి వాతావరణమే భగవద్విలాస పూరితమై యుండెను. భగవచ్ఛక్తి యుక్తమగునట్టి బాప్తిస్మము నెవ్వఁడు వారింపఁగలఁడు? గతకాలమెల్లఁ 4 దదభావముగ నెట్లు జీవించిరో?

వారందఱుం గూడి పెక్కువిషయములు సంప్రతించుకొనిరి. పెక్కండ్రు ప్రార్థించిరి. ధర్మపురార్యాలయ సంఘమునుండి బయలువెడలిన పెక్కు ఘనకార్యములా నాటినుండియే ప్రారంభమైనవని కణ్వుఁడు కనిపెట్టెను. తుదకు వారందఱుఁ దమ తమ నెలవులకుఁ జేరి పరిశుద్ధాత్మాయత్తానందంబున నోలలాడిరి.

సర్వకళాశాలాధ్యక్షుఁడగు విద్యాధరుఁడు కణ్వునితో గృహోన్ముఖుఁడయ్యెను. విద్యాధరుఁడు నెమ్మదిగ మాటలాడుచు "కణ్వమునీ! నేనొకవిధముగ స్థిరపఱచుకొంటిని. నాసిలువను నేను గనుఁగొంటిని. అది బహుకష్టసాధ్యముగ నున్నది. కాని దాని నాచరణమునఁ బెట్టి నిర్వహించినవెనుకగాని నాకు మనశ్శాంతి కలుగ నేరదు."

కణ్వుఁడు ప్రత్యుత్తరము నొసంగక నిశ్శబ్దముగ వినుచుండ విద్యాధరుఁడిట్లు చెప్పఁదొడంగెను.

"నేను చిరకాలమునుండి నాకు విధ్యుక్తధర్మమని తలంచుచుండిన విషయము

1. రెండువేల. 2. పిలిచెను. 3. వ్యక్తము 4. అదిలేక

నేటి 1 భవదీయోపన్యాసప్రభావంబున నామనంబున సహస్రగుణితంబుగ నెలకొనియెను. నాస్థానంబుననుండిన నెట్లుగాఁ గ్రీస్తు ప్రవర్తించును? మీతోఁ గ్రీస్తుననుసరింతునని వాగ్దానముచేసిన దాదిగ నీప్రశ్నము నే పలుమారు తలంచుచుంటిని. కళాశాలా కార్యంబుల యథావిధిగ నెరవేర్చుచు బాలుర 2 కధ్యయనాభ్యసనంబుం జలుపుచుం దదితరవిషయంబుల మౌనము వహించుచునని తలంచి తృప్తినందఁ బ్రయత్నించితినిఁగాని యాతఁడింకను మఱికొన్ని కార్యముల నాచరించునను నూహ నామనంబును విడువదాయెను. ఆ మఱికొన్ని కార్యములే నే నాచరింప వెనుదీయుచున్నవి. వాని నాచరణమునం దుంచుటవలన నాకుఁ గష్టపరంపరలు తటస్థించును. వానిస్మరించుటకే భయాకుల మానసుండ నగుచుంటిని. అట్టికార్య మెద్దియో నీ వూహింపఁగలవా?"

కణ్వుఁడు— నాకుఁ దెలియదు ననుకొనెదను. నాకు దుర్ఘటమైన కార్యము నద్దియే. తదన్యము నెద్దానినేని నాచరించియుందును.

విద్యాధరుఁ డాశ్చర్య పరీత మానసుండై కణ్వుం దిలకించి తన్నుం బోలినవాఁ డింకొకఁడుకలఁడుగదా యని కొంతమనశ్శాంతిం గాంచెను. విచారగ్రస్తమైన హీనస్వరంబుతో దృఢముగ నిట్లనెను.

విద్యా— అయ్యా! మనము పురవాసోచిత కృత్యములయందశ్రద్ధ వహింపఁదగిన జీవనోపాధి గలవారము. మనల నావరించియుండు స్వల్పజనంబునే ప్రపంచముగ భావించి మన కానందదాయకమగు స్వధర్మానురక్తిం జరించుచుం దదితర నాగరికోచిత 3 వ్యాపృతిం ద్యజించితిమి. పురాభివృద్ధియెడ నాకుఁగల బాధ్యతను బుద్ధిపూర్వకముగ నలక్ష్యము చేసితిని. పురపాలకాధికారులందఱును ధనాశాపిశాచగ్రస్తులును, సురాపానోత్క్రాంతులును, స్వార్థపరాయణులునై న్యాయవిరుద్ధముగ సంచరించుచుం బట్టణమును బాడుసేయుచుండిరి. ఈదౌర్భాగ్యస్థితి నెఱింగియు నేనును దక్కుంగల పాఠశాలోపాధ్యాయులునుగూడ 4 ఛాత్రశాస్త్రోపబోధనమే పరమావధిగ భావించి తన్నిర్వహణమునఁ దృప్తులమై పురపారిశుధ్యతకై ప్రయత్నింపమైతిమి. ఈవిషయమునఁ గ్రైస్తవప్రబోధనమును యోజింపనైన మానితిమి. ఇఁకముం దిట్లువ్యర్థుఁడనై చరింపనేరను. రాఁబోవు నెన్నికలలోఁ బాల్గొని, యింటింటికిం దిరిగి, వ్యభిచారము, లంచములు, త్రాగుడు, జూదము మున్నగు దుష్కార్యములచే దేశము వినాశము నందుచున్నదనియు, ఇందులకుఁ గారణము మనమెన్నుకొనిన ప్రతినిధులే యనియు, నిప్పుడు సజ్జనుల నెన్నుకొని సకల విషయములఁ జక్కపఱచుకొంట యెల్లరకుఁ గర్తవ్యమనియుఁ బ్రజాసామాన్యమున నుద్బోధించి నాకుఁగల స్వల్పపు బలుకుబడిని నగరాభివృద్ధికై వినియోగ పరచెదను. ఇట్టికార్యమును జేయుటకంటె 5 శతఘ్నికాముఖంబునఁ జొచ్చుట సుకరమని తోఁచెడిని. ఈవిషయములఁ బ్రవర్తించుట కలవడమి నసహ్యముగఁ దోఁచెడిని. క్రీస్తిట్లు చేయఁడని నన్నెవ్వరేని నమ్మింపఁగలిగిన వారు కోరినదాని నొసంగెదను. ఆలోచించినకొలఁదిఁ బ్రభువీ శ్రమలఁ బాల్గొనుననియే తోఁచుచున్నది. ఈ విషయమే నాకు విశేష శ్రమఁగల్గించుచున్నది. నాయుద్యోగము పోయిన నింతశ్రమయని యెంచను. ఈ పుర పారిశుద్ధ్య విషయము నాకసహ్యమును గొల్పుచున్నది. పిల్లలకు పాఠమును జెప్పుకొనుచుండుమనిన మిక్కిలి యానందింతును. "విద్యాధరా! నన్ను

1. నీయొక్క. 2. చదువు. 3. వ్యాపారము. 4. శిష్య. 5. తుపాకి.

వెంబడింపుము. నీవు పురవాసివగుటచేఁ దత్పారిశుధ్యసంఘము నుద్ధరించుటకై వలయు శ్రమపడుట నీకుఁ గర్తవ్యము. ఈమలినంబుచే నీమనంబు నించుక క్లేశపరుప వలసివచ్చి నను సహించి [1] సంఘాళ్వశాలను నిర్మలము నొనర్పుము" అని ప్రభువు నాయంతరాత్మను ప్రబోధించుచుండెను. కావున నో కణ్వమునీ! నే నీశ్రమల నామోదింపవలయును. లేదా ప్రభువునైనఁ ద్యజింపవలయును.

కణ్వుఁడు మందహాసము చేసి యిట్లనెను— నీవు నాకుఁ బ్రతినిధిగఁ గూడ ముచ్చటించితివి. నేను మతప్రచారకుఁడనైన కారణమున నామనోభిప్రాయముల నించించుక యారాధనాంత్యోపన్యాసంబుల వెల్లడించుటతోఁ దృప్తినంది నాగరికుఁడ ననుమాటయే మరచి మిన్నకుండుట ధర్మమా? అర్హ ప్రాతినిధ్యము వడయుట కేనెన్నఁడుఁ బ్రయత్నింపలేదు. ననుబోలిన మతాధిపతులు పెక్కండ్రు గలరు. ఉపన్యాస వేదికనుండి మేము చర్చించు సాంఘికార్థిక నీతివాక్యముల మేమె [2] యుల్లంఘింతుము నీవలె నేనును "క్రీస్తువిషయమున నేమి చేయును?" అని యాశంకించి ప్రత్యుత్తరమునకై [3] యిఱుగుపడుచుంటిని. నా విధాయకము స్పష్టము. నేను శ్రమపడవలెను. కడుపులో నిచల్ల కదలకుండ నింటఁగూర్చుండి మతవ్యాసంబులం జెక్కుచు నిర్విచారంబుగఁ గాలక్షేపము సేయుట కభ్యాసపడిన నేను పురపారిశుధ్యతకై ప్రతినిధుల నెన్నుకొనుటలోఁ దిరిగి పనిసేయుట కడు నేహ్యంబుగను, [4] భీభత్సంబుగను దోఁచుచున్నవి. మధుపాన [5] పంక నిమగ్నంబైన యీ పురపారిశుధ్యతకుఁ బ్రయత్నించుటకంటె మాలగూడెమున నివసించి యల్పార్జనచే జీవయాత్ర గడపుటయైన సుకరముగఁ దోఁచుచున్నది. కాని నీవలె నేనును నాబంధనముఁద్రోసివిడువఁ జాలకుంటిని. స్వధర్మానుష్ఠానపరుని వలె నీకార్యమున నంతఃకరణశుద్ధిగఁ బ్రవేశింప నిశ్చయించుకొనినఁగాని దైవానుకరణము నెరవేరదని స్పష్టమగుచున్నది. విద్యాధరా! మనబోటి విద్యాగురువులు, మతగురువులు, [6] ఆలేఖ్యులు, మున్నగు రాజకీయ వ్యాపారముల పిరికిపందలని యొప్పుకొనకతప్పదు. అజ్ఞాన వశంబునను, స్వార్థపరాయణతను, నాగరిక విధుల [7] నుల్లంఘించితిమి. క్రీస్తు మనయుగంబున నుండిన నట్లెన్నటికిని జేయఁడు. ఈభారమును వహింపఁ గృతనిశ్చయులమై కర్తవ్యమునఁ గడంగుటకంటె నుత్కృష్టధర్మమును మఱొండు లేదు.

ఉభయులు నొకక్షణము నిశ్శబ్దముగ నడచిరి. తుదకు విద్యాధరుఁ డిట్లు పలికెను.—

మనమీ కార్యమున నొంటొంటిగ నసహాయులమై పనిసేయ నవసరము లేదు. దైవానుకరణ ప్రతిజ్ఞఁ గావించిన వారందఱును మనకు సహాయులుగ నుందురు. ధర్మపురియందలి క్రైస్తవసేనను సమావేశపఱిచి సురాపాన దుష్ప్రవర్తనలపై దాడి వెడలుదమని కేవల [8] వక్తృత్వముచేత నేగాక యింకను బలవత్తర ప్రచారములచేఁ బల్లెలవెంటఁ దిరిగి పనిసేయుదము. సురాలయ వాదులు నిర్వీర్యులు, భయంకరులునై యుందురు. ఎంతటి ధర్మవిరుద్ధ ప్రవర్తనము గలిగిన నేమి ప్రయోజనము? ధర్మసంస్థాపనార్థమైన మనసంకల్పమునకు వికల్పము కలుగదు. తన్నిర్వాహణార్థ మొక [9] పథకము నేర్పఱుతము. ఇట్టి విషయములఁ గ్రీస్తు విశేషజ్ఞానమును వినియోగించును. తగిన యాధార

1. సమాజ. 2. దాటుదుము. 3. కష్టము. 4. భయంకరము. 5. పాపము-బురద. 6. ప్రాతగాండ్రు. 7. దాటితిమి. 8. మాటలనేర్పు. 9. పన్నుగడ.

ములు సమకూర్చును. పెద్ద పెద్ద యెత్తులను వేయును. మనము నట్టే చేయుదము. మన మీవిషయమున శ్రమపడ నిశ్చయించినప్పుడు ధైర్యసాహసములుగల పురుషులవలెఁ బని సేయుదము.

ఆనాఁడు విశేషకాల మీవిషయముననే ముచ్చటించుకొని మరునాఁడు కణ్వుని పఠనగృహంబునఁ దిరిగి సమావేశమైరి. శుక్రవారమునాఁడు పల్లెలయం దెన్నికలు జరుగునఁట. అస్వాభావికములగు చర్యలే యెన్నికలఁ బ్రవర్తించునని ధర్మపురియందెల్లెడల వదంతి బలమగుచున్నది. ఎచ్చట నాలకించిన నీప్రసంగములే ప్రబలములగుచుండెను. రహస్యవిధానంబున సమ్మతుల నొసంగు పద్ధతి యింక నీప్రాంతములఁ బ్రచారమందు లేదు. [1] జానపదులందఱుఁ దత్తద్విషయకోపన్యాసంబుల నాలకింప సభాభవనంబున సమావేశమగుఁడని ప్రకటింపఁబడెను.

ధర్మపురీ వాసులా సమావేశము నెన్నటికిని మరువఁజాలరు. ఇందనుక నెన్నఁడు నిట్టి గంభీరోపన్యాసంబుల వినియుండరు. పురాధ్యక్షుఁడు, కార్యదర్శి, కోశాధికారి, రక్షకభటాధ్యక్షుఁడు, మున్నగు వారి నెన్నుకొనవలసి యున్నది [2] భృగువాసరంబున వెలువడిన దైనికపత్రికలో నేయేప్రదేశములవారి కెన్నెన్ని సమ్మతులుకలవో విభజనగా వివరింపఁబడినది. ధర్మపురీ నివాసులగు క్రైస్తవులందఱును దమతమ విధ్యుక్త ధర్మంబుల బాగుగ గుర్తింపఁ గలుగుటచే నిప్పు డెన్నుకొనఁబోవు ప్రతినిధులు తగిన వారు లభింపఁగలరని పురూరవుఁడు ఉచితముగ దినపత్రికలోఁ బ్రకటించెను. పురూరవుని పత్రికావ్యాసమునందలి కొంతభాగమీకథాసందర్భానుసారముగ నుండును. కావున నిందుఁ బొందుపఱచెదము.

“గడచినరాత్రి సభాభవనమున జరిగిన జానపదుల సమావేశమునకంటె మిన్నయగున దెన్నఁడు ధర్మపురీప్రాంతమున జరిగియుండలేదు. జనసామాన్యము నంతను దమచేతి కీలుబొమ్మలుగాఁ దలంచి వారి కన్నులు గప్పి ప్రతినిధుల యెన్నికలు తటస్థించినప్పుడెల్లఁ దమ కనుసన్నల మెలంగు వారినే యాస్థానములఁ జేర్చి పురపాలనమంతయుఁ దమచిత్తవృత్తిని నెరవేర్చుచుండిన [3] మాయావుల కందఱికి నీసమావేశ మత్యాశ్చర్యకరముగను, హృదయోద్భేదంబుగను గనుపట్టెను. ఇంతదనుక మున్నెన్నఁడును రాజకీయ వ్యాపారముల పాల్గొనక నశ్రద్ధతో సంచరించు పౌరులెల్లరు నీసమావేశమునఁ బాల్గొని తమతమ యభిప్రాయంబుల సభాముఖంబున వెల్లడించి తమకుత్తములనితోఁచిన వారి నాయాపదవులకుఁ దామెన్నుకొనుటయే మాయావుల చిత్తవిభ్రాంతికిఁ గారణము.”

ప్రజా ప్రాతినిధ్యమునకిది సదాదర్శము. సర్వకళాశాలాధ్యక్షుఁడగు విద్యాధరుఁడు మున్నెన్నఁడును బ్రాతినిధ్య నియామక స్థానమును జూచియుండని వాఁడు. ప్రజలకంటఁబడి యుండనివాఁడు. ధర్మపురియం దెన్నఁడు వినియుండని గంభీరోపన్యాసమును గావించెను. విద్యాధరుఁ డున్నతాసనముపై నిలువంబడి ప్రజాభిముఖుఁడై యావేశముతో నుపన్యసించుటంజూడ స్వార్థపరాయణులయి ప్రజల మోసపుచ్చుచుండిన ప్రజానాయకనామమాత్రుల కళావిహీనములగు ముఖంబుల నీక్షించి తీరవల

1. పల్లెటూరివారు. 2. శుక్రవారము. 3. మాయగాండ్రు.

యును. అందుఁ బెక్కండ్రీతఁ డెవ్వఁడని [1] పృచ్ఛఁ జేసిరి. ఎన్నికలు సాగినకొలఁది వారి భయోద్రేకంబు లతిశయిల్లఁ జొచ్చెను. చిరానుసరణంబులగు తమ మాయా మయాచారంబులు నిరర్థకములుగాఁ జొచ్చెనని వారుగ్రహించిరి. ధర్మపుర్యాలయాధిపుఁడగు గణ్యుఁడును, కన్నయ్యశ్రేష్ఠి, వైద్యభూషణుఁడు, సుమంతుఁడు నింకననేకులు పురప్రముఖు లెల్లరు నెన్నికలఁ బాల్గొనుట కచటికి విచ్చేసియుండిరి. వారందఱును యోగ్యులని తమయంతరాత్మలు ప్రబోధించినవారినే యెన్నుకొను తీవ్రసంకల్పముతో నరుదెంచిరని స్పష్టంబయ్యెను. వీరెవ్వరును బూర్వ మెన్నికలకు వచ్చువారుకారు. ప్రజానాయకులమని డంబములుగొట్టు మాయావులు వీరిముఖముల నైనఁ జూచియెఱుంగరు. కాని వారి మాయామయ విధానంబులచే స్వార్థపరాయణులగు తమబోంట్లు దుష్టుల మఱికొందఱఁ దమకూటమునఁ జేర్చుకొని దౌర్జన్యంబున నెట్లో తమచెప్పుచేతల మెలఁగువారినే సకలాధికారంబుల నెన్నికల విజయులఁగావించి యేతన్మూలమున ధనాకర్షణంబును, ప్రజా సంక్షోభంబును గావించుచుండిరి. ఇదియే వీరి చిరకాలాభ్యాసము.

ఈసారి ఎన్నికలు తమస్వాధీనమునుండి తొలంగినవని వారెఱింగినతోడనే నిస్పృహులై వెడలిపోయిరి. అటులేగి వారికనుకూలమగు మఱియొక తావున నెన్నికల సాగించిరి. ఇచ్చట సమావేశమయిన వారందఱును త్రాగుబోతులు, జూదగాండ్రు, వ్యభిచారులు, దారిదోపిడిగాండ్రు, మాయావులు, పరస్త్రీ, పరధనాకర్షణాసక్తులు, స్వార్థపరాయణులునని మా చదువరు లెల్లరు గ్రహింతురుగాక ! ప్రజలందఱును దమ తమ చిత్తంబులు పరాయత్తంబులుగాకుండఁ గాపాడుకొని పరోపకార పారీణులై సంఘాభివృద్ధికిని, దేశాభివృద్ధికిని, ప్రజాభివృద్ధికిని, ఆత్మోద్ధరణంబునకును, జారచోరాద్యనేకేతిబాధా నివారణానుసంధాతలగు సత్పురుషులఁ దమ ప్రతినిధులనుగ స్వేచ్ఛాప్రవృత్తి నెన్నుకొనెదరుగాక ! దుష్టుల ప్రోత్సాహంబుల నిరసింతురుగాక! ప్రభురాజ్యమును భూమిపై దివమునందువలె నెలకొల్పెదరుగాక ! అరాజకస్థితి పరమావధిం జెందినది. దుర్భరావస్థ సంప్రాప్తమైనది. సత్సభాసదుల నెన్నుకొనుట యొండె, దేశము అనామకమై నశించుటయొండె కర్తవ్యములు. కల్లు సారాయి మున్నగు దుర్వ్యసనాసక్త పానశాలలు, ద్యూతమందిరములును, పరాంగనా మానభంగ పంకిలంబులగు వ్యభిచార నిరాఘాట ప్రచార గోప్య ప్రదేశంబులును మున్నగువానికిఁ గడుంగడుఁ బ్రోత్సాహమును గలిగించు ప్రతినిధుల నెన్నుకొని దేశమును సంక్షోభంబున ముంచుటయా, లేక దుర్వ్యసన ధ్వంసకులగు యోగ్యుల నాస్థానంబులఁ జేర్చి పురంబును బరిశుభ్రపఱచి దౌష్ట్యముల నివారించుటయా ? మనకుఁ గర్తవ్యము. యోజింపుఁడు జనులారా !

" మా దైనికపత్రిక సర్వారిష్ట విద్వేషకమగు నవీనాదర్శమునే ప్రోత్సాహపఱచెడిని. నిన్న సభాభవనమున సమావేశమయిన ప్రజాబాహుళ్యము మెన్నుకొనినసద్బృందమే జయమునందుటకు యథాశక్తిఁ బ్రయత్నింతుము. పానశాలల దుష్టజనసమావేశమందిరంబుల నిర్మూలించుటకును, దురాత్ములు తాము వశపరచుకొనిన ప్రజానాయకత్వమును రూపుమాపుటకును, గృషిచేసెదము. అందఱు గ్రైస్తవులును, దేవాలయ సభ్యులును, ధర్మాపేక్షకులును, నిర్మలాత్ములును, మాయుద్యమమునకు సహాయభూతులుగా వేఁడుకొనుచున్నారము. చిరవాంఛితమగు నీమార్పున కుద్యమించిన విద్యా

1. అడిగిరి.

ధరాది ప్రముఖుల నాదరించి కార్యసాఫల్యము నొనర్పఁ బౌరులఁ బ్రార్థించెదము.”

విద్యాధరుఁడీ వ్యాసమును బత్రికాముఖంబునఁ దిలకించి పురూరవుని ధైర్యస్థైర్యములకు భగవంతుని గొనియాడెను. ఈదైనికపత్రిక తప్ప తక్కుంగల వార్తాపత్రికలన్నియు నపవాది పక్షమునే యవలంబించెను. ఇప్పుడే ప్రారంభమయిన యీదుర్భర దుర్ఘట సమర సంరంభముయొక్క ప్రాశస్త్యము నాతఁడు తనమనంబున నెలకొల్పెను. తైహానుకరణాదర్శామోదమున దైనికపత్రిక ప్రజామోదాభావంబునకుఁ బాత్రమైనదను విషయమ్ము గుంభితముగాదు. ధర్మపురీ వాసులగు క్రైస్తవులెల్ల రిప్పుడీ పత్రిక నాదరించెదరా ? లేక నేరములు, అపవాదములు, అపమార్గప్రయుక్త రాజకీయ ప్రసంగములు, మున్నగువానియం దాసక్తిచేఁ దదభావతం గాంచి సత్ప్రసంగములకే తావొసంగుటం జేసి క్రైస్తవులుగూడ నీపత్రికం గొనుట మానెదరా ? ఈవ్యాసమును వ్రాయుసమయమున నే తత్పత్రికాధిపుఁడగు పురూరవుం డీవిషయముల దనమనంబున విచారించి 1డోలాయమాన మానసుండయ్యెను. వాణిజ్య రహస్య ప్రక్రియ ధనార్జన మొనర్చు ధనికులెల్ల రీవ్యాసముం గాంచి విషాదమునఁ దమయాదరణమును నిరాకరింతురని వానికిఁ దెలియును. అట్లు కృతనిశ్చయుఁడయ్యుఁ దనకలమును గాగితముపై నాడించునప్పుడు క్రీస్తు మిసేయునను నా శంకను దనమనంబున నెలకొల్పెను. అతని జీవితమునందీ ప్రశ్నమే ప్రధానాంశముగ నేర్పడెను. తదితరవిషయంబుల కంటె దీనినుత్కృష్టముగ గ్రహించెను.

పురవాసిసభ్యసంఘమున కాదిగ నాశ్రయించి మించి లోకారిష్టమును గలిగించుచుండిన సురాపాన జార చోర ద్యూతాది హేయక్రియా భూయిష్ట దౌష్ట్యంబుల నున్మూలింప బద్ధకంకణులై మతాధికారులు, మతసంస్కర్తలు, నౌజ్ఞులు, పండితులు, ధన్వంతరులు, పత్రికాధిపతులు, వేదవేదాంగవిదులు, శాస్త్రవేత్తలు లోనుగాఁగల ఘనులు, మున్నెన్నఁడును బురపాలనా విధానంబులఁ బాల్గొనని వారు, నేఁడీదౌష్ట్యములఁ దొలంచు తలంపున నిందుఁ బ్రవేశించిరి. ఈవిషయ మాశ్చర్యకరము కాదా ! రాజకీయ వ్యాపారములు ధర్మబుద్ధితో నెరవేర్పఁబడినచో దేశమెంత యభివృద్ధిఁ జెందునో తానీవఱకుఁ దెలిసికొనియుండలేదని విద్యాధరుఁ డవమానకరముగ భావించెను. ఆశుక్రవారము రాత్రి మొదలు తాను తన విద్యార్థులను “రాజకీయవేత్త” యను పదమునకు నవీనార్థమును గుర్తించిరి. అతనికిని విద్యార్థులకునుగూడ విద్యాభ్యాసమూన శ్రమయని గ్రహించిరి. స్వార్థత్యాగమే యభివృద్ధి దాయకము.

మాలగూడెమునందా వారమునం దాధ్యాత్మికావలోకన ముచ్ఛ్రదశం జెందెను. 2తిరోధాన సూచనలు గన్పట్టుటలేదు. సుమతీ సుగుణవతు 3లనురాత్రంబు నచ్చటికిఁ బోవుచుండిరి. సుమతి తనద్రవ్యమునం దధికభాగము నెట్లువినియోగపరుపవలయునను విషయమును జర్చించుకొనిరి. ప్రభువైన యేసుక్రీస్తు నొద్ద నింతధనముండిన దాని నాతఁడు సుమతినిశ్చయించిన విధానమునసే వినియోగించునని వారునిర్ధారణ పరచుకొనిరి. ప్రభు వెట్లు వినియోగించినను దేశకాల పాత్రానుసరణముగ నీవిభేదములుండవచ్చును. క్రైస్తవులు ధనమునెట్లు వినియోగపరుపవలయునో యెవరు నిర్ణయింపఁగలరు ! ప్రతి వ్యక్తియుఁ దనకుఁదాను నిశ్చయించుకొనవలయును. అందు స్వార్థపరత లేకుండుటయే ప్రధానము.

---

1 ఉయ్యెలగా జేయబడిన 2 మాయమగు. 3 ప్రతిరాత్రియు.

1 ఆత్మద్రవిణ వ్యయ విధానంబున వారిట్లు వితర్కించుకొనుచుండఁ బరిశుద్ధాత్మ వారిఁ గార్యాంతరాసక్తులఁ జేసెను. సముద్రముమీఁద నడచుట, కొలఁదిరొట్టెలతో జనసంఘమును దృప్తిపఱచుట మున్నగు మనుష్యాతీత విపరీతములకంటె నాశ్చర్యకరములగు కార్యముల వారనురాత్రమును జూచుచుండిరి. జీవలోకము పాపమున మరణించి నీతియందుఁ బునరుద్ధారణ నందుటకంటె విచిత్రమేమికలదు ! పశుప్రాయులు, దుర్మదాంధులు, మధుపానలోలురు, వ్యభిచార బ్రహ్మహత్యాది మహాపాతకులు, నగువారు దేవునియెదుట సాగిలఁబడి పశ్చాత్తాప తప్త మానసులై కన్నీరు మున్నీరై పార జగత్స్రష్టను వేడుకొనుట కెంచినపుడెల్ల నీసుందరాంగుల కిరువురకును సమాధినుండి లేచివచ్చిన లాసరు జ్ఞాపకమునకు వచ్చుచుండెను. ఈదృశ్య వారికత్యంతోద్రేకమును గలిగించుచుండెను.

భానుమంతుఁ డచ్చట జరిగిన సభల కన్నిటికిని తప్పక వచ్చెను. ఆతనిలో మార్పు కలిగిన దనుటలో నిస్సంశయము. ఆతఁడమిత్ర స్త్రీమిత్రమునందెను. ఈకాలమంతయుఁ బర్యాలోచనసేయువారివలెఁ గాన్పించెను. పూర్వపు భానుమంతుఁడు కాఁడు. తరువాత వాఁడు సోమనాథశర్మతో మాటలాడుచుండును. సుగుణవతి సమీపమును హేయముగ జూచుటలేదుగాని తమ పూర్వపరిచితిని పునరుజ్జీవనము సేయఁ బ్రయత్నింపఁడు. అతని కాత్మైక వైద్యమగు నూతనోజ్జీవనమును గూర్చి తెనయామోదమును దెల్పుటకుఁగూడ సుగుణవతికిఁ గష్టసాధ్యముగఁ దోఁచెను. తమ పరస్పరానుబంధముల నతఁడు మరువలేదు. కాని తన యంతరాత్మను నవీనమార్గంబులఁ బ్రసరింపఁజేయుట కింక నభ్యాసపడలేదు.

వారాంతమున మాలగూడెమంతయు 2మద్దతులమధ్యఁ బేదలచందంబున నల్లాడఁ జొచ్చెను. చిరకాలమునుండి పేదలఁ దనబానిసలుగఁ జేసికొని రాజ్యమేలుచుండిన కల్లంగడులను సైతానును బరిశుద్ధాత్మ తనయుత్కృష్ట శక్తి సామర్థ్యంబులచే నులుముచుండెను. నూతనజీవనము ధరించుచున్న యానీచాత్ముల కీసంఘర్షణ మెట్లు పరిణమించునో ధర్మపురీక్రైస్తవ సమాజ మెఱింగినచోఁ బురప్రతినిధులయెన్నికలు చిరకాలాచారానుసరణముగఁ బానశాలల నిర్వహింప సమకట్టువారికి జయము కలుగదు. అదియెట్లు పరిణమించునో నిరీక్షించవలసి యున్నది. క్రైస్తవాదర్శము నామోదించిన పెక్కండ్రనాదరించి యుండిన దౌరాత్మ్యము క్రమక్రమముగ సుమతికి గోచరమై సుగుణవతియు నామెయుఁ బ్రతిరాత్రి యింటికిఁ బోవునప్పుడీ భారమును దమతోఁగూడఁ గొని పోవుచుండిరి.

3 అశ్రుపాతమున కందని ఖేదోద్రేకంబున సోమనాథశర్మ "ఇందనేకులు తిరిగి పోదురు. సహవాస దోషమే సౌశీల్యమునకు వేరుపురుగు, వారివలన దిక్కుల నావరించియున్న మధుపానాగారముల పరిమాణమును దృష్టిదోషమును వారెల్లకాలము నిగ్రహింపఁ గలరనుకొనుట వెఱ్ఱితనము. ఓప్రభువా! మౌనముచేతను, పరుల4కగ్రాహ్యపుకట్టెన్నికలచేతను క్రైస్తవు లెంతకాలమిట్టి దురాచారములఁ బ్రబలఁజేయుదురు ! దేశమునకంతకునిది యనర్థదాయకముగఁ బరిణమించుచుండెను కదా ! ,, యని పరితపించును.

1 తనడబ్బు. 2. గొప్పవారి, 3. కన్నీరుగారుట. 4 తెలియని.

అతఁడు పరాత్పరునిట్లు ప్రశ్న చేసెనుగాని త్వరలో సమాధానము లభించునను వాంఛ వానికి లేదు. శుక్రవారము రాత్రి యెన్నికలసమావేశమునఁ గొంత ధైర్యము కలిగెనుగాని పర్యవసాన మెట్లు పరిణమించునో నిర్ధారణ సేయలేకపోయెను. 1 మధుద్రవాసక్తులందఱు ఏకీభవించి సత్కార్య సహిష్ణుతను ఘనీభవింపఁ జేసిరి. క్రైస్తవులందఱు ఏకీభవించి యపవాద శిలువతోఁ బోరానర్చెదరా! లేక స్వకార్యఫలాపేక్షలచే నైననేమి, యైకీభావము నవలంబించెదరా? అదియును నింకను నిరీక్షించి చూడఁదగినదే. ఇదియిట్లుండ మధుపాన 2 మహోరగము పంచమవాటిక యందెల్లెడల వ్యాపించి బుసలుకొట్టుచు, విషజ్వాలలఁ 3 గ్రసింప సంసిద్ధమై యుండెను.

శనివారము సాయంసమయమున సుమతి సుగుణవతింజూచి తననూతనోద్యమము నామెతోఁ జర్చింప సమకట్టి యిల్లు వెలువడి సింహద్వారముం జేరునంత నామె పూర్వపరిచితులగు ముగ్గురు యువతీమణులు 4 శకటారోహులై వచ్చి ద్వారముకడ నిలిచిరి. సుమతి బండిబాటుంజేరి యచట నిలిచి వారితో ముచ్చటించుచుండెను. వారామె నూరక చూచిపోవుటకు రాలేదు. తమతోఁగూడ స్వారివెడలుమని కోరిరి. వ్యాయామారామంబున గానవినోదంబులు జరుపఁబడును. దినాంతం బత్యంతాహ్లాద దాయకంబుగ నుండుటచే నింటఁగాలముఁ బుచ్చఁజనదు.

ఎఱ్ఱని చేరుమాలున సుమతి భుజముపై సవిలాసంబుగఁ గొట్టుచు నందొక యువతీలలామ "ఇన్ని దినంబులనుండి నీవెచ్చట నుంటివి? లోక ప్రఖ్యాతి వడయఁదిరుగుచుంటివని వింటిమి. ఆవిషయములు మాకుఁ జెప్పవా" అని ప్రశ్న చేసెను.

సుమతి ముఖంబున నించుక కెంపు వొడమెను. ఒకక్షణము యోజించి పిదపఁ బంచమవాటీవిశేషంబుల వ్యక్తంబుగ వారితో నుడివెను. శకటారోహులగు తరుణులా ప్రసంగమునం దాసక్తిం జూపఁజొచ్చిరి.

"నేను చెప్పెదనా! చెలులారా! నేటి సాయంకాలము నుపవనవిహారంబున గడుపుటకు మారు సుమతితోఁగూడి మాలగూడెమునకుఁ బోవుదము. నేనింతకుమున్నెన్నఁడు నచ్చటికిఁ బోయియుండలేదు. అది దుర్మార్గావాసమనియు నందుఁ జూడఁదగిన విషయము లనేకములు కలవనియు విందును. సుమతి మనకు మార్గదర్శిగ నుండగలదు. అది కడు—హాస్యాస్పదము—అనఁబోయి సుమతి వాడిచూపులచేఁ బర్యాలోచించి—విజ్ఞానదాయకమగును." అని యాముగ్గురిలో నొకతె పలికెను.

సుమతికిఁ గ్రోధముద్భూతమయ్యెను. వీరెంత ప్రోత్సాహపఱచినను వీరితోఁ బోఁగూడదని ప్రప్రథమమున నిశ్చయించుకొనెను. పైన హేళనగ మాటలాడిన తరుణీలలామం బోలినవారే తక్కిన యిర్వురంగనలును. అట్టులయ్యును వారు నిష్కల్మష హృదయములతోఁ దమ్ముఁ దీసికొని పొమ్మని సుమతిని వేఁడుకొనిరి.

వీరి యీనిరర్థక 6 చిత్రదిదృక్షచే వీరిని సత్సేవాపరులనుగా మార్ప వీలగునని యాకస్మికముగా భావించెను. గూడెమునందు జరుగు పాపకృత్యములను దౌర్భాగ్యమును వీరెన్నఁడుఁ గని విని యెఱుంగరు, వారచ్చటికి రాగమకించుటకుఁ గాలయాపనమే ప్రధానకారణమైనను వారల కీయవస్థ నేల చూపఁగూడదు?

"సరే. నేను మీతో వచ్చెదను. మీరు నావాక్యముల మన్నించి నేఁ గొనిపోవు తావుల కెల్ల నేతెంచి నేఁ జూపునదెల్లఁ జూడవలెను," అని చెప్పుచు శకటము నారో

1 కల్లు 2 పెద్దపాము 3 క్రక్కుటకు. 4 బండినెక్కి 5 ఎఱ్ఱదనము 6 చిత్రముజూచుకోర్కె

హించి యింతకుముందు దనతో ముచ్చటించుచున్న పడఁతిప్రక్కం గూరుచుండెను.

"మన మొక రక్షకభటుని మనతోఁ గొనిపోవలదా? అచ్చటికి మనబోంట్లొంటరిగఁ బో సాహసింపఁ జనదని మీ రెఱుఁగుదురుగదా!" అని వారిలో నొకతె 1 కంపాన్విత గాత్రియై పలికెను.

"అపాయ మేమియు లేదు" అని సుమతి సమాధానము చెప్పెను.

"భానుమంతుఁడు గూడ మార్పు జెందెనఁట నిజమేనా? అని యింకొకర్తె సుమతింజూచి పృచ్ఛచేసెను. బండిలోఁ బోవుచుండ వారందఱామెను జిత్రముగఁ బరికించుచుండిరని సుమతి కనిపెట్టెను.

"అగును. ఆతఁడు మారుమానిసి యయ్యెను. వారము క్రిందట నాతఁడు దైవానుకరణంబునం దగిలెను. ఆరాత్రి నేనె స్వయముగ వానిలోని మార్పులఁ గాంచితిని." అని సుమతి చెప్పెను. ఆనాటి రీతి 2 ననురూపంబుగ వర్ణించుట కామె కలవి కాలేదు.

"అతఁడు వ్యాయామ మందిరంబులకేగి యచ్చటి పూర్వ పరిచయులకెల్ల మత బోధ గావించుచుండునని వింటిని." అని యెత్తు రుమాలఁగల నాతి పలికెను.

సుమతి ప్రత్యుత్తరము నీయలేదు. బండి పెద్దబాటనుండి మరలి గూడెము వైపున కేగుచుండుటచే బండియని వారందఱును దమ తమ తలంపులనుండి మేల్కొని గాంచి చూడఁదొడంగిరి. సమీపించిన కొలఁది వారికి మనోవిభ్రాంతి మెండగుచుండెను. సుమతి కభ్యాసమయిన యచ్చటి నాదములు, వాసనలు, దర్శనములును, నాగరికత నభ్యసించిన యీ యువతీత్రయంబునకును భయంకరములుగఁ దోఁచెను. బండిగూడెమునఁ బ్రవేశించినతోడనే చక్కని దుస్తులను ధరించి గొప్పవారివలె గన్పట్టుచుండిన వీరి నాపల్లినివాసు లత్యాశ్చర్యముతో గుంపులు గుంపులుగఁ గూడి చూడసాగిరి. ధర్మపురీవాసు లిట్టి నీచములగు పల్లెల కెన్నఁడును వచ్చినవారుగారు. కావున వీరిసమావేశమున కిదియే మొదలు. బండిలోని వారు తాము గూడెమునందలి విశేషములఁ గాంచి యానందించుటకు మారుగ 3 జానపదులే తమ్ము విడ్డూరముగఁ జూచుచుండుటం గాంచిరి. వారందులకు భయపడి యేహ్యతం జెందిరి.

"ఇప్పటికే మనము చూడఁదగినదానికంటె నధికము దిలకించితిమి. చాలును మరలిపోవుదము." అని సుమతి ప్రక్కగా గూర్చుండిన స్త్రీ వచించెను.

వారాక్షణమున మిక్కిలి ప్రసిద్ధిఁగాంచిన యొక ద్యూతగృహముం దరిసిరి. వీధి కడు సంకుచితముగ నుండెను. ప్రక్కలఁగల కాలి దారి క్రిక్కిరిసి యుండెను. అకస్మికముగ నాద్యూత మందిరమునుండి యొక యువ్వనవతి తూలిపడుచు బయలు వెడలెను. ఆమె తన దురవస్థం దెలిసికొనెనో యనునట్లు "గీ. ఎట్టులుండినఁ జేకొను మట్టినన్ను! పాతకుల నాశ్రయుఁడవో కృపాకరంగ!" అని యశ్రుపూరిత నయనారవిందయై పాడుచుండెను. మన యౌవనవతుల బండి యాపెం దాటిపోవుతరి సుమతి యొక్కయు, నాపెయొక్కయు చూపులు కలిసికొనెను. ఒండొరుల గురుతించిరి. పరస్ప 4 రావలోకన సంజనిత విషాదాకుల చిత్తలైరి. ఆనాఁడు రాత్రి గుడారమున సాష్టాంగపడి 5 యశ్రుధారా 6 భరిత ముఖపద్మయై పశ్చాత్తప్త మానసంబునఁ బరిత

---

1 వణకుతోఁగూడిన 2 చక్కగ 3 పల్లెటూరివారు 4 చూపు 5 కన్నీటి 6 నిండిన.

పించుచుండ సుమతి యామె దరినే తానుగూడ హాహాకారించి యామె నుద్ధరింపుమని దైవమును వేడుకొనెను.

"బండి నిలుపు" మని సుమతి రథసారథిని హెచ్చరింప నాతఁడు తిరిగి చూచెను. రెప్పపాటులో సుమతి శకటము 1 నవతరించి యానీచాంగనం గౌఁగిలించుకొనెను.

"సావిత్రీ" యని సుమతి పిలిచెను. అంతియే. ఆమె సుమతిం జేరిపారఁ దిలకింప నామె ముఖము వైవర్ణ్యముం జెంది భయాకులమయ్యెను. బండిలోని స్త్రీలాశ్చర్యాక్రాంత మానసంబుల నిర్విణ్ణులైరి. మధువిక్రేత వీధి గుమ్మముం జేరి 2 ముకుళిత కర 3 కమలుండై వారిం దిలకించుచుండెను. గూడెము నందలి వారందఱును గుమ్మముల నుండియు, దిడ్డిగంతలనుండియు, దుర్గంధ పరీత పథంబులనుండియు, నిశ్చేష్టితులై నిలిచి యీయిరువురి చర్యం గాంచుచుండిరి. 4 తపనాతప 5 తైక్ష్ణ్యధారలు వీరిపైఁ గురియుచుండెను. వ్యాయామారామంబున జరుగుచుండిన భజంత్రీ మేళపు 6 నినాద మించుక వినఁబడుచుండెను. నాగరికోపభోగంబుల నచ్చటివా రనుభవించుచుండిరి.

ఇది పంచమాధ్యాయము.

---

1 దిగి 2 ముడుచఁబడిన 3 పద్మము 4 సూర్యుని యెండ 5 తీవ్రము 6 ధ్వని.

శ్రీ

# దైవానుకరణము.

## షష్ఠాధ్యాయము.

సుమతి బండి దిగి సావిత్రిం జేరునప్పుడు, ఇదమిత్థమని తా నాచరింపఁదగిన విధానమును నిశ్చయింపలేదు. తాఁ జేయఁబోవుదాని ఫలితార్థము నూహింపలేదు. ఈ తృప్త జీవిత ఫలాస్వాదనము నించుక చవిఁగొని యొక యాత్మ తిరిగి యథాగతి పొలగుటం గాంచెను. హఠాద్ఘటిత మనోద్రేకంబున నామె భుజములపైఁ జేయివైచుటకుఁ బూర్వము "ప్రభువగు క్రీస్తు సందర్భమున నేమిచేయును?" అని మాత్రము వితర్కించెను. ఈ వితర్కమీసమయమునఁ బెక్కండ్రకువలె నీమెకు నభ్యాసయోగముగఁ బరిణమించెను.

సావిత్రి సరసను నిలువఁబడి యామె నలు దిక్కులం బరికించెను. సావిత్రియొక్క దౌర్భాగ్యత యంతయుఁ గడుంగడు 1 శోచనీయమై యామె కట్టెదుర నిజబింబంబునుం బోలెఁ గన్పట్టెను. బండిలోఁ గూర్చుండియున్న నాగరిక సఖీజనముం గూర్చి యించుక ప్రప్రథమమునఁ బర్యాలోచించెను.

"మీరు బండిని దోలించుకొని వెడలిపొండు. నాకై నిరీక్షింపవలదు. నాయీ స్నేహితురాలిని స్వగృహముం జేర్చెదను." అని నిశ్చలముగా సుమతి వారితోఁ జెప్పెను.

సుమతి "స్నేహితురాలు" అని పలికిన వాక్యమును విని యెఱ్ఱచేరుమాలుగల తరుణి యత్యాశ్చర్యంబున 2 నిర్విణ్ణ యయ్యెను. ఆమె మారు పలుకలేదు. తక్కుంగల సుందరాంగులకు 3 వాగ్బంధనమే యయ్యెను.

"వెడలిపొండు. నేను మీతో రాఁజాలను." అని సుమతి వక్కాణించెను. సారథి యశ్వంబుల నెమ్మదిగ నదలించెను. అందులో నొకర్తు రథమునుండి వంగి చూచుచుండెను.

"మేమేమియు— అనగా— మా సహాయమును గోరదవా? మేము నీకుఁ 4 బచరింపమా?" అని బండిలోనివారడిగిరి.

"మీరు నాకుపచరింపరు" అని సుమతి కేకవైచెను.

శకటము వెడలిపోయెను. సుమతి సావిత్రితో నొంటరిగ దిగబడెను. సుమతి యటు నిటుఁ జూచెను. గుంపునం దనేకముఖములు సాదరభావంబును జూపించెను. వారందఱును దురాత్ములును, బహుప్రాయులును గారు; పరిశుద్ధాత్మగూడెములోని పెక్కండ్ర 5 ననునయించెను.

"ఈమె నివాసమెక్కడ?" అని సుమతి యడిగెను.

ఎవ్వరును సమాధానము చెప్పలేదు. పిదప సుమతి యొంటరిగ నాలోచించుకొనునప్పుడు తద్వాటీ నివాసులు యథార్థమును వెల్లడించుటకు లజ్జాకుల మానసులై

1 విచారింపదగినది 2 తెల్లపోయెను 3 మాటరాదయ్యెను 4 చేయమా 5 ఓదార్చె

స్థానమును వహించి యాత్మగౌరవమును నాగరికులవలెం గాపాడుకొనిరని గ్రహించెను. నారకకూపోపమంబగు సురాగార సంపర్కంబున నధోగతిప్రాప్తైన యీ 1 యనశ్వరాత్మకు స్వనివాసము లేదని సుమతి యిప్పుడే మొదటిసారి గ్రహింపఁ గలిగినది.

సావిత్రి యాకస్మికముగఁ దన చేతిని సుమతి చేతినుండి లాగికొనెను. అట్లు చేయుటలో సుమతిని దాదాపుగఁ గ్రిందఁ బడవైచెను.

"నీవు నన్ను దాఁకఁగూడదు. నన్ను విడువుము. నన్ను నరకమున కేగనిమ్ము. అది నానివాస స్థానము. సైతాను నాకై యిచ్చట నెదురుచూచుచున్నది. దానిం గాంచుము." అని సావిత్రి మొఱటుగ సుమతి నుద్దేశించిపలికెను. గిరుక్కున వెనుకకుఁ దిరిగి ద్వారముకడ నిలిచియుండిన సురాశాలాధిపతిని జూచెను. ప్రేక్షకు లందఱు నొక్కపెట్టుఁ గడుపుబ్బ నవ్విరి.

సుమతి సావిత్రిం దరిసి తనచేతి నామె మూపున వైచెను. "సావిత్రీ! నాతోఁ గూడ రమ్ము. నరకము నీస్థానము గాదు. ప్రభువైన యేసుక్రీస్తు నీవాఁడు. అతఁడు నిన్ను రక్షింపఁ గలఁడు. రారమ్ము" అని సుమతి దృఢవిశ్వాసముతో నొత్తిపలికెను.

సావిత్రి యేడువ సాగెను. సుమతిం గాంచుటవలనఁ గలిగిన మనోవైకల్యముచే నించుక శమించిన సురోన్మత్తతగలదై యుండెను.

సుమతి తిరిగి తన చుట్టుప్రక్కల బరికించి "సోమనాథశర్మ నివాసమెచ్చట?" అని చెంతనున్నవారి నడిగెను. గుడారమునకు సమీపముననే యెచ్చటనో యాతఁడు నివసించుచుండెనని యామె యెఱుంగును.

జనసంఘమునుండి పెక్కం డ్రామెకు సదుత్తరము నొసంగిరి.

"సావిత్రీ! రారమ్ము. నీవు నాతోఁగూడ సోమనాథశర్మ బసకు రావలెను" అని సుమతి వణఁకుచుండిన యామెపై నాదరభావముతో నుంచిన తన హస్తముం దీయకయే పలికెను. ఆమాటవిని విలపించుచు ముందెంత వ్యగ్రతతో సుమతిం దిరస్కరించెనో యిప్పుడంత సౌమ్యతతోఁ 2 దదాహ్వానము నంగీకరించెను.

ఇట్లు వారుభయులు నచటినుండి వెలువడి సోమనాథశర్మ బసవైపునకు వెళ్ళిరి. 3 ఏతద్దృశ్యాపరు లందఱు నాశ్చర్య వివశులైరి. వారు సురాపానోన్మత్తు లయినప్పుడిట్టి విషయముల సరకు గొనరు. ఇప్పుడట్లు కాదు. చక్కని దుస్తులను ధరించిన భాగ్యవతి పట్టణమునుండి వచ్చి సకల దుష్కారంబుల కాకరంబును, నీచాతినీచ ప్రచారిణియు నగు కాంతం జేపట్టి యుద్ధరింప సమకట్టుటచే సావిత్రికిఁ గూడఁ గొంత గౌరవ 4 మాపాదిల్లెను. సావిత్రి యెల్లప్పుడు నధికముగఁ ద్రావి యొడలెఱుంగక దారి ప్రక్కలనుండు కాలువలంబడి పొరలుచుండుటచే సదా ప్రజల హాస్యప్రసంగముల కాస్పద యగుచుండును. కాన 5 స్మారకము తప్పియుండుటచేఁ దొట్రుపడు నడకతో నున్నతస్థానములను వహింపఁదగిన సుమతి నానికొని పోవుచుండుట వింతకదా! కావున నీవిషయముం దిలకించిన జానపదు లందఱు మహాద్భుత స్వాంతులును, భగవద్ధ్యాన పరాయణులు నైరి.

వారట్లు సోమనాథశర్మ బసకుఁబోయి యడుగ నాదంపతు లిరువురును, నెచ్చటికో వెళ్ళియుండిరనియు, సాయంసమయమునకుఁగాని తిరిగి రారనియు నింటఁగల

---

1 నాశనరహిత. 2 ఆపిలుపు 3 ఇదిచూసి నిచ్చఁగల 4 కలిగెను 5 జ్ఞప్తి

పనికత్తె ప్రత్యుత్తర మిచ్చెను.

సావిత్రి మధుపానోన్మాదమునుండి తెలివిఁగాంచువఱకుఁ దమయింట నుంచుటగాని, లేక 1 తత్తదుచిత ప్రదేశమునఁ జేర్చుటగాని, కావింపుఁడని సోమనాథశర్మను వేఁడుకొనుటకే సుమతి సంకల్పించెను. అంతకు మించిన యాలోచనను జేయలేదు. అందుకుఁ బ్రధానులగు సోమనాథాదు లింటలేరని విని యేమిచేయుటకుఁ దోచక యించుక విచారించుచు సుమతి ద్వారముకడ నిలువఁబడెను, సావిత్రి యెదురుగఁగల మెట్లపైఁ జతికిలఁబడి దన ముఖమును జేతులతోఁ గప్పుకొని మిన్నకుండెను. సుమతి తన కసహ్యము గలుగునేమో యని సంశయించుచు సావిత్రియొక్క దుర్దశం విలకించెను.

తుదకుఁ దా నాపుకొనఁజాలని యొక తలంపు సుమతికిఁ గలిగెను. ఈమెం దీసికొని తన యింటికేల పోఁగూడదు? అందుల కభ్యంతర మేమికలదు? వైద్యాలయంబునగాని ధర్మశాలయందుఁగాని పరుల స్వాధీనము చేయుటకంటె 2 నాసవ దుర్గంధ పూరితంబును, దేహస్మారక నివర్తితంబునగు నీమెను దన స్వగృహంబున నేల కాపాడఁజనదు. వైద్యాలయంబులు మున్నగు ప్రదేశంబుల సుమతి యెఱుంగదు. అట్టివి రెండుమూఁడు స్థలంబుల ధర్మపురిఁ గలవని మాత్ర మెఱుంగును. కాని యిట్టి దురవస్థయందుండిన సావిత్రి వంటి దౌర్భాగ్యవతుల నందుఁ జేర్చుకొనెదరో లేదో సుమతికిఁ దెలియదు. కాని యిప్పుడు సుమతి మనంబును గలఁత పఱచుచున్న దా విషయము కాదు. ఇట్టి స్థితియందుండిన సావిత్రిం గాంచినఁ గ్రీస్తేమి చేయునని మనంబునఁ దీవ్రంబుగ వితర్కించుకొని తత్ఫలముగ సావిత్రి భుజముపైఁ జేయివైచెను.

“సావిత్రీ! రమ్ము. నాతో మాయింటికి రమ్ము, ఆసందుమూల నొక శకటము 3 నధిరోహింతము” అనెను.

సావిత్రి తడఁబడుచు లేచెను. తిరస్కారభావమును జూపమిని సుమతి సంతసించెను. తాను రానని తిరస్కరించి మంకుపట్టు పట్టునని తలంచెను. వారా సందుకొనకేగిచూడ బండి బాటసారులతో నిండియుండెను. వారా 4 జనాకీర్ణ శకటంబు నధిరోహింప నందున్న వారెల్ల వీరిరువురి 5 ననిమేషాక్షులై చూడసాగిరి. ప్రజల వీక్షణ ప్రసారంబులు సుమతికి వాడిములుకులవలె దోఁచెను. కాని యామె దృష్టియంతయు ముందింటికడఁ దన ముత్తవతో జరుగనైయున్న జగడముపై నాటఁబడియుండెను. సావిత్రింజూచి తన ముత్తవ యేమనును?

సుమతి కిప్పుడు కొంచెము తెలివి వచ్చెను. కాని మాటిమాటికి నిద్రాసక్తయగుచుండెను. కావున గ్రిందఁబడకుండ సుమతి యామెను బట్టుకొనవలసివచ్చెను. అనేకసారులు భారముగా సుమతిపయిం బడెను. బండిదిగి వారుభయులును కాలిబాటం బోవుచుండ బలువురు వారిం దేఱిపారఁ జూడఁజొచ్చిరి. వారి యింటి మెట్లెక్కునపుడు ముత్తవతో జరుగు సంఘర్షణకై వెఱచుచుండియు సుమతి 6 మార్గావరోధము లేకుండ సావిత్రి నింటికిఁ జేర్చినందులకు సంతసించెను. సింహద్వారమును మూసి స్వగృహరహితయగు సావిత్రితోఁ దన మహాలు నందలి విశాలమగు సావడిం జేరినతోడనే 7 యాసన్న పితామహీ సంవాదంబునకు సంసిద్ధయయ్యెను.

---

1 ఆయాతగిన. 2 కల్లు. 3 ఎక్కుదము 4 జనులతో నిండిన 5 రెప్పవేయని 6 దారికడ్డు 7 సమీప

పితామహి పఠనాగారంబున నుండెను. సుమతి రాక నెఱింగి సావడిలోని కరుదెంచెను. 1 మహార్ఘగృహోపకరణంబుల నత్యాశ్చర్యంబునం దిలకించుచుండిన సావిత్రి 2 నవలంబించి సుమతి నిలువం బడియుండెను.

నిర్భయంబుగ 3 స్పష్టాభాస స్వనంబున సుమతియిట్లనెను;—"అవ్వా! మాల పల్లెనుండి నానేస్తకత్తె నొకతెందోడ్కొని వచ్చితిని. ఆమెకు స్వగృహము లేక చిక్కులలోనున్నది. కొంచెముకాల మామెనిచ్చట( బోషింప నిశ్చయించుకొంటిని." అవ్వ మనుమరాలిని సావిత్రిని విషాదాశ్చర్య మానసంబున( దేరిపార( జూచెను.

"ఈమె నీ స్నేహితురాండ్రలో నొక్కతెయని చెప్పితివా?" యని యవ్వ సుమతికి మున్నెన్నడును గలుగనంతటి విషాదమును గొలుపు క్రూరదృష్టితో జూచుచు( బలికెను

"ఔ నట్లే చెప్పితిని" అని సుమతి బదులు చెప్పెను. ఆమె ముఖపద్మము 4 క్రోధోద్రిక్తత నెఱ్ఱబాఱెను. "పాపుల స్నేహితు(డు" అని సోమనాథశర్మ పాడిన కీర్తన జ్ఞాపకమునకు రాగా మనశ్శాంతినందెను. నిశ్చయముగా దాను జేయుచున్న యీ కార్యమునే క్రీస్తును సేయును.

అవ్వ సుమతిని సమీపించి 5 యుపహరించి క్రోధారుణిత లోచనయై "యిది యెవ్వతెయో నీ వెఱుంగుదువా?" అనెను.

ఈమె తాను(గూడని 6 మతంగ కన్యయని నెఱుంగుదును. అవ్వా! అవిషయమును నీవు నాకు( జెప్పనక్కఱలేదు. నీకంటె నాకెక్కువ బాగుగ( దెలియును. ఇప్పుడీ ఋణమునకు జెడ(ద్రాగి యున్నది. ఈమెయు దైవ సంతతియేగదా! శివుని యెదుట సాష్టాంగపడి తన పాపముల నొప్పుకొని పశ్చాత్తాప పడెను. పిదప యమలోకము, ఆమెను దిరిగి యావరించెను. కావున నీవెఱు నేను చేయ(దగిన సహాయ మింతియే. సైతానుబారినుండి తప్పించుటయే యైయున్నది. అధోగతిపాలయి నిలువ నీడలేక శాశ్వత నరకరూపంబున( గూలనున్న యీమెం జూచుము. మనకు దైవము పరోపకారము సేయుటకు( దగినంత భాగ్యము ననుగ్రహించెను. ఈమె నిచ్చటికి దీసికొనివచ్చితిని. మనయింట గొన్నిది కాలముంచి బాగుసేయుదము." అని సుమతి యవ్వతో( జెప్పెను.

పితామహి కన్నులెఱ్ఱ(జేసి తదేకదృష్టితో సుమతిం జూచుచు 7 ముకుళితకరకమల యయ్యెను. ఆమె బాల్యమునుండియు నభ్యసించిన సాంఘికాచారముల కిది మిక్కిలి 8 వైరుధ్యముగ నుండెను. వీధులలో నాఱిప్రక్కల( జెట్లక్రిందనివసించు నీచాంగనా సాంగత్యమును సంఘ మెట్లు సహించును? సుమతి సంకల్పించిన యీ యనాలోచన కార్యమునకు( గుల గౌరవము, వంశ మర్యాదయు నెంత తగ్గును! పరులెంత యాక్షేపింతురు! ఖ్యాతి నశించును. ధనవంతులు శక్తిమంతులునగు ప్రజానాయకులతో( బొంద(దగిన యుచ్చస్థాన 9 పాతము సంభవించును. పితామహి దృష్టిలో( గ్రైస్తవుల కూటములుగాని, తదితర విషయములుగాని సాంఘిక గౌరవమునకు మించినవి కావు. భయభక్తులతో 10 ననునయింప దగినది సంఘమర్యాదయని యామె తలంపు. ధనశాలి

1 విలువలేని 2 పట్టుకొని 3 వెల్లడియగు. 4 క్రోధాధికతను 5 చేతులచాటు పెట్టి 6 మాల 7 ముకుళించబడిన 8 విరుద్ధము 9 పతనము 10 బూరడింప

ము తప్ప దక్కిన నష్టములు, ఈ సాంఘికాపకీర్తిభయమునకంటె దప్పువవి.

ఆమె నిశ్చలముగ బిఱ్ఱబిగిసి నిలువఁబడెను. తన మనంబునఁ గర్తవ్యాంశమున దృఢనిశ్చయము నొనర్చుకొని సుమతి [1] యభిముఖి యయ్యెను. సుమతి సావిత్రి భుజమును దృఢముగఁ దన హస్తమునందుంచి దగ్గఱ దీసికొని పితామహి యెదుర్కొనన సంసిద్ధురాలై తేరిపారఁ జూచెను.

అవ్వ— సుమతీ! నీవట్లు సేయఁజనదు. అనాథ శరణాలయంబున కామెను బంపవచ్చును. కర్చంతయు మనమే భరింపవచ్చును. కాని మన గౌరవమును గాపాడుకొనుటకై యామెను మనయింట నుంచుకొనఁ జనదు.

సుమతి— అవ్వా! నీకనిష్టమును జేయు సంకల్పము నాకెన్నటికిని లేదు. ఈ రాత్రికి సావిత్రి నిచ్చట నుంచుకొనక తప్పదు. అవసరమని తోఁచెనేని మఱికొంతకాలమిచ్చటనే నిలుపవలసి వచ్చును.

అవ్వ— అట్లయిన స్వయంకృతాపరాధ ఫలితమును నీవే యనుభవింతువు. ఇట్టి దుర్మార్గ ప్రవర్తనగల [2] కులటలతో నేనీ యింటనుండఁజాలను. ఇంక నామె కాత్మ నిగ్రహశక్తి తప్పెను. ఆత్మోద్రేకము నింకను వెలిబుచ్చకమున్నె సుమతి యడ్డుదగిలి యిట్లనెను :—

"కమలాంబా! యిది నాయిల్లు. నీవు నాతోనుండ నిచ్చగించినంతకాలము నీయిల్లె యగును. ఈ విషయమునఁ గ్రీస్తు నాస్థానమునందుండిన నెట్లు సంచరించునో నేను నట్లే సంచరింప నిశ్చయించుకొంటిని. ఉన్నత సంఘమున నన్నెట్లు తలంచిన నేమిచేసిన దానికి సంసిద్ధముగ నుంటిని. సంఘము నాకు దేవుఁడు కాదు. వశింపనై యున్న యీ పేదరాలి యాత్మోద్ధరణము ముందీ సాంఘికావమానము నిస్సారము."

"అట్లయిన నేనిచ్చట నుండఁజాలను." అని పితామహి ప్రవచించెను. గిరుక్కున వెనుకకు మరలి చావడి చివరకు వెళ్ళెను. తిరిగి వెనుకకు వచ్చి యామె దండంబును [3] గొందలమందించుచున్న సంపూర్ణావేశముతో నిట్లనెను:—

"ఒక త్రాగుబోతు కొఱకు నీపితామహి నిలువెడల నడఁచితివను ఖ్యాతిని సర్వకాలము వడయుదువు గాక!"

ఇట్లని సుమతి ప్రత్యుత్తరము నిచ్చుటకు సావకాశము నీయక సౌధోపరి భాగంబునకుం జనెను.

సుమతి యొక దాసిం బిలిచి సావిత్రి నామె వశపఱచి వివిధోపచారంబులఁ గావింప నాజ్ఞాపించెను. కయిపు తలకెక్కుటచే నామె మిక్కిలి హీనావస్థ పాలగుచుండెను. చావడియందున్న స్వల్పకాలములో నామె గాఢముగ సుమతి [4] కరాకర్షమును గావించుటచే జేయి బరువెక్కి బాధింపఁజొచ్చెను.

కమలాంబ యిల్లు విడిచి వెడలిపోవునో లేదో సుమతి యెఱుంగదు. ఆమెకు మితిమీఱిన ధనముకలదు. శరీర స్వాస్థ్యమును గలదు. ఆత్మరక్షణ సామర్థ్యముకలదు. ఆమె సోదర సోదరీమణులు దక్షిణదేశంబునం గలరు. ఆమె ప్రతివత్సరమునఁ గొంతకాలము వారి సన్నిధిఁ గడపుచుండు నాచారమును గలదు. పితామహి వార్ధక్యమునఁ గష్టపడవలసి వచ్చునను భయము సుమతి కింతమాత్రమును లేదుగాని పూర్వోక్త పర

---

1 ఎదురయ్యెను 2 రంకులాడి. 3 విచారపెట్టు 4, చేయిపట్టుకొనుట.

స్వైర సంభాషణ మామెకు విషాదమును గలిగించెను. తన గదిలోనికేగి తేయాకునీరుఁ ద్రావి వచ్చుటకు ముందీ విషయములం గూర్చి యొంటరిగా మననము జేసెను గాని యందుఁ దాను పశ్చాత్తాపము నందుటకు తగకారణ మేమియుఁ గనుపింపలేదు. క్రీస్తేమి చేయును? ఇట్లే చేయును. తాను న్యాయ్యమైన కార్యము నొనర్చితి ననువిషయమున సందేహమేమియు లేదు. ఒకవేళ నందులోపమేమైన దొరలినను అది బుద్ధిపూర్వకము గాదు. పొరబాటు కావచ్చును. ఫలాహారమునకు రమ్మనుగంట మ్రోగినతోడనే సుమతి క్రిందికిఁ బోయెను. ముత్తవ యచ్చోటికి రాలేదు. ముత్తవం బిలువుమని సేవకునిం బంపెను. సేవకుఁడు తిరిగివచ్చి యామె గదిలో లేదని ప్రత్యుత్తర మిచ్చెను. కొలఁది నిముసములలో భానుమంతుఁ డచ్చటి కరుదెంచి తన పితామహి సాయంకాలపు రైలుమీఁద దక్షిణదేశమునకుఁ బయనమై పోయినను వార్తను నివేదించెను. కొందఱి స్నేహితుల సాగనంపుటకు కాతఁడు రైలుకడకుఁ బోయెను. అచ్చట నాకస్మికముగఁ బితామహిఁ దిలకించెను. తాను లేచిపోవుటకుఁ గలకారణము నామె యాతనితోఁ జెప్పెను.

భానుమంతుఁడును సుమతియు విచార[1] గ్రస్తములగు ముఖకమలములతో బల్లయొద్దఁ గలిసికొనిరి.

"తమ్ముఁడా! నేను తప్పుఁజేసితినా? నీవు నన్ను నిందింతువా?" అని సుమతి సోదరునితో ననెను. భానుమంతుఁడు క్రైస్తవాదర్శము నవలంబించిన పిదప సుమతి తన సోదరుని యందుఁ గలిగిన మార్పునకుఁ దానొందు సాహ్లాదమును వెలువరించుచు నతనితో ముచ్చటించుట కిదియే మొదటిసారి.

"నీయెడల లోపమున్నదని నేననుకొనఁ జాలను. ఈ విషయము మనకుఁ గనుంగడు విషాదకరమే యగును. కాని యా పేదరాలు నీసాహాయ్యంబున నుద్ధరింపఁ బడఁగలదని నీవు విశ్వసించినచోఁ జేయఁదగిన కార్యమిదియే. సుమతీ! మనమిన్ని వత్సరములనుండియు స్వార్థపరాయణులమై స్వైరవిహారులమై మనకుఁ గరగతమైన యీ మహాభాగ్యమును స్వోదర పోషణార్థమే వినియోగించు చుంటిమి. ఈ స్త్రీని బోలినవారు పలువురు కలరను విషయమునే గమనింప మైతిమి. క్రీస్తే మన స్థానము నాక్రమించిన నాతఁడు నిశ్చయముగ నీవొనర్చినట్లే చేయును." అని భానుమంతుఁడు బదులు చెప్పెను.

ఇట్లు భానుమంతుఁడు సుమతి నోదార్చెను. ఆరాత్రి వారన్యోన్యాలోచనంబులఁ గాలమును బుచ్చిరి. సుమతి దైవానుకరణ ప్రతిజ్ఞఁ గావించుటచేఁ గలిగిన మార్పులన్నిటికంటెఁ దనసహోదరుఁడగు భానుమంతుని యందుఁ గలిగిన మార్పే యపరిమితాశ్చర్య దాయక మయ్యెను. క్రీస్తునందు జీవించుచున్న యాతఁడు నిశ్చయముగా మారుమానిసి యే. ప్రాతపద్ధతు లన్నియు నశించినవి. ప్రభువునం దన్నివిషయములును క్రొత్తవిగాఁ[2] బరిణమించెను.

సుమతి పిలువనంపు వైద్యభూషణుఁ డాదినము సాయం సమయమున విచ్చేసి సావిత్రికి పలువిధ వైద్యోపచారంబులఁ గావించెను. జన్మవ్యాధి యంకురించునంత విశేషముగా మధుపాన మొనర్చినది. ఆమె నిప్పుడు సంపూర్ణ విశ్రాంతి నిచ్చుట

1. మునిఁగిన. 2 అపూర్వము

సకలోపచారంబు లొనర్చుట, ప్రేమాస్పదంబుగ నాదరించుట మున్నగు సాధనముల నీడ దేర్పవలయును. ఆదివ్య భవనంబునం గల యొక్క రమ్యమగు గదిలో సముద్ర ప్రాంతమునఁ జరించుచున్న ప్రభుని పటము నెదురుగ గోడకు వ్రేలాడఁగట్టి కలవరపాటుగల యామె కన్నులు దెరచినప్పుడెల్లఁ గాన్పించుటచేఁ బ్రభుభక్తి నెలకొనునట్లేర్పరచి, సావిత్రి నాగదిలోఁ బరుండఁబెట్టిరి. ఇట్టు లొడలెఱుంగక మధుపాన జనిత జ్వాలా 1 దందహ్యమానాంగముల నిటునటుఁ బొరలుచు విశేష బాధోపేతయగు సావిత్రిం దరిసి పరిచర్య సేయుటచే సుమతికిని భగవత్సాన్నిధ్యము సమీపించినట్లుండెను.

ఈనడుమ మాలగూడెమంతయు నెన్నికలెట్లు పరిణమించునో చూతమని శ్రద్ధాళువులై యుండిరి. సోమనాథశర్మయు, వాని 2 యర్ధాంగలక్ష్మియు, నీ నీచమానవుల దౌరాత్మ్య దౌర్భాగ్యంబులం గాంచి కడుంగడు విలపించుచుండిరి. దినమంతయు నాదంపతులు సకల శ్రమలకోర్చి వారిం బ్రభుభక్తి పరతంత్రులనుగా నొనర్ప నేసందునని దౌష్ట్యచింతనలు వారి వ్యాపృత్ఫలకంబుల నాకర్షించి తుదకు దుష్టస్థానంబులఁ జేర్చుచుండెను.

ధర్మపుర్యాలయారాధనాంతస్సమావేశములు యథావిధిగ నెరవేరుచుండెను. ఎన్నికలం గూర్చిన సభ జరిగిన వారాంతాదివ్యవాసరంబునఁ గణ్వుఁడు విద్యుక్తకాలంబున నుపన్యాస మందిరంబునఁ జేర నాతఁ 3 డాపాదమస్తకాంతము గగుర్పాటుఁ జెందునంతటి తీవ్రసంకల్పముతో సభ్యులాతని కాహ్వానము నొసంగిరి. నృసింహాకవి వేడుమ సభ్యులలోఁ గాన్పింపలేదు. తక్కుంగల వారందఱును వచ్చి కూడియుండిరి. పరస్పర విశ్వాస మినుమడించు నైకమత్యము ప్రస్ఫుటముగ వారి నావరించియున్నది. ప్రతివారును దమ తమ స్వానుభవముల నిస్సంశయముగ సాంఘికులకు వెల్లడించుటయే శ్రేష్ఠమతమని వారు భావించిరి. పురూరవుఁడు తన పత్రికకు దైవానుకరణాదర్శంబునఁ గలుగుచుండిన కష్టసుఖముల స్వభావసిద్ధముగ నచ్చటి వారికి నచ్చఁజెప్పెను.

"గడచిన మూఁడు వారములలో నాకు ధననష్టము విశేషముగఁ గలిగినది. ఎంతయో వివరించి చెప్పుటకు సాధ్యపడదు. దినదినమును బెక్కండ్రు చందాదారులు పత్రికం దిరస్కరించు చుండిరి." అని పురూరవుఁడు చెప్పెను.

కణ్వుఁడు:—పత్రికం దిరస్కరించుటకు వారేమి కారణములఁ జెప్పుచుండిరి?

ప్రత్యుత్తరమునకై యందఱు నాతురతతో నిరీక్షించిరి.

పురూరవుఁడు— పలువురు పలుతెరంగుల సమాధానములఁ జెప్పుచున్నారు. కొందఱు దేశవార్తల నన్నిటిని దెలుపు పత్రిక తమకు వలయుననిరి. నేరముల వివరములు, మల్లయుద్ధములు మున్నగు నుద్రేక కరాంశములు, అపవాదములు, ఇంకను బలువిధములగు ఘోరకృత్యముల వర్ణనములు, మున్నగు విషయములు పత్రికలం జదువఁ గోరెదరు. ఆదివారమున బత్రిక నిలుపుచేయుట తగదని కొందఱు వ్రాసిరి. ఆదివారమునాఁడు ప్రచురింపఁబడు పత్రికయందు ముద్రణమగు కాకితముల నినుమడించి యితర దినముల చందాదారులకుఁ బంపుచుండినను నాదినమున బత్రిక ప్రచురింప నందులకు వందలకొలఁది చందాదారులు మానుకొనిరి. పొగాకు, సారాయి, బ్రాంది మున్నగు వా.

1 మిక్కిలి కాల్పబడిన 2 భార్య 3 కాలు మొదలు తలవఱకు.

కారిష్ట పదార్థ ప్రచురముల నిలుపుచేయుటచే మిక్కిలి నష్టముకలిగినది. పురపాలకుల యెన్నికల విషయమున నే నవలంబించిన రీతి వలన మిక్కుటమగు ననర్థ 1 మాపతిల్లినది. ఈ చరమ కార్యము తదితరములకంటెఁ బ్రబలారిష్ట దాయకమయ్యెను. మా పాతకులఁ బెక్కుండ్రు వైరివర్గములోని వారు. ప్రజాప్రాతినిధ్య విషయమున నేనీవిధానము నే నవలంబించి ప్రభుమార్గానువర్తి నగునెడ మన పట్టణమునందలి క్రైస్తవులందఱు నాదరించిననే తప్ప పత్రిక స్వయంప్రకాశత నంద నేరదు.

పురూరవుఁడు నిజకథా 2 కథనము నించుక నిలిపెను. గదిలోనివారందఱును నిశ్శబ్దముగ నుండిరి. సుమతి మిక్కిలి యభిలాషతో విననుంకించి యుండెను. ఏష యాసక్తత నామె ముఖకమలము విరిసియుండెను. ఈ విషయము నే తదేకదృష్టితో ధ్యానము సేయువానికిఁ గలుగునంతటి యాసక్తి సుమతికిఁ గలిగెను. పురూరవు డిట్లు చెప్పఁదొడఁగెను ;—

“ధర్మపురీ క్రైస్తవసంఘమే దైనిక పత్రిక నుద్ధరింపవలయును. కేవల క్రైస్తవపత్రికయం దాదరణములేని వారందఱును బత్రికం దెప్పించుకొన మానిరి. బజారున వెలకు దొరకు వస్తుసామగ్రి ధరవరల నెఱుంగ గోరువారును నవమానించిరి. క్రీస్తు తాను స్వయముగఁ బ్రచురించు పత్రికను గొనునంతటి భక్తిపరులీ క్రైస్తవసంఘమునఁ గలరా? క్రైస్తవాదర్శముల సరకు సేయక రాక్షససంయుక్త 3 కిల్బిషాకర్షణ విధానసంకులంబగు లోకసామాన్య పత్రికాపఠనమునే గోరునంతటి నీచావస్థకు బాల్పడెరా? ఏక కార్యాసక్తులగు మన సంఘము వారితోఁ జెప్ప లజ్జింప నవసరములేదు. దైవానుకరణవిధానము నాశ్రయించుటకే పత్రికావ్యాప్తి దిగభాగింపఁ బడుటయేగాక సాధన సంపత్తియు మిక్కిలి కొఱవడినది. పత్రికా ప్రచురణమునం గూడనే స్వ వ్యాపారవిషయములలోఁ గూడ దైవేచ్ఛ ననుసరింప నేను బ్రయత్నించుటయుఁ దటస్థించుటచే నెల్లెడల నాకు ధన నష్టమే సంభవించినది. మన యేర్పరచుకొనిన విధానము ననుసరించి యిది లాభించునా లేదా యని విమర్శింపఁ జనదు. మన కృత్యముల నన్నిటిని క్రీస్తంగీకరించునా లేదా యనియే వితర్కింపవలయును. ఈయాదర్శము ననుసరించుటచేఁ బత్రిక ప్రారంభించినది మొదలు నేటిదనుక నే నార్జించిన ధనమంతయు నష్టమైపోయినది. అంతచ్ఛిద్రంబుల నిందు వివరింపఁ బనిలేదు. 4 త్రైవార కానుభవంబునఁ గ్రైస్తవాదర్శము నవలంబించుచు వారెల్లరుఁ బ్రకృత కాలానుసరణ వ్యాపారంబుల మిక్కిలి కష్టము నందగలరని సువ్యక్తమయినది. నవీన పథకానుసరణంబున దైనిక పత్రిక విజయము నందఁగలదను నమ్మకముననే నాకుఁ దటస్థించిన నష్టములం గూర్చి మీతో ముచ్చటించితిని. ప్రకృతావస్థం గాంచిన మన యూరఁగల క్రైస్తవులును, ఆలయసంఘమును దైవానుకరణా మోదకులను, పత్రికను జందాలవలనను బ్రకటనల వలనను దోడ్పడి కొనసాగింపనిచో నేనీపత్రికను జిరకాలము నిర్వహింపఁజాలను”

సుమతి యొక ప్రశ్న నడిగెను. పురూరవుని ప్రత్యుత్తరము నత్యాదరముతో నిరీక్షించెను.

సుమతి— క్రైస్తవ కళాశాలలకు వలెనే క్రైస్తవ వార్తాపత్రికలకును విశేష మూలధనముండిననే గాని యభివృద్ధినందఁ జాలవని మీరూహింతురా?

---

1 సంభవించినది. 2 చెప్పుట 3 పాపము చేర్చుకొనుట 4 మూడువారముల యనుభవము.

పురూరవుఁడు— నిశ్చయముగ నాయభిమత మదియే. దుర్విషయప్రకటనముఁ గావింపకయే క్రైస్తవాదర్శములతో మన పత్రికను గ్రైస్తవేతర పత్రికలవలె నాహ్లాదజనకమగు వ్యాసములచేఁ బూరింపఁగలపద్ధతుల నాలోచించితిని. ఆవిధుల ననుసరించుటకు విశేషధనము కావలయును. క్రీస్తు హర్షింపఁదగినట్టియు, నాతఁడు స్వయము నైన ముద్రింపఁదగినట్టియు సంగతులనె ప్రచురించుచు నుచితరీతిని బనిచేసిన క్రైస్తవపత్రిక జయప్రదమే యగునని నా నమ్మకము అనెను.

సుమతి—ఎంత ద్రవ్యము కావలయునని మీరెంచెదరు. అని నెమ్మదిగ నడిగెను.

పురూరవుఁ డామె యాంతరంగికావస్థం గుర్తించుటచే నామెవంకఁ దేరిపార సూక్ష్మదృష్టితోఁ జూచి, 1 హర్షపులకితాంతరంగుండయ్యెను. ఆమె చిన్నతనమునం దాదివారపు బడిలోఁ జదువునప్పటినుండియు నాతఁడెఱుఁగును. వ్యవహార విషయములం దామె తండ్రితో నత్యంత మైత్రిమై మెలంగెడివాఁడు.

పురూరవుఁడు—ధర్మపురివంటి పట్టణమునం దరలక్ష ధనము మూలధనంబుగ నుండిన నేనుద్దేశించిన విధానంబున నొక దైనికపత్రికను నిరాఘాటంబుగ నడుపవచ్చు ననెను.

ఆతని కంఠస్వర మించుక గద్గదికము నందెను. ఇట్టి సహాయము లభించిన పత్రికాప్రచురణ విధానంబుననే లోకమునంతను మతవిషయమునఁ దారుమారు చేయ నగునని పురూరవుఁడు దనమనంబునం దుబ్బిలులూరుచుండెనని ప్రేక్షకులకుఁ బ్రస్ఫుటమగుచుండెను.

ఆయంశము నింతకుమున్నే పూర్తిగ విమర్శించినదానివలె సుమతి యిట్లనియె—

"తామిప్పు డుపక్రమించిన రీతిని పత్రికను బ్రకటింప సన్నద్ధులగు నెడ నా ద్రవ్యము నేనిప్పు డొసంగుదాన"

"దైవము కొనియాడఁబడును గాక!" యని కణ్వుఁడు నెమ్మదిగ ననెను. పురూరవుఁడు తెల్లపోయి చూచుచుండెను. మిగిలిన వారందఱును నిశ్శబ్దముగ సుమతిపై 2 చక్షుప్రసారమును గావించిరి. ఆమె యింకను జెప్పవలసిన దున్నది.

ఆమె ప్రసంగం బీషద్విషాద వ్యాప్తంబుగ నుండెనని తత్తద్విషయంబుల నేకాంతంబున విమర్శించుకొనునప్పుడు ప్రేక్షకులు తలంచిరి.

సుమతి—స్నేహితులారా! నేనెద్దియో 3 సార్వజనీనంబగు మహాకార్యంబు నాచరించితినని మీరెవ్వరుం దలంపఁజనదు. నేనింతదనుక నాతని తలంచుచుండిన యీ ద్రవ్యమంతయు భగవంతునిదిగాని నాయది కాదని తెలిసికొంటిని. దైవాదాయమునకు నేను ధర్మకర్తనై దాని నాతని యుద్దేశానుసారంబుగ వినియోగింపఁ గడంగినంతన స్తోత్రపాత్రఁ గాఁజాలను. ఈపత్రికానిర్వహణ విషయమునే కొంత కాలమునుండి తలంచుచుంటిని. మిత్రులారా! మన మిప్పుడు మద్యపాన నివారణ విధానంబునఁ బడవలసిన పాట్లలో—అట్టి శ్రమ లిప్పుడే ప్రారంభమైనవి—క్రైస్తవాదర్శంబుల మన దైనిక పత్రిక నిరాఘాటంబుగ నుద్ఘోషింప వలసియున్నది. తక్కుంగల పత్రికారాజంబు లన్నియు సురాపాన మోదకంబులని తా మెఱింగిన విషయమే. సురాగారములు నిలిచియుండునంతకాలము గూడెమునందలి ప్రజల నుద్ధరింపఁ

1 సంతోషముతో గగుర్పొడిచిన 2 చూపులను 3 సకలజనహితకరంబగు.

బలుయి ప్రయత్నములు ప్రాయికముగా విఫలములే యగుచుండును. మద్యవిక్రేత లాకర్షించుచుండ సురాపానాభిలాషు లగువారల నుద్ధరింప సోమనాథశర్మ యెన్ని యుపన్యాసముల నిచ్చిన నేమి ప్రయోజనము? క్రైస్తవ దినవార్తాపత్రిక యుండితీర వలయును. మన పత్రిక నిలిచిపోయిన శత్రువునకు లోఁబడినవార మే యగుదుము; పురూరవుని శక్తిసామర్థ్యములయెడ నాకు మిక్కిలి విశ్వాసము కలదు. అతఁ డేర్పరచిన విధానమును నే నింకను జూడలేదు, పత్రికా వ్యాపారమును సరిగాఁ జేసినయెడల నాతఁడు జయప్రదముగ నిర్వహింపఁగలఁడని నే నెఱుంగుదును. ధనము నార్జించు విషయమును గూడఁ గ్రైస్తవేతర పత్రికాధిపులకంటెఁ గ్రైస్తవ పత్రికాధిపులు తీసిపోదురని నేననుకొనను. కావున నే క్రైస్తవాదర్శముల ననుసరించి దివ్యముగాఁ బనిసేయు నీపనికి వలయు ద్రవ్యము నిచ్చుటకు సంసిద్ధురాల నైతిని. ఇది దేవుని ధనమే. దైవకార్యమున వినియోగించుచుంటిని. పత్రికా విధాన మివ్విధంబున నొకవత్సరంబుదనుక నిర్విఘ్నంబుగ నెరవేరినచో నీద్రవ్యము సద్వినియోగమైనదనియే తలంతును. మీరిందులకు నన్ను గొనియాడ వలదు. నేఁ జేయు ద్రవ్య సహాయ్యము నద్భుతముగ నెంచకుఁడు. ఇంతకాలమునుండి భగవద్దత్తమగు నీద్రవ్యము నెట్లు వినియోగించుచుంటిని? స్వసౌఖ్యమునకే గదా! నాకోర్కెల నెరవేర్చుకొనుటకే గదా! ఇందనుక దైవ ద్రవ్యమునుండి స్వఫలాపేక్షకురాలనై నేనార్జించిన పాపము 1 నుపశమింపఁ జేసికొనుట కేమాత్రమైనఁ జేయవలదా! ఈ విషయమును నేనిట్లు భావించుచుంటిని. క్రీస్తు తానిట్లే చేయఁగలఁడని నేను నమ్ముచుంటి.

భగవదాత్మ తత్సమావేశ మందిరముమీఁదఁ బ్రసరించుచుండెనని కన్నులకుఁ గాన్పింపకుండిన నందలి వారిమనంబులకుఁ బ్రస్ఫుటంబుగ గోచరించుచుండెను. ఒక్కక్షణ మెవ్వరును మాటలాడక నిశ్శబ్దంబుగ నుండిరి. అందఱుదన వంకఁ దేరి పారఁజూచుచుండఁ గణ్యుఁడు నిలువం బడియుండి యీ పందొమ్మిదవ శతాబ్దము ప్రథమ శతాబ్దముగ మారినదనియుఁ అప్పటివలె దరిద్ర్యాదికములు సంఘాదాయకముగ నిప్పుడు పరిణమించుచుండెననియుఁ దలపోయుచుండెను. ధర్మపురాశ్యాలయ సంఘమునను నెన్నఁ డిట్టి ఐకమత్యత ప్రబలలేదని యెంచుచుండెను. కొలఁది కాలము క్రిందట యా క్రైస్తవాదర్శము నవలంబింపఁ గొందఱు ప్రతిజ్ఞ గావింపకము నైకమత్యతయే లేదు. ఈ దేశకాలావస్థలు 2 విపరీతములని యాతఁ డిప్పుడు తలంపలేదా? అంతకు మున్నందఱు నట్లే తలంచిరి. మున్నెన్నఁడు నెఱుంగని సోదరభావ మిప్పుడు వారి నలముకొనియెను. సభపతి ముచ్చటించునప్పుడును బిదప నిశ్శబ్దంబుగ నుండినప్పుడు నీ సహోదర భావమే ప్రబలెను. ఈ మనోభావము నెవ్వరయిన బహిరంగముగ వక్కాణింప నెంచినచోఁ గ్రైస్తవాదర్శము నవలంబించిన నాఁడు గష్టము లెవ్వి తటస్థించిన నిట్టి యాదర్శా 3 వలంబకులగు నీసంఘమునం గలవారెల్ల దాఁ బాల్గొందురని చెప్పినట్లగును.

వారిపై పర్యటనము గావించుచుండిన పరమాత్మయే యిట్టి మనోభిప్రాయముల వారికిఁ గలిగించెను. మున్ను క్రీస్తుని ద్వాదశఛాత్రు లెట్టి విశ్వాసమునకుఁ బాత్రులై మానసిక శారీరక బాధలనోర్చిరో యట్టి విశ్వాస మిప్పట్టున వీరి కందఱికిని గలిగెను.

వారీమందిరమును విడిచి పోకమున్ను పురూరవుని వలెనె మెకళాండ్రుడు తమతమ

---

1 పోఁగొట్టుకొనుటకు. 2 మారినవి 3 పూనినవారు

కష్టసుఖంబులఁ బరస్పరము దెలుపుకొనిరి. [1] యువకులు కొందఱిట్టి యాచరణంబునఁ దమ జీవనోపాధులకు భంగము కలిగెనని నుడివిరి. ఉచితకాలంబుల నేరస్థులపైఁ దగు చర్య జరిపెదమని యధికారులు తెలిపిరని సుమంతుఁడు వెల్లడించెను. కర్మాగారంబునఁ దన యుద్యోగ మంతరించుటచేఁ [2] దంతి వార్తాగారంబునఁ దన పూర్వపుబనిలోఁ జేరెను. అతఁడిట్టి నీచోద్యోగము నవలంబించినది మొదలు వాని భార్యయుఁ బుత్రికయు బహిరంగముగ సంఘమునఁ దిరుగుట మానిరి. అతనికి గలిగిన కుటుంబ కలహమును వారియాదర్శము నపార్థంబుగఁ బరిగణించుటచే గలిగిన విషాదంబును వానికే తెలియును. అచ్చట సమావేశమయిన వారిలోఁ బెక్కండ్రిట్టి విషాదములఁ బాల్పడిన వారే. ఇవి వారు ముచ్చటింపఁదగిన విషయములు కావు. కణ్వుఁడు తన సంఘస్థితిగతులను బాగుగ గుర్తించినవాఁడగుటచే ననేక కుటుంబములలో అప్రతిజ్ఞవలనఁ గలహంబులు పొసఁగి పెక్కుశ్రమలకు హేతుభూతము లగుచుండెనని గ్రహించెను. “ఒకనికి విరోధులు తన కుటుంబముననే యుందురు.” ఏక కుటుంబములోని కొందఱు క్రీస్తు ననుసరించుటయు, మఱికొందఱు తిరస్కరించుటయుఁ దటస్థించుటచే నిట్టి వైరుధ్యంబులు పొసఁగును. ప్రభువు జీవులలోని భేదమును విభజించువాఁడు. ప్రతి మనుజుఁడును వాని ననుసరింపవలయును, లేదా వ్యతిరేకముగనైన సంచరింపవలయును.

ఈ సమావేశంబున వారిలో నందఱి కైకమత్య భావము మొదలయ్యెను. ఇట్టి భావ మింక నుత్కృష్టదశం జెందలేదని యెఱింగి కణ్వుండీ విషయముంగూర్చి ముచ్చటించెను. అట్టి యేకీభావ మున్నతస్థితిం జెందిన వారెట్లుందురో యాతఁడెఱుంగఁడు గాని దానికై భయపడలేదు. వీరందఱిలోఁ దమతమ ప్రతిజ్ఞల నిర్వహింపఁ బ్రయత్నించుటలోఁ బడుచుండిన శ్రమల నత్యాదరభావంబున బరికించుచుండెను. ఇట్టి శ్రమానుభవ మద్భుతావహంబుగ నుండెను. వీని ఫలితము దేశమునం దెల్లెడల వ్యాప్త మగుచుండెను. సంవత్సరాంతమునకు ఘనీభవించు నీ శక్తి యెట్లు పరిణమించునో ప్రవచింప నెవ్వనికి శక్యము?

పురూరవునికిఁ బత్రికా నిర్వహణమునకై వలయు ధనము లభించుట వలననే యీ సాంఘిక శక్తిని గొంతదనుక గ్రహింపనగును. సమావేశాంతంబున నందఱు వానిం జుట్టుకొనిరి. ధర్మపురినుండు క్రైస్తవులందఱు సాయపడుదని యాతఁడు ప్రకటించిన కోర్కికిఁ బ్రతిఫలమును వారందఱును నిష్కర్షగఁ దెలిపికొనిరి. ఇట్టి పత్రికా రాజంబు గృహంబుల నలంకరించుటచేఁ గలుగు విశేషంబును [4] పదంపడి యిట్టి దుర్ఘటకాలంబున దానివలనఁ గలుగు జనోపకారంబును గణింప నశక్యము. పత్రికా నిర్వహణమున కింత ద్రవ్యము లభించెనుగదా! ఇఁక నా పత్రిక యెంత దేశోపకారమును గావించునో ఫలితమునుబట్టి తెలిసికొన వలసియున్నది. పురూరవుఁడు చెప్పినట్లు ద్రవ్యలబ్ధి మాత్రమునఁ బత్రికాభివృద్ధి కానేరదు. పురంబునఁ గ్రైస్తవ శక్తి సామర్థ్యంబుల వెదజల్లు మహాశక్తిగాఁ బరిణమించుటకుఁ గ్రైస్తవులందఱుఁ దోడ్పడి యాదరింప వలయును.

ఈ సమావేశానంతరమున వచ్చిన యాదిత్యవాసరము పట్టణస్థుల కందఱికిని దీవ్రజనితావేశంబుగ నుండెను. ప్రతినిధుల నెన్నుకొను వార మిదియే. విద్యాధరుఁడు

1 ప్రాయపువారు 2 బెల్జిగాము 3 విచారము 4 అరుగ.

తన వాగ్దానానుసరణముగఁ దన సిలువను మోచికొని పాటుపడ నారంభించి బహిరంగముగ వెలువడెను. అతఁడు దృఢ సంకల్పుఁడగుటచే మనోద్రేకం బతిశయించి యొకటెఱుంగక తానింతదనుకఁ బాతుకొని యుండిన గ్రంథరాజంబులనుండి వెలువడి తన యుపన్యాస రూపంబునఁ బ్రజాంతఃకరణంబులఁ బ్రవేశింపఁ జొచ్చెను. క్రైస్తవుఁడయ్యు నిట్టి శ్రమను మున్నెన్నఁడుఁ బడినవాఁడు కాఁడు. విశ్వవిద్యాలయోపాధ్యాయులు కొందఱతని యుద్యమమునకుఁ దోడ్పడిరి. వారికిని దదితరులకువలెనే శ్రమ లధికముగఁ గలిగెను. వారు నాతనివలె నడుగు బయటఁ బెట్టినవారు కారు. 1 సురావిక్రేతల 2 నోహటించి వారి యుద్యమమును నశింపఁజేయ విశ్వప్రయత్నముఁ జేయుచుండిన కల్వాని విషయముఁ గూడ నట్టిదియే. దినదినమును వారి నెదుర్కొన భయాతురుల మానసుండయ్యుఁ గర్తవ్యమును నెరవేర్చుచుండెను. ఈతని కిట్టి శ్రమలు మున్నెన్నఁడును గలుగలేదు. వానిలో మునిఁగి తేలుచు నప్పుడప్పుడు విశ్రాంతికై తన పఠనమందిరంబునఁ జేరినప్పుడు వాని ముఖారవిందంబు 3 స్వేదాంచితంబై మున్నెన్నఁడుఁ గనివిని యెఱుంగని నరక కూపంబునం జొచ్చువాని మోముదమ్మివలె 4 వివర్ణమై యుండును. పిదప నీవిషయముల స్మరించినప్పు డాతఁ డాశ్చర్యము నందెను. పిరికి పంద కాఁడు. కాని తనవలె నున్నతావస్థ యందుండు వారి కిట్టి సమయములఁ గలుగు విషాదమే వానికిని గలిగెను. ఘన కార్యాచరణమునకు గడంగుటచేఁ దాను మున్నెఱుఁగని విషయంబుల నెన్నిటినో తెలిసికొని తన 5 కించిజ్ఞతకు లజ్జించెను.

ప్రతినిధుల నెన్నుకొనుటకేర్పడిన శనివారము రాఁగానే మానసోద్రేక 6 ముత్కటమయ్యెను. అట్టి సురాగారంబుల మూయింపఁ బ్రయత్నించిరి. ఈ యుద్యమమునఁ గొంతదనుక జయమునందిరి. కాని యాదినమంతయు సురాపానము మిక్కుటమయ్యెను. మాలగాడెమంతయు సురాపాన 7 నిమగ్నమై యొడలెఱుంగక మండిపడు కాలాగ్నికీలంబుల పగిది నసంభావ్యమై యుండెను. సోమనాథశర్మ యావారమంతయుఁ బ్రసంగించుచుండెను. అతఁ డనుకొనినకంటె నెక్కుడుగ ఫలించుచుండెను. శనివారమునాఁడు తన కార్యమున కుత్కృటావస్థ తటస్థించెనని భావించెను. పరిశుద్ధాత్మకును సురాభూతంబునకును గలుగు మహాసంగ్రామంబున జయాపజయ నిర్ధారణోపేతంబగు కయ్యంబు మొదలయ్యెను. ఉపన్యాస మందిరంబుల భక్తి విశ్వాసంబు లెంత మెండగుచుండెనో తదన్యప్రదేశంబుల నపవాద ప్రభావ మంత విశేషింప దొడంగెను. మద్యవిక్రేతలు తమ మనోభావంబుల నింక మరుగు పఱచుకొనఁ జాలరైరి. బహిరంగ ఘోర ప్రమాణంబులఁ గావించుచుండిరి. ఆవారములో నుపన్యాసముల ముగించి యర్ధరాత్రంబున సోమనాథశర్మయు, నాతని సహచరులు నిండ్లకుఁ బోవు సమయంబున మార్గమధ్యంబున నీకిరాతులు వారి డాకి యనేకవిధంబుల నుల్లంఘన గావించిరి. పోలీసువారు వారి సంరక్షణకై తగుసేన నొసంగిరి. సుమతిని, సుగుణవతిని, భానుమంతుఁడును, వైద్యభూషణుఁడును, కంటికి రెప్పవలెఁ గాచుచుండిరి. సుగుణవతి గానమాధుర్యము తగ్గుటకుమారు దినదినాభివృద్ధియై పరిశుద్ధాత్మ సాన్నిధ్యమును వెల్లడించుచుండెను.

---

1 కల్లమ్మువారు 2 ఎదుర్కొని 3 చెమటచేనొప్పు 4 తెల్లపోయి 5 తెలివితక్కువ 6 అధికము 7 మునిఁగి.

ప్రథమమున నారాత్రి, యుపన్యసించుటకు సోమనాథశర్మ సంకోచించెను. కాని యాతఁడు స్వదౌర్బల్యమును మరచి పరిశుద్ధాత్మునిచే నడిపింపఁబడవలెనని నిశ్చయించుకొనెను. ఆత్మచేఁ బ్రోత్సహింపఁబడి శనివారము రాత్రి సభాభవనమున నుపన్యసింపఁ బోయెను.

సాయంతనమున సూర్యాస్తమయ సమయమున కెన్నికలు ముగిసెను. అప్పటికిఁ బ్రజల యంతరంగంబు 1 లత్యుత్కటోద్రేకమును జెందియుండెను. ధర్మపురియందట్టి ప్రాతినిధ్య 2 సంఘర్షణము మున్నెన్నఁడును గలుగలేదు. పానాగారముల నెలకొల్పుటయా నిల్పుజేయుటయా? యనియింతగ నెప్పుడును బనిసేయలేదు. కళాశాలాధ్యక్షుఁడగు విద్యాధరుఁడేమి, మతాధినాథుఁడగు కణ్వుఁడేమి, వ్యాపారధర్మమున మెలంగు ధనాఢ్యులేమి, యిట్లు సంచరించుట విని యెఱుంగము. 3 ప్రాయికముగ రాజకీయాందోళనమున మెలంగు ప్రముఖులందఱు నీచర్యకు నిర్విణ్ణులైరి. కాని యింతమాత్రమున వారికి విముఖత కలుగలేదు. కాలము సమీపించినకొలఁది నాందోళనము క్షణక్షణాభివృద్ధి నందెను. ఎన్నికలు ప్రారంభమైనపు డే తెగవారును జయలక్ష్మిని దాము పొందఁగలమని నమ్మఁజాలరైరి. సంశయపూరితాంతఃకరణులై యుండిరి. పర్యవసానమును దెలిసికొన నాతురతతో నిరీక్షించిరి.

రాత్రి పదిగంటలకె గుడారముకడ మతసమావేశము ముగిసెను. ఈ సమావేశముగూడ 4 నద్వితీయమైనదనియే చెప్పనగును. సోమనాథశర్మయొక్క యాహ్వానము నంగీకరించి కణ్వుఁడా సమావేశమున కరుదెంచెను. వాసర చర్యచే నాతఁడు డస్సియుండెనుగాని సోమనాథుని యాహ్వాన ప్రాబల్యమున నిరాకరింపఁజాలఁడయ్యెను. విద్యాధరుఁడు గూడ నచ్చటికి వచ్చెను. అతఁడిదివఱకెన్నఁడు నీనీచస్థానమునఁ గాలిడి యెఱుంగఁడు. మాఘ్యమున కాకరంబగు నా వాటికయందు శర్మ చేయుచుండిన కార్యము లాశ్చర్యమును గలిగించెను. కావున నాసమావేశ 5 దిదృక్షాకాంక్షచే నచ్చటికిఁ బోవ సాహసించెను. వైద్యభూషణుఁడును, రక్షకభటుఁడును సుమతిని గుణవతులఁ దోడ్కొనివచ్చిరి. ఇప్పుడు సుమతితోడనే నివసించుచున్న సావిత్రి సంగీతపు పెట్టెయొద్ద నిర్మలమైన మనస్సుతోనుండెను. పానాపేక్ష తన్ను దిరుగ మోసపుచ్చునను భయమునంబోలె విశ్వాసపాత్రమగు 6 శునకము పగిది నామె సునతికి సామీప్యముననే యుండెను. ఆరాధన జరుగునంత దనుక 7 నవనతవదనయై మధ్యమధ్యగన్నీరొలుక నమ్రయై యుండెను. తదనంతరము సుగుణవతి గానామృతాస్వాదనమున నామెహృదయము కరఁగి నీరయి ప్రవహింపఁ దాను జన్మాంతరముఁ గాంచినట్లు దలంపసెంచియుఁ బూర్వాశ్రమ స్మృతిచే నందులకు సాహసింప నేరదయ్యెను.

8 పటకుటీరము నిండి క్రిక్కిరిసి యుండెను. పూర్వమువలె 9 నంగణమంతయు జనసంకీర్ణముగనుండెను. రాత్రి ప్రొద్దుపోయినకొలఁది. నెక్కుడుగఁ బ్రజరాఁదొడంగిరి. సభ నింక సాగించుట యుచితమని శర్మ తలంచెను. వెలుపలనుండి యప్పుడప్పుడు కేకలు వినవచ్చెను. బయట పెద్ద గుంపు చేరినదనుట కిదియొక నిదర్శనము. ఎన్నికల నుండి జనము తండోపతండములుగ నిచ్చటికి. వచ్చిచేరిరి. పేటలో నన్ని గుడిసెలనుం

---

1 అత్యధిక విజృంభణ 2 పోరాటము 3 తరచుగ 4 ఈడులేనిది 5 చూచు కోరిక 6 కుక్క 7 వంగబడిన 8 డేరా 9 ముంగిలివాకిలి.

డియు, నిండ్లనుండియు, జావడులనుండియు లోనఁగల వారందఱు నిచ్చటికే యేతెంచిరి.

పటకుటీరము నందలి శ్రోతలు పలుతెరంగుల నాకర్షింపఁబడిరి. కాని సుగుణవతి శ్రావ్యముగఁ బాడుచున్నంతకాల మెవ్వరును నిశ్శబ్దమున కంతరాయమును గలిగింపలేదు. పది పదునేనుగురు తమ పాపముల నొప్పుకొని మారు మనస్సును జెందిరి. క్రమక్రమముగ గుంపధికమగుటచే శర్మసభను ముగించి తాను మాత్రము పునర్జీవితులతోఁ గొంతదనుక నుండెను.

సుమతియు, సుగుణవతియు, సావిత్రియు, వైద్యభూషణుఁడును, విద్యాధరుఁడును, కణ్వుఁడును దాము బండినెక్కుటకు వేచియుండు తావునకుఁ జన బయలు వెడలిరి. వారు పటకుటీరమునుండి వెలువడఁగనే మాలగూడెమంతయు సురాపాన వివశులచే నిండి బొమ్మలాటకు సంసిద్ధముగ నుండెనని గ్రహించిరి. ఇరుకు సందులో జనము నొత్తిగించుకొనుచుఁ బోవుచుండఁ దామా ప్రజ నాకర్షించితిమని గ్రహించిరి.

“ఆసుగో నల్లకోటు దొడుగుకొని పాడుసుపాటి [1] కుళ్ళాయిం బెట్టుకొనిన యాతఁడే మొనఁగాడు. పర్యవసానము నూహింప వ్యవధి చాలదుగదా!” అని జనులలో నొక్కఁడు బిగ్గరగ నరచెను. వీరిలో విద్యాధరుఁడు [2] నిమ్నోన్నత గాత్రమునఁ బ్రసిద్ధముగ ప్రేక్షకుల నాకర్షించును.

“ఎన్నికలలో నేమిజరిగెను? ఫలిత మప్పుడే తెలిసెనా?” అని త్రాగుబోతులలో నొకఁడడుగ “రెండు మూఁడు వీధులవారు పానశాలలకు వ్యతిరేకాభిప్రాయులైరఁట. అది నిజమైనచో గమళ్ళవాండ్ర పని కిచకిచయే” యని మఱియొకఁడు బిగ్గరగఁ బ్రత్యుత్తర మిచ్చెను.

“దైవము స్తుతింపఁబడునుగాక! ఈవార్త సత్యమేయగును గాక! విద్యాధరుఁడా! మన మిప్పు డపాయకరమైన స్థితిలో నుంటిమి. నీవా విషయముల గ్రహించితివా? స్త్రీల నసహాయ ప్రదేశమును జేర్పవలయును.” అని కణ్వుఁడనెను. విద్యాధరుఁడు దీర్ఘదృష్టితో — ‘నీవనినది సత్యమే’ యనెను. ఆతరుణముననే వారిపై శిలావర్షము గురియ నారంభించెను. ఇరుకయిన మార్గమంతయుఁ ద్రాగుబోతులతోఁ గిక్కిరిసియుండెను.

కణ్వుఁ “డిది యసందర్భముగ నున్నదే” యని పలుకుచు విద్యాధర వైద్యభూషణుల సరస నిడుకొని ముందు నడువసాగెను. సుమతీ, సుగుణవతీ, సావిత్రులు తమ [3] కాసన్నమయిన యుపద్రవమును గుర్తించి ముగ్వురి పురుషుల మఱుగున నడువఁ జొచ్చిరి. నిమ్నజాతులవారందఱు దప్పత్రావి యొడలెఱుంగక క్రోధాన్వితులై యుండిరి. ఆ మను[illegible]వము ననుభవించుచుండిన మద్యదేవతను దరిమివేయఁ బ్రయత్నించువారిలో విద్యాధర కణ్వులు ప్రధానులగుటయే వారి యాగ్రహకారణము. “పాలకవర్గము నణఁగఁద్రొక్కుఁ” డని యొక గంభీరధ్వని స్త్రీకంఠస్వనమువలె వినవచ్చెను.

బురదయు, ఱాళ్ళును, వారిపైఁ బడఁజొచ్చెను. అంత భానుమంతుఁ డాకస్మికముగ సుగుణవతి కెదుర నిలువంబడి యెన్నియో ఱాతిదెబ్బలను దనతలతోడను, వక్షముతోడను, భరించి యామెను సంరక్షించెను. వాని సాహసమున కామె సంతసించెను.

ఆతరుణముననే యింకను రక్షకభటులు రాకపూర్వము హఠాత్తుగ సావిత్రి

1 టోపి 2 ఎగుడు దిగుడు 3 సమీపించిన.

సుమతి నొకప్రక్కకుఁ ద్రోచి తానామె కడ్డుగ నిలువంబడి తలపైకెత్తి చూచి కేకలు వైవసాగెను. 1 హఠాద్ఘటితమగుటచే నీ వైకల్యమునకుఁ గారకుఁడైనవాని నానవాలు పట్టుట కెవ్వరికి నాధారము కలుగలేదు. వారు వారము దినములక్రిందట సావిత్రిని మద్యపాన వివశంజేసిన కల్లంగడి ముందరనే యిప్పుడు నిలువంబడి యుండిరి. ఆ యంగడిపై 2 సౌధగవాక్షము నెవ్వరో హఠాత్తుగఁ దెరచి బరువైన 3 కాచపాత్రము నొకదానిని గ్రిందికి ఱువ్విరి. అది సావిత్రీ శిరోభాగమునఁ దగుల నామె నేలపై యొరగెను. వెంటనే సుమతి తిరిగిచూచి సావిత్రిదరిని మోకాళ్ళూని కూర్చుండెను. అప్పటికి రక్షకభటులు గుంపు నావరించిరి.

“ ఆగుఁడాగుఁడు, మీలొక స్త్రీని జంపితిరి ” అని విద్యాధరుఁ 4 డుచ్చైస్స్వరమున నరచెను. ఆకేకలచే దొమ్మియించుక శాంతించెను.

“ అది నిజమేనా ? ” అని కణ్వుఁడడిగెను. ఇంతలో వైద్యభూషణుఁడు సావిత్రి నాడుకొని యామె ‘ చచ్చుచున్న ’ దని క్లుప్తముగఁ బలికెను.

సావిత్రి కన్నులఁ దెరచి సుమతిం దిలకించి 5 యీషద్వికసిత వదనారవింద యయ్యెను. సుమతి యామె ముఖముపైఁ గారుచున్న రక్తముం దుడిచి వంగి ముద్దిడుకొనెను. సావిత్రి తిరిగి కొంచెము నవ్వెను. అంత నామె జీవాత్మ పరమాత్మ సాన్నిధ్యమున కేగెను.

మధుపానగ్రహ నిహతులగు కోయిమందిలో నీమె యొకతె. త్రాగుబోతులారా ! వెనుకకు సద్దుకొనుఁడు. మీదౌష్ట్యఫలము నీమృతకళేబరము వేనోళ్ళనుద్ఘోషించుచున్నది. ఈమె 6 మీమేదోరక్తమాంసాస్థియంత్ర మైనది. ఈమె మరణమువలన మీదౌర్భాగ్యము శాశ్వతముగ ముద్రింపఁబడినది. మీకొఱకు సిలువపై నిట్లు ఘోర మరణమునంది జయమందిన మహామహుని ప్రతిబింబ మీమె ముఖమున వికాసించుచున్నది. క్రైస్తవ సంఘ మీ మృతకళేబరమును గౌరవ ప్రపత్తులతోఁ గొనిపోనెంచు. పానశాల లీమెను బొట్టం బెట్టుకొనినవి. ఈ పానశాలలను నెలకొల్పుటకు సమ్మతులొసంగిన మహామహులే యీపుణ్యమును గట్టుకొనిరి. అంత్యవిమర్శదినమున నీసావిత్రిని జంపిన దెవరో నిశ్చయింపఁబడును.

ఇది షష్ఠాధ్యాయము.

---

1 ఉత్పాత్తుగా సంభవించిన 2 మేడకిటికి 3 గాజుగిన్నె 4 పెద్దధ్వని 5 కొంచెము వికాసముగల 6 మీ మెదడు నెత్తురు మాంసము ఎముకలు.

శ్రీ

# దైవానుకరణము.

## సప్తమాధ్యాయము.

1 పురోద్యానవన ప్రాంతమున నున్న సుమతియొక్క దివ్యభవనమున సావిత్రి మృతకళేబరముండెను. ఆదివారము ప్రాతఃకాలమున 2 సుమసౌరభ సంభరితములగు చల్లని పిల్ల 3 తెమ్మెరలు 4 వాతాయనంబులనుండి గదిలోని 5 శవాచ్ఛాదనపైఁ బ్రసరించుచుండెను. దేవాలయపు జేగంటలు మ్రోగుచుండ నామార్గమున నుదయారాధనమున కేగువారెల్లరు నామందిరముం దిలకించుచు నాపట్టణమున నవీన చారిత్రము నంకురింపఁజేసిన విశేషాంశముల ముచ్చటించుకొనుచుండిరి.

దేవాలయమునఁ గణ్యమహర్షి గతరాత్రమున జరిగిన విషయ చిహ్నముల ముఖమున ధరించి యగణ్యమగు సంఘమున కభిముఖుఁడై పూర్వదినంబునఁ దనకుఁ గలిగిన స్వానుభవంబును 6 నిరర్గళ వాగ్ధారా ప్రవాహంబున నుపన్యసింపఁ జొచ్చెను. శ్రోతలు వానియందుఁ గలిగిన మార్పునకు గర్వమునందుచుండిరి. ఆతని యుపన్యాసమునం దంతటను విషాదమును, సాంఘికులలోఁ బెక్కండ్రకు 7 లజ్జావనత వదనులు కాఁదగినంతటి 8 గర్హణంబును బొడసూపెను.

ధర్మపురీ వాసులు పానశాలల నింకొక వత్సరముదనుక నిలుప సమ్మతించిరను వార్త నాటి 9 యుషఃకాలమున వ్యాపమైనది. రెండుమూఁడు వీధులవారు వ్యతిరేకాభిప్రాయు లయిరని నిన్న సాయంసమయమున మాలపల్లెలో విన్న వార్త నీలివార్తగాఁ బరిణమించెను. ఆమోదకులసంఖ్య బహుస్వల్పము. అధికమగుటచే దౌష్ట్యమునకే జయము లభించినది. కాని జనబాహుళ్యాభిమతము లభించిన దెంతయో యిప్పుడు నంతియే. కల్లంగడు లింకొక వత్సరముదనుక స్థిరముగ నుండును. ఈ ఫలితార్థము వలన ధర్మపురీ క్రైస్తవ సంఘ మవమానింపఁబడినది. శతాధిక క్రైస్తవులు ప్రభుసేవకుల మనువారు—ఎన్నికలకు రాకమానిరి. అంతకంటె నెక్కువమంది పానశాలల పునరుద్ధారణకే సమ్మతుల నొసంగిరి. ధర్మపురింగల క్రైస్తవులందఱు 10 నేకగ్రీవముగ వ్యతిరేకాభిప్రాయులైనచోఁ బురపారిశుధ్యసంఘమునఁ బానశాలలు శిరోభూషణములుగాక నిహతములై యుండును. ధర్మపురియం దనేక వత్సరముల నుండి యిట్లే జరుగుచుండెను. కల్లంగడులే రాజ్యము నేలుచున్నవి. వాని నిందించువారు గాన్పింపరు. ఇట్టి తరుణమునఁ గ్రీస్తేమిచేయును ? తన వినాశనమునకై కృషి చేసిన మద్యమే సావిత్రిం బొరిగొనెను. ఆవిషయమున నేమి ? ఏపానశాలల 11 దుర్విదగ్ధతచే సావిత్రి పితృలోకమునకుఁ బంపఁబడెనో వానినే క్రైస్తవు లింకొక వత్సరము నెలకొల్పుటచే నీలోపున శతగుణితముగ సావిత్రిని బోలినవారు లోకాంతరమును జేరుటబ్బురము కాదు.

---

1 పట్టణోద్యానవనము 2 పుష్పవాసన 3 వాయువులు 4 కిటికీలనుండి 5. శవముమీఁదిగుడ్డపై 6 అడ్డులేని 7 సిగ్గుచేవంచఁబడిన 8 నింద 9 ఉదయమున 10 ఒక్కమాటగా 11 అజ్ఞానము

ఈవిషయము లన్నిటిని గణ్యుఁడశ్రుపూరిత లోచనములతో మహోద్రేకంబున నత్యుత్కంఠతతో నానాటి యుపన్యాసమున వెలిబుచ్చెను. అతని కరుణాకర వాగమృత స్పర్శచే శ్రోతృజనాంతరంగములు గరఁగి నీరై నేత్రములనుండి ప్రవహింపఁ జొచ్చెను. తన దృఢోన్నత సాహంకారములు నశించి విద్యాధరుఁడు నిర్విణ్ణుఁడై కూరుచుండియుండెను. అతని శిరస్సు వక్షస్స్థలమున కొరగెను బహిరంగముగ నాతఁడట్టి మానసోద్రేకమును మున్నెన్నఁడు వెలిబుచ్చని వాఁడైనను కన్నీరు జలజల రాల్పఁ దొడంగెను. కణ్వోపన్యాసమును వినినకొలఁది, 1 నధరము చలింప మ్రాన్పడి తన యాసనము గొయ్య నాశ్రగాఁ గొని పురూరవుఁడు కూర్చుండెను. "క్రైస్తవాంతఃకరణము సకాలమునఁ బ్రజ్వలింపక పోయెనో, లేక ప్రచలనము కలుగనే లేదో యని సంశయించుచుఁ గూర్చుండెను. తానింకను గొంతకాలమునకు మన క్రైస్తవాదర్శము నవలంబించిన నెట్లుండునో ?

అచ్చట నున్న తాసనమునఁ 2 దంతీగాన పరికరముల నాధారము చేసికొని కూర్చుండి సుగుణవతి తానింతదనుక నెన్నఁడు నెఱుంగని మనోవైకల్యమునకుఁ బాత్రయయ్యెను. కణ్వుని యుపన్యాసాంతమున యథోచితముగఁ బాడ సంకల్పించి యుపక్రమించెనుగాని వివశాత్మయై నిర్వహింపఁ జాలక పోయెను.

ఈ విరుద్ధచర్యచే దేవాలయ మంతయు నిశ్శబ్దముగ నుండఁ బలుతావులనుండి వెంటనే ధ్వని వినవయ్యెను. ఇట్లశ్రుధారా స్నానము నెన్నఁడీ యాలయ సంఘము పొందినది? అజ్ఞాన మనోద్రేకము వలన మునింగి, నిశ్శబ్దముగ నుండక యెన్నఁడిట్లు ప్రకంపనము నొందినది? ప్రజామానసము లిప్పుడు దీర్ఘాలోచనమున మునింగినవి. ఇందనుకఁ బైపైని కాలక్షేపము జేయుచుండిరేగాని మానసాంతఃకరణముయొక్క గంభీరమును గుర్తింపరైరి. ఇప్పు డిప్పుడు దీర్ఘాలోచనమునకు దొరకొనుటచేఁ గ్రైస్తవాదర్శముయొక్క 3 పరమావధిని గుర్తింప దొడంగిరి.

క్రైస్తవాదర్శము నవలంబింపఁ దలంచినవారు ప్రత్యేక సభ నలంకరింపుఁడని కణ్వుఁడిప్పట్టున సభ్యుల నడుగలేదు. కాని సంఘమును సాగనంపిన పిదప నాతఁ డుపన్యాసమందిరమును జేరఁగనే ప్రథమ వీక్షణముననే సభ్యుల సంఖ్య ద్విగుణమై క్రిక్కిరిసి యుండెనని గ్రహించెను. ఆసమావేశ మతి మార్దవముగ నుండెను. పరిశుద్ధాత్మ వారిపై నోలలాడదొడంగెను. పానశాలల శత విధముల నెదుర్కొని తుదముట్టింపవలయునని వారందఱును దృఢనిశ్చయులైరి. ఇట్టి యీ సమావేశములు ప్రారంభమయినది మొదలు ప్రతిసమావేశ సమయమున నొక్కొక విషయము వారి మనంబులఁ బ్రథానాంశముగ నాటుకొని యుండెను. ఈ సమావేశమున మద్యపాన 4 నిర్మూలనమే కర్తవ్యముగ నెలకొనియెను.

గత వారమున జరిగిన యీ చర్యలచే దేవాలయసంఘ మాందోళనమున మునింగి యుండ మాలపల్లెయుఁ దదనుగుణమగు రీతిని గలఁత బారెను. సావిత్రి మరణము వారికంత యెక్కువలోనిది కాదుగాని యామెలోఁ గలిగిన మార్పును బట్టణవాసులతో నలవడిన సహవాసమును, తుదకామెకు సంభవించిన విపరీతాంతమును, వారి నాశ్చర్య 5 నిమగ్న మానసులనుగాఁ జేసెను. సావిత్రి శవమిప్పుడు సుమతి దివ్యభవనమున్న

1 పెదవి 2 వీణాదివాద్యవిశేషము. 3. గొప్పహద్దు. 4. నాశనము. 5. మునిఁగిన.

నుండెనని నిమ్నజాతివారెల్ల రెఱుంగుదురు. ఆమె నంచుటకుఁ జేయుచుండిన పెట్టెను ప్రతివారును విశేషముగ వర్ణించుచుండిరి. ఉత్తరక్రియల నెంతవిశేషముగ నాచరింతురో యని విమర్శించుటయే యేమూలఁజూచినను వినఁబడుచుండెను. బహిరంగముగ సమాధిచేసెదరా! సుమతి యేమిచేయును! నిమ్నజాతివారికిని గొప్పవారికి నీమాత్రము సంపర్కమైన మున్నెన్నఁడును గలుగలేదు. వీరి సమావేశమునకే సావకాశము లేదు. సావిత్రి బంధుమిత్రాదు లామెను గడపటిసారి జూచి గౌరవించు విధానమెద్ది! యను ననేక ప్రశ్నలచే వాండ్రందఱును సోమనాథశర్మ నాతని భార్యను, బీడింపఁ దొడంగిరి. 'గూడెమునఁ బెక్కండ్రామె నెఱుంగుదురు. వారిలో మారు మనస్సును బొందువారెల్ల రామెకు విహితులు.

తుదకీరీతిని సోమనాథము సాయంసమయమున మాలపల్లెయందలి పటకుటీరమున సావిత్రికొఱకుఁ [1] జరమారాధనము గావింపఁబడినది. గుడారమంతయు జనాకీర్ణమై కాలుసేతులు గదుల్పనైనఁ దావు లభింపలేదు. శర్మ సుమతి యింటికిఁబోయి యామెతోడను గణ్వునితోడను గొంతదనుక ముచ్చటించిన వెనుక నీయేర్పాటుఁ గావించిరి.

[2] డాంబిక విడంబనముల యెడఁగల వైముఖ్యతయే శక్తిగాఁగలిగిన సోమనాథశర్మ యిట్లనెను ;—

“సమాధి సమయముల ననేకుర సమావేశ మొనరించుట కిచ్చగించువాఁడను గాను. కాని సావిత్రి పరిచితు [3] లసంఖ్యాకు లామెనుజూచి యంత్యగౌరవమును గావింపఁ బ్రార్థింపుచుండ నెట్లు తిరస్కరింపఁ గలము! కణ్వముని! నీవేమనెదవు? ఈ విషయమున నీ యభిమతానుసారము వర్తించెదను. నీవును సుమతియుఁ గలిసి చెప్పునదియే యుచితమార్గమగునని నా నిశ్చయము.”

కణ్వుఁడు :— నేనును నీవలెనే యనుకొనియెదను. ఇట్టి తరుణములయందు లోకవిడంబనోచితముగఁ బ్రవర్తించుట నా యభిమతము కాదు. కాని యీవిషయ మట్టిది కాదు. నీచమానవు లీయాలయమునఁ గాలిడరు. కావున వారికొఱకే చరమసంస్కారారాధనమును బటకుటీరమున గావించుటయే ధర్మమని నాకుఁ దోఁచుచున్నది. సుమతీ నీవెట్లూహింతువు?

సుమతి :— అయ్యో! పాపము ఎట్లు చేయుటుచితమో నాకుఁ దెలియదు కాని సావిత్రి తనప్రాణమును నా ప్రాణమునకు మారుగా నిచ్చెనని గ్రహింపఁగలను. ఈ చరమాచరణము నీచ ప్రకటనములఁ బుచ్చ నిచ్చగింపను. ఆమె స్నేహితుల కోర్కెల నెరవేర్పుఁడు. అందువలన నాకు నష్టమేమియుఁ గాన్పింపదు,

తుదకుఁ గొంత కష్టముపైని గుడారమునొద్ద నీయారాధనమును గావింపఁదగు నేర్పాటులఁ జేసిరి. సుమతి, సుగుణవతి, భానుమంతుఁడు, విద్యాధరుఁడు, కణ్వుఁడు మున్నగువారందఱు నచ్చటికేగి మున్నెన్నఁడు వారి జీవితములలోఁ గాంచని కూటమిని గాంచిరి.

సమీప పట్టణమున జరుగుచున్న రాజకీయ సభాస్థానమున కేగుచు నొక ముఖ్యపత్రికా విలేఖరి మార్గమధ్యమున నీయారాధనమునుగూర్చి విని యచట నిలిచెను. మరునాటి పత్రికలో నాతఁడా విధానమునంతను వర్ణించి వ్రాసెను. పెక్కం

1. చివరిపూజ. 2 బడాయి. 3. లెక్కలేని.

డ్రాపత్రికం జదివి యానందించిరి. అందలి కొన్ని భాగంబుల నీ క్రిందఁ బొందుపరచెదను:—

ధర్మపురి సమీపమునఁ గల చండాలవాటికలో సోమనాథశర్మయను బోధకుఁడు గుడారమును వైచి బోధఁ గావించుచుండెను. ఇచ్చట మున్నెన్నఁడును గని విని యెఱుఁగనంతటి యత్యద్భుతమగు చరమసంస్కారారాధనము జరిగెను. శనివారము రాత్రి యెన్నికల విషయమున జరిగిన దొమ్మిలో నొక కొమ్మ బలాత్కారముగఁ జంపఁబడెను. ఆమెకై జరుపఁబడిన యారాధన మిది. శర్మగారి బోధకతా సామర్థ్యమువలన నీమె కొలఁది కాలము క్రిందటనే మార్పును జెందెనఁట. మతవిషయకోపన్యాసమునకేగి తిరిగి మిత్రులతోఁ గూడి వచ్చుచుండ నీమెను గడతేర్చిరి. పూర్వ మీమె తెగఁదిరిగి యొడలెఱుఁగక వీధులలో దొర్లుచుండెడిది. అట్టులయ్యు నీమె కొఱకిచ్చట జరుపఁబడిన యీయారాధనమును బోలిన దింతదనుక ముఖ్యపట్టణముల రాజవంశముల వారికొఱకైన జరుపఁబడి యుండలేదు.

ప్రప్రథమమునఁ జక్కఁగ నభ్యసించి యారితేరిన వారికే సంకీర్తనము గావింపఁబడెను. గొప్పగొప్ప దేవాలయములలోఁ జేయు గానమును దలదన్నిన యీ గానామృతము నాకర్షింప నీ దేశమునకుఁ గ్రొత్తవాఁడనగు నాక త్యాశ్చర్యమును గలిగించెను. అందును మున్నొకప్పుడు కలకత్తా నాటక సభాధ్యక్షుఁడు విరివిగల వేతనమిచ్చెదనని యాహ్వానించినదియు సౌందర్యరాశియు నగు సుగుణవతి యను కన్యక పాడిన కీర్తన యానంద సాగరమున నోలలాడించినది. నాటకముల గానము సేయుట కిచ్చగింపక నిరాకరించినదఁట. సంగీతమున నామె కత్యద్భుత శక్తి కలదు. పల్లవిని బూర్తిపరుపకమునుపే శ్రోతలలోఁ బెక్కండ్రు రోదనము సేయ నారంభించిరి. చరమారాధన సమయమునఁ గరుణ రసము వెల్లివిరియుట వింతలోనిది కాదుగాని యీ [1] గాత్రమాధుర్యము కోటికొక్కరికి లభించుటగూడ దుర్లభము. ధర్మపురీ దేవాలయమున నీమె పాడుచుండునఁట. గానసభలఁ గావింప నిచ్చగించిన నెంతటి ద్రవ్యమునైన నార్జింపఁ గలదు. బహుశః త్వరలో నట్లొనర్పఁ గలదనుకొనెదను. అట్టి కంఠస్వర మెవ్వరి నాకర్షింపదు ?

సంగీతముమాట యటుండనిండు. ఆరాధనమే యద్భుతావహముగ నుండెను. లేనిపోని వేషభాషలకుఁ బోవు స్వాభావికములేని సోమనాథశర్మ కొలఁదివాక్యముల ముమ్మరముగ ముచ్చటించెను. పదంపడి కణ్వుఁడను ధర్మపురార్యుల యాధికారి ప్రసంగించెను. సావిత్రియను నామె మరణమున సిద్ధమైయుండెనని నుడివి పిదప మద్యపానము వలనఁ గలుగుచున్న దురవస్థలంగూర్చి విశేషముగ ముచ్చటించెను. ఈమెం బోలు పెక్కండ్ర స్త్రీలఁ బురుషుల నీ పెనుభూతము దురవస్థల పాలొనరించుచున్నది. ధర్మపురి రైలుమార్గముల ముఖ్యస్థానమగుటచేఁ గూలివాండ్రధికముగ నుండిరి. వారికొఱకుఁ బానశాల లధికముగ నెలకొల్పఁబడినవి. వీనిని సర్కారువా రామోదించు విషయమునఁ దన యభిప్రాయమును మొన్న మొన్ననే మార్చుకొంటినని బోధకుఁడు వక్కాణించెను. అతఁడు మధుపాన [2] నిగర్హణము [3] నత్యుత్కటముగఁ గావించెను. కాని చరమారాధనకిది యంత సరిపడియుండలేదు.

1 కంఠనాదరుచి 2 నింద 3 ఎక్కువ.

పిమ్మట నత్యాశ్చర్యకరమగు విషయము దృగ్గోచర మయ్యెను. పటకుటీరమునఁ జేరిన స్త్రీలందఱును అందును శవము నుంచిన 1 పేటిక సమీపముననున్న వారును లేచి, అతి దీనస్వరముతో "నేనొకప్పుడు దారితప్పిన గొఱ్ఱె" నను కీర్తనను బాడిరి. వారట్లు పాడుచుండ నొక పంక్తిగఁ గొందఱు స్త్రీలు పేటికను సమీపించి ప్రతివారు నొక్కొక్క పుష్పమును దానిపై నుంచి దాటిపోయి తిరిగి తాము వెడలిన స్థానమును జేరిరి. వారివెనుక మఱియొక వరుస వా రట్లేచేసిరి. అట్లే యచ్చటి స్త్రీలందఱును గావించిరి. ఇది యంతయు ముగియుదనుక గానము నొనర్చుచునే యుండిరి. భేదజ రహితమయ్యు నింతగ మనస్సు నాకర్షించిన దానిని నేనెన్నఁడును జూచి యుండలేదు. ప్రక్క తెరల నెగనెత్తిరి. లోనఁ బ్రవేశింపఁ దావులేక చుట్టును వందలకొలఁది జనము మూగి నిలువఁబడి యుండిరి. వారంద ఱంతటి పోరటము మానినులయ్యును, 2 అధరస్పందము గావింపక నిశ్శబ్దముగ నుండుటం గాంచ నత్యద్భుతముగ నుండెను. ఇంతటి మూఁక స్త్రీలొక శతమానమును మించియుండిరి. వారందఱుఁ గొలఁది దినములక్రిందటనే ప్రభువు ననుసరించి తమ దుష్ప్రవర్తనములనుండి 3 తిరోధాన 4 చేతస్కులైరి. ఆ గానమాధురి 5 నిదమిద్ధమని వర్ణింప నాకుఁ దరముగాదు. ఒక్క పురుషుఁడైన నొక స్వరమునైనఁ బాడలేదు. అన్నియు స్త్రీగాత్రములే యయ్యును మిక్కిలి స్పష్టముగను విభజనగను వినవచ్చి యానంద పారవశ్యమును గూర్చెను.

ఆరాధనాంతమున సుగుణవతి తిరిగి యొక కీర్తనను బాడి ముగించెను. పిమ్మట బోధకుఁ డందఱి 6 నవనత శీర్షులగుఁడని చెప్పి ప్రార్థింప నారంభించెను. రైలుబండి చిక్కదను భయముచేఁ బ్రార్థనోపక్రమముననే నేను వెడలిపోవలసి వచ్చెను. తుదకు ధూమశకట మా సమీపమున నుండియే పోవుచుండ నిశ్శబ్దముగ జనమంతయుఁ బ్రవాహము పగిది బయలువెడల నాలుగురు స్త్రీలు పేటికను మోసికొని బయలువెడలిరి. బహుకాలమునుండి యిట్టి మానసోద్రేకమును గాంచుటరుదు"

సావిత్రి యంత్యకార్యములు పరదేశికే యిట్టి యభిప్రాయమును గలిగింప నామె జీవితావస్థను మరణావస్థను బూర్తిగ నెఱింగిన వారి యంతరంగంబులఁ గరగించె ననుటలో నతిశయోక్తి యేమి కలుగును? సావిత్రి శవమును గొనిపోవునప్పుడు మాలపల్లెయందుఁ గలిగినంత మానసోద్రేకము మున్నెన్నఁడును గలుగలేదు. ఈ నిర్జీవ 7 మృణ్మయ శరీరము ప్రత్యేక వ్యక్తిని గలిగించెను. పరిశుద్ధాత్మ వారిపైఁ దాండవమాడుచున్నట్లుండెను. ఆసాయంతనారాధన కాలమున ద్వాదశ సంఖ్యాకులు తమ జీవితములను మార్చుకొనిరి. అందును పలుమంది స్త్రీలు ప్రభువు ననుసరింపఁ దొడంగిరి.

శణ్వుఁడు చెప్పినట్లు సావిత్రి మరణమునకుఁ దోడ్పడిన పానశాల తలుపులు దెరచిరి. దాని యధికారిని నరహత్యా నేరమునకై పట్టుకొని రెండుదినములు మాత్రమే మూసియుంచిరి. తగిన నిదర్శనము లేవియుఁదను గాన్పింపక పోవుటచే శనివారమునుండి నిరభ్యంతరముగ యథాస్థితంబుగ నాకల్లంగడి తెరువఁబడినది. సావిత్రి హత్యకై మానవాధికారు లెవ్వరిని శిక్షింపఁ జాలరైరి.

1 పెట్టె 2 పెదవికదపుట 3 మరుగుపఱచిన 4 చిత్తము 5 ఇట్లని 6 వంచఁబడిన 7 మన్నుతో నున్న

సావిత్రి మరణమున కంతటికంటె నెక్కుడుగ సుమతి విచారించెను. ఆమె దీనిని దనకుఁ గలిగిన నిజాపదగాఁ బరిగణించెను. సావిత్రి తనయింట నుండిన వారము దినములలో నామె మనంబున విశేషాభిప్రాయము లనేకము లంకురించెను. సమాధి కార్యము ముగిసిన మఱుసటి దినమున నామె సుగుణవతితో నాయావిషయముల ముచ్చటించెను. సుమతి భవనంబున వారిరువురును గూర్చుండి యిట్లు ప్రసంగించిరి.

" ఇట్టి నీచాంగనల జీవితముల నించుక సంతసింపఁ జేయుట కనువగు రీతిని నా ద్రవ్యమును వినియోగింతును. " అని సుమతి యాగదియందే యున్న సావిత్రి శవము నుంచిన ప్రదేశమును దేరి పారఁజూచి " నా కుచితమని తోఁచినట్టు లొక మంచి పథకము నేర్పరచితిని. భానుమంతునితో నావిషయమును మాట్లాడితిని. అతని ద్రవ్యమునఁ గూడఁ గొంత దీనికై వినియోగింతునని చెప్పెను. " అనెను.

" సుమతీ ! ఇట్లు వ్యయమొనర్చుటకు నీ కెంత ద్రవ్యము కలదు ? " అని సుగుణవతి యడిగెను. ఒకప్పు డిట్టి ప్రశ్న నడిగియుండదు. అన్యవిషయముల ముచ్చటించుకొనుట యెట్టిదో ధనవిషయముఁ గూడ వారికిప్పు డట్టిదిగనే యుండెను. వారి దృక్పథమున నిప్పు డన్నియు దైవవిషయములే.

" ఇప్పు డుపయోగమున కైదులక్షల రూప్యములు సంసిద్ధముగ నున్నవి. భానుమంతునియొద్ద నంతకెక్కుడు ద్రవ్యము కలదు. తానీ మారుమనస్సును పొందక పూర్వము పితృదత్తంబగు ధనంబునం దర్ధభాగము దుర్వ్యసనంబుల వ్యయపుచ్చితినని యాతఁ డెంతయు విచారించుచుండెను. శక్తివంచన సేయక మేముభయులమును ప్రభుసేవఁ గావింప నిశ్చయించుకొంటిమి. ప్రభు. ద్రవ్యము నెట్లు వినియోగించును ? జ్ఞానముతోడ యోగ్యముగ నీప్రశ్నకు సదుత్తరము నూహించుచుంటిమి. దైనిక పత్రికకై వినియోగింపఁ దలంచిన ధనము ప్రభుసమ్మత వినియోగమే యనుకొనెదను. మధుపానము పెనుభూతము నెదుర్కొన వలసిన యీ తరుణమునఁ గ్రైస్తవాదర్శములతో ధర్మపురియందొక దైనిక పత్రికను నెలకొలుపుట వైద్యశాలల నిర్మించుట వంటిదే. కావున నేతత్పత్రికా నిర్వహణమునకై పురూరవుని స్వాధీనము సేయఁదలంచిన యైదులక్షల ధనమును ప్రభుచిత్తవృత్తిని వినియోగించిన దాననే యగుదును. "

నేను తలంచుచున్న యితర కార్యములలో నీవు నాకుఁ దోడ్పడవలయునని కోరుచున్నాను. మాలపల్లెయందుఁగల విశేష ప్రదేశముల నన్నింటిని నేనును నా సోదరుఁడును గలిసికొనఁ దలంచితిమి. ప్రస్తుతము మన జేరాను పాతిన స్థలము కొంత కాలము నుండి వ్యాజ్యముల మునిఁగి యుండెను. వ్యాయస్థానము లాస్థలాస్థల యాజమాన్యమును నిర్ధరించిన తోడనే దానినంతను వ్యయమునకుఁ బుచ్చుకొనెదము. పెద్ద పెద్ద పట్టణముల నంటియుండు నిమ్నజాతుల పేటలలో నెలకొల్పఁబడిన కళాశాలలు దేవాలయములు మున్నగు సంస్థాపనల విధానముల నన్నింటిని శ్రద్ధాభక్తులతోఁ బరిశీలించితిని. మన పట్టణమునకుఁ జేరియున్న మాలపల్లెలో నట్టి 1 ప్రతిష్ఠాపనము విశేష 2 శ్రేయోదాయకమో యింకను నిర్ణయింపఁ జాలకుంటిని. కాని యొక విషయము నిశ్చితమైనది. నా ద్రవ్యము, అనఁగా భగవంతుఁడు ప్రజాసౌకర్యమున కుపయోగింపుమని నా స్వాధీనమునందుంచిన ద్రవ్యము, దానితో నీపల్లెయందుఁ బరదేశులు

1 ప్రతిష్ఠ 2 శుభప్రదము

నివసించుటకును, బీదస్త్రీలకు వాసగృహంబులు, కూలి చేసికొని జీవించు యువతుల కునికిపట్టులు, సావిత్రివలె దుర్వ్యసనంబులఁజిక్కి దిక్కుమాలిన 1 యబలాజనంబుల నుద్ధరించి రక్షించు వసతులు సంపూర్ణముగ నిర్మించెదను. ధనమును సద్వినియోగము సేయుటతోఁ దృప్తినందు దానను గాను. దైవము తోడ్పడును గాక! నేనా కార్యమున స్వయముగఁ బ్రవేశించి పని సేయ సంకల్పించితిని. అధికార్యామోదమును వడసి పానశాల లచ్చట నిలిచియుండు నంతకాలము నెంతద్రవ్యము వెచ్చించినను, ఎంత యెంత శ్రమ జెందినను, నిష్ప్రయోజనమేయని తలంచెదను. ఏ పట్టణమునఁ జేయు క్రైస్తవ కార్యమునకైన నిది యభ్యంతరమే. ప్రజారక్షక సంఘము లెన్నియైనఁ జేరి తుదముట్టింపఁ జాలనంత మంది రక్షణార్హుల నీ పానశాలలు సిద్ధము సేయుచుండును."

ఇట్లు వాక్రుచ్చుచు సుమతి హఠాత్తుగ లేచి గదియం దటునిటు దిరుగ నుపక్రమించెను. సుగుణవతి నిరాశా నిరీక్షణముల పెనఁగొన నిట్లు పలికెను.

"అది సత్యమే. కాని సుమతీ! ఈధన 2 వినిమయమున నెంతటి సౌఖ్యమును, శక్తినైన గలిగింపవచ్చును. పానమందిరము లెంతకాల మిచ్చట నిలువఁగలవు? క్రైస్తవ సేనకు విజయము లభించు కాలము రాకమానదు"

వెల వెలఁ బోరి నిరాశను జెందిన ముఖకమలము వికాసమునంద సుమతి సుగుణవతి దరి నిలిచి యిట్లనెను:—

"నేను నట్లే యూహింతును క్రైస్తవాదర్శముల నవలంబింప నిశ్చయించుకొనువారి సంఖ్య దినదినాభివృద్ధి నందుచున్నది. ఎన్నటికైన నిట్టి సత్క్రైస్తవు లైదువందలమంది సమకూడిననాడే మద్యపానమను పెనుభూతమున కంతము ప్రాప్తమగును. కాని ప్రియస్నేహితురాలా! యీ నిమ్నజాత్యుద్ధరణమున నీవు చేయవలసిన కార్యము నాలోచించుకొనుము. నీ గాత్రమే యొక మహాశక్తి. అందఱి బాలికలం జేర్చి నీవొక గానకళాశాల నేర్పరుప నగును. నీవలన వారా విద్యను నేర్చుకొను భాగ్యమును గలిగింపుము. అచ్చటివాండ్రెల్లరు మోటవారే యైనను గంఠస్వారస్యము గలవారంగుఁ గొందఱు కలరు. నిన్న నా యువతులందఱును జేరి పాడిన విధానమును మున్నెన్నఁడైన వినియుంటివా! సుగుణవతీ! వారల గానకళాకౌశలము నభివృద్ధి పఱచుట కిది యుక్తసమయముగదా! ధన సహాయ్యమునఁ బడయఁగల జంత్రతంత్ర వాద్యపరికరముల నెల్ల నీకు సమకూర్చెదను. గాన విధానంబున నచ్చటి స్త్రీల జీవితములను బరిశుద్ధములైన వానినిగను సౌఖ్యవంతములైన వానినిగను జేయుట కవకాశమున్నది."

సుమతి యిట్లు ప్రవచించి ముగింపకమున్నే సుగుణవతి ముఖపద్మము తన జీవితాశయ నిర్ధారణమున 3 నవనవోన్మేషము నందినది. తదాశయ మామె హృదంతరంబునఁ బ్రవాహప్రాయమై ప్రవేశించి యడఁగింప నడంగక నశ్రుధారారూపంబున బహిర్గతము కాఁజొచ్చెను. ఆమె చిరకాలమునుండి చేయఁదలంచుచున్న కార్యమిదియే. సుమతియు దీనినే ప్రబోధించుటచేఁ దన గానవిద్యాకౌశలమును ప్రభుసమ్మత మార్గమున వినియోగించు విధాన మామెకు నిశ్చితమయ్యెను.

"మేలు మేలు!" అనుచు నామె లేచి సుమతి 4 గంఠాశ్లేషము గావింప నుభయులుఁ దదానంద పరవశతచే గదియం దెల్లెడల గంతులువైచిరి. సుగుణవతి— "అట్టి

---

1 స్త్రీలు 2 మార్పు 3 క్రొత్తవికాసము 4 కుత్తుక కాఁగిలించి

ప్రజాసేవయందు నాజన్మము సార్థకపఱచుకొనెదను. నాజీవితము నిట్లు వినియోగపరుపుమనియే ప్రభువు కోరుచుండెనని నా దృఢ నిశ్చయము. ఇంతద్రవ్యము మన స్వాధీనమునందుండ దాని సద్వినియోగంబున వలయు విధానము నేర్పరచుకొనిన నెంతటి యద్భుతకార్యములనైనఁ బ్రభునామమునఁ జేయఁవచ్చును."

"దానికేమి తోడు నీవంటివారి స్వకాయ కష్టముఁగూడ నొనగూడ నింకెయ్యది దుర్ఘటము?" అని సుమతి నవ్వుచుఁ బలికెను. దానికి సుగుణవతి సమాధానముచెప్పుచుండుమున్నె భానుమంతుఁడు వచ్చెను.

గుమ్మముకడ నొక క్షణము నిలిచి లోనికేగుటకనుమానించి పఠనమందిరమువైపునకుఁ దిరిగెను. అంతట సుమతి లోనికిం బిలిచి యాతఁడు పూనుకొనిన కార్యములఁ గూర్చి ప్రశ్నసేయ దొడంగెను. భానుమంతుఁడు లోని కరుదెంచి కూర్చుండెను. ముగ్వురును జేరి 1 భావికార్య విధానముల వితర్కించుకొనఁజొచ్చిరి. సుమతి సముఖమున నుండుకాలమున భానుమంతుఁడు నిస్సంశయముగ సుగుణవతితో ముచ్చటించెను. ఆమెతో నాతఁడు మాటలాడినరీతి వైముఖ్యమును సూచింపకున్నను యథోచితంబుగ నుండెను. అత్యద్భుతావహమగు నాతని పునరుత్థానమున గతమంతయు నంతరించినది. గతము నాతఁడు 2 విస్మృతి నందలేదుగాని ముందు చేయఁదలంచిన 3 కార్యాలోచనమున 4 నిమగ్నాంతరంగుఁడై యుండెను.

కొంతకాలము వారట్లు ముచ్చటించుకొనుచుండ భానుమంతు నెవ్వరో పిలిచిరి. ఆతఁడు లేచివెళ్ళెను. పిదప బాలిక లిరువురు నితరవిషయములు మాటలాడుకొనిరి.

మాటవరుసను "నృసింహ కవి యేమయ్యెను!" అని సుమతి యడిగెను. ఆమె మనస్సునం దేమియు నుద్దేశించి యట్లడుగలేదుగాని సుగుణవతి 5 యీ సలజ్జావనతవదనాంబుజ యయ్యెను. సుమతియింక నాప్రశ్ననే సాగించుచు "అతఁడింకొక గ్రంథమును వ్రాయుచుండెననుకొనెదను. చెలీ! నిన్ను గ్రంథమునఁగూడఁ జొప్పనాయేమి! ఆతని ప్రథమ నవలయం దట్లు నిన్నుద్దేశించి వ్రాసెనని నా కనుమానము గలదు." అనెను.

ఈస్నేహితుల కిరువురికి నభ్యాసమయిన నిస్సందేహమగు రీతిని సుగుణవతి యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను :—

"సుమతీ! నృసింహకవి మొన్నటిరాత్రి—నాతో—మరేమి—తన్ను బెండ్లియాడుమని— నిర్బంధించెను."

ఇట్లని సుగుణవతి తనచేతుల నొడిలో నుంచుకొని కూర్చుండెను. ఆపైనేమియుఁ జెప్పలేదు. నయనారవిందముల నుండి 6 తుహినకణంబులవలెఁ గన్నీరొలుకుచుండెను.

"సుమతీ! అతఁడు నన్ను మిక్కిలి ప్రేమించితినని చెప్పుటచే నేను నాతని నొకప్పుడు ప్రేమించితి ననుకొంటిని. కాని మొన్న నాతఁడు ముచ్చటింప నాడెందము తిరస్కార భావము నందినది. తదనుగుణమగు ప్రత్యుత్తరము నిచ్చితిని. అప్పటినుండి నాకాతఁడు తిరిగి కాన్పింపలేదు. మాలపల్లెలోని ప్రజలు క్రైస్తవులగుట కారంభించిన రాత్రియే యిది జరిగినది."

---

1 కాఁగల 2 మరపు 3 పరామర్శ 4 మునిఁగిన 5 కొంచెము సిగ్గు 6 మంచు తుంపురులు.

"నీకొఱకు నేను సంతసించుచుంటిని." అని నెమ్మదిగ సుమతి పలికెను. సుగుణవతి కొంచెము ఉలికిపడి "యేమట్లనుచుంటి"వని యడిగెను. సుమతి—"వాని యెడల నాకెప్పుడు నామోదము లేదు. అతనియందుత్సాహమే కాన్పింపదు—అతని గుణగణన మొనర్ప నేనిచ్ఛగించను గాని పలువురితో నాతఁడు దైవానుకరణ ప్రతిజ్ఞను గావించినప్పుడు దాని ననువర్తించునను విశ్వాసము నాకుఁ గలుగలేదు."

సుగుణవతి సుమతివంకఁ దేరిపారఁజూచి యిట్లనెను—

"అంతఃకరణశుద్ధిగ నేనాతని నెప్పుడును బ్రేమింపలేదు. అతని కవితామాధుర్యమునకు మెచ్చితిని. అతని మనస్సును నొప్పింపకుండ వలయునని కొంతకాలము ప్రయత్నించితిని. అతఁడారాత్రిగాని మఱియొకప్పు డట్టిసంభాషణమును గావించి యుండెనేని నేనుగూడ నాతని బ్రేమించు మార్గమునఁ బడుదునేమో? కాని యిప్పుడట్లు కాదు."

సుగుణవతి యిట్లు మాటలాడుచుఁ దిరిగి పరధ్యానమున లగ్నయయ్యెను. తిరిగి కన్నెత్తి సుమతిం గాంచునప్పటికామె నేత్రము లశ్రుపూరితములుగా నుండెను. సుమతి సమీపించి సప్రేమమున నాలింగన మొనర్చెను.

కొంతదనుక వారట్లు ప్రసంగించుకొనినవెనుక సుగుణవతి నిజగృహంబునకు వెడలిపోయెను. సుమతి తానొంటరిగఁ గూర్చుండి నేస్తురా లెంతటి విశ్వాసమును దనయెడలఁ జూపించి తనరహస్యముల వెలిబుచ్చెనాయని తలపోసెను. సుగుణవతి యొక్క ముఖవైఖరింబట్టి యింకను జెప్పవలసినది కలదని యూహించెను. కాని యంతయుఁ జెప్పనందులకుఁ గినుక వహింపలేదు.

ఆతరుణముననే భానుమంతుఁడు తిరిగివచ్చెను. వారియువు రభ్యాసానుసార మొకరి భుజము నొకరూతగా నానుకొని యిటునటు 1 నడయాడఁ దొడంగిరి.

మాలపల్లె నంటియున్న ప్రదేశము నంతను విలిచి చేయఁదలంచిన లోకోపకార కార్యములలోఁ బాలుగొనవలసినదగుటచే వారి ప్రసంగము నైసర్గికముగ సుగుణవతి విశేషముననే ప్రసరించెను. సుమతి తన సహోదరునితో నిట్లనెను.—

"2 వల్లకీ గుణగణ స్వానంబు నధఃకరించు గానకళా 3 కౌశలము కలిగిన దేయువతియైనను దనసహజశక్తిని ధనార్జనమునకుఁగాని లోకముయొక్క మెప్పును వడయుటకుఁగాని వినియోగింపక సుగుణవతివలె నిమ్నజాత్యుద్ధరణమునకై వినియోగింప సమకట్టునని నీవూహింతువా? పట్టణమునఁ గొందఱి పిల్లలకుఁ బాఠములు చెప్పుచుఁ దన్మూల్యమున జీవనోపాధిని గలిగించుకొనుచు మిగిలిన కాలమునంతను మాలపల్లెయందలి ప్రజల యభివృద్ధికై వినియోగింప నిశ్చయించుకొనినది."

"ఇది నిశ్చయముగ స్వార్థత్యాగమునకుఁ బ్రబల నిదర్శనము" అని భానుమంతుఁడు 4 సంక్షేపముగ నుత్తరము నొసంగెను.

సుమతి యాతని దేరిపారఁజూచి యిట్లనెను:—

"ఇట్టి స్వార్థత్యాగమును గావించుట దుర్ఘటమని తలంపవా!" అని నాటకరంగముల 5 నభోమణులవలెఁ బ్రకాశించుచున్న తరుణీలలామల నైదాఱుగురిఁ జేర్కొని "వీరిలో నెవ్వరైన నిట్టిస్వార్థత్యాగము చేయుచుండుదురా?"

1 అరుగ 2 వీణ 3 నేర్పు 4 సంగ్రహము 5 సూర్యుల

యనెను. భానుమంతుఁడు—"ఎఱుంగను" అని మున్ను తన్ను కూలపల్లెకుఁ దీసికొని పొమ్మని వేఁడుకొనిన బనారసుచీరను ధరించిన తరుణి నామమును వక్కాణించి "యా యిందుమతియు నీవలెఁ బరమార్థమును దలంచునదని యెంచఁజాలను" అనెను.

"విలాస మందిరముగఁ గాలముఁ బుచ్చుచు నీటుగఁ దిరుగు సాంబుఁడును నీవలె నిమ్నజాత్యుద్ధరణమునకుఁ గడంగ నేరఁడు." అని సుమతి పలికెను. పిమ్మట వారిరువురు నిశ్శబ్దముగఁ గొంతదనుక మిన్నకుండిరి.

సుమతి—సుగుణవతి విషయములోఁ దమ్ముఁడా! నీవేల నిర్లక్ష్యమును బ్రకటించుచుంటివి? నామాటలు కఠినముగఁ దోఁచిన మన్నింపుము. నీ విధానమును గాంచి యామె 1 ఱుజుగుపడుచున్నది. మీరు స్నేహధర్మమున వర్తించుచుండెడు వారు. నీలోఁ గలిగిన యీమార్పు నామె సహింపదనుకొనెదను."

భానుమంతుఁ డాకస్మికముగ నిలువఁబడిపోయెను. కలతనందిన మనస్సుగల వానివలెఁ గాన్పించెను తన చేతిని సుమతి భుజముపుఁడి తీసికొని గదిలోని యొక మూలకు నడచెను. తన రెండుహస్తములను వెనుకనుంచుకొని తిరిగివచ్చి సుమతి 2 కభిముఖుఁడై "సుమతీ! నారహస్యమును నీవు గ్రహింపలేవా?" అనెను. సుమతి తబ్బిబ్బుఁజెంది సంగతి గ్రహించినదానివలె ముఖవికాసమును మార్చెను. భానుమంతుఁ డంతట నిర్మలాంతఃకరణతో నిట్లనెను.—

"నేను నా జన్మమున సుగుణవతిని దక్క నితరుల నేరిని బ్రేమించలేదు. ఆనాఁడామె నాటకోద్యోగము నంగీకరింపక నీయెదుట నిరసించినదే. అదినమున నేన తన్ను 3 ద్వాహము కమ్మని కోరితిని. అదిగో! యీపచ్చికబైట నీ ప్రసంగము జరిగెను. ఆమె నన్ను దిరస్కరించెను. తిరస్కరించునని నేనెఱుంగుదును. నాజీవితమునకు 4 సదాశయమేమియు లేకుండుటయే తన 5 వైమనస్యమునకుఁ గారణమని తెల్పెను. ఆమె యథార్థమునే 6 ప్రవచించినది. సుమతీ! ఇప్పుడు నాజీవితమున కొక యాశయ మేర్పడియుండుటచే నేనిప్పుడు క్రొత్తమానిసి నగుటచే నేనిప్పు డెట్లు ముచ్చటించుటకును సావకాశము లేదని నీవెఱుంగవా? నేనీ దైవానుకరణమున నవలంబించుట యామె గానమహిమ చేతనే ఆనాటిరాత్రి యామె గానము నాకర్ణించుచుండ నాసంగతిని మరచి దైవోపదేశమునే కేవలము వినుచున్నట్లునుతలంచితిని. నాకామె యెడలఁ గల సర్వోత్కృష్ట ప్రేమ తాత్కాలికముగ నప్పుడు నారక్షకుని యెడలఁగల ప్రేమగాఁ బరిణమించినది." ఇట్లని కొంతతడవు చెప్పిచెప్పి నిశ్చలుఁడై యూరకుండెను. పిదపఁ దిరిగి ప్రారంభించి "సుమతీ! నేనామె నింకను బ్రేమించుచునే యుంటిని. కాని యామె నన్నెన్నటికిని బ్రేమింపఁజాలదని శంకించుచుంటిని." అని విషాద పూరిత మంద హాసముతో సుమతివంకఁ జూచెను.

సుమతి భానుమంతుని సుందర వదనారవిందమును బరికించుచుండెను. అస్వాభావిక సంచరణమువలనఁ గలుగు చిహ్నములన్నియు నశించినవి. 7 దృఢోష్ఠములు పురుషధర్మమగు ధైర్యమును సూచించుచున్నవి. నిర్మలవీక్షణము లామెపై బ్రసరించుచున్నవి. గాత్రము బలవత్తరమై సౌందర్యరాశివలె నుండెను. భానుమంతుఁ డిప్పుడు సత్యమగు

---

1 చిఱ్ఱు 2 ఎదురై 3 వివాహము 4 యోగ్యాశయము 5 విమనోభావము 6 పల్కినది 7. గట్టి పెదవులు.

పురుషాకృతిని దాల్చెను. కాలక్రమమున సుగుణవతి వీని నేల వరింపక పోవును! నిశ్చయముగ వీరు పరస్పరానురాగముల కర్హులై యుండిరి. అందును వీరి జీవితాశయములు క్రైస్తవాదర్శకములగుటచే మఱియును—

ఆమె హృదంతరమున వ్యాప్తమయిన యీ యూహల నన్నిటికిని భానుమంతునితో నించుకించుక వక్కాణించెను. అంతమాత్రమున వానికి మనశ్శాంతి లభింపలేదు. వారీ ప్రసంగమును ముగించునప్పటికి భానుమంతుఁడు పురప్రముఖులతోఁ దిరుగుచు వారిని క్రైస్తవులుగ మార్పఁ బ్రయత్నించుచుండుననియును తటస్థించినప్పుడెల్ల సుగుణవతితో ముచ్చటింప నాతఁడు వెనుదీయక పోయినను గావలెనని యామె సాంగత్యము నభిలషింపఁడనియు సుమతి గ్రహించెను. అతఁడు స్వకీయేంద్రియ నిగ్రహశక్తి నింకను బూర్తిగ విశ్వసింపలేదు. తన ప్రేమ యింకను యథాస్థితంబుగ నుండెనని ప్రేయసి తెలిసికొనిన ద్వితీయ తిరస్కారమలవడునని యాతఁ డనుమానించుచుండె ననియు సుమతి వాని వైఖరిని బట్టి గ్రహింపఁగలిగెను.

అపురునాగానా పత్రికానిర్వహణమునఁ దాను చేయఁదగిన విషయముల నంతర్భావములఁ దెలిసికొను నిచ్చచేఁ బురూరవునితో సంభాషింపఁ బత్రికా కార్యాలయమున కేగెను. ఈ సమావేశకాలమునఁ గణ్వుఁడును గూడఁ దటస్థించెను. పత్రికా నిర్వహణాంతర్భాగంబులఁ బ్రభు వెట్లు నడిపించువాఁడైనను బ్రపంచోద్ధరణమున కాతఁడే యాదర్శముల నవలంబించెనో యీ విషయమునఁ గూడ నా యాదర్శములనే కైకొనునని వారు మువ్వురేకాభిప్రాయులైరి.

పురూ—ప్రభు వాచరించునని నాకుద్బోధించిన విధానముల నిటు విభజించి పెట్టితిని.' అని బల్లపైనుంచిన కాగితము దీసి చదివెను.

తనదినచర్య నిట్లే వ్రాయ బ్రయత్నించు స్వవిషయమును, కన్న శ్యామ శ్రేష్ఠియు నిట్లే వ్రాయఁ బ్రయత్నించిన విషయమును గణ్వునకు స్మరణకువచ్చెను.

దైనిక పత్రికాధిపుఁడగు పురూరవుని స్థానమునఁ బ్రభువగు యేసు క్రీస్తును నిలిపిన నాతఁ డవలంబించు విధానములు అని యీ శీర్షికకుఁ బేరిడితిని.

1 చెడ్డదనిగాని, మోటుదనిగాని, అపరిశుద్ధమైనదని గాని, యెంచఁదగిన వాక్యమునైనను, బొమ్మనైనను దన పత్రికలో జొనుపఁడు.

2 రాజకీయ వ్యాపారముల విమర్శించునప్పు డది యే తెగవారి కుపయోగించునని తలంపక సకలప్రజా సౌకర్యాకరమగునా యనియే విచారించి వ్రాయును. తెగలతోఁగాని ప్రత్యేకవ్యక్తులతోఁగాని వానికిని తమి యేమియును లేదు. దేవుని రాజ్యమును భూమిపై స్థాపించుటకనుగుణమగు విధులనే చేపట్టుచుండును.

అంత నిలిపి పురూరవుఁడు తలయెత్తి వారిం దిలకించి ప్రభువు పత్రికాధిపతియై రాజ్యాంగవిషయములఁ జర్చించునప్పు డవలంబించునని నేను తలంచిన విధానమును మీకు వ్యక్తపఱచితిని గదా! ప్రభువు చిత్తవృత్తి మఱియొక విధమున నుండునని యూహించువారిని నేను నిరసింపను. నా స్థానమునఁ బ్రభువు గూర్చుండిన నేమి సేయునో నాబుద్ధికిఁ దోఁచినట్లు వివరించుచుంటిని.

శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయము
సుల్తాన్ బజార్, హైదరాబాద్. ఆం. ప్ర.

3 ప్రభువుచే నడుపఁబడు దైనికపత్రికయొక్క 1 యాద్యంతోద్యమము దేవుని చిత్తమును నెరవేర్చుటయే యైయుండును. ఆతఁడు పత్రికా నిర్వాహణమున ధనార్జన కొఱకు గాని, రాజకీయవిషయములఁ బ్రజాభిప్రాయమును దన కానుగుణ్యముగఁ ద్రిప్పుకొనుటకు గాని యవలంబింపఁడు. తన పత్రికా మూలమున దేవుని రాజ్యమును, వెదకుచుండెనని పాఠకుల కందఱికిని సువ్యక్తమగు రీతిని నడపును. స్వార్థత్యాగము నొనర్చి తమ ప్రాణములపైన ధారవోసి 2 మృతజీవు లనిపించుకొని క్రైస్తవ మతోద్ధారకులు, బోధకులు, మంత్రులు మున్నగువారి కార్యవిధానములవలెఁ బత్రికాధిపుని ముఖ్యోద్దేశములు గూడ నిష్కల్మషముగ 3 సువ్యక్తములై యుండవలెను.

4 అపకార 4 ద్యోతకములగు ప్రకటన లనర్హములు.

5 కార్యస్థానమున బనిసేయు వారి నందఱి నత్యంతము ప్రేమింపవలయును.

ఇచ్చటఁ దిరిగి తల నెత్తి చూచి పురూరవుఁడు — నేను పరికించినంతదనుకఁ బనివాండ్రందఱును సమభాగస్వాములుగఁ గ్రీస్తు బరిగణించునని తోఁచెడిని. భిన్నాదర్శములు గలవారి కందుఁ దావుఁ గాన్పింపదు. అందఱుఁ దదేకాయత్త చిత్తులై కార్యస్థానమునఁ జేరవలయును. ఈ విషయమున జయప్రదముగ నెరవేరఁగల విధానము 5 నారయుచుంటిని. ఏదియెట్లున్నను బనివాండ్రందఱి యెడలఁ దీవ్రప్రేమ నొక్కటిఁ బ్రసరింపఁజేసినప్పుడు, ఒక్కని స్వఫలాపేక్షకై కార్యము నిర్వహింపఁబడనప్పుడు, పత్రికాధిపుఁడు, లేఖరులు, విలేఖరులు, వ్యాసనిర్మాణకులు, విక్రేతలు, మున్నగువారెల్ల రేకఫలాపేక్షులై పరస్పర ప్రేమా 6 నిబద్ధ చేతస్కులై ప్రభుసేవఁ గావింప సమకట్టినప్పుడు ఫలితార్థము నందఱు ననుభవింపఁ బత్రిక యేల జయప్రదముగా నుండదు ?

6 ప్రభువు పత్రికాధిపుఁడైనచోఁ బత్రికలోని విశేషభాగమును దేశమునఁ గ్రైస్తవాదర్శముల నెలకొల్పుట కుపయోగించును. సంఘసంస్కరణము, సాంఘిక దురాచార నిరసనము, మతబోధా ప్రచారము మున్నగు విషయములఁ దరుచు చర్చింపఁ బడుచుండును.

7 మద్యపానము నవనాగరకత కనావశ్యకమనియును, జనసామాన్యము నధఃపతనము గావించు బద్ధవైరి యనియును మన పత్రికారాజంబున శక్తివంచన సేయక వ్యాసముల గుప్పించుచుండును. అట్లొనరించిన నెవ్వరేమనుకొని యెదరో యని యించుకంతయు సంశయింపఁడు. పాఠకుల సంఖ్య తగ్గునని యైన భయపడఁడు.

ఇచ్చటఁ దిరిగి పురూరవుఁడు కన్నుల నెత్తి వారిం గాంచి “ యీవిషయమున మదీయాంతరాత్మ ప్రబోధము 7 నుద్ఘాటించితిని. భిన్నవిధమునఁ బత్రికలఁ బ్రకటించు క్రైస్తవుల నేను నిందింపను. మద్యపానమును నిర్మూలము చేయుటకే క్రీస్తు తన యావచ్ఛక్తిని వినియోగించునని నా నిశ్చయము ” అనెను.

8 ఆదివారమునాడు క్రీస్తు పత్రికను బ్రకటింపఁడు.

---

1 మొదలు తుద 2 చనిపోయియు జీవించియున్న 3 బాగుగఁ దెలియబడినవి. 4 తెలుపునవి. 5 వెదకుచుంటిని 6 కట్టుబడిన 7 పలికితిని.

9 ప్రజలు తెలిసికొనుటకు యుక్తమైన లోకవార్తలనే యాతఁడు ప్రచురించును. మల్లయుద్ధములు, హత్యలు, మున్నగు దురంతముల వివరములు, కుటుంబాపవాదములు, ప్రవాదములు మున్నగు విషయముల నాతఁడు ప్రచురింపఁడు. వీని జ్ఞానము లోకమున కనవసరము ప్రజానువృద్ధికి 1 అనుపయోగములు.

10 పత్రికా నిర్వహణమునకై తనస్వాధీనమున దున్నంత ద్రవ్యము ప్రభువునకుఁ గరగతమయ్యెనేని 2 మనోద్రఢిమగల సత్క్రైస్తవులగు స్త్రీ పురుషుల సాహాయ్యమును వడసి 3 ప్రకృష్టములగు వ్యాసరాజంబుల వెలువరించును. నేనును జేయఁబూనిన దదియే. కొలఁదికాలముననే మీకు విశదము కాఁగలదు.

11 పత్రికాంతర్భాగము లెట్టి కార్యముల నాసించినను మొత్తమువిగాఁ నీవిధానము నవలంబించిన దేవుని రాజ్యమును భూమియందుఁ బ్రతిష్ఠాపించుటయే ప్రధానాంశముగఁ బరిణమించును.

పురూరవుఁడు తానిట్లేర్పఱచుకొనిన విధానముల వారికిఁ జదివి వినిపించి దీర్ఘాలోచనమున మునింగి తుదకిట్లనెను. "ఆచరించవలసిన మార్గముల నించుకించుక 4 స్థాలీపులాకన్యాయమున సూచించితిని ఈ పత్రికను మనదేశమున నొక బలవత్తరమైన శక్తిగఁ బ్రబలఁజేయుటకు పెందలకొలఁది యూహలస్మన్మనంబున నుప్పొంగు చున్నవి. వానినింకను నేనే పూర్తిగ విమర్శింప లేదు. ఇతర పత్రికాధిపులతో నాయా యావిషయంబులఁ జర్చించితి. సబ్బాతుబడుల కుపయోగించునట్లు ఆదిత్యవాసరమున నొక పత్రికను బ్రకటింపుమని కొందఱభిప్రాయము నిచ్చిరి. సబ్బాతుబడుల నన్నిటిని జేరఁగలిగిన సంతోషమే. ఈకాలమున మనదేశమున సబ్బాతుపాఠశాలలు బలవత్తరమయిన శక్తిగఁ బరిగణింపఁ బడఁదగియుండ నేలొకో పెక్కండ్రు నీరసముగ నెంతురు. పత్రికమాత్ర మెన్నఁడును బలహీనముగ నుండదు. దౌష్ట్యమునకంటె యోగ్యతయే దార్ఢ్యవంతమయినది. ధర్మపురీ క్రైస్తవసంఘము మీపత్రిక నాదరించునా లేదా యనునదియే 5 విచింత్యము. ఈపట్టణమున లెక్క కిరువదివేలమంది క్రైస్తవులు కలరు. అందర్ధభాగమయినఁ బత్రిక నాదరించిన దీనికిఁ జలన మెన్నటికిని గలుగనేరదు. కణ్వుఁడా! క్రైస్తవాదరణ మెట్లుండునని నీవూహించెదవు?"

కణ్వుఁడు—ఇదమిద్ధమని నిర్ణయించుటకు నాకు సామర్థ్యము చాలదు. పత్రిక జయమునందఁగలదనియే నానమ్మకము. సుమతి చెప్పినట్లు ఒక వత్సరముదనుక నిలిచియుండిన నపరిమితమగు లోకోపకారమును జేయఁగలఁదు. ఇట్టి యాదర్శములతోఁ బత్రికను బ్రకటించుటయుఁ గ్రైస్తవ 6 మేధాశక్తులను జ్ఞానమును సంపూర్ణముగఁ దదర్థమై వినియోగించుటయు, దంభము, అహంభావము, స్వార్థపరత, ఆత్మస్తవము, పరనింద మున్నగు నసంగత ప్రసంగముల నరికట్టుటయు ననునీ 7 సంపుటియే సర్వోత్కృష్టము. ఇట్టి దైనికపత్రికను నెలకొల్పుటకిందనుక మతోద్ధారకులును, మేధాశాలురు నగు మహామహు లెందఱో ప్రయత్నించి విఫల మనోరథులైరి.

---

1 ఉపయోగింపని 2 మనస్సుగట్టితనము 3 ఎక్కువయగు 4 గిన్నెలోని మెతుకు 5 మిక్కిలి యోజింపదగినది 6 మెదడునందలి బలము 7 కలయిక.

పురూరవుఁడు—నిజమే. నేను ననేక లోపముల నాచరింపవచ్చును, నాకు విశేషజ్ఞానము కావలసియున్నది. కాని నేను ప్రభువు ననుసరింపఁ దలంచితిని. నే నను దినమును ప్రభు వేమిచేయునని శంకించుకొనుచుంటిని. ముం దడుగడుగున నిట్లే వితర్కింతును. ప్రత్యుత్తరమును నాయంతరాత్మ ప్రబోధించిన రీతి ననుసరింతును.

సుమతి— "మన ప్రభువైన యేసుని యనుగ్రహమునను, జ్ఞానమున నభివృద్ధి నందుము." అను ననుజ్ఞ నిప్పు డిప్పుడు గ్రహింపఁ బ్రారంభించితిమి. ప్రభువును నేనింకను బూర్తిగ గ్రహించినగాని వాని యాచరణ విధానము గ్రహింపఁజాలను.

కణ్వుఁడు— నీవు యథార్థమును బలికితివి. ప్రభువుయొక్క యాంతరంగిక జ్ఞానము నింకను బూర్తిగ గ్రహించినగాని యాతఁ డిట్టి సందర్భముల నెట్లు ప్రవర్తించునో నిశ్చయింపఁ జాలకుంటిని. ప్రభువుయొక్క చర్యలఁ దెలిసికొనుటలో దిన దినాభివృద్ధి నందును. ప్రతివిషయమునఁ బ్రభు వేమిచేయునని వితర్కించి మన యంతరాత్మకుఁ బ్రబోధించిన ప్రత్యుత్తరము ననువర్తింపఁ ద్రికరణ శుద్ధిగ సంసిద్ధులమైన మన జన్మలు తరించినవనియే నిశ్చయింపనగును. ప్రభువు ననుసరించుటకు బూర్వము మనమాతని నెఱుంగవలయును.

సుమతి పురూరవుల మధ్య జరుగఁదగిన యేర్పాటులు ముగిసినతోడనే వాని కామె యైదు లక్షల ధనము నిచ్చెను. ఈ ద్రవ్యముతోఁ గ్రైస్తవాదర్శములుగల దైనికపత్రికను సకల స్వాతంత్ర్యములతో నడపుట కధికార మొసంగఁ బడెను. పిదపఁ గణ్వుఁడును సుమతియు వెడలిపోవఁ బురూరవుఁడు సింహద్వారమును మూసికొని గదిలో నొంటిగఁ గూర్చుండి సర్వశక్తిగల పరలోకమందుండిన తండ్రి నేతత్కార్య నిర్వహణ సామర్థ్యము నొసంగుమని పలుదెఱంగుల దీనహృదయుఁడై వేఁడుకొనెను. అతఁడు ప్రార్థించుచున్నంత కాలమును దన బల్లముందు మోకాళ్ళూని యుండి యిట్లు పలుకుచుండెను.

సమస్తశక్తి సామర్థ్యములుగల మాతండ్రీ! జ్ఞానము సంపాదింపఁ దలంచిన ప్రతి మానవుఁడు నిష్కల్మష బుద్ధితో నడిగిన సమస్తజ్ఞానమును వారికిఁ బ్రసాదింతునని సత్యవేద గ్రంథమునఁ బ్రవచించి యుంటివి. సుమతిని నీసేవకై నా కరగత మొనర్చిన యీధనమును నీ చిత్తవృత్తిని వినియోగింపఁగల జ్ఞానమును నాకొసంగి నన్ను ధన్యునిఁ జేయుము."

భగవంతుఁ డాతని మొర నేలయాలింపఁడు? నిశ్చయముగ నీపత్రికారాజ ప్రకటనంబునఁ బరలోక రాజ్యము భూమిపై నవతరింపఁగలదు.

మాసద్వయము గతించెను. ధర్మపుర్యాలయ సాంఘికుల లోను, పట్టణ వాసుల లోను, కదలిక విశేషముగఁ గలిగినది. మండు వేసవిని గ్రీష్మబాధ విశేషముగ నున్నను ప్రభుసేవా తత్పరులు, తమ ప్రతిజ్ఞల నెరవేర్చుకొన యథాశక్తిని బాటుపడుచుండిరి. సోమనాథశర్మ మాలపల్లెలోఁ జేయఁదగిన సేవను బూర్తిగ నాచరించుచుండుటచే నూర్లకొలఁది ప్రజల యంతరంగంబులు మార్పుఁజెందుచుండినను బ్రేక్షకుల కేమియు భేదము ప్రస్ఫుటముగఁ గాన్పించుటలేదు. పానశాలలు, జూదమాడు ప్రదేశములు, వ్యభిచార నిలయములు మున్నగు చెడు కార్యముల కాకరములగు నునికిపట్లు యథాప్రకారము వర్ధిల్లుచున్నవి. అందుచే సోమనాథశర్మచే నుద్ధరింపఁబడిన జీవు లాస్థానముల

నీచాచారములఁ గ్రొత్తవా రాక్రమించుచుండిరి. అపవాది తన సేనల నతిశీఘ్రముగఁ బూరించుచుండెను.

కణ్వుఁడు నీలగిరి పర్వతముల కేగలేదు. తానట్లు చల్లని ప్రదేశమున కేగుటకై కూడఁ బెట్టిన ద్రవ్యమంతయు నిచ్చి మాల గూడెములోని యొక బీదకుటుంబమును మున్నెన్నఁడు నా దుర్గంధప్రదేశమును విడిచి యెఱుంగని వారిని విశ్రాంతికై దేశాంతరమునకుఁ బంపెను. ఆ కుటుంబము నట్లు బంపుటకు వలయు ప్రయత్నములఁ జేయుటలో గడపిన వారము నాతఁ డెన్నఁడును విస్మృతి జెందఁడు. ఒక మండు వేసవి నాటి మధ్యాహ్నము, ఎండ మల మల మాడ్చుచుండ నాతఁడు మాలగూడెమున కేగి యాకుటుంబమును వెంటఁ బెట్టుకొని ధూమశకటారోహకులఁ జేసి నీలగిరికిం గొనిపోయి యచ్చటనొక క్రైస్తవ యువతి యింట బస చేయించెను. వారి యీ జన్మమున నెన్నఁడు నెఱుంగని యీ సుక్షేత్ర వాసమును నవనవ కుసుమ 1 సౌరభ మిళితములగు శీతలవాతపోతముల సౌకర్యమును గాంచుటచే వారి జీవితావధి యినుమడించెనని చెప్పనొప్పును.

వానిలో నొక 2 రుగ్ణబాలిక యుండెను. తక్కుంగల మువ్వురిపిల్లలలో నొకతె 3 వికలాంగి. గృహమేధి కొంతకాలమునుండి కూలి దొరకకపోవుటచే జీవనోపాధి లభింపనివాఁడు— తన యీయవస్థను పదంపడి కణ్వునితో నొప్పుకొనెను.—ప్రయాణము నందెల్ల కడగొట్టు పిల్ల నెత్తుకొని యుండెను. స్వర్గతుల్యస్థానమునఁ బ్రవేశింపఁగనే యాతఁ డానందపరవశుఁడై పట్టఁజాలక కణ్వుని కరయుగము నాకర్షించి కన్నీరు మున్నీరై పార గద్గద స్వనంబునఁ దన కృతజ్ఞతను వెలిబుచ్చెను. గృహిణియు గతవత్సరంబున నా యపరిశుద్ధమగు గూడెము నాశ్రయించిన మహామారి మువ్వురి పిల్లలఁ దన పొట్టం బెట్టుకొనుటఁ జేసి గర్భశోకంబున నవయుచు నసంపూర్ణ దుర్బలాహారమునఁ 4 గార్శ్యత నందిన దేహము కలదియై యుండియు మార్గమధ్యమున దృగ్గోచరములగు వివిధాహ్లాద విషయంబులఁ దిలకించియు సకల సౌరభముల నాఘ్రాణించియు ముదితయగుచు గమ్యస్థానమును జేరి యచ్చటి రామణీయకమున కలరి 5 తదానందానుసంధాతయైన కణ్వు నంతశ్శుద్ధిగ దీవించి కొనియాడెను. ఆవారాంతంబున వారి యనుమతిని వడసి కణ్వుఁడు ధర్మపురికిఁ దిరిగివచ్చెను. 6 అత్యల్పంబుగనైన శీతల వాతావరణాహ్లాదము 7 నాస్వాదించినవాఁడగుటచే ధర్మపురీ ప్రాంతములఁ గల కారువడల కుడికిపోయెను. ఇట్టి దుర్భరావస్థనుండి యాకుటుంబమును సంరక్షించుటవలన గలిగిన యానందరసమున నోలలాడుచుఁ దనకుఁ గలిగించుకొనిన యారాటమున కలుగక 8 స్వయంనియుక్త దైవానుసరణి ననుసరించుచుండెను. అతఁడింతకు మున్నెన్నఁడును దేహారోగ్యమున కవసరమైనం గాకున్న వేసవిని నీలగిర్యావాసమును మానినవాఁడు కాఁడు.

పలువు రీవిషయమును బ్రశ్నసేయఁ దనశరీరారోగ్యమున కట్టి మార్పు విధాయకము కాదని ప్రత్యుత్తర మిచ్చెను. నాకు సంపూర్ణారోగ్యము కలిగియుండుటచే నీవత్సరమున నచ్చటికిని బోవసమకట్టు లేదని చెప్పుచు వచ్చెను. తా నాకుటుంబమునకీ 9 సౌకర్యమును గలిగించితినని తన భార్యతోఁ దప్ప మఱియెవరికిని దెలుపలేదు. అదియు

1 పరిమళను 2 రోగిణి 3 అంగవైకల్యము కలది. 4 కృశత్వము. 5 ఆసంతోష 6 మిక్కిలితక్కువ 7 పీల్చుకొనిన 8 తనంతటఁ దాను ఏర్పరచుకొనిన 9 మేలు

నాతని కానందమయ్యెను. గుప్తదానమేకదా ప్రభ్వంగీకారమునకు వడయును. పలువురిచేఁ గొనియాడఁబడునట్లు చేయు దానఫలము నిహమునందే స్తోత్రరూపమునఁ బొందునుగావున నాముష్మికమున ఫలింపదు.

ఇట్లు వేసవి విశేషించినకొలఁది నాతఁడు ప్రభువు నధికముగ గ్రహింపఁ గలిగెను. మద్యపానపు పెనుభూతమింకను విడువలేదు. దైవానుకరణాదర్శము నింత దనుకఁ బరిశుద్ధాత్మయే కాపాడుచుండె నని కణ్వుఁ డెఱుంగును. ఇదియంతయు నొక వైత్యవికారమును బోలిన వెఱ్ఱిప్రేరణ మనియుఁ గొలఁదికాలముననే యంతరించి పురాతన మార్గమునే యవలంబించుననియుఁ దలంచు సాంఘికు లనేకులు గలరు. తన శిష్యు లందఱు నీ యాదర్శము నంగీకరింపలేదు. కాని కణ్వుఁడుమాత్రము పట్టినపట్టు విడువక 1 కార్మికుల కుపన్యాసముల నిచ్చుచు దేవాలయారాధనముల యథావిధి నెరవేర్చుచు నవీనశిష్యవర్గము నత్యుత్సాహముతోఁ బ్రోత్సహించుచుఁ బ్రభుమార్గమునం దపరిమిత జ్ఞానమును వడయుచుఁ గాలముఁ బుచ్చుచుండెను.

వైశాఖమాసమున నొకనాటి సాయంసమయమున నెండవేడిమి తగ్గి మలయమారుత మించుక మెల్లమెల్లన వీచుచుండ నృసింహకవి తాను గవాక్షమోక్షణమును గావించి 2 పరిసర ప్రదేశమును వీక్షించుచుండెను. ఆతనిబల్లపై లిఖితగ్రంథము విప్పఁబెట్టఁబడి యుండెను. ఆనాఁడు సుగుణవతితో ముచ్చటించిన పిదప నామెను మరలఁ గలిసికొనలేదు. తనమాట సాగనప్పు డాగ్రహాపరీత మగు నాతని స్వభావము గ్రంథకర్తయగుటచే నాతని నొంటిగఁ గూర్చుండునట్లొనర్చెను. ఈ వేసవి నంతయు నాతఁడు వ్రాయుచునే యుండెను. ఆతని గ్రంథ మిప్పుడు పరిసమాప్తి నొందనయ్యుండెను. ఆతని నేక్షణమునందయిన నలసునిఁజేయు నంతటి మహోద్రేకముతో గ్రంథరచనఁ గావించెను. ఇతరులతోపాటు తా నాచరించిన దైవానుకరణ ప్రతిజ్ఞ నాతఁడు విస్మరింపలేదు. గ్రంథరచన కాలమునందెల్లను మఱియుఁ బ్రేయసీ తిరస్కార మందిన దాదిగ సదా జ్ఞప్తికి వచ్చుచునే యుండెను. వేయియు నొక్కసారి క్రీస్తేమి సేయు నని శంకించెను. ఇట్టి గ్రంథమును వ్రాయునా? ఇది లోకవిడంబనార్థమైన నవల, ప్రజామోదమును వడయు శైలిఁగలది. ప్రజారంజకమును మించిన యాదర్శము దీనికి లేదు. ఇందు నీతిబాహ్యములైన విషయములు గాన్పింపవు గాని, మతప్రబోధక విషయములు పొడకట్టవు. ఇట్టి గ్రంథము గ్రంథకర్తకు విశేషధనమును సేకరించునని యాతఁ డెఱుంగును. నవనాగరి కాగ్రేసరు లానందించు శైలిని గూర్చు నేర్పాతనికిఁ బ్రాయికముగాఁ గలదు. ఏతద్విధానంబున గ్రంథమును వ్రాయుచుండ ననుక్షణంబును గ్రీస్తిట్లు రచించునా యను 4 నాకాంక్ష వానికి సాక్షాత్కరించుచుండెను. క్రీస్తువ్రాయు గ్రంథము కేవల మాదర్శప్రాయముగనే యుండును. అది ప్రజోపయోగముగను నీతిదాయకముగను రక్షణప్రధానముగ నుండును. నృసింహకవి యేకారణము నుద్దేశించి యీగ్రంథమును వ్రాయుచుండెను? ధనార్జనకొఱకు ఖ్యాతికొఱకు. ఆతఁడా విషయము నెఱుంగనిది కాదు. ఆతఁడు బీదవాఁడు కాఁడు. కావునఁ గేవల ధనార్జనకే గ్రంథరచన సేయ నవసరములేదు. దిగంతవ్యాప్త కీర్తిం గాంచుటయే ప్రధాన హేతువు. అందుల కిట్టి గ్రంథమునే వ్రాయవలయును. క్రీస్తిట్లు వ్రాయునా?

---

1 పనివాండ్ర 2 సమీపపు 3 ఇష్టురాలు 4 కోరిక

వాని కిట్టి ఖ్యాతివలయునా ? సుగుణవతి తిరస్కృతికంటె నీవిషయ మాతని నెక్కుడుగ బాధించెను. ప్రతిజ్ఞాభంగము జేయ నగునా ?

అతఁ డీవిషయములఁ దనమనంబున మననము సేయుచుఁ గవాతుముకడ నిలిచి బయలు చూచుచుండ భానుమంతుఁ డెదురుగనున్న విలాసక్రీడామందిరమునుండి బయలు వెడలి వీధినిఁ బోవుచుండ నాతని సుందర వదనారవిందంబును మనోహర గాత్రంబును గవిప్పరికించెను. పిమ్మటఁ గవి తన బల్లదగ్గఱ కేగి కూర్చుండి తన వ్రాసిన కాగితముల నటునిటుఁ ద్రిప్పిచూచెను. తిరిగిలేచి కిటికీదరి కరుదెంచెను. భానుమంతుఁడు వడివడిగ నేగుచుండెను. సుగుణవతియు వాని సరసను నడచుచుండెను. ఆమె సుమతింజూచి తిరిగివచ్చుచుండ వెనుకనుండి వచ్చి భానుమంతుఁ డామెను గలిసికొని యుండనోపును.

[1]దృక్పథమును దాటి వార లుభయులు నదృశ్యులగుదనుకఁ గవి వారలఁ దదేకదృష్టిం బరికించెను. పిదపఁ దిరిగి వ్రాయుటకు దొరకొనెను. గ్రంథమును పరిసమాప్తి నందించు నప్పటికిఁ గనుచీఁకటి పడుచుండెను. " క్రీస్తేమి సేయును ? " క్రీస్తును దిరస్కరించుట మూలమున నతఁడు తుదకు సమాధానము నొసంగెను. వాని గదియందు జిమ్మచీఁకటులు గ్రమ్మెను. శ్రేయసీ తిరస్కృతిచేతను, ఆమె నెన్నటికైనఁ గూడఁగలనను భావము భావముగుటచేతను కవి తుదకధఃపాతము నందెను.

" మేడికోలను బట్టినవాఁడు వెనుకకుఁ దిరిగిచూచినయెడల నాతఁడు దేవుని రాజ్యమున కనర్హుఁడు. " అని క్రీస్తు ప్రవచించి యుండ లేదా ?

సప్తమాధ్యాయము.

సంపూర్ణము.

1 చూపుదారి.

శ్రీ

# దైవానుకరణము.

## అష్టమాధ్యాయము.

సప్తమాధ్యాయాంతమున నుడివినట్లు నృసింహాకవి వాతాయనమునుండి చూచుచుండఁ గ్రీడామందిరమునుండి వెలువడి వడిగఁ బోవునపుడు భానుమంతుఁడు సుగుణవతిని గూర్చి తలంపనైన లేదు. ఆమె నచ్చటఁ జూతునని కలనైన నెంచలేదు. ఆమెయు నాసందుమలుపుఁ దిరుగునప్పటి 1 కాకస్మికముగ వారియువురుఁ దారసించిరి. ఆమెఁ జూచునప్పటి కాతని హృదయ మాహ్లాద 2 సంకలితమైనది. పిదప నామె సరసను నడువ నారంభించెను. తన మనఃఫలకమునుండి తరిమివేయ సాధ్యముగాని తన యనురాగమున నొకతూణమైన నామె సమావేశ 3 లేశముచే నానందింప సంకల్పించెను.

సుగుణవతి — నేనిప్పుడే సుమతిని జూచివచ్చుచుంటిని. మాలగూడెములోని భూమి యంతయు విలుచుటకు వలయు నేర్పాటు లన్నియుఁ గావింపఁబడిన వని చెప్పినది. 4 అచిరకాలంబున నట్లు జరుగఁగలదు.

భానుమంతుఁడు — అగును. న్యాయస్థానముల నీవిషయము చిరకాలము నుండి చర్చింపఁబడుచున్నది. అచ్చటు నిర్మింప సమకట్టిన భవనములఁ జిత్రలేఖనములు మున్నగు నన్నియు సుమతి నీకుఁ జూపినదా ?

సుగుణ — అనేక చిత్రపటములఁ గాంచితిమి. ఈకార్యమునకై యిన్నియూ వాల సుమతి యెట్లు తలంపఁ గలిగినదో యని నా కాశ్చర్యమగుచున్నది.

భాను — ఈ విషయమునఁ జిరకాలమునుండి నిమ్నజాత్యుద్ధరణమునకై పాటుపడుచున్న 5 ప్రముఖు లందఱికంటె సుమతి కెక్కుడుగఁ దెలియును. ఈ వేసవికాల మంతయు నీవిషయమున వలయు సంగతులఁ బెక్కుతావులనుండి తెప్పించి తెలిసికొనుటలోనే గడపినది.

ప్రపంచోద్ధరణమునకై కావింపఁ దలంచిన యీ కార్యవిషయమును ముచ్చటించుకొను చుండుటచే భానుమంతుఁడు ప్రప్రథమమున నొందిన మనోవిభ్రాంతిని విడిచి స్వస్థచిత్తుఁడై ప్రస్ఫుటముగ మాటలాడఁ జొచ్చెను.

"వేసవికాల మంతయు నేమిచేయుచుంటివి ? నాకచ్చటను గాన్పింపలేదే!" అని సుగుణవతి యడిగెను. ఆమె ముఖేందుమండల మించుక 6 వైవర్ణ్యముం జెందెను. ఎక్కువ చనవరిగ ముచ్చటించుటనో, తరుచు వానిం గాంచఁ జాలమికి వగపునో యీ వర్ణపరిణామము సూచించుచుండెను.

"పనిలో మునిఁగియుంటిని." అని యాతఁడు సంకుచితోత్తరము నిచ్చెను

సుగుణ — ఆపనిని గూర్చి సవిస్తరముగఁ జెప్పుము. బహు క్లుప్తముగమాటలాడు చుంటివి. నిన్నిట్లడుగుటకు నా కధికారము కలదా లేదా ?

---

1 హఠాత్తుగ 2 కూడినది 3 ఇంచుక 4 స్వల్పకాలములో 5 గొప్పవారు 6 వివర్ణత

భానుమంతుని కభిముఖియై 1 నిష్కర్షగ నిట్లు ప్రశ్నించెను.—

విశ్వాస పూరితమగు మందహాసముతో నాతఁడు— "అందుకు సందేహమేమి? నీకంతగఁ జెప్పఁదగిన విశేష మేమియుఁ గాన్పింపదు. నాకుఁ బూర్వపరిచయుల సన్మార్గమునకుఁ ద్రిప్పఁ బ్రయత్నించుచుంటిని." అనెను.

ఇఁక ముందు జెప్పుటకు భయపడువానివలె నిలిపెను. సుగుణవతి మారుమార్గముల సూచింప సాహసింపలేదు

భాను—నీవును సుమతియు జేరిన సంఘమునందు నేను నొకఁడనై యుంటిని ప్రభువైన యేసుక్రీస్తు యెట్లు ప్రవర్తించునని నా యంతరాత్మ ప్రబోధించునో యట్లు చేయుటకుఁ బ్రమాణము చేసితిని. అట్లు చేయు దృఢసంకల్పముతో నేనీ కార్యము నాచరించు చుంటిని.

సుగుణ—అదియే నాకు 2 దుర్గ్రాహ్యముగ నున్నది. నీ మఱియొక కార్యమును గూర్చి సుమతి ముచ్చటించినది. మాతోపాటు నీవు నావాగ్దత్తము 3 ననువర్తింపఁ బ్రయత్నించుట యాశ్చర్యముగ నున్నది. క్రీడాభవనంబులఁ గాలంబుఁ బుచ్చు వారిని నీ వేమి చేయఁగలవు?

భాను—నీవు చాల ముఖ్యమయిన మాట నడిగితివి. నే నిప్పుడు సమాధానము చెప్పవలసినవాఁడనై యుంటిని. ఆనాటి రాత్రి గుడారముకడ గడచిన వెనుక—నీకు జ్ఞాపకముండవచ్చును—దానికి మారుగ నా జీవితమునకు ఫలితార్థ మేమిగలిగించి దైవానుకరణ ప్రతిజ్ఞను సఫల మొనర్చుకొందునని విచారించితిని. ఆవిషయమునే మనంబునఁ బదింబదిగ 4 మననము సేయఁ దుదకీ కార్యము నాచరింప నిశ్చయించుకొంటిని తదాచరణమునఁ దటస్థపడు కష్టముల భరింప నెంచితిని. మన సంఘమున ననాలోచితముగ 5 నసడ్డ సేయఁబడిన వారిలో నావలె జీవితకాలమును ధనమును గూడ దుర్వినియోగపఱచుచు విలాసభవనంబుల (Clubs) దిరుగువారు మిక్కిలి హీనదశయందున్నవారని నీ వూహింపవా? మాలగూడెమును బోలిన నీచస్థానములనుండు వారి యుద్ధరణమునకై దేవాలయ సంఘములు పాటుపడఁగలవు. మఠాధిపతులే కూలివాండ్ర యాత్మరక్షణమునకుఁ గూడఁ బనిసేయుదురు. పరదేశములలోని యితరులకై పాటుపడఁ బ్రత్యేక సమాజము లేర్పడుచుండును. కాని మనచుట్టునుండి సకలవిధముల నధోగతిఁ జెంద సంసిద్ధులై యున్న నాగరకాగ్రేసరుల క్రీడాభవనముల 6 నామరణాంతముఁ గాలము బుచ్చువారి నుద్ధరింప నెవ్వరును బూనుకొనరు. వీరికంటె నెక్కుడుగ నే యధమాధములును సహాయ్యమున కర్హులగారు. వీరిలో బెక్కండ్ర మంచిచెడ్డల నెఱుంగుదును. నేనును వారిలో నొకఁడను. నిమ్నజాతుల సమీపించుటకు నేను దగను. కారణము నాకుఁ దెలియదు. వెచ్చబుచ్చ దగినంత ధనము గలిగిన యీ తరగతి వారిలోఁ గొందఱినైన సన్మార్గమునకుఁ ద్రిప్పఁగలనను నమ్మకము గలదు. అందుకొఱకే నేనిప్పుడు కృషిచేయుచుంటిని. నీవలెనే క్రీస్తు నాస్థానముననుండిన నేమిసేయునని వితర్కించుకొన నీ సమాధానము లభించినది. దీని నిర్వహించుట నాకు మిక్కిలి సంకటముగ నున్నది.

1అడ్డులేక 2గ్రహింపరానిది 3సమ్మతింప 4స్మరింప 5అశ్రద్ధ 6బ్రతికియున్నంతకాలము

ఈ వాక్యము నుచ్ఛరించు నప్పటికి భానుమంతుని స్వరము మిక్కిలి హీనమై చెట్టుమన్న ధ్వనిలో సుగుణవతికి వినిపించుటయే దుర్ఘటమైనది. కాని యాతఁడు చెప్పినదంతయు నామె గ్రహించెను. అతఁడీ కార్యము నే మార్గముల నాచరించు చున్నదియుఁ దెలిసికొనఁ గోరెను. కాని వాని కేమని యడుగుటకును దోఁచలేదు. ఇతర సంగతులఁ దెలిసికొను 1 చాపల్యమున కంటె నీమెకీవిషయమున విశేషాకాంక్ష కలదు. ఒకప్పుడు తన్ను పెండ్లిచేసికొనుమను కోరిక నాగరక యువకుని కంటె మిక్కిలి భిన్నమైనవాఁడుగ మారుటచే నీతఁడు కేవలము క్రొత్తమానిసిగఁ దోఁచి ముచ్చటింపఁ నాహ్లాదమును గొలిపెను.

వారా సందుమలుపు దిరిగి సుగుణవతి యింటివైపునకు వెళ్ళుచుండిరి. ఈవీధి లోనే వెనుక భానుమంతుఁ డామెను "నీవు నన్నెల ప్రేమింపఁజాల" వని యడిగెను. ఆ స్థానమును సమీపించు నప్పటి కిరువురు నలుకఁ జెందిరి. ఉభయులు నా ప్రసంగ మును 2 విస్మృతిఁ జెందలేదు. ఇట్లు నిశ్శబ్దముగఁ గొంతఁ దూరము నడచిన వెనుక సుగుణవతి యిట్లనెను :—

"నీ పూర్వ పరిచితులగు క్రీడాగార ప్రవేశకులతో నీవీ దైవతంత్రముల ముచ్చటించునప్పుడు వారు నిన్నెట్లాదరించుచుండిరి? నీవు వారి నెట్లు సమీపింపఁ గలుగుచుంటివి? వారేమను చుండిరి?

భానుమంతుఁ డామె ప్రశ్నల సావధానముతో నాలకించి పిదప నిట్లు సమాధానము చెప్పదొడంగెను.—

" అదియా! ప్రతిమనుజునితోడి ప్రసంగమును భిన్నభిన్న మార్గముల నవలంబించును. అందులోఁ బెక్కండ్రు నన్ను వెఱ్ఱివానిగాఁ దలంచెదరు. నేనా సమాజ సభ్యునిగనే యుంటినిగాన నావిషయమునఁ జిక్కు కలుగలేదు. నేను జాగ్రత్తగ సంచరించుటచేఁ బలువురు గూడి పరిహాసము సేయుట కవకాశము నిచ్చుటలేదు. నా ప్రసంగముల నామోదించువారి సంఖ్య పెరుగుచున్నదని వినుటకు నీకాశ్చర్యము గలుగఁ గలదు. కొలఁదిరాత్రులకిందట వారిలోఁ బన్నిద్ద ఱామోదాహ్లాదములతో విశేష కాలము నాతో మతవిషయిక ప్రసంగములఁ గావించుచుండిరనిన నీవు నమ్మఁజాలవు. వారిలోఁ గొందఱు దుర్వ్యసనములఁ ద్యజించి నూతనోజ్జీవనము నవలంబించుటను గాంచితినని చెప్పుట కెంతయు సంతోషముగా నున్నది. క్రీస్తుమిచేయుననీ వారిఁ దరుచుగ నడుగుచుండును. సమాధానము వందమంద గమనంబుల లభించుచుండును. ఒక సంగతిమాత్రము నిశ్చయము. వారెవ్వరును నన్ను ద్వేషించుటలేదు. అది మంచిసూచనగ భావించుచున్నాను. ఇంకొక సంగతి వినుము. కొందఱికి మాలపల్లెలో జరుగుచున్న కార్యములయం దాసక్తిని గలిగించితిని. ఆ కార్యముల నాచరణలోనికిఁ దెచ్చునప్పుడు వానిమతెంత శక్తివంతములుగఁ జేయు వారు దోడ్పడెదరు. ఈసమాజమున 3 ద్యూతమాడ నాశనమందుచున్న వారికి దానియెడ విముఖతను గలిగించితిని. "

భానుమంతుఁడు మిక్కిలి హెచ్చరికతో ముచ్చటించుచుండెను. అతని జీవితములోఁ బాల్గొన నారంభించిన యీనవీనోజ్జీవనముచే వాని ముఖమున నొకవిధమగు నూతన వికాస మంకురించెను. అతని దృఢవిశ్వాసయుక్త సంభాషణమును సుగుణవతి

---

1 చపలత్వము 2 మరుపుతేను 3 జూదము

కనిపట్టెను. అతఁడు సిలువను (శ్రమలను) సంతోషముతోడనే వహించుచున్నను దజ్జనితవ్యథ సువ్యక్త మగుచుండెను. కావున నాతని పరిణామజీవితమున 1 కనుగుణముగ సుగుణవతి హెచ్చరికను గొలుపుచు నిట్లు పలికెను —

" నీజీవిత మాదర్శ రహితముగ నున్నదని నిన్నొకప్పుడు నిందించితిని. ఇడువు నీవు ధైర్య స్థైర్యములతో నీ ప్రతిజ్ఞను నెరవేర్చుకొనఁ బ్రయత్నించుచుంటి వని చెప్పుటకెంతయు సంతోషముగ నున్నది. ఇప్పుడు నీజీవిత మత్యంత గౌరవార్హమై వెలయుచున్నది ,,

భానుమంతుఁ డీవాక్యముల వినునప్పు డానందసాగర 2 మగ్నుఁడై యుండెను. నవీనాదర్శములచే 3 ఘనీభవించిన మానసము కలవాఁడగుటచే నాత్మానందము నిగ్రహించెనుగాని పూర్వమువలె నుండిన నాపుకొనఁజాలక పోయి యుండును. అతఁ 4 డాపాదమస్త పులకిత గాత్రుఁ డయ్యెను. సుగుణవతి వాని యవస్థం గ్రహించెను. కొంతదనుక వా రధరస్పందము గావింపకయే నడచిరి. ఎట్టకేలకు భానుమంతుఁడు "నీకు కృతజ్ఞుఁడను. నీ వాక్యామృత జనితానందము వర్ణనాతీతము. అని యామె ముఖమును దేరిపారఁ జూచెను. ఆమె తనయెడ నాతనికిఁ గల ప్రేమాతిశయము నా వీక్షణంబున దెలిసికొనెను. అంతటితో వారి ప్రసంగము ముగిసెను.

అతఁ డనుజ్ఞను వడసి వెడలిపోయిన తోడనే సుగుణవతి తన గదిలో నొంటిగఁ గూర్చుండి శీర్షమును గరంబుల నిడుకొని యిట్లు తలపోయ దొడంగెను—

" గౌరవపాత్రుఁ డగు వాని ప్రేమకు స్థానమైనఁ గలుగు నానందము నిప్పుడు గ్రహించుచుంటిని. భానుమంతుని నేనుగూడఁ బ్రేమించెదను. నే నేమనుచుంటిని ? సుగుణవతీ ! మరచితివా ?—"

లేచి కొంతవడి వడివడిగ నాగదిలో నటునిటుఁ దిరుగఁజొచ్చెను. నఖశిఖ పర్యంత ముద్రేక ప్రకంపిత యయ్యెను కాని యామె మానసోద్రేకము 5 విషాదపశ్చాత్తాప జనితమైనదికాదు. ఆహ్లాదకర మగు నవీనానందము ప్రాదుర్భవించెను. 6 అచుంబితాహ్లాద మంకురించెను. సమ క్రైస్తవాదర్శ మిట్టి యానందమునకుఁ గూడఁ దావొసంగినందుల కామె మిక్కిలి సంతసించెను. క్రైస్తవాదర్శమున నిదియు నొకభాగమే. ఏలయనఁ గ్రైస్తవాదర్శావలంబి యగు భానుమంతుఁడే యామె ప్రేమకుఁ బాత్రుఁడయ్యెను. ఆమె మనస్సును సత్క్రైస్తవుఁడే దొంగిలించెను. క్రైస్తవేతరుఁ డామె మానస హరణమును గావింప లేకపోవును.

ఆనాడు సుగుణవతి తిరస్కారభావమును సూచించినది మొదలాతఁడు కలనైనఁ దలంపని క్రొత్తయాశలు భానుమంతుని హృదయారామమున మొలకలెత్త నారంభించెను. దినములు గడచిన కొలఁదియు నట్టి నిరీక్షణముతో నాతఁడు తన కార్యములఁ జాకచక్యముగఁ జక్కఁబెట్టుచుండెను. సుగుణవతి యీ యాశను గలిగించినది మొదలాతఁడు కడుంగడు 7 శ్రద్ధాళుఁడై పెక్కండ్రకుఁ గ్రీస్తు నామోపదేశము నొనర్చి వారి యాత్మల నుద్ధరించుచుండెను.

వేసవికాలము గతించినది. శీతల వాతావరణము ప్రబల మగుచుండెను. మాల

1 తగినట్లు 2 మునిఁగిన 3 గట్టిపడిన 4 కాలు మొదలు తలవఱకు 5 దుఃఖము, పశ్చాత్తాపము 6 ఇదివఱ కెఱుంగని 7 శ్రద్ధగలవాఁడై

గూడెము నుద్ధరించుట కామె సంకల్పించిన పథకములలో నొకదాని నిప్పటికి సుమతి నిర్వహింపఁ గలిగెను. పొలములో భవనముల నిర్మించుటయు, నా ప్రదేశము నంతనొక యుద్యానవనముగ మార్చుటయు, మున్నగున వన్నియు నామె సంకల్పమునఁ జేరియున్న వేగాని స్థలము నార్జించిన వెనుక వీని నన్నింటిని బూర్తిసేయుటకుఁ దగిన వ్యవధాన మిప్పటికిఁ జాలదు. క్రైస్తవాదర్శముల నెలకొలుపుటకై లక్షరూప్యములు సంసిద్ధపరచుకొని యున్నప్పు డీ కాలములో నెంతటి కార్యములనైనఁ గావింప నగును. కణ్వుఁ డొకసారి యా ప్రదేశమునకుఁ జూడఁబోయి యంతలోఁ గావించిన కార్యములఁ జూచి యాశ్చర్య నిమగ్న మానసుఁ డయ్యెను.

ఈ విషయములనే మనంబునఁ దలపోయుచు మరలిపోవుచుండ నెంతటి పనులఁ జేయుచుండినను మధుపానమును నివారింపలేక పోతిమి గదా యని విచారింపఁ దొడంగెను. ఆ పెనుభూతమును దరిమివేయఁ జాలనిచో నీ కార్యములఁ బ్రయోజనమేమి? సుమతి సుగుణవతులును సోమనాథశర్మయుఁ బడిన పాటు లెంతదనుక ఫలించినవి? ధర్మపుర్యాలయ ప్రాంతమునను గుడారమునను బరిశుద్ధాత్మని 1 ప్రాబల్యమునఁ గావింపఁబడిన ప్రత్యేకాదర్శప్రభావంబునఁ బట్టణమున నెక్కుడు మార్పు కలిగిన దనుట 2 యతిశయోక్తి కానేరదు కాని యాతఁడా మార్గమునఁ బోవుచుఁ గల్లుదుకాణములు వరుసగ నుండుటయు గుంపులు గుంపులుగ జనము వానిలోనికిఁ బోయి వచ్చుచుండుటయుఁ గాంచినప్పు డా ప్రాంతములఁ గల వృద్ధజనంబుల ముఖములపై దురవస్థా ప్రభావము ప్రస్ఫుటముగఁ గాంచినప్పుడు, వాని హృదయము ఖేదము నందఁ జొచ్చెను. ఒక లక్షరూప్యము లీ మురికికూపమును శుభ్రముచేయు నెట్లు చాలును? అని శంకింపఁ జొచ్చెను. తాము నివారింపఁ బాటుపడుచుండిన మానవదౌర్భాగ్యదశ కంతకు నీ మధుపానశాలలే గదా పుట్టినిండ్లు. సకల 3 దుష్కృతాకరం బనఁదగు నీ 4 పానాగారములు నిరంతరశీధాటిని విషరసప్రవాహమును జనసంఘముపైఁ బ్రసరింపఁ జేయుచుండ సుమతిబోటి సత్క్రైస్తవు లెందఱు చేరిన నేమి సేయఁగలరు? ఒక జీవుని నుద్ధరించు నప్పటి కిరువురిని సంసిద్ధము సేయఁగల పానశాలలు ప్రబలుచుండ భూలోక నరక మనఁదగు నీ నీచాతినీచ కూపంబునఁ బ్రవేశించి సుమతింబోలు సత్క్రైస్తవులు తమ జీవితముల వ్యర్థము సేసికొనుట న్యాయమా?

ఈ యాశంక నాతఁడు తొలఁగింపలేకపోయెను. పానశాలల రూపుమాపినఁ గాని యేమియుఁ జేయ వశము కాదని సుమతి సుగుణవతితోఁ జెప్పినప్పు డామె డెందమునుగూడ నీ సంశయమే బాధించెను, కణ్వుఁ డా సాయంతనమున, స్వధర్మాచరణమునఁ బ్రవర్తించు తరుణమునకు 5 మద్యాగారముల విషయమై తన మనంబున స్థిరమైన యూహల నెలకొల్పుకొనెను.

ధర్మపురీవాసుల పునరుజ్జీవనమునకు మధుపాన మంతరాయమైనచో, దైవానుకరణ ప్రతిజ్ఞను గావించిన స్వల్పసంఖ్యాకుల కా పెనుభూతమును నార్కొని నిగ్రహించు సామర్థ్యము కలదా లేదా యని నిర్ణయింప వలసివచ్చినప్పుడు, తత్సమాజాధ్యక్షుఁడగు కణ్వుఁ డభిప్రాయము నొసంగ దక్షుఁడు కాఁడు. ఈ కార్యముతో సంబంధము

1 అధికృత 2 గొప్పగాఁ జెప్పుట 3 పాపములకు నివాసము 4 కల్లంగడులు 5 కల్లుపాకలు.

లేని పరుఁడు నిజమును గ్రహింపఁగలఁడు. లేని యీ నూతనాదర్శము గ్రామమునఁ బ్రవేశించిన వెనుక మొత్తముమీఁదఁ బట్టణ 1 నైతికావస్థయందు మిక్కిలి మార్పు కలిగినది. ఈ మార్పునకుఁ గల కారణము నా పట్టణస్థులు బూర్తిగ గ్రహింపఁ జాలరైరి.

శీతకాలము గతించినది. క్రైస్తవాదర్శమునకుఁ గణ్వుఁడు నియమించిన సాంవత్సరికావధి 2 యంతరించినది. ఆసంవత్సరోత్సవము ధర్మపుర్యాలయ చారిత్రమునఁ బ్రసిద్ధాంశము. ఆలయ సభ్యులు గుర్తించినదానికంటె నెక్కుడుగ ముఖ్యమైనది. సాంఘికులు గ్రహింపఁ దగనంతటి వేగముతో విశేషచరిత్ర నీవత్సరము సమకూర్చినది. ఏడాది పండుగనాడు బయలువడిన విషయములను ప్రజల యొప్పుదలలఁ గాంచి సామాజికులే యీయాదర్శము తమ పట్టణములకే గాక యీ దేశమునకుఁగూడ నెంతటి మహోపకారమును జేయునైయున్నదో గ్రహింప శక్యము గాకుండెను.

ఈ ప్రథమ సాంవత్సరికోత్సవమున కొక వారముక్రిందటఁ గణ్వునకు సహాధ్యాయుఁడును, కాశ్మీరదేశమునఁ బురోహితుఁడు నగు వేంకట సోమయాజి తన స్నేహితులఁజూడ నీయూరి కరుదెంచెను. ఆతఁ డాదివారమునా 3 డారాధన కాలముననుసిదప దైవాను సరణ ప్రతిజ్ఞాధారుల సమావేశకాలముననుదత్తత్త్వ దేశముల నుండి యత్యంత కుతూహలముతో సకలమును జూచెను. ఆతని యభిప్రాయము నిందుఁ బొందుపరచెదము :—

(వేంకట సోమయాజి తన మిత్రుఁడగు గంగాధరునకు వ్రాసిన లేఖ.)

ప్రియమిత్రమా !

నే డాదివారము. రాత్రి మిక్కిలి ప్రొద్దుపోయినను నేనీ ధర్మపురియందుఁ గని విని యున్న విషయంబులు నా మనంబున కత్యంతో ద్రేకంబును గలిగించుటచే రేపటిదనుక నాపుకొనఁ జాలక నీకీ జాబుమూలమున వానినన్నిటిని దెలియఁజేయుచుంటిని. కావున నీకాలమున నింత పెద్దజాబు వ్రాసినందులకు మన్నింపుము.

మనకు సహాధ్యాయుఁడగు కణ్వుని నీవు జ్ఞాపకముంచుకొనియే యుందువు. నేను చెన్నపురికి నిన్ను జూడవచ్చినపుడు ప్రసంగవశమున విశ్వవిద్యాలయమును విడిచిన వెనుకఁ గణ్వుని నీవు తిరుగఁ జూడలేదని చెప్పినట్లు నాకు జ్ఞాపకము, అతఁడు మంచి వక్తయు ననూన పాండితీ విభవము కలవాఁడు నని నీవెఱుంగుదువు. విద్యల నారితేరిన వెనుక వత్సరాంతముననే ధర్మపుర్యాలయాధ్యక్షుఁడుగ నియమింపఁ బడెను. అప్పుడు నేను నాభార్యతో నీతఁడు4సముచితమార్గమున 5 నన్వేషించెను; మతవిషయిక ప్రసంగముల నారితేరిన వాఁడగుచు" అని చెప్పియుంటిని. ఆతఁ డేకాదశ వత్సరములనుండి యిచ్చటనే యుండెను. ఒక వత్సరముక్రిందటి దనుక నాతఁ డుదయారాధములఁ జక్కని ప్రసంగములఁ గావించుచుఁ బెక్కండ్ర సాంఘికుల నాకర్షించి యాధ్యాత్మిక విద్యను సముచితంబుగఁ గరపుచుఁ గాలముఁ బుచ్చుచుండెను. ఈ మతాధి పత్యముక్రింద ధనవంతులు పెక్కండ్రు కలరు. సంఘమును గడు పెద్దదిగనుండెను. సౌభాగ్యు లెల్లరు నవిచ్ఛిన్నముగ గుడి నలంకరింతురు. సుగుణవతి యను నొక సుప్రసిద్ధ 6 గాయనీ గానంబున మిక్కిలి శోభాస్పదంబుగ నుండెను. ఈ పాటకత్తె విషయ మింకను ముందు వివరింపవలసి యున్నది. నేను విచారించినంత వఱకుఁ గణ్వుఁడు చేత

1 నీతివిషయమున 2 దాటినది 3 పూజ 4 మంచి 5 వెదకను 6 సంగీతవిద్యావంతురాలు

నమును చేకొనుచు యోగ్యసంఘమును గలిగి సకలవిధ సౌఖ్యముల నందుచుండెను. ఈ స్థానము పెక్కండ్ర 1 కీర్ష్యం గొలుపఁదగినదై యున్నది.

నేటికి సరిగ నొక 2 యబ్దముక్రిందట నీయాదివారమునాఁడు యథాప్రకారము కణ్వుఁ డుదయారాధనమునకై యాలయమున కరుదెంచి కార్యక్రమమును ముగించిన తోడనే "యొక వత్సరముదనుకఁ బ్రతికార్యారంభమునను గ్రీస్తు విషయమున నెట్లు ప్రవర్తించు" నని విమర్శించి తమ యంతరాత్మలు ప్రబోధించిన సదుత్తరముల 3 ననువర్తింతు మని నాతోపాటు ప్రతిజ్ఞఁ గావింప నభిలషించు వారెల్ల నొక సమాజముగఁ గూడి పనిసేయుద" మని వక్కాణించెను.

పిదప నాలయసభ్యులలోఁ గొంద ఱొకచోఁ జేరి 4 పూర్వోక్తవిధానంబునఁ బ్రతిజ్ఞఁ గావించిరి. వా రత్యద్భుతక్రియలఁ దదనుగుణముగఁ గావించుటచేఁ దేశము నంత నాకర్షించిరి. ఈవిధాన మీ యాలయసంఘములో నంతరింపక 5 కాలానుగతికముగ దేశవ్యాప్తమై ప్రతియాలయమున నెలకొనఁగలదని నేను నమ్ముచున్నాను. కావుననే దీనినొక ప్రబలాదర్శ మని వక్కాణింప సాహసించు చుంటిని.

తన యీ ప్రవచనము నాదియందే పెక్కం డ్రవలంబింప సంసిద్ధు లగుటచేఁ దానే వింతపడితి నని కణ్వుఁడు చెప్పెను. ఆలయసంఘమునఁ బ్రముఖులైన వారిలోఁ గొందఱు ప్రభుమార్గానుసరణ ప్రతిజ్ఞం గావించిరి. అందు దైనిక పత్రికాధిపుఁ డగు పురూరవుఁడు పత్రికాప్రకటనమున విడ్డూరము లగు మార్పులఁ గావించెను. 6 వణిక్శిఖామణి యగు కన్నయ్యశ్రేష్ఠియుఁ గర్మాగారాధికారి యగు సుమంతుఁడును మున్నగువారు తమతమ కార్యములలోఁ జేసిన మహాద్భుతములు ప్రజల మనంబుల నాకర్షించినవి. ఒక కోటీశ్వరుని యేకపుత్రికయగు సుమతియును కన్యక పత్రికా నిర్వహణమునకును జండాల వాటీప్రజోద్ధరణంబునకును దనయనర్ఘ ద్రవ్యము నంతను వినియోగించినది. 7 వల్లకీతంతీగణ స్వానంబుతోఁ దులదూగు గాన కళా కౌశలంబున లోకప్రసిద్ధి వడసిన సుగుణవతియు, దన సంగీతవిద్యను 8 స్వాతిశయార్థము వ్యర్థపుచ్చక నిమ్నజాతుల నారీతిలకంబుల నుద్ధరించుటకై వినియోగింపనిశ్చయించుకొనినది.

వీరికిఁదోడు దేవాలయ సాంఘికు లనేకు లీ దైవమార్గానుసరణ ప్రతిజ్ఞ నవలంబించు చుండిరి. సంఘసంస్కర్తలు నిందుఁ బెక్కండ్రు చేరుచుండిరి. ప్రభు వేమి చేయు మనిన దానికి సంసిద్ధులమై యుంటి మను వాగ్దానమే మూలమాత్రముగాఁ గల వారీ సంఘసంస్కర్తలు. కణ్వవినిర్మిత విధానంబునకును దీనికిని గొంత భేదము కలదు. ఇందు భక్తుఁడు ప్రభువుయొక్క మార్గము నూహించి యనుసరింపఁ బ్రయత్నించును. దానికిని దీనికిని ఫలితార్థమున విశేషవ్యత్యాసములేదు. కావుననే వారిలోని పెక్కండ్రిందుఁ జేరుచుండిరి.

ఈప్రయత్న మెట్లు ఫలించినదని నీవడుగవచ్చును. ఈసమాజ మేమిచేసినది? అందువలనఁ బ్రజాసామాన్యమునం దెట్టి మార్పు కలిగినది? అనెదవు. ఇప్పటి ఘన కార్యములనుగూర్చి లోకప్రతీతి వలననే కొంతవఱకు నీవు తెలిసికొనియుందువు. ఏసుని యడుగుజాడ నత్యంత మనుసరించుటచేఁ గలుగుఫలమును బూర్తిగ గ్రహింపఁ

---

1 కోపమును 2 సంవత్సరము 3 అనుసరింతుమని 4 వెనుక చెప్పినట్లు 5 కాలముంబట్టి 6 గొప్పవర్తకుడు 7 వీణ 8 తనగొప్పకు

గలిగినచో నిచ్చటి కేతెంచి ప్రతిమనుజుని దినచర్యయందుఁ గలిగిన మార్పులను దేవార్చనాదికములఁ గలిగిన ప్రాశస్త్యమును గాంచిన సువ్యక్తమగును. దానినంతను వివరింపఁదలంచినఁ బెద్దగ్రంథమగును. అట్లొనరింప సాహసింపను. ఇచ్చటి నామిత్రులును గణ్వుఁడును జెప్పిన సంగతులఁ గొన్నిటి సంగ్రహముగ వివరింతును.

ఏతత్ప్రతిజ్ఞామూలమున ధర్మపుర్యాలయమునఁ గలిగిన మార్పు ద్వివిధము. ఈ సంఘమునందు మున్నెన్నఁడునుగలుగని క్రైస్తవ[1]స్వానుభూతి యంకురించినదని కణ్వుఁడే చెప్పెను. అపోస్తలుల కాలమునందుఁ బ్రబలిన యైకమత్య మిప్పుడు వీరియందుఁ బొడసూపుచున్నది. క్రైస్తవసంఘమునంతను రెండుభాగములుగా విభజించినది. ప్రతిజ్ఞాపాలకు లందఱును వ్యర్థప్రయత్నము సేయుచుండిరనియు వ్యావహారిక ధర్మములఁ [2]దత్తదాశయములకుఁ బ్రవృత్తి కలుగదనియుఁ దదితరులు తలంచుచుండిరి. సంఘమునం దీయాదర్శము ప్రబలుచుండుటచే కొందఱు వైముఖ్యతచే నితరాలయ సభ్యులుగఁ జేరిరి. కొందఱు తటస్థులుగ నుండిరి. కొందఱు పట్టుదలతోఁ దదాశయమును నెలకొల్పుచుండిరి. కణ్వుని మతాధిపత్యమునుండి తొలఁగింపఁ మఱికొందఱు పాటుపడుచుండిరి. [3]చరమవర్గమువా రల్పసంఖ్యాకులు నాయకులుగఁ బరిగణింపఁ దగిన వారిలోఁ బెక్కండ్రు ప్రతిజ్ఞాపాలకు లగుటవలనను బరిశుద్ధాత్మ వీరి నావరించియుండుటవలనను బరపీడన మప్రసిద్ధ మగుచుండెను.

ఇది కణ్వునిపై నధికప్రచారముం గాంచి వానిలో విశేషపు మార్పును గలిగించెను. నాలుగు సంవత్సరముల క్రిందట నాతఁ డొకపరి బోధించుచుండ వినియుంటిని. శ్రోతల కాహ్లాదమును గొలుపు వక్తృత్వము నాతఁడు చక్కఁగ నభ్యసించెను. అట్టిశక్తి తన కలవడెనని యెఱుంగును. ప్రసంగవ్యాసమును లలితపద భూయిష్ఠంబుగా లిఖించెను. శ్రోతృజనాకర్షణముగ నుండెను. నాటికి నేడు తిరిగి వాని ప్రసంగమును వింటిని. ఆప్రసంగ విషయమును ముందుముందు జెప్పెదను. అప్పటి కణ్వుఁడీతఁడు కాఁడు. పూర్తిగ మారిపోయెను. క్రైస్తవ సేవాదృక్పథ [4]పరిణామంబున నీవ్యత్యయము సంభవించినదని యాతఁడే చెప్పెను. ఆతని పూర్వపు దలంపులన్నియు వినిమయమునందెను. సురాపాన విషయమున నేడాదిక్రిందట నాతనికిఁగల యభిప్రాయములు తారుమారయ్యెను. దేవాలయ కార్య నిర్వహణమున నేమి శిష్యవర్గముల కుపదేశములఁ జేయు విధానముల నేమి చిరకాలాభ్యాసమును ద్యజించి నూతనపథశంబుల నవలంబించెను. క్రైస్తవు లెల్లరుఁ బ్రభువు నత్యంతము వెంబడించఁదగు ననియుఁ దదాచరణమునఁ గలుగు శ్రమల నోర్పున భరింపవలయుననియు నాతని నిశ్చితాభిమతము. క్రీస్తువిశేష శ్రమల నోర్చి మార్గదర్శియగుచుఁ దన[5]ఛాత్రుల నట్లొనర్ప నియమించెను. ఆతని యడుగుజాడల ననుసరింపుఁడు. అను పేతురుని వాక్యమును బెక్కుసారులు నాతో ముచ్చటించు సమయములయం దాతఁ డుద్ఘాటించెను. కావున సమస్త క్రైస్తవ సంఘమును బ్రభ్వాదర్శాను సారముగ శ్రమలవండ సమకట్టుటయే యీ కాలమునకుఁ గర్తవ్యమని యాతని దృఢనిశ్చయము.

ఈతని యభిప్రాయములతో నేను సంపూర్ణముగ నేకీభవింపఁగలనో లేనో చెప్పఁజాలనుగాని మిత్రమా! యీ దైవానుకరణ విధానానుసరణ మీయూర నీసంఘ

1 అనుభవము 2 ఆయాయూహలు 3 చివరి 4 మార్పు 5 శిష్యులు

మునఁ గావించుచున్న విశేషపు మార్పు లాశ్చర్యకరములుగ నున్నవి. త్రికరణశుద్ధిగ నీ ప్రతిజ్ఞ నడపుచున్న వారిగతి యెట్లు పరిణమించుచున్నదని నీ వడుగవచ్చును. ప్రతి[1] నైష్ఠికుని విషయమును బ్రత్యేక చరిత్ర మగును. కావున నిందు వివరింప నసంభవము. కాని యిది కేవలాడంబర ప్రాయము కాదని నీ వెఱుంగుటకై కొలఁది విషయముల నుదాహరించెదను.

సుమంతుని విషయము నించుక విమర్శించి చూడుము. అతఁ డిచ్చట యంత్ర నిర్మాణ కార్యస్థానమున కధ్యక్షుఁడు. అందు జరుగు కొన్ని లోపముల వెలిబుచ్చి యథార్థవాది యగుటచే స్థానభ్రష్టుఁడయ్యెను. పదవీచ్యుతుఁ డగుటచే నాతని భార్యయుఁ బుత్రికలును సిగ్గున నిలు వెడలుట గూడ మానిరి. మున్నున్నత స్థానము నాక్రమించి పలువురితోఁ గూడ వేడుకల మెలంగుచుండెడివారు సుమంతుని యథార్థకథనముచే నా కర్మాగార వ్యావహారిక మర్మము లెల్ల వెల్లడియై దౌష్ట్యమున కంతరాయము ప్రాప్తించినది. సకలదేశీయ కర్మాగారాధ్యక్షుఁడే [2] యపమార్గ వర్తనుఁ డయ్యెనని సుమంతుఁడు నిర్ధారణ చేసెను. సత్యవాక్పరిపాలనమున సుమంతుని యుద్యోగ మంతరించుటచే నాతని పూర్వోద్యోగమగు తంతివార్తలనంపు నీచస్థానమునఁ జేరెను. కణ్వుని వలె నీతఁడును స్వధర్మాచరణమున దుర్మార్గుల కుతంత్రముల కాహుతియయ్యె. విశ్వాసముతోఁ బ్రతిజ్ఞను నెరవేర్చుకొనుచుండెను. నిన్న దేవాలయమున నీతనిం జూచితిని. ప్రతిజ్ఞాపాలకులలో నీతఁడు నొక ప్రధానుఁడుగ నాకు గోచరించెను.

దైనిక పత్రికాధిపుఁడగు పురూరవుని చారిత్రముం దిలకింపుము. ఎంతటి నష్టమునకైన సంసిద్ధుఁడై పత్రికావిధానము నంతను క్రైస్తవాదర్శముగఁ దారుమారుగ మార్చి తన ద్రవ్యము నంతను దాన గోలుపోయెను. నిన్నటి పత్రికను నీవు చూచుటకుఁ బంపుచుంటిని. దానినంతను జాగరూకతతోఁ బరికింపుము. ఇందనుక మన దేశమున నెన్నఁడు నెవ్వరిట్టి పత్రికం బ్రకటించి యుండరు. దాని ననేకరీతుల విమర్శింప వచ్చును. ఏ మానవుని కార్యము విమర్శార్హము కాదు? కాని మొత్తము మీఁద విచారించిచూడఁ బత్రికాసామాన్యమున కంటె నత్యుత్కృష్టముగ నున్నదనక తప్పదు. గ్రామమునఁ గల క్రైస్తవు లందఱుఁ [3] గాలానుగతికముగ నీ పత్రిక నాదరభావముతోఁ జదువఁ బ్రారంభించిరని యాతఁడు చెప్పెను. సంపూర్ణవిజయమే పరమావధిగఁ బరిణమించునని పత్రికాధిపుని విశ్వాసము.

మద్యవిక్రేతలం గూర్చియుఁ ధనార్జనా విధానముల నుద్ఘాటించియుఁ బ్రాతినిధ్యముం గూర్చియు నాతఁడు వ్రాసిన సంపాదకీయ వ్యాసములఁ జదివిచూడుఁడు. ఆదర్శానుసరణమున నత్యద్భుతములని తోఁపక మానవు. పత్రికతో సంబంధించిన కార్యములు నెరవేర్చునప్పుడును వ్యాసముల వ్రాయఁ బ్రారంభించునపుడును క్రీస్తేమి చేయునని విమర్శింపక ప్రారంభింపఁడు.

కన్నయ్య శ్రేష్ఠిని జూడుము. ఈతఁడు వర్తకుఁడు. తన వ్యాపారమునం దీ దైవానుకరణమును బూర్తిగఁ బ్రవేశపెట్టుటచే నూరివారందఱు నాతని నధిక గౌరవ ప్రపత్తులతో నాదరించుచుండిరి. నౌకరు లందఱు నాతని యెడఁ జూపు విశ్వాసము శ్లాఘాపాత్రము. శీతకాలమున నాతఁడు విషమజ్వరపీడితుఁడై పడియుండ గృహసేవకులే

1 నియమశీలవాని 2 తప్పుదారి 3 కాలమునుబట్టి

గాక షాని వ్యాపారముతో సంబంధించిన వారందఱును వచ్చి సకలోపచారములఁ గావించిరి. నిరామయుఁడై కార్యస్థానమునకుఁ దిరిగి వచ్చినపుడు మహోత్సవమును గావించి వారి యానందమును వెలిబుచ్చిరి. వ్యవహారమునఁగూడఁ బ్రేమ ననుసంధానము గావించుటచే నిట్టి యోగ్యమగు మార్పు కలిగినది. ఈప్రేమ పొడిమాటలతో లభించినది కాదు. వ్యాపారమునఁ బ్రవర్తించు సేవకుల నందఱి సమానభాగస్వాములుగ నాతఁ డంగీకరించెను. ప్రేక్షకు లాతని వెఱ్ఱివానిగఁ బరిగణించిరి. ఈక్రైస్తవాదర్శమువలనఁ గొన్ని వ్యవహారములలో నతనికి విశేష నష్టము సంభవించినది గాని క్రమాభివృద్ధి నంది యిప్పుడీ గ్రామమున నీతఁడే పెద్ద వర్తకుఁడుగ నెంచఁబడుటయే గాక యెల్లరికిని గౌరవ పాత్రుఁ డయ్యెను.

సుగుణవతి యను గాయని కలదు. ఆమె తన గానకళాకౌశలము నంతను బీదలకొఱకు వినియోగింప నిశ్చయించుకొనెను. నిర్భాగ్యులు నివసించు గ్రామోపకంఠమున నొక గానకళాశాలను స్థాపింపఁ దలంచినది. దీని నభివృద్ధిలోనికిఁ దెచ్చుటయే తన జీవితమునకుఁ బరమావధిగా నేర్పరచుకొనినది. తన నేస్తకత్తెయు ధనాఢ్యయు నగు సుమతి నాధారపఱచుకొని చేయఁదలంచిన కార్యము సఫలమగు నెడల నాదీన మానవుల జీవితము లానందమును జవిజూడఁ గలవనుటలో నతిశయోక్తి కానిపింపదు. శృంగారవిషయముల యం దనాదరణ వహించునంతటి వృద్ధుఁడను గాను గావునఁ దెల్పుచుంటిని—సుమతి సోదరుఁడగు భానుమంతునకును, సుగుణవతికిని
1 భావ్యబ్దంబున నుద్వాహము నిశ్చయింపఁబడినది. ఆతఁడు మొన్న మొన్నటి
దనుకఁ గ్రీడాభవనంబుల సంచరించు విలాసవంతులలో నొకఁడైనను చండాలవాటీ
2 పరిసరంబునఁ బటకుటీరంబున నాటి సోమనాధశర్మ కావించుచున్న మతబోధవలన
జీవితాదర్శముల మార్చుకొనెను. ఇందుకు సోమనాధశర్మ వాగమృతధారలే కారణమో లేక నాబోధకునికి సాయపడుచున్న సుగుణవతి గానామృత వర్షధారాపరంపరలే కారణమో నే నెఱుంగఁ జాలను ఎటులైన నేమి! యాతఁడు మారుమానిసి యయ్యెను.

దైవానుకరణ తంత్రప్రయోగంబునఁ గలిగిన మార్పులలోఁ గొన్నిటిని మాత్రమే చెప్పితిని. కళాశాలా ప్రధానోపాధ్యాయుఁడు నధ్యక్షుఁడు నగు విద్యాధరుని గూర్చి కూడ వ్రాయఁదలంచితిని. మేమిరువుర మొక్కదేశికునికడనే శాస్త్రాధ్యయనమును గావించితిమి. కావున నాకు సహాధ్యాయి ఈమధ్య జరిగిన పురపాలకసభ్యుల యెన్నికలలో నీతఁడు విశేష శ్రద్ధవహించెను. రాఁబోవు నెన్నికలలో నీతని ప్రభావము మెండగు నని వాడుక గలదు. ప్రభువు నామమునఁ బొందు శ్రమ లత్యానందదాయకములుగఁ బరిణమించునని కణ్వుఁడు చెప్పురీతిని దైవానుకరణమునకై శ్రమల నందిన వారితోఁ దుల్యంబుగ నీతఁడు నట్టి పెక్కుశ్రమలకుఁ లోనయ్యెను.

నేనీ లేఖను విపులముచేసి నీకు విసువును గొలుపుచుంటిని గానోపు నేనిచ్చట నుండినకొలఁది నభివృద్ధి నందుచుండిన నామనోగతాభిలాష నిముడ్చుకొనఁ జాలకుంటిని. నేడు దేవాలయాంగణంబున జరిగిన సమావేశముం గూర్చి కూడ నించుక ముచ్చటింపఁ దలంచితిని.

---

1 రాఁబోవు వత్సరమున 2 సమీపము.

పైన వ్రాసిన రీతిని గణోపన్యాసమును దనిపదీర నాకర్ణించితిని. ఆతని కోరిక పైన గతభానువాసరంబున నే నుపన్యసించితిని. నాలుగేండ్ల క్రిందట నాతఁడు గావించిన మతవిషయికోపన్యాసంబునకును నేటి ప్రసంగంబునకు విశేష 1 వ్యత్యాసము కలదు. గోళాంతరమునుండి యరుదెంచిన మహాపురుషుని ప్రవచనముం బోలియున్నది. నేనానంద పరవశాంతరంగుండ నైతిని. తచ్ఛ్రవణానందంబున నాకుఁ గన్నీరు మున్నీరై ప్రవహించెను. 2 శ్రోత లందఱు నట్టులేయుండిరి. "దానితో నీకేమిపని? నన్ను వెంబడింపుము" అను దైవవాక్యము నాధారపరచుకొని నేటి ప్రసంగమును గావించెను. పరులేమనుకొనిన నెట్లుదలంచిన లక్ష్యము సేయక రక్షకుని వెంబడింప వలసిన దని ధర్మపురీ నివాసుల నత్యంత 3 మనోద్రఢిమతోఁ బురికొల్పెను. ఆప్రసంగమును వినిన ప్రతివాని మనంబును గరగి నీరైపోవును. గ్రంథవిస్తర భీతిచే నా ప్రసంగ విధానము నైనఁ దెలుపఁజాలకుంటిని. ఆరాధన క్రమము ముగిసినతోడనే వారికేదానినుండి యాభ్యస్తమయిన రీతిని దైవానుకరణ వ్రతధారు లందఱుఁ బ్రత్యేకించి సమావేశమైరి. వారందుఁ బరస్పర సందేహ నివారణములఁ గావించుకొని కష్టసుఖములఁ గూడఁ బలుకుకొని పరిశుద్ధాత్మని సహాయమునకై నిశ్చలముగ 4 నైకకంఠ్యముగఁ బ్రార్థించిరి.

నన్నీ సభకుఁ గూడ గమ్మని కణ్వుఁడు పిలిచెను. ఈసమావేశ క్రమము నాహృదయమును గరఁగించినంత మిక్కుటముగ నాజీవితమున మున్నెన్నఁడుఁ 5 జిత్తద్రావ మేకారణమునం గలుఁగలేదు. పరిశుద్ధాత్మని సహవాస మింత యౌన్నత్యముతో నెన్నఁడు నాకు లభింపలేదు. ఇది యన్యోన్యానుభవముల నిష్కల్మష వృత్తితో వెల్లడించుకొనుట కేర్పడిన సహకార సమావేశ మన నొప్పును. ఇప్పుడు క్రైస్తవమత ప్రారంభదశ నాకనుభవమునకు వచ్చినది. అపోస్తలుల నాటి కాలమువలె నాకు గోచరించినది

నేను కొన్ని ప్రశ్నల నడిగితిని. స్వీయద్రవ్య వినిమయముంగూర్చి నేనుసంప్రశ్నింప నందఱికిని మానసోద్రేకము కలిగెను. ప్రతివాఁడును దన 6 భూహిరణ్యాది 7 స్వామ్యములఁ ద్యజించుటయే క్రీస్తునియభిమతమని మేమెవ్వరమును నిశ్చయింప లేదని కణ్వుఁడు సమాధానము చెప్పెను. ఈసమాజమునం దెవ్వనికేని క్రైస్తవాభిప్రాయ మట్లుండునని తోఁచిన నాతఁ డాచరింపవచ్చును. సాంసారిక ధర్మములం గూర్చియు, ధనధాన్యాదికములం గూర్చియు, వైభవానుభవముం గూర్చియు మే మింకను నిశ్చితాభిప్రాయులము కాలేదని కణ్వుఁడు ప్రవచించెను. ధననష్ట మెంతకలిగినను 8 సరకుసేయక యీ సామాజికులు తమయంతఃకరణము లెట్లు క్రైస్తవాదర్శమని ప్రబోధించెనో యట్లే యాచరించుచుండిరి. ఇందెవ్వరును ధైర్యసాహసముల దిగనాడలేదు. ప్రతిజ్ఞాపాలకులలో వ్యావహారిక ధర్మమునఁ బ్రవర్తించువారు విశేష ధననష్టమునకు లోనైరి. ఉద్యోగధర్మమునఁ దా మింతదనుక నాచరించుచుండిన కృత్యముల నంతశ్శుద్ధిగ నవలంబింపఁ జాలక కొంద ఱుద్యోగములఁ గోల్పోయిరి. ఇట్లు కారణాంతరములచే ధననష్టమును బొందిన సామాజికులకు ధనికులగు సాంఘికులు ధనసహాయ్యము నొనర్చుచుండిరి. ఈవిధానములఁ బరికింప నొకవిధమున వీ రందఱును దమ సత్త్వముల

1 ఎచ్చుతగ్గు 2 వినువారు 3 చిత్తస్థైర్యము 4 ఒక్కగొంతుకతో 5 మనస్సు నీరగుట 6 భూమిబంగారము 7 ఆస్తి 8 లెక్కపెట్టక

సామాజికాదాయముగఁ బరిగణించు చుండిరని తలంప నగును. దైవానుకరణ వ్రతావలంబకుల సమావేశ కాలమున నాకు దృగ్గోచరములైన విషయములు మున్నెచ్చటను నే సంఘమున జరిగియుండవు. భూలోకమున నీ కాలమున నిట్టి క్రైస్తవ [1] సహకారము సాధ్యమగునని నే నెన్నఁడుఁ దలంపలేదు. నా [2] చక్షుశ్శ్రోత్రేంద్రియములనే నేను నమ్మఁజాలకుంటిని. ఇది నిజముగఁ బంతొమ్మిదవ శతాబ్దమేనా యని నాకిప్పటికిని సంశయము వొడముచున్నది.

మిత్రమా ! నేనీ విషయముల నన్నిటిని బరిహరించిన పిదప నీకీజాబును వ్రాయ సంకల్పించిన ముఖ్యకారణమును దెలిపెదను వినుము. నేటి ప్రాతఃకాలమున నీసభను ముగింపక పూర్వము ఈ యాదర్శమును దేశమునం దెల్లెడల వ్యాప్తము సేయఁ బ్రయత్నింప సభవారు తీర్మానించుకొనిరి. దేశమునందలి ప్రముఖుల సాహాయ్యము నీయుద్యమసాఫల్యమునకై వేఁడుకొన నిశ్చయించిరి. కణ్వుఁడీవిషయమును దూరమాలోచించియే యిట్లు తీర్మానించుకొనెను. దేశమునందలి క్రైస్తవు లెల్లరీ యాదర్శము నవలంబించిన నెట్టిమార్పులు కలుగఁ గలవని మే మొకపరి ముచ్చటించుకొంటిమి.

క్రైస్తవుఁడగు ప్రతిమానవవ్యక్తియు నీవ్రతము నవలంబించు ననుకొనుము. దేశ మెంతటి యౌన్నత్య మందును ? క్రైస్తవలోక మేల యంగీకరింపదు ? సమాజ క్రైస్తవుఁ డాచరింపఁదగిన దానికంటె నింక విశేష మేమియైన కలదా ? ఇట్లాచరింపఁ దలంపనివాఁడు క్రైస్తవుఁ డనుపించుకొనఁదగునా ? కాలమునుబట్టి క్రైస్తవ నిర్వచనమున వ్యత్యాసము కలుగఁగలదా ?

ధర్మపురిని దాటి దేశమంతయు నెట్లుండవలయునని కణ్వుఁ డుద్దేశించెనో, నే నెఱుంగను గాని దేశమునఁగల క్రైస్తవు లందఱు నేకీభవించునట్లు చేయవలెనని సంకల్పించెను. తన సామాజికులలోఁ బెక్కండ్రె సమావేశపఱచి దైవానుకరణవ్రతము నవలంబించు రీతిని బ్రోత్సాహపరపుఁడని ప్రతి మతాధిపతిని కణ్వుఁడు కోరును. దేశప్రజల నందఱిని వ్రతావలంబులఁ గండని ప్రార్థించును. ఈవ్రతప్రాబల్యముచే మధుపానబీజ మడుగంటు నశించునని కణ్వుఁడు నిశ్చయముగ నమ్మియుండెను. ఈవిషయమున వానికిఁ గలవిశ్వాస మపారము. రాఁబోవు నెన్నికలలో విధాయకముగ మద్యశాలల నడుగంటించి తీరవలె నని చెప్పుచున్నాఁడు. అట్లగుచో నాచార్యునిచే నాటఁబడి సచ్ఛాత్రులచే నభివృద్ధిపరుపఁబడుచున్న యీ వృక్షము [3] శాఖోపశాఖలతో దేశమునెల్ల నావరించుకొనుటకు సందియము లేదు. ఈసారి కూడ మద్యశాలోద్యమ సంఘమే జయమందినఁ గ్రైస్తవుల శ్రమ వ్యర్థమైనదే యగును. మద్యపానభంగ విషయమున నభిప్రాయ భేదములు కలిగినను క్రైస్తవ సహకారమును దేశమునం దెల్లెడల వ్యాపకము చేయఁదగిన సమయ మాసన్నమైనదని [4] కణ్వమతము. ధర్మపుర్యాలయ సంఘమునందును, దత్ప్రాంతంబున నిట్టి [5] పరిణామములు పొడసూపినప్పుడు, వాదాభిప్రాయ రూపముననే గాక కేవల సంచరణమున నీ యభిప్రాయముల నాచరించునపుడు దేశమునం దెల్లెడలఁ బ్రజాసామాన్యమునందు మన మెన్నఁడుఁ దలంపశక్యముగాని యభివృద్ధి కలుగఁగలదు.

---

1 తోడు 2 కనులు చెవులు 3 కొమ్మలు పలవలు 4 కణ్వునియభిప్రాయము 5 మార్పులు.

ఇది 1 యద్భుతావహమగు నూహయే యగునుగాని నాకీవిషయమున నొక సంశయము వొడముచున్నది. ఇచ్చట ధర్మపురి నీవ్రతావలంబకు లనుసరించు చున్నంత తీవ్రముగఁ బ్రభుపాదవిన్యాసముల ననువర్తించుట క్రైస్తవుల కెల్లరకును సముచితమే యగును. కాని నేను ఢిల్లీపురమున కేగి నాయాధిపత్యము క్రిందనున్న యాలయ సంఘమున కీ క్రైస్తవాదర్శము నుపదేశించిన వా రట్లాదరింతురో యని శంకించుచుంటిని. నేను గూడఁ బరిశుద్ధాత్ముని సహాయమును బొందితి నను నమ్మకము కలిగిన వెనుక నే యీ లేఖను వ్రాయ నుపక్రమించితిని. నాపరిపాలనమున నున్నవారిలో స్వార్థత్యాగమునఁ జేసి దైవానుకరణవ్రతము నంతఃకరణశుద్ధిగ నాచరించువారి నొక పదిమందినైన సమకూర్పఁగలనా యను సంశయము పొడముచున్నది. మిత్రమా! నీసంఘమున నీవేమయిన విశేషముగ నీయాదర్శమును బ్రవర్తింపఁ జేయఁగలవా? మనవేమి సమాధానము చెప్పవలెను. ? ప్రభువువలె మీరును శ్రమల నందుటకు రండని పిలిచిన మాసాంఘికు లామోదించుట లేదనియా? ఇచ్చట ధర్మపురినిఁ గాన్పించు పర్యవసానములఁ దిలకించిన నేమతాధిపతియైనఁ గంపమునొందక తీరదు. అట్లే మన శిష్యవర్గముఁగూడ నాచరించునట్లు చేయఁ బ్రయత్నింపక తీరదు. పరిశుద్ధాత్ముని సహవాసమిచ్చటి వారికి లభించినంత విశేషముగ నెచ్చటను గాంచను. నేనీ వ్రతము నాచరించుటకు సిద్ధముగ నుంటినా యని కూడ సంశయించు చుంటిని. ఈ ప్రశ్నకు నేనంతఃకరణ శుద్ధిగఁ బ్రత్యుత్తరము నీయ జంకుచుంటిని. రక్షకుని పాదవిన్యాసములఁ బూర్తిగ ననుసరించునెడల నాజీవితమునఁ బెక్కుమార్పులఁ జేయవలసి యుండును. చిరకాలమునుండి క్రైస్తవుఁడ ననిపించుకొను చుంటిని. గతశతాబ్దమున నే నాయన నామమునకై పడిన శ్రమ యేమియుఁ గాన్పింపదు. నీచజాత్యుద్ధరణము, మధుపాన భంజనము, పురపారిశుధ్య సంఘ పునరుద్ధారణము, మున్నగు లోకోపకార కార్యముల నెన్నఁడును జోక్యము కలిగించుకొని యెఱుంగను. నేనీ ప్రతిజ్ఞ నామోదించిన నేమి చేయవలయును? దీనికి బదులు చెప్పఁ జాలకుంటిని. నాశిష్యవర్గ మందఱును ధనికులు మంచి స్వాస్థ్యములు కలవారు స్వాతిశయమునఁ బరితృప్తి నందినవారు స్వార్థత్యాగమునకును శ్రమానుభవమునకును సంసిద్ధమగు వారుకారు. ఆసంగతి నాకుఁ దెలియును. నేనేపొరఁబడుచుంటినేమో? వారి యంతరాత్మల నాటునట్టులు నేనుపదేశింపకపోయి యుండవచ్చును. చెలికాఁడా! గంగాధరా! నా మనోభావమును నీకు వెల్లడించితిని. నాయాధ్యాత్మిక పరిపాలనమున నున్న దేశమున కేగి రాఁబోవు 2 భాను వాసరమున దేవాలయోపన్యాస పీఠముపై నిలువంబడి మనమందఱము గ్రీస్తును బూర్తిగ ననువర్తింతము. మన మానసి కార్థిక శారీరక విషయములకు శ్రమగలిగిన నోర్చుకొందము. కార్యారంభమునఁ గ్రీస్తెట్లు సంచరించు నని విమర్శించి మన యంతఃప్రబోధము నాచరింతము. అని నాశిష్యవర్గమున కెల్ల బాహాటముగ నుపదేశింతునా? నేనీ సువార్తతో వారిందరిసిన నాశ్చర్యపడెదరు. ఐననేమి మనము ప్రభువు 3 ననుక్షణము ననువర్తింపవలదా? క్రీస్తును వెంబడించిన వాఁడనిన నర్థమేమి? వాని యడుగుజాడల నాశ్రయించుట యన నేమి?

వెంకటు సోమయాజి పై విధమున నంతదనుక వ్రాసి లేఖకలమును గాకితముపైఁ

1 ఆశ్చర్యమును గలిగించు 2 ఆదివారము 3 ఎప్పుడును.

బడవైచెను. ప్రాఁతత్రోవను విడిచి నవీనమార్గము నవలంబించ వలసినక్షణ మాసన్నమయ్యెను. ఋషుల కందఱికి నిట్టి మనఃక్లేశమే సంభవించును. కిటికీదగ్గఱకేగి 1 గవాక్ష కవాటము మూతను గావించెను. మనోవేదనచే స్థంభితుఁ డయ్యెను. గదిలోనిగాలి యాతనికిఁ జాలనట్లు తోఁచెను. నక్షత్రములఁ దిలకించి లోకవాయువు నాస్వాదింపఁ గోరెను.

రాత్రి కడు నిశ్శబ్దముగ నుండెను. దేవాలయమునందలి ఘటికాయంత్ర మర్ధరాత్రమును సూచించెను. గంటకొట్టుట మానినతోడనే మాలపల్లెవైపునుండి మలయమారుతముచేఁ గొనిరాఁబడిన మధురగానయుక్తమగు నీసునాద మాతని 2 శ్రవణపుటంబుల కానందమును గొలిపెను.—

గీ. శ్రమల నొంటిగఁ బడ జగద్రక్షకుండు । ప్రజలు పాల్గొనకుండు టబ్రంబుగాదె ?
శ్రమలు గల వెల్లవారి కా 3 సరణి ధరణిఁ । గాన నాతను దగు శ్రమల్ గలవు నిజము.

సోమనాథశర్మ మూలమునఁ బ్రభువు ననుసరింపఁ గలిగిన యొక పురుషుఁడు దీనిఁ బాడుచుండెను. ఆప్రాంతమున నున్న యొక కర్మాగారమునం దీతఁడు కావలి యుండువాఁడు. ఒంటిగ రాత్రి యంతయుఁ గడపుటలో నప్పుడప్పు డిట్టి భక్తియుక్తము లగు పద్యములఁ జదువుకొనుచుండును.

వేంకటసోమయాజి 4 వాతాయనమునుండి వెనుకకు మరలి 5 ఈషత్సంశయాకుల మానసుండయి మోకాళ్ళ భూమిపై నూని సాగిలఁబడి దైవమును బ్రార్థింపఁ దొడంగెను. 6 దన్మయత్వమునఁ "క్రీస్తేమి చేయు" నని పలుమారు స్మరించెను. ఇటువలె మున్నెన్నఁడును బరిశుద్ధాత్మని సహవాసము నాశింపలేదు. విశేషకాలమట్లు నమ్రుఁడై యుండెను. పడంపడి లేచి విశ్రమించెనుగాని గాఢనిద్రను జెందలేదు. ఉషఃకాలమున 7 నుద్ధితుఁడై మరలఁ గిటికీనిఁ దెఱచెను తూర్పురేఖలు తెలతెల్లవారిన కొలఁదిఁ దదేకధ్యానమునఁ జూచుచుఁ "క్రీస్తేమి సేయును ? నేనాతనిని యనుసరింతునా ?" యని యనుకొనుచుండెను.

8 అరుణోదయమై లేయెండలు గ్రామమెల్లనిండెను. దైవానుకరణ విధానమున విజ్ఞానారుణోదయ మెన్నఁటికిఁ బ్రజలయందగును ? ప్రభుప్రదర్శిత మార్గముల నెల్ల లోకమెన్నటి కనువర్తించును ?

గీ. ప్రభువు తానేగినట్టి మార్గంబు నెఱిఁగి । సకలమానవు లెన్నఁడా ప్రకటరీతి
ననుసరింతురు ? భూలోకమున నె స్వర్గ । మెన్నఁ 9 డనుభావ్యమగును మహోన్నతముగ ?

ఈ విషయమే త 10 న్నాపాదమస్తక మావరించియుండ వేంకటసోమయాజి తన స్వస్థానమగు ఢిల్లీనగరంబున కేగి తన నూతనాదర్శమును బ్రకాశింపఁజేయ నారంభించెను.

అష్టమాధ్యాయము సంపూర్ణము.

---

1 కిటికీ తలుపు 2 చెవులకు 3 విధము 4 కిటికీ 5 ఇంచుకసందేహము 6 అతనియందే బుద్ధి నిలుచుటచే 7 లేచి 8 సూర్యోదయము 9 అనుభవింపఁదగినది 10 కాళ్ళయొద్దనుండి తలవఱకు.

శ్రీ

# దైవానుకరణము.

## నవమాధ్యాయము.

ఢిల్లీపట్టణమునఁ గల పురమందిరమున శనివారము నాఁడు నాటక మప్పుడే ముగిసినది. శ్రోత లొకరికంటె నొకరు ముందుగఁ దమ బండ్ల నెక్కి వెడలి పోవలయునని తత్తర పడుచుండిరి. కావలివాఁడు ప్రతిబండిని పేరు వెట్టి పిలుచుచుండెను. బండ్లు ద్వారముకడ కేగినతోడనే తలుపులఁ దెరచుటలోను, మూయుటలోను, టపటప మని ధ్వని సేయుచుండెను. అంతదనుక నాఁడు బైట వేచియుండుటచేఁ [1] పాంథులు చలిచే గజగజ వణఁకుచుఁ దత్తరపడుచున్న గుఱ్ఱముల పగ్గముల సడల్చి రథికు [2] లారోహించిన తోడనే శరవేగంబునఁ బ్రవాహమువలె వెడలుచున్న బండ్ల నడుమను దోలుచుండిరి.

" 624 నెంబరు బండి " యని ద్వారపాలకుఁడు కేకవైచెను. అంతట నల్లని [3] యుత్తమాశ్వద్వయమును బూన్చిన సుందరమైన శకటము ద్వారముదగ్గఱ వచ్చి నిలిచెను. ఆబండి తలుపుపైని (వి. రా.) అను నక్షరములు చెక్కఁబడి యుండెను. సంఘమునుండి యిరువురు పిల్లలు బండి దరికిఁ బరువిడి వచ్చిరి. ఇరువురిలోఁ బెద్దపిల్ల బండి నెక్కి కూర్చుండెను అశ్వపాలకుఁ డింకను దలుపుఁ దెరచి పట్టుకొనియుండెను. చిన్నపిల్ల యిటునటుఁ జూచుచు నింకను ద్వారప్రాంతమున నిలువంబడి యుండెను.

" చకోరాక్షీ! రమ్ము. ఇంక నేలనిలిచియుంటివి? నేను చలిచే ముణచుకొని పోవుచుంటిని. " అని బండినుండి యప్పు విశాలాక్షి గంభీరస్వరముతోఁ బిలిచెను,

అంత చకోరాక్షి తన కంఠమునుండి యొక చంపక కుసుమ మాలికను దీసి తొందరగా మార్గపార్శ్వమున నిలువంబడియున్న యొక చిన్నపిల్లవాని చేతి కిచ్చెను. ఆబాలుఁ [4] డశ్వఖురసామీప్యమున వణఁకుచు నిలిచి యుండెను. వాఁ డత్యాశ్చర్యముతో నాబాలికం గలకొంచి ' వందనము ' లని చెప్పి [5] నలిగిన దదాని గొంచమైన పరిమళము నాఘ్రాణింపఁ జొచ్చెను. బాలికయు బండి నెక్కెను. తలుపు మూయు నప్పు డిట్టి యమూల్యశకటముల కనువగు గంభీర [6] నినాదంబు వెలువడెను. [7] ఉత్తరక్షణమున [8] సారథి [9] రశ్ముల సడల్ప రివ్వున బండి పరువిడెను.

" చకోరాక్షీ! నీ విప్పుడు నెద్దియో యొక చిత్రమైన పనిని జేయుచుందువు. " అని పెద్దపిల్ల పలుకుచుండఁ [10] గాచదీపికలచే విరాజమానములగు దివ్యభవనముల ననేకముల దాటి పోవుచుండిరి.

అంత చకోరాక్షి తన వదనారవిందమును విశాలాక్షివైపునకుఁ ద్రిప్పి 'అటులా? అక్కా' నేనిప్పుడేమి చిత్రమైన పనిని గావించితిని? అనెను.

---

1. మార్గస్థులు 2 ఎక్కినవ 3 మంచి గుఱ్ఱపుజోడు 4 గుఱ్ఱపుడెక్కల 5 వంచబడిన 6 ధ్వని 7 వెంటనే 8 బండితోలువాఁడు 9 గుఱ్ఱములను 10 గాజు.

విశా—నీవా చెంపక కుసుమ మాలిక నా బాలున కీయలేదా ? అతనికి [1] గుసుమదామముల కంటె నుష్ణాహార సౌఖ్యముగ నావశ్యమై యుండు నని నే నూహించెదను. నీవాతని మనయింటి కాహ్వానము సేయు నందులకు నా కాశ్చర్యముగనున్నది. నీ వాతనిం బిలిచిన నే నాశ్చర్యపడియుండను. చకోరాక్షీ ! నీవెప్పుడు నిట్టి పిచ్చి పనులనే చేయుచుందువు.

చకో—అట్టి పిల్లవానిని మన యింటికిఁ బిలిచి సుఖభోజనము నొసంగిన నది పిచ్చిపనియా ?—అని నమ్రతతోఁ బలికెను.

విశా—నిర్లక్ష్యముగా నిట్లనెను—పిచ్చి యనుమాట దీని కనురూపమైనది కాదు. పెద్దమ్మ వాడుచుండు 'ఛాందసము' అను పదము సరిపోవునేమో ? కావున నే నంటినిగదా యని వానిని గాని దత్తుల్యుని నొకని గాని యెన్నఁడు మనయింటి కాహ్వానము మాత్రము చేయకుము. అమ్మాయీ ! నాకుఁ జాల విసుగుగానున్నది.

ఇట్లు చెప్పుచు విశాలాక్షి యావులించెను. చకోరాక్షి [2] రథవాతాయనము నుండి బయలు జూచుచుండెను.

కొంచెము విసువుదలతో విశాలాక్షి యిట్లనెను.—

మార్దంగికుఁడు బుద్ధిహీనుఁడు. జంత్రవాద్యగాఁడు, కేవలపశువు. నాటకము పూర్తియగుదనుక నీవెట్లు కూర్చుంటివో నేనూహింపఁ జాలకుంటిని.

"నాకు సంగీతమునం దత్యాదరము." అని చకోరాక్షి నెమ్మదిగ ననెను.

విశా—నీకన్నిటియందు నాదరమే. ఇంతటి విమర్శజ్ఞాన శూన్యమగు పిల్లను నే నెచ్చటను జూడలేదు.

[3] ఈమాటతోఁ గ్రోధారుణిత వదనారవింద యయ్యుఁ జకోరాక్షి మిన్నకుండెను. విశాలాక్షి తిరిగి యావులించి సామాన్యమగు కీర్తనలోని యొక చరణమును బాడి యంత నకస్మాత్తుగ నిట్లనెను—

"అంతయు నాకు సహ్యముగ నున్నది. ఈరాత్రి 'సారంగధర' రమ్యముగ నుండు నని తలంచెదను."

"సారంగపాణియా ?" యని చకోరాక్షి యనెను.

విశా—సారంగపాణి యనెదవేమి ? సారంగధర నాటకము. అందు చిత్రవిచిత్రములైన ప్రదర్శనములు కలవు. ఇచ్చట మాసద్వయ పర్యంత మిదియే యుడావిడి. నేటిరాత్రి గోడేవారితోపాటు మనకు నొక యఱ కలదు నీ వెఱుంగవా ?

చకోరాక్షి తన యక్క కభిముఖి యయ్యెను. ఆమె నేత్రముల మనోగతాభిప్రాయములు ప్రస్ఫుటము లగుచుండెను. అంతస్తాప సూచకారుణిమయుఁ దద్వీక్షణ ప్రసారంబుల మిళితమై యుండెను.

చకో—అట్టులయ్యు మన జీవితమను నాటకరంగమున విషాదము నందకుంటిమి. నాటకమునఁ బ్రదర్శింపఁబడు సారంగధరుని చరిత్ర మెంతటిది ? మన పట్టణములలోని మానవుల జీవితనాటకములఁ బరికించిన నెంతయు విడ్డూరముగ నుండును. లోకసంబంధములగు విషయములఁ బరికించినప్పుడు విషాదామోదము లేల మనకుఁ గలుగవు ?

విశా—ప్రజలు ముక్కివారై చూచుట కసహ్యముగ నుందురు కావున వారిని

1 పూలమాలలు 2 రథపుకిటికి 3 కొంచెము కోపమున నెఱ్ఱబారిన ముఖపద్మము.

గూర్చి విచారించుటకు విశేషక్లేశము నందవలయును. చకోరాక్షీ! ప్రపంచము నంతను నీవు చక్కఁబరుప నేరవు. ఏమిప్రయోజనము? లోకములోని దారిద్ర్యదశకును, దురవస్థకును మనము నిందాపాత్రులము కాము లోకమునం దేకాలమునను ధనికులును, దరిద్రులును గలరు. ఇంకముం దెప్పుడు నట్లే యుండఁగలరు. మనము ధనాఢ్యుల మయినందులకు సంతసింపవలయును.

చకో—క్రీస్తుప్రభు వీవిధానము నే యవలంబించె ననుకొనుము. ‘తనదారిద్ర్యము వలన మీరు ధనికులగుటకుఁ బ్రభువు ధనవంతుఁడయ్యు మనకొఱ కాతఁడు బీదవాఁ డయ్యెను.’ అను విషయముచేఁ బ్రభువైన యేసుక్రీస్తుని యాథార్థ్యము మీ రెఱిఁగియేయుంటిరి. అను సువార్తవాక్యము నాధారపరచుకొని వెంకటసోమయాజి కావించిన యుపన్యాసమును నీవు వినియుంటివిగదా!

విశా—విసుగుదలతో నిట్లనెను—నాకు బాగుగ జ్ఞాపక మున్నది. ధనవంతులు దయార్ద్రహృదయులై బీదల నాదరించుచుండిన యెడల నిందాపాత్రులు గారని కూడ సోమయాజి చెప్పలేదా? ఆతఁడును జక్కని వసతిని సమార్జించి సుఖపడుచుండెను. వీరిలోని కొందఱు పేదలాహారము లభింపక శ్రమఁజెందు చుండిరని యాతఁడు తన యైశ్వర్యము ననుభవింపక మానునా? అట్లు చేయుటచే నాతని కేమి లాభము! నేను చెప్పుచుంటిని వినుము. చకోరాక్షీ! మన మెంత ప్రయత్నించినను దేశమునం దెప్పుడును ధనికులును బీదవారును గూడ నుందురు. సుగుణవతి ధర్మపురీ విశేషముల వ్రాసినది మొదలు నీవు కుటుంబము నంతను వారుమారు సేయుచుంటివి. ప్రజ లెల్ల రెప్పుడాస్థితిలో జీవింపఁగలరా! కొలది కాలముననే సుగుణవతి యీపట్టును విడుచుటను నీవే చూడఁగలవు. ఆమె యిచ్చటికి వచ్చి పురమందిరమున గానసభలఁ గావింప కుండుట కడు శోచనీయము. నేఁడే యెవరో యాహ్వానము చేసిరని వింటిని. ఆమెను రమ్మని నేను ప్రోత్సాహపరుపఁ దలంచితిని. ఆమె గానమును వినవలెనని నేను చెవులు కోసికొనుచుంటిని.

చకోరాక్షి కిటికీనుండి బయలు సూచుచు మిన్నకుండెను. బండి గమనవేగంబునఁ బడి విశాలపథంబుల దాటి యొక వంతెనక్రిందుగ నేగి యింటి గుమ్మము కడ నిలిచెను. సోదరీమణు లిరువురును శకటావరోహణంబును గావించి గృహాంతంబున కేగిరి. వారి యిల్లు పెద్దరాతిపలకలతోఁ గట్టఁబడిన విశాల దివ్యభవనము. రాజమందిరముల వలె నలంకరింపఁ బడినది. ఏమూలఁ జూచినఁ బ్రతిమలు, ఛాయాపటములు, నిలువుటద్దములు, మేజుబల్లలు, కుర్చీలు, చీనిచీనాంబరములతో నిండిన హంసతూలికా తల్పంబులు మున్నగు వానితో నిండియున్నది. [1] ఏతద్గృహమేధి యగు విజయరామరాజు ముంగిట ధూమపానముఁ గావించుచు నిలువంబడి యుండెను. ధాన్యపు వర్తకము వలన నీ ద్రవ్యమంతయు నాతఁ డార్జించెను. ఆతనికి రెండు కోట్లు ధనము కలదని లోకమున వాడుక. ఈతని భార్య సుగుణవతి కక్కగారు. ఆమె విశేషాబ్దంబు [2] లామయగ్రస్తయై మంచముఁ బట్టి యుండెను. చకోరాక్షి విశాలాక్షు లిద్దరు మాత్రమే యీదంపతులకుఁ గల సంతానము. అందు విశాలాక్షి

1 ఈ యింటి యజమాని. 2. రోగమునఁ బడి.

యిరువది వత్సరంబుల ప్రాయంబునఁ దనరుచున్నది. ఆమె 1 మృద్వంగియు సౌకుమార్యము గలదియు నై యుండెను. లోకజ్ఞానము కలది. ఆగర్భశ్రీమంతు లందఱివలె విద్యనభ్యసించినది. పలువురి సహవాసము నిప్పుడే యాశించుచుండెను. పరుల నించుక యవమానించుటయును, నిర్లక్ష్యముగఁ జూచుటయును బ్రారంభించినది. ఈ యమ్మను సంతోషపెట్టుట కష్టసాధ్య మని యొకప్పుడు నవ్వులాటగను, ఇంకొకప్పుడు తీవ్రముగను దండ్రియే యనుచుండును. చకోరాక్షి సుగుణవతివలె నించుక పల్లెటూరు రూపురేఖలు కలది. 2 ఏకోనవింశతి సంవత్సరప్రాయమున విరాజిల్లుచున్నది. భూతదయచే నవనీతతుల్యహృదయ క్రైస్తవాదర్శంబుల మనంబును హత్తించిన దగుటచే నామె జనకుఁడే నిర్వేద మెందుచుండెను. జనని యాగ్రహోపేతయై కన్పట్టెను. లోకవ్యాప్తులు కాఁగల యూహాపోహలఁ దనలోఁ బ్రకాశమున మసలుచుండఁ జకోరాక్షి ప్రవర్ధమాన యగుచుండెను. తన యంతఃప్రబోధము ననుసరింప నవకాశము చిక్కనం జాలు నెట్టి యిక్కట్టుల నైన భరించి సమయోచితముగ గడుపుకొనఁగల శక్తి కలది.

విజయరామరాజు తన జేబునుండి యొక లేఖం దీసి—చకోరాక్షీ! నీకొక జాబు వచ్చినది—అనెను.

"ఇది సుగుణవతి యొద్దనుండి వచ్చినది." అని చెప్పుచు దాని నందుకొని యొకచోఁ గూర్చుండి విప్పి వెంటనే చదువ నారంభించెను.

తన తనూజాత 3 యంతరంగమును బరీక్షించు వానివలె 4 నర్ధనిమీలితలోచనుఁడై పొగచుట్టను నోటినుండి తీసి చేతఁ బట్టి ధర్మపురిలోని క్రొత్తవిశేషము లేమి? యని యడిగెను.

చకో—వెంకటసోమయాజి గతపక్షమెల్ల ధర్మపురియం దుండి తత్త్వపారమార్థిక విషయములఁ బరిశీలించెనఁట. కణ్వప్రవర్ధమానాదర్శముల నత్యాదరమున నంగీకరించెనఁట."

విజ—"సుగుణవతి తన విషయ మేమని వ్రాసినది?" అని మెత్తని పరుపులతో నమర్పఁబడిన పడకకుర్చీపై సుఖాసీనుఁడై నిద్రావస్థం జెందువానివలె నుండి ప్రశ్నచేసెను.

చకో—ఆమె యింకను జండాలవాటియందు గానామృతమును వర్షించుచున్నది. సోమనాథశర్మ గుడారమున నుపన్యసించుట ముగించి నప్పటినుండియుఁ దన చెలిమికత్తెయగు సుమతి కట్టించుచున్న గానశాల సిద్ధమగు దనుక నొక పురాణాగారమునఁ బాడుచున్నది.

విజ—మనలఁ జూచుట కిప్పటికి రమ్మని వ్రాసెదను. గానరసాస్వాదనా 5 నైపుణి లేని యీ 6 కుగ్రామ వాసులకడఁ దన సహజపాండితిని వ్యర్థపరుపఁజనదు.

విజయరామరాజు, జుంజురుకట్టఁ జోలు మఱియొక చుట్ట నంటించెను.

విజ—సుగుణవతి వట్టి వెఱ్ఱిదని నాయభిప్రాయము. పురమందిరమున నొక్కసారి గానముచేసిన ఢిల్లీవాసుల నందఱఁ దైతక్కలాడింపఁగలదు. తాము వినన

---

1 కోమలాంగి 2 పందొమ్మిదవ 3 మనస్సును 4 సగముమూసిన 5 నేర్పరితనము 6 పల్లెటూరు

దేమియో యెఱుంగని మూర్ఖుల కొఱకుఁ దన శ్రావ్యగాత్రమును బూడిదలోఁ బోసిన పన్నీటివలె వృథగావించుకొనుచున్నది.

చక్రో — తానిప్పటి కేతెంచి తన 1 శ్రవణపరిముగ్ధంబగు సంగీతశాస్త్ర జన్యజ్ఞానమును లోకవిడంబనార్థ ముపయోగించియుఁ దద్వ్యతిరిక్త ప్రతిజ్ఞను నెరవేర్పఁ గలిగిననే తప్ప నామె యిట్లు రాదు.

విజయ — "ఏమి ప్రతిజ్ఞ" అని యంతయు స్మృతినభినయించి ఓహో! తెలిసినది. అగును. అది మిక్కిలి చిత్రమైన విషయము. సుమంతుఁడు నాకొకప్పుడు ముఖ్యస్నేహితుఁడు. తంతివార్తలనంపు విద్యను మే ముభయుల మొక్క 2 దేశికునికడనే యభ్యసించితిమి. అతఁడు తన యుద్యోగమునకు వీడుకోలు ఇచ్చి కంపెనీవారికి వ్యతిరిక్తముగ సాక్ష్యము నిచ్చినప్పు డెల్లరు నాశ్చర్యముగఁ జెప్పుకొనిరి. తంతివార్తా 3 ప్రేషణోద్యోగముననే తిరిగి చేరెను. గతాబ్దమున ధర్మపురియం దిట్టిచిత్రచర్య లెన్నియో జరిగినవి. మొత్తముమీఁద సోమయాజు లెట్లు భావించెనో వినఁ గుతూహల మగుచున్నది. వానితో నీ విషయమున ముచ్చటింపవలెను.

చక్రో — రే పాతఁ డుపన్యసించును. ఈవిషయమును గూడ బహుశః వక్కాణించిన నిమిషకాల మందఱు నిశ్శబ్దముగ నుండిరి. అగోచర వ్యక్తితో ముచ్చటించుచున్నదానివలె నకస్మాత్తుగఁ జక్రోరాక్షి యిట్లనెను:— "మనయాలయ సంఘము నా ప్రజ్ఞాపాలనము గావింపుమని సోమయాజి నివేదించిన నేమగునో!"

విజయ — తీవ్రముగా నిట్లనెను:— ఎవరు? ఏమనుచుంటివి!

చక్రో — వెంకటసోమయాజిని గూర్చి ముచ్చటించుకొనుచుంటిమి. కణ్వుఁడు ధర్మపుర్యాలయ సంఘమునఁ దన శిష్యులకుఁ బ్రబోధించినట్లు ఈతఁడును 4 దేవతాయతన సమాజమునకు దైవానుకరణ మహామంత్రోపదేశమును గావించి పునశ్చరణఁ గావింపుఁడని సామాజికుల బ్రార్థించిన నేమగునో యనుచుంటిని.

విశా — తేయాకునీటిని ద్రావు కాలమును సూచించు చిహ్నమగు గంట మ్రోగుటచే శయనోత్థితయై "మనకా భయములేదు." అనెను.

విజయ — అది కేవల 5 మనాచరణీయాదర్శ మని నే తలంచెదను.

చక్రో — ధర్మపురీ సమాజమువారీ యాదర్శమును దేశమున నెల్లసమాజముల వ్యాప్తమొనరింపఁ బ్రయత్నించుచుండిరని పిన్నమ్మ జాబువలనఁ దెలియుచున్నది. వారట్లు చేయఁ గలిగినచోఁ బ్రజల జీవితముల యందును సమాజముల యందును, గొప్ప మార్పులు కలుగఁగలవు.

విశా — భోజనశాలలోనికేగుచు "మనము ముందు తేయాకునీటిని ద్రావుదము." అనెను. విజయరామరాజును జక్రోరాక్షియు నామె వెనువెంటఁ జనిరి. నిశ్శబ్దముగ నల్పాహారముల నారగించిరి. వివశాంగియగు విజయరాముని యర్థాంగలక్ష్మి యల్పాహారముల నామె శయనాగారముననే యమర్చిరి. విజయరామరా 6 జన్యాక్రాంత చిత్తుఁడై యుండెను. అతఁ డత్యల్పముగ భుజించెను. శీఘ్రముగ 7 నాసనోత్థితుఁడై బయలువెడలుచు నాడు శనివారసాయంసమయ మైనను గార్యాంతరములచే

1 చెవికి మిక్కిలి యింపయిన 2 గురువు 3 పంపు 4 దేవాలయ 5 చేయరాని 6 ఇతరబుద్ధి 7 పీటనుండిలేచి

నూరిలోనికిఁ బోయి కొంచెమాలస్యముగఁ దిరిగి వత్తు నని చెప్పి పోయెను.

చకో—తండ్రి వెడలిపోయిన వెనుక నిట్లనెను.—ఈమధ్య తండ్రిగారు, ఆందోళనము నందుచుండిరి సుమా!

విశా—ఆవిషయము నాకుఁ దెలియదు. 1 సహజేతర చిహ్నము లేమియు నాకుఁ గాన్పించలేదు—అని కొంచె మూరకుండి తిరిగి—చకోరీ! నేటి రాత్రి నీవు నాటక ప్రదర్శనమున కరుదెంచెదవా? ఏడుగంటలన్నరకు గోడేవారి కంబుకంఠి మన కొఱ కిచ్చటికి వచ్చును. నీవుఁగూడ రావలసియుండును. నీవు తిరస్కరించిన నామె చిన్నబుచ్చుకొనును.

చకో—నాటక 2 దిదృక్షు నాకు లేకున్నను వచ్చెదను. నేనచ్చటి కేగకున్నను బెక్కుపాత్రములు నా కక్షిగోచరము లగుచుండును.

విశా—పందొమ్మిదేండ్ల ప్రాయముగల పిల్ల పలుకఁదగిన మాటకాదు. ఎట్లయిన నీయూహాలు చంచలములుగఁ దోఁచుచున్నవి. నీవమ్మను జూడఁబోవు వెడల "తానప్పటికి మెలఁకువగ నుండిన నాటకమునుండి తిరిగి వచ్చినతోడనే పైకివచ్చి చూచెద" నని చెప్పుము.

చకోరాక్షి మాతృదేవతా సందర్శన కాంక్షచే మేడమీఁది కేగెను. కంబుకంఠి బండిచప్పుడగుదనుక నచ్చట నుండెను. ఆమె తల్లి తనభర్తయవస్థం దలంచి విచారించెను. ఆవిషయముననే విశేషముగ మాటలాడెను. చకోరాక్షి చెప్పిన ప్రతి వచనములకు వినుఁగుదలం జెందెను. పినతల్లి జాబులోని కొన్ని వచనములనైనఁ జదివి వినిపింపఁ బ్రయత్నింప నామె యిచ్ఛగింపలేదు. నాటిరాత్రి తనసేవలో గడపెదనని చకోరాక్షి చెప్పిన తన 3 యనంగీకారమును దీర్ఘముగఁ బ్రస్ఫుటపఱచెను.

అట్లగుటచేఁ జకోరాక్షి 4 పరివేదనా దోధూయమాన మానసంబుతో నాటకముం జూడఁ బోయెను. ఇతర సమయములకంటె నిప్పుడత్యంతసౌఖ్యముగ నుండెనని యెఱుంగును. అందుచేఁ దనలోఁ దా నెద్దియో మననము చేసికొనుచుఁ బరవశాంతరంగియై యుండెను. ప్రేక్షకు లందఱు సుఖాసీనులైనతోడనే తెరనెత్తిరి. ఆట ప్రారంభమయ్యెను. అందఱత్యాదరముతో శ్రోత్ర నేత్ర పర్వానందము ననుభవించుచుండిరి. చకోరాక్షి మాత్రము కొంచెము వెనుకఁ గూర్చుండి మాంద్యముగఁ దనలోఁ దా నాలోచించుకొనుచుండెను. చకోరాక్షి చపలస్వాంతయని యామె యప్పగారి వలన వినియున్నది. కావునఁ జకోరాక్షి పరధ్యానముగ నున్నదని యెఱింగియు ముందునకు రమ్మని పిలువక యూరకుండెను. ఈ యాత్మ జిజ్ఞాసచేఁ జకోరాక్షి తన కర్తవ్యనిర్ధారణమును గావించుకొనుట కవకాశము కలిగినది.

నేటి ప్రదర్శనము కడుంగడు రమ్యమైనది. మనోహరములగు సీనులు, ఆనందదాయకములగు శృంగారప్రసంగంబులు గర్భనిర్భేదములగు 5 భీకరార్భటులు మున్నగు వివిధ రససాంకర్యంబునఁ 6 ప్రేక్షకుల యంతరంగంబుల క్షణంబున కొక మాదిరిగ మార్చుచుండెను. తృతీయాంకమున నొకరంగము విశాలాక్షి హృదయమును గూడ నాకర్షించెను.

---

1 మామూలుకన్న మార్పు 2 చూచుకోర్కి 3 ఇష్టములేకపోవుటను 4 విచారము. 5 భయంకరములగు నట్టహాసములు 6 చూచువారి.

అర్ధరాత్రమున నొక బ్రహ్మాండమగు వంతెన కాన్పించెను. దానిక్రింద నొక గొప్ప నది శరవేగంబునఁ బ్రవహించుచుండెను. మిన్నుముట్టిన గోపురము పురప్రాసాదాగ్రంబునఁ బ్రస్ఫుటంబుగఁ గన్పట్టుచుండెను. అట్టి తరుణమున నొక బాలిక వంతెన మీఁదికెక్కి క్షణకాల మచ్చట నిలువంబడెను. ఆబాలిక యెవరికో అక్కో యాతురతఁ బరీక్షించుచున్నట్లు కాన్పించెను. పలువురు వంతెనం దాటుచుండిరి. అందొక యువతి సేతుమధ్యంబున నిలువంబడి అంచుగోడమీఁదనుండి నీటిలోనికి వంగి చూచుండెను. ఆమె మోము కవళికఁ బరికించిన దుర్భర దుర్దశ దుఃఖాక్రాంతయై యాత్మహత్యఁ గావించుకొన నెంచిన దానివలెఁ బొడకట్టెను. ఆమె నెమ్మదిగఁ బిట్టగోడపై నెక్కి నదీప్రవాహంబునఁ బడఁబోవు నవసరంబున పయినఁ జెప్పిన బాలిక యామెం జూచి యెద్దియో యడవిజంతు వరచినట్లు పెద్ద కేకవైచుచు మెఱుమువలెఁ బరువిడి యాతరుణిం జేరి చీరచెఱఁగును బలాత్కారముగఁ బట్టుకొని తనశక్తినంతను వినియోగించి వెనుకకు లాగెను. ఆతరుణమునఁ బటాక్షేపముగఁ బాత్రలు రెండు ప్రవేశించెను. వారింతకు మున్ను నాటకమున నటించిన వారే ఒక సుందరోన్నత పురుషుఁడు సాముచేసి గరిడీ కట్టినవాఁడు, [1] కాంచనాంబరధారియు నతని సేవకుఁడు వీరిరువురు దుర్భర క్లేశావస్థచే మరణోన్ముఖయైన యా యువతియుఁ దల్లికై పరితపించుచున్న యామె [2] తనూజాతయుఁ గడు బీదదశచేఁ జినిఁగి తుత్తునియలై దేహము నంతను బయల్పరచుచు దుర్వాసనా [3] దూషితము లగు మలిన జీర్ణ వస్త్రధారులై యుండిరి. ఈపురుషు లిర్వురు నాయాత్మహత్యను నివారించిరి. వారి సంభాషణమువలన నాయువతియు నాపురుషుఁడు [4] సోదరులని తెలిసినది. పిదప నారంగము హస్తినాపురప్రాంత నిమ్నజాత్యాకరముగ నొక చిన్న గుడిసెగ మారెను. మనదేశమున నత్యంత దారిద్ర్యము ననుభవించుచున్న దౌర్భాగ్యుల దురవస్థలఁ దేటతెల్లముగ వెల్లడిసేయునట్లు అతిచాకచక్యముగఁ దెరపై లిఖింపఁబడియున్నది. లేఖరి కడుంగడు నేర్పరియని యొప్పుకొనక తీరదు. చినిఁగి జల్లెడవలె దూట్లుపడియున్న వస్త్రములు తావుచాలమిని గ్రిక్కిరిసిన పర్ణకుటీరంబులు నీచాతినీచ ప్రవర్తనములు విరిగి ముక్కలైన కుర్చీలు, గలిగి దేవుని ప్రతిబింబములుగ నిర్మింపఁబడిన మానవులు పశ్వాదులకైన ననర్హములగు రీతుల నివసించు విధానమును బహుచమత్కారముగఁ జిత్రించి చిత్రకారుఁడు తన లేఖనానైపుణ్యమును వెల్లడించెను. దానిం జూచుచున్న విశాలాక్షివంటి ప్రేక్షకులు మొకమలు పరుపులచే నమర్పఁబడిన వాలుకుర్చీలపై సుఖాసీనులై చీనిచీనాంబరముల తెరల మాటుననుండి చూచియు [5] విషాద కంపితాంగులై తెరపైనున్న వారి సామీప్యముచే మైలపడుదుమని భయపడిరి. కాని చకోరాక్షి మాత్ర [6] మనిమేషయై మనోభావములు వెల్లివిరియ నీరంగము నత్యాదరముతో [7] నధరస్పందము గావింపకయే పరికించెను.

పిదప నొక జమీందారుని గృహరంగము ప్రదర్శింపఁబడెను. ధనికుల గృహమర్యాదలఁ దెలుపు నీరంగముఁ జూచినతోడనే ప్రేక్షకులలోఁ బెక్కండ్రు 'బ్రతికితిమి' అని నిట్టూర్చిరి. గతరంగమునకును దీనికిని గల తారతమ్యము విశేషముగ నుండెను.

---

1 బంగారుబట్టఁ గట్టినవాఁడు 2 కూఁతురు 3 నిందింపఁబడిన 4 ఒక కడుపున బుట్టినవారు 5 దుఃఖము 6 కన్నుమూయక 7 పెదవిగదుపక.

ఈలాంటి నొకదాని వెనుక నొకదానింజూపిన ప్రదర్శనానైపుణ్యమున నీయవస్థాభేదములు, ప్రస్ఫుటములయ్యెను. నాట్యరంగస్థలమునం బ్రసంగములుజరుగుచుండెను. సముచితపాత్ర ప్రవేశ[1] నిష్క్రమణములు సాగుచుండెను. కాని చకోరాక్షికివన్నియు నాటలేదు. వంతెనపై జరిగిన విషయమును పతితుల వసతులను మాత్రమే యామె నాకర్షించెను. లోక దుస్థితి కారణముల నామె యిందనుక నాలోచింపలేదు. అందుకుం దగిన వయస్సు లేదు. దీర్ఘాలోచన గావించు నభ్యాసమును లేదు. కాని మిక్కిలి విచారించెను. నిమ్నోన్నత స్థాన తారతమ్యము నామె గుర్తించుట కిది మొదలుకాదు. ఈవిషయ మామె మనఃఫలకము నాక్రమించి వేధించుటచేతనే విశాలాక్షి యనినట్లు 'చంచల' యైనది. కావుననే ధనవంతులగు స్నేహితు లందఱు "మిక్కిలి యస్వాభావిక" మనిరి.

విశా — ఏరమ్మ ! చకోరాక్షీ ! నీ వింటికి రావా యేమి ?

ఆట ముగిసినది. తెరను దింపివైచిరి. 2 రణగుణధ్వని సేయుచుం బ్రజలు వెడలిపోవుచుండిరి. కొందఱు నవ్వుకొనుచు ముచ్చటులాడుచుండిరి. లోక దుస్థితిని జక్కఁగాఁ బ్రదర్శించి రనుకొనుచుండిరి.

చకోరాక్షి యందఱితోపాటు లేచి వెడలిపోయెను. ఆమె మనస్సు నాక్రమించిన విషయము నాటకాంతమునైన గుర్తింప నీయలేదు. ఆమె మందబుద్ధి కలది కాదుగాని కొన్నివిషయముల నాలోచించునప్పుడు సంఘమునను నొంటిగ నున్నట్లే భావించును.

అక్కచెల్లెండ్రిలు సేరి చావడిలోని కేగఁగనే చెల్లీ ! "నాటక మెట్లున్నది?" అని యక్క యడిగెను.

నటకుల రచనావిధాన సారస్యమును చకోరాక్షి సూక్ష్మముగా గ్రహింపఁ గలదని జ్యేష్ఠభగినిఁ యెఱుంగును.

చకో — లోకజీవనమును జక్కఁగాఁ బ్రదర్శించి రనియే తలంచితిని.

విశా — నటనా కౌశలమును గూర్చి నే నడుగుచుంటిని.

చకో — వంతెనమీఁది చర్యను బహుస్వభావసిద్ధముగ నటించిరి. అందును స్త్రీపాత్రము కడు సమంజసముగ నున్నది. పురుషపాత్రము కొంచెము వ్యగ్రముగఁ దోఁచినది.

విశా — అటులా ? నాకది మిక్కిలి బాగుగనున్నది. సహోదరు లిరువురుం దమ బాంధవ్యమును దెలుపుకొని నప్పటి సంభాషణము చిత్రముగ లేదా ? నిమ్న జాతుల ప్రదర్శనము కడు భయంకరముగ నున్నది. 3 దృశ్యప్రబంధములలో నట్టి ఘోరములఁ జూపరాదు. ప్రేక్షకుల కతి కష్టముగ నుండును.

చకో — ఆ నిమ్నజాతుల జీవితము లింకను గష్టతరములుగ నుండునుగదా !

విశా — అగును కాని మన మట్టివారి జీవితములఁ గాంచు నిమిత్త ముండదు. మనముడబ్బునిచ్చి కాంచిన ప్రదర్శమునవే యట్లుగనున్నది.

విశాలాక్షి చావడిలోని కేగి బల్లమైనున్న పళ్లెరమునఁ గల పండ్లను గారెలను దీసికొని తినుచుండెను.

---

1 వెళ్ళుట. 2 యుద్ధమున వింటినారిచప్పుడువలె 3 నాటకములు

చకో—నీ వమ్మను జూడఁ బోయెదవా?

విశా—నేనీరాత్రి యమ్మకు శ్రమ గలిగించను. నీవచ్చటి కేగిన నే నలసి యుండుటచే రాలేదని చెప్పుము.

చకోరాక్షి తన తల్లిగదివైపునకుఁ బోయెను. ఆమె మెట్ల నెక్కి పెద్దగదిని సమీపించు నప్పటి కచ్చట దీపము వెలుఁగుచుండెను. తల్లియొద్ద నుండు కంచుకి యామెను లోనికి రమ్మని పిలిచెను. తల్లిగారి మంచమును సమీపించిన తోడనే "కంచుకిని వెళ్ళిపొమ్మని చెప్పుము" అని తల్లి పలికెను.

చకోరాక్షి కాశ్చర్యము కలిగెను. ఐనను దల్లి చెప్పినట్లు చేసి పిమ్మట నీదేహ స్థితి యెట్లున్నదని యామె నడిగెను.

తల్లి—అమ్మా! నీవు ప్రార్థన సేయఁగలవా?

ఈవిధమున నామె మున్నెన్నఁడు మాటలాడియుండమిని జకోరాక్షి కద్భుతముగ నుండెను.

చకో—అమ్మా! ఏమట్లనుచుంటివి? అట్లే ప్రార్థించెదను; ఇట్లడుగ కారణమేమి?

తల్లి—తల్లీ! నాకు భయమగుచున్నది. మీ తండ్రిగారు—నేటిదిన మంతయు నాయన విషయమై నాకేమో బెంగగా నున్నది. నీచేఁ బ్రార్థన జేయించవలెనని యున్నది.

చకో—ప్రార్థించెదను వినుముతల్లీ!

తల్లి—సరే! ప్రార్థింపు మమ్మా!

చకోరాక్షి తన తల్లిమంచముదగ్గఱ భూమిపై మోకారించి వంగి స్వహస్తమున మాతృకరగ్రహణ మొనర్చెను. తల్లికరము 1 కరము 2 ప్రకంపిత మగుచుండెను. చకోరాక్షిపై యామె యింత కరుణ నెప్పుఁడు జూపి యెఱుఁగదు. ఇందువలననే తల్లి కామెపై విశ్వాసము పొడముచున్నదని గ్రహింపనగును.

ఆమె యట్లే యుండి ప్రార్థింప దొడంగెను. ఇంతకు మున్నెన్నఁడును బిగ్గరగఁ బ్రార్థించి యెఱుఁగదు. ఆమె ప్రార్థించినప్పుడు మాత్ర మనోగతాభిప్రాయముల ననుసరించి యుండెను. కావుననే ప్రార్థన ముగిసిన వెనుక రోగికి నరములపట్లు సడలి నిశ్శబ్దముగ నేడువసాగెను.

చకోరాక్షి కొంతదనుక తల్లియొద్దనే యుండెను. తల్లికిఁ దనతో పనిలేదని తెలిసికొనిన వెనుక వెళ్ళుటకై లేచెను.

చకో—అమ్మా! నీకు వందనము. రాత్రి నీకు బాధగానుండిన నన్ను బిలువనంపుము. కంచుకి యిచ్చటనే సిద్ధముగ నుండును.

తల్లి—ఇప్పుడు నాకు స్వస్థతగానున్నది.

చకో—వెళ్ళఁబోవును.

తల్లి—అమ్మా! నన్ను ముద్దుపెట్టుకొనవా?

చకోరాక్షి వెనుకకు మరలి తల్లిని సమీపించి యామెమోముపై వంగెను. ఆమె

1 మిక్కిలి 2 కదలుచుండెను.

కీ ప్రార్థన యెంత యద్భుతావహముగ నుండెనో 1 చుంబనము నట్లే యుండెను. చకోరాక్షి గదివిడిచి పోవ నామె కపోలము లశ్రుపూరితములై యుండెను. ఆమె బాల్యదశనుండియు నెన్నఁ డేడ్చి యెఱుంగదు.

ఆదివారము ప్రాతఃకాలమున విజయరామరాజు మందిరము నిశ్శబ్దముగ నుండెను. పిల్లలు సహజరీతిని పదునొకండు గంటలకు దేవాలయమున కేగిరి. తండ్రి యాలయ సభ్యుఁడు కాఁడుగాని ధనసహాయమును జేయుచుండెను. ప్రాయికముగాఁ బ్రాతరారాధనకే పోవుచుండును. నేఁ డదియు భోజనమునకుఁ గ్రిందికి దిగలేదు. అనారోగ్యముగ నుండుటచే నిలువెడలఁ జాల నని వార్త నంపెను. కావున సోదరీమణు లిరువురుమాత్రమే వేగముగల గుఱ్ఱములఁ బూన్చిన రథముపై 2 దేవతాయతనమున కేగిరి.

3 అభ్యాసానుసారము వెంకటసోమయాజి పాణిద్వారమున లోనఁ బ్రవేశించి యున్నతాసనమున నున్న సత్యవేదగ్రంథమును దెరువ నేగి నప్పుడు కాంచిన వారెవ్వరును వాని ముఖవైఖరియందుఁగాని, యాచరణమునఁ గాని విపరీతముల వేనినిం గాంచలేదు. ఆరాధనక్రమమును యథావిధిగా నడపెను. అతఁడు నెమ్మదిగ నుండెను. కాని గాత్రము గంభీరముగ నుండెను. అతఁడు ప్రార్థించునప్పుడు ప్రప్రథమమునఁ గ్రొత్త వింతలు పొడసూపెను. ఢిల్లీపురిబోధకుఁడై ప్రవర్తించిన ద్వాదశాబ్దములలో నెన్నఁడు నింత స్వాభావికముగఁ బ్రార్థించియెఱుంగఁడు. క్రీస్తు ననుసరించు విధానమున నవీనాదర్శముల గ్రహించిన నూత్నముగ నాచరింప సమకట్టిన వాఁ డెట్లు పూర్వరీతిని బ్రార్థింపఁగలఁడు? స్వాతిశయమును, విద్యాగర్వమును, నాగరకాఢ్యతయుఁ గలిగిన మఠాధిపతియగు సోమయాజి స్వల్పదినములలోఁ దన స్వభావమును సాంతముగఁ మార్చుకొని, బాలునివలె నేడ్చుచు మోకాళ్ళూని తన యాదిత్యవాసర ప్రసంగమును బ్రభుసమ్మతముగ నడిపింప శక్తి నొసంగుమని వేఁడుకొను నని యా సామాజికులలో నెవ్వరనుకొనఁజాలరైరి. అట్టు లయ్యు దేవాలయోపన్యాస 4 వేదికనుండి మున్నెన్నఁడును వినియెఱుంగని స్వభావప్రేరితమును కఠినాంతరంగములఁ గూడఁ గరగించునదియు నగు ప్రార్థనను గావించెను.

ప్రార్థన ముగిసినతోడనే నిశ్శబ్దముగ నుండు తరుణమునఁ బరిశుద్ధాత్మ యా సమావేశముపై వెల్లివిరిసినట్లు ఎల్లరకును బొడకట్టెను. మిక్కిలి యజాగ్రతగ నుండు వారికిఁ గూడ గోచర మయ్యెను. కదిపినంత మాత్రమున నుప్పొంగు పారమార్థిక స్వభావము గలది యగుటచేఁ జకోరాక్షి 5 స్వభావాతీతమగు నీమహచ్ఛక్తిచేఁ బ్రకంపితయయ్యెను. ఆమె తలనెత్తి బోధకుని వంకఁ జూచినప్పు డామె వీక్షణప్రసారముల భావిసూచనలు ప్రచ్ఛన్నములై యుండెను.

ఈవిషయమున నామె యేకాకినికాదు. ప్రార్థనా విధానమును బట్టియే గ్రహించి సామాజికులలోఁ గొంద ఱీవిధంబున సంసిద్ధులై యుండిరి. మందిరము నందలి స్త్రీపురుషు లందఱును ముందునకు వంగి వినఁ గుతూహలులై యుండిరి. తాను ధర్మపురీయాత్రఁ గావించి నేర్చిన విషయముల నుద్ఘాటించి చెప్ప నుపక్రమించినప్పుడే దైవాత్మచే మందిర మెల్ల నిండిపోయెను.

---

1 ముద్దు 2 దేవాలయము 3 అలవాటునుబట్టి 4 అరుగు 5 స్వభావమునుమించిన

నే నిప్పుడే ధర్మపురి కేగి వచ్చితిని. అచ్చట దైవప్రేరితములై చేయఁబడు చున్న విశేషముల మీ కించుకఁ దెలుప నుద్యుక్తుఁడ నైయుంటిని" అని సోమయాజి శ్రోతల నందఱిఁ దేరిపారఁ జూచెను. వా రందఱుఁ దన వాక్యముల నాదరింపవలయు నను కుతూహలముతో నేమిచేయుదురో యను సంశయముతో వాని మనంబునఁ బెనగు లాడుచుండెను. ధనికులు నవనాగరకులు, సంస్కర్తలు, సకలామోదములఁ దులఁ దూఁగువారు నగు తన శిష్యులలో నెందఱు తాఁ జెప్పఁబోవు సదుపదేశము ననుసరించెదరు? ఆతని కీ విషయమగమ్యగోచరముగ నుండెను. తాను మాత్ర మరణ్యమున శోధనలకులోనై బయలఁబడి కష్టముల నంద సిద్ధముగ నుండెను. అట్లు క్షణకాల మూగి పిదప నుపక్రమించి తనయాత్రార్థము నెల్లఁ బూసగ్రుచ్చిన ట్లుపన్యసించెను. ధర్మపురిం జరుగుచున్న విషయముల నీ ప్రజ లింతకుఁబూర్వమే కొంత వినియుండిరి. ఈప్రతిజ్ఞాఫలమును దేశమునం దెల్లవారును నిరీక్షించుచుండిరి. దేశమునఁగల సమాజములెల్ల నీప్రతిజ్ఞాపాలనమునఁ దోడ్పడఁ దగిన కాల మాసన్నమైన దని కణ్వుఁడు నిశ్చయించెను. ధర్మపురియం దీ విధాన మత్యానంద 1 దాయక మగుటచే నెల్లరు దీనఁ బాల్గొనుటయే సమంజసము. దేశమునం గల సమాజముల నిదివఱకే సహకార సంఘము లేర్పడి సాధ్యమగు నంతదనుకఁ బ్రభుమార్గానుసరణమునకు గడంగినవి. దాన సామాన్యముగఁ బారమార్థిక బుద్ధి విస్తరిల్లినది.

ఈవిషయముల నన్నిటిని సోమయాజి సక్రమముగ నుడివి పిదపఁ దన యుద్యమము వెల్లడించెను. చకోరాక్షి ప్రత్యక్షరమును నిదానముగ నాకర్ణించెను. ఆమె విశాలాక్షి ప్రక్కం గూర్చుండి యుండెను. వామాగ్నిహోత్రములకుఁ గల తారతమ్యము వారికి బోసఁగియుండెను. విశాలాక్షికిఁ గూడ నీ ప్రసంగవశంబున నించుక మానసోద్రేకము కలిగినది.

సోమ — "ప్రియమిత్రులారా! — ధర్మపురీ క్రైస్తవ సమాజ మీ ప్రతిజ్ఞను గావించినట్లే దానినే ఢిల్లీసమాజమువారగు మీరు గూడ నాచరింపవలయునని కోరుచున్నాను. దీని వలన మీకును నాకు నెట్టి కష్టసుఖములు కలుగునో నే నెఱుంగుదును. మన యనేకాభ్యాసములఁ దారుమారుగ మార్చుకొనవలయును. ఉచ్చస్థానపాతమును గూడ సహింపవలయును. పెక్కండ్రకు ధననష్టము సంభవింపవచ్చును. ఇవి యన్నియు శ్రమలే యగును. ప్రభువు నాశ్రయించుటయనఁ బ్రథమ శతాబ్దమున నేమి యర్థమో యిప్పుడు నదియే. ధననష్టము, శ్రమ, కష్టానుభవము, క్రైస్తవేతరముల నెల్ల విసర్జించుట, క్రీస్తు ననుసరించుట యన నర్థమేమి! అప్పుడేమి యర్థమో యిప్పుడు నదియే. మీలో నీప్రతిజ్ఞను బరిపాలింపఁ దలంచిన వా రందఱును ప్రభువు చెప్పిన విధమున వాని ననుసరింతు మని వాగ్దానము సేయుఁడు."

ఇచటఁ బ్రసంగమును గొంచెము నిలిపి సామాజికులవంక తిరిగి తేరి పారఁ జూచెను. వారిలోఁ బ్రస్ఫుటముగఁ గాన్పించుచున్న కదలిక వలననే తన ప్రసంగము యొక్క ఫలితమును గ్రహించెను. పిమ్మట నెమ్మదిగా నీ ప్రతిజ్ఞను గావింపఁ దలంచిన వా రందఱును ఆరాధన ముగిసిన వెనుక నిలిచియుండుఁ డని వక్కాణించెను.

1 ఇచ్చునది

పిదపఁ దన సహజ ప్రసంగము నుపక్రమించెను. "ప్రభువా! నీ వెచ్చటికిఁ బోయిన నేను నిన్ను వెంబడించెదను." అను మత్తయి సువార్త VIII 19 వచనమును, ఆధారము చేసికొని మాట్లాడెను.

ప్రవర్తనయొక్క యాంతరంగిక విషయముల స్పృశించెను. 1 దేశికుని యభ్యాసయోగసారమే ప్రస్ఫుట మయ్యెను. క్రైస్తవ ప్రథమ శతాబ్ద విషయముల నుద్ఘాటించెను. చిరకాలమునుండి యెల్లరును విస్మరించిన క్రైస్తవ శబ్దార్థమును 2 బునరుద్బోధ మొనరించెను. ఎవఁడైనఁ దన జీవితకాలమున నొక్కసారి ప్రవచింపఁ దగిన ప్రసంగముగ్గఁ బరిణమించెను. ప్రజ లెల్లరు తమ జీవితకాల మంతయు ననుసరింపఁ దగిన సర్వోత్కృష్ట ప్రసంగమును గావించెను.

శ్రోత లందఱు నిశ్శబ్దముగ నుండ దైవతారాధనము ముగిసెను. పిదప నొకరొకరితో ముచ్చటించుకొనుటలో నించుక ధ్వని ప్రారంభ మయ్యెను. జనులు గుంపులు గుంపులుగ లేవ నారంభించిరి. లేచి పోవువారలు ప్రయత్నముపై నట్లు సేయుచుండిరని స్పష్టపడఁజొచ్చెను.

విశాలాక్షి నిర్విచారముగ లేచి తిన్నగ సింహద్వారము కడ కేగి నిలిచి—చకోరాక్షీ! పోవుదము రమ్ము.—అని పిలిచెను. అప్పటికి గుడిలోని భక్తు లెల్లెడల లేవ నారంభించిరి.

చకో—నే నప్పుడు రాను—అనెను.

చకోరాక్షి యిట్టి సమాధానముల నిచ్చుట విశాలాక్షి యెఱుంగును. ఆమె చెప్పినంతయుఁ జేయు నని కూడ నెఱుంగును. అట్లయ్యు వెనుకకు మరలి చకోరాక్షి కూర్చుండి యున్న చోటునకు వెళ్లి 3 కోపారుణిత లోచనయై యిట్లనెను—

విశా—చకోరాక్షీ! ఇది కేవలము తప్పు. నీ వేమి చేయఁగలవు? మన కుటుంబమున కంతకు నపఖ్యాతిని తెచ్చెదవు. నాయనగారేమందురు? పోవుదము రారమ్ము.

చకోరాక్షి తోబుట్టువును దేరిపారఁ జూచెనుగాని వెంటనే ప్రత్యుత్తరము నీయలేదు. మార్గదర్శి వగుమని దైవమును త్రికరణశుద్ధిగ వేడుకొనుచున్నట్లు అధరస్పంద ముద్బోధించుచుండెను. ఆమె 4 శిరఃకంపమును గావించెను.

చకో—నేను రాను. ఇచ్చట కొంచెము సేపాగి ప్రతిజ్ఞాపాలన ప్రమాణమును గావించిన తరువాత వచ్చెదను. దాని ననుసరించుటకు సంసిద్ధముగ నుంటిని. దీనిని నే నేల చేయుచుంటినో నీ వెఱుంగవా?

విశాలాక్షి యామెను క్రూరదృష్టితోఁ జూచెను. పిదప గిరుక్కున మరలి లేడివలె రెండంగలలో గుడినుండి వెడలిపోయెను. తన స్నేహితులతో ముచ్చటించుటకైన నిలువంబడలేదు. ఆమె యాలయపు ముంగిలిని జేరునప్పటికి గొడ్డేవారి కంబుకంఠి మెట్లను దిగుచుండెను.

కంబు—"అయితే నీవు సోమయాజిగారి యుపసంఘమునఁ జేరుటలేదా?" అని హేళనగాఁ బలికెను. విశాలాక్షి మోము రౌద్రరసంబున నెఱ్ఱఁబాఱెను.

విశా—లేదు. నీవు చేరెదవా యేమి! ఇది కేవలము వ్యర్థప్రయత్నము. ధర్మ

1 గురువుయొక్క 2 తిరుగఁ దెలియునట్లు 3 కోపముచే నెఱ్ఱబడిన నేత్రములు. 4 తలనూపెను

పురియందు జరుగుచున్న దెల్ల మతవ్యామోహ మనియే నా తలంపు. అచ్చటి వార్తల నెల్ల సుగుణవతి మాకుఁ దెలుపుచునే యున్నది.

కంబు—అవును. ఈ ప్రతిజ్ఞాపాలనమునఁ బెక్కండ్రు లెక్కకు మిక్కుటములగు నిక్కట్టుల పాలగుచుండిరని తెలియుచున్నది. సోమయాజి యిచ్చటఁగూడ ననవసరమగు మానసోద్వేగమును బురికొల్పుచుండె నని నా నమ్మకము. మన క్రైస్తవాలయ సమాజమును రెండుగ విభజించిన సమర్థించుకొన నవకాశము లేని వారు మన సమాజమునఁ బెక్కండ్రు కలరు. నే నట్టివారిలో నొకతెను.

పిదప వా రిరువురు నిష్క్రమించిరి. విశాలాక్షి యిలు జేరునప్పటికి జనకుం డెప్పటియట్లు చుట్టఁ గాల్చుకొనుచు వసారాలోఁ బచారు సేయుచుండెను. ఈమె లోనఁ బ్రవేశింపఁగనే "చకోరాక్షి యెచ్చట నున్నది?" అని యడిగెను "ఆరాధనాంత సమావేశమునకై వేచి యున్నది." అని సూక్ష్మముగా సమాధానము విశాలాక్షి చెప్పెను. 1 బహిరాచ్ఛాదనమగు శాలువను దీసివైచి లోనికిఁ బోవుచుండఁ దండ్రి పిలిచి—"ఆరాధనాంత సమావేశ మంటి వదియేమి?" అనెను.

విశా—వెంకటసోమయాజి మన క్రైస్తవాలయ సమాజమును ధర్మపురీ ప్రతిజ్ఞ నామోదింపుమని కోరెను.

విజయరామరాజు చుట్టను నోటినుండి తీసి మనఃప్రకోపముచే వేళ్ళతో నలుప నారంభించెను.

విజ—వేంకటసోమయాజి యింత పనిసేయు నని నే ననుకొనలేదు. సమూహమునఁ బెక్కండ్రందు చేరిరా?

విశా—నాకుఁ దెలియదు. నే నందుఁ జేరలేదు.

ఇట్లు తన తండ్రికిఁ బ్రత్యుత్తరము నిచ్చి విశాలాక్షి మేడమీఁదికి వెడలిపోయెను. విజయరామరాజు వాతాయనమును దరిసి వీధిలో నటునిటుఁ బోవువారిం జూచుచుండెను. అతని చుట్ట యారిపోయినది. కాని దానిని నింకను వ్రేళ్ళతో నలుపుచునే యుండెను. పిదప గదిలో నటునిటుఁ బచారుచేయ నారంభించెను. 2 మహానసాధ్యక్షుఁడు వంట సిద్ధమైన దని వచ్చి చెప్పెను. చకోరాక్షి వచ్చుదనుక వేచియుండు మని వాని కనుజ్ఞ నిచ్చెను. విశాలాక్షి మేడదిగి పఠనమందిరమున కేగెను. విజయరామరా జింతయును నొడుదుడుకుగా గదిలో నటునిటుఁ దిరుగుచునే యుండెను. తిరిగి తిరిగి వేసరి వాలుకుర్చీపై నొరిగి తనలోఁ దా నెద్దియో దీర్ఘాలోచన గావించుచుండెను. ఇంతలోఁ జకోరాక్షియు నింటికి వచ్చెను.

తండ్రి లేచి యామె 3 కభిముఖముగ నిలిచెను. తా నిప్పుడే పరిసమాప్తి నందించి వచ్చిన సద్భక్త సమావేశ విషయములనే చకోరాక్షికి మానసోద్రేకము మెండై యుండెను. ఆవిషయముల నామె యితరులతో మిక్కిలిగ ముచ్చటింపఁ దలంపలేదు. ఆమె చావడిలో నడుగిడునప్పటికి విశాలాక్షియుఁ బఠనమందిరమునుండి యచ్చటికి వచ్చెను.

"ఎందఱు నిలిచిరి" అని విశాలాక్షి యడిగెను. ఆమె వైఖరి చిత్రముగ నుం

---

1 మీఁదఁ గప్పుకొనిన 2 వంటసాల యజమాని 3 ఎదురుగ

డెను. సంగతులఁ దెలిసికొన నాతురపడెను. ధర్మపురీ విషయముల నామె మూఢ విశ్వాస జనితము లని భావించెను.

“ శతమాన ” మని చకోరాక్షి బదులు చెప్పెను. విజయరామరాజు 1 నిర్విణ్ణుఁ డయ్యెను. చకోరాక్షి చావడినుండి వెడలిపోవుచుండెను. అతఁ డామెను పిలిచి యిట్లనెను—

రాజ—నీవు నిజముగా నాప్రతిజ్ఞను నెరవేర్పఁ దలంచితివా ?

చకోరాక్షి వివర్ణ యయ్యెను. తండ్రీ ! యీ సమావేశకాలమున నీవచ్చట నుండిన నన్నిట్లు ప్రశ్నింపుమని యానాచున్నదో యనునట్లు ఆమె 2 కపోలతల ప్రదేశము లరుణములయ్యెను. ఒకక్షణకాల మచ్చట నిలిచి భోజనమునకుఁ గొంచె మాలస్యముగ వచ్చెద నని కుమార్పణను చెప్పి మేడమీఁదికిఁ దల్లిం జూడబోయెను.

మాతాపుత్రికలకు జరిగిన సంభాషణము నెవ్వరు నెఱుంగరు. ప్రాతఃకాలారాధ నానంతరమున సోమయాజి ప్రేరేచ నుపసంఘముగాఁ జేరినతరి నా సమావేశమునకై పరిశుద్ధాత్మ యెంత తీవ్రముగాఁ బ్రసరించెనో చకోరాక్షి తల్లికిఁ జెప్పియే యుండును. పరిశుద్ధాత్ముని సహవాస మింత విశేషముగ లభించునని చకోరాక్షి యెన్నఁ డనుకొనలేదు.

గతరాత్రి తల్లికొఱకై దాను ప్రార్థించుటవలన తప్పాలేనియెడల నీసమావేశ విషయముల నామెకు 3 నివేదింప వీలుకలుగుటయుఁ గలదోనివార ర. పిదపఁ దుదకుఁ జకోరాక్షి భోజనశాల కేగి తండ్రిని తోఁబుట్టువును గలిసికొని నప్పుడే సంఘసమావేశ విషయముల వారితోఁ జెప్ప నుత్సాహపడలేదు. వీరి కీవిషయమును దెల్పుట యందును నకుఁ జంద్రోదయ వర్ణనము గావించిన ట్లగునని యామె తలంచి 4 విరమించెను. ఆనాటి సాయంసమయమున సంజకెంజాయ 5 వాతాయనములనుండి భవనము నెల్లెడల దేదీప్యమానముగఁ బ్రకాశింపఁ జేయుచుండ నొకమూలనున్న గదిలోఁ దలుపులు మూసికొని యొంటిగఁ జకోరాక్షి 6 నిర్వికల్ప నిష్ఠాగరిష్ఠయై తదేకాయత్త చిత్తంబున 7 నవ్రీడాభూషితోత్తమాంగియై ప్రార్థింప దొడంగెను. తన మనోగతాభిప్రాయముల నెల్లఁ దండ్రియగు భగవంతునకు నివేదించి యాతని సహాయమును బ్రతీక్షించి, సంతృప్తాంతరంగియై ముగించి లేచి తలయెత్తి చూడ, తన జీవితాశయముల భగవదర్పణము గావించి మించిన దేవలోకకన్యక వదనారవిందంబు భాతి నతిశయించి స్వచ్ఛంద దర్పణమువలెఁ బ్రకాశించుచుండెను.

ఆసాయంకాలముననే సోమయాజి తన 8 యర్ధాంగలక్ష్మితో నాటి సభావిశేషంబుల ముచ్చటించుచుండెను. ఆదంపతు లిరువురు నేకాగ్రచిత్తమున నీయుత్తమాశయము నవలంబించి నూత్న మతావలంబుల భాతి నిర్మలముగఁ బనిసేయ నారంభించిరి. వా రుభయులు నీప్రతిజ్ఞాపాలనమున సమాజమునకును దమకును గలుగనున్న మార్పులను గుర్తెఱుంగకపోలేదు.

వారిట్లు సంభాషించుకొనుచుండ సింహద్వారముకడ గంట మ్రోగెను. సోమయాజి వెళ్ళి తలుపును దెరచి ‘ ఓహో ! దీక్షితులవారా ! లోనికి దయసేయుఁడు.’ అనెను.

---

1 తెల్లపోయెను 2 చెక్కిళ్ళు 3 చెప్పుటకు 4 ఊరకుండెను 5 కిటికీలు 6 నిశ్చల నిష్ఠతోఁగూడి 7 వంచిన శిరస్సు కలది 8 భార్య

స్ఫురద్రూపియు నాజానుబాహువు నగు నొక పురుషుఁడు చావడిలోని కరుదెంచెను. దీక్షితులు మిక్కిలి పొడవరియు, విశాలవక్షుఁడును ఉచితావయవసూర్తిచే మనోహరుఁడును నగును గాని 1 యస్వాభావిక మానవుని వలెఁ జూపట్టఁడు. క్రొత్తగఁ జూచువారి కితఁడు విశేష దేహపరిశ్రమ గావించిన మహాదార్ఢ్య సంపన్నుఁడుగఁ బొడకట్టును. పిదప నవనీత తుల్య మగు దయార్ద్ర హృదయుఁ డని గోచరించును.

అతఁడు లోనఁ బ్రవేశించి సోమయాజి యర్ధాంగలక్ష్మిని దరిసి యామె 2 ననునయించెను. పిదప వారు మువ్వురును గూర్చుండి కొంచెము కాలము ముచ్చటించు నప్పటి కెవ్వరో పిలువ సోమిదమ్మ వెడలిపోయెను. స్నేహితు లిరువురును సంభాషించుకొనుచు నొంటిగ నుండిరి.

చావడి నంటియున్న దక్షిణపు దిక్కు వసారాలో నున్న నిమ్న విశాలాసనముపై దీక్షితులవారు కూర్చుండిరి.

దీక్షి—తన సహాధ్యాయుఁడగు సోమయాజివంకఁ గన్నెత్తి చూచి యిట్లనెను—నేఁడు నీవు మిక్కిలి కఠినమైన పనికిఁ బూనుకొంటివి. మధ్యాహ్నమున నేనా విషయమును వింటిని. నేటి రాత్రి నీతో నావిషయమున ముచ్చటింప నిశ్చయించుకొని వచ్చితిని.

సోమ—తన సహాధ్యాయుఁడగు దీక్షితుని సమీపమునఁ గూర్చుండి తన చేతి నాతని భుజముపై వైచి—“నీవరుదెంచినందులకు నేను మిక్కిలి సంతసించుచుంటిని. మిత్రమా! నా యుద్యమమును నీవు బూర్తిగ గ్రహించితివా” అనెను.

దీక్షి—నేను గ్రహించితిననియే యనుకొనెదను. అగును. తెలిసికొంటిని.

దీక్షితు లిట్లు నెమ్మదిగను దీర్ఘాలోచనతో సమాధానము జెప్పెను. అతఁడు తన పాణియుగంబును గట్టిగఁ బట్టి కూర్చుండెను. అతని ముఖమున భూతదయయు, 3 ప్రజోద్ధరణ భావమును నేవయు, ప్రస్ఫుటముగఁ బ్రకాశించుచుండెను. అతఁడు తిరిగి కన్నుల నెత్తి తన మిత్రునివంకఁ జూచెను.

దీక్షి—మిత్రమా! సోమయాజీ! మన బాల్యమునుండియు మన యొకరి నొకరము బూర్తిగ నెఱుంగుదుము. ఆలయసేవయందు మన మవస్థాంతర భేదములచే మార్గాంతరముల నున్నను క్రైస్తవ సేవయందు అభేదబుద్ధితోడనే మెలంగు చుంటిమి.

సోమయాజి తన మనంబున నంకురించుచున్న భావముల గుప్తము సేయఁ దలంపక నంతశ్శుద్ధిగఁ దన మిత్రునితో ముచ్చటించెను.

సోమ—అది నిజమే. భగవంతుఁ డందులకు స్తుతింపఁ బడును గాక! నీతో నేస్తము, ఇతరుల సఖ్యమునకంటె సహస్రగుణితముగ సదా భావించుచుంటిని. నేనందులకుఁ బాత్రుఁడను గాకున్నను దాని విలువను బాగుగ గుర్తెఱుంగుదును.

దీక్షితులు తన స్నేహితుని కరుణాకటాక్ష వీక్షణంబులఁ దిలకించెను. వాని ముఖవికాస మింకను 4 ఛాయాచ్ఛన్నమై యుండెను. క్షణమూరకుండి తిరుగ నిట్లనెను.

దీ—ఈనవీనాదర్శమును నీజన్మప్రవృత్తికి గొప్ప గండమువంటిది. అన్ని విషయములలోఁ గ్రీస్తు ననుసరింపఁ దలంచితివేని నీవట్లాచరించియే తీరుదువు, నీ సహా

1 స్వభావమును మించిన 2 ఓదార్చెను 3 ప్రజల నుద్ధరించుట 4 నీడచేఁగప్పఁబడి

జమునఁ బ్రస్ఫుటములైన మార్పులు కలుఁగక మానవు. దేశమునందలి క్రైస్తవ సమాజము లన్నియుఁ దద్దేశాయత్త చిత్తమున నీదేవానుసరణ విధానము నవలంబించి ధర్మపురీ క్రైస్తవ సంఘమువలె నిర్వహించిన యెడల లోకమంతయుఁ దారుమారు కాక మానదు.

దీక్షితుఁ డిట్లని తన మిత్రుఁ డెద్దియేని ప్రశ్న వేయునని నిరీక్షించెను. సోమయాజి కణ్వుఁడును దానును విశేష పరిశ్రమ చేసి సంపాదించిన పరంజ్యోతి తన మిత్రుని హృదయంబునఁ గూడ వెలుంగుచుండె నని యెఱుంగఁడు.

దీ—నాసంఘమున వీనిం బ్రవేశపెట్టుట మిక్కిలి దుష్కరము. అట్టి ప్రతిజ్ఞను గావింప సమర్థులు వారుగాని కావించి సమర్థింపఁ బాటుపడు వారుగాని పెక్కండ్రు గానరారు. స్వార్థత్యాగము గ్రంథములఁ దప్ప లోకమునఁ గాన్పింపదు. కష్టముల శ్రమల నాదరముతో ననుభవించి భరించుటకు మారుగ నకాలపు క్రైస్తవులు సకల సౌకర్యములని నిశ్చయించుచుండిరి. కాని క్రీస్తును వెంబడించుట యన నేమి? ఆ ప్రభువు పాద[1]విన్యాసముల నాశ్రయించుట యన నేమి?

దీక్షితు లిప్పుడు తనలోఁ దానే మాట్లాడుకొన దొడంగెను. ఇప్పుడు సోమయాజి తన యెదుట నుండెనో లేదో యెఱుంగఁడు. తన్మయత్వమున మైమఱపును జెందినవాఁడై యుండెను. ఇప్పుడే దీక్షితుని యాథార్థ్యము సోమయాజికి మానసగోచరము కాఁజొచ్చెను. దీక్షితులుగూడ కణ్వప్రాయుఁడై తన పరిపాలనమున నీప్రతిజ్ఞను నెలకొల్పిన నట్లుండును? ఢిల్లీపురంబుననే గాక తత్ప్రాంత ప్రదేశవాసులగు సకలైశ్వర్యములతోఁ దులదూఁగు నరనాగరకాగ్రేసరులలోఁ బెక్కండ్రీతనికి వశంవదులు. దీక్షితుఁడే యీ నవీనాదర్శము నాశ్రయించిన నెంత బాగుండును.

ఈయూహను సోమయాజి, వాగ్రూపమున బహిర్గతము గావింప [2]నుద్యుక్తుఁడై యుండెను. తనచేతిని మైకత్తి చిరపరిచితుఁడగు దీక్షితుని భుజోపరిభాగంబున నత్యాదరముతో నుంచి మిక్కిలి ముఖ్యమగు ప్రశ్న నడుగఁబోవుచుండ నతిథుల రాకను సూచించు గంట సింహద్వారముకడఁ దీవ్రముగ మ్రోగెను. సోమిదేవమ్మ ద్వారమును దరిసి యెవ్వరితోడనో ముచ్చటించుచుండెను. అంతనొక పెద్దకేక వినఁబడెను. దద్దరిల్లి సోమయాజి వడిగ నటకుఁ బోనుంకించెను. దీక్షితులు చివాలునఁ గుర్చి నుండి లేచి వాని వెనువెంటఁ జనెను. అంత సోమిదమ్మ [3]ద్వారచ్ఛన్న పటమును [4]బట్టాత్క్షేపముగఁ బైకెత్తెను. ఆమె మోమువమ్మి వాడి వెల్లనై యుండెను. [5]ఆపాదమస్తమును గంపము నందుచుండెను.

సోమిదమ్మ—ప్రాణనాథా! యేమి యీ ఘోరము! విజయరామరాజు—నేనామాట నుచ్చరింపఁజాలను. ఆచిన్నపిల్ల లిద్దఱికి నెంతటి దురవస్థ సంప్రాప్తమైనది.

'ఏమిది!' అని సోమయాజియు దీక్షితులును జావడిలోనికి కరుదెంచి విజయరామరాజు మందిరమునుండి వచ్చిన [6]వార్తాహరుని కభిముఖులై యడిగిరి. వార్తాహరుఁడు [7]శిరోవేష్టము నైన ధరింపలేదు. ఆకుటుంబ స్నేహితులలో దాపునఁ గాపురమున్న వాఁడు సోమయాజియే యగుటచేఁ బరుగిడి వచ్చెను.

---

1 జాడలను 2 ప్రయత్నించి 3 గుమ్మమున గప్పినగుడ్డ 4 హఠాత్తుగ 5 కాలు మొదలు తలవఱకు 6 చారుఁడు 7 తలపాగ.

వార్త—విజయరామరాజు తుపాకిని గాల్చుకొని యాత్మహత్య గావించుకొనెను. తన శయనాగారంబుననే యిట్లొనర్చెను. వాని భార్య—

దీక్షి—మిత్రమా! నేనచ్చటి కేగవలయును ; నీవుగూడ నాతో వచ్చెదవా? వారు నీకును బూర్వపరిచయులు.

దీక్షితులు మిక్కిలి వెల్లబోయియుండెను. తాని స్వాభావికముగ నిదానము కలవాఁడగుటచేఁ దత్తరపడలేదు. తన స్నేహితుని దేరిపారఁజూచి యిట్లనెను—

"అట్లే నీతో వచ్చెదను. ఈ 1 ప్రేతగృహంబునకే కాదు; లోకమునఁ గల పాపమును శ్రమలను గూడ నీతో నీది తరించెదను. దైవ మామోదించునుగాక!"

మిక్కిలి యాతురతఁ జెందియున్న యీ సమయమునఁ గూడ సోమయాజి తన మిత్రుని మనోభావమును గ్రహించెను

నవమాధ్యాయము సంపూర్ణము.

1 శవమున్న యిల్లు

శ్రీ

# దైవానుకరణము.

## దశమాధ్యాయము.

సోమయాజి దీక్షితులుగార్లు విజయభవనమునకుఁ బోవునప్పటికి సకలమును బరిశుభ్రముగ నుంచు నభ్యాసముగల యింటిలో సమస్తమును స్థానభ్రష్టత నంది గందరగోళముగ నుండెను. ప్రాసాదాగారము లన్నియు విజనంబుగ నుండెను. కాని వడి వడిగ నడచు పాదవిన్యాసముల ధ్వనులును గుసగుసలును మేడమీఁదనుండి వినఁబడుచుండెను. వీ రిరువురును మేడ నెక్క నుద్యుక్తులై సోపానముల సమీపించునప్పటికి, ఒక పరిచారిక భయకంపిత వదనయై వివర్ణమునంది తొందరగా మెట్లను దిగుచుండెను.

ఏదియో ప్రశ్నకుఁ "జకోరాక్షి తల్లిదగ్గఱ నున్నది." అని గొణుగుకొనుచుఁ బెద్దపెట్టున నేడ్చుచుఁ బరుగిడిపోయి చావడిని దాటి వీధిలోనికి వెడలిపోయెను. వీరు మెట్లెక్కిన తోడనే చకోరాక్షి దృగ్గోచరయయ్యెను.

ఆమె చూచినతోడనే సోమయాజిని సమీపించి తన రెండుచేతులును వాని చేతులలో నుంచెను. దీక్షితులామె శీర్షంబునఁ దన పాణితలము నుంచెను. ఇట్లు వారు ముప్వురు నొక్క క్షణము నిశ్శబ్దముగ నుండిరి.

దీక్షితులు చకోరాక్షిని శిశుత్వమునుండియు నెఱుంగును. అతఁడే మాటలాడ మొదలు పెట్టెను.

దీ—"చకోరాక్షి! దయామయుండగు భగవంతుఁడు నీ కీ కష్ట కాలమునఁ దోడై యుండునుగాక. నీ తల్లి—"

దీక్షితులు పై వాక్యము నుచ్చరింప సందేహించెను. సోమయాజి యింటినుండి యిచ్చటికి వచ్చులోపున యౌవనదశయందుఁ దనకుఁ గలిగిన యొక శృంగారావస్థ నాతఁడు స్మరించెను. ఆ విషయము సోమయాజికిఁ గూడఁ దెలియదు. దీక్షితులు మధ్యయౌవనమున నుండు కాలమున నాతని మనంబును ప్రియంవద (విజయరామరాజు భార్య) ఆకర్షించుట చే నామెను విశేషముగఁ బ్రేమించి తన దేహమనోబలంబుల నామె పరంబుగావింప నిశ్చయించుకొనెను. కాని ప్రియంవద లక్షాధికారినే స్వీకరించెను. దీక్షితుని హృదయమునఁ గ్రోధ మంకురించలేదు. కాని యీ సందర్భమును మాత్రము విస్మృతిఁ జెందలేదు.

అర్ధోక్తిలో ముగించిన దీక్షితుని ప్రశ్న కుత్తరముగాఁ జకోరాక్షి తన తల్లి గదిలోని కేగెను. ఆమె యింక నొక్కమాటయైనను జెప్పలేదు. ఆమెయొక్క యద్భుతమగు శాంతమునకు వీ రిరువురును నిర్విణ్ణులైరి. ఆమె తిరుగ వచ్చి వారి నిద్దఱిని రమ్మని పిలిచెను. అసహజమగు విషయము సిద్ధియేని గాంచఁబోవు వారివలె నీ[1] దేశికద్వయము భయవిహ్వల హృదయములతో మెల్లగ గదిలోనికిఁ జనిరి

విశాలాక్షి చేతుల రెంటిని బారజాపి మంచముపైఁ బడియుండెను. పరిచారిక

1. ఇద్దరు గురువులు.

నెత్తిపై గుడ్డగప్పుకొని కూర్చుండి భయప్రకంపితాంగియై యేడ్చుచుండెను. భూమ్యాకాశముల నెన్నఁడుఁ బొడసూపని 1 వికాస పరికల్పిత వదనారవిందయై ప్రియంవద నిశ్చలముగఁ బర్యంక తలంబున స్థాణురూపంబున నుండెను. ప్రప్రథమమున దీక్షితులు గూడ మోసపోయెను. సత్యము వ్యాప్తమగుడు వారిరువురుఁ దత్తరపాటుఁ జెందిరి. 2 అస్థిగతంబగు పురాతన వ్రణంబున 3 నలాతశల్యము నాటి నటులు దీక్షితులు వ్యథాకుల మానసుం డయ్యెను. అతఁడు తన మనోభావముల సమర్థించుకొని పూరుషార్హం బగు ధైర్యంబునఁ గిమ్మనక నిలిచి యుండెను. ఇప్పుడవలంబించిన యీ ధైర్యము నే యాతఁ డామరణాంతమును ప్రజాసేవకై వినియోగించెను.

ఉత్తరక్షణమునఁ గ్రింద యిల్లంతయు రణగుణధ్వానంబున మునింగెను. పిలువ నంపిన ధన్వంతరియు నప్పుడే వచ్చి చేరెను. అతఁడు కొంచెము దూరమున నివసించువాఁడు. వాని వెనువెంటనే రక్షకభటులుం నరుదెంచిరి. భయవిహ్వలురగు నౌకరులు వారిం బిలిచిరి. పత్రికావిలేఖరులును, నిరుగుపొరుగువారును గూడ వచ్చి నిండిరి. సోమయాజి, దీక్షితులు, వీరందఱిని మెట్లయొద్దఁ గలిసికొనిరి. అవసరమగు వారిని దప్ప మిగిలినవారిని మేడపై కెక్కకుండ నివారించిరి. స్నేహితు లిరువురును వీరును గూడి యీ ఘోరకృత్యమునకుఁ గల కారణముల నన్నిటిని విచారించిరి. ఆ కారణములే మరునాటి పత్రికలో నత్యద్భుతముగ వర్ణించిరి

విజయరామరాజు రాత్రి 9 గంటలకుఁ దన గదిలోని కేగెను. అదియే వాని సజీవునిగఁ జూచుటకుఁ గడపటిసారి. అరగంటయైన వెనుక తుపాకి కాల్చిన శబ్దము వినఁబడెను. ఆశబ్దమును వినితత్తరపడి నౌకరొకఁడు గదిలోనికిఁ బరుగిడిచూడ నాతఁడు నేలపైఁ జచ్చి పడియుండెను. ఆసమయమునఁ జకోరాక్షి తన తల్లియొద్దఁ గూర్చుండి యుండెను. విశాలాక్షి పుస్తకాగారమునఁ జదువుకొనుచుండెను. ఆమె పైకిఁ బరువిడి నౌకరులుతన తండ్రిని నెత్తి మంచముమీఁదఁ బరుండఁబెట్టుచుండఁ జూచి పెద్దపెట్టున నేడ్చుచుఁ దల్లి గదిలోనికిఁ బరువిడిపోయి మంచము దగ్గఱ మూర్ఛ మునింగెను. ప్రియంవద యీ సంగతి వినిన తోడనే మూర్ఛనందెను. కొంతవడి కత్యద్భుతముగఁ దెప్పిరిలి వెంకటసోమయాజికై యొక నౌకరు నంపెను. పిదపఁ దన భర్తను జూచెద నని పట్టుపట్టెను. చకోరాక్షి యెన్ని చెప్పినను వినక భయముచే గజగజ వణఁకుచు నేడ్చుచున్న పరిచారికల సాహాయ్యమునఁ దనభర్తపడియున్న గదిలోని కేగెను. కంట దడియైనఁ బెట్టకుండ నాతని 4 ననిమిషయై పరికించి వెనుకకు మరలి తిరుగఁ దన గదిలోని కేగి మంచముపైఁ బరుండెను. గురువులిరువురు వచ్చునప్పటికి ప్రియంవద తన నిమిత్తమును, తన భర్తకొఱకును, నిర్మలముగఁ బ్రార్థించుచు విశాలాక్షి కాళ్ళఁ బరవశయై పడియుండఁ జకోరాక్షి తన మోముపై వంగి తిలకించుచుండఁ 5 నసువుల విడిచెను.

ఆ యాదివారము రాత్రి మృత్యుదేవత యా దివ్యభవనమునఁ జేరియింతటి యల్లకల్లోలమును గావించెను. విజయరామరాజు యొక్క 6 యార్థికచారిత్రము బూర్తిగ వెల్లడి యగుదనుక నీమృత్యుదేవతా ప్రవేశమునకుఁ బ్రధాన కారణము గోచరింపలేదు.

1 ప్రకాశము 2 ఎముకలను బట్టిన 3 కొరవి 4 రెప్ప వేయక 5 ప్రాణములను 6 అర్థసంబంధమయిన.

కొంతకాలమునుండి విజయరామరాజు, ఒకానొక వ్యాపారములఁ బ్రవేశించెను. ఒక నెలదినములలో వాని ధనమంతయు నంతరించెను. ఆత్మజీవనోద్ధరణమునకై పోరాడు వానికిఁ 1 దాత్కాలికముగఁ బొడసూపు మాయామయ జ్ఞానము వీనియం దంకురించి, ధనమెల్లఁ గోల్పోయి నిర్భాగ్యుఁడ నయితి నని తెలిసికొని నప్పుడు ఏమియుఁ దోఁచక వినాశము బూర్తిగఁ దెలిసికొను దనుక నీక్షించి తన దేహయాత్రకుఁ బరిసమాప్తిని జెప్పెను. ఆదివారము సాయంసమయముననే సర్వనాశనమైన సంగతి తెలిసెను. అతఁడు దన దనుకొనుచుండిన యీ దివ్యభవనము, తాను వాడుకొనుచున్న కుర్చీలు, బల్లలు, గుఱ్ఱములు, బండ్లు, వెండి బంగారు సామానులు, గృహోపకరణములు మున్నగున వన్నియు, నాతని కష్టార్జితము కాని ద్రవ్యముచే నొకప్పుడు కొనెను.

యథార్థమగు విలువలేని మాయామయ ప్రవర్తనము వలననే యీ ధనము నంతయు నార్జించెను. మాయోపాయములచే ద్రవ్యనష్టమును గూడఁ దొలఁగించుకొనఁ గలనని 2 నిరీక్షించెను. ఇట్టివా రెప్పుడు నట్టి నిరీక్షణనే కలిగియుందురు. 3 ఈదృశులగు పరులనేకుల వలెనే యీసారి విజయరామరాజు మోసపోయెను. తాను ముష్టిచిప్పను బట్టుకొని వీధివీధులం దిరిగి 4 తిరిపె మెత్తఁదగిన యవస్థ తటస్థించినదని తెలిసినతోడనే యీకష్టదశలో మరణమే మోక్షమని గ్రహించెను. వీని జీవితవిధానమున కిది యోగ్యమయిన ఫలమే. ద్రవ్యమునే దేవునిగ సేవించెను. ఆ ద్రవ్యదేవత తన బారినుండి తొలఁగినతోడనే వాని కారాధన నిధాన మంతరించెను. ఆరాధన నిధాన మంతరించిన జీవితాశయే నశించును. ఇవ్విధంబున లక్షాధికారియగు విజయరామరా జంతరించెను. అతఁ డజ్ఞానియై యజ్ఞానాంధకారంబున మునింగి 5 సమసెను. నిత్యనిర్మల భగవత్సాన్నిధ్య ప్రదాయకమగు నాత్మజ్ఞానమునకును దీనికిని సాదృశ్య మెక్కడ ?

ప్రియంవద మరణమునకుఁ బెనిమిటి చావువలనఁ గలిగిన 6 హఠాద్ఘటిత వ్యథయే కారణము. కొన్ని వత్సరముల నుండియు భర్త తన రహస్యముల నీమెకుఁ జెప్పుట మానివైచెను. కాని యాతనికి ధననష్టము కలుగఁ గలదని మాత్ర మీమె యెఱుంగును. పెక్కువత్సరములనుండి యామె 7 జీవన్మృతయై యుండెను. మిక్కుటములగు దుఃఖములనైన భరింప సమర్థతగలది. ప్రియంవద తాను లేవలేని స్థితియందుండియుఁ బరిచారికల సహాయంబున భర్తృమృతకళేబర 8 దిదృక్షచే నాగదికిఁ బోవుట వలననే యీమె స్థైర్యమును గ్రహింపనగును. ఆమె కడు నీరసస్థితియం దుండుటచే నీ దుర్భరావస్థ సహింపఁజాలక యసువులఁ ద్యజించెను.

తల్లిదండ్రుల మరణమును ధననష్టమునను నీ 9 యాపత్త్రియము నొక్కసారి సంప్రాప్తమైనవి. ఈఘోరము వలన విశాలాక్షి కొన్ని వారముల దనుక స్వస్థచిత్త కాలేదు. మిత్ర బాంధవ పరామర్శ వాక్యానునయముల వలన గాని సదుపచారముల వలనఁగాని యామె చలింపలేదు. ఆమె తన జీవితమునకు ముఖ్యాధారమని భావించుచున్న భాగ్యము రిత్తయైనదని యైన నెఱుంగదు. చకోరాక్షియుఁ దాను నిట్లు విడిచి

---

1 వెంటనే 2 చూచెను 3 ఇట్టివారు 4 బిచ్చము 5 చచ్చెను 6 వెంటనే వచ్చిన 7 బ్రతికియుఁ జచ్చినదానివలె 8 చూచుకోరిక 9 మూఁడాపదలు

పోయి బంధుజనుల దయాధర్మమున జీవింప వలసిన సమయ మాసన్నమైన దని చెప్పినను దాని యర్థమును గ్రహింపదయ్యెను.

చకోరాక్షి కీ విషయము లన్నియుఁ బూర్తిగఁ దెలియును. తమ కిట్టి యాపద యేల సంభవించినదియు నాయమ యెఱుంగును; సమాధి కార్యములు ముగిసిన వెనుక నామె తా నాచరింపఁ దలంచిన జీవిత యాత్రావిధానమును సుగుణవతితో ముచ్చటించెను. సుగుణవతియు నామె తల్లియు నీదుర్వార్తను వినినతోడనే ధర్మపురినుండి ఢిల్లికి వచ్చిరి. ఈ సమయమున సమావేశమయిన యితర బంధు మిత్రాదులును వీరును గలిసి యీ కుటుంబ [1] భావివిధానమునుగూర్చి యోజించు చుండిరి.

సుగుణవతి తన ముఖారవిందమునుండి బంధువత్సలత వెదజల్లుచు ‘ చకోరాక్షీ! నీవును నీ యక్కయును ధర్మపురికి మాతో నేతెంచి కొంతకాలము మాయొద్ద నుండ వలయును. ’ అనెను. చకోరాక్షిగూడ దైవానుకరణ ప్రతిజ్ఞ గైకొనుటచే సుగుణవతి కామె యెడలఁ గల బంధువాత్సల్యము, బద్ధానురాగముగఁ బరిణమించి దినదిన ప్రవర్ధమాన మగుచుండెను.

చ—నేను చేయఁ దగిన దిచ్చట నేమియు లేనియెడల నట్లే వచ్చెదను. అని సుగుణవతిని దీనవదనయై తిలకించెను.

సుగు—తల్లీ ! నీవిచ్చట నేమి సేయఁ గలవు ?

చ—ఏమియును లేదు. కొంచెము సంగీతము పాడుట తప్ప నాకే యితర కార్యమును నేర్పింపలేదు. ఆసంగీత మయినను ఇతరులకు నేర్పి జీవనాధారముగఁ జేసికొనుటకుఁ దగినంత రాదు. వంటఁ జేయు విధానము నించుక యభ్యసించితిని— అని చిఱునగవుతో సమాధానము చెప్పెను.

సుగు—చకోరాక్షి తన యనుదినాహారమునకుఁ గూడ బంధుజనులపై నాధారము పడవలసి వచ్చెనని సంకోచించుచున్నదని గ్రహించి తత్సందేహ నివారణార్థ మిట్లనెను—

“ అమ్మ వంటపనిలో శ్రమ పడలేక చిక్కుపడుచున్నది. అట్లయిన నీవే మాకుఁ బచనముచేసి పెట్టవచ్చును. ”

తండ్రి యాస్తిలోఁ బిల్లల కించుకయు [2] సంక్రమించలేదు. అంతటితోనైన ముగింపక యాతఁడు దురాశాపిశాచ గ్రస్తుఁడై తన భార్యాపుత్రికలఁ బ్రత్యేకాదాయము గూడఁ గపటనాటకమునఁ జేర్చి [3] కోలుపోయెను.

చ—సుగుణవతి చెప్పిన విషయము దీర్ఘాలోచన సేయఁ దగినదిగాఁ దలంచుచు— అటులా ! అటులా! విశాలాక్షికిని నాకును జీవనోపాధిని సమార్జించుటకై మర్యాదహీనముగాని యేపనినైనను జేయుటకు సంసిద్ధముగ నుంటిని. అయ్యో ! పాపము విశాలాక్షి అది యీ [4] దురవస్థాప్రాప్త విమోహమునుండి తిరిగి ప్రజలలోఁ బడఁ జాలము.

సుగు—చకోరాక్షి తన దారిని తాను చూచుకొన నాతురపడుటకు మందహాసము ముఖచంద్రునియం దంకురింపఁ గన్నీటి ధార లొలుక నిట్లనెను:—ధర్మపురి కేగిన వెనుక నంతర్భాగముల నేర్పరచుకొన వచ్చును. ’

1 రాఁబోవు 2 చేరలేదు 3 నష్టపడెను 4 చెడ్డయవస్థచేఁ గలిగిన.

ఈ సంభాషణము జరిగిన యొక పక్షమునకుఁ జకోరాక్షి విశాలాక్షులు ధర్మపురిలో సుగుణవతియింటఁ బ్రవేశించిరి. ఈ మార్పు విశాలాక్షికి మిక్కిలి 1 విషాదకరముగ నుండెను గాని చేయఁదగిన దేమియు లేక మిన్నకుండెను. ఇట్టి 2 యసంతృప్త్యవస్థయం దుండుటచే నీమెను సాకుట కష్టసాధ్యముగ నుండెను.

తన మనోభావముల కనుగుణ మగు సుగుణవతి సహవాస మహోరాత్రములు లభించుటచేఁ జకోరాక్షి యానందమయావస్థయందు మగ్నయై యుండెను. దైవానుసరణ విధానావలంబనము సుగుణవతి తల్లికి సహ్యముగ లేకున్నను దత్సామాజిక కృతఘనతర కార్యంబుల నీక్షించుటచే నామె మనంబుఁగూడఁ గరఁగఁ జొచ్చెను. సుగుణవతి చండాల వాటికయం దాచరించుచున్న సత్కార్యమునకుఁ దోడ్పడుటకుఁ జకోరాక్షి కవకాశము కలిగెను. స్వకాయకష్టంబున జీవింపఁ దలంచుటచేఁ జకోరాక్షి గృహపాకమునఁ బాల్గొన మొదలిడెను. కొలఁది దినంబులలో నామె మహానస కృత్యంబునఁ దన హస్తలాఘవము నెల్లరకు వెల్లడి సేయుటచేఁ జండాల వాటికలో 3 పాకవిద్యాభ్యాసము గూడఁ గావింప నవకాశము చిక్కెను.

చకోరాక్షి మిక్కిలి సంతోషముతో బీదలకు వంట నేర్ప నారంభించెను. పరసౌఖ్యాకరము లగు కార్యముల నాచరించుటచేఁ గలుగు సౌఖ్యమును జవిగొన మొదలిడెను. ప్రభు వేమి సేయు నని విమర్శించి తదనుగుణముగఁ బ్రతికార్యము నాచరింప నామె కావించుకొనిన నిశ్చయ మామెకుఁ గాలక్రమమున నైజగుణముగఁ బరిణమించెను. మనోద్రఢిమ మిక్కుటము గాఁజొచ్చెను. చకోరాక్షి గుణగతము లాహ్లాదకర మని పెద్దమ్మకూడ వక్కాణించెను. లక్షాధికారికి తనూజాతయై మహాపట్టణమున సకల వైభవములతోఁ బెనుపఁబడి యాగర్భ శ్రీమంతురాలై యున్న యొన్నటి దనుకఁ జరించిన చకోరాక్షి ఆరితేరిన వంటలక్క వలె 4 ననుక్షణమును బాకశాలయం దటునిటు దిరుగుచుఁ జేతులు వంటపదార్థములచే మలినములై యుండ నప్పుడప్పుడు నాసికాగ్రమునఁ గూడఁ బిండి మున్నగు పదార్థము లంటుకొని యుండ లక్ష్యము సేయక కార్యనిర్వహణ లగ్న చిత్తయై చరించుటం గాంచఁ బెద్దమ్మకూడ నాశ్చర్య మగ్నాత్మ యయ్యెను.

పెద్ద—చకోరాక్షీ! దాసదాసీజనార్హంబులగు నీచకృత్యంబుల నీవాచరింపఁ జూచి సహింపఁ జాలను. నీ వా కార్యముల మెలంగవలదు.

చకో—. పెద్దమ్మా! అట్లనెదవేమి ప్రొద్దుపొడుపున నేను సిద్ధపఱిచిన పెసరట్లు నీకు 5 రుచిరముగ లేవా?

పెద్ద—కడుంగడు స్వాదువుగ నున్నవి. కాని చకోరాక్షీ! నీవు మా యింట నిట్టి పనుల నాచరించుట యుక్తము కాదు.

చకో—ఏల యుక్తముగాదు? ఇది గాక నే నింకేమి చేయఁ గలను.

పెద్దమ్మ చకోరాక్షివంకఁ దేఱిపారఁ జూచెను. ఆమె ముఖవికాస మించుకేనియుఁ గొఱవడలేదు.

పెద్ద—అమ్మా! నీ వెప్పుడును వంటలక్కవై యుండఁ దలంపలేదుగదా?

---

1 దుఃఖకరము 2 తృప్తిలేని 3 వంటపని 4 ప్రతిక్షణమును 5 బాగుగనుండలేదా

చక్రి—బహుశా యట్లే యగునేమో? ఢిల్లీలోఁగాని తత్తుల్యమగు మఱియొక పెద్దపట్టణమునఁగాని వంటలఁ జేయు విధానమును నేర్పు బడిని పెట్టుకొని తత్ప్రాంతమునఁ గల బీదవాండ్ర యిండ్లకేగి తల్లులకుఁ జక్కఁగా వంటసేయు రీతిని నేర్పవలెనని యున్నది. నిమ్నజాతులయందుడికియు నుడుకని మెతుకులఁ దినుట వలననే రోగములధికముగఁ బ్రబలుచుండు నని సోమయాజి చెప్పియుండెను. ఈ యసంతృప్తాహారమే వారి ఘోరకృత్యములకుఁ గూడ బురికొల్పుచుండునఁట. ఈ విధానమున నాకును విశాలాక్షికిని వలయు జీవనోపాధి నార్జించుకొనుచుఁ బరోపకారమును గావింపఁగలను.

చక్రి రాత్రి యీవిషయమును మననము చేసి చేసి తుదకు నిర్ధారణ పఱచెను. ఈలోపల ధర్మపురియందును మాలపల్లియందును గల ప్రజల యనురాగమునకుఁ బాత్రయై [1]పాకశాస్త్రాధ్యయనిపించుకొనెను. ఢిల్లీదేవాలయమునఁ గావించిన దైవానుకరణ ప్రతిజ్ఞ యామె దైనికచర్యయం దెల్లెడ వ్యాప్తమగుచుండెను.

ఉపన్యాసపీఠముపై నిలిచి వెంకట సోమయాజి దైవానుకరణ మహామంత్రోపదేశమును గావించి మూఁడు మాసములైనది. ఇంతదనుకఁ దన సమాజకుల యంతఃకరణ ప్రవృత్తు లెట్లు ప్రసరించుచుండెనో యాతఁ డెఱుంగఁడు. ఇప్పుడు దేశమున వ్యాప్తమై యున్న దేవాలయారాధన విధానంబునఁ దృప్తినందని పెక్కండ్రు ఈ నవీనాదర్శమును విశేషాహ్లాదముతో నంగీకరించిరని మాత్ర మాతఁడు గ్రహించెను.

ఆతఁడు తన స్వీయప్రవర్తనమునకే తృప్తినందలేదు. దాని పరిణామ పరిమితి నిదమిత్థమని నిర్ధారణ సేయ సాధ్యము కాదుగాని దీక్షితున కీతనికిఁ గలిగిన పునస్సమావేశ సంభాషణమును గుర్తించిన [2]నీషత్ జ్ఞాన మంకురించును. సోమయాజి యింట గ్రంథాలయంబున వీ రిరువురుఁ గూర్చుండియుండిరి.

దీక్షి—నేనీదినమున నిన్నుఁ జూడవచ్చిన కారణమేమో నీ వెఱుంగుదువా?

సోమయాజి తన మిత్రుని గన్నెత్తి చూచి తలపంకించెను.

దీక్షి—ప్రభువు పదపద్మంబుల నంతఃకరణశుద్ధిగ నింకను వెంబడింపఁ జాలకుంటి నని నీయెదుట నొప్పుకొన వచ్చితిని.

సోమయాజి యాసనమునుండి లేచి గదిలో నిటునటుఁ దిరుగుచుండెను. మనోనిశ్చయము నొనర్చుకొను వేళ నతనికి సహజమగు విధానమున నేత్రములనుండి నూత్నవికాసము వెల్లివిరియ దీక్షితులు లోఁతగు కుర్చీపై నిశ్చలుఁడై కూర్చుండి యుండెను.

సోమ—ప్రతిజ్ఞాపాలనమున నాకింకను దృప్తి కలుగలేదు. తుద కిప్పుడు నే నాచరింప వలసిన విధానమును నిశ్చయించుకొంటిని. కర్తవ్యమును అవిచ్ఛిన్నముగ నిర్వర్తించుటకు నేనీ యుద్యోగమును మానుకొన వలసి యున్నది.

దీక్షి—నీవట్లే చేయుదువని నే నెఱుంగుదును. నేను నా యుద్యోగమును విడువ వలసి యున్నదని నీతోఁ జెప్పుటకే నే డిచ్చటికి వచ్చితిని.

సోమయాజి వెనుకకు మరలి తన స్నేహితున కభిముఖుఁడై నిలువంబడెను. వారిరువురును దమ మనోగతాందోళనము లోన నిముడ్చుకొనఁ బ్రయత్నించుచుండిరి.

సోమ—నీవిషయమున నిది యవసరమా?

దీక్షి—అవసరమే. కారణములఁ జెప్పెదను వినుము. నీకు నవియే కారణములు కావచ్చును. అట్లే యగు నని నా నమ్మకము. సోమయాజీ! నే నెంతకాలమునుండి

1 వంటలయందు నేర్పరి 2 కొంచెము.

యీ యాచార్యపదవియం దున్నదియు నీ వెఱుంగుదువు. 1 తదున్నత స్థానోచిత కార్యనిర్వహణ మెంత 2 దుర్ఘటమో నీ వెఱుంగనిది కాదు. కష్టసాధ్యమును దుఃఖావహము నని నా తాత్పర్యము. కాని యజ్ఞానులగు పామరజనులు, 3 అత్యంతామోదావహ మని భ్రమించు నీస్థానమునం దుంటిని. ఒక దివ్యభవనము నివాసమున కేర్పడినది. 4 అనర్ఘ వస్త్రాభరణా ద్యలంకార సమృద్ధి కలదు. శారీరక సౌఖ్యము లెల్లఁ గొల్లగా ననుభవించుచుంటిని. దేశయాత్రలఁ బలుసారులు గావించి తత్తద్దేశ వ్యాప్త శిల్ప విద్యానైపుణ్యములఁ గాంచి యానందించితిని. దారిద్ర్యమన నెట్లుండునో యెఱుంగను. ఈపడుమ 'క్రీస్తుకొఱకు నేనేమి శ్రమలనందితిని.' అన్న ప్రశ్న 5 పదింబది నాకు స్ఫురింపఁ జొచ్చెను. అందుకుఁ దగిన సమాధానమును జెప్పఁ జాలకుంటిని. ప్రభువు నిమిత్త మెన్నెన్ని కష్టములనో చెందవలయు నని పౌలు చెప్పెను. క్రీస్తు మార్గము ననుసరించుట యన శ్రమల నందుటయే యని నిర్ధారణ సేయుటచేఁ గబ్బుఁడు సరియగు పద్ధతి నవలంబించెను. నే నెట్టి యిక్కట్టుల నందుచుంటిని? ఉద్యోగ ధర్మమునఁ దటస్థించు స్వల్ప మనఃక్లేశముల శ్రమలుగ భావింపఁ జనదు. పౌలు మున్నగు సనాతన క్రైస్తవులతోఁ బోల్చి చూచుకొనిన నే 6 ననాయాసమగు సకల సౌఖ్యాకర జీవితము ననుభవించు చుంటినని చెప్ప నొప్పును. ఈ స్థితి నిఁక భరింపఁ జాలను. ఇట్టి క్రైస్తు అనుసరణమును గర్హించుశబ్దము ముఖాముఖిని బెక్కుసారులు న న్నవమానించు చున్నది. నేను బ్రభుని యడుగు జాడల ననుసరించుట లేదు. ఇప్పుడు ప్రబలియుండు నాధ్యాత్మిక, సాంఘిక, నైతి కాచారములకు విముఖుఁడనై నా జీవిత శేషమును నిమ్నజా త్యుద్ధరణమునకై వినియోగించిన నే గాని మన శ్శాంతి లభింప నేరదు.

ఇట్లు దీర్ఘోపన్యాసమును గావించిన పిదప దీక్షితు లాసనోద్ధితుఁడై గవాక్షము చెంత కరుదెంచెను. ఇంటిముందు వీధి పగటివలెఁ బ్రకాశించుచుండెను. ఆమార్గంబున వచ్చుచుఁ బోవుచున్న ప్రజలఁ గొంతవడి 7 తిలకించి పిదపఁ 8 దిగులోహితుఁడై తనలోఁ బ్రజ్వలించుచున్న మానసాగ్నిజ్వాలల వెడలఁ గ్రక్కుచుండెనో యనునట్లు ఇట్లనెను.

దీక్షి—సోమయాజీ! మనము నివాసము సేయుచున్న యీ పట్టణము పంచ మహాపాతకుని పట్టణమును బోలినది. ఇచ్చట నాచరింపఁబడు మహాపాతకములు, దురవస్థలు, స్వార్థపరాయణత్వము, మున్నగు నవి తలంపునకు వచ్చిన గుండెలు నీరగుచున్నవి. ఐహిక సౌఖ్యాకరోన్నత పదవీ 9 చ్యుతుండనై నిరక్షర మగు నీ జన సామాన్యమునఁ జేరు కాల మెన్నఁడు సంప్రాప్తమగునో యని భయపడుచుండెడివాఁడను. కార్మికాగారములఁ బనిసేయు యావసాంగుల దౌర్భాగ్యదశను గాంచియును సర్వకాల సర్వావస్థలయందు స్వార్థమునే నెలకొల్పి పూజించి సాంఘిక ప్రజా పాలనములఁ దిలకించినను, ఆలకించినఁ బ్రేవులు తరుగుకొని పోవు దరిద్రుల దీనాలాపముల కించుకేని యలుకఁ జెందని ధన కనక వస్తువాహన సమృద్ధి గల శ్రీమంతుల చర్యలఁ బరికించినను, మద్యపాన 10 ద్యూతాంతక శాలల నవలోకించినను, 11 నిరుపాధికుల విలాపముల నాలకించినను, దేవాలయము లన నసహ్యపడు కోటానకోటి

---

1 ఆగొప్ప 2 కష్టమో 3 మిక్కిలి యానందము 4 విలువలేని 5 మాటిమాటికి 6 శ్రమలేని 7 చూచి 8 అగపడక 9 విడువఁబడినవాఁడనై 10 జూదము 11 దిక్కులేనివారి

ప్రజాసమూహంబును, నవరత్న ఖచిత హంసతూలికా తల్పంబులచే నమర్పఁబడి వానిపై సుఖాసీను లగు నిరర్థక దేశిక వర్గమును విలోకించినను, నేను భయ విస్మయాకుల మానసుండ నై వ్యర్థజీవనమునఁ గాలమును వ్యర్థపుచ్చితినిగదా. యని పరితపించు చుంటిని. 'నాసహోదరు లగు నీ బీదమానవుల నీ వాదరింపక పోవుటచే నన్నాదరించని వాఁడ వైతివి.' అని మన ప్రభువును రక్షకుఁడు నైన యేసుక్రీస్తు పలికిన వాక్యములు 1 నాశ్రవణ వివరంబుల ఘంటానాదంబుల పగిది మ్రోగుచున్నవి. నే నెప్పుడు స్వయముగఁ బోయి కారాగార బద్ధుల పాపుల నామయగ్రస్థుల నాదరించితిని? నా సామాజికులలో, ధనవంతులు, సముపత్తి గలవారు సదుద్యోగులు విద్వాంసులు భూస్వాములు మున్నగు సత్సంపత్తి గలవారితోడనే కాలక్షేపము గావించితిని. ఇందు నాకు శ్రమ యెచ్చట? ప్రభువు కొఱకు నేనేమి శ్రమపడితిని. మిత్రమా! నే నీవిషయముఁ దలంచుకొని నప్పుడు కొరడా దీసికొని వీపు పగుల గొట్టుకొన నుద్యుక్తుఁడ నైతిని. మార్టిను లూథరు కాలమున నేను జీవించువాఁడ నగునెడల 2 వివస్త్రమగు నావీపును గొరడా దెబ్బల కప్పగించి యుందును.

వెంకటసోమయాజి నిర్విణ్ణుఁడై నిర్జీవప్రతిమ వలెఁ దెల్లపోయి నిలువంబడెను. ఇంతటి మానసోద్రేకమున నున్నపు డెన్నఁడును దీక్షితుని జూడలేదు. అంత గది యంతయు నిశ్శబ్దముగ నుండెను. దీక్షితుఁడు తిరిగి సుఖాసనాసీనుఁడై తలవంచుకొనెను. సోమయాజి తుదకిట్లనెను—

సోమ—స్నేహితుఁడా! నీవు నామనోభావములను గూడ వెల్లడించితివని వేఱుగఁ జెప్ప నవసరములేదు. నేను కొన్ని సంవత్సరములనుండి యిటువలెనే యుంటిని. సకల సౌకర్యాకర జీవితమును గడపితిని. అట్లనుటచే దేవాలయ కార్య నిర్వహణమున నాకుఁ గష్టములు, మనఃక్లేశములు, భారములు, దటస్థింపలేదని కాదు. క్రీస్తు కొఱకు నేను కష్టము లనుభవించితినని చెప్పుటకు మాత్రము సాహసింపను. క్రీస్తు మీ కొఱకు శ్రమల ననుభవించి తన యడుగు జాడల ననుసరించుటకు మార్గదర్శియయ్యెను. అను పేతురుని వాక్యము సదా నాకుఁ గన్నులకుఁ గట్టినట్లుఁ ప్రత్యక్షమగుచుండెను. నేను సౌఖ్యములఁ దులఁదూగితిని. దారిద్ర్యమన నెట్టిదియో యెఱుంగను. సత్సాంగత్యమునకును 3 దేశాటనమునకును వలయు కాలమును వినియోగించితిని. నవనాగరకాదర్శములచేఁ బొందఁ దగిన సకల సౌకర్యముల ననుభవించితిని. దారిద్ర్యముచేఁ బ్రబలిన పుర పాపపుంజం బెల్ల ప్రళయ ఝంఝామారుతప్రాయమై దేవాగార 4 కుడ్యములకును నాయింటి గోడలకును విశేషముగఁ దాకుచుండెనుగాని రాతిగోడ లతి దృఢంబులగుటచే నే నా 5 కిల్బిష వీచీ పరంపరల గ్రహింపఁ జాలక పోతిని. ఈ దుస్థితిని భరింపఁజాలని యవస్థ నాకుఁ దటస్థించినది. నేను పురోహిత వర్గమును నిందించుటలేదు. అత్యాదరము కలదు. క్రైస్తవ సంఘమును నేను ద్యజింపను. సాంఘికాదర్శములు సమంజసములే. వానినంతరింపఁ జేయ నుంకింపను. నే నాచరింపఁదలంచిన విధానమువఁ గూడఁ గ్రైస్తవమత సంఘమును ద్యజించితి ననిపించుకొన నొల్లను. కాన నేనీ మతాధిపత్యమును ద్యజించిననే గాని ప్రభుపాద విన్యాసముల యథావిధిగ ననుసరింప నవకాశము లేదు. నే నిట్లొనరిం

1 నాచెవి 2 బట్టలేని 3 దేశసంచారము 4 గోడలు 5 పాపతరంగములు

చుటచే నితర మతాధిపులఁ గాని సామాజికులఁ గాని నిందింపను. నేను నీవలెనే తలంచుచుంటిని. ద్యూత మద్యపాన వ్యభిచారాది మహాపాతకముల కునికిపట్టయి యధోగతి పాలగుచున్న నిమ్నజాతులతోఁ గలసి మెలసి సంచరించి తదుద్ధరణమునకై నా జీవితశేషమును వినియోగింప సమకట్టితిని. అట్లాచరించుటకే మతాధిపత్యమును ద్యజింప వలయును. ప్రభువు కొఱకు నిక్కముగా శ్రమపడుటకు దీనిని మించిన మార్గము వేఱొండు గాన్పింపదు.—అనెను.

మరల వారిరువురి మధ్యను క్షణకాలము నిశ్శబ్దముగ నుండెను. వారు నిశ్చయించుకొనుచున్నది సాధారణ కార్యముకాదు. వారుభయులు నేకవిధంబున నాలోచనము చేసి యేకాభిప్రాయులైరి. లోకచారిత్రమును జక్కఁగ గుర్తించిన వారు 1 మేధావంతులు; నిదానము గలవారు; తాత్కాలికోద్రేకమున కెడ మిచ్చువారు కారు. తమ ప్రవర్తనమును, కాలోచితమును బూర్తిగ విమర్శింప 2 దక్షులు.

తన ముఖదర్పణమునకు నూత్న వికాసమును గల్పించు సహజ మందహాసమున దీక్షితు లెట్టకేల కిట్టులనియెను—

దీక్షి—నీవుఁ ద్రొక్కఁ దలంచిన దారియేది?

సోమ—పరోపకారమును విశేషముగ నాశించు చున్న బీదపాపుల మధ్యఁ జేరుటయే నాకు తోఁచిన దారియై యున్నది. నా యర్ధాంగలక్ష్మియు నా యుద్యమమునకు 3 సహకారిణియై విరాజిల్లుచున్నది. మన పట్టణమున మిక్కిలి దరిద్రులు నివసించు గూడెమున నొక గుడిసె నద్దెకుఁ దీసికొని యందు నివసింప నిశ్చయించుకొంటిమి.

దీక్షితుని మానసోద్రేక మిప్పటికి మిక్కుటమై పిక్కటిల్లినది. తానును దన మిత్రుఁడును నవలంబింపఁ దలఁచిన జీవితయాత్రా విధానమున 4 నిమగ్నమైన హృదయారవిందము కలవాఁడై "మనకు నివాసోచిత స్థానమును జెప్పెదను వినుము." అనెను. ఆ ప్రదేశ కథనాకర్ణమున సోమయాజి దీక్షితుని ప్రజాప్రేమాపారమును గ్రహింపఁ గలిగెను.

రాత్రి ప్రొద్దుపోవుదనుక నట్లే ప్రసంగించుకొనుచుఁ గూర్చుండిరి. విజనంబగు దూరదేశమునకు యాత్రార్థమై వెడలువారివలె నత్యుత్సాహముతో భావివిధానంబులఁ గూడఁ బలుకుకొనుచుండిరి. ఇట్లు జీవితాశయమును నిశ్చయించుకొనిన యాక్షణమున నెద్దియో పెద్ద బరువు దింపినట్లై మానసోల్లాసము హెచ్చెనని దీక్షితు లప్పుడప్పుడు తన మిత్రులతోఁ జెప్పుచుండును.

5 ఏతన్నిశ్చితానుసారముగఁ బూర్వము సారానువండు నొక పెద్దయింటిని వారద్దెకుఁ బుచ్చుకొని యందు నివసించిరి. నానా దురాచార సంకలితంబగు నీచవాటీ మధ్యమున నున్న దీగృహము. ఇది యొక క్రొత్తయూహ కాదు. మన రక్షకుఁడైన యేసుక్రీస్తు తన పితృగృహంబును వసతులను 6 ద్యజించిబీదలు, సుంకరులు, పాపులు నగు నీచ జనమధ్యమున నివసించి వారల నుద్ధరింపఁ బ్రయత్నించలేదా? కావున బుద్ధిమంతులు బీదలమధ్య నివసించి వారికివిద్యాబుద్ధులఁ గరపి సముద్ధరింపఁ బ్రయత్నిం

---

1 బుద్ధిమంతులు 2 తగినవారు 3 సహాయము చేయునది 4 మునిఁగిన 5 ఈ యేర్పాటునుబట్టి 6 విడిచి

చుట ప్రభువునాటిది గాని నవీనము కాదు. వీరిరువురును క్రీస్తుకొలువుఁ బొందఁ దలంచిన శ్రమకీ యూహ సమీపించినది. తమ పట్టణమున మిక్కిలి నిర్ధనులును పరమార్థ చింతారహితులు నగు వారి నుద్ధరింప బద్ధకంకణులైరి. తా మట్టివారి మధ్య నివసించినఁగాని వారి నెట్లు ఉద్ధరింప నగును! ఎద్దియో యొక విధమగు స్వార్థత్యాగమును చేసిననే గాని శ్రమానుభవ మెట్లు కలుగును! పట్టణమునందలి పాపకష్టదశలఁ బాల్గొనినచో స్వార్థత్యాగ మెట్లు స్వానుభవమునకు వచ్చును!

పరచింత లేక స్వవిషయముననే వారు పరస్పర మిట్లు వితర్కించుకొనిరి. క్రీస్తు ననుసరించెద మని తాము చేసికొనిన ప్రతిజ్ఞను 1 త్రికరణశుద్ధిగ సార్థక మొనర్ప నిట్లు ప్రయత్నించిరి. వారి ప్రతిజ్ఞ యిదియే. తత్పాలనకై యీ విధము నవలంబింప వలసి వచ్చిన నెట్లు వెనుదీయఁ గలరు?

దీక్షితులు ధనవంతుఁడు ఆతఁడు ధనాఢ్యుఁడని ఢిల్లీనగరంబునం గల వారెల్ల రెఱుంగుదురు. గ్రంథరచన వలన సోమయాజియుఁ గొంచెము ద్రవ్యము నార్జించెను. ఈ ద్రవ్యమున విశేష భాగమును వినియోగించి తమ నవీన నివాసమును బెక్కండ్రు గృహవిహీనులకు వాసయోగ్యముగఁ జేయ వీ రిరువురును సమకట్టిరి.

వీరి విషయ మిట్లు ప్రవర్ధమాన మగుచుండ ఢిల్లీక్రైస్తవ సంఘ చారిత్రము, అత్యుత్కృష్ట దశనందఁ జొచ్చెను. దేశిక ప్రబోధిత దైవానుకరణ మంత్రము ప్రజల నారాటపెట్టఁ దొడంగెను. ధర్మపురి క్రైస్తవ సంఘమునకుఁ గణ్యోపదేశ మెట్టి ఫలమును గలిగించెనో యిచట నట్లే జరిగెను. కాని యిచ్చటఁ బెక్కండ్రు ధనికులు పూర్వాచార పరాయణులు, కలరు. అట్టు లయ్యు నొక భానువాసరమునఁ బ్రాత రారాధనకై సోమయాజి స్వోచితోన్నత పీఠము నధిష్టించి తన వీడుకోలును సాంఘికులకు నివేదింప గ్రామ మెల్ల నల్లకల్లోల మయ్యెను. సోమయాజి యంతకు మున్నె తన నిశ్చితాభిమతమును ధర్మకర్తలకుఁ దెలిపినను వినియోగింపలేదు.

దీక్షితులు గూడఁ దన పదవిని 2 త్యజించెననియు వీ రిరువురును నిమ్నజాతుల మధ్య నివసించి తదుద్ధరణమునకుఁ దమ జీవితముల ధారవోయుచుండి రని తెలిసిన తోడనే ప్రజలలో 3 నత్యుత్కటోద్రేకము వొడమెను.

ఒకానొక ప్రాణమిత్రుఁడు దీక్షితు నిట్టి కార్యమునకు గడంగవలదని కన్నీరొడుకఁ బ్రార్థింపనిట్లు సమాధానము చెప్పెను.

దీక్షి—సోమయాజియు నేనును గలిసి చేయఁదలంచిన యీ కార్యమునకు మీ రిట్లు తల్లడిల్లనేల? ఆధ్యాత్మికప్రబోధము గావించుటకేర్పడిన మేము సకల కష్టనిష్ఠురములకు లోనగుచున్న నిరర్థకమానవకోటి నుద్ధరింపఁ బ్రయత్నించుటలో నసహజ మేమి కలదు? మేము బొంబయి, కలకత్తా మున్నగు ప్రదేశములకేగఁ దలంచి మా గురుత్వమును విసర్జించిన యెడలఁ గ్రైస్తవ సంఘములు ప్రజలును గూడ మే మెంతయో స్వార్థత్యాగుల మని కొనియాడి యుందురు. మన యూర మనమధ్య నివసించుచున్న నిరాధారులగు బీదమానవుల దురవస్థలఁదొలఁగింపఁ బ్రయత్నించు మమ్ము మీ రిట్టేల 4 యొగ్గడించెదరు? బీదల దురవస్థల స్వయముగఁ బరికించి నివారింప

1 మనశ్శుద్ధి, వాక్శుద్ధి, కాయశుద్ధి 2 విడిచెనని 3 మిక్కిలి యెక్కువయిన తొందర 4 పలికెదరు

నిరువురు బోధకులు తమ జీవితముల వినియోగింప నెంచుట యెంత వింతలోనిదియా? జీవాత్మల నుద్ధరించుటకీవిధానము నవలంబించుట యరుదా!

వీరిరువురు దీని నంత ఘనకార్యముగఁ దలంచుకొనక పోయినను ప్రజ లీ విషయము నద్భుతముగ ముచ్చటించుకొనసాగిరి. క్రైస్తవసంఘములు తమ యాశ్చర్యమును దీర్ఘమైన రూపమున వెలిబుచ్చఁ బ్రారంభించెను. అయ్యో! క్రైస్తవదేశమా! క్రైస్తవుఁ డెవఁడైనఁ బ్రభ్వాజ్ఞా పరిపాలనమునకై స్వార్థత్యాగమును గావించిన వింత పడునంతటి యవస్థ సంప్రాప్తమైనదా? నీదృష్టికిట్టి కార్యము లసహజము లయ్యెనా!

దైవానుకరణ ప్రతిజ్ఞ నామోదింపనివారికిఁ గొంత సుకరముగనే దోఁచినను మొత్తముమీఁద సామాజికులలోఁ బెక్కండ్రు సోమయాజిని విడఁచుటకై పరితపించిరి. ఏతత్ప్రతిజ్ఞా పాలనమున లౌకిక వ్యాపార 1 నిరోధము కలుగునని భయపడి దూరముగ నున్నవారెల్లరు సోమయాజి నత్యంత గౌరవప్రపత్తులతోఁ బరికించిరి. వాని యోగ్యతాతిశయముల వారు చిరకాలమునుండి యెఱుంగుదురు. కాని యిట్టి త్యాగబుద్ధి కలవాఁడని గుర్తింపరైరి. తన నవీనాదర్శానుగుణముగఁ 2 గర్తవ్యమును యథావిధి నివర్తించెనని తలంచిరి. ఆతఁడు నాటిన యీ బీజ మెన్నటికిని నశింపలేదు. ఆతనితో నా ప్రతిజ్ఞను గావించిన వారెల్లరు నేతత్సంఘమునఁ గార్యదర్శిప్రాయులైరి.

వర్షకాల మంతరించి శీతల వాత ప్రచారము మెండయ్యెను. దీక్షితు లొకనాఁడు తా మేర్పరచిన సత్రమునుండి బయలువెడలి యొక క్రొత్త మిత్రునిఁ జూడఁబోయెను. కొన్ని గుడిసెలు దాటిపోవునప్పటి కొక క్రొత్తదుకాణ మాతనికి దృగ్గోచర మయ్యెను. తత్ప్రాంత ప్రజలంద ఱాతని కింకను బూర్ణపరిచితులు కాలేదు. కావునఁ బ్రతిదిన మాతనికిఁ గ్రొత్త మానవులును, ప్రదేశములును దటస్థించుచున్నవి.

చీనాదేశపు చాకలివాండ్ర యింటిప్రక్కనున్న యొక చిన్నయిల్లు వానికిప్పుడు కాన్పించెను. అందు మిక్కిలి పరిశుభ్రముగ నుంచఁబడిన రెండు కిటికీలు కలవు. ఇచ్చటఁ బరిశుభ్రముగనుండుటయే మొదటి వింత. ఆయరలలోఁ జక్కని 3 పచన పాత్ర లుంపఁబడినవి. ప్రతిపాత్రమీఁదను ధరలు వ్రాసియుండెను. సకల 4 మలీమస సంకులంబగు దరిద్రుల కాలవాలంబైన యీ పేటలో నిట్టివి గానఁబడుటచే దీక్షితున కత్యాశ్చర్యము కలిగెను.

ఆతఁడు నిర్ఘాంతపడి యాగవాక్షమువంకఁ జూచుచు నిలువంబడియుండ నంతలోఁ దటాలున నా కుటీరద్వారమును దెరచి చకోరాక్షి బయటికివచ్చెను.

దీ—చకోరాక్షీ! నాకుఁ దెలియకుండ నేనుండు నీ పేటలోని కెప్పుడు వచ్చి ప్రవేశించితివి?

చ—నీవు నన్నింత త్వరగా నెట్లు కనిపెట్టఁ గలిగితివి!

దీ—నీ వెఱుంగవా! ఈ పేటలో శుభ్రముగానుంచిన కిటికీ లివియే.

చ—నేను నట్లే యనుకొనెదను.

అని దీక్షితున కింపుఁగలిగించు మందహాసమును గావించెను.

దీ—నాకు ముందుగఁ దెలుపకయే ఢిల్లీనగరమునకు రానేల సాహసించితివి? అందును నాకగోచరముగ నీ ప్రదేశము నెట్లు జేరితివి?

---

1 అడ్డు 2 చేయఁదగినది. 3 వంటగిన్నెలు 4 మురికి

చకోరాక్షి మున్నొకప్పుడు నాగరక దశ ననుభవించిన దగుటచే నాయున్నతావస్థను దీక్షితులు తిరిగి స్మరించెను. అంతమాత్రమున నాతఁడు తిరిగి యాపదవిం గోరె నని భావింపఁ జనదు. చకోరాక్షి తానెప్పుడు చనవుగఁ బిలుచురీతిని దీక్షితునితో నిట్లనెను.—

చకో—గురువర్యా! నీవు స్వీయ నిర్ణయ సూత్రప్రచారంబున నెంత మునిఁగి తేలుచుంటివో నే నెఱుంగుదును. నే నేర్పఱచుకొనిన విధానంబుచే నీకాయాసమును గలిగింపఁ దలంచుకొనలేదు. ఇంతియె కాదు. నీ యుద్యమమునకు నేను దోడ్పడెదను. నిన్నుఁ జూచి నీసదుపదేశమును వడయుటకే బయలువెడలితిని. నేను ప్రస్తుతము శారదాంబగారి యింట నివాస మేర్పరచుకొంటిని. ఇందు మూఁడుగదులు కలవు. నే నొక గదియం దుంటిని. సుమతి ధనసహాయముచే సుగుణవతియొద్ద గానవిద్య నభ్యసించిన మఱియొక యువతి రెండవగదియందున్నది. 1 గృహిణియగు శారదాంబ మూఁడవ గదిలో నున్నది. ఈ పాటకురాలు నిమ్నజాతులనుండి వచ్చినది. పరిశుద్ధాహారమును వడయు మార్గమును బామరులకు నేర్ప నెంచితిని. నేను 2 సూదవిద్యయందు నిపుణను. నాయుద్యమమునకు నీవు తోడ్పడెదవా?

దీ—నిశ్చయముగా నే నట్లే తోడ్పడియెదను.

చకోరాక్షిని ఆమె తీవ్రసంకల్పమును సమర్థతను గాంచి దీక్షితుం డద్భుతము నందెను.

చ—మీ ధర్మసత్రమునఁ గమలము వీణాగానముచేత నానందము గొలుపఁ గలదు. చిత్రపక్వాన్నములచే నేను సంతోషమును గలిగింపఁ గలను. ముందు నే నిచ్చట స్థాయి నేర్పఱచుకొని పిదపఁ గర్తవ్యమునకు గడంగ వచ్చు నని యెంచితిని. నే నిప్పుడు నాదినాహారమును సమార్జించుకొనఁ గలిగితిని.

దీ—అటులా! ఎట్లు? వస్తువులఁ జేయుటచేతనా?

అని తత్తరపాటుతో ననెను.

చ—( 3 కొంచెదసహ్యమును వెలిబుచ్చుచు) ఆవస్తువులా? అయ్యా! అవి మన పట్టణమునఁగల భోజన పదార్థములలో నెల్ల స్వచ్ఛమైనవియు చక్కఁగఁ బచనము సేయఁ బడినవియు నని పందెము చరచి చెప్పఁగలను.

దీక్షి—నేనా విషయమున సంశయించుటలేదు. కాని భక్ష్యముల మంచిచెడ్డలు రుచివలనఁ గాని గోచరము కాదు.

చ—లోని కరుదెంచి చవిజూచియే 4 నిర్ధరింపుఁడు. పాప మొక మాసము నుండి 5 రుచిరాహారమును గుడిచి యెఱుంగరు కాఁబోలును.

దీక్షితుని లోనికి రమ్మని బలవంతపెట్టెను. అచ్చట కమలము కూర్చుండి యుండెను. ఆమె 6 నిషాదబాలిక. ఆమె ముంగురు లుంగరములు చుట్టుకొని యుండెను. సంగీతశాస్త్రమును నెమరవేయుచుండెను.

చకో—కమలా! పాడుము. పాడుము. వీరు దీక్షితులవారు. వీరిని గురించి నేను నీతోఁ బెక్కుసారులు ముచ్చటించితిని. ఆచార్యవర్యా! తా మీ యాసనము

---

1 ఇంటి యజమానురాలు 2 పాకశాస్త్రము 3 కొంచెమయిష్టత 4 నిశ్చయము చేయుఁడు 5 ఇష్టపదార్థము 6 చెంచుచిన్నది

నధివసింపుఁడు. బనారసుకాజా, మైసూరుపాకము మున్నగు వివిధ మధుర పదార్థము లించుక రుచిచూడుఁడు. మీరు మిక్కిలి యాకలిగొని యుంటిరనుకొనెదను.

ఇట్లు చకోరాక్షియు దీక్షితులును గూర్చుండి యల్పాహారముల నారగించిరి. నిజమాడవలసిన దీక్షితులు కొన్ని వారములనుండి భోజనమునకు విశేషకాలము వినియోగించుటలేదు. కావున నీ వివిధ 1 పక్వాన్నముల నత్యాదరముతో భుజించి చకోరాక్షి పచన నైపుణ్యమును గొనియాడెను.

చ—దేశికోత్తమా! మీరు మున్ను ధనాఢ్యుల యిండ్ల గొప్ప విందులకుఁ జనినప్పుడు లభించిన పిండివంటలతోఁ దుల్యముగ నుండెనని యెంచెద రనుకొనెదను.

దీక్షి—తుల్యమనెదవా! చకోరాక్షీ! వీని ముందా పదార్థములు చెత్తయని చెప్పనొప్పును. నీవు మాసత్రయమునకు రావలయును. మే మచ్చటఁ జేయుచున్న కార్యముల నీవు చూడఁగోరెదను. నీ విచ్చట నీ రీతిని జీవనోపాధి నార్జించుకొనుచుండుటం గాంచ నాశ్చర్యముగ నున్నది. నీ వేర్పరచుకొన్న విధానము నాకు బోధపడుచున్నది. నీవు మాకు మిక్కిలి సహకారిని గాఁగలవు. నీవు నిశ్చయముగ నిచ్చటు నివసించి యీ ప్రజలకు స్వచ్ఛాహార ఫలమును దెలుప నెంచితివా?

చకో—త్రికరణశుద్ధిగ నా యుద్యమ మదియే. నే నీ ప్రజలకు బోధింప నెంచిన సువార్త యిదియే. నే నిట్లాచరింపఁ జనదా?

దీ—అగు నగును. నీ యుద్యమ 2 ముత్కృష్టమైనది. దీనికిట్టి తలంపును గలిగించి నందులకు భగవంతుఁడు స్తోత్రపాత్రుఁడు. నేను నాగరిక ప్రపంచమును ద్యజించినప్పుడు 3 అధునాతన 4 యువతీజనంబును గూర్చి మిక్కిలి ముచ్చటించుకొనుచుండిరి. నీ వాగణమునఁ జేరిన దానవైనచోఁ ద 5 దౌద్ధత్యమునకు నే నిప్పుడే సమ్మతినొసంగుచుంటిని.

చ—(మందహాసముతో) ఇంకను స్తోత్రపాఠములేనా! నీచస్థానమునఁ బ్రవేశించినను స్తవ 6 విమోచనము కలుగవలదా?

ఈ ప్రాంతములఁ గొన్ని నెలలనుండి పాపభూయిష్ఠమైన విషయములు 7 దృక్శ్రోత్ర గోచరములగుచుండుటచే దీక్షితుని మానసము వికలమైయుండినను చకోరాక్షి పలికిన ఈ మాటలు వాని కాహ్లాదమును గొలిపెను. ఇవి మంచిమాటలు దైవసంబంధమైనవి.

చకోరాక్షి సత్రమును జూడఁగోరి దీక్షితునితోఁ గూడ నచ్చటికేగెను. విశేషధనమును మేధాశక్తిని భగవదర్పితముగ వినియోగించుటచే నీ స్వల్పకాలమున నత్యద్భుతమగు మార్పా ప్రదేశమునఁ గలుగుటం గాంచి యామె విడ్డూరపడెను. వారు సత్రములోని భాగములన్నిటిని దిరిగి చూచుచు మాటలాడుకొనుచుండిరి. ఉత్సాహమునకుఁ జకోరాక్షి పుట్టినిల్లు. ఉత్సాహశక్తి యీమె యందు మూర్తీభవించెను. అని దీక్షితులు గూడ భ్రమజెందెను.

వారు మొదటి యంతస్తునకు దిగినప్పుడు దీక్షితు లొక కవాటమును ద్రోసెను. ఆ లోపలి నుండి వడ్రంగులు పనిచేయుచున్న శబ్దము వినవచ్చెను. అది యొక చిన్న కొయ్యపనివాండ్ర దుకాణము. అందొక యువకుఁడు జమ్ముటోపీని ధరించి చిత్రిక

---

1 వంటకములను 2 గొప్పది 3 ఇప్పటి 4 స్త్రీలు 5 ఉన్నతికి 6 విముక్తి 7 కనులు చెవులు

గుల్లను సారించి యొక పేకపలకను దోముచు నీలవైచుచుండెను. వీ రిరువురును లోనఁ బ్రవేశింపఁగనే తిరిగి చూచి 1 శిరోవేష్టమును దొలఁగించెను. అట్లు చేయుటలో నొక చిత్రికపాట్టు చుట్టు వాని వ్రేలి నంటుకొని 2 శిరోజములలోఁ దగుల్కొనెను.

దీక్షి—తిమ్మయ్యా! ఈమె చకోరాక్షి; తిమ్మయ్య వారమునకు రెండు పూటలు మాకుఁ దోడ్పడుచుండెను.

ఇంతలో నెవ్వరో దీక్షితుని బిలుచుటచే నిప్పుడే తిరిగి వచ్చెద నని చెప్పి వారి నిరువురి నచ్చట విడిచి వెడలిపోయెను.

చ—మన మిదివరలోఁ గలిసికొంటిమి.

తిమ్మ—అగును. దీక్షితు లనునట్లు పూర్వప్రపంచమున.

అని చిత్రిక గుల్లన సారించఁబోయెను గాని వాని చేతులు వణఁకసాగెను.

చ—(కొంచెము సంకోచించుచు) అగును. మి మ్మిప్పుడు చూచుటచే మిక్కిలి సంతోషముగ నున్నది.

తిమ్మ—(ఆనందముచే ముఖమునరక్తిమ దోప) అటులా! అటుపిమ్మట నీకు మిక్కిలి కష్టములు తటస్థించినవి.

అని యామెకుఁ గష్టకాలము స్మరింపఁజేసితినో యని పశ్చాత్తప్తుఁ డయ్యెను. కాని యామె కష్టదశ లన్నియు మారిపోయినవి.

చ—అగును. మీ విషయము నట్లేగదా! మీ కీ ప్రాంతములఁ బనిసేయుట యెట్లు లభించినది?

తిమ్మ—చకోరాక్షీ! అది యొక పెద్దగాథ. నా తండ్రి తన భాగ్యమునంతను గోల్పోవుటచే నే నీ వృత్తి నవలంబింప వలసి వచ్చినది. ఇది నాకు మంచినే కలిగించినది. నే నందులకుఁ గృతజ్ఞుఁడనై యుండవలెనని దీక్షితులవా రనిరి. నే నట్లే యుంటిని. నే నిప్పు డపరిమితానందమున నోలలాడుచుంటిని. ఎప్పుడైన నుపయోగించు నని నేను వ్యావహారిక విద్య నభ్యసించితిని. నే నిప్పు డొక 3 యన్నవిక్రయసత్రమున రాత్రులఁ బనిసేయు లేఖరిగ నుంటిని. ఆ భానువాసరోదయమున నీవు దైవానుకరణ ప్రతిజ్ఞఁ గావించినప్పుడే తదితరులతోఁ గూడ నేను నా శపథమును జేసితిని.

చ—అట్లు కావించితివా! మిక్కిలి సంతోషము.

ఇంతలో దీక్షితులు తిరిగి వచ్చెను. పదంపడి దీక్షితులును జకోరాక్షియుఁ గలిసి వెడలిపోయిరి. తిమ్మయ్య తన పనిని జేసికొనుచు నచ్చటనే యుండెను. ఇప్పు డాతఁడు పనిసేయుచు మునుపటికంటె నధికముగ నీలవైచు చున్నట్టు లచ్చటివారు కనిపెట్టిరి.

దీ—చకోరాక్షీ! తిమ్మయ్యను నీ వింతకుము న్నెఱుంగుదువా?

చ—ఆచార్యవర్యా! పూర్వ జగంబున ఢిల్లీ దేవతాయతన సంఘమున నీతఁడు నాకుఁ బూర్వపరిచితుఁడు.

దీ—అట్లా?

చ—మే మత్యంత స్నేహభావంబున మెలంగితిమి.

దీ—"అంతకు మించలేదా?" యని సాహసించెను.

---

1 తలగుడ్డ 2 తలవెండ్రుకలలో 3 పూటకూళ్ళ యిల్లు

చకోరాక్షి ముఖకమల మొక్క క్షణకాలము నూత్నవికాసము నందెను. పిదపc దీక్షితుని దేరిపారc జూచి యిట్లనెను—

చ—అంతియే నిశ్చయముగా మరేమియు లేదు.

"ఆ యువకు లన్యోన్యము సమీపించుట కిదియే లోకరీతి యని దీక్షితులు తనలోc దాననుకొనెను. ఏలాకో యీ యూహ వానిని విడువదాయెను. తన యవ్వనదశ స్మరణకు వచ్చెను. చకోరాక్షి వాని యనుజ్ఞం గొని వెడలిపోయిన వెనుకc గూడ వాని దశ్రుకణంబు లొలుకc, "ప్రేమానుబంధములు గూడ నైజములే గదా! అనురాగము నాకంటె వృద్ధు" అనుకొనెను.

తరువాత వారమున దీక్షితునకుc గ్రొత్త శ్రమలు కలిగెను. కట్టుపనివాండ్రు తమ పనుల నిలిపి సమ్మెకట్టిరి. వాండ్ర సమావేశమున కేగి రాత్రి ప్రొద్దుపోయి తిరిగి వచ్చుచుండ నిరువురు దుష్టమానవులు పొదలమాటున నుండి పటాక్షేపముగ దీక్షితున కభిముఖులై నిలువంబడిరి. వారిలో నొకండు, పిస్తోలును దీక్షితుని ముఖసమీపమున నుంచెను. రెండవవాండు కంచెనుండి యూడc బెరికిన కొయ్యతో వానిc గొట్ట నుంకించెను.

వారిలో పిస్తోలును బట్టినవాండు "నీ చేతులను వడిగc బై కెత్తుము" అని క్రోధారుణిత నేత్రుండై యరచెను. అది 1 నిర్జనప్రదేశము. వాండ్రం 2 బ్రతిఘటించు తలపే దీక్షితునికి గలుగలేదు. వాని యాజ్ఞ ననుసరించెను. కఱ్ఱc బట్టుకొనినవాండు దీక్షితుని జేబులc బరిశోధింపc జొచ్చెను. దీక్షితులు బహు శాంతముగ నుండెను. వాని నరముల వణకు జనింపలేదు. 3 ఊర్ధ్వబాహుండై నిలువంబడిన దీక్షితుని పరు గెవరైనc జూచిన నాతండా దొంగల నుద్ధరింపు మని భగవంతుని బ్రార్థించు చున్నట్లూహించును. ఆతc డట్లే ప్రార్థించెను. వాని ప్రార్థన మారాత్రియే ఫలించెను.

దశమాధ్యాయము సంపూర్ణము.

---

1 మనుష్యులు లేని చోటు 2 మార్కొను 3 చేతులెత్తి

శ్రీ

# దైవానుకరణము.

## ఏకాదశాధ్యాయము.

దీక్షితులు తనతోఁగూడ సొమ్ము తీసికొనిపోవు స్వభావము కలవాఁడు కాఁడు. వాని జేబులఁ బరీక్షించిన 1 స్తేయి తన కేమియు లభింపమికి 2 విషాదము నంది దూషణ తిరస్కార వాక్యములఁ బలుకుచుఁ గొంచెము చిల్లరదక్క వే రేమియు లేదనెను. ఆమాటల నాలకించి పిస్తోలును బట్టుకొనినవాఁడు "వాని జేబునుండి గడియారము నూడఁబెరుకుము. లభించునదెల్ల సంగ్రహింతము" అనెను.

రెండవ వాఁడు చేయిఁ జూపి గడియారపు గొలుసును బట్టుకొనఁ బోవుచుండ వెనుకనుండి యెవరో వచ్చుచున్న యడుగుల చప్పుడు వినఁబడెను.

"పొదలమాటునకు రమ్ము మే మింకఁ బూర్తిగ వెదకలేదు. అధరస్పందమును గావింపకుము. లేనిచో—" అని ప్రథముఁడని తన చేత నున్న 3 మారణ యంత్రమును వానికిఁ జూపించెను. వాని సహకారి దీక్షితుని బొదలమాటునకు బడబడ యీడ్చుకొని పోయెను. పాంథులు దాటిపోవుదనుక వారు ముువ్వురు నిశ్శబ్దముగ నుండిరి.

ప్రథ—వాచి నూడలాగితివా?

ద్వితీ—లేదు. గొలుసెచ్చటనో తగులుకొనియున్నది.

ప్రథ—అట్లయిన దానిం ద్రెంపుము

దీక్షి—"దానిం ద్రెంపకుఁడు. నాకు మిక్కిలి పరమాప్తుఁడగు నొకమిత్రుఁడు దీని బహుమాన మొసంగెను. దాని ద్రెంపుచుండఁ జూచి సంహింపఁజాలను." అని మొదటిసారి నోరుదెరచి పలికెను.

దీక్షితుని వాక్యములు 4 శ్రవణ వివరంబులఁ బడినతోడనె 5 ప్రథమస్తేయి తన చేతినున్న 6 యాగ్నేయాస్త్రము తన్నే మార్కొనె నని భ్రమఁజెంది యులికి పడెను. హఠాత్తుగఁ దన ద్వితీయకరంబున గురు శిరంబు నవలంబించి కొంచెము వెలుఁగుగల వైపునకుఁ ద్రిప్పి సమీపించి వాని ముఖమును బరిశీలించి చూచెను. పిదపఁ దన సహాయుఁ డదరిపడున ట్లిట్లనెను.

"జేబులోని చిల్లర దొరకిన దంతియే చాలును. వాచి 7 నాకర్షింపకుము."

"చాలునా! నాలుగణాలు దీనితో—" అని రెండవవాఁ డేమియో యనఁ బోవుచుండఁ బ్రథముఁడు తన చేతఁగల పిస్తోలు పృష్ఠమును వాని 8 యుత్తమాంగమునకుఁ దాఁకెను.

ప్రథ—ఆవాచిని విడువుము. చిల్లరను గూడ యథాస్థానమునఁ జేర్పుము. మనము దీక్షితుని బట్టుకొంటిమి, ఆచార్యుఁడు—దీక్షితులు—వినఁబడుచున్నదా?

---

1 దొంగవాఁడు 2 విచారము 3 చంపుసాధనము 4 చెవి 5 మొదటిదొంగ 6 పిస్తోలు 7 తీసికొనకుము 8 తలకు

ద్వితీ—దీక్షితులైన నేమి ? గీక్షితులైన నేమి ? మన దేశము నేలుచున్న రాజప్రతినిధియైన నొంటిపాటునఁ జేఁ జిక్కిన వాని 1 సర్వస్వము నపహరింపక విడుచుట చోరధర్మమా ?

ప్రథ—చిల్లర జేబులోఁ బడవేయుము. లేనియెడల నుత్తరక్షణమున నీ శీర్షమును ప్రక్కలు చేసెదను. దానితో నీ తిక్క దిరుగును.

తన మిత్రునియందుఁ గలిగిన యీ మార్పునకు ద్వితీయుఁ డొక్కక్షణ మాలోచించెను. పిదప నసమ్మతముగ నా డబ్బులను దీక్షితుని జేబులోఁ బడవైచెను.

ప్రథ—అయ్యా ! మీరు మీ చేతులను క్రిందికి దింప వచ్చును ? అని దీక్షితునితోఁ జెప్పి తీయ నాయుధపాణిని గూడ సడలించెను. కాని ద్వితీయు నింకను సంకోచముతోఁ 2 దిలకించుచుండెను. 3 ఉన్నమిత పాణియుగంబును యథాస్థానమునం జేర్చుకొని దీక్షితులు వారియువురిని గన్నెత్తి చూచెను. కనుచీకటి పనుటచే వారిం గుర్తింప వీలు కలుగలేదు. అతని కప్పు డభ్యంతర మేమియుఁ లేకపోయినను గదలక యచ్చటనే నిలిచియుండెను.

“మాకొఱకు మీ రింక నిలిచి యుండ నవసరము లేదు. వెళ్ళిపోవచ్చును.” అని ప్రథముఁడు దీక్షితునితోఁ జెప్ప సమీపముననున్న రాతిపైఁ గూర్చుండెను. ద్వితీయుఁడు తన కఱ్ఱతో నేలను ద్రవ్వుచు క్రూరదృష్టితోఁ బ్రథముని జూచుచుండెను.

“నే నందులకే నిలిచి యుంటిని.” అని దీక్షితులు సమీపమున నున్న కంచె కఱ్ఱపైఁ గూర్చుండెను.

ద్వితీ—(వికటహాసముం గావించి మొరటుగ నిట్లనెను.—) మీకు మా సహవాస మాహ్లాదముగ నుండెఁ గాఁబోలును. ఒకొక్కకప్పుడు ప్రజలకు మమ్ము విడిచి పోవుట దుర్లభముగ నుండును.

ప్రథ—నోరు మూయుము. మనము నరకమార్గమునఁ జాలదూరముపోతిమి. మనకది చాలదా ? మనము సైతానును విడిచి సత్సాంగత్యము నపేక్షింపఁదగియున్నది.

“మీ కందులకైన నన్ను బచరింప నిచ్చిన—” అని దీక్షితులు నెమ్మదిగ దీనస్వరముతో ననెను. 4 ఉపలాసీనుఁడు మహాంధకార మైనను దీక్షితుని దదేక దృష్టితోఁ జూచెనుఁ ఒక క్షణకాల మూరకుండి తానొకప్పుడు తిరస్కరించిన మార్గము నవలంబింపఁ 5 గృతనిశ్చయుఁడైన వానివలె నెమ్మదిగ నిట్లనెను—

“మీరు నన్నెప్పుడైనను జూచిన జ్ఞాపకము గలదా ?”

దీక్షి—లేదు. వెలుఁగు తక్కువగ నుండుటచే నిన్ను జక్కఁగ జూచుటకు నా కవకాశము చిక్కలేదు.

ప్రథమ 6 మల్లిమ్లుఁచు డాకస్మికముగఁ దన శిరోవేష్టమును దీసి, లేచి దీక్షితుని దాపునట్లు సమీపించి—.

“మీరు నన్నెప్పుడైన డానవాలు పట్టితిరా ? ” అనెను.

వాని శిరోజములు 7 జీమూతప్రాయముగ నుండెను. నడినెత్తిని మాత్ర మరచేతి గుంటయంత తెల్లని మచ్చ యుండెను. దీక్షితు లా మచ్చం గాంచిన తోడనే

---

1 సకలధనము 2 చూచుచుండెను 3 ఎత్తబడిన 4. రాతిపైఁగూర్చున్న వాఁడు. 5 నిశ్చయము చేసికొనిన 6 దొంగ 7 మేఘమువలె

దద్దరిల్లెను. పదునేను వత్సరముల క్రిందటి విషయము లాతనికి జ్ఞప్తికి వచ్చెను. పూర్తిగ జ్ఞప్తికి దెచ్చుటకు వాఁడు దోడ్పడెను.

ప్రథ—పూర్వము 1905 సంవత్సరమున నొకఁడు మీ యింటికి వచ్చి కాశ్మీర దేశమునఁ దన భార్యయు, సంతతియు నొక యుద్దియింటఁ గాలి చచ్చిరని చెప్పిన విషయము మీకు జ్ఞాపకము లేదా ?

" అగును. నాకిప్పుడు జ్ఞాపకమునకు వచ్చుచున్నది. " అని గొణుగుకొనుచు దీక్షితులు ప్రత్యుత్తరమిచ్చెను. ద్వితీయ 1 పాటచ్చరుఁడీ గాథను వినుట కుత్సాహ పడుచుండెను. తన చేతికఱ్ఱతో నేలను ద్రవ్వుటను మాని నిశ్చలముగ నిలుఁవఁబడి వినుచుండెను.

ప్రథ—నన్నా రాత్రి మీ యింటనే యుంచుకొని మరునాడు నా కొద్దియైన పనిని సమకూర్చుటకు మీ రెంతయో శ్రమపడితిరి. తుదకు మీరు నా కొక కర్మాగారంబునఁ బని నిప్పింపఁ గలిగితిరి. నన్ను మద్యపాన విముఖుని గమ్మని మీ రన నే నందుల కంగీకరించితిని.

దీక్షి—ఇప్పుడు నా కా విషయ మంతయు స్మరణకు వచ్చినది. నీవు నీ వాగ్దానము ననుసరించితి వనుకొనెదను.

దొంగ మృగప్రాయుఁడై యట్టహాసముం గావించెను. పిదపఁ దన ముఖమునుండి రక్తము వెడలు నంత తీవ్రమునఁ దన కరయుగంబున మోదుకొనెను.

ప్రథ—అనుసరించితివా యని యడుగుచుంటిరా ! ఈ వారములోఁ గూడ నేను తప్పఁద్రాగితిని. అప్పటినుండియుఁ ద్రాగుచునే యుంటిని. కాని మిమ్ముఁ గాని మీ రొనరించిన ప్రార్థనను గాని 2 విస్మరింపఁ జాలకుంటిని. నేను మీ యింటి కరుదెంచిన మరుచటి యుదయమునను, మధ్యాహ్న భోజనానంతరమునను దాము భగవంతుని గూర్చి ప్రార్థించుచు నన్ను గూడలోనికిం బిలిచి మిగిలిన వారితోఁగూడఁ గూర్చుండఁజేసితిరి. జ్ఞాపక మున్నదా? ఆ విషయము నా హృదయము నాకర్షించినది. చిన్నప్పుడు మా తల్లి ప్రార్థించుచుండెడిది. నేను బాల్యదశయం దుండ నా పర్యంక ప్రాంతమున నామె సాగిలఁ బడి ప్రార్థించు రీతి నా కిప్పటికిని గన్నులఁ గట్టినట్లు ప్రత్యక్ష మగుచుండును. ఆమె పూర్వోక్త విధానంబున నొకనాఁడు నా మంచము దరిని ప్రార్థించుచుండ నాజనకుఁడు మద్యపానోన్మాదంబున నొడలెఱుంగక లోనఁ జొరబడి యామెం దన్నెను. కాని నాటి యుదయమునఁ దాము గావించిన ప్రార్థన నెన్నటికిని మఱువఁ జాలను. నా తల్లి నా కొఱ కెట్లు ప్రార్థించెనో మీరు నట్లొనర్చితిరి. నేను మొదటి మానిసినిగ నుంటి నని గాని, తప్పఁ ద్రావి యొడలెఱుంగని స్థితితో మీ యింటికి వచ్చితినని గాని మీరు నన్ను నీరసముగఁ జూడరైతిరి. దైవమా ! నే నెంత దౌష్ట్యముగ జీవించితిని. కల్లంగడియే నా కిల్లయి నరకమునకు దారిఁ జూపినది. అట్టు లయ్యుఁ దాము గావించిన ప్రార్థన నన్నెడబాయలేదు. నే నికఁ ద్రాగ నని మీతోఁ జేసిన వాగ్దాన మొక పక్షమున వేయి సారులు అవమానింపఁ బడినది. తాము సమకూర్చిన పని పోయినది. పిదప దివసద్వయంబు పరీక్షక భటులచేఁ బట్టుకొనఁ బడితిని. కాని మిమ్మును మీ ప్రార్థనను

1. చోరుడు, 2. మరువ.

విస్మరింపఁ జాలక పోతిని. దాని వలన నా కేమి ఫలితము కలిగినదో చెప్పఁజాలను గాని మరపునకు మాత్రము రాదు. నేను మీ కట్టి యపకృతిం గావింపను. పరుల నట్లు చేయనీయను. కావునఁ దాము యథేచ్ఛముగ వెడలి పోవచ్చును."

దీక్షితులు కదలలేదు. ఎచ్చటనో దేవాలయ 1 ఘటికాయంత్ర మర్ధరాత్రమును దెలియఁజేయుచు మ్రోగెను. వాఁడు తన కళ్ళాయిని దిరుగ నెత్తిపైఁ బెట్టుకొని పాషాణముపైఁ గూర్చుండెను. దీక్షితుఁ డెద్దియో దీర్ఘాలోచనమును గావించుచుండెను. కొంతవడికి "నీ కెంత కాలమునుండి పనిలేదు?" అనెను ప్రథమునికి బదులుగా ద్వితీయుఁడు ప్రత్యుత్తరము నిచ్చెను.

ద్వితీ—ఆఱుమాసములనుండి మే మిరువుర మేపనియుఁ జేసి యెఱుంగము. 2 మార్గావరోధమే మేము చేయుచున్న పని. నేటి రాత్రివలె లేచి యుండియు నేమియు నార్జింపఁ జాలనప్పు డీ పనియు విసుపును గలిగించుచుండును.

దీ—మీయిరువురికిని నేను తగిన పనుల నుపకార్పిన నీచోరవృత్తిని మానెదరా?

ప్రథ—ఏమి ప్రయోజనము. నే నిట్లెన్ని సారులోఁ ప్రయత్నించితిని. ప్రయత్నించిన ప్రతి పర్యాయమును మఱింత యధోగతిఁ జెందుచు వచ్చితిని. సైతాను నన్నదివఱకే మ్రింగివైచినది. కాలాతిక్రమణ దోషము పట్టినది.

దీక్షితున కిప్పు డీ యాత్మల నుద్ధరింప వలయునని కలిగినంత దీవ్రసంకల్పము మున్నెన్నఁడును గలుగలేదు. వీండ్ర చర్యం గాంచుచు నాతఁ డచ్చటఁ గూర్చుండిన యంత కాలమును "ప్రభువైన దేవా! యీ యిరువురి నుద్ధరించుటకు నన్ను నిమిత్త కారణముగ ననుగ్రహింపుము. అందులకు నే నత్యాశ పడుచుంటిని. వీరిని నాకు దయ చేయుము." అని ప్రార్థించు చుండెను.

దీ—అట్లనకుఁడు. మీ యిరువురి వలన భగవంతున కేమి కావలయును నా కేమి కావలయు ననునది ప్రధానాంశము కాదు. ఈ విషయమున నే నాచరించునది భగవత్సంకల్పము. మిమ్మిరువుర భగవంతుఁడు మిక్కిలి విలువగఁ బరిగణించు చున్నాఁడు.

ఇప్పుడు దీక్షితుని మేధాశక్తి యంతయుఁ బొడ్పడెను. ప్రథముని పేరుజ్ఞాపకమునకు వచ్చెను. వానిం బేరు పెట్టి పిలిచి దీనాలాపములతో వాని హృదయము గరఁగు నట్లు వేఁడుకొనెను.

దీ—నత్పుత్రకా! నీవును నీ స్నేహితుఁడును నేటి రాత్రి నాతో మా యింటికి వచ్చిన యెడల మీ యిర్వురికి సద్యోద్యోగముల నిప్పించెదను. నేను మిమ్ముల బూర్తిగ నమ్మెదను. మీ రిరువురును మధ్యవయస్సువారు. దైవము మి మ్మేల యుద్ధరింపక విడుచును? మన లోకాంతర పితయగు భగవంతుని ప్రాపును సంపాదించుటయే ముఖ్యకార్యము. నేను మిమ్ము ప్రేమించుట యొక విశేషములోనిది కాదు. నా సహోదరులారా! లోకమునం దింకను ప్రేమకలదని మీరు గ్రహింపఁగోరినచో నేను మిమ్ము ప్రేమించుచుంటిని. మన పాపముల కొఱకుఁ గొఱత వేయఁబడిన యా జగద్రక్షకుని నామమున నరజన్మయొక్క సర్వోత్కృష్టతను మీరుఁ జూపింపక విడువఁ జాలను. రండు; ధైర్యము నవలంబింపుఁడు దేవుని సహాయము నపేక్షించి యింకొక పరి ప్రయత్నింపుఁడు. నేటి విషయముల మీరును నేనును దైవమును దప్పఁ బరు లెఱుంగ

1 గంటలకొట్టు యంత్రము 2 దారులడ్డుట

నవసరము లేదు. ఆతఁడు మిమ్ము క్షమించెను. మీ రాతని క్షమాపణ వేడుకొన్న క్షణముననే వడయఁగలరు. రండు. మనము కలిసి సైతానుతోఁ బోరాడుదము, జీవ మశాశ్వతమైనది. పాపుల నుద్ధరించుటకే క్రీస్తు భూమియం దవతరించెను. నాకు సాధ్యమగు సహాయము నంతను జేసెదను. దైవమా ! వీరిని నా కొప్పగింపుము.

ఇట్లు వారితో ముచ్చటించి ముచ్చటించి దీక్షితులు దైవమును గూర్చి ప్రార్థింపఁ దొడంగెను. వాని మానసోద్రేకమునకు వెలుందారి కాన్పింపలేదు. ఇట్లాతఁడు దైవమును గూర్చి ప్రార్థించుచుండ నక్షత్రకుఁడు తన ముఖమును గరయుగమునం దుంచుకొని పెద్దపెట్టున నేడువసాగెను. వాని 1 యశ్రుధారా పరంపర కుల్యాదశము భాతిఁ బ్రవహింపఁ దొడంగెను. వాని తల్లి గావించిన ప్రార్థన యేమయ్యెను. దీక్షితుని ప్రార్థన కది తోడ్పడుచుండెను. రెండవవాఁడు దీక్షితునితోఁ బూర్వపరిచితి లేనివాఁడగుటచేతను దైవతంత్రము మున్నెన్నఁడు వానిపైఁ బ్రసరింపక పోవుటచేతను, ప్రప్రథమమున నిర్లక్ష్యమునఁ దన చేతికత్తి నానుకొని కంచెప్రక్కను నిలువంబడి యుండెను. దీక్షితుని ప్రార్థన కొనసాగిన కొలఁది 2 కరకోపమమగు వాని యంతరంగము నీరై కరగఁ జొచ్చెను. ఘోరకృత్యములచే మొద్దుబారినట్టియుఁ బాపభీతి విరహితమైనట్టియు పాషాణతుల్యమగు వాని మానసమును పరిశుద్ధాత్మ యిట్లు 3 నవనీతోపమగఁ జేయఁగల్గెనో గ్రహింప మన కసాధ్యము. దేవదూతల కైనఁ దెలియునేమో ! దమస్కను మార్గమునఁ బోవుచుండ పౌలును మార్పాక్రాంతునిఁ గావించిన యా పరిశుద్ధాత్మ, కణ్వుఁడు దైవానుకరణ మహామంత్రోపదేశమును గావించిన క్షణముననే ధర్మపురార్యాలయ సంఘముపైఁ బుష్కలావర్తక ఘనాఘన వర్షపరంపరవలెఁ దన శక్తిని వెదఁజల్లిన పరిశుద్ధాత్మ, పిదప ఢిల్లీ క్రైస్తవ సంఘముపై వెల్లి విరిసిన పరిశుద్ధాత్మ, నీచాతినీచ కర్మాకరంబగు నీ నిమ్నవాటి 4 పరిసరంబున మద్యపానోన్మత్తులును, నరహత్యాద్యనేక ఘోరమహాపాతకులును, 5 మలిమ్లుచులు నగు నీ యాత్మద్వయంబుపైఁ దన కరుణాకటాక్ష వీక్షణ ప్రసారమును గావించెను. భగవద్జ్ఞానము వీరిపైఁ బ్రసరింపకుండఁ జిరకాలమునుండి యడ్డుపడియున్న యజ్ఞానమను నినుపతెర బ్రద్దలయ్యెను. ఈ హటాద్ఘటిత పరిణామ మా 6 ముడియ విడుపులకే యద్భుతమును గలిగించెను.

దీక్షితులు ప్రార్థనను ముగించి వాండ్రఁ గన్నెత్తి చూచెను. వారిలోఁ గలిగిన మార్పాతనికి వెంటనే గోచరము కాలేదు. వాండ్రును బూర్తిగ గ్రహింపఁ జాలరైరి. నక్షత్రకుఁ డింకను దన వక్త్రమును గరాచ్ఛాదనము గావించుకొనియే యుండెను. కత్తి నానుకొని నిలిచి యున్నవాఁడు భయాద్భుతవిహ్వలాక్షుల దీక్షితు నవలోకించుచుండెను. వానిమనోవీధి నాశాబీజము లంకురించి బయల్పడ సంకల్పించుచుండెను.

దీక్షితులు లేచి నిలువంబడి—“ సోదరులారా ! రండు దేవుఁడు దయామయుఁడు. ఈ రాత్రి మీరు శరణాలయంబున నుండవచ్చును. మీకుం దగిన సదుద్యోగమును సమకూర్చుటకు నేను పాటుపడెదను. ”

వారిరువురు 7 నిరుత్తరులై దీక్షితుని వెంటఁ జనిరి. శరణాలయముం జేర

---

1 కన్నీటిధార 2 వడగల్లుంబోలిన 3 వెన్న. 4 సమీపమున 5 దొంగలు 6 చోరుల 7 మాటాడక.

నప్పటికి రాత్రి రెండు గంటలైనది. దీక్షితులు వారి నొక గదిలోఁ బ్రవేశపెట్టెను ద్వారము కడ నొక క్షణము నిమ్నోన్నతగాత్రముతో నాతఁడు నిలువంబడెను. గత విషయములచే నావరింపఁబడిన వాని నెమ్మొగమున భగవత్కళ ప్రజ్వలించుచుండెను.

“దైవము మాకుఁ దోడై యుండును గాక!” యని యాశీస్సును బలికి యాతఁడు వెడలిపోయెను.

మరునాటి యుదయమున దీక్షితుఁడు వారి నిరువురిం గాంచుట కెంతయు భయము నొందెను. రాత్రి జరిగిన విషయము లాతని మనంబున హత్తుకొని యుండెను. తనవాగ్దానానుసారముగ వారికిఁ బనుల నిప్పించెను. శరణాలయ పాలకునికిఁ గార్యబాహుళ్య మగుటచే నొక సహకారి కావలసి యుండెను. నక్షత్రకు నా స్థానమునం దుంచెను. శరణాలయ సమీపమున నున్న తోఁటలో నీటి యంత్రమును నడుపు పనిని రెండవ వాని కిప్పించెను. వీ రిరువురి నొక రక్షింప నువ్విళు లూరుచున్న పరిశుద్ధాత్మ యీ సమయమునఁ దన శక్తి నంతను వీరి కై ధారవోయఁ జొచ్చెను.

మరునాటి సాయంసమయమున నక్షత్రకుఁడు తన నవీనోద్యోగానుసరణమున శరణాలయ సోపానము శుభ్రపరచుచు నొక క్షణము నిలువఁ బడి యిటు నటుఁ జూచెను.

అతఁడు కన్నెత్తి చూడ రోడ్డుప్రక్క నొక కల్లుకుండ కాన్పించెను. తన చేతికఱ్ఱతోఁ దాకఁదగినంత సమీపముగ నుండెను. రోడ్డున కద్దరిని రెండు కల్లంగడులు గలవు. కొంచెము దూరము పోయిన మఱి మూఁడంగళులు గలవు.

హఠాత్తుగ సమీపమున నున్న మద్యవిక్రయశాలనుండి యొక పురుషుఁడు వెలుపలికి వచ్చెను [1] ఆతరుణముననే మఱి యిరువురు లోనఁ బ్రవేశించిరి. సోపానములపైఁ నిలువఁబడి యున్న నక్షత్రకునకుఁ గల్లు వాసన గుప్పునఁ గొట్టెను.

తన చేత నున్న కఱ్ఱను గట్టిగఁ బట్టుకొని తన పనినిఁ జేయ నారంభించెను. ఉష్ణాధిక్యము లేక చలిగాలి వీచుచున్నను వానిముఖమున [2] స్వేదబిందువు లంకురించెను. తిరిగి యింతలోఁ గల్లుదుకాణము తలుపు తెఱచి నలుగురు బయటికి వచ్చిరి. ఒక చిన్న పిల్ల పాత్ర నొకదాని జేతంగొని లోనికేఁగి దానిఁ గల్లుచేఁ బూరించుకొని తిరిగి వచ్చెను. నక్షత్రకుఁడు నిలువఁబడియున్న [3] సోపాన సమీపమునుండియే యాబాలిక పోవుచుండుటచే [4] మద్యామోదము వాని నాకర్షించెను. అతఁ డింకొక మెట్టు దిగెను. వేత్రమును దృఢముగ నవలంభించుటచే వాని వ్రేళ్లుబారెను. మనోనిగ్రహేచ్ఛ నతి కష్టమునఁ బైమెట్టు నెక్కి యెటులో తలుపుమాటునకుఁ జేరి యాస్థలమును శుద్ధపరుప నారంభించి తనలో నిట్లనుకొనెను — “దైవమా! దీక్షితు లిపుడు వచ్చిన బాగుండును. దీక్షితులును సోమయాజియుఁ గలిసి యెచ్చటికో వెళ్ళియుండిరి. నక్షత్రక నెఱింగిన వారెవ్వరును శరణాలయమున లేరు.”

ఆ తలుపు మూలనే రెండు మూఁడు నిముసములు పనిచేయుచుండెను. అంతఃకలహముచే వాని ముఖము వాడబారెను. ఆతఁడు తిరిగి మెట్లు మీఁదికి వచ్చి క్రమక్రమముగ దిగ నారంభించెను. దారి ప్రక్కను జూచి కడపటి మెట్టును తుడిచివేయలేదని గ్రహించెను. ఆమెట్టును గూడ దిగుటకుఁ దగిన మిష

1 సమయమున 2 చెమట 3 మెట్లు 4 కల్లువాసన,

దొరికినది. రోడ్డుమీఁదికి దిగి చివర మెట్టును బాగు నేయుచు శరణాలయమున కభిముఖుఁడై యుండెను. ఆ మెట్టునే పదిసారులు తుడిచెను. వాని ముఖమునుండి [1] స్వేదకణములు జారి కాళ్ళకడఁ బడుచుండెను. క్రమక్రమముగ నాతఁడు దుకాణమునకు దగ్గరగా నున్న మెట్టుకొన నుండెను. దుకాణమునుండి కల్లువాసన యచ్చటికి స్వేచ్ఛగఁ బ్రసరించుచుండెను. నరకకూపమున నుండుచున్న గంధకపువాసనను బోలిన దుర్వాసనయైనను ఆమద్యాఘ్రాణము వాని నాకర్షించెను.

అతఁ డిప్పుడు రోడ్డుప్రక్క నున్న కాలిదారిని దుడుచుచుండెను. పిదపఁ గాలువం దుడువ నారంభించెను. ఆపయిని శరణాలయమున కెదురుగ నున్న రాజమార్గమును శుభ్రపరచెను. అంతస్తాపముచే నుడుకుచుండుటచేఁ గుళ్ళాయినఁ దీసివైచెను. తన చొక్కాచేతిని క్రిందికి లాగి దానితో ముఖముం దుడుచుకొనెను. అతని పెదవు లారిపోవుచుండెను; దంతములు పటపట కొఱుకుచుండెను. ఆపాదమస్తము నొడలెల్ల వణఁకఁ జొచ్చెను. చెడఁద్రాగిన వానివలె నిటునటు నూఁగ దొడంగెను. వాని యాత్మ ప్రకంపిత మయ్యెను.

రోడ్డు నిద్దరినుండి యద్దరి కేఁగి కల్లంగడి ముందు నిలువంబడెను. అంగడిలోఁ జక్కఁగఁ దరగతులుగ నమర్పఁబడియున్న కాచపాత్రములను, సీసాలను, కల్లుకుండలను దదేకదృష్టితో [2] ననిమేషవృత్తిఁ జూడఁ దొడంగెను. పెదవులను నాలుకతోఁ దడపుకొని యింకొక యడుగు ముందుకు వైచి తన్నెవరు చూచుచుండిరో యను భయకంపిత మానసంబున నటునిటుఁ జూచెను. అంత నా యంగడి తలుపుం దెరచి యెవ్వరో వెలుపలికి వచ్చిరి. తిరిగి కల్లువాసన గుప్పున బయలుదేరెను. అంత నక్షత్రకుఁడు మనోనిశ్చలముఁ ద్యజించి మఱియొక యడుగు ముందునకు వైచి తలుపు దగ్గఱకుఁ జేరెను. చేయిఁ జాపి తలుపును దెరువఁ బోవుచుండ నంతలో సందు మూలనుండి యొక నిమ్నోన్నత పురుషుఁ డరుదెంచెను. అతఁడు దీక్షితులు.

నక్షత్రకుని చేతిని గట్టిగఁ బట్టుకొని కాలిదారివైపున కీడ్చుకొని వచ్చెను. మద్యపానేచ్ఛ మితిమీఱి మతిచెడి యున్న వాఁడగుటచే నీ యాతంకమునఁ [3] గ్రోధోద్రిక్త మానసుండయి చేయూచి దీక్షితు నొక చెంపపెట్టుం బెట్టెను. మృత్యుముఖంబునఁ బడకుండఁ దన్నీడ్చుకొనిపోవునది యెవ్వరో మొదట నక్షత్రకుఁ డెఱుంగకుండి యుండవచ్చును. కాని దీక్షితున కా దెబ్బ తీవ్రముగఁ దగిలి దవడపైఁ బెద్ద గాయ మయ్యెను.

దీక్షితులు నోరు దెరచి యొక మాటనైన నాడలేదు. అతని ముఖము మిక్కిలి విచారగ్రస్తముగ మాత్ర ముండెను. అంతటితో నక్షత్రకుని విడువక పసిబాలునివలెఁ బట్టుకొని మెట్లెక్కి శరణాలయము లోనికిం గొనిపోయెను. సావడిలో వానిని దింపి సింహద్వార కవాటమును బంధించి తలుపున కడ్డముగఁ దన వీపును జేర్చి నిలువంబడెను.

నక్షత్రకుఁడు సాష్టాంగపడి పెద్దపెట్టున నేడ్చుచు దేవుని బ్రార్థింపఁ దొడంగెను. నక్షత్రకుఁడు స్థూలకాయుఁడు కాకున్నను వాని నెత్తుకొని వచ్చినందున దీక్షితు లాయాసమున నొగర్చుచుండెను. అట్లుండియు వానిం జూచి కరుణార్ద్ర హృదయుండై

1 చెమట 2 రెప్పవేయక 3 కోపముచే రేగిన

యుండెను.—నక్షత్రకా! ప్రార్థింపుము. మున్నెన్నడును ప్రార్థించ నంత తీవ్రముగఁ బ్రార్థింపుము నీ కదియే రక్షణమార్గము. వేఱొండు లేదు."

నక్ష—" ఓదైవమా! నాతోఁ బ్రార్థింపుము. నన్ను రక్షింపుము; నన్ను నరకాగ్నినుండి తొలఁగింపుము." దీక్షితులును దన 1 జానువుల నేలపైనాని ప్రార్థించెను.

అట్లు వారు ప్రార్థించి లేచిన తోడనే నక్షత్రకుఁడు తన గదిలోని కేఁగెను. సాయంసమయమున నతఁడు వినమ్రుఁడై గదినుండి వెలువడెను. దీక్షితులును ప్రభునామమున లభించిన గాయముల ధరించి యూరిలోనికి వెళ్లెను. ప్రభు పాదవిన్యాసానుసరణ మెంత కష్టతరమో యాతఁ డిప్పుడు గ్రహించుచుండెను.

అయ్యో! మధుపానాగార మటులనే యున్నది. ఆవీధిలో నెన్నియో కల్లంగడులు నక్షత్రకుని 2 గ్రసింప సంసిద్ధముగ నున్నవి. లేనె బూసిన కత్తివలె నరకమున కాకర్షించు నా మద్యపరిమళము సదా కట్టెదురఁ బ్రత్యక్షమై యుండ నెంత కాలము నిగ్రహింపఁ గలఁడు? దీక్షితు లూరిలోని కేగెను. ఏమూలఁ జూచినఁ దద్దుర్గంధమే ప్రసరించుచుండెను. " ఓభగవంతుఁడా! ఎంతకాల మీ దుస్థితి." అని యాతఁడు పరితపించెను.

సోమయాజియు దీక్షితులును కలిసికొని నప్పుడు నక్షత్రకునికి గలిగిన శోధనను గూర్చి కొంతదనుక ముచ్చటించుకొనిరి.

దీ—మన ప్రక్కనున్న యా స్థలాధిపతు లెవ్వరో విచారించితివా?

సోమ—లేదు. నే నందులకుఁ బ్రయత్నింపనే లేదు. నీ కవసరమని తోఁచిన యెడల నట్లే విచారించెదను. కాని మిత్రమా! ఈ మహాపట్టణమునఁ గల్లంగడుల మూయింప మనకు సాధ్యమగునా? దేవాలయము లెంత దృఢముగ నున్నవో నివియు నంతబలవత్తరముగ నున్నవి. వాని దొలఁగింప నెవ్వరి తరము?

దీ—కాల మాసన్నమైనప్పుడు భగవంతుఁడే మాన్పఁ గలఁడు. అతఁడు నరవిక్రయమును మాన్పలేదా? ఈలోపల మన కత్యంత సామీప్యముగనున్న యీ కల్లుదుకాణ మెవ్వరి స్వాధీనమున నున్నదో మనము తెలిసికొనఁ బ్రయత్నించుట ధర్మము.

సోమ—నేను తెలిసికొనెదను.

దినద్వయానంతర మాతఁడు ఢిల్లీదేవాలయ స్వాంఘికుని కార్యస్థానమున కేఁగి వానితో మాటలాడఁ గోరెను. ఆగృహమేధి తనపూర్వదేశీయుని గౌరవప్రపత్తులతో లోనికిఁ గొనిపోయి సముచితాసనాసీనుం గావించి కుశలప్రశ్న మొనరించెను.

సోమ—నేను దీక్షితులును గలిసి యొక శరణాలయమును స్థాపించితిమి. తత్సమీపమున నీ యిల్లొకటి కలదు. అచ్చట మద్యవిక్రయమును గావించుచుండిరి. ఆ విషయమున మీతో ముచ్చటించ నేనిచటికి వచ్చితిని. చల్లకువచ్చి ముంత దాచనేల? నా సంకల్పమును స్పష్టముగఁ జెప్పెదను. మన జీవితకాల మత్యల్పమగుటచే నభిప్రాయముల మఱుగు పరచి వ్యర్థపరుప రాదు. వామన మూర్తీ! నీయిల్లు కల్లంగడిఁ బెట్ట నద్దెకిచ్చుట యుక్తమనియే తలంచెదవా?

ఈ ప్రశ్న సూటిగ దాకుటచే వామనమూర్తికి గర్వనిర్భేదముగఁ దోఁచెను. క్షణకాలమున వానిలో గొప్పమార్పును గలిగించెను. శరీరములోని రక్తమంతయుఁ గాగి

1 మోకాళ్ళు 2 మ్రింగ.

నెత్తికెక్కెను. లౌకిక వ్యాపార నిమగ్నాత్ముల కెల్లరి కిడియే లక్షణము పిదప పర్యాలోచనమున వాని వదనారవిందము తెల్లబడెను. నమ్రుండై కొంతవడి శిరమును రెండుచేతులం బట్టుకొనియుండి పదంపడి తలయెత్తి యాతనితో నిట్లనియెను.—

"గురూత్తంసమా! ఆనాటి ప్రాతఃకాలమున నితరులతోపాటు నేను గూడఁ బ్రతినవట్టితినని మీరెఱుంగుదురా ?"

సోమ—అవును నాకు జ్ఞాపకమున్నది.

వామ—ఈ విషయముననే నా ప్రతిజ్ఞాపాలనము గావింపఁ జాలనందుల కెంత ఖేదపడుచుంటినో మీరెఱుంగరు. సైతా నా కల్లంగడి మూలముననే నన్ను శోధించుచుండెను. నాకిప్పు డెక్కుడు లాభము దానివలననే వచ్చుచున్నది. మీ రాకకుఁ బూర్వమొక క్షణము క్రిందటనే 1 స్వదైహిక ఫలాపేక్షచే నాకర్షింపఁబడి నేను బ్రతిజ్ఞజేసిన యారక్షకుని వాక్పరిపాలనఁ గావింప లేనంటినే యని పరిపరి విధములఁ బరితపించుచుంటిని. నే నట్లు పశ్చాత్తాప నిహతుండ నగుచుండఁ దా మరుదెంచితిరి. ప్రభు వెన్నఁడును తన వసతి నిట్టి కార్యమున కడ్డకేయఁడని నేనెఱుంగుదును. ఆచార్యవర్యా! యీ విషయమున మీరు నా కుపదేశ మొనర్పఁ దగిన దేదియు లేదు.

ఇట్లని వామన మూర్తి లేచి యాచార్యునకు వందన మొనర్చెను. సోమయాజియు 2 సుత్థితుఁడై వాని నాశీర్వదించి వెడలిపోయెను. కానఁ గొంతకాలము గతించిన వెనుక గాని వామనుఁడీ విషయమునఁ బడిన పాట్లు వానికిఁ దెలియలేదు. పరిశుద్ధాత్ముని ప్రేరణపై నాటియుదయమున దైవానుకరణ మహామంత్రోపదేశానంతరము ఢిల్లీసంఘ చరిత్రలో నిదియొక భాగము. దైవానుసరణ మార్గమునఁ బూర్తిగఁ బ్రవర్తించుచున్న యీ దేశిక ద్వయమునకుఁ గూడ సంఘమున గలుగుచున్న మార్పులు గోచరింప లేదు గాని పాపభూయిష్ఠమైన యీపట్టణమునం దల్లెడలఁ బరిశుద్ధాత్మ వెల్లివిరియుచుండెను. భక్తుల నేకులు సమయము తటస్థించిన నెట్టిశ్రమలనైన భరించుటకును, ఎంతటిత్యాగము నైనఁ గావించుటకును సంసిద్ధులై యుండిరి. చిరకాలమునుండి మాంద్యముగఁ బడియున్న హృదయములు చలింపసాగెను; 3 ధనార్జనయే ప్రధానముగఁ బరిగణించు వ్యావహారిక వేత్తల మనంబులఁ దత్కార్యోచితానుచిత జ్ఞాన మంకురించి కలంచుచుండెను; ఆనగరమున మున్నెన్నఁడు గలుగ నంతటి యాధ్యాత్మిక ప్రచార మలవడెను శరణాలయమును స్థాపించి పనిచేయుచున్న స్వల్పకాలముననే 4 యాచార్య ద్వయమునకుఁ గొంత యుద్బోధనము కలిగెను. ఈ లోకమునం దీకాలమున నసంభవ మని తోఁపఁ గల మహాద్భుత విషయములు సులభసాధ్యము లని త్వరలో వీనికి గోచరించును.

పయి సంభాషణము జరిగిన యొక నెలలోపలనే యా మద్యశాల 5 యంతరించినది. అద్దె కేర్పరచిన గడువు తీరిన తోడనే వామనుఁడు కల్లుదుకాణమును దీసివేయించుటయే గాక యా యింటిని శరణాలయాంగముగ నుపయోగింపుఁడని యాచార్యాధీనమును గావించెను. శరణాలయమున నిప్పుడు వివిధ వృత్తుల కాస్పదము కల్పింపఁబడెను.

ఇందు వివిధములగు భోజనపదార్థములఁ జక్కఁగా వంటఁజేయు రీతిని నేర్ప

1. దేహసంబంధమయిన 2 లేచి 3 ధనసంపాదన. 4 గురువు 5 నశించినది

వృత్తి యొకటి చకోరాక్షి యీ 1 మహానసాధ్యక్షతను వహించెను. పలువురు చిరకాలమునుండి నెలక్రిందటి వఱకు నే గదిలోఁ దప్పద్రావి నాశనము నందుచుండిరో యచ్చటనే చకోరాక్షి మధురపదార్థముల రుచికరముగఁ బచనము జేయు విధానముం బలువురికి నేర్పుచుండెను. 2 పాకశాస్త్రాధ్యయనము నే గాక గృహనిర్వాహక విధానమును గూడఁ బెక్కండ్రకుఁ గఱపుచుండెను. చకోరాక్షి యిప్పుడే సోమిదేవి మున్నగువారితోఁ గూడ శరణాలయమునే నివాసముగా నేర్పరచుకొనెను. గానకళానిధి యగు కమలము మాత్రము వెనుకటి యింటనే యుండి యప్పుడప్పుడు శరణాలయమునకు వచ్చి సంగీత విద్యను నేర్పుచుండెను. ఒకనాడు సాయంసమయమున నలసటఁ దీర్చుకొన నాచార్యద్వయమును జకోరాక్షియుఁ గూర్చుండి యుండ సోమయాజి "చకోరాక్షీ! నీ వాచరింపఁ దలంచిన మార్గములు మాకుఁ దెల్పుము" అని యడిగను "కూలిసేసికొని జీవించు యావనాంగుల నుద్ధరించు రీతిని గూర్చి చిరకాలమాలోచించితి" అని చకోరాక్షి పలికెను. క్రైస్తవానుసరణ వ్రతము నాచరించుచున్న యీ చిన్నదాని ముఖవికాసమును బరికించి యాశ్చర్యానందములు 3 వెల్లివిరియ వెంకటసోమయాజి హాసన్ముఖుఁ డయ్యెను. చకోరాక్షి తిరిగి యిట్లనెను— నామనోనిశ్చయము నన్నొకదారికిఁ దెచ్చెను. అయ్యది పురుషుల కింక 4 నగమ్యగోచరము గానోపును గాని నామనోభారమును సోమయాజి గ్రహింప నోపును.

దీక్షితులు నమ్రుఁడై యిట్లనెను—విషయగ్రహణమున మా బాల్యావస్థ నంగీకరించెదము చకోరాక్షీ! చెప్పుము.

చ—అట్లయిన నేను చేయఁదలంచిన రీతి యిది. శిథిలమై యున్న యా పానశాలను రెండు గదులు గల చిన్న యిల్లుగా మార్చవచ్చును. అట్లు గావించి యందు పాకవిద్యను బాలికలకు నేర్పఁ దలంచితిని. వారందుఁ బ్రవీణలై గృహస్థుల యిండ్ల వంటకత్తెలుగఁ బోయి చేరి సుఖింతురు. ఆఱుమాసములలో నీ విద్య పూర్తిగ నలవడును. ఆలోపున రుచ్యములగు పదార్థములఁ బచనము సేయుటయు, వస్తువులఁ బరిశుభ్రముగ నుంచుటయుఁ జేయుపనులఁ జక్కఁగా నెరవేర్చు నభిలాషయు వారికిఁ గలిగించెదను

దీక్షితులు—చకోరాక్షీ! ఆగు మాగుము. ఇది యద్భుతములు చేయఁగల కాలము గాదు.

చ—నే నీ యద్భుతమును గావించి తీరెదను. ఇది యసంభవమని పైవారికిఁ దోపక మానదు. కాని నేను బ్రయత్నించి తీరెదను. నా యొద్ద నీ విద్య నభ్యసింపఁ దలంచిన బాలికలు పదిపండ్రెండుగురు కలరు. బాలికలలో నిట్టి యాదర్శమును నొక్కసారి ప్రజ్వలింపఁజేసిన యెడల నది వారి యభివృద్ధి కపారమైన శక్తిగఁ బరిణమింపఁ గలదు. నేను గఱపిన నిర్మలాహార విధాన మనేక గృహంబుల నిది వఱకే, యద్భుతములఁ గావించుచున్నది.

వెంకటసోమిదమ్మ—చకోరాక్షీ! నీ ప్రవచనము నందర్ధభాగము నాచరింపఁ గలిగిన నా మహాత్కార్యము మన సంఘము నంతను మహోత్కృష్టదశకుఁ దేఁగ

1 వంటసాలకు అధికారము 2 వంట నేర్పుట 3 వృద్ధిఁబొంద 4 ఎంతమాత్రమును దెలియని

లదు. నీవు దీని నెట్లు ఆచరింపఁగలవో నే నూహింపఁ జాలకున్నాను. కాని నీ యీ కార్యాచరణమున నీకు భగవంతుఁడు తోడ్పడునుగాక!

సోమ—దీ—తథాస్తు. అట్లే జరుగునుగాక !

చకోరాక్షి తా నవలంబించిన కార్యము మిగుల పట్టుదలతో సాగింపఁ జొచ్చెను. ఆ 1 యుద్యమము దినదినాభివృద్ధిఁ గాంచఁ దొడంగెను. చకోరాక్షి 2 సంకల్పము సంపూర్ణముగ నెరవేర ననుటకు సందియ మిసుమంతయును లేదు. తన కార్యనిర్వాహణ దీక్షచేతను, మృదుమధు రాలాప చాతుర్యముచేతను, ప్రజల మనంబుల నాకర్షించు విధాన మామె కలవడెను. తన శిష్యురాండ్రకు గృహకృత్యములఁ జక్కఁగ నేర్చు విధానములఁ దీవ్రముగ 3 నుద్బోధించుచుండెను. ఆమె చేతిక్రింద నిపుణులైన పనికత్తెల నేర్పనకు నాకరుల నుంచుకొను 4 గృహమేధు లత్యంతామోదమును జూపఁ దొడఁగిరి. శరణాలయ చారిత్రమును మన మింకను వివరింపలేదు. ఆ సమయమునఁ జకోరాక్షి కార్య మినుమడిగఁ బ్రవర్తింపఁ గలదు.

శీతల వాత పోతము లమ్మహా పట్టణముపై విచ్చలవిడిఁ బ్రసరించుచుండుటచే ధనదారిద్ర్యములకును, పాండిత్యము లోకజ్ఞానము సిరి సంపదలకును అజ్ఞానము వినీతి నిరాశలకును గల తారతమ్యమునకులె నవస్థాభేదమును వెల్లడించుచుండెను. శీతకాలము మిక్కుటముగ నున్నను గలవారి మనోల్లాసముల కాకరమై యుండెను. సంతర్పణలు, విందులు, నృత్యములు, గానసభలు, వ్యాయామసంఘములు మిక్కుటముగ వెల్లివిరియుచుండెను. అనర్ఘాలంకార చీనిచీనాంబర ధారణములును, నాటక ప్రదర్శనములును మున్నగు విలాసము లత్యధికముగ నొకవంకఁ బ్రబలుచుండ శరీరపోషణమునకు వలయు నాహారము లభింపక జీర్ణగాత్రులై సమయువారును, మాన రక్షణమునకు వలయు జీర్ణవస్త్రములైన లేక దిగంబర ప్రాయులై చలికి బిగిసికొని పోవు దౌర్భాగ్యులు మఱియొక వంకను నవయుచుండిరి. 5 అనురాత్రమును సోమయాజియు దీక్షితులును, వీథులవెంటఁ దిరిగి నీడయుఁ గట్టువస్త్రమును దిన నన్నమును లేని నిర్భాగ్యులగు స్త్రీబాల వృద్ధుల మృత్యువక్త్రమునుండి తప్పింపఁ బ్రయత్నించుచుండిరి. అన్నదాన సమాజములు, దేవాలయ సంఘములు, నిమ్నజాత్యుద్ధారకులు, ధర్మపరాయణ సంఘములు, మున్నగు ఆహారపదార్థముల వస్త్రములఁ జందాల మూలమునఁ బోగుచేసి బీదలకు వినియోగించుచుండిరి. కాని క్రైస్తవాదర్శములు గల వారి సేవ లభించుట 6 దుర్లభము. స్వకాయకష్టమునకోర్చి తన మాన ధన ప్రాణముల దేశసేవకై వినియోగింప నిశ్చయించుకొనిన స్వార్థత్యాగి లభించుట యరుదుగదా! ఈ విషయము స్మరణకు వచ్చినప్పుడెల్ల దీక్షితుని హృదయము నీరగుచుండును. సంపన్నులు తమకుఁ గల విశేష ధనమునుండియే యించుకయైనను దానధర్మములకు వినియోగింప వచ్చును. అట్టి 7 వినిమయము వలన వారి సంపదలకు లోటుకానిపింపదు. వారు సులభముగ నీయఁదగిన దాని నిచ్చెదరు. అందువలన వారెటులు స్వార్థత్యాగులు కాఁగలరు. ఈ యావి వలనఁ దా మిసుమంతైనఁ గష్టపడినప్పుడు గదా స్వార్థత్యాగము! ఇదియేనా! క్రీస్తును వెంబడించు విధానము. అనేక సంఘములలోని ధనికులం గాంచు

1 ప్రయత్నము 2 ఊహ 3 చెప్పుచుండెను 4 ఇంటి యజమానులు 5 ప్రతిరాత్రియు 6 దొరకుట కష్టము 7 మార్పులు

చుంటిమి. బీదల కష్టముల నివారించుటకై వారించుకయున శ్రమపడుచుంటిరా? చినిగిపోవుటచేఁ దాను ధరింపటకుఁ బనికిరాని జీర్ణవస్త్రముల నెవనికైన నొసంగుటయు, తాను దినఁగా మిగిలిన విస్తరిలోని యెంగిలిని ప్రోగుచేసి వీధిలోని వారి కొసంగుటయుఁ గూడ ధర్మములే యగునా! కోటీశ్వరు లన్నదాన సమాజము వారికొక బస్తా బియ్యము నొసంగుటతో దానము పూర్తియైనదా? అట్టి వారు తామెన్నఁడు స్వయముగఁ బోయి బీదల నాదరింపవలదా! నటవిట గాయకాద్యనేక లీలావిలాసంబులఁ ద్యజించి యొకప్పుడయినను వారు బీదలయానికిపట్టుల కేగి యచ్చటి దురవస్థల నివారణ సేయ స్వయముగఁ బాటుపడవలదా? ఇట్లా సంఘము యొక్క దుస్థితి గూర్చి సోమయాజియు దీక్షితులు నప్పుడప్పుడు పరిపరివిధంబుల దలపోయుచుఁ బట్టుదలను విడువక ధైర్యకవచములు ధరించి స్వార్థత్యాగులై పనిసేయుచుండిరి. సంఘమునందుఁ దాత్కాలికముగ నెక్కుడు మార్పు కాన్పింపకున్నను మొత్తమున వారి నైతికావస్థలయం[1] దీషచ్ఛేదములు కలుగుచున్న వని యొప్పుకొనక తీరదు.

ఒకానొక నాటి ప్రాతఃకాలమునం దీ మార్పు శరణాలయమునందున్న వారి కందఱికిని స్ఫుటముగ విశదమయ్యెను. శరణాలయ వాసులందఱును జేరి భోజనముఁ జేయు కాలమే వారికి విశ్రాంతి కాల మని చెప్పవచ్చును. ఆ కాలమునందే వారు సరస సల్లాపము నిరచుక సౌఖ్యమును వడయుదురు. దీక్షితు లా సమయమునఁ జక్కని కథలను జెప్పుచుండును. సోమయాజి లోకవార్తలఁ బ్రసంగించుచుండును. వారు సదా కష్టనిష్ఠురములఁ దిలకించుచుండు వారైనను ఈ సమయమునం దానంద మగ్నమానసులై చరించుట యాచారము. హాస్యప్రసంగ శక్తియు భగవద్దత్తమైనదే యని దీక్షితు లనుచుండును. వాని కిదియే[2] వ్యాయామప్రాయముగఁ బరిణమించుచుండును.

నేటి మధ్యాహ్నమున దీక్షితులు తనతోడివారి యానందమునకై వార్తాపత్రికం జదువుచుండెను. చదువుచు మధ్య నాకస్మికముగ నిలుపుచేసెను. ఆతని ముఖవర్చస్సు వెల్లనై విచారగ్రస్తముగఁ దోఁచెను. తక్కుంగల వారందఱును నిర్విణ్ణులై యాతని వంక నిశ్శబ్దముగఁ జూచుచుండిరి.

“ బండినుండి బొగ్గును దిగుమతి సేయుచుండఁగా దుహాకినిఁ గాల్చి చంపిరి ” ఆతని కొన్నిమాసములనుండి పని లేకపోవుటచే వాని కుటుంబము జీవనోపాధి లేక మలమల మాడుచుండెను. అతని భార్యయు నాల్గురు పిల్లలును ఒక చిన్న గుడిసెలోఁ గిక్కిరిసి యుండిరి. ఒక పిల్లను లోనఁ దావుచాలక బొత్తిళ్ళలోఁ జుట్టఁబెట్టి పంచనుంచిరి.

ఈ శీర్షికను దీక్షితులు మెల్లఁగఁ జదివెను. పిదప విపులముగఁ బత్రికాముఖంబునఁ బఠించెను. ఆతఁడు ముగించునంతకు నందఱును నిశ్శబ్దముగ నుండిరి. ఈ దురాగత వార్తాపఠనము వలన వారి మనంబుల నావరించిన యానందమంతయు నంతరించెను. పట్టణ మంతయు నీ విషయమును గూర్చి యట్టుడికిన ట్లయ్యెను. జనసమూహ మంతయుఁ బనిగల వారును లేనివారును గూడ నిలయము వైపునకు గుంపులు గుంపులుగఁ బోవుచుండిరి. ఇట్లు పోవువారిలోఁ బెక్కండ్రు సకల సౌఖ్యాకరమైన పట్టణ వాస్తవ్యులయ్యును నిరాహారులై నీరసించిన శరీరములు గలవారై యుండిరి. వారికి వలయు పని

1 కొంచెముమార్పు. 2 పరిశ్రమ

పాటులు లభింపకుండుటయే దీనికిఁ బ్రధాన హేతువని చెప్ప నొప్పును.

అచ్చట వసించువారిలోఁ బలువురు పలువిధంబుల ముచ్చటించు చుండిరి. మత బోధకుఁడుగ సిద్ధపడుటకై క్రొత్తగ వచ్చి చేరిన యొక యువకుఁ డిట్లనియెను.—"అతఁడు ధర్మగృహాధికారికైన దన విషయము నేల చెప్పుకొనలేదు. నాగరికులకైనఁ జెప్పవలదా ? క్రైస్తవ సంఘముతో నిండియున్న యీమహాపట్టణమున నొక్క మనుజునిఁ దిండికి లేక చావనిచ్చెదరని నమ్ముట కవకాశము లేదు."

వెంకటసోమయాజి—అట్లగు నని నే ననుకొనను. ఆమానవుని, చరిత్రమును మన మెఱుంగము. అతఁ డిదివఱ కెన్నిసారులో ధర్మము నడిగి యుండవచ్చును. తుదకు విసిగి వేసరి యున్నప్పు డిట్లు నిశ్చయించుకొని యుండును. ఈ శీతకాలమున నిట్లు గావించిన వారి నెందఱినో యెఱుంగును.

దీ—ఇందులో ఘోరమైన విషయ మది కాదు ఈ మానవుని కాఱుమాసములనుండియుఁ గూలిపని లభించినది కాదు.

యువకుఁడు—అట్టి వాండ్రు పల్లెలవెంట నేల పోఁగూడదు ?

పల్లెలలోని సంగతులఁ బూర్తిగ నెఱింగిన యొకఁడు డీ ప్రశ్నకు సమాధానముం జెప్పెను. పల్లెలలో బనిపాటులు లభించుటయే యరిది. దొరికినను గొంతకాలము నిలుకడగా నుండవు. కుటుంబములు లేని బ్రహ్మచారులకే 1 జానపదులు పనుల నిచ్చెదరు. 2 గృహమేధి యొంటిగఁ బోయి పనుల సంపాదించుకొనఁ గూడదా ? యనిన నింటియొద్ద దారపుత్రాదులలో నెవరికైన జబ్బుచేసిన వచ్చి చూచు టెట్లు ? రాకపోకల వ్యయముగూడఁ బైఁ బడునుగదా ? ఈతఁడు పల్లెలకుఁ బోక పోవుటకిట్టి వనేక కారణము లుండనోపును.

సోమయాజి—పాప మీతనికి భార్యయుఁ బిల్లలును గూడఁ గలరు. ఎంత దురంతము ? ఎచ్చట యీ పని జరిగిన దంటివి ?

దీక్షితులు వార్తాపత్రికను గైకొని—"సమీపముననే, మూఁడవవీధిలో, అది సుంకువారి వీధి ఆ వీధిలోని యిండ్లలో నర్ధభాగము సుంకువారివే. నగరములోని యిండ్లన్నిటిలో నివి కడు నీచమైనవి. సుంకువారును క్రైస్తవ సంఘమునఁ జేరినవారే"

సోమయాజి—ఔను. వారు లూథరు సంఘమునఁ జేరినవారు—అని హీనస్వరముతోఁ బలికెను.

దీక్షితులు సత్యాగ్రహముతోఁ గుర్చిమీఁదనుండి లేచెను. అతఁ డెప్పుడును క్రోధోక్తు లాడువాఁడు కాఁడు. కాని యిప్పుడు తీవ్రముగ నేదియో పలుకనుంకించి నోరు తెరచెను అంతలో బయట నెవ్వరో తలుపుఁదట్టిరి. వారిలో నొకఁడు తలుపుఁ దెరువ నేఁగెను.

"నేను తొందరగ మాటలాడుటకు వచ్చితి నని సోమయాజి దీక్షితులు గార్లతోఁ జెప్పుడు. నాపేరు సుంకు వెంకటస్వామి. సోమయాజి నన్నెఱుఁగును."

భోజనమునకుఁ గూరుచుండిన వారి కెల్లరి కీ మాటలు వినఁబడెను. దీక్షితులు సోమయాజివంక భావగర్భితముగఁ జూచెను. వారిరువురును వెంటనే లేచి చావడిలోనికి వెళ్ళిరి.

1 పల్లెటూరివారు 2 ఇంటి యజమాని

“వెంకటస్వామిగారూ! దయచేయుఁడు” అని దీక్షితులు పిలిచెను. ఆతఁడు లోనికి వచ్చిన తోడనే వారు ముగ్వురును గూర్చుండిరి

సుంకు వెంకటస్వామి యా యూర గౌరవము గలవారిలో నొకఁడు. మిక్కిలి పలుకుబడిఁ గలవాఁడు. ఘనధనవంతులును మర్యాదవంతులు నగు కుటుంబికులలో జన్మించినవాఁడు. ఆ యూర నే మూలఁ జూచిన వీని యిండ్లే. వానికిఁ గల ధన 1 మపారము. సోమయాజి యాజమాన్యముక్రింద నుండు సంఘములో నీతఁడు 2 యావజ్జీవ సభ్యుఁడు.

ఈతఁడు దీక్షితుని తన పూర్వ సంఘాధ్యక్షుఁడగు సోమయాజి నెదుర్కొనెను. ఏదియో యపూర్వానుభవమును గాంచిన వానివలె నాతని చూపులు విపరీతములుగ నుండెను. వాని ముఖవికాసము వెలవెల బారుచుండెను. మాటలు గద్గదికతోఁ గూడియుండెను. ఇదివఱ కెన్నఁడు నాతఁ డిట్లు భయకంపితుఁడై యుండ నెఱుంగఁడు

“తుపాకి ప్రేలు విషయమును మీరు పత్రికలోఁ జదివియే యుందురు. ఆ కుటుంబము నా యింటఁ గాపురముండెను. అది కడు విషాదకరమైన సంగతి. నా యీ రాకకది ముఖ్యకారణము కాదు.”—అని తొట్రుపాటుతో వారి యిర్వురి ముఖముల వంకను దేరిపారఁ జూచెను. దీక్షితు లింకను వానిని సూక్ష్మదృష్టితోఁ జూచుచునే యుండెను. ఈ ధనికుఁడు 3 దయార్ద్రహృదయుఁడైనచో నెందఱో బీదలనో రక్షించి యుండనోపు ననియు, తనలాభమును గొంచెము తగ్గించుకొనిన యెడలఁ దన యిండ్లలోఁ గాపురము సేయు వారిని సౌఖ్యపెట్టి యుండు ననియు, ఈ యాపదను తప్పించి యుండుననియు దీక్షితులు తలంచుచుండెను

సుంకు వెంకటస్వామి—(సోమయాజి వైపునకుఁ దిరిగి భయగద్గదిక స్వరముతో) గురువర్యా! నా కొక యనుభవము కలిగినది. 4 ఇదమిత్థమని వివరించుటకు మనుష్యాతీత మయిన శక్తి కావలయును. ఆ విషయమును ద్వరతో విన్నవించుటకే వచ్చితిని. మీరు మఠాధిపత్యమును వహించియుండు కాలమునఁ గ్రీస్తు ననుసరింతు మని ప్రతిజ్ఞఁ గావించిన వారిలో నే నొక్కరుండ నని తమకు జ్ఞాపక ముండియుండ వచ్చును. అప్పటికి నే నజ్ఞానమున మునింగి యుండుటచేఁ గ్రైస్తవుల విధివిధానమునఁ జరించుచునే యుంటినని భావించితిని. నాకుఁ గల విశేష ధనమునుండి సంఘాదాయమునకును దానధర్మములకును గొంత ద్రవ్యము సమర్పించుచునే యుంటిని. నే నాత్మత్యాగమును గావించితి నని యెంచఁ దగినంతమాత్ర మిచ్చియుండలేదు. నే నా ప్రతిజ్ఞను గావించినది మొదలు నా 5 సంచరణ మంతయుఁ బరస్పరభేదములతోఁ గూడుకొని యున్నది. నా చిన్న కుమార్తె కమలము గూడ నట్టి ప్రతిజ్ఞను గావించెను. ఆమె యప్పుడప్పుడీ బీదవారు నివసించు గృహావసతులను గూర్చి సంప్రశ్నము గావించుచుండెను. నే నామెకుఁ బ్రత్యుత్తరమియ్యక తీరెడిది కాదు. గతరాత్రి యామె యడిగిన యొక ప్రశ్న నాకు 6 నాసాపాళమున నంటినది. అట్టి బీదలు కాపురము సేయుచున్న యిండ్లేమయిన నాకుఁ గలవా? అవి మన యిండ్లవలెఁ జక్కఁగను సౌఖ్యకరముగ నున్నవా? పిల్ల లట్టి ప్రశ్నల నెంత స్పష్టముగను

---

1 హద్దులేనిది 2 బ్రతికియున్నంతకాలము 3 దయచేఁ జల్లఁబడిన చిత్తముకలవాఁడు. 4 ఇట్లని 5 ప్రవర్తన 6 ముక్కురంధ్రమున

తీవ్రముగ నడిగెదరో మీకే యెఱుక. నేను రాత్రి వాసగృహమును జేరినది మొదలు నా యంతరాత్మ నన్ను యమబాధా సమేతునిగఁ జేసెను. నిదుర పట్టలేదు. అంత్యదినము సమీపించినట్లు తోఁచెను. విమర్శకుని యెదుట నుంచఁబడితిని. నా జీవితకాలమునఁ గావించిన చర్య కంతకును సమాధానమును జెప్పుమనిరి. కారాగారమున నున్న యెందఱి పాపులను నేను పరామర్శించితిని? నాచే నుంచిన ధనము నెట్లు వినియోగించితివి? శీతకాలమునఁ జలిగాలికి ముడుచుకొనిపోయి వేసవిని యెండకు మలమల మాడుచు బాధపడుచుండు నా యిండ్లలో నద్దెలకు నివసించువారి కేమి [1] సౌకర్యములఁ గావించితి? వారి యొద్ద నద్దె వసూలు చేసికొనుట తప్ప వారి సౌఖ్యముల కెట్లు పనిచేసితిని? బీదలకై నే నెట్లు శ్రమపడితిని? క్రీస్తు నా స్థానమున నుండిన నావలె సంచరించునా? నా ప్రతిజ్ఞను భిన్నముగావించితినా లేదా? భగవంతుఁడు నాకుఁ బ్రసాదించిన ధనమును, గౌరవమును పలుకుబడిని యెట్టి సద్వినియోగము గావించితిని? దేశాభివృద్ధికై, ప్రజాభివృద్ధికై, శ్రమపడు వారి కుపశమనమును గలిగించుటకై, దుఃఖములో నున్నవారి కానందమును గలిగించుటకై యుపయోగించితినా? నేను పెక్కు ఫలములను దైవమునుండి వడసితినిగదా. పరోపకారము నెంత గావించితిని?"

"ఈ విషయము లన్నియు జాగ్రత్స్వప్నమువలెఁ గట్టెదురఁ గాన్పించెను. ఇప్పుడు మనము మువ్వురము కూర్చుండి యుండినంత స్పష్టముగ బొడగట్టెను. ఈ స్వప్నాంతమును గాంచఁ జాలనైతిని. మనకై సకల శ్రమల నందిన ప్రభువు నా చర్యను నిరసించుచున్నట్లు పొడకట్టెను. అంత నాకుఁ గండ్లు మిరుమిట్లు గ్రమ్మి యంధకార బంధురం బయ్యెను. ఇరువదినాల్గు గంటలు దనుక నాకుఁ గండ్లు మూతలు పడలేదు. బొగ్గుపనివాండ్రు నివసించు తావున జరిగిన తుపాకి ప్రేలుడును గూర్చిన వార్త నేటి యుదయముననే నాకుఁ జేరెను. ఆ వార్తను జదువుట వలన నాకుఁ గల్గిన శరీర [2] ప్రకంపన మిప్పటికిని నన్ను విడువలేదు. దేవుని యెదుట నేను పాపము చేసినవాఁడను."

అంతట వెంకటస్వామి తన ప్రసంగమును హఠాత్తుగ నిలుపుచేసెను. గురువు లిరువురు నాతనివైపుఁ జూచుచుండిరి. ఆత్మ సంతృప్తి కలిగి తనకుఁ గల విద్యాధన గౌరవములచే నానందించుచుఁ [3] పారమార్థిక విషయముల [4] సరకుగొనక సంచరించుట కభ్యాసపడిన యీతఁడు దారిద్ర్యదశచే నవసి సకల కష్టముల [5] కాలవాలమై యల్లాడు దౌర్భాగ్యుల దుర్దశలకై పరితపించు రీతినిఁ గాంచుటకుఁ బరిశుద్ధాత్మ యెంత పాటుపడెనో?

పూర్వము కణ్వుని యాలయముపైఁ బ్రసరించినశక్తి యీ చావడిలోఁ బ్రవేశించెను. దీక్షితులు తన చేతిని వెంకటస్వామి భుజముపైనుంచి యిట్లనెను—"సహోదరుఁడా! దేవుఁడు నిన్ను మిక్కిలి సమీపించి యున్నాఁడు. వానిఁ గొనియాడుదము" "ఆల్లే అల్లే" యని వెంకటస్వామి యేడ్చుచుఁ బలికెను. ఆతఁడొక కుర్చీమీఁదఁ గూరుచుండి తనముఖమును జేతులతోఁ గప్పుకొనియెను. దీక్షితులుం బ్రార్థించెను. అంతట "మీరు నాతో నా గృహమునకు వచ్చెదరా?" యని వెంకటస్వామి యడిగెను.

1 సదుపాయముల 2 వణకు 3 పరలోక సంబంధమయిన 4 లెక్కసేయక 5 పాదు

ఆ యాహ్వానమునకుఁ బ్రత్యుత్తరముగా దీక్షితులు సోమయాజియుఁ దమ యుత్తరీయముల ధరించిరి. మరణించిన వాని కుటుంబము నివసించుచున్న యాయింటికి వారు మువ్వురు నేగిరి. ఇదియే వెంకటస్వామి జీవితమున నూతనోద్య[1]మాంకురమునకుఁ బ్రారంభము. గృహమని పిలువఁబడు నా దౌర్భాగ్య మానవ వాసస్థానమునఁ జేరి యచ్చటి వారి దురవస్థలఁ గన్నులార నాతఁడు మొదటిసారి చూచినప్పుడు తన జీవితమున నొక క్రొత్తమార్పు కలిగెనని యాతఁ డెఱుంగఁడు. తన యీ యద్దెయిండ్ల నివసించువారి సౌఖ్యమునకై క్రీస్తు ప్రవర్తించు విధానము నవలంబించుట కాతఁడు కావించిన మార్పుల నన్నింటి నిందుఁ బొందుపరుప నెంచిన నొక క్రొత్త కథ చెప్పిన ట్లగును. క్రీస్తున కిట్టి యద్దెయిండ్లున్న వాని నాతఁ డెట్లు వినియోగించును? దీనికిఁ దగు ప్రత్యుత్తర మూహింపఁ గలిగిన నా విధానమునే వెంకటస్వామి యాచరణలోనికిఁ బెట్టెను.

హేమంతర్తు వాసన్న మగునంతకుఁ గ్రీస్తును వెంబడింపఁ దలంచిన వారంద ఱా నగరమునఁ గావించిన చర్యలు పలుమార్పులను గలిగించెను.

ఒకానొకనాఁడు చకోరాక్షి యపరూపము లగు ఫలాహారముల సిద్ధపరచిన తట్ట నెత్తుకొని కుంకవారి యిండ్లలోనున్న బీదలకు వానిం జూపుటకై తన వాసగృహమును వెలువడి సందుమూలలను దిరిగినతోడనే తిమ్మయ్యయుఁ దన కర్మాగారమును మూసి బయలువెడలి వచ్చుచు దైవికముగఁ జకోరాక్షికి దారసించెను.

తిమ్మ—నీతట్ట నన్ను దీసికొని రానిమ్ము.

చ—(తట్టనందించి) అంత మర్యాదగ మాటలాడు చుంటివేమి?

తిమ్మ— నీ కింకొక విషయమును జెప్పఁ దలంచితిని.

ఆనాఁడు చకోరాక్షిని కార్మికాగారమునఁ జూచినది మొదలు తిమ్మయ్య యామెపై ననురాగము గలిగియుండెను. పదంపడి వా రప్పుడప్పుడు సమావేశ మగుచుండుటచే నాతని యనురాగాంకురము దినదినాభివృద్ధిం గాంచ దొడంగెను.

చ—మఱియేమి? అనెను. ఆమె యాతని మనోభావమును గ్రహింపఁ జాలక నిష్కల్మష హృదయముతో నుండెను.

తిమ్మ—స్వచ్ఛంద మయిన తన వదనారవిందమును చకోరాక్షి వైపునకుఁ బూర్తిగఁ ద్రిప్పి లోకములోని ప్రశస్తవస్తువుల నెల్ల నాకర్షింపఁ గల కరుణాకటాక్ష వీక్షణములతో నామె ముఖవికాసము బరికించుచు—"ప్రియమైన చకోరాక్షీ! నీతట్టను నన్ను మోయ నిమ్ము—అన నిచ్ఛగించెదను" అనెను.

చకోరాక్షి తన జీవితకాలములో నెన్నఁ డింత యాదరముగఁ గాన్పింపలేదు. తన ముఖము నాతని వైపునకైన ద్రిప్పకయే కొంచెము దూరము నడచెను. చకోరాక్షి తన మానసధనము నాతని కిదివఱకే సమర్పించె ననుటలో నతిశయోక్తి లేదు. అంత నామె యాతని వైపునకు ముఖవికాసము చెంగలింప నిట్లనెను.

చ—అట్లైన నట్లేల పిలువవు?

తిమ్మ—పిలువ నిచ్చెదవా?—అని యానంద పరవశాంతరంగుఁడై ఫలాహారముల తట్ట నజాగ్రత్తగఁ బట్టుకొనియెను.

1. మొలక

చ—పిలువ నిచ్చెదను. కాని నా ఫలాహారవస్తువులను క్రిందఁ బడవేయకుము.

తిమ్మ—ప్రియమైన చకోరాక్షీ! నీ కంతటి ప్రియమైన యీ వస్తువులను గ్రిందఁ బడనిచ్చెదనా?—అనెను.

అతఁడు కొంతదనుక నాకసమున నెగురువానివలె నడిచెను. పిదప వారికి జరిగిన సంభాషణము రహస్యమగుటచే దానితో మన కేమియు ప్రసక్తిలేదు. నాటి దినము ఫలాహారములను కొనిన తావునకుఁ జేరలేదు. నాటి సాయంకాలము దీక్షితులవారి వెలుపలినుండి పోవుచుండ నీ క్రింది ప్రశంస యాతని చెవులఁ బడెనని చెప్పినఁ జాలును.

తిమ్మ—చకోరాక్షీ! నీవు న న్నెప్పటినుండి ప్రేమించుచుంటివో నిజమును జెప్పుము.

చ—ఆనాఁడు సాపులో నీవు బల్లను చిత్రికబట్టుచుండఁ బొట్టులోని యొక చక్కియ నీ చెవిం దగుల్కొనెను. దానిం జూచి యప్పటినుండియు నిన్ను బ్రేమించితిని—అని 1 తన్మయావస్థను స్తంభింప నశక్యమై పెద్దనవ్వు నవ్వెను.

అంత దీక్షితులు వీధిమూలను తిరిగి వారిని దరిసెను.

దీ—అతట్టను బట్టుకొని మీ రెచ్చటి కేగఁ దలంచితిరి?

తిమ్మ—మేము దానిని—చకోరాక్షీ! యెచ్చటికిఁ దీసికొని పోవుచుంటిమి?

చ—ఆచార్యా! మేము దాని నింటికిఁ గొనిపోయి—

తిమ్మ—2 గార్హస్థ్యము నారంభింప సమకట్టితిమి—అని వాక్యాంతమును గావించెను?

దీ—అటులా? నన్ను గూడ విందు నారగింపఁ బిలిచెదరా? చకోరాక్షి వంట లెంత యింపుగ నుండునో నే నెఱుంగుదును.

చ—(ఆనందముతో) ఆచార్యవర్యా! మీరు మా గృహంబున నెప్పుడును ప్రేమాతిథులే. విూ కిది సమ్మతమేనా?

దీ—చకోరాక్షి తలంపును గ్రహించి యామోదమును సూచించుచుఁ 3 ప్రేమార్ద్రభాషణంబుల నిట్లనెను—

"నాకు సమ్మతమే. మి మ్మిరువుర దేవుఁడు రక్షించును గాక!" అని—దీవించి వారి యేకాంత వినోదంబున 4 కంతరాయమును గలిగింపక వెడలి పోయెను.

భూసంబంధమయిన ప్రేమాస్వరూప మగు పరమాత్ముఁడు 5 దుఃఖభాజనుఁ డని పేరువడసిన క్రీస్తు భక్తుల కా ప్రేమానుభవమును జవిజూపఁడా! ఈ వధూవరులిరువురును, ఒండొరులకుఁ జేదోడుగ దుర్గతియం దుండిన బీదజనులతో సంచరించి వారి కష్టములఁ దొలఁగింపఁ బ్రయత్నింతురు. లోకములోని కష్టముల నారసిన కొలఁదియును వీరి 6 పరస్పరానుబంధ మతిశయించును. ప్రభు పాదవిన్యాసముల ననుసరించిన కొలఁది వీరి యానందము 7 కెల్లివిరియును. నిలువ నీడలేని వేలకొలఁది జనులకు వీరి వసతియే యాధారముగా నేర్పడిన కొలఁదియు విశ్వాస మతిశయించును. ప్రభువయిన యేసుక్రీస్తు విట్లు ప్రవచించెను—"ఇందుకొఱకే మనుజుఁడు తన మాతా

1 తత్స్వరూపావస్థ 2 గృహస్థధర్మము 3 ప్రేమచేఁ జల్లనైన మాటల 4 అడ్డు 5 విచారమునకుఁ బాత్రుఁడు 6 ఒకరియం దొకరికిఁ గల స్నేహము 7 వృద్ధిబొందును

పితరులను వీడి తన భార్యను వాత్తుకొనను " చకోరాక్షియుఁ దిమ్మయ్యయుఁ బ్రభువు ననుసరించుచు దైవముచే సమకూర్పఁబడిన ప్రేమానుబంధమున విస్తరించి. ప్రజాసేవను మిక్కుటముగఁ గావింతురు.

ఈ స్త్రీపురుష 1 వ్యక్తుల ప్రేమానుబంధములు సువ్యక్తము లయిన కొలఁది కాలముననే వీరి వైవాహిక మహోత్సవ పూర్తికై దీక్షితునిచే నాహ్వానింపఁబడి కణ్వ 2 ప్రభృతు లెల్లరును విచ్చేసిరి. ఈ పెండ్లి విందున కెచ్చటను గూలి దొరకక నిరాహారులై యల్లాడు వారినితమ దుస్థితియందు నిమగ్నులై దేవుని యెడలను, మానవుల యెడలను, విశ్వాసము నశించిన దౌర్భాగ్యుల సంతతిని బిలిచిరి.

ఇట్లు 3 సమావేశ మయిన దుష్ట దౌర్భాగ్య సమూహమునకు దైవాను సరణ ఫలమును గూర్చి కణ్వుఁ డుద్బోధించెను. ప్రప్రథమమున ధర్మపురాద్యాలయమున నా బీదవాఁడు మృతినొంది నప్పు డుదయించిన దైవానుసరణ బీజము నేటి కింతటి వృక్షముగ విస్తరిలినందులకుఁ గణ్వుఁ డత్యానంద భరితుఁ డయ్యెను.

కణ్వుఁడు కోరినటులు క్రైస్తవ సంఘీభావము ఫలించునా ? ఈ యుద్యమము దేశమునం దంతటను వ్యాపించుచున్నదా ? యీ విషయములు నగరమునం దెటులు వ్యాప్తి నందుచుండెనో కాంచుటకే కణ్వుఁడు తన స్నేహితులతోఁ గూడ ధర్మపురి నుండి యిచ్చటి కరుదెంచెను. ప్రజాసామాన్యము నెదుట నిలువంబడి యాతఁ డుప న్యసించు నప్పుడు దైవమును గూర్చి ప్రార్థించెను. పిదప దీక్షితులు మున్నగు వారితోఁ జేరి క్రైస్తవాదర్శ సంఘాభివృద్ధిఁ గాంచి నప్పు డాతని యానందమునకు మేర లేదు.

ఏకాదశాధ్యాయము, సంపూర్ణము.

1 రూపముల 2 మొదలైనవారు 3 కూడిన.

శ్రీ

# దైవానుకరణము.

## ద్వాదశాధ్యాయము.

ఆరాత్రి కణ్వమహాముని శరణాలయమున నుండిన జనసమూహము నుద్దేశించి ప్రసంగించి నప్పు డింత గొప్పసమావేశము నింతకు మున్నెన్నఁడును గాంచి యుండ లేదని భావించెను. ధర్మపురియం దింతటి 1 వైచిత్ర్యముగల మానవసంఘము లేనిమాట సత్యము 2 తదుపాంత చండాలవాటీ నివాసులలోఁ గూడ నింతటి నైతి కాధ్యాత్మిక జ్ఞాన విరహితులను క్రైస్తవ సంఘము నతిక్రమించిన వారును లేరు.

ఆతఁడు వారితో నేమి ప్రసంగించెను? ప్రసంగాంశము నంతకు మున్నే నిశ్చయించుకొనెను. ధర్మపురియందు దైవానుకరణ 3 శపథమును ప్రవేశ పెట్టుటచేఁ గలిగిన మార్పులను విపులముగాఁ దేట తెల్లమగు వాక్యములతో నుడివెను. అచ్చట సమావేశ మయిన స్త్రీపురుషు లందఱును, క్రీస్తుస్వామిని గూర్చి కొలఁదిగో గొప్పగో యెఱింగినవారే. క్రైస్తవ మతప్రచారకుల బాహ్యాచారముల వారెంత నిరసనభావముతోఁ జూచినను క్రీస్తుయొక్క గుణగణములను వారించుక తెలిసికొని యుండిరి. న్యాయాన్యాయ్య 4 విచక్షణ జ్ఞానమును వారి యవస్థకుఁ దగినట్లుఁ గలిగియుండిరి. అవి యన్నియు నజోరీయుని పనినుండి గ్రహించినవే.

అట్టు లగుటచేఁ గణ్వోక్త దైవానుసరణ విధానము వారి యంతరంగముల నాకర్షించెను. ధర్మపురిలోని చరిత్రమును వివరించిన వెనుక సర్వసామాన్యముగ సాంఘిక ప్రచారమున నీ యాదర్శ మెటులు ప్రవర్తించునను విషయము నుచ్చరించెను. శ్రోత లందఱును వాని ప్రసంగమును గౌరవప్రపత్తులతో నాలకించిరి. అంతియే కాదు. అభిలషించిరి. ప్రసంగ మాహ్లాద 5 జనక మయిన కొలఁది వారెల్లరును చెవులు దోరబెట్టి విన నారంభించిరి. ఏయాలయ సభ్యులు నింతటి యాదరముతోఁ బ్రసంగముల విని యెఱుంగరు. కూలివాండ్రును బజారునకుఁ బోవువారును మాత్ర మాహ్లాద ప్రసంగముల వినునప్పు డిట్లే శ్రద్ధతో నాలకించెదరు. ఆలయసభ్యులే గాక వర్తకులును, రాజకీయ వేత్తలును, వార్తాపత్రికలును, కూలివాండ్రను గూడ దైవానుసరణ వ్రతము నవలంబించిన యెడలఁ బ్రాపంచిక నైతి కార్థి కావస్థలఁ దారుమారు గావించుట కెంత కాలము పట్టును? లోకము శ్రమాకులం బగుటకుఁ గారణం బేమి? స్వార్థతయే యననొప్పును. క్రీస్తువలె సంపూర్ణముగ స్వార్థత్యాగమును గావించిన మానవుఁడు మఱియొక్కఁడు లేఁడు. ఫలాఫలముల సరకుసేయక జగమంతయు వాని ననుసరించినచో నూతనోజ్జీవనము లోకమునఁ బ్రజ్వలింపఁ గలదు.

6 పాపభూయిష్ఠ మయిన జనాంగముతో నిండిన శ్రోతల మనంబుల నాకర్షించుట యన నెట్టిదో కణ్వుఁ డిందనుక నెఱుంగఁడు. మానవ ప్రకల్పితాచారముల గర్హించు నట్టియు, సాంఘి కాదర్శముల హేయములుగఁ బరిగణించు నట్టియు,

---

1 అద్భుతము 2 ఆసమీప 3 ప్రతిజ్ఞ 4 తెలిసికొను 5 పుట్టించునది. 6 పాపముతోనిండిన

స్వార్థముచేతను ద్వేషముచేతను నిండినట్టియుఁ బ్రజలచే నిండియున్న యాసభను దీక్షితులును సోమయాజియుఁ గాంచి ప్రసంగవశంబున వారియం 1 దంకురించిన మార్దవము ప్రేమ మున్నగు సూర్పుల కచ్చెరు వందుచుండిరి.

2 శ్రోతలకుఁ 3 ప్రాసంగికునియెడఁ గల గౌరవాతిశయములు ప్రస్ఫుటము లగుచున్నను సంఘాంతరంబున ఘనీభవించియున్న మానసోద్రేకమును గ్రహింప దీక్షితాదుల 4 కనవగాహముగ నుండెను. ఈ సమావేశ విషయమును విని యచ్చటి కరుదెంచిన వారిలో నిరువదిమంది కూలిదొరకక సంచలించుచున్న వారుఁ గలరు. వారు వీధులలో నుండు చలిగాలి బారినుండి తప్పించుకొనుటకును, ఈ చిత్రమును జూచుచుఁ గాలక్షేపముఁ జేయవచ్చుననియు సభ కరుదెంచిరి. ఆనాటి రాత్రి శీతల 5 వాతపోతములు మిక్కుటముగఁ బ్రసరించుచుండెను. పానశాలలు నిండియుండెను. ముప్పది వేలమంది జనాంగంబులతో నిండి యుండిన యా వీధిలోఁ బానశాలలును క్రైస్తవ శరణాలయమును దప్ప నే గృహద్వారమును బాంధులకుఁ దెరువఁబడి యుండలేదు. అట్టి స్థితిలో జీవనోపాధియు, నిలువ నీడయు లేని వాండ్రు పానశాలకుఁ దక్క వే ఱచ్చటికిఁ బోవ వీలుకలదు ?

ప్రాసంగికుని యుపన్యాసాంతమున సందేహముల నివారించుటకై సామాజికులతో వాద ప్రతివాదములు జరుపు నాచార మీ శరణాలయ ప్రచారమునఁ గలదు. ఆ యాచారము ననుసరించి కణ్వుఁ డుపన్యసించి సుఖాసనాసీనుఁ డయిన తోడనే దీక్షితు లగ్రాసనము నధిష్ఠించిన వాఁ డగుటచే లేచి సభ్యులలో నెవ్వరయినను దమ సంశయములను గూర్చి ముచ్చటింప వచ్చుననియు, కాని బహిరంగ సభలలో నవలంబింపఁ బడుచున్న నిబంధనల కట్టివారు బద్ధులై యుండవలయు ననియు, నటులు ముచ్చటింపఁ దలంచినవారు సభలోఁ బెక్కండ్రుందురు గావున నొక్కొక్కరు మూఁడు నిముసములకంటె నెక్కువ కాలము వినియోగింపఁగూడదనియు వక్కాణించెను.

గత వారమున జరిగిన సభ కరుదెంచిన వారిలోఁ బెక్కండ్రు " మా కది సమ్మతమే " యని 6 యేకగ్రీవముగ నుడివిరి.

సభాధిపుఁ డగు దీక్షితులు కూర్చుండెను. సభామధ్యమునఁ గూర్చుండిన పురుషుఁ డొకఁడు మాటలాడుటకై లేచి నిలువంబడి యిట్లనెను—

" నేటిరాత్రి కణ్వుఁడు ప్రసంగించిన విషయములు నా జీవితమునకు సరిపోవుచున్నవి. ఆతఁడు చెప్పిన యానందమగు వానిని నే నెఱుంగుదును. ఆతఁడు స్వగృహంబున మృతినందెను. ఆనందమును నేనును రెండు వత్సరములు కలకత్తా నగరమున నొక ముద్రణాలయమునఁ బనిచేసితిమి. ఆతఁడు కడు యోగ్యుఁడు. నే నొకప్పుడు చేత 7 దుగ్గానియు లేక బాధపడుచుండ నాతఁడైదురూప్యముల నాకు బదులిచ్చెను. నే నాతని ఋణమును దీర్చికొనుటకు సావకాశము చిక్కనే లేదు. మేము పనిచేయుచున్న ముద్రాలయాధికారులు మారుటచే నాతని పని నిలుపుచేయఁ బడినది. అందుచే నాతఁడు బొంబయి పట్టణమునకు వెడలిపోయెను. నేను వానిని తిరిగి చూడలేదు. 8 విద్యుచ్ఛక్తిచే నడుపఁ బడు ముద్రాయంత్రములు వచ్చినతోడనే యాతనివలె నేనును

---

1 పుట్టిన 2 వినువారికి 3 చెప్పువాఁడు 4 తెలియకుండెను 5 పిల్లవాయువులు 6 ఒక్కమాటగా 7 రెండుపైసలు 8 మెఱుపుయొక్క బలము

బని చాలించుకొనవలసి వచ్చినది. అప్పటినుండియు మఱియొకచోట బని లభింపక తిరుగుచునే యుంటిని. యంత్రముల గనిపట్టుట మంచిపని యని చెప్పెదరు. కాని నా కదిసత్యమని తోఁచుటలేదు. స్వార్థముచే నేను భ్రమజెందితి నేమో ? యంత్రములు పెరిగిన కొలఁదియుఁ గూలివాండ్ర జీవనాధారము పడిపోవుచున్నది. కణ్వుఁడు బోధించిన క్రైస్తవమత మంతయుఁ గడు యోగ్యమయినదియే. కాని క్రైస్తవ సంఘములోని వారెవ్వరు నంతటి స్వార్థత్యాగులు కాన్పింపరు. నే నెఱిఁగినంత వఱకు నన్యు లెంతటి స్వార్థపరాయణులై సంచరించుచుండిరో క్రైస్తవులు నట్లే మెలంగుచుండిరి. 1 తారతమ్య మావంతయుఁ గాన్పింపదు. బహుశః కణ్వుఁడు, దీక్షితులు, సోమయాజి మున్నగు కొలఁదిమంది మాత్రము కలరేమో ? లౌకిక వ్యాపారముల మెలంగునప్పుడును, ధనార్జనా పరతంత్రు లగునప్పుడును క్రైస్తవులును క్రైస్తవేతరులును దుల్యరీతినే మెలంగుచుండిరి. అచ్చటికి వచ్చుసరికి యిరువురును జెడ్డవారే."

"అట్లే" యథార్థమును బల్కితివి, "సత్యము" అను వాక్యములు సభలోని పెక్కండ్రనుండి వినఁబడెను. అతఁడు కూర్చుండఁగనే యంతకుఁ బూర్వమే ప్రసంగింప నూహించియున్న యిరువురు నొక్కసారి లేచి మాటలాడఁ దొడంగిరి.

దీక్షితు లందులో నొకని గూర్చుండ నాజ్ఞాపించెను. రెండవవాఁ డిట్లు ప్రసంగించెను—

"నే నీ సభలోనికి వచ్చుట కిదియె మొదటిసారి. బహుశః కడపటిసారియు నేను తిరిగి తిరిగి వేసరితిని. ఈ యూర నెచ్చట నైనఁ గూలిపని దొరకు నేమో యని నిరాశజనించు దనుక 2 శోధించితిని. ఇప్పుడిచ్చట నెందఱో మిత్రులు కలరు. మీ రందఱును వాక్రుచ్చునెడల మన బోధకుని నొక ప్రశ్న నడుగ సంకల్పించితిని. అడుగుదునా ?"

దీక్షితులు—ఆ విషయమును గణ్వుఁడు నిర్ధారణ సేయవలయును.

కణ్వుఁడు—అడుగ వచ్చును కాని వానికే దృప్తికరముగ సమాధానము జెప్పఁజాల నని యనుకొనియెదను.

ఆపురుషుఁడు ముందునకు వంగి తన 3 యాజానుబాహువును ముందునకుఁ జాచి యందఱి మనంబుల నాకర్షించునట్లు ఇట్లు ముచ్చటించెను—

"నా ప్రశ్న యిది. నా యీ సందర్భమునఁ గ్రీస్తేమి సేయునో తెలిసికొనఁ గోరుచుంటిని. రెండు మాసముల నుండి నా కిసుమంతయైనఁ బని దొరకలేదు. నాకు భార్యయు మువ్వురు పిల్లలును గలరు. నేను లక్షాధికారి నైన వారి నెట్లు ప్రేమింతునో భిక్షాధికారినయ్యు నంత మిక్కుటముగ వారిఁ బ్రేమించుచుంటిని. దసరా పండుగ వఱకును నేను పనిలో నున్న కాలములోఁ గూడఁబెట్టిన కొద్ది ద్రవ్యముతో నిప్పుడు జీవించు చుంటిని. నేను కమ్మరమును జేసెదను. ఎవ్వరయిన నాచేఁ బనిచేయించుకొనెద రేమో యని కడుంగడుఁ బ్రయత్నించితిని. క్రీస్తు ననుసరించుటయే మన యాదర్శ మని మీరు చెప్పెదరు. క్రీస్తు నావలె 4 నిర్వ్యాపారిగ నుండిన నేమి చేయును ? నేను మఱియొకరి స్థానమునందుండి ప్రశ్నించిన ప్రయోజనము

1 భేదా 2 వెదకితిని 3 మోకాళ్ళనంటు. 4 పనిలేనివాఁడుగ

లేదు. పాటుఁ బని కావలయును. దినమునకుఁ బదిగంటల కాలము శ్రమపడి పని చేయుటకు సంసిద్ధుఁడనై యున్నాను. అట్టులయ్యును బని లభింపమికి నేను నిందాపాత్రుఁడనా? ఏమి తిని జీవింపవలయును! దారాపుత్రాదులను బోషింప వలయును. ఎట్లు! క్రీస్తేమి చేయును? మన మందరము నడుగ వలసిన ప్రశ్న యిదియే యనిగదా మీరు చెప్పుచుంటిరి?"

సభ్యులందఱును దన వైపునకుఁ దదేకదృష్టితోఁ బ్రత్యుత్తరమునకై నిరీక్షించుచుండఁ గణ్వుఁడు వారి వైపునకుఁ దేరిపారఁ జూచుచుండెను. సమాధానముఁ జెప్పుట యసంభవముగ నాతనికిఁ దోఁచు చుండెను. కణ్వుఁడు భగవంతుని గూర్చి తన మనంబున నిట్లని ప్రార్థించెను—"సర్వశక్తిగల తండ్రీ! సామాన్య ప్రజల జీవనాధార విషయ మీ ప్రశ్నలో నిమిడి యున్నది. దైవతంత్రమునకు భిన్నముగా మానవ కల్పితములగు నపమార్గముల నివారించు సాధనోపాయముల నీతఁడు దెలుపఁ గోరుచున్నాఁడు. దేహదార్ఢ్యము సంపూర్ణముగ వడసియుండి, కాయకష్టమున కోర్చి, జీవనోపాధి నార్జింప నిచ్ఛ గలిగి యుండియు నాహార 1 సముపార్జనోపాయముఁ గాంచక భిక్ష మెత్తుకొనుటయో, మిత్రులను యాచించుటయో, పస్తుపరుండి మలమల మాడుటయో, ఆత్మహత్య గావించుకొనుటయో తక్కఁ 2 దరణోపాయముఁ గాంచని దుస్థితి మానవజాతమునకుఁ దటస్థించుట కంటె 3 శోచ్యమేమి కలదు. ఇట్టి తరుణమున క్రీస్తేమి చేయును. అది యాతఁ డడుగఁ దగిన ప్రశ్నయే. ఆతఁడు క్రైస్తవుఁ డయినచో నిదియే యడుగఁ దగిన ప్రశ్న. కాని యీ సందర్భమున దీనికి సమాధాన మేమని చెప్పనగును."

ఈ విషయము లన్నియుఁ గణ్వుని హృదంతరమును భేదించుచుండెను. అచ్చట నున్న వా రందఱు నీ విషయమునే మననము చేయుచుండిరి. దీక్షితులు విచారగ్రస్తమైన మోమునఁ గూర్చుండెను. వాని మనోభావములు వదనారవిందమునఁ బ్రతిఫలించుచుండెను. సోమయాజి తలవంచుకొని యుండెను. దైవానుసరణ ప్రతిజ్ఞను గైకొని దేవాలయ సేవను 4 వర్జించి శరణాలయమునఁ జేర నప్పుడీ ప్రాపంచిక భారమాతని హృత్ఫలకమున నింతగ నాటుకొనలేదు. ఇట్టి సందర్భమునఁ గ్రీస్తేమి చేయు నని యూహించుటకు దురవగాహముగ నుండెను. ఆజానుబాహుఁడును, దీర్ఘకాయుఁడు నగు నా వృచ్ఛకుం డింకను నిలువంబడి యుండెను. తుదకుఁ గణ్వుఁ డిట్లు పలుక నారంభించెను—

"ఇప్పు డిచ్చట సమావేశ మయిన వారిలో నెవ్వఁడయిన నిజమైన క్రైస్తవుఁడై యుండి, తా నిట్టి యాపద్దశ యందుండి, ప్రభు విట్టి సందర్భమున నేమి సేయు నని మనస్ఫూర్తిగ విమర్శించిన వాఁడు కలఁడా? అట్టివాఁ డొక్కఁడయిన నిచ్చటు నున్నచో నాకంటె నాతఁ డీ ప్రశ్నకు సమాధానమును జెప్ప నర్హుఁడు."

ఒక్క క్షణకాలము సభ నిశ్శబ్దముగ నుండెను. పిమ్మట మునుముందుగఁ గూర్చుండి యున్న యొకఁడు నెమ్మదిగ లేచి నిలువంబడెను. ఆతఁడు వృద్ధుఁడు. వణకు జనింపకుండఁ దనముందున్న బల్లను జేయూతగ నానుకొని యిట్లనెను—

1 సంపాదించికొను వెరవు 2 దాటు వెరవు 3 వెదుకదగినది 4 విడిచి

"ఇట్టి యవస్థ నా కనేక పర్యాయములు సంప్రాప్త మయినది. కాని యన్ని సందర్భముల యందును సత్క్రైస్తవుని పగిది మెలఁగితిని. క్రీస్తేమి చేయునని ప్రశ్నించుకొంటినో లేదో గాని పరిశేక 1 యిఱుకుపడు కాలముల యందెల్ల వాని శిష్యునిగ సంచరింప బ్రయత్నించితిని. అగును. నేనును భిక్షమెత్తితిని. శరణాలయములలోఁ గొంతకొంత కాలము గడపితిని. శరీరపోషణార్థమై యబద్ధ మాడుటయు, దొంగిలించుటయుఁ దక్కఁ దక్కుంగల నీచకార్యముల నన్నింటిని గావించితిని. జీవనోపార్జనకై నేను గావించిన నీచకృత్యములఁ బ్రభువు గావించునో లేదో నేను జెప్పఁజాలను గాని నేను మాత్ర మెట్టి యవస్థయందున్నను బుద్ధిపూర్వకముగఁ దప్పుచేసి యెఱుంగను ప్రభువున కాహారము లభించనిచో 2 భిక్షమెత్తుటకు మారుగ నుపవసించునేమో! ఆ విషయమును నేను జెప్పఁజాలను?

ఆ వృద్ధుని కంఠస్వరము గద్గదికం బొందెను. సభ నలుదిక్కులఁ బరికించెను. దీక్షితునకుఁ గొలఁది దూరమునఁ గూర్చుండి యుండిన యొక యువకుఁడు బవిరిగడ్డంబు వాఁడు, గంభీర గర్జనంబునఁ బలుక నారంభించెను. ఆతఁడు ప్రసంగింప నుపక్రమించిన తోడనే సభలోని వారందఱు నిశ్చలులై విన నారంభించిరి. ప్రభు వేమి సేయునని ప్రశ్నచేసెను. నెమ్మదిగఁ గూర్చుండి "యీతఁ డెవ్వఁడని తన ప్రక్కనున్న వాని నడిగెను.

"ఆతఁడు సర్వోత్తముఁడు. కార్మిక సామాధ్యక్షుఁడు. నీ వాతని ప్రసంగమును వినఁగలవు."

సర్వోత్తముఁడు—మానసోద్రేకముచే బవిరిగడ్డంబు చలింప నిట్లనెను—

"అది యంతయుఁ గేవల మిథ్యాప్రసంగమని నే నూహింతును. మన సాంఘిక విధానమే 3 లోపభూయిష్ఠమై యున్నది. మనము నాగరకావస్థ యనుకొనుచున్న దంతయుఁ గేవలము కుళ్ళిపోయినది. ఈ సత్యమును గప్పిపుచ్చఁ బ్రయత్నించినఁ బ్రయోజనము లేదు. ధనాశా పిశాచ గ్రస్తులైన 4 వణిక్శిఖామణుల సమ్మేళనము ప్రబలుచున్నది. అందువలన బీదలగు స్త్రీ బాల వృద్ధులకు వేలకొలఁది జనంబులకు మృత్యు వాసన్నమై యున్నది. వర్తకుల యాశలు పెరుగుచున్న కొలఁది బీద కూలివాండ్రపని క్షీణించుచున్నది. నేను పెండ్లియాడి సంసారమును భరింపవలసిన వాఁడను గాక బ్రహ్మచారినై యున్నందులకు భగవంతుఁ డను వాఁ డొకఁ డున్నయెడల వానిని మిక్కిలి కొనియాడెదను. భగవంతుఁడు కలఁ డను నమ్మకము నాకు లేదు. "సంసారసాగరం దుఃఖం" అను నార్యోక్తి కూలివాండ్ర యెడల సార్థకమయినది. కార్మికులకు సంసారమునకంటె నరకము లేదు. ఇప్పుడీ ప్రశ్నఁ గావించిన కార్మికుఁడు భార్యను మువ్వురి పిల్లలను బోషించవలసి యుండెను. వాని కింతకంటె ఘోరమగు నరకము గలదా? ఇట్లు శ్లేష్మములోని యీఁగల వలె సంసారభారమున 5 బ్రుంగి పరితపించు లక్షలకొలఁదిజనములో నీతఁ డొక్కఁడు అట్టులయ్యును ఈ పట్టణమున నింక నిట్టి యవస్థయందున్న పెక్కు పట్టణముల ననేకమంది క్రైస్తవులు భోగభాగ్యములతోఁ దులఁదూఁగుచు అష్టైశ్వర్యముల ననుభవించుచుఁ బ్రత్యాదిత్య వారమునను దప్పక గుడికిఁ బోవుచుఁ దమకుఁ గల సర్వస్వమును గ్రీస్తున కర్పిం

1 చిక్కుపడు 2 బిచ్చము 3 లోపములతోఁ గూడినది 4 వర్తకుల 5 మునిగి

చిటి యని పాటలఁ బాడుచు వానిని వెంబడించి వాని సిలువను మోయుచున్నా మనియుఁ దన్మూలమునఁ దాము రక్షింపఁ బడితి మనియుఁ దలంచువారు పెక్కండ్రు గలరు. అట్టివారిలోఁ గొందఱు యోగ్యులగు వా రుందు రని నేనన ను; కాని నేటి రాత్రి మనకుఁ బ్రసంగమును గావించిన గురువు నేను చెప్పెడి యేదేవాలయ సంఘమునకైనఁ బోయి మనకుఁ బ్రబోధించిన యీ దైవానుసరణ మహామంత్రమును వారికి బోధించిన యెడల వా రాతనిని వెఱ్ఱివానిగనో మతి చెడినవానిగనో తలంచి రని యాతఁడే తెలిసికోనఁ గలఁడు. ఓహో ! ఈ లోకభారమున కది [1] ప్రతిక్రియ కానేరదు. అందువలన ఫల మేమియుఁ గలుగ నేరదు. మన రాజ్యాంగ తంత్రమున మార్పులను గలిగింపవలయును. అంతయుఁ దారుమారు గావింప వలసియున్నది. దేవాలయ సంఘములలోఁ గలుగు మార్పుల వలనఁ బ్రజాసౌకర్యములు లభించు నని నేను నమ్మఁజాలను. దేశికులు ప్రజల నామోదించువారు కారు. లక్షాధికారులగు గొప్పవారినే వా రాదరింతురు [2] వణిగ్వరులలో నున్నతు లీ సంఘముల సభ్యులుగ నున్నవారలు బోధకులు వారికి బానిసవాండ్రుగ నుండిరి. ప్రజాసామాన్యమునుండి బయలు వెడలిన వారి కుపయోగించు ప్రతిష్ఠాపనలే యిప్పుడు కావలసియున్నవి. ”

సర్వోత్తముఁడు మూఁడు నిముసములకంటె నెక్కువ కాలము ప్రసంగింపఁ గూడ దను విధిని మరచెను. ఆతఁడు సహజముగ నుపన్యసించు నప్పు డొక గంటకుఁ దక్కువ కాలము పట్టదు. అట్లాతఁడు ప్రసంగాంశ నిమగ్న మానసుండై యావేళ వశంబునఁ గాలపరిమితిని సరకుగొనక గంభీరారావంబునఁ బ్రసంగించు చుండ సరసను గూర్చుండిన మఱియొక పురుషుఁ డాతనిని బలాత్కారముగ వెనుకకు లాగి తాను బ్రసంగించుటకై లేచి నిలువంబడెను. సర్వోత్తముఁ డాగ్రహోపేతుఁడై కలతను బెంచఁ బ్రయత్నించెనుగాని నాఁటి సభాధిపతి యగు దీక్షితులు [3] కాలనియమమును జ్ఞాపకమును జేయ నంతటితో గొణుగుకొనుచు విరమించి కూర్చుండెను. పిదపఁ బ్రసంగింప నుపక్రమించిన వాఁడు పన్నులను దగ్గింపఁ బ్రయత్నించిన నీ సాంఘికావస్థ లన్నియుఁ దొలఁగు నని వాక్రుచ్చె. పదంపడి మఱియొకండు లేచి దేవాలయ సంఘములను దారుమారుగ దూషించెను ఈ ప్రజాసంక్షోభమున కంతకును దేవాలయసంఘములు న్యాయస్థానములును గారణము లని ఘంటాపదంబుగ నొక్కి వక్కాణించెను.

పదంపడి యింకొకఁడు ముఖవర్చస్సు వలననే వీధులలోఁ గూలిచేసికొని జీవించు వాఁ డని సూచించుచున్న వాఁడు లేచి నిలువంబడి రైలుకంపెనీలను గూర్చియుఁ బుర పారిశుధ్య సంఘములం గూర్చియు మిక్కుటముగ వలపోసెను. వాఁడు ముచ్చటించుట కేర్పడిన కాలము ముగిసినతోడనే మఱియొకఁడు లేచి తాను కంచరము చేయు వాఁడ ననియుఁ గార్మికు లందఱు నేకీభవించి కట్టుఁగట్టినఁ గాని ముక్తి గలుగ నేర దని దృఢంబుగఁ జెప్పెను. ఇందఱు ప్రజలు పనిపాటలులేక జీవనోపాధి కొఱవడి యుండుటకుఁ గల కారణములను బూస గ్రుచ్చినట్లు చెప్పుచు యంత్ర నిర్మాణమే సైతానుని పథక మని చెప్పెను. తక్కుంగల వా రందఱును వల్లెయనిరి.

దీక్షితు లింతటితో సభ చాలింత మని చెప్పి సుగుణవతి నొక కీర్తనఁ బాడు మని నియమించెను. దైవానుసరణ ప్రతిజ్ఞను గావించిన యేడాదిక్రిందటి యాదివారము

1 మారుసేత 2 గొప్పవర్తకులు. 3 కాలముయొక్క యేర్పాటు

నుండియు సుగుణవతి దైవబలమున మిక్కిలి యభివృద్ధిఁ జెంది వర్ధిల్లుచుండెను. ఆమెకుఁ గల సంగీత విద్యా 1 వైశద్యమంతయు భగవన్నామ సంకీర్తనంబున వినియోగించు చుండెను. ఆరాత్రిఁ దాఁ బాడ నారంభింపక పూర్వము తన కీర్తనవలనఁ బ్రజల మనంబులఁ గరఁగింపు మని భగవంతుని గూర్చి మిక్కుటముగఁ బ్రార్థించెను. ఆమె ప్రార్థన మప్పుడే యంగీకరింపఁ బడెను.

గీ. పాపభారంబుచే 2 దుఃఖభాజను లగు । మనుజులార! యేసుక్రీస్తు ఘనజగీశు,
రండు రండని మిమ్ముఁ జేరంగఁ బిలుచు । చుండె భయ మందనేల? చేరుండు ప్రభుని.

అని సుగుణవతి గానము సేయుచుండెను. ప్రప్రథమమునఁ జండాలవాటికలోని ప్రజలు సద్దుసేయుచుండ సుగుణవతి సంకీర్తనము నిశ్శబ్దమును గావించిన విషయమును స్మరించుకొనుచుఁ గణ్వుఁడు కూర్చుండెను. మధుర మగు కంఠస్వరమును ప్రభుసేవ యందు వినియోగించిన నెంతటి యద్భుతముల నైనఁ జేయ వచ్చును. సుగుణవతికి గల సంగీత విద్యావిశేషమును ధనార్జనకై వినియోగింపఁ దలంచి నాటకశాలలో వినియోగించిన దేశమున నద్వితీయముగఁ బరిణమించి యుండును. రెండు రూపాయల టిక్కెట్టునైనఁ గొనవిది వినుటకు వలనుపడ నంతటి యుత్కృష్టగానము నాకర్ణించుటకుఁ గూలివాండ్రు సిద్ధపడి యుండిరి. వీండ్ర కెన్నఁడయిన నిట్టి గాన మలవడునా? అపరోక్షానుభూతి యిట్టిదే గానోపు నటులా మృదు మధుర గీతము సభయందెల్లెడల వెల్లి విరిసెను సర్వోత్తముఁ డానంద బాష్పముల వెలిబుచ్చెను. వాని ముఖమునం దీర్ష్యాభావము నశించి సద్భావ మంకురించెను. కూలి దొరుకక విసికి వేసరి క్రీస్తిట్టి తరుణమున నేమి చేయు నని కణ్వునితో వాదించిన బీదవాఁడుగా 3 నాకర్ణనానుభవంబునఁ 4 దాత్కాలికముగఁ దన దురవస్థను మరచి నిర్విణ్ణుఁడై తదేకాయత్త చిత్తంబున బల్లనానుకొని ప్రతిమవలెఁ జలింపకుండెను. తద్గాన రసామృతము నాస్వాదించుచున్న కాలమునం దాతని కదియే యాహారము. దారాపుత్రా ద్యఖిల బంధు సంయోగము, నున్నతోద్యోగముగఁ బరిణమించెను. మతాధిపులను గూర్చియు, వారి చర్యలను గూర్చియు నతి తీవ్రముగఁ బ్రసంగించిన పురుషుఁడు గీతారంభమునఁ గొంత దనుక సంచలింపక కూర్చుండెను గాని క్రమక్రమంబుగ నందలి మనంబుల నాకర్షించిన గానామృతము వాని ముఖవికాసంబునఁ గూడ విషాదము నంకురింపఁ జేసెను.

లోక మంతయుఁ 5 పాపభూయిష్ఠమైనదే యైనను నిట్టి గాత్రపాటవము గల 7 గాయనీజన సాహాయ్యంబున నచిరకాలంబున సన్మార్గాచరణంబునకుఁ ద్రిప్ప నగు నని కణ్వుండు భావించుకొనుచుండెను. వీణా మృదంగాది వాద్యపరికరంబుల నసమాన సాధక మలవడిన వారును భగవద్దత్తంబగు శారీరసాధకముచే నమృత ధారా ప్రవాహంబులఁ బెల్లుగ వర్షింపఁ గలవారును, పెక్కండ్రు తమ శక్తిని ధనార్జనకై వినియోగించుకొనుచు బీదవాండ్ర 7 శ్రవణపుటంబులఁ దమ గానరసంబును జొన్పకుందు రిది యేమి పాపము! జనానురంజనమునకై స్వార్థత్యాగమును గావించు వారు కొలఁదిమంది యైన లభింపఁగూడదా! యని తలంచుకొనుచు నా గానామృతమును గ్రోలుచుండెను.

---

1 తెలివి 2 విచారమునకుఁ బాత్రులు 3 విని యనుభవించుట 4 అప్పటికి 5 పాపముతో నిండిన 6 పాడువారు 7 చెవులలో

నాటి సభా కార్య విధానమును దిలకించినది మొదలు కణ్వుని మనంబునం దాందోళన మెక్కుడయ్యెను. క్రైస్తవు లెల్లరుఁ బ్రభ్వాజ్ఞ ననుసరించిన నాగరికు లెల్లను రక్షింపఁ బడుట కభ్యంతర ముండ దని నిశ్చయించుకొనెను. కాని పామరజనము గతి యేమి? ప్రభువు పామరులను రక్షించుటకే గదా భూమియం దవతరించెను. క్రైస్తవ సంఘమునకును జనసంఘమునకును గల యంతరము దూర మగుచున్నదే! బోధకులు వారి నాకర్షింపక యున్నతస్థానము నభిలషించుచున్నారు. 1 పారమార్థికము నుద్బోధింప వలసిన వారే ప్రాపంచిక సౌఖ్యములచే నాకర్షింపఁ బడుచుండుటచే జనసామాన్యమునకు వారియెడల గౌరవభావము రాను రాను బూర్తిగ నశించినది. వారును దమ్ము గౌరవింపఁగల ధనికులకే తమ నీతి బోధనలను గావించుచు నైహిక ప్రతిఫలము నొసంగ నసమర్థు లగు పేదల సమీపించుట లేదు. ఇది కడుంగడు శోచనీయ విషయముగఁ బరిణమించినది.

ఇప్పుడీ 2 పరిషదంతరమునఁ గూడిన జనసంఘమునఁ బెక్కండ్రకు నాచార్యప్రబోధమునకంటెఁ బానశాలలే యానంద జనకములుగ నుండెను. ప్రసంగ శ్రవణామోదమున నిశ్శబ్దముగ నుండఁజాలరు. సుగుణవతి సంగీత ప్రభావంబున నిశ్శబ్దముగ నుండఁ గలిగిరి. ఈ దురవస్థ యిట్లు కొనసాగవలసినదేనా? క్రైస్తవు లందఱును బ్రభుసేవా పరాయణులే యగు నెడల నిందఱు బీదవాండ్రు కూలిపని లభింపక రాజమార్గముల వ్యర్థముగఁ 3 బర్యటనము గావించెదరా? వేలకొలఁది ప్రజల మతబోధకుల నిందించెదరా? పెక్కండ్రు పానశాలలే శరణ్యములుగ భావించెదరా! నేటిరాత్రి మన కిచ్చటఁ బ్రదర్శింపఁ బడిన యీ మానవలోక దురవస్థకుఁ గ్రైస్తవు లెంతవఱ కుత్తరవాదులు కాఁగలరు? పెద్దపెద్ద పట్టణ రాజంబుల నెలకొల్పఁ బడి యుండు మతప్రబోధనాలయాధికారు లెల్లరును ప్రభుమార్గము ననుసరింపక తిరస్కరించి స్వేచ్ఛగ సంచరించు చుండిరా?

సుగుణవతి పాట ముగించెను. సభ నిలుపుచేయఁ బడెను. ప్రచారకు లగు మిత్రులు పరస్పర సంభాషణములఁ జేయఁ గడంగిరి. కణ్వుఁడు మాత్రము తన మనంబున నీ విషయములను గూర్చియే 4 మననము చేయుచు మౌనము వహించి యుండెను. ప్రచారకులు ప్రత్యేకముగ సమావేశమయిన కాలమున నీ విషయమునే యాతఁడు ముచ్చటించెను. దీక్షితులు, సోమయాజి మున్నగు మిత్రులతోఁ నేకాంతమునఁ గూడ నీ విషయముననే సంభాషించెను. దినాంతమున శయనింపఁబోవు తఱిఁ గావించు ప్రార్థనలోఁ గూడ నీ విషయమును గూర్చియే తన మనోభావములను బ్రభుసన్నిధానమున నివేదించెను. ఉదయమున నిద్ర మేల్కాంచినతోడనే యిందును గూర్చియే ప్రార్థించెను. పిదప దినమంతయు నిదియే తలంపు. ప్రజలతోఁ గలిసి మెలసి సంచరించు నపుడెల్ల నిదియే స్మరణ. ధర్మపురి ప్రాంతమునందే కాక దేశమునఁ గల క్రైస్తవ సంఘము ప్రభు నాజ్ఞ నుల్లంఘించు చుండెనా! తత్ప్రదర్శిత మార్గము ననుసరించుట లేదా?

ఇదియే సమాధానమును జెప్పవలసిన ప్రశ్నయై యున్నది. ధర్మపురికిఁ దిరిగి పోయి యాదివారమునఁ దానే యచ్చట నుపన్యసింప నిశ్చయించుకొనెను. కాని

---

1 పరలోక విషయమును 2 సభలో 3 ప్రచారము. 4 స్మరణ

శుక్రవారమునాఁడే వాని కింకొక యాహ్వానము వచ్చెను. ఆదివారమునఁ గలకత్తా నగరంబున కేతెంచి యచ్చటి పౌరుల కుపన్యసింపఁ గోరిరి. ఈ యాహ్వానము నంగీకరింతునా లేదా యని ప్రప్రథమమునఁ గొంచెము సంకోచపడెను గాని పరిశుద్ధాత్మవలననే యీ పిలుపు తగిలె నని నిశ్చయించుకొని దాని నంగీకరించెను. తనహృదయము నాందోళన పరచు చున్నట్టియు నేటి సభలో బహిరంగముగఁ బ్రజలచే నాక్షేపింపఁ బడినట్టియు, నీ విషయము నచ్చట నిర్ధరింపఁ బ్రయత్నించెదను. దేశమునం దలి క్రైస్తవు లెంతటి స్వార్థత్యాగులో విమర్శించెదను. అనుకొన్నియెను.

శనివారము రాత్రి యంతయుఁ బ్రార్థనతో గడపెను. ధర్మపురియం దుండు కాలమున నెన్నఁడును వాని యంతరాత్మ కింత సంఘర్షణము కలుగలేదు. వాని మనోభావములును స్వానుభవమును దారుమారు కాఁ జొచ్చెను.

ఆదివారమునఁ గలకత్తాలోని విశాల దైవాగారము జనసంకీర్ణమై యుండెను. కణ్వుఁడు రాత్రియంతయు భగవత్సాహాయ్యమునకై వేచియుండి సకాలమునఁ [1] బరిషదున్నతాసనము నధిష్ఠించిన తోడనే ప్రేక్షకు లందఱు నీతని యుపన్యాసమును విను కుతూహలముతో నిరీక్షించు చుండిరి. ధర్మపురియం దంకురించిన నూతనోద్యమమును గూర్చి వా రింతకు మున్నె వినియుండిరి. దీక్షితులు మున్నగు వారు పదంపడి శరణాలయమును స్థాపించుటచే నీ యుద్యమము మఱింత విపులముగ వెల్లడి యయ్యెను. పరిశుద్ధాత్ముని సాహాయ్యమే తన శక్తికి మూలకారణ మని గుర్తెఱింగిన వాఁడై నిశ్చల హృదయముతో నుపన్యసించెను.

కణ్వుఁ డెప్పుడును వాగాడంబరముగల వక్త కాఁడు. అసమాన వాక్ప్రవాహంబున శ్రోతల ముంచివేయు ప్రసంగశక్తి యీతనికి లేదు. కాని ప్రభు మార్గానుసరణ ప్రవృత్తి నవలంబించినది మొద లీతని ప్రసంగముల కత్యంత మధురిమ మంకురించెను. శ్రోతృజనాకర్షణ దక్షమయ్యెను. నేటి ప్రసంగ వశంబున నచ్చటి వా రందఱీతఁడు దైవసత్యమును సత్యముగ నత్యంతము గ్రోలిన వాఁ డని గ్రహించిరి.

దైవానుకరణ ప్రతిజ్ఞా పాలనము నారంభించినది మొదలు ధర్మపుర విశేషములఁ గొంతవడి ముచ్చటించెను. పిమ్మటఁ దన మనంబును బాధించు చున్న సందియము నే ప్రవచించెను. పరలోకరాజ్యమును వడయుటకు నే నేమిచేయవలసి యుండు నని ప్రభుని బ్రశ్నించిన యువకుని కథ నుద్ఘాటించెను. నీకుఁ గల సర్వస్వమును విక్రయించి బీదల కిచ్చినఁ బరలోకమున నీకు ధనము సమకూరును. పిదప వచ్చి నన్ను వెంబడించు మని ప్రభువు వానికిఁ బ్రత్యుత్తర మిచ్చెను. కాని యాతఁడు తన [2] స్వామ్యము నంతటినుకఁ గోల్పోవుటకు వాఞ్ఛింపఁ డయ్యెను. ప్రభువు నాశ్రయించుట యన నంత నష్టకష్టదాయక మగుచో నాయువకునకు సమ్మతి లేదు. ప్రభువు నాశ్రయించు తలంపు కలదుగాని యింత నష్టమును భరింపఁ సాహసింపఁ డయ్యెను. నేఁడు మన మధ్యఁ బ్రబలియున్న క్రైస్తవ సంఘము—ప్రభు నామమున నెలకొని యున్న యీ సంఘము—కష్టనిష్ఠురముల కోర్చి ప్రభువును వెంబడించుటకీ యువకుని వలెనే వెనుదీయుచున్నదా? అని సభ్యుల నాతఁడు పృచ్ఛసేయు సమయమున నాతని వదనారవిందము జాజ్వల్యమాన ప్రభతో బాలార్కనిభాతి ప్రకాశమానమై

1 సభా 2 అధికారము

యుండెను. గతవారమున శిరణాలయమున జరిగిన మహాసభాంతరమున నొక కార్మికునిచే నీ విషయము ప్రకటింపఁబడినది. ప్రజాసామాన్యము నుద్ధరించుటకుఁ గ్రైస్తవసంఘమునకు శక్తి లేదని యాతఁ డాక్షేపించెను. ఆతఁ డట్లు పల్కుటకుఁ గారణ మేమి? సంఘమునందుఁ బెక్కండ్రు తమ స్వార్థమునే ప్రధానముగఁ బరిగణించి పాపపుంజమున మునింగి దరిఁ గాంచనేరక చలించుచున్న బీదవాండ్ర నుద్ధరింపఁ బ్రయత్నించ కుండుటయే దీనికిఁ గారణమైయుండ నోపును. ఇది యెంతవఱకు సత్యము? మన దేశమునఁ గల క్రైస్తవు లందఱును దమ దమ యాథార్థ్యావస్థను బరిశీలించుకొనఁ బ్రయత్నించెదరా! ధనాఢ్యుల విషయ మేమి? వారి ధనమును గ్రీస్తు వినియోగించు రీతిని వెచ్చింప నిచ్ఛగించెదరా? శక్తి సామర్థ్యములు గల మేధావంతుల విషయ మేమి? క్రీస్తు తన బుద్ధివైశద్యము శక్తియుక్తులను బ్రజాసేవకై వినియోగించిన రీతిని వీరుఁ గూడ వినియోగించెదరా?

ఈ కాలమునఁ బ్రభ్వాదర్శమును [1] పునరవలోడనమును గావింప వలయునా లేదా? మాకంటె నీ మహానగరమున నివసించు మీరే దీనికి సమాధానము చెప్పవలసియుండును. క్రైస్తవసేవా రహితమగుటచే నిచ్చటి దీనజను [2] లాబాలగోపాలము నశించిపోవుచుండ సరకుసేయక మీరు మీ స్వకార్యముల మెలఁగఁ దగునా? వేలకొలఁది ప్రజలు యుద్ధమునందు కంటెను మిక్కుటముగ నీ పానశాలల మూలమున నడుగంటుట లేదా? దృఢకాయు లగు పెక్కండ్రు మానవులు కార్మికాగారములఁ బనులు దొరకక, కూలిపనికై పరితపించుచుఁ బురవీథుల వృథగాఁ దిరుగుచుండ నవలోకించు మీ మనంబుల దయారస మంకురించుట లేదా! కుడువ నాహారము లేక, వారు, కాని కార్యము లనేకములఁ జేయుచు నాత్మహత్యఁ గావించుకొను చుండ మీరు చూచియుఁ జూడని వారివలె నూరకుండఁ దగునా? వీరి నుద్ధరించుట మీ కర్జమే కాదా? మీలోఁ బ్రతివాఁడును మీ యంతరాత్మను బరిశోధించుకొనుఁడు. మన దేశమునం గల ప్రతి క్రైస్తవుఁడును బ్రభుమార్గము ననుసరింప నిశ్చయించుకొనినచో జనసంఘమును గార్మికప్రపంచమును మన రాజ్యాంగవిధానమును దారుమారై జనపీడ యనునదియే లేకపోవును.

క్రైస్తవ సంఘములోని ప్రతివాఁడును బ్రభువు ననుసరింపఁ గృషిసల్పినఁ గలుగు పర్యవసానము [3] నిదమిద్ధ మని మనము నిర్ధారణ చేయుట కవకాశము లేదు. కాని కార్మిక వర్గముయొక్క జీవనాధార ప్రవృత్తులు చక్కఁబడఁ గలవని మాత్రము నిశ్చయముగఁ జెప్పనోపును. ఏమానవుఁ డయిన క్రైస్తవుఁ డనుటకు నిదర్శన మేమి? క్రీస్తు భూమిపై జీవించియుండు కాలమున నాతని శిష్యులని యనిపించుకొనుటకు వలయు నిదర్శనములే యిప్పుడును బరిగణింపఁ దగినవి కావా? కాలముయొక్క మార్పును బట్టి యా నిదర్శనములఁ గూడ మార్చవలసిన యవసరము కలదా? క్రీస్తే కాలమున నరదేహధారియై మన మధ్యను నివసించుచున్న యెడల మిమ్ముఁ బిలిచి యానాడు ఆ యువకునకుఁ జేసిన ప్రబోధమే మీకును గావింపఁడా? మీ ధనమును బీదల కర్పించి తన్ను వెంబడింపుఁ డని కోరఁడా? తన దాసులలో నెవ్వఁడయినఁ దన ధనమును రక్షకునికంటె మిక్కుటముగాఁ బ్రేమించుచుండెనని యెఱింగిన దానిం ద్యజింపు

1 తిరిగి బయలుపెట్టుట 2 పిల్లలు మొదలుగొల్లలవఱకు 3 ఇది యిట్టిదని

మని వాని కుద్బోధించు ననియే నా నమ్మకము. క్రీస్తు తన జీవితకాలమునఁ గోరినంత
తీవ్రముగాఁ దన్ను వెంబడింపుఁ డనియు, స్వార్థత్యాగముం గావింపుఁ డనియుఁ
దమకై శ్రమల నోర్వుఁ డనియు నెవ్వఁడైనఁ దనకుఁ గల 1 సర్వస్వమును దృజిం
పని యెడలఁ దన శిష్యుండు కాఁజాలఁ డనియు నిప్పుడుఁ గూడఁ జెప్పుచున్నాఁడు.

ఈ యాదర్శమును మనస్సున నుంచుకొని యీ పట్టణంబునఁ గల ప్రతిక్రైస్తవుఁ
డును ప్రభువును వెంబడింపఁ దలంచినఁ గలుగు ఫలమేమి? తత్ఫలాంతర్భాగముల నూ
హింప వీలుగలుగదుగాని మీలోఁ బెక్కం డిప్పు డాచరించుచున్న విధానములలో
ననేకములు మార్పులు కలుగక తీరదు. క్రీస్తుచేత ధన ముండిన దాని నెట్లు వినియోగిం
చును? ఏ యాదర్శములపై దానిని వెచ్చించును? దానిచే వైభవోపేతముగ
జీవించుచు నాభరణాద్యలంకార సముపార్జనకై వెచ్చించునా? తిండిలేక లేక మలమల
లాడు బీదవాండ్ర జీవనోపాధికై వినియోగించునా? ధనార్జనమునఁ బ్రభు వెట్టి మార్గ
మునవలంబించును? తనకుఁ గల గృహంబులఁ 2 గులటా సమావేశమునకు మద్య
పాన శాలా వినిర్మాణమునకు నద్దెల కిచ్చునా? లోనికి సూర్యరస్మియు, గాలియుఁ
జొరక దుర్గంధ పూరితములై యుండు నిరుకుకొట్లను గట్టించి బీదల కద్దెల కిచ్చునా?

పాటుపడి జీవనోపాధికై ప్రయత్నించియు నెచ్చటను గూలిపని దొరకక
యాకలిచే మలమల మాడుచు వీధులవెంట నల్లాడు వారిం జూచి క్రీస్తేమిచేయును?
3 పరాఙ్ముఖుఁడై వెడలిపోవునా? వారిం గూర్చి మనంబున నావంతైనఁ జింత నొందక
తన కార్యముల నిర్వర్తించుకొన నెంచునా? వారి దురవస్థం దొలఁగింప నా పని
కాదని తలంచునా?

ఇట్టి మహాపట్టణములలో ధనార్జనమే ప్రధాన కార్యముగ భావించి 4 వణిక్ప్ర
ముఖులు దదేక దృష్టితోఁ బ్రవర్తించుచుండుటచేఁ గూలివాండ్రలోఁ బెక్కండ్రు
బాలికలు జీవనోపాధి నార్జించుకొను మార్గముం గానక యనేక దుష్ప్రవర్తనలకు
లోనగుచుండ బాల్యమునందే యనేకులగు 5 యువకులు ఈ కామదేవతచేఁ దమ
దేహ మనోదార్ఢ్యముల బాల్యావస్థయందే గోల్పోయి కాలుని పురి సమీపించుచుండఁ
గ్రీస్తు మీవలెనే చూచియుఁ జూడ నట్లూరకుండునా? ఇట్టి ప్రజాసంక్షోభమును
గన్నులారఁ గాంచుచుఁ గ్రైస్తవు లని పించుకొను మీ రందఱు సుఖముగ షడ్రసోపే
తాన్నములఁ గుడిచి యానందమున నోలలాడుచుంటిరి గదా! మీ ప్రభు విట్లే చేయు
నా? ఆతని దాసుల మని చెప్పుకొనుటకు మీరు సిగ్గుపడవలదా? క్రైస్తవుఁ
డయిన వాఁడు తన సోదరులగు బీదవాండ్ర శ్రమలలో నెంతవఱకుఁ బాల్గొనె నను
నదియే ప్రశంసార్హమైన విషయముగాని, అష్టైశ్వర్యములఁ దులదూగుచు నందే
స్వల్పభాగమునో యనాథశరణాలయంబుల కొసంగుట కాదు. అట్లు మీరు స్వార్థ
త్యాగులై పరుల నుద్ధరింప సమకట్టి నప్పుడే మీరు ముక్తినందితి మని భావింపవల
యును. పేరునకు క్రైస్తవుల మని పిలిపించుకొనఁ దలంచువారు పెక్కండ్రు గలరు.
నిజమైన క్రైస్తవులే మన కిపుడు కావలయును. క్రీస్తు యొక్క నిజ మయిన మతమును

---

1 సకలధనము 2 ఱంకుటాండ్రు 3 పెడమోము పెట్టి 4 గొప్పవర్తకులు 5
పడుచులు.

నెలకొల్ప వలయును. మనము, అజ్ఞానవశమున స్వార్థపరతను సోమరితనముచేఁ గ్రమక్రమముగఁ బతితుల మైతిమి. మనల నా ప్రభు వామోదింపడు. మనలోఁ బెక్కండ్రంత్య దినమున నాతనిఁ బ్రభువా ప్రభువా యని పిలువ నేను మిమ్మెన్నఁడు నెఱుంగను పొమ్మని తిరస్కరించును. కావున నో సోదరులారా! ఇప్పు డయిన మేలుకొనుఁడు. మీ సిలువను మూపుపై నెత్తుకొని బయలువెడలుఁడు.

సంఘారాధన కాలములోఁ బాల్గొనుట, మనకుఁగష్టముగఁ దోఁచనంతటువఱకు బీదలకు బిచ్చమిచ్చుట, స్తోత్రపాఠములఁ జెప్పు మిత్రులతోఁ గూడి యైశ్వర్యములఁ దులదూగు చుండుట, గౌరవజీవనమును గలిగి యుండుట బీదల కష్టదశలఁ జూచి సహించుట దుర్భరము గావున నట్టి వారి నుండి తొలఁగి సంచరించుట—యివియే మన క్రైస్తవ మతాదర్శము లగు నెడ నిశ్చయముగ మనము ప్రభువునకుఁ జాలదూరముగ నున్నారము. దిక్కులేక దీనులై విలపించు వారి దరిఁ జేరి సకలోపచారములఁ గావించుచు, వారికై తన 1 స్వేదకణంబులు రుధిరబిందువులుగ మారు నంతటి తీవ్రావేశముతోఁ దండ్రియైన భగవంతుని గూర్చి ప్రార్థించిన ప్రభువు ననుసరించు విధాన మిదియేనా?

ఇప్పటికైన మీ స్వార్థపరతను ద్యజించి నూతనోజ్జీవనము నవలంబింతురా? క్రైస్తవుఁడన నెట్లుండవలయునో విమర్శించెదరా? ఎట్లుండవలె? ఆతఁడు నడచిన త్రోవలను బట్టి చరింపవలె, ఆతఁ డాచరించు రీతి నాచరింపవలె.

ఇట్లు చెప్పి చెప్పి కణ్వుఁడు తన ప్రసంగమును ముగించెను. తోడనే యాతఁడు ప్రజల వంకఁ దేరిపారఁ జూచెను. ఆతని యా విపరీత వీక్షణము నెవ్వరును మరువఁ జాలరు. ఆ సమయమునందచ్చట చేరియున్న వా రందఱును క్రైస్తవాదర్శముల మరచి సుఖజీవనమును గావించు చున్నవారే. నామమాత్రమునఁ గ్రైస్తవులు అందఱును నిశ్శబ్దముగ నుండిరి. ఆ నిశ్శబ్దకాలమునం దందఱి మనంబులఁ బరిశుద్ధాత్మ ప్రసరించు చుండెను. చిరకాలమునుండి యీ యనుభవము నే వా రెఱుంగరు. క్రైస్తవ మార్గానుసరణము నవలంబింపఁ దలంచిన వారి నాతఁడు పిలుచునని నిరీక్షించు చుండిరి. నేఁడు కణ్వుఁడు ప్రసంగాంతమున ఫలమును నిరీక్షింప సమకట్టెను.

అంతమున నాతఁ డత్యంత నిర్మలముగఁ బ్రార్థించి సభను జాలించెను. ప్రజలు నిర్గమోన్ముఖులై లేచిరి. అప్పు డొక యద్భుత మయిన ప్రదర్శనము లభించెను.

సభ్యులలోని పెక్కండ్రు స్త్రీపురుషు లున్నతాసనమును సమీపించి చుట్టును ముట్టడించి కణ్వుం జూడఁదొడంగిరి. అట్లాతని జూచి దైవానుసరణ వ్రతమును మేము పూన నిశ్చయించుకొంటి మని ప్రతివారును 2 శపథము సేయ నారంభించిరి. పిలువని పేరంటముగ వచ్చి వారు తమంతట తామే యిట్లు ప్రతిజ్ఞ నూన నారంభించిరి ఇది కణ్వునకు విపరీతముగఁ దోఁచెను. పరిశుద్ధాత్ముని సాహాయ్యము యొక్క పరిమితిని లెక్కింపఁ జాలకుండెను. ఆతని, నిరీక్షణకు మించిన ప్రతిఫల మిది.

అంత నాతఁడు ధర్మపురిలోఁ గావించినట్లు ప్రతిజ్ఞాపాలకుల నందఱిం గూర్చుండ నియమించి తిరిగి దైవప్రార్థన గావించెను. నాటి సాయంసమయమునఁ గ్రైస్తవ యువజన సంఘము కణ్వుని సమీపించి ప్రాతఃకాలమునం దాలయ సంఘము గావించి నటులే మనఃపూర్తిగఁ గ్రైస్తవానుసరణ వ్రతము నవలంబించిరి. ఆ సమావేశము

1 చెమటబొట్టు 2 ప్రతిజ్ఞ.

మఱియు నప్పటి కందఱును బరిశుద్ధాత్మయం దీదులాడు చుండిరి. దాని పర్యవసాన ఫల మింతింత యని నుడువ నలవిగాదు. ఆ గ్రామసంఘ చారిత్రమునందు నవీన యుగాంతర మైన దని చెప్ప నొప్పును. కణ్వుని జన్మయందుఁ గూడ నట్లే యని తోఁచెను. సభ చాలించు నప్పటికి రాత్రి చాల ప్రొద్దు పోయెను. పిదప నాతఁ డొంటిరిగఁ దన శయనాగారమున నుండి నాటిచర్యను మననము చేసెను.

పిదపఁ బ్రార్థింప మోకారించెను. ఆట్లాతఁ డేకాగ్ర చిత్తుఁడై ప్రార్థించు చుండఁ బ్రభు వాతనికి దర్శన మొసంగెను. ఈ నవీనాదర్శ ప్రభావము లోకము నెంత మార్పుఁ జెందించునో వానికి దృగ్గోచరమయ్యెను. ఆ విశ్వరూప దర్శనముచే నాతఁడు పరవశుఁడయ్యెను. ఇది స్వప్నదర్శనము కాదు. జాగ్రదవస్థయందుఁ బ్రత్యక్షమయ్యెను.

తాను వెంటనే ధర్మపురి కేగి నట్లును పూర్వము కంటెను [1] వినమ్రుఁడై సంచరించు చుండినట్లును దలంచెను. తాను నిర్మల మగు క్రైస్తవాదర్శము నుద్బోధించు చుండుటచే ధర్మపురీ మఠాధిపతిగ నుండుట దుర్ఘట మని తలంచెను. తత్స్థానచ్యుతుఁడైనఁ జేయఁ దగిన దేమి యని విమర్శించెను. భగవ దనుగ్రహమే సమస్తమునకును సరిపడి యుండు నని నిశ్చయించుకొనెను.

సుగుణవతీ సుమతులు మాలపల్లెనుద్ధరించు పూర్ణసంకల్పముతోఁ బనిచేయు చున్నట్లు గాంచెను. సుగుణవతి భానుమంతుని వివాహ మాడిన ట్లాతనికిఁ బొడకట్టెను. వా రిరువురు నిశ్చల హృదయులై ప్రభుసేవా పరాయణులైనట్లు గాంచెను. సుగుణవతి తన గానామృత ధారాప్రవాహముచే నార్తుల మనంబుల నానంద వార్ధి నోలలాడించు చుండెను. సుమంతుఁడు విద్యాధరుఁడు, పురూరవుఁడు సరసకవి మున్నగు వారు తమ తమ మార్గములఁ బ్రభుసేవఁ జేయుటం గాంచెను. తిమ్మయ్యయుఁ జకోరాక్షియు వివాహ మాడి ప్రభుసేవఁ గావించు చున్నట్లు పొడకట్టెను. ఈ నవీనోద్యమము దేశమునం దెల్లెడలను వ్యాపించి నట్లును ప్రజా సమూహ మంతయుఁ దమ దురవస్థల నుండి తొలఁగి యానందించు చున్నట్లును దేవుని రాజ్యము భూమియందు స్థాపితమైనట్లును పొడగాంచెను. "దైవానుసరణము" అను వాక్యములు ప్రతిదేవాలయ ద్వారముల యందును జెక్కఁబడి యున్నట్లు గాంచెను. పిదప దేవుని పుత్రుఁ డగు యేసుక్రీస్తు ఈ విషయములోఁ బాటుపడిన వారి నందఱిని పిలుచు చున్నట్లు చూచెను. దేవదూత లాకసమునుండి గానము చేయుచుండిరి. జయజయ ధ్వానములు శ్రవణపుటంబులఁ బ్రతిధ్వని సేయుచుండెను. ప్రభునియాకారము ప్రస్ఫుటముగఁ గాన్పించుచుండెను. అనేక సోపానములకు బయి మెట్టుపై నిలువం బడియుండెను.

ఇట్లు కొంతకాలము విశ్వరూప దర్శనాంత ర్నిమగ్నుఁడై యుండి లేచి నిట్టూర్పు విడిచెను. లోకములోని పాపకృత్యములు వానికి యథాస్థితములై కాన్పించు చుండెను. అంత నాతఁడు భక్తోచితం బగు నిరీక్షణమును మనంబున నెలకొల్పి ప్రభుభక్తి పరాయణుఁడై శయనించెను. స్వప్నావస్థయందుఁ దనకోర్కె లన్నియు నెరవేరినటును, దేవునిరాజ్యము భూమిపై స్థాపింపఁ బడినట్లును భక్తలోకమంతయుఁ [2] కళంకరహితమై విరాజిల్లు చున్నట్లును, మానవలోక మెల్లఁ బ్రభుపాదముల నాశ్రయించి తరించినట్లును చెప్పెను.

దైవానుకరణము సమాప్తము.

---

1 మిక్కిలి వినయముకలవాఁడై. 2 పాపములేనిది.